అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2017



దివ్యకాంతి పథం

విషయ సూచిక

సంపాదకీయం:

"వేదాలను శృతి లేక దివ్యజ్ఞానం అని పేర్కొనడం సమంజసం. వీటిలో ఋగ్, యజు, సామ, అథర్వణాలు. పరమ సత్యమనే మొక్కకు సత్తువ నిచ్చి దానిని ఫలవంతం గావించే వర్షపు జల్లులు బ్రాహ్మణములు, ఆ మొక్క వుండే అరణ్యాలు అరణ్యకములు, అది పెరిగే నేల, ఉపనిషత్తులు, స్వయంగా మొక్క, దాని వేర్లు, కాండము, ఆకులు, పూరేకులు వాటి పాత్రలు. ఇక ఆ పుష్పం ఒక్కసారి స్వయం వ్యక్తమై శాశ్వతంగా నిలిచే మహావాక్కు — 'సోహం' — ఉపనిషత్ సారమగు "అహం బ్రహ్మ" అను వేదోక్తి...."


CWSA 17:102

శ్రీఅరవిందులు

నాగరిక సమాజ ప్రారంభదశలో మహామహులగు భారతీయ మహర్షులు మానవ హృదయంలో నాటిన పరమ సత్య బీజాలు ఇవి.

మన ప్రాచీన పూర్వీకుల మహోన్నత ఆవిష్కరణలకు ఈ సంచిక అంకితము.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి


Sri Aurobindo

వేదముల ఆవిష్కరణ

మార్మిక విద్యా ప్రభావిత దశ

ప్రపంచంలో ఇంచుమించు ప్రతిచోటా ఏదో ఒక దశలో మాయ మంత్రాలనే మార్మిక విద్యలు ప్రాచుర్యం పొందాయి. కొంతమంది విజ్ఞులు ఈ విద్యల్లో నిష్ణాతులై దాన్ని ఆచరణాత్మకంగా ఉండేటట్లు కొన్ని విధి విధానాలను, మతాచారాలను, వాటి చిహ్నాలను, రహస్య సాంప్రదాయాలను, ఆదిమజాతి మతాలలో లేక వాటికి దగ్గరగా ఏర్పాటు చేసారు. ఈ అభ్యాసాలు వివిధ దేశాల్లో, వివిధ రకాలుగా ఆచరణలో ఉండేవి. గ్రీకు దేశంలో ఓర్ఫియన్ అనే పేరుతో గానీ ఏల్యూషియన్ అనే ఆయన పేరుతో గానీ వ్యవహారంలో ఉండేవి. వీరిద్దరు మార్మికులే. ఈజిప్టులో, ఛాల్డియాలో మతగురువులు వారి గుప్త మరియు ఇంద్రజాలమనే పేరుతో, పర్షియాలో 'మాగి' లు పేరుతో ఈ విద్యలు ఆచారంలో ఉండేవి. భారతదేశంలో ఋషులది ప్రధాన పాత్ర. వీరందరూ కూడా ఆత్మజ్ఞానం కోసం, విశ్వవిజ్ఞానం కోసం చేసే సాధనలో నిమగ్నమై వుంటూ, మానవునిలో బాహ్యంగా కనబడే భౌతిక వ్యక్తిలో అంతర్గతంగా ఇంకొక అస్తిత్వం, లోతైన వ్యక్తిత్వం గలవాడు ఆసీనుడై ఉంటాడని గమనించారు. దానిని కనుక్కొని తెలుసుకోవడమే మనిషికి పరమావధిగా భావించారు. భారతదేశంలో ఆత్మజ్ఞానం పొందుట మాదిరిగానే "నిన్ను నీవు తెలుసుకో" అనేది వారి మానసికానుభూతిగా నుండింది. భారతదేశంలో ఆత్మజ్ఞానం తెలుసుకోవడం ఎంత గొప్ప ఆధాత్మికావసరమో మనిషికి అది అంత గొప్పఅవసరం అని వారు గ్రహించారు. ఇంతే కాక మనకి కనబడే భౌతిక విశ్వానికి ఆవల పరమ సత్యం ఒకటి వున్నదని, దాన్ని కనుగొని, అనుసరించి సాధించుకోవాలనేది వారి తీవ్ర ఆకాంక్ష. భౌతిక ప్రపంచానికి చెందని ప్రకృతి రహస్యాలనూ, శక్తులనూ తెలుసుకుంటే భౌతిక విషయాలపై, ప్రపంచంపై ఆధికారత సిద్ధిస్తుందని, ఈ జ్ఞానాన్ని వ్యవస్థీకరించి ఒక పద్ధతిగా చేయడం కూడా వారి ఉద్దేశం. అయితే దానికి చాలా కఠినమైన శిక్షణ, లక్ష్యశుద్ధి, ప్రకృతి పారిశుధ్యత అవసరము. అది సాధారణ మానవులకు సాధ్యపడదు.అటువంటి అర్హత లేనివారు దీనికి పూనుకుంటే అది వారికి చాలా హానికరము, వారికొక్కరికే కాక మిగతావారిక్కూడా అపాయమే. ఈ శక్తులు దుర్వినియోగం చేయబడుటకు, పెడర్థాలకు, సత్యాన్ని అసత్యంగా మార్చడానికి, మంచిని చెడు

చేయటానికి అవకాశం ఉన్నది కాబట్టి ఈ విషయాన్ని రహస్యంగా వుంచారు. ఈ జ్ఞానాన్ని, గురువులు శిష్యులకి తెరచాటున బోధించేవారు. ప్రత్యేకమైన చిహ్నాలతో, సంకేతాలతో ఈ బోధన జరిగేది. ప్రత్యేక దీక్ష పొందినవారు మాత్రమే అది అర్థం చేసుకోగలరు. దీక్ష పొందనివారు, వాటి యదార్థ అర్థాన్ని, వాటిలోని నిగూఢత మాటుపరచ బడినందున బాహ్యార్థాన్ని మాత్రమే తెలుసుకోగలరు. గుహ్యావిద్యల సారాంశం ఇది.

CWSA 16:5-6

వేదములు మానవజాతి అంతర్ జ్ఞానదశలో రూపొందించబడ్డాయి

మన మేధోజనిత తత్వ్యజ్ఞానానికి పూర్వ దశలోనే వేదాలు ఏర్పడ్డాయి. ఆ తొలి దశలో మన ఆలోచనా విధానం నేటి ఆధునిక అలవాట్లకు సరిపడు హేతువాద సిద్ధాంతపరమైన మాట తీరు, వ్యక్తీకరణకు భిన్నమైన రీతులలో సాగేది. ప్రాజ్ఞులు ఆ కాలమందు మానవుల యొక్క దైనందిన కార్యాచరణకు, సాధారణ గ్రహణశక్తికి అవసరమైన తెలివితేటలను మించిన జ్ఞానం కోసం అంతర్బుద్ధి యొక్క సూచనలు, అనుభవాలపై ఆధారపడ్డారు. వారి లక్ష్యం హేతుబద్ధమైన విశ్వాసం కాదు, ప్రకాశమాన మైన జ్ఞానసంపద. వారి ఆదర్శం ప్రామాణికబద్ధుడైన వాదన చేయువాడు కాదు, ఒక ఈశ్వర ప్రేరితమగు దివ్యజ్ఞాని. ఈ విధంగా వేదాల ఆవిర్భావాన్ని భారతీయ సాంప్రదాయం పదిల పరచింది. ఋషి వ్యక్తిగతంగా వేదగానానికి స్వరకర్త కాడు, కాని ఒక నిత్య సత్యానికి, సమిష్టి జ్ఞానానికి చెందిన దివ్యదృష్టి గలవాడు, ఒక ద్రష్ట. వేదభాష స్వయంగా శృతి, ఒక లయ. అది చెవులకు వినవచ్చిందే కానీ మేథాశక్తితో కూర్చబడినది కాదు. అనంతంలో నుంచి ఒక దివ్య అపౌరుషేయ మంత్రంగా, ఒక ప్రకంపనము, ఇతః పూర్వమే తనకు తాను ఆ జ్ఞానాన్ని అందుకొనుటకు సమాయత్తపరచుకున్న మనిషి అంతరంగంలో అవతరించింది. దృష్టి, శృతి అనే పదాలు వేదభాషాపరమైన మాటలు. ఈ మూలాధారమైన పదాలు వేదగానాలలో స్పష్టంగా అభివ్యక్తమైన దివ్యజ్ఞానానికి సంబంధించిన గోప్యమైన పరిభాషను, దివ్యావేశ విషయాలను సూచిస్తాయి.

వేదాంతము — ఉపనిషత్తులు — బ్రాహ్మణములు

వేదాలతో యజ్ఞయాగాది క్రతువులతో ప్రారంభించి ఒక వినూత్న ఆధ్యాత్మిక చింతనకూ, అనుభవానికీ సరికొత్త వ్యాఖ్యానం ప్రతిపాదించే ఉద్ధరణ విధానాలే, ఉపనిషత్తులు. ఇందులో రెండు పరస్పరం సహాయపడే అంశాలు. ఒకటి, వేదవిదుల రక్షణ, రెండు, వేదసారాన్ని దర్శనీయంగా చేయడము. మొదటిదానికి ప్రతీక బ్రాహ్మణములు, రెండవదానికి ప్రతీక ఉపనిషత్తులు.

వేద కర్మాచరణలోని ముఖ్యాంశాలను, వాటి భౌతిక సార్థకతకు అవసరమైన నియమ నిబంధనలను, వాటి సంకేతాత్మక జ్ఞానాన్ని, వాటి వేర్వేరు భాగాల ప్రయోజనాలను, కదలికలను, ఉపకరణలను, కర్మకాండకు ప్రధానమైన మూల గ్రంథాలను, అస్పష్టమైన వాటి పూర్వాపరాలను, పురాతన గాథల సాంప్రదాయ జ్ఞాపకాలను బ్రాహ్మణాలు నిర్ధారిస్తాయి.

ఉపనిషత్కాల ఋషులు వేరొక మార్గాన్ని అనుసరించారు. వారు అంతరించి పోయిన, లేక క్షీణించిపోతున్న ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ధ్యానంలోనూ, ఆధ్యాత్మికానుభూతి తోను తిరిగి పొందే ప్రయత్నం చేశారు.తమ అంతఃకరణ స్ఫూర్తికి ప్రాచీన మంత్రాలను ఆసరాగా, ప్రమాణంగా వాడుకున్నారు, లేక పాతసత్యాలను క్రొత్త రూపాల్లో తిరిగి రాబట్టుకొనుటకు వేదమంత్రం వారి ఆలోచనకు, దర్శనానికి బీజమయింది. వారు దర్శించినదానిని వారు జీవిస్తున్న కాలంలో అర్థమయ్యే విధంగా వ్యక్తపరిచారు. వాక్సత్వానికి మించినదాన్ని సాధించాలనుకొనే అన్వేషకులు కాబట్టి పదాలను వారు ప్రయత్నిస్తున్న తేజోమయ లక్ష్యానికి చేరుకొనుటకు సూచికలుగా వాడుకున్నారు. వారి అసలు ధ్యేయం వేదాలకు వ్యాఖ్యానం చెప్పటం కాక వేదాంతాన్ని అందుకోవడం.

అద్భుతమైన వీరి అన్వేషణ ఫలితంగా ఒక నూతన ఆలోచన, మరింత అధికంగా స్థిరమైన, శక్తివంతమైన ఆలోచనా సరళి, ఆధ్యాత్మికత సమకూరి వేదాంతంగా పరిణమించింది.

CWSA 15:13-15

అనువాదం: అమరవాది ప్రభావతి

శృతి — స్మృతి

ప్రాచీన కాలంలో వేదాలు జ్ఞాన సంపన్నమయిన పవిత్ర గ్రంథాలుగా పరమోన్నత స్ఫూర్తిదాయకమగు ఘన కవితా రాశిగా, ఋషులు, ద్రష్టలు, యోగులు ఎవరైతే తమ మానసిక కల్పనచే కాక, ఉద్దీపింపబడిన చేతనతో స్వీకరించిన మహత్తరమూ, విశ్వజనీనమూ, శాశ్వతమూ అయిన పరమ సత్యంగా, మంత్రబద్ధం చేయబడిన, దర్శనములైన శక్తి శ్లోకాలుగా, సాధారణం కాక దివ్యప్రేరణ మూలాల నుండి ఆవిర్భవించినవిగా భావించబడ్డాయి. ఈ యోగులకు 'కవి' అనే నామధేయం యివ్వబడింది. తరువాతి కాలంలో దీని అర్థం అన్ని విధాల కవులకు ఆపాదించబడినా, ఆ కాలంలో మాత్రం — అది సత్యాన్ని దర్శించిన ద్రష్టలకు మాత్రమే వాడబడింది. వేదమే స్వయంగా వీరిని 'కవీయః సత్యశ్రుతః' గా వర్ణించింది. అనగా సత్యాన్ని విన్న ద్రష్టలు అని అర్థం. వేదం శ్రుతి అని పిలువబడింది. వినబడినది, దర్శించబడినది — అని అర్థం. ఉపనిషత్ ద్రష్టలు కూడా వేదం గురించి యిదే అభిప్రాయాన్ని కలిగి ఉండినారు. వారు ప్రకటించిన సత్యాల ప్రామాణికతకు తరచుగా వేదాన్నే ఆశ్రయించారు. అనంతర కాలంలో ఉపనిషత్తులు కూడా శ్రుతుల వలె దర్శించబడిన శాస్త్రంగా పవిత్ర గ్రంథాలలో చేర్చబడ్డాయి.

CWSA 16:3

గుహ్యమూ, మార్మికమూ అయిన భాష

వేదంలోని చాలా పంక్తులు, స్తోత్రాలు, మొత్తంగా, బాహ్యంగా ఒక మార్మికమయిన అర్థాన్ని కలిగి ఉంటాయి. అది ప్రస్ఫుటంగా గుహ్యమయిన భాషలో ఆంతరికమయిన అర్థాన్ని కలిగి ఉంటాయి. ఒక ద్రష్ట అగ్నిని తన స్వగృహంలో ప్రకాశించే సత్యపు తేజోమయ రక్షకుడిగా వర్ణిస్తాడు, లేదా మిత్ర, వరుణ, తదితర దేవతలను పరమ సత్యతతో స్పర్శలో ఉన్న లేదా సత్యాన్ని ప్రవర్ధమానం చేసే వారిగా, లేదా సత్యంలో జన్మించినవారిగా వర్ణిస్తాడు. ఇవి మార్మిక కవి, తొలి యోగులు అంతరంలో ఏ సత్యాన్నయితే ఆకాంక్షించారో, దానిని భావిస్తూ వాడిన పదాలు. అతడు అక్కడ బాహ్యమైన అగ్నికి అధిష్టానంగా ఉన్న ప్రకృతి శక్తి గురించి లేదా హోమాగ్నిని గురించి చెప్పటం లేదు, ఆతడు సరస్వతిని సత్యమైన వాక్కును

ప్రేరేపించి, సమ్యగాలోచనకు మేల్కొలిపే శక్తిగా లేదా ఆలోచనా సంపద గల దేవతగా వర్ణిస్తాడు. సరస్వతీ దేవి మనలను చైతన్యంలోకి మేల్కొలుపుతుంది, లేదా మనకు ఆ చేతన అనే మహాసముద్రపు ఎరుకను కలిగిస్తుంది. మన ఆలోచనలను ఉద్దీపింప చేస్తుంది. అతను ఈ విధంగా స్తుతిస్తున్నది ఖచ్చితంగా నదీ దేవతను కాదు. ఆ శక్తిని, ఒక ప్రేరణా ప్రవంతిని, ఆ రోచస్సును మన భావనల లోనికి కొని తెచ్చి, మనలో ఆ సత్యాన్ని అంతర్ జ్ఞానాన్ని నిర్మించే సత్యవాక్కును అతను స్తుతిస్తాడు. ఈ దేవతలు నిరంతరం తమ మానసికమయిన కార్యాలలో నిలిచి ఉంటారు. యజ్ఞం అంతరమైన కార్యానికి బాహ్యాచిహ్నం, మానవులు దేవతల మధ్య ఒక ఆంతరంగిక వినిమయం. మనిషి తనకున్న దానిని సమర్పించటం, బదులుగా దేవతలు శక్తి-అశ్వాలను, కాంతి గోవులను, అంధకారంలో వృత్రాసురులు, దస్యులు ప్రాణులతో చేసే సమరంలో విజయం సాధించటానికి శక్తి సమన్వితమయిన యోధులను సేనగా యిస్తారు. యజ్ఞ మాచరించే వ్యక్తి కోరే సంపద, గోవులు, అశ్వాలు తదితరమయిన వేవీ ప్రాపంచికమయిన సంపదలు కావు. అది భావన, మంత్రంలో మూర్తీభవించిన భావన యివ్వగలిగినవి, దివ్యత్వాన్ని పొందే ప్రక్రియ మహత్వమైన, పూర్ణమైన, తేజోమయమయిన సంపదలను క్రిందకు భూమి పైకి తెచ్చుకోవటం. ఆంతరిక యజ్ఞంవలన దేవత నుండి పొందిన నిధులు అన్నీ మార్మిక మయిన పదాలలో సూచించబడ్డాయి. కానీ రహస్య పదాలను చదవటం తెలిసినవారికే 'న్యవాచాంసి', స్పష్టంగా వ్యక్తపరిచే 'కవయే నివచన.'

CWSA 16:12-13

వేద ఋక్కుల ద్వంద్వార్థాలు

మనం అత్యంత నిగూఢమయిన ద్వంద్వ భావనలు గల శాస్త్రి గ్రంథాల సమక్షంలో ఉన్నాం. ఒకటి బాహ్యమైనది, మరొకటి అంతర్భూతమయినది. అందులోని సంకేతాలు ఈ నిగూఢమయిన అర్థాల అంతర్భాగమై ఉంటాయి, రహస్య బోధన జ్ఞానాలలో అంశమై ఉంటాయి. కొన్ని స్తోత్రాలు మినహాయించి ఋగ్వేదమంతా అంతర భావనతో యిటువంటి పవిత్ర గ్రంథమౌతుంది. ఇదే సమయంలో బాహ్యమైన అర్థం కేవలం ఒక ముసుగు కానక్కర లేదు. ఋక్కులు వాటి రచయితలచే శక్తి వంతమయిన శబ్దాలుగా భావించబడ్డాయి — అంతరమైన శక్తి కలిగి వుండడమే

గాక బాహ్యంగా కూడా శక్తివంతమయినవి. కేవలం ఆధ్యాత్మికమయిన గ్రంధాలు ఆధ్యాత్మికమయిన ప్రాధాన్యతనే కలిగి ఉంటాయి, కానీ ప్రాచీన ఋషులు ఎవరిని మనం మార్మిక యోగులుగా భావిస్తున్నమో వారు అంతర్గత మార్గాల ద్వారా బాహ్యము మరియు అంతర్గత ఫలితాలు కూడా సాధ్యమని విశ్వసించారు. భావనలు, పదాలు ఏ విధమయిన సిద్ధిని పొందటాని కయినా వినియోగించుకోవచ్చునని భావించారు. వేదంలో తరచుగా చెప్పబడినట్లుగా మానవమాత్రమైన మరియు దైవికమయిన సిద్ధి ఇది.

CWSA 16:10-11

చిహ్నాలతో, సంకేత పదాలతో వాటి అర్ధాలను మరుగుపరిచే అవసరపు వత్తిడి వలన — గుహ్యంగా ఉంచవలసినందున — ఋషులు ద్వంద్వార్ధాలను ఎన్నుకొన్నారు. సంస్కృత భాషలో సులభంగా వీలయిన పద్ధతి యిది. ఎందుకంటే ఒకే పదానికి భిన్నమయిన అర్ధాలుంటాయి. కానీ యిది ఆంగ్లభాషలో అనువదించటం అంత సులభం కాదు, చాలాసార్లు అసాధ్యం కూడా. ఆ విధంగా అవుకు ఉయోగించే 'గో' పదానికి వెలుగు లేదా కాంతికిరణం అని కూడా అర్ధం ఉంది. ఇది కొంతమంది ఋషుల నామధేయాలలో కూడా గోచరిస్తుంది. గౌతమ, అత్యంత ప్రకాశవంతమయిన. గవిష్ఠిర, వెలుగులో నిశ్చలమైనవాడు అని అర్ధం. వేదాలలో గోవులు తేజో, జ్ఞాన సత్యసూర్యుని కాంతి కిరణాలు — గ్రీకు మార్మిక గాధలలో కూడా అభివర్ణించినట్లుగా. కొన్ని వేదభాగాలలో వ్యక్తపడిన ఈ అర్ధాన్ని అన్ని సందర్భాలలో ఆపాదించినప్పుడు సముచితమైన భావాన్ని కలుగ జేస్తుంది.

CWSA 16:13-14

వేద ఋషులు

ప్రాచీన కాలం నాటి భారతదేశంలో వేదాల కవిద్రష్టలైన ఋషులు ఉత్కృష్ట మయిన ఆధ్యాత్మిక మరియు సామాన్య ప్రజల కతీతమయిన మార్మిక జ్ఞానాన్ని కలిగి ఉండేవారు. వారు తమ జ్ఞానాన్ని, శక్తులను ఉపదేశం ద్వారా తమ శిష్యులకు, వారసులకు ధారపోయటం సంప్రదాయంగా వస్తుంది.

ఉనిషత్కాలంలో కూడా ఆ యుగంలోని ఆధ్యాత్మిక జిజ్ఞాసులు ఉపదేశము, ధ్యానము ద్వారా ఈ నిగూఢమయిన జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నించారు.

పండితులు అనంతరం ఊహాగానాలపై ఆధార పడవలసి వచ్చింది. ఒక మానసికమయిన వ్యాఖ్యానంపై కేంద్రీకరించి లేదా పురాణపరంగా మరియు బ్రాహ్మణములలోని కథల ననుసరించి విశదీకరించవలసి వచ్చేది. (బ్రాహ్మణములలో గాథలు కూడా సంకేతాలతో నిగూఢంగానే ఉండేవి.)

వైదిక ఋషులు తమ మంత్రాలు ఉన్నత గుప్తచేతనా స్తరాల నుండి ప్రేరితమయినవని విశ్వసించారు. అవి ఈ గుప్తమయిన జ్ఞానాన్ని కలిగి ఉన్నాయి. వేదంలోని వాక్కుల నిజమైన భావం కేవలం ద్రష్టలు, జ్ఞానులు అయినవారికే విదితం. ఇతరులకు ఈ శ్లోకాల్లోని గుప్తజ్ఞానం అందకుండా పోయింది.

CWSA 16:6-8

వైదిక ఋషులు ఉన్నత లోకాల నుండి వచ్చినవారు

ప్రశ్న: శ్రీమాతా! వేదఋషులంటే ఆ స్థాయికి ఎదిగిన మానవులా లేక ప్రత్యేకంగా ఆవిర్భవించినవారా?

మీ ఉద్దేశమేమిటి? దైహికంగా పరిణామం చెందిన జీవులా, లేక అంతర్మథనంతో పరిణితిచెందిన జీవులా? అని కదా?

వారు బహుశా ... కాదు... ఖచ్చితంగా అంతర్మథనంగా పరిణతిచెందిన జీవులు కానీ శరీరం మాత్రం పరిణామ క్రమంలో ఏర్పడింది.

కానీ వాళ్ళు నిస్సంశయంగా, కచ్చితంగా అంతర్మథనంగా పరిణతి చెందిన జీవులే. ఉన్నత స్తరాల నుండి దిగివచ్చి, ఈ దైహిక ఉపాధులను, వినియోగించుకొని ఈ దేహాలతో వ్యక్తపరచుకున్నారు. నేను మొన్న చెప్పినదిదే. ఈ భౌగోళిక మరియు మానవ పరిణామ క్రమాన్ని మార్చిన విషయ మేమనగా శరీరాలు ఉన్నత స్తరాలకు చెందిన జీవుల అవతరణకు అనువైన విధంగా వినియోగపడుటకు తగిన ఉదాహరణలుగా మారటానికి తగినంత పరిపూర్ణతను పెంపొందించుకోవటం. ఋషులు ఈ కోవకు చెందిన వారవటం తెలిసిన విషయమే. అందరూ కాకపోయినా కొంతమంది నాయకులుగా శిరఃస్థానంలో ఉన్నవారు — బహశా వారంతా ఒక సమూహంగా ఉండి పరిసరాల కతీతంగా సిద్ధిని పొందిన వారై ఉంటారు.

CWM 7:355-56

వేద కవులు పరిపూర్ణ నైపుణ్య ప్రవీణులు. వారి లయగతులు దేవతల రథాల్లా మలచబడి, దివ్యమైన, విశాలమైన, శబ్దపు రెక్కలపై మోయబడి, ఒకేసారి వాటి గమనంలో ఏకాగ్రము, విస్తృతము అగు తరంగాలుగా వృద్ధిజెంది, స్వరకల్పనలో సూక్ష్మ మై, భాషణములు శ్రుతిబద్ధమై, ఇతిహాస స్థాయికి ఉన్నతి చెంది, ఉచ్చారణలో మహాశక్తివంతమై, రూపంలో స్థిరము, స్వచ్ఛము, వైభవోపేతమై, సూటియైన, సంగ్రహమైన ప్రభావంగల భాషగా, సంపూర్ణమై పొంగిపొరలే భావన, సూచనలతో ప్రతి శ్లోకమూ స్వయంగా పటిష్టమై, సంతృప్తమై విరాజిల్లుతూ తన స్థానంలో ముందున్నదానికీ, తరువాత రాబోవుదానికీ మధ్య ఒక బృహత్సోపానా లయినాయి. విశ్వసనీయంగా అనుసరించిన వైదిక సంప్రదాయం దానికి రూపాన్నీ, స్థూలత్వాన్ని ఇచ్చింది, కాని యిందులోని విషయాలు గంభీరమై మానవాత్మకు సాధ్యమయిన మానసిక మరియు ఆధ్యాత్మిక అనుభవాలను కలిగి ఉన్నాయి. వాటి రచనా నిర్మాణశైలి ఆచారాలుగా జీర్ణావస్థకు ఎప్పటికీ దిగజారవు. ఎందువలన అంటే తాము అందించ దలచుకున్న దానిని ప్రతి కవి స్వయంగా జీవించి, తమ మనసులకు తమ వ్యక్తిగత దర్శనములకు సూక్ష్మత, ఉదాత్తతలతో కొత్త వ్యక్తీకరణను గలిగించారు. విశ్వామిత్రుడు, వామదేవుడు, దీర్ఘతముడు మొదలైన మహాద్రష్టల వాక్కులు అత్యంత అసాధారణము, విశాలము, ఉన్నతమయిన మార్మిక కవితా శిఖరాల నందుకున్నాయి. వీటిలో ఉపనిషత్తులు నిరంతరం వసిస్తూ తమ శ్వాసను నిలుపుకొనే సృష్ట్యావిర్భావ స్తోత్రం వంటి కవితలుగా భావనా శిఖరాలపై ఒక శక్తివంత మయిన స్పష్టతతో సాగుతాయి.

సనాతన భారతావని మానసము దాని వేదాంత, మత, సంస్కృతుల మూలాలను ఈ కవి ద్రష్టల రచనలలో గ్రహించ ప్రయత్నించినపప్పుడు ఏమాత్రం పొరపడలేదు. ఎందుకంటే తన జనావళి భవిష్య ఆధ్యాత్మికత వాటిల్లో బీజరూపంలో ఉన్నది లేదా వాటి ప్రథమ ప్రకటనలోనే వ్యక్తమయింది.

CWSA 20:326-27

వైదిక కవులు మంత్రమని పిలిచినది ఒక ప్రేరిత జ్ఞానమయ దర్శనము మరియు దివ్యదృష్టిగల భావన. అది సిద్ధితో కూడిననది — భగవంతుడు, ఆత్మ, మనిషి, ప్రకృతి, జగత్తు, జీవనం, విషయం, భావన, అనుభవం, కార్యం యొక్క అంతర సత్యవ్యక్తీకరణ సూచించే అవసరమైన యోచనాయుతమైన ఆధునిక పదం. అది ఛందస్సు అనే మహత్తరమైన ఆత్మ లయగీతుల రెక్కలపై ఏర్పడిన భావన. ఎందుకంటే దర్శనము, శ్రవణము వేర్వేరు కాదు. రెండూ ఒకే కార్యం, తమలో సత్యాన్ని జీవించటం. దేనినయితే మనం సిద్ధిపొందటం అంటున్నామో దానిని ఈ రెండింటి నుంచీవిడదీయలేము. ఎందుకంటే ఆత్మలో దాని ఉనికి, అది మనస్సును పొంది ఉండటం అనేదాని వ్యక్తీకరణ సృష్టి కర్త లేదా కర్మకు మానవ మాధ్యమానికి ముందుగానో లేక దానితో సలిసో ఒక అంతర్ ర్శనము, శ్రవణముగా ఒక తేజోమయ శబ్దంగా రూపుదిద్దుకుంటుంది.

మంత్రం హృదయం నుండి ఉద్భవిస్తుంది

హృదయంలో జనించిన మంత్రం మానసిక భావనలో ఏ శాశ్వత దైవం యొక్క సత్యత ముఖంగా లేక రూపంగా దర్శించబడిందో ఆ దైవం యొక్క రథంగా రూపొందించబడింది. కవి ద్రష్టల మంత్రాన్ని వినటానికి అర్హతగల బాహ్యశ్రోత మనసులో కూడా, ఆ శబ్దం నిజమయున మంత్రమయితే, అది విన్నవారికి ఆ అంతర సత్యంయొక్క దర్శనం కలగాలి, దాని అంతరమైన ఆత్మను మనసు పొందగలగాలి. ఆ లయబద్ధమైన శబ్దపు సందేశం, సత్యంయొక్క దర్శనం విన్న వెంటనే అది ఆత్మకు తక్షణమే అవగత మవ్వాలి. అది చాలా మార్మికమయిన విషయం అనిపించవచ్చు. మంత్రం యొక్క జననం, ప్రభావానికి యితమిద్ధంగా యింతకన్నా సంపూర్ణమయిన వర్ణన సాధ్యం కాదు. వైదిక ఋషులు ఉద్దేశించినదాని కన్నా తక్కువ స్థాయిలో, నిజంగా ఉన్నతమయిన కవితా ఆవిర్భావాలకు దీనిని వినియోగించుట జరగవచ్చు. అంతర సత్యానికి స్వరం కాగలిగినపుడు, సత్యం యొక్క భాషణం, లయల ఉన్నత శక్తిలో యిమిడినపుడు మంత్రమౌతుంది.

మరొక విధంగా చెప్పాలంటే మంత్రం సూటిగా, అతి ఉన్నతమైన, తీక్షణమైన,

అత్యంత లయబద్ధమయిన దివ్యభరితమయిన శబ్దం. అది మూర్తీభవించిన అంతర జ్ఞానం, మరియు జ్ఞానోదయ స్ఫూర్తి. అది మనస్సును ఆత్మసాక్షాత్కారము, దర్శనముల వలన వస్తువుల అంతర సత్యం, వాటి దివ్యమైన రూపాలతోను మమేకం చేస్తుంది. అది ఒక పరమ లయబద్ధమైన భాష. అది పరిమితమయిన దానిని పట్టుకొని అందులోనికి అనంతమయిన వెలుగును, స్వరాన్ని తెస్తుంది.

CWSA 26:218

స్వచ్ఛమైన ఆకాంక్ష — మంత్రం

నిజమైన ఆకాంక్ష, మెదడు నుండి రాదు. అది భావన ద్వారా నిర్మిత మయినప్పుడు, హృదయం నుండి ఒక జ్వాలలా పైకెగసి వస్తుంది, మీరు శ్రీఅరవిందులు వేదాల గురించి వ్రాసిన వ్యాసాలు చదివారో లేదో నాకు తెలియదు. ఆయన ఒక చోట వివరిస్తారు, ఈ స్తోత్రాలు మనసుతో వ్రాసినవి కాదు. అవి చాలామంది అనుకునేటట్లు ప్రార్థనలు కాదు, హృదయం నుండి ఎగసే ఒక జ్వాల, ఒక స్పందన, అది ఆకాంక్షకు వ్యక్తీకరణ. (అది హృదయం కాదు, వ్యక్తియొక్క చైత్యసత్త కేంద్రం) అది ఆలోచించి చెప్పినది కాదు, అవి శబ్దాల నుండి వచ్చిన అనుభవాలు కాదు. అనుభవం సరియైన, ఖచ్చితమయిన, అనివార్యమయిన శబ్దాలతో నిర్మితమైనవి. వాటిని మార్చటానికి వీలు లేదు. అది ఆకాంక్ష యొక్క సహజ గుణం. మీరు ఆ మంత్రాన్ని నిర్మించాలని అనుకోరు. అదే మీ నుండి ఒక సిద్ధమైన జ్వాలలా పైకెగసి వస్తుంది. అందులో ఏమైనా శబ్దాలు ఉంటే (కొన్నిసార్లు ఏమి ఉండదు) వాటిని మార్చటానికి ఉండదు. ఒక శబ్దస్థానంలో మరొక శబ్దాన్ని ఉంచలేరు. ప్రతి పదం ఖచ్చితంగా సరియైనిదై ఉంటుంది. ఒక ఆకాంక్ష, రూపుదిద్దుకున్నప్పుడు అది రూఢిగా, నిశ్చయంగా మార్పుకు అవకాశం లేకుండా చేయబడుతుంది.

CW M 4:136

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

యజ్ఞయాగాది మార్గము

ఋత్విజుడు

దివ్యజ్ఞానము, దివ్యశక్తి ఆవశ్యకమైనవే. యజ్ఞయాగాదుల నిర్వహణ, త్యాగశీలత వలననే అవి లభిస్తాయి, అభివృద్ధి చెందుతాయి. వాటిని ఆహ్వానించి యజ్ఞము అనే బలిపీఠం పైన ప్రతిష్ఠించాలి. దివ్యత్వం కూడా అంతే. దివ్యత్వం హృదయంలో ప్రతిష్ఠితమైతేనే మానవుడు దివ్యత్వాన్నీ, అమరత్వాన్నీ సాధిస్తాడు. మహర్షులు, ద్రష్టలు కూడా ఇట్టి సాధకులకు సహకరించారు. ఇది కూడా ఒక రకమైన ఆరాధనయే! ఈ విధంగానే దివ్యత్వం ఆవిష్కరింపబడుతుంది. వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ఆ విధంగా సుదాస్యునికి, త్రాసదాస్యునికి బోధకులైనారు. దైవస్తోత్రం చేసి, ఆరాధించి ఆహ్వానించటానికే ఋత్విజులు మంత్రపూతంగా హవిస్సులను ఆహుతి చేస్తారు.

దివ్యత్వం హృదయంలో మేల్కొననిదే జీవన్ముక్తి లేదు. దివ్యత్వమే మనకు విముక్తిని ప్రసాదించగలిగేది. మనలో అవగాహన కల్పించే అర్చకస్వామి దైవమే. ఆయనయే నిజమైన బోధకుడు. ఆయనను జ్వలిస్తున్న అగ్నిలో చూడవచ్చు. మన యజ్ఞాన్ని ఆయనే విజయవంతంగా నడిపించగలడు. ఋగ్వేదంలోని మొదటి ఋక్కు 'అగ్నిసూక్తం' కావటం కాకతాళీయం కాదు.

'అగ్ని' సర్వజ్ఞుడైన దైవశక్తి

'అగ్' అనేది అగ్నికి మూలబీజం. 'అగ్' అంటే శక్తి. అది వెలుగుకు కూడా సంకేతం. అందువలన 'అగ్ని' అంటే వెలుగుతున్న విజ్ఞానం అని అర్థం చేసుకోవచ్చు. ఎవరైతే విజ్ఞాన తేజంతో ప్రకాశిస్తాడో వాడు 'అగ్ని' లాంటి వాడని అర్థం చేసుకోవాలి. దీని వలన అగ్ని ప్రాథమికమైనదనీ, ఉన్నతమైనదనీ అర్థం చేసుకోవాలి. ఇది సృష్టికే ప్రాచీనమైనది. మనకు గోచరించే ప్రకృతి శక్తులకు కూడా 'అగ్ని' యే మూలము. 'ఆగ్' అనే ధాతువుకు 'సంచాలకత్వము', 'మార్గదర్శనము' అనే అర్థాలు కూడా వున్నాయి. ఆ విధంగా 'అగ్ని' ప్రపంచాన్ని నడిపించే శక్తి అని అన్వయించుకోవచ్చు. ఈ విధంగా మన ప్రపంచాన్ని నిర్దేశించిన లక్ష్యానికి చేర్చే శక్తి 'అగ్ని' అని భావించాలి. అందువలన దానిని భగవంతుని సేనావాహినికి నాయకుడు అని నిర్ణయించారు. అంతేకాక ప్రకృతిలోని వివిధ శక్తులకు ఆధారభూతమై వాటికి దిశానిర్దేశనం చేసే

శక్తి కూడా అగ్నియే. ఇదే విషయం వేదంలోని అనేక సూక్తాలలో చెప్పబడింది.

సృష్టి ప్రారంభానికి అసలైన కారణం ఈ శక్తియే. ఇదే సృష్టిలోని చర్య లన్నిటికి వెనుక ఉండే శక్తి, దేవతలను కూడా నడిపించేది, వారికి మార్గనిర్దేశనం చేసేది కూడా ఇదే. ఈ అగ్నిశక్తియే దివ్యశక్తికి కూడా ఆధారభూతమైనది. అగ్ని శక్తిరూపంలోను, తేజస్సు రూపంలోను, ఉష్ణరూపంలోను ఏకకాలంలో వ్యక్తం కాగలదు. మన లక్ష్య మైన 'ఋతచేతన' (సత్యచేతన) కలిగించేది కూడా ఈ శక్తియే. వేయేల, సృష్టికి ఆధార భూతంగా వుంటూ, మార్గనిర్దేశనం చేసే స్వయంచాలక శక్తి ఈ అగ్నియే అని చెప్పవచ్చు.

శాశ్వత సత్యాన్ని కాపాడేది కూడా అగ్నియే

అజ్ఞానము, అనృతము, దుర్మార్గము బాహ్యప్రపంచంలో అంతటా వుంటాయి. ఈ భయంకరమయిన ముసుగు వెనుక శ్రీమాత నిజస్వరూపం దాగి వుంటుంది. అచేతనత్వం, తమోగుణము, బాధలు కేవలము నిశాచర శక్తులే. వేదం వీటిని 'తమస్సు' గా అభివర్ణించింది. మన మేధాశక్తి కూడా అస్పష్ట చంద్రకాంతి వలెనో మిణుగు మిణుగు మనే నక్షత్రకాంతి వలెనో ద్యోతకమయ్యే దివ్యనిశీధి మాత్రమే. కాని విచిత్రం ఏమిటంటే ఈ చీకటి దుప్పటిలోనే ఆమె సహోదరి 'ఉషస్సు' కూడా నిద్రించి వుంటుంది కదా! ఇందవలన రానున్న దివ్య ఉషస్సుకు తమస్సు ఒక విధంగా తెర వంటిది అనుకోవాలి.

భౌతిక చేతన అనే కాళరాత్రిలో కూడా అగ్ని ఆరని జ్యోతిలా ప్రకాశిస్తూనే వుంటుంది. మన చీకటి ప్రపంచానికి 'సత్యచేతన' అనే వెలుగును ప్రసరించేది ఈ అగ్నియే. సృష్టికర్త దానిని అంతటా దాగి యుండేలా నిక్షిప్తం చేసాడు. అది విశ్వంలోని అన్ని కదలికలనూ శాసించగలదు. అసత్యం చుట్టూ వున్న అగ్ని శాశ్వత సత్యాన్ని నిగూఢంగా కాపాడుతూనే వుంటుంది. అచేతనాన్ని చైతన్యవంతం చేసేది కూడా అదే. అదే పదార్థంలో నిబిడీకృతమై యున్న చైతన్యం, అజ్ఞానంలో దాగియున్న దివ్యజ్ఞానం. పాపపంకిలంలో దాగియున్న స్వచ్ఛత కూడా అదే! దుఃఖం అనే మంచుతెరల మాటున ఉన్న ఆశాకిరణం; పరమాత్మ యొక్క విశ్వకళ్యాణ జ్యోతి అది.

మనమే గనుక అజ్ఞానపు పైపొరను ఛేదించి లోనున్న చైతన్యాన్ని చూడగలిగితే

దివ్య ఉషోదయమూ, దాని వెనుక నున్న అంతర్గత దివ్యశక్తులూ కనబడతాయి. "అందువలన పైనున్న అంధకారాన్నీ, అజ్ఞానాన్నీ, వేదననూ, అపజయాల్నీ రూపు మాపండి; దివ్యత్వంలో అమరులు కండి" అని దీని సందేశం.

మనలోని దైవానికి మొట్టమొదటి సజీవ సంకేతం 'అగ్ని'

అగ్నియే మనలోని అత్యున్నత దివ్యజ్యోతి. దాన్ని హృదయంలో జ్వలింప జేద్దాం. అది మన హృదయాలయానికి అర్చకస్వామి. ఆయనను ఆహ్వానిద్దాం. వారి దివ్యతేజస్సుతో అంతా పరిశుద్ధులమౌదాం. అల్ప సంతోషాలు, అర్థం లేని దుఃఖాలు, విజయాలు, పరాజయాలు ఆయనకు నైవేద్యంగా అర్పిద్దాం. చివరకు మరణాన్ని కూడా. పాతభావాలు, అసత్యము భస్మమై పోవు గాక! అప్పుడు ఊర్ధ్వ లోకాలను చేరుకోగల 'సావిత్రి' ప్రజ్వరిల్లుతుంది. అట్టి స్థితి నవ్యమైనది, సత్యమైనది.

సర్వము మన హృదయాంతరాళంలోనే ఉంటుందన్న సత్యం మరువకండి. 'అగ్ని' మనలోనే ఉన్నది. అర్పించేవాడు, స్వీకరించేవాడు, స్వీకరింపబడేదీ మనలోనే వున్నది. ద్రష్ట, స్రష్ట, విశ్వము మనలోనే వున్నాయి. బ్రాహ్మణుని వేదమంత్రం, దివ్యత్వాన్ని ఎదిరించే అసురశక్తులు, భూతగణాలు మన అంతర్గతమైనవే. వృత్రాసురుడు, ఆతని సంహర్త మనలోనే వున్నారు. దేవదానవుల యుద్ధం అంతరంగంలోనే జరుగుతుంటుంది. అంగిరస, వశిష్ట, విశ్వామిత్రాది సప్తఋషులు, అలాగే రాక్షసులు మనలోనే వున్నారు. జీవాత్మ — విశ్వాత్మ వేరుగా లేవు. అవి ఒక్కటే. దగ్గర, దూరం అనే భేదాలు ఉండవు. అష్టదిక్కులు, సప్తసముద్రాలు, జీవనదులూ, సప్తలోకాలు మనలోనే వున్నాయి.

శ్రీఅరవిందుల బెంగాలీ రచనలు (పేజీలు 35-40)

యజ్ఞ, యాగ క్రమ మార్గము

అసత్యమై, నశ్వరమైన ఈ భౌతిక ప్రపంచం ఏనాటికైనా అనంతమైన దివ్యత్వాన్ని అందుకోగలదా? చిచ్ఛక్తిని, దివ్యానందాన్ని అది ఏ విధంగా అందిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం ఒక్కటే: "అవును, అందిస్తుంది. యజ్ఞయాగాదులు అందుకు మార్గం." యజ్ఞం అంటే సమర్పణ, మరియు ఆత్మార్పణ. నీవు నీ సర్వస్వము, నీ భవిష్యత్తు, నీ ధన కనక వస్తు వాహనాలు ఆ దివ్యాగ్నిలో ఆజ్యం కానివ్వు. అదే

దివ్యానందానికి నీవు అర్పించగల ఆహుతి. ఆ విధంగానే దివ్యత్వాన్ని, దివ్యానందాన్ని నీవు అందుకోగలవు. అదే యోగమార్గము, మోక్షమార్గము. అశాశ్వతమైన భౌతికము పాశవికానికి ఆవల కొలువున్న పరాత్పరుడికి అర్పించే ఆజ్యమే.

శరీరము, మనసు, జీవము అనే మూడు రజ్జువులతో జీవుడు బంధించబడ్డాడు. మనసు అజ్ఞానము అనే బంధనము. దుఃఖము ప్రాణానికి ఉన్న అవరోధము. కోరికలూ, విభేదాలు ఈ దుఃఖానికి కారణము. శరీరానికి మరణం అనేది ఆవలి గట్టు. ఎలా జీవి ఈ బంధనాలను త్రెంచుకొని విముక్తుడు కాగలడు? జీవుడు పైకి ఎదగాలంటే ప్రకృతి అవరోధాలను దాటాలి. దీనికి మార్గం తన సర్వస్వాన్ని త్యాగం చేయాలి: దైవానికి అర్పించాలి.

నిగూఢమైన ఈ సత్యాన్ని — అంటే ఆత్మ పరమాత్మలో లీనం కావటం — నిజం చేయటానికే దైవం ఈ లీలను ఎంచుకుంది. శారీరక స్పృహలో వుండి కూడా అమరత్వాన్నీ, బ్రహ్మానందానుభవాన్నీ, అనంత విజ్ఞానాన్నీ, శక్తిని సముపార్జించటం, ప్రేమైక జీవన మాధుర్యాన్ని అనుభవించ గలగటం ఈ జీవితంలోనే సంభవించాలి. ఇవన్నీ భగవంతుని లక్షణాలు. ఆయన నిత్యుడు కాబట్టి ఆయన లక్షణాలు కూడా నిత్యమే. కాని మానవులలో ద్వైదీ భావం ఉంటుంది. సుఖదుఃఖాలు, అనేకత్వ ఏకత్వాలు, అవధి, నిరవధికములూ, బాహ్య అంతరంగాలూ, ఇంద్రియానుభవము, అతీంద్రియ జ్ఞానము మొదలైనవి పరస్పర భిన్న భావాలు. ప్రతిదానికి మరొకటి విరుద్ధంగా వుంటుంది.

శ్రీఅరవిందులు, బెంగాలీ రచనలు (పేజి 47-48)

యజ్ఞాచరణ యొక్క నియమాలు

మన జీవితము, చేతన నిశీధి లాంటివి. మిణుగు మిణుగుమనే నక్షత్రాలు కొంచెం కాంతిని ప్రసరింప చేస్తాయి. కాని ఆ చీకటి ఉషోదయానికి జన్మ నిస్తుంది, కాని మరల కాళరాత్రి వెలుగులను మ్రింగి వేస్తుంది. ఇది ఒక విధంగా ప్రకృతిలోని యజ్ఞమే. ఆకాశం నుండి మేఘుడు వర్షించటమూ యజ్ఞమై. సప్తసముద్రాలే పైనుండి వర్షించి మరల మనకు జీవనదులౌతాయి. చుట్టూ చుట్టుకున్న కొండచిలువ లాంటి వృత్రాసురుడు దేవుని అశనిపాతానికి ఛిన్నాభిన్నమై పోతాడు. యజ్ఞంలో సోమపానం చేసి ఋత్విక్కులు తన్మయులౌతారు.

సర్వస్వం పరమాత్మకు సమర్పించటమే మనము చేయగలిగిన యజ్ఞం. ప్రపంచ మంతటా ఒక అవ్యక్తమైన యజ్ఞభావమే ఉంది. ఆత్మ పరమాత్మలో లీనం కావాలనుకోవటం యజ్ఞమే కదా! ఎక్కడ ఆత్మకు ముక్తి లభిస్తుందో, ఎక్కడ హృదయంలో దైవ సంకీర్తన ప్రతిధ్వనిస్తుందో అక్కడ ఆత్మకు బంధనాలు ఉండవు. అది నిర్జిత బంధ విజేత.

హృదయాంతరాళంలో జనించిన నిజమైన సృజనాత్మక అర్పణ ద్వారా మానవుడు దేన్నయినా సాధించ గలుగుతాడు; పరిపూర్ణతను అందుకో గలుగుతాడు. ప్రకృతే అట్టివానికి తనకు తానుగా లోబడి అతని సాహచర్యం కోరుకుంటుంది; అతని భాగస్వామి అవుతుంది. ఆమె భవితకు అతడు ద్రష్ట యైన రారాజు కాగలడు.

జీవుడు దేవుడు కావాలంటే మూడు నియమాలు ముఖ్యంగా పాటించాలి

1) దైవ ప్రార్థన ద్వారా దైవానికి ఆకర్షితుడై వుండాలి. 2) ప్రస్తుతించటం ద్వారా దేవుని దృఢంగా నమ్మాలి. 3) తన జీవితంలో దైవాన్ని వ్యక్తం చేయటం ద్వారా దైవత్వాన్ని ఆవిష్కరించాలి. మానవుడు ఆ విధంగానే తనలో ప్రతిబింబించుకో గలడు. అట్టివాడు దైవసాన్నిధ్యంలో వుంటూ మరల మరల దైవాంశతో జన్మిస్తూ తనలోనూ, సర్వ ప్రపంచంలోనూ ఆనందాన్ని చూస్తూ హాయిగా జీవితం గడపగలడు.

యజ్ఞాచరణలో సాధకుడి ముందంజ

మన భౌతిక ప్రపంచం రెండు మహా సముద్రాల మధ్య వుంటుంది. అధో భాగంలో వుండే సముద్రం మనలోని అంతఃకరణమే. అది అధోచేతన. మన దైనందిన మనోభావాలు, స్పందనలు, ఆవేశాలు అందులో నుండే జనిస్తాయి. అచేతనము కాళరాత్రి వంటి సముద్రము. దీనిని వేదము 'అప్రకేతం సలిలం' అని అభివర్ణించింది. అదే అధోచేతన, లేక సుప్త చేతన. అయినా దానికి ఉండే చైతన్యం దానికి వుంది. ప్రకృతికి అతీతమైన విశ్వం అందులో దాగి వున్నది. అది విజ్ఞాన భాంఢాగారము. సత్కర్మ దాని విధి. అది బహిర్గతమైతే సృష్టి రూపం సంతరించుకుంటుంది. ఇక మనకు ఊర్ధ్వంలో ఇంకొక మహా సముద్రం వుంటుంది. అదే విశ్వవ్యాప్త 'అతిమానస'

చేతన. చేతన, అచేతన అనేవి రెండూ దాని ఛాయారూపాలే. ఊర్ధ్వంలో వున్న సత్, చిత్, ఆనందములు అందులో సంపూర్ణ ఆకృతులు పొందుతాయి. అదే సత్యలోకం; అనంతమైన సత్యలోకం. ఇక తపోలోకంలో అనంత శక్తి,చేతన నిండి వుంటుంది. జ్ఞానలోకంలో సృజనాత్మకత ఆనందాబ్ధిలో మునకలు వేస్తుంది. మహర్లోకంలో సత్యచేతన అనంత పరివ్యాప్తిని పొందుతుంది. వీటన్నిటి మధ్యన ఉన్నదే భూలోక చేతన. ఈ విషయం కూడా వేదంలో ఉన్నదే. పైన పేర్కొన్న వివిధ లోకాలు, చైతన్యాలు దివ్యచైతన్యదానిలోని మజిలీలే.; సమతలంగా వుండే మజిలీలు. ఈ ఏడు మజిలీలు ఏడు మెట్ల వంటివి. వీటిని దాటితే దివ్యత్వం చూడవచ్చు. పైకి ఎక్కేనారికి భగవంతుడు చేయూత నిస్తాడు. అసుర శక్తులు క్రిందకి లాగుతూనే వుంటాయి; ఆటంకాలు కలిగిస్తూనే వుంటాయి. సత్యాన్వేషి మాత్రం క్రమంగా ఎక్కి ఆధ్యాత్మిక గిరి శృంగం చేరగలడని వేదాలు చెప్పాయి. ఆలా వెళ్ళినవారే ఆనంద సముద్రంలో మునకలు వేయగలరు. దానికి మార్గదర్శియే అగ్ని. అదియే ఈ యజ్ఞానికి ఋత్విజుడు.

శ్రీఅరవిందుల బెంగాలీ రచనలు పుట. 40-41

అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు

సంసమిద్ యువసే వృషన్నగ్నే విశ్వన్నియం ఆ

ఇంస్పదే సమిక్ష్యయసే స నో వసున్యా భర

"ఇద్దరూ ఏకమై ఒకే మాట పలకండి, ప్రాచ్యదేవతలు ఒకే జ్ఞానాన్ని తెలుసుకుని ఎవరి భావాన్ని వారు తీసుకున్నట్లుగా మీ మనసులు కూడా ఒకే జ్ఞానానికి రావాలి

స గచ్ఛధ్వం స వదధ్వం సం వో మనాంసి జానతమ్



దేవా భాగం యధా పూర్వే సంజానానా ఉపాసతే

మీ ఆకాంక్ష ఏకముగాను, మీ హృదయములు ఐక్యమై మీ మనసులు కలసియుండు గాక. అందువలన మీరిరువురు పరస్పరం సన్నిహితమయిన స్నేహాన్ని కలిగి యుందురు గాక.

CWSA 16:446-47

శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజాప్రసాద్

భగవానుడు తనకు తాను యజ్ఞప్రభువు. భగవానుడు మహాశివుడు, మహాప్రకృతి ఉమ. ఆమె మహాశివుని ప్రతిబింబాన్ని తన హృదయంలో ధరించినా కూడా, ఇంకా ఆమె ఆయన దర్శనీయమైన రూపాన్ని పొందే అవకాశం కోల్పోతున్నది, స్పర్శతో తెలియబడే ఆయన శరీరం కోసం ఆమె తీవ్రంగా వాంఛిస్తున్నది. ఈ విధమైన తీవ్రవాంఛయే విశ్వజీవితంయొక్క గాఢమైన ప్రాధాన్యత.

Sri Aurobindo: Bengali Writings 46-47

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కొన్ని వేద ప్రతీకలు

నెయ్యి నివేదనం

...యజ్ఞంలో 'ఘృతం', నెయ్యి ద్వారా బహుశః ఏమి సూచించబడుతుండ వచ్చు?... ఘృతమును ఎప్పుడూ ఆలోచనలకు లేదా మనస్సుకు అనుసంధానం చేస్తూ వాడబడిందని నేను కనుగొన్నాను. వేదాలలోని స్వర్గం మనస్సుకు ప్రతీక, ప్రకాశమానమైన మనఃప్రవృత్తికి ఇంద్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు, ఆయన రెండు గుర్రాలు ఆ మనః ప్రవృత్తికి రెండు విధాలైన గతిశక్తులు. వేదాలకు సైతం ఒక్కొక్కప్పుడు దేవతలకు మేధస్సును (మనీషా) శుద్ధనెయ్యిలాగా నివేదించడాన్ని స్పష్టంగా చెపుతుంది, "ఘృతం నపూతం మనీషామ్". ఘృతమనే పదం సమృద్ధి లేదా ఉత్సాహభరిత స్ఫూర్తి నొసగే భావనతో పాండిత్య ప్రాధాన్యాంశంగా కూడా దృఢంగా విశ్వసించబడుచున్నది....

*

గోవులు, గుర్రాల కానుకలు

గోవు మరియు గుర్రం, 'గో' మరియు 'అశ్వ' ఎప్పుడూ జతగూడే ఉంటాయి. ఉషా, అరుణోదయం, 'గోమతి అశ్వవతి' గా వర్ణించబడింది. అరుణోదయం యజ్ఞకర్తకు గుర్రాలను, గోవులను ఇస్తుంది. భౌతిక ఉషోదయ వేళకు సంబంధించినప్పుడు గోమతికి అర్థం కాంతికిరణాలతో వచ్చేది, లేదా తీసుకువచ్చేది, మానవుల మనస్సులో ప్రకాశమాన ఉషోదయానికి అది ప్రతిబింబం. కనుక 'అశ్వవతి' కూడా కేవలం భౌతిక అశ్వానికి మాత్రమే ఉదహరించ గలిగిందేమీ కాదు. దానికి తప్పకుండా మానసిక ప్రాధాన్యత కూడా ఉంటుంది. వేదాశ్వాన్ని అధ్యయనం చేసినప్పుడు 'గో', 'అశ్వ' అనేవి రెండూ జతకూడి ఉండే భావాలతో దివ్యప్రకాశము, దివ్యగతిశక్తి మరియు దివ్యచైతన్యము, దివ్యశక్తులకు ప్రాతినిధ్యం వహించేవని, అవి వేద, వేదాంతుల మనస్సులకు ఉనికిలోని సమస్త చర్యల రెండు విధాలైన లేక కవలలైన దృక్పథాలు అని అంతిమంగా నిర్ణయానికి నేను రావడం జరిగింది.

కనుక వాస్తవంగా విశదమైన విషయం, వేదయజ్ఞపు రెండు ప్రధాన ఫలాలు గో

సంపద, అశ్వసంపదలు మానసికప్రకాశ సమృద్ధికి, ప్రాణికశక్తి పుష్కలత్వానికి ప్రతీకలు....
CWSA 15:42-44

సంఖ్యల రహస్యం

వేదవ్యవస్థలో ఏడు సంఖ్య అత్యంత ప్రముఖమైన పాత్రను పోషిస్తుంటుంది, చాలా అత్యంత ప్రాచీన సాంప్రదాయ సిద్ధాంతాల ఆలోచనల ప్రకారం ఇది ఎప్పుడూ తిరిగి తిరిగి పునఃప్రస్తావన అవుతూనే ఉంటుంది — ఏడు ఆనందాలు, సప్తరత్నాని; ఏడు జ్వాలలు, అగ్ని నాలుకలు లేదా కిరణాలు, సప్త అర్చిషః, సప్తజ్వాలాః; ఆలోచన-తత్వం యొక్క ఏడు ఆలోచనా రూపాలు సప్తధీతయః; దేవతల జనని, అదితి, వధించతరంకాని దివ్యధేనువు యొక్క సప్త దివ్యకిరణాలు లేదా ధేనువులు, సప్తగావః; ఏడు నదులు, ఏదు తల్లులు లేదా పోషణ నిచ్చే ఆవులు, సప్తమాతరః, సప్తధేనవః, ఈ పదాన్ని తటస్థంగా దివ్యకిరణాలకు, దివ్యనదులకు వాడబడింది. ఈ ఏడు అంకెతో కూడినవన్నీ వేదాలు వర్గీకరించిన విధంగా, ఉనికిలో ఉన్న వాటియొక్క ప్రాథమిక సూత్రాలు, తత్వాల మీద ఆధారపడిందని నేననుకుంటున్నాను.

ఆ 'ఏకము' నే ఆధారమైనదానిగా, ప్రధానమైనదానిగా గుర్తించడం జరిగింది; ఈ ఏకానికి రెండు తత్వాలున్నాయి. దివ్యము మరియు మానుషము, మర్త్యము మరియు అమృతత్వము. ఇంకా, ఆ రెండు సంఖ్య మరొక విధంగా రెండు తత్త్వాలై స్వర్గము, పృధ్విగా, మహా మనస్సు మహద్ శరీరాలకూ, మహదాత్మ మహాప్రకృతులకు వాడబడుతుంది. అవి అస్తిత్వాలన్నింటి తండ్రి, తల్లిగా తలచబడ తాయి. ఆ రకంగా అవి ప్రాముఖ్యత కలిగినవి, అయినప్పటికీ స్వర్గ, పృధ్వులు సహజ గతిశక్తి యొక్క రెండు రూపాలుగా మానసిక, భౌతిక చైతన్యాలకు ప్రతీక లైనప్పుడు, అవి ఇక ఎంత మాత్రమూ తండ్రి, తల్లిగా కాకుండా ఇద్దరు తల్లులుగా అయిపోతారు. త్రిపుటి తత్వం రెండు విధాలుగా గుర్తించబడింది, మొదటిది మూడు విధాలైన దివ్యతత్వం, ఆరాధనకు ప్రత్యుత్తరమిచ్చే సచ్చిదానందం, దివ్యసత్యం, చైతన్యం, ఆనందములు; రెండవది మూడు విధాలైన విశ్వ సంబంధిత మహా మనస్సు, మహా జీవితం, మహా శరీరములు, వీటి మీదనే వేదాలు, పురాణాలలో ప్రస్తావించిన మూడు లోకాలు నిర్మాణమయ్యాయి. కాని పూర్తి సంఖ్య సాధారణంగా ఏడుగానే గుర్తించబడింది. ఈ అంకె మూడు దివ్యతత్వాలకు, మూడు విశ్వతత్వాలకు మధ్యన

ఏడవది లేక లంకె-తత్వమైనది, ఏదైతే కచ్చితంగా దివ్యసత్య-చైతన్యమో, 'ఋతం బృహత్', అనంతర కాలంలో విజ్ఞానము లేదా మహస్‌గా తెలియబడిందో అది చూపించబడింది. వీటన్నింటి మొత్తం ఏడుగా స్థిరపరచబడింది.

CWSA 15:96-97

ఏడు నదులు

వేదాలలోని ఏడు నదులు, దివ్యజలములు, ఆపః, వేదభాషలో సాధారణంగా సప్తమాతృకలుగా లేదా పోషణ నిచ్చే సప్తదివ్యగోవులు, 'సప్తధేనవః' గా పేర్కొనబడింది. ఆపః అనేదానికి అర్థం, నిగూఢంగా, రెండు విధాలుగా ప్రాముఖ్యత కలిగింది; ఆపః మూలధాతువు ప్రాథమికంగా కేవలం కదులుతూ ఉండేదనే అర్థంలో మాత్రమే కాదు, దాని నుంచే జలతత్వ భావన పూర్తి సంభావ్యతతో ఉత్పన్న మైనప్పటికీ, ఉండేదానిని లేదా తీసుకువచ్చేదానిని, 'అపత్య' లో శిశువులాగా మరియు దక్షిణ భారతదేశపు, 'అప్పా', తండ్రిలాగా కూడా అర్థం వస్తుంది. సప్తదివ్యజలములు అస్తిత్వం యొక్క జలములు; ఎవరి నుంచైతే ఉనికిలోని అన్ని రూపాలు ప్రభవించాయో, ఆ దివ్యమాతలు వారు. కాని మనం మరొక వ్యక్తీకరణను కూడా చూస్తాం, సప్తగావ; ఏడు దివ్యగోవులు లేదా ఏడు దివ్యకిరణాలు, ఇంకొక విశేషణం సప్తగు, ఏడు కిరణాలు కలదీ. గు (గావః) గో (గావః) అనేవి వేదసూక్తాలలో అంతటా ఈ ద్వంద్వ భావనతో గోవులు, ప్రజ్వలించే కిరణాలుగా వాడబడుతుంది. ప్రాచీన భారతీయ వ్యవస్థ ఆలోచనలలో అస్తిత్వము, చైతన్యము రెండు ఒకదాని కొకటి అభిముఖంగా ఉంటాయి. 'అదితి' ని, ఏ అనంత సత్త్వం నుంచి దేవతలు ఆవిర్భవించారో, ఆ జగజ్జననిగా, సప్తనామములతో, సప్త ఆసనాలతో (ధామాని) వర్ణించబడింది, ఇంకా ఆమె అనంత చైతన్యం, దివ్యగోవుగా, సప్తప్రజ్వలన కిరణాలలో అభివ్యక్తమైన ప్రాథమిక ప్రకాశంగా, 'సప్తగావః' లాగా కూడా భావించబడింది. ఒక దృష్టి కోణంలో, ఏడు విధాల తత్వాలతో కూడిన ఉనికిని సాగరం నుంచి దివ్యనదులు ఉద్భవించిన చందంగా చిత్రీకరించబడింది, సప్తధేనవః, మరొక కోణంలో సృష్టించే సూర్యసావిత్రి, సప్తగావః, పరమపితయొక్క దివ్యకిరణాల రూపంగా చిత్రీకరించబడింది.

CWSA 15:123-124

దివ్యప్రకాశం యొక్క శిశువులు — గాఢాంధకారం యొక్క ఆధిపత్య శక్తులు

వేదాలలో వ్యక్తీకరించబడిన ఋతమ్ జ్యోతిః, హిరణ్యమ్ జ్యోతిః, సత్య ప్రకాశము, బంగారుకాంతి కూడా ఉన్నాయనే విషయాన్ని మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అది మనకు అదనపు కీలకాన్ని అందజేస్తుంది. సూర్యకాంతిని గురించిన ఈ మూడు విశేషణాలు ఆర్య, ఋత, హిరణ్య అనేవి అన్యోన్యం జ్ఞానప్రకాశంతో కూడినవై చాలా మటుకు సరిసమానమైనవని నేను ప్రతిపాదిస్తున్నాను. సూర్యుడు దివ్యసత్యానికి ప్రభువు, కనుక అందువలన దాని ప్రకాశం ఋతమ్ జ్యోతిః; ఈ సత్యప్రకాశమును ఆర్యుడైనటువంటి దేవుడు లేదా మర్త్యుడు స్వాధీనంలో ఉంచుకుంటాడు, అదే అతని ఆర్య తత్వానికి రూపకల్పన నిస్తుంది; ఇంకా స్వర్ణమయమనే విశేషణ ఎప్పుడూ ఆదిత్యునికే వాడబడింది, బహుశా వేదాలలో సువర్ణము సత్యపదార్థానికి ప్రతీక అయి ఉండవచ్చు, ఎందువల్లనంటే దాని పదార్థం ప్రకాశం, అది సూర్యునిలో, స్వర్ జలములలో స్వర్ణసంపద, , అప్ప్యాప్సేగా కనపడుతుంది — కనుక ఈ విశేషణం హిరణ్యాం జ్యోతిః అని చెప్పబడింది. ఈ స్వర్ణమయమైన లేదా వెలుగులు వెదజల్లే ప్రకాశం సత్యం యొక్క రంగు, 'వర్ణం'; అది కూడా ఆర్యులు సంపాదించిన ఆ సంపూర్ణ ప్రకాశంతో నిండిన ఆలోచనల రంగు, శుక్ర, శ్వేత రంగులో వెలుగులను వెదజల్లే గోవుల రంగు, దివ్యప్రకాశపు రంగు; కాని దస్యుడు, గాఢాంధకార ఆధిపత్య శక్తి అవటం మూలంగా, అతడి రంగు నలుపు. నేను సత్యప్రకాశం వెలుగు, జ్యోతిః ఆర్యంను, జ్యోతిరగ్రాః లైన ఆర్యుల వర్ణముగా ప్రతిపాదిస్తున్నాను; అజ్ఞాన కాళరాత్రిది 'పాణి' ల రంగు, దాసవర్ణము. ఈ విధంగా రంగు అనేది చాల మటుకు సహజ ప్రకృతిని లేదా ఆ ప్రత్యేక ప్రకృతియొక్క మిగిలినదాని నంతటినీ తెలియజేస్తుంది. రంగు సహజ ప్రకృతికి ప్రతి అవటం మూలంగా అది దానినే తెలియజేస్తుంది....

CWSA 15: 225-26

నేను కనుగొన్న దేవతలు దివ్యప్రకాశం యొక్క శిశువులు, ఆనంతంయొక్క అదితి పుత్రులుగా వర్ణించబడ్డారు. ఎటువంటి మినహాయింపులు లేకుండా వారు మనిషిని మించి ఉంటారని వర్ణించబడింది. వారు అతనికి జ్ఞానప్రకాశమును తెచ్చే వారుగా, అతని మీద పుష్కలమైన జలములను, స్వర్గ సమృద్ధిని కురిపించే వారుగా, అతనిలో

సత్యమును వృద్ధిచేస్తూ, దివ్యలోకములను నిర్మాణము చేస్తూ, అతని మీద దాడిచేసే వాటిని ఎదుర్కొంటూ, ఆ గొప్ప లక్ష్యమైన పూర్ణానందము, పరమ సుఖము ముందుకు నిడిపిస్తూ ఉంటారని వర్ణించబడింది. వారి చర్యలు, వారి విశేషణాలు, వారితో ముడిపడిన పురాణాలలోని మానసిక భావనలు, ఉపనిషత్తులు, పురాణాల సూచనలను బట్టి, ఇంకా అప్పుడప్పుడు, పక్కన వెలుగు లందించే గ్రీకు మానవాతీతుల గాథల ద్వారా వారి ప్రత్యేక విధులు దృగ్గోచర మవుతుంటాయి. అంతే కాకుండా, వారిని వ్యతిరేకించే రాక్షసులు విభజన, పరిమితుల ఆధిపత్యశక్తులు, వారంతా ఆవహించేవారు, గాయపరచి హింసించేవారు, భక్షించేవారు, చెరపట్టేవారు, రెండుగా విభజించేవారు, అవరోధం కల్పించేవారు; వారి పేర్లు సూచించే విధంగానే స్వేచ్ఛా యుతమైన, సమగ్రమైన ఐక్య అస్తిత్వానికి వ్యతిరేకంగా ఆ ఆధిపత్య శక్తులు పని చేస్తాయి. ఆధునిక మనస్సు దాని చారిత్రక భావనల ప్రకారం ఉండాలను కునే విధంగా, గోరంతలు కొండంతలు చేసి చెప్పే విధంగా ఈ వృత్రాసు, పాని, అత్రి, రాక్షస, శంబర, వాల, నాముచి అనబడు వారు ద్రావిడ రాజులు, దేవతలు కారు. వారు చాలా పురాతన భావనకు బాగా సరిపోయే మన పూర్వీకుల మతపరమైన, నైతికపరమైన అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారు ఉన్నతోన్నతమైన దివ్యశ్రేయస్సు మరియు నిమ్నకామన ఆధిపత్య శక్తుల మధ్య సంఘర్షణకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఋగ్వేదంలోని ఈ భావం, అదే విధమైన మంచిచెడుల వ్యతిరేకత, మరొక విధంగా, కొంత తక్కువ మానసికపరమైన అతిసూక్ష్మ భేదాలతో మన పురాతన పొరుగువారైన, రక్తసంబంధీకులైన జోరాష్ట్రియన్ పవిత్ర గంథాలలో మరింత ఎక్కువ నైతికతతో సూటిగా వ్యక్తీకరించబడింది. ఇది బహుశా ఇద్దరికీ సమానంగా మూలమైన ఆర్య సంస్కృతి యొక్క వర్తన నియమావళి నుంచి ఉత్పన్నమై యుండవచ్చును.

*

దివ్యసత్యానికి, దివ్యప్రకాశానికి సహజ శత్రువు

.... దస్యువు సహజ శత్రువు. ఈ విభజించే, కొల్లగొట్టే, హానికారక శక్తులు, ఈ దానవులు విభజించే దివ్యజనని పుత్రులు, వారి గురించి చెపుతూ ఋషులు వారి అనేక సర్వ సాధారణ నామములను వివరాలతో అందించడం జరిగింది. అచట

రాక్షసులు భక్షించేవారు మరియు మింగేసేవారు, తోడేళ్ళు మరియు గాయపరచి హింసించేవారు ఉన్నారు; బాధ కలిగించేవారు మరియు ద్వేషించేవారు ఉన్నారు; రెండుగా విభజించేవారు; బంధించేవారు మరియు నిందించేవారు ఉన్నారు. కాని మనకు అనేక ప్రత్యేక నామాలు కూడా ఇవ్వబడ్డాయి. వృత్ర, మహాసర్పము, అత్యధిక ప్రాధాన్యత కలిగిన శత్రువు, ఎందువల్లనంటే అతడు తన గాఢాంధకార చుట్టలతో దివ్య ఉనికి సంభావ్యతను, దివ్యచర్యలను అడ్డగిస్తాడు; వృత్రాసురుడు ప్రకాశంచేత చంపబడినా కూడా, అతని నుండి భయంకర శత్రురూపాలు ఉద్భవించాయి. ఘుష్ణ, తన అపవిత్ర, నిష్ఫల శక్తితో దుఃఖాన్ని కలుగజేస్తాడు. నముచి బలహీనతలతో దాడిచేస్తాడు, ఇతరులు కూడా తమ తమ సహజమైన దుష్టత్వంతో శత్రుత్వంతో మన మీద దాడి చేస్తారు. మరియు ఇంకా వల, వాల పాణిలు భావనా-జీవితంలో పిసినారి వ్యాపారులు, ఉన్నతోన్నతమైన దివ్యప్రకాశమును, దాని వెలుగులను దొంగిలించేవారు, దాచిపెట్టేవారు, దానిని వారు కేవలం గాఢాంధకారమయం చేసి, దురుపయోగ పరుస్తారు — అది అత్యంత క్రూరమైన సైన్యం, తాము నిలవచేసుకున్న దానిని తమ హక్కుగా కాపాడుకుంటూ, దేవతలకు నైవేద్యంగా నివేదించనివారు. ఇవి, ఇంకా ఇతర వ్యక్తిత్వాలు — వ్యక్తిత్వధారణ చేసినవాటి కంటే అవి చాలా ముఖ్యమైనవి — మన అజ్ఞానం, దుష్టత్వం, బలహీనత, ఎన్నో పరిమితులు మనిషి మీద నిరంతరం యుద్ధం చేస్తూ ఉంటాయి. అవి సమీపం నుంచి చుట్టు ముట్టుతాయి లేదా దూరం నుంచి శరాఘాతాలు కలిగిస్తాయి లేదా ద్వారం వేయబడి ఉన్న అతడి గృహంలో దేవతల స్థానంలో నివసించడం సైతం చేస్తూ, ఆకృతిలేని తడబడే నత్తి నోరు కలిగిన ముఖాలతో, సరిపోనటువంటి శ్వాసశక్తితో అతని స్వయం-వ్యక్తీకరణను వికృతం చేస్తాయి. వాటిని బహిష్కరించాలి, జయించి వశపరచుకోవాలి, వధించాలి. బలవంతులైన, సహాయం చేసే ఆరాధ్యదైవాల తోడ్పాటుతో వాటిని నరకాంధకారం లోనికి బలంగా నొక్కివేయాలి.

CWSA 15: 46, 379

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

వేదాలలో దేవీ దేవతలు

దేవతల ఆంతరిక ప్రాశస్త్యము

వేదాలలో ప్రస్తుతించబడిన దేవత లందరికీ వారు ఉపరితలంలోను, ఆంతరంగికం గాను నిర్వహించవలసిన నియమితమైన పని ఒకటుంటుంది, మనకు తెలిసిన మరియు తెలియని గుప్త నామాలుంటాయి. బాహాటంగా వ్యక్తవడే వారి లక్షణాలు మహా ప్రకృతియొక్క శక్తులు. వాటి అంతరార్ధం ఒక మానసిక చర్యను మరియు మనోవాసన లను సూచిస్తుంది. వారందరూ ఒక 'ఏకము; అగు పరమ సత్యం, 'ఏకమ్ సత్', ఏకైక అనంత దివ్య అస్తిత్వంయొక్క అనేక శక్తులు. అవగాహనకు అందని పరమాత్మ వేదంలో 'తత్ సత్' లేక 'తద్ ఏకమ్' అని అనేకసార్లు ప్రస్తుతించ బడ్డాడు. వైదిక దేవతలకున్న ఈ విశిష్ట లక్షణం కొన్ని ఆకృతులను ఆపాదించుకుంది. ఎవరైతే దేవతలకు కేవలం బాహాటంగా వ్యక్తమయ్యే వారి భౌతిక ప్రాశస్త్యాన్ని మాత్రమే ఆపాదిస్తారో వారిచే ఈ ఆకృతులు పూర్తిగా అపార్ధం చేసుకోబడ్డాయి. ఈ దేవతలలో ప్రతి ఒక్కరు తమలో తాము ఆ ఏకైక 'ఏకమ్ సత్' యొక్క ప్రత్యేక విశ్వాత్మక వ్యక్తిత్వానికి పరిపూర్ణ ప్రతీకలు. వారి శక్తుల సంయోజక స్థితిలో ఒక సంపూర్ణ విశ్వ శక్తిగా, ఒక స్వయం సంపూర్ణ విశ్వవ్యాప్త వ్యవస్థగా, 'వైశ్వదేవ్యమ్' గా రూపొందుతారు. ప్రతి ఒక్కరు, వారి ప్రత్యేక చర్యకే పరిమితం గాక, మిగతావారి కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు. ప్రతివారు స్వయంగా తమలో విశ్వగత దివ్యత్వాన్ని నిలుపు కొంటారు.

CWSA 20:201-202

వైదిక దేవతలు సజీవమైన వాస్తవ అస్తిత్వాలు

వైదిక దేవతలు విశ్వేశ్వరుడగు భగవంతుని నామాలు, మరియు వ్యక్తిత్వాలు, ప్రతి ఒక్కరు ఆ దివ్య అస్తిత్వం యొక్క ఒక అత్యావశ్యక శక్తి ప్రతిరూపం. వారు విశ్వానికి సాక్షీభూతులు మరియు ఆ విశ్వమందే స్వయం వ్యక్తమౌతారు. వారు దివ్యతేజస్సు యొక్క బిడ్డలు, అనంతుడగు ఆ దేవుని పుత్రులు, మనిషి అంతరాత్మలో తమ సహజాతుని, మిత్రుని గుర్తించి, తమంతట తాము తమ శక్తిని అతనిలో పెంచుకుంటూ తమ ప్రకాశంతో, బలంతో, సౌందర్యంతో అతను తన ప్రపంచాన్ని



స్వంతం చేసుకొనుటకు సహాయ మందించాలనే కోరిక కలిగి వుంటారు. దేవతలు మనిషితో ఒక దివ్యసాహచర్యం మరియు ఒక సంబంధం నెలకొల్పటానికై అతనిని పిలుస్తారు, అతనిని తమ తేజోమయ సమాజానికి ఆకర్షితుడిని గావించి, ఉద్ధరించి, చీకటిమయం మరియు చీలికలు గావించబడిన లోకవాసులును ఎదిరించటానికి అతని సహాయాన్ని అర్థిస్తారు, తమ సహాయాన్ని అందిస్తారు. అందుకు కృతజ్ఞతా పూర్వకంగా మనిషి దేవతలను తాను నిర్వర్తించే యజ్ఞానికి ఆహ్వానించి వారికి తనను ఉత్తేజపరచే, చరుకుదనం కలిగించే, స్వచ్ఛతను సమకూర్చే, మాధుర్యాలను అందిస్తాడు — దీప్తిమంతమైన గోమాత యొక్క పాలు, వెన్నలు, మహదానందాను భూతిని కలిగించే దివ్యౌషధీ మూలిక రసాలు, యజ్ఞాశ్వం, భక్ష్య భోజ్యాదులు, మధుర పానీయాలు, పందెంలో దౌడు తీసే వేగాన్ని దైవంపై లగ్న మైన మనస్సుకు అందించే దీప్తివంతమైన అశ్వాలకు దాణ. అతడు వాటిని తన అస్తిత్వం లోనికి, వారి బహుమతులను తన జీవితం లోనికి స్వీకరించి వాటిని వేదగానంతో, మధుర పానీయాలతో గొప్ప తేజోవంతమైన సమగ్ర ఆకృతులుగా రూపొందిస్తాడు — వేదంలో చెప్పబడినట్లు ఒక కమ్మరి ఇనుమును కాల్చి పోత పోసినట్లుగా.

ఒక్కసారి మనకు మార్గం దొరికితే వైదికమైన ఈ కల్పననంతా అర్థం చేసుకోవడం సులభమౌతుంది, కానీ అది కేవలం కల్పనను తెలుసుకోవటానికేననే పొరపాటు చేయకూడదు. దేవతలు కేవలం మహాప్రకృతి యొక్క భౌతిక మరియు మానసిక కర్మల లేక శూన్య భావాల కవితాపరమైన వ్యక్తీకరణలు కారు. వేదద్రష్టలకు వారు సజీవ వాస్తవాలు. మానవ అంతరాత్మ యొక్క పరిణామ క్రమాలు కేవలం సిద్ధాంతాల మరియు ఉద్దేశాల విశ్వగత పోరాటాలను ప్రతిబింబించవు, అవి వాటికి ఆధారభూత మైన, వాటికి రూపకల్పన చేసే విశ్వగత దివ్యశక్తుల పోరాటానికి ప్రతీకలు. వీటినే దేవతలు మరియు రాక్షసులు అని అంటారు. ప్రపంచ నాటకరంగం పైన మరియు వ్యక్తి యొక్క అంతరాత్మలోన, ఇదే విధమైన యదార్థ నాటకం, అలాంటి పాత్రధారుల తోనే ఆడబడుతుంది.

విశ్వదేవతలు

ఏ దేవతల నివేదనకై యజ్ఞాన్ని ఆచరించాలి? మానవ జీవిలో పెరుగుతున్న ఈ దేవతాంశను ప్రత్యక్షపరచటానికి, కాపాడటానికి ఎవరిని ఆవాహన గావించాలి?

అగ్ని: మొదట అగ్నిదేవుడిని, ఎందుకనగా అతడు లేకుండా ఆత్మ బలిపీఠంపై యజ్ఞజ్వాల రగలదు. ఆ అగ్నిజ్వాల దైవసంకల్పం యొక్క సప్త జిహ్వాత్మక శక్తి, జ్ఞానదీప్తమైన దైవశక్తి. ఈ చైతన్యవంతమైన, శక్తిమంతమైన సంకల్పం మన మర్త్యత్వంలోకి విచ్చేసిన అమరుడగు అతిథి, ఒక పవిత్రుడగు అర్చకుడు, ఒక దివ్య శ్రామికుడు, దివికి భువికి మధ్య మధ్యవర్తిత్వం నెరిపేవాడు, ఉన్నతతర దివ్యశక్తులకు మనమేది నివేదిస్తామో దానిని చేరవేసి, ప్రతిఫలంగా వారి శక్తిని, తేజాన్ని, ఆనందాన్ని మానవజాతికి అందించేవాడు.

ఇంద్రుడు: తరువాత మహాబలసంపన్నుడగు ఇంద్రుడు. అతడు దివ్యమానసంగా స్వయం వ్యక్తమైన పవిత్ర దివ్యసృష్టియొక్క ఆధిపత్య శక్తి. అగ్ని ఏ విధంగానైతే తన శక్తి ప్రసరణను భువి నుండి దివికి, ఊర్ధ్వముఖంగా పంపించే జ్ఞానశక్తితో నిండిన దివ్యశక్తి నిధియో, అదే విధంగా ఇంద్రుడు దివి నుండి భువికి దిగివచ్చే తన శక్తితో నిండిన దివ్యకాంతి నిధి. అతడు మన ప్రపంచంలోకి అతిమానుష శక్తి సమన్వితుడిగా కాంతివంతమైన అశ్వాలతో దిగివచ్చి అంధకారాన్ని, విభజన తత్వాన్ని తన మెరుపులతో చెండాడి, ప్రాణప్రదాతలగు స్వర్లోక జలాలను వర్షింపచేసి, వేటకుక్క జాడను కనుగొన్నట్లుగా దివ్యమైన అంతర్ జ్ఞానాన్ని, అంతరించిన లేక మరుగుపడిన కాంతులను కనుగొని, పరమ సత్య ప్రతీక యగు సూర్యుడిని మన మానసిక స్వర్గ సీమల పైకి ఆరోహించునట్లు చేస్తాడు.

సూర్యుడు: పరమోత్కృష్టమైన పరమ సత్య ఆధిపత్య శక్తి సూర్యుడు — అస్తిత్వంయొక్క సత్యం, జ్ఞానం యొక్క సత్యం, ప్రక్రియ, ప్రవర్తన, కదలిక మరియు నిర్వహణల యొక్క సత్యం. అందుమూలంగా అతడు సృష్టికర్త లేక సమస్త విషయాలలో స్వయం వ్యక్తమగువాడు — ఎందుకనగా సృష్టి అనగా వెల్లడి గావించటం, పరమ సత్యము మరియు దివ్య సంకల్పముల ద్వారా వ్యక్తపరచటం — మన అంతరాత్మలను వికసింప జేయువాడు, పోషకుడు, పితరుడు. మనం కోరే ఆధ్యాత్మిక వెలుగులు, దివ్యమైన అరుణోదయ బాటలో మనలను చేరే ఈ సూర్యుని కాంతి సమూహాలు నిశీథిలో దాచబడిన లోకాలకు, ఒకదాని తరువాత ఒకటి, అత్యున్నత దివ్యానంద ప్రాప్తి సిద్ధించే విధంగా విడుదల గావిస్తాడు, బహిరంగ పరుస్తాడు.

సోముడు: ఆ దివ్యానందమయ స్థితికి సోముడు ప్రాతినిధ్యం వహించే దేవత. ఆతని పారవశ్యము కలిగించే ద్రాక్షాసారము భూమిలో పండే పంటలలో, సృష్టిలోని

జలసమూహాలలో దాగి వున్నది. ఇక్కడ, మన భౌతికసత్తలో సైతం అమరత్వం ప్రసాదించగల ఆతని జీవరసాలున్నాయి. వాటిని వెలికితీసి దేవత లందరికి నివేదించాలి. ఎందుకనగా ఇవి ఆ విధంగా బలం పుంజుకొని వృద్ధిచెంది జయిస్తాయి.

ఈ ఆద్యదేవతలలో ప్రతి ఒక్కరు తమతో బాటు ఇతర దేవతలను కూడా భాగస్వాములను చేసి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

CWSA 15:379-80

శ్రీఅరవిందులు

వరుణుడు — మిత్రుడు — ఆర్యముడు — భగుడు

సూర్యుని సత్యత మన మానవ ప్రకృతిలో దృఢంగా నాటుకోవాలంటే ముందుగా కొన్ని షరతులను పాటించటం అనివార్యం. పాపభూయిష్టము, కుటిలము, దోష పూరితమగు దానినంతా భగ్నపరచగల అపారమైన స్వచ్ఛత, సుస్పష్టమైన విశాల దృక్పథం అలవడాలి — ఇదే వరుణుడు. ఒక ప్రకాశమానమైన ప్రేమ, సహనశీలతతో కూడిన శక్తి ఏదైతే మన ఆలోచనలను, ఆచరణలను, భావోద్వేగాలను సామరస్యంగా రూపొందించుటకు దోహదపడుతుందో — అదే మిత్రుడు. ఒక అక్షయమైన, బలమైన, స్పష్టమైన వివేచనాత్మక ఆకాంక్ష, కృషి — ఇది ఆర్యముడు. పాపము, పొరపాటు, బాధలు గల కలల దుష్పరిభావాన్ని పారదోలి, అన్ని విషయాలను సక్రమంగా, ఆనందంగా అనుభవించగల సంతోషకర సహజత్వం — ఇది భగుడు. ఈ నాలుగు సూర్యుని సత్యత యొక్క శక్తులు.

అశ్వినులు: సోముని పరిపూర్ణ పరమానంద స్థితి మన సహజ ప్రకృతిలో పూర్తిగా నెలకొనాలంటే, ఒక సంతోషకరమైన, జ్ఞానదీప్తమైన, వైకల్యం చెందని మానసిక, ప్రాణిక, శారీరక స్థితి ఏర్పడటం అవసరం. మనకు ఈ స్థితిని ప్రసాదించే వారు కవలలగు అశ్వనీదేవతలు. దివ్యకాంతి (సూర్యదేవుని దివ్యాంశయగు సావిత్రిగా మన ప్రాచీన పౌరాణిక గ్రంథాలలో పేర్కొనబడింది) పుత్రికను పెండ్లాడిన వారు, మధువును గ్రోలువారు, సంపూర్ణ సంతృప్తిని కలిగించేవారు, వైకల్యతను, వ్యాధిని నయం చేయగలవారు, మన తెలివితేటలను మన కార్యాచరణలను కొంతవరకు పంచుకొని, మనము మానసిక, ప్రాణిక, దైహిక అస్తిత్వం అభ్యున్నతిని ఒక సులభతర మైన, విజయవంతమైన మార్గంలో పొందుటకు సమాయత్తపరుస్తారు.

రిభులు, మరుత్తులు: మానసిక ఆకృతులను రూపొందించే దైవమానసమగు ఇంద్రుడు, తనకు సహాయకులుగా, చేతిపనివారులుగా రిభులనబడు మానవ శక్తులను నియమించుకుంటాడు. యజ్ఞకార్యాచరణ వలన, మరియు సూర్యదేవుని మహోన్నత నివాసస్థానానికి ప్రజ్ఞాపాటవాలతో ఎదిగినందున అమరత్వం పొంది, వారు సాధించిన ప్రగతిని మానవజాతి సైతం సాధించుటకు తోడ్పడుతారు. ఇంద్రుని అశ్వాలను, అశ్వనీ దేవతల రథాన్ని, దేవతల ఆయుధాలను, పయనానికి, యుద్ధానికి అవసరమైన సమస్త సాధన సామగ్రిని తమ మానసిక శక్తితో రూపకల్పన గావిస్తారు. సత్యత యొక్క దివ్యకాంతి ప్రదాతగా మరియు వృత్రాసుర సంహారిగా ఇంద్రుడు మరుత్తుల సహాయం పొందుతాడు. మరుత్తులు ఆలోచనా చేతనకు, స్వయం వ్యక్త గళానికి పటిష్టమైన లేక ప్రాణాధారమైన దివ్యశక్తిని, సంకల్పబలాన్ని అందించగల శక్తులు. సమస్త ఆలోచనలకు, వాక్కులకు వెనుక ప్రేరకులుగా వుంటారు, పరమోత్కృష్టమైన దివ్యచేతనకు కాంతిని, సత్యతను, పరమానంద స్థితిని చేకూర్చుటకు పోరాడుతారు.

స్త్రీ శక్తులు

స్త్రీశక్తులు కూడా వున్నాయి. ఎందుకనగా దైవం పురుషమూర్తి మరియు స్త్రీ మూర్తి రెండూను. అలాగే దేవతలు కూడా అయితే క్రియాశీల శక్తులు లేకపోతే సహనంతో కార్యాన్ని నిర్వహించే మరియు క్రమబద్ధత కల్పించే శక్తులు.

అదితి, ఆమె శక్తులు

మొదటిది దేవతల దివ్యమాత యగు అదితి శక్తి. దీనికి తోడు దివ్యసత్యచేతన యొక్క పంచశక్తు లున్నాయి — మహి లేక భారతి అను మహామంత్ర పదము, దైవికమైన మూలం నుండి సమస్త విషయాలను మనకు చేకూర్చేది; ఇళ అను పరమ సత్యంయొక్క మహాశక్తిమంతమగు మంత్రపదము. దాని కార్యకారిక దృష్టిని మనకు ప్రసాదించేది; సరస్వతి, దాని శక్తి ప్రసరణ ప్రవాహిక మరియు ప్రేరణ శక్తి యొక్క మంత్రపదము; సరమ, దైవికమగు అంతర్ జ్ఞానం, స్వర్లోకపు వేటకుక్క లాగా అచేతన అను అజ్ఞానాంధకార బిలంలోకి దిగివచ్చి అచ్చట మరుగుపరచబడిన కాంతులను కనుగొనేది; దక్షిణ, ఆమె నిర్వహించే కార్యం గురించి సక్రమంగా ఆలోచించి, యజ్ఞనిర్వహణ కార్యక్రమాన్ని తగు రీతిలో జరిపించి, పూర్ణాహుతిలో

ప్రతి దేవతకు అందవలసిన భాగాన్ని అందచేసేది. ప్రతి దేవత కూడా తన స్త్రీశక్తిని కలిగి వుంటాడు.

ఈ కార్యక్రమం, ఈ తీవ్ర ప్రయత్నం. ఈ ఆధ్యాత్మిక ఆరోహణా క్రమం అంతా దేవతలకు మాతాపితరులు, మనకు తండ్రియగు సర్వేశ్వరుడు, మనకు తల్లి యగు భూమాత అండగా నిలిచి, తమ వంతుగా మానసిక, అభౌతిక, మరియు దైహిక చైతన్యాన్ని కాపాడుతారు.

CWSA 15:379-82

అదితి, ఉషాదేవి

ఉషాదేవి గోమాతలకు తల్లిగా అనేక మార్లు వర్ణించబడింది. గోవు భౌతిక కాంతికి లేక ఆధ్యాత్మిక వికసనానికి వైదిక చిహ్న మైనట్లయితే, ఆమె పగటి వెలుగుయొక్క భౌతిక కాంతికిరణాలకు ఉత్పత్తి స్థానము లేక వాటి తల్లి లేక ఉషోదయ కాంతికిరణాల దేదీప్యమానమైన వెలుగులకు, అంతరంగ వికసన స్వచ్ఛతకు, వైభవానికి సృష్టికారిణి అనే భావాన్ని ఆ వర్ణన కలిగిస్తుంది. కాని వేదంలో దేవమాతయగు అదితి గోమాతగాను, జగన్మాతగాను వర్ణించబడింది. ఆమె పరమోత్కృష్టమగు దివ్యకాంతి, సమస్త ప్రకాశాలు ఆమె నుండి ఉద్భవిస్తాయి. మానసిక దృష్ట్యా అదితి దేవతాలోకంలో అత్యున్నతమైన స్థానం గలది లేక అనంతమైన దివ్యచేతన, దేవతలకు మాత. ఆమెకు శతృస్థానంలో దను లేక దితి, విభాజితమగు చేతన, వృత్రాసురుడు మొదలగు దానవులకు — దేవతలకే గాక పురోగతి చెందే మానవులకు గూడా శతృవులు — తల్లి. ఒక విశాల దృక్పథంతో గమనిస్తే, భౌతిక చేతన నుండి ఉన్నతస్థాయి దశలకు చెందిన అన్ని విధముల విశ్వచేతనకు అదితి మూలస్థానం. సప్తగోవులు 'సప్త గావః', ఆమె రూపాలు. దానికి తోడు దేవమాతకు సప్తనామాలు, సప్తపీఠాలు వున్నాయని తెలుపబడింది. గోమాతగా ఉషాదేవి కేవలం అదితి యొక్క పరమోత్కృష్ట దివ్యకాంతికి, పరమోన్నత దివ్యచేతనకు ఒక రూపం లేక శక్తి మాత్రమే. వాస్తవానికి 1-113-19 లో (వేదం) ఆ విధంగా వర్ణించబడింది, "మాతా దేవానామ్ అదితిర్ అనీకమ్", ''దేవతల మాత, అదితియొక్క రూపం (లేక శక్తి)".

CWSA 15:131-132

సరస్వతి కేవలం నదులకు సంబంధించినదే కాదు, ఇతర దేవీమూర్తులకు — ఎవరైతే వాస్తవంగా మానసికపరమైన సంకేతాలుగా నున్నారో — వారికి కూడా సంబంధించినది. ప్రధానంగా భారతి, ఇళలు తదుపరి కాలపు పౌరాణిక పూజా విధానాలో సరస్వతి వాక్కుకు, శాస్త్రాధ్యయనానికి, కవిత్వానికి దేవతగా వ్యవహరించబడింది. భారతి ఆమెకు మరో పేరు కానీ వేదవాఙ్మయంలో భారతి మరియు సరస్వతి వేర్వేరు దేవతలు. భారతిని మహా సమగ్రమైనది, మహోన్నతమైనది, అప్రమేయమైనది అగు మాహి అని కూడా పిలుస్తారు. ఈ త్రయం, ఇళ, మాహి మరియు భారతి అనబడు సరస్వతి కలిసికట్టుగా యజ్ఞార్థం అగ్నిదేవునిచే ఆహూతులు కాబడు దేవతల నామాలతో పాటు ఆహ్వాన స్తోత్రాలలో జతపరచబడ్డారు.

"ఇళా సరస్వతి మాహి, తిస్రో దేవీర్ మయోభువః

బర్హి సిదాంత్వస్రిధః"

"ఇళ, సరస్వతి, మాహి దేవీత్రయం ఎవరైతే పరమానందస్థితి కారకులో వారు యజ్ఞపీఠంపై ఆసీనులగుదురు గాక, వారు తడబడకుందురు గాక" లేక "ఎవరు హాని కలిగించుటకు రారో లేక 'హాని చేయరో'" ఈ విశేషణంయొక్క అర్థం, నేననుకున్నట్లు, ఎవరిలోనైతే దుష్టపరిణామాలను కలుగజేసే మోసపూరితమగు యత్నం దురితం వుండదో, పాపపంకిలము పొరపాటు అను గోతులలో పడిపోవటం వుండదో...

"భారతి మన యజ్ఞానికి వేగంగా తరలి వచ్చును గాక, ఇళ మానవజాతిలో మన చేతనను మేల్కొలుపుతూ (లేక, జ్ఞానాన్ని, గ్రహణశక్తులను) ఇచ్చుటికి విచ్చేయును గాక, మరియు సరస్వతి — ముప్పురు దేవీమూర్తులు ఈ పరమానంద పీఠంపై ఆసీనులై, యజ్ఞకార్యక్రమాన్ని సక్రమంగా నిర్వర్తించెదరు గాక".

ఈ ముగ్గురమ్మల విధులు పరస్పర సంబంధము కలిగినవని, అవి సరస్వతి యొక్క ఉత్ప్రేరిత శక్తికి సన్నిహితమైనవని స్పష్టమయింది, పోను పోను మరింత స్పష్టమవుతుంది. సరస్వతి ఒక మహామంత్ర పదము, ఒక ప్రేరణశక్తి. నేను సూచించినట్లుగా అది పరమసత్య చేతన అనబడు ఋతమ్ నుండి ఉద్భవిస్తుంది. భారతి

మరియు ఇళ కూడా అదే మంత్రపదము లేక జ్ఞానముయొక్క వేర్వేరు రూపాలు అయి వుంటాయి.

CWSA 15:94-95

సూర్యసావిత్రి

అయితే ఆ సూర్యుడు, ఎవరి నుంచైతే ఈ కాంతికిరణాలు ప్రసరిస్తాయో, అతడు ఎవరు? అతడు పరమ సత్య అధిపతి, దివ్యకాంతి ప్రదాత, సృష్టికర్త యగు సావిత్రి, వృద్ధి కారకుడగు పూషుడు. అతని కాంతికిరణాలు సహజ సిద్ధంగా జ్ఞానోదయం, ప్రేరణ, అంతర్బుద్ధి యొక్క దీప్తివంతమైన వివేచనల యొక్క అతిమానస కార్యక్రమాలు, వేదాంత పరిభాషలో విజ్ఞానము అబడు సంపూర్ణ జ్ఞానము, వేద ఋతమ్, పరమ సత్యముల సర్వోత్కృష్ట నియమానుసారంగా సాగే కార్యక్రమం. కానీ ఈ కాంతికిరణాలు మానవ మానసిక సీమలలోకి సైతం దిగివచ్చి వాటి అత్యున్న తస్థితిలో ప్రకాశవంతమైన మేధాలోకాన్ని, ఇంద్రుడు ప్రభువైన స్వర్లోకాన్ని రూపొంది స్తాయి.

ఎందుకనగా ఈ విజ్ఞానం ఒక దివ్యమైన శక్తి, మానవ మాత్రమైనది కాదు. స్వయం ప్రకాశమానమైన సత్యంతో ఏర్పడిన దివ్యమానసం మాదిరిగా మనిషి మనస్సు ఏర్పడలేదు. అది ఒక ఇంద్రియానుభూతికి లోనైన మనస్తత్వం, మనస్సు, ఏదైతే పరమ సత్యాన్ని అందుకొని అర్థం చేసుకొనేది కాని దానితో ఏకమయ్యేది కాదు. భౌతిక చేతన పరిమితులకు, సమర్థతలకు సరిపడునట్లుగా పదును పెట్టబడిన మానవ అవగాహనా శక్తిలో జ్ఞానదీపం తనకు తానుగా వ్యక్తపరచుకోవాలి. తన నిజ స్వభావ దిశగా అంచెలంచెలుగా ఎదగాలి, మన మానసికాభివృద్ధి కోసం వరుస క్రమంలో సాగే పరిణామ దశలను ప్రకటించాలి. అందువలన సూర్యకాంతి కిరణాలు మన మానసికస్థితిని ఏర్పాటు చేసే ప్రయాసలో ఒకదానిపై ఒకటి ప్రభావం చూపే మానసిక లోకాలను మూడింటిని సృష్టిస్తాయి — ఇంద్రియ సంవేదన, ఉత్తమ అభి రుచి, మానసికోద్వేగం గల మనస్సు, స్వచ్ఛమైన మేధాసంపత్తి మరియు దివ్యజ్ఞానం. ఈ మూడు మానసిక లోకాల పరిపూర్ణత మరియు సమగ్రత కేవలం అస్తిత్వంయొక్క స్వచ్ఛమైన మానసిక స్తరంలోనే వుంటుంది. అక్కడ, ఆ మూడు స్వర్లోకాలపై, 'త్రిస్రో దివః', వారు మూడు దేదీప్యమానమైన కాంతులుగా 'త్రిరోచనాని'

వెలుగుతూంటాయి. కానీ, వాటి ప్రకాశం భౌతిక చేతన పైబడి దాని పరిధుల్లో తదనుగుణంగా ఏర్పడే స్థితులను, వైదికపరంగా "పార్థివాని రజాంసి" అనబడు ప్రకాశమానమైన పృథ్వీ క్షేత్రాలను ప్రభావితం చేస్తాయి. వాటినే త్రివిధ, "తిస్రః పృథ్వీః" మూడు భూమండలాలు అని అంటారు. ఈ లోకాలన్నింటికీ సూర్యసావిత్రి సృష్టికర్త....

పరమ సత్య ప్రామాణికంగా సావిత్రి సృష్టికర్త, కానీ నిర్మాణాత్మకమైన లేక యాంత్రికమైన విధంగా రూపొందించే భావనలో కాదు. ఆ పదం యొక్క మూల అర్థం ఒక మానసిక ప్రేరణను, ఒక సడలింపును, ఒక విడుదలను లేక బహిర్గతం చేయటాన్ని – సృష్టి అను పదం యొక్క సాధారణ అర్థానికున్న భావనను – సూచిస్తుంది. అందువలన అది ఒక ఉత్పాదన. ఒక కార్యం చేయాలనే భావన కలగటంతో ఉత్పత్తి జరగదు, కానీ తపస్సు వలన, ఆచరించేవాడి అస్తిత్వ చేతనపై కలిగే ఒత్తిడి వలన, ఆ అస్తిత్వంలో అంతకు పూర్వమే నిగూఢమై వున్న, మన ఊహకందని ఊర్ధ్వస్తరాలలో అంతర్నిహితంగా నిద్రాణమైవున్న శక్తి, సత్యతల వలన, ఆ ఉత్పత్తి బహిర్గతమౌతుంది.

సూర్యుడు మనస్సును, ఆలోచనలను పరమ సత్యకాంతులతో దీప్తివంతం గావిస్తాడు. అతడు 'విప్రుడు', దివ్యజ్ఞాని. ఎవరైతే వ్యక్తిగత మానవ మనస్సును పరిమితులకు లోబడిన స్వీయచేతన నుండి, పరిసర పరిస్థితుల నుండి విముక్తిని కలిగించి, వ్యక్తిగత ఇష్టాయిష్టాలచే కట్టడి కాబడిన కదలికలకు స్వేచ్ఛను ప్రసాదించ గలడో, అతడు ఆ దివ్యజ్ఞాని. 'విప్రుడు'. అందువలన అతడు 'బృహత్', అప్రమేయుడు. కానీ అతని ప్రకాశం ఒక మసకబారిన వెలుగు కాదు, అతని అప్రమేయత, అతని విశాలత ఆత్మ పైన, లక్ష్యం పైన తడబాటుపడిన, దిగజారిన అభిప్రాయంతో ఏర్పడదు. అతడు తనలో సమస్త విషయాలను గురించి, వాటిలో భాగాలు, వాటి సంబంధాలను గురించి సమగ్రమైన, స్పష్టమైన అవగాహన కలిగి వుంటాడు. అందువలన అతడు 'విపశ్చిత్', స్పష్టమైన గ్రహణశక్తి గలవాడు.

CWSA 15:288-89

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



అనేక అస్తిత్వాలచే నిండిపోయి వున్న ప్రపంచం మనిషి అంతరాత్మ. ఒక మహోన్నత విజయానికి సహాయపడేందుకు, లేక ఆటంకపరచేందుకు సంఘర్షిస్తూండే సైన్యాలు కల ఒక రాజ్యం మనిషి అంతరాత్మ. మన అతిధులైన వేలుపు లుండే మరియు అసురులు ఆక్రమించాలని పెనగులాడే గృహం అది. అంతరాత్మ శక్తుల సమృద్ధతలు, దాని అస్తిత్వం యొక్క వైశాల్యత, దానిని దివ్యమైన వాటి సమావేశార్థం విస్తృత పరచబడిన, సిద్ధం చేయబడిన, శుద్ధం చేయబడిన యజ్ఞవేదికగా తయారుచేసాయి.
CWSA 15:384

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

వేదాలలోని ప్రాథమిక సత్యాలు

ప్రపంచం ఆనందంలో మరియు ఆనందంతో జీవిస్తుంది

ప్రపంచం ఆనందంలో, ఆనందం వల్ల మనుగడ సాగిస్తోంది. ఆనందంనుండి మనం జన్మించామని, ఆనందంవల్ల జీవిస్తున్నామని, ఆనందంలోకి తిరిగి చేరుకొంటామని వేదం చెప్తున్నది. మన దేహాలను ఆవరించి, తన శాశ్వతతత్వపు ద్రవ్యంతో, బలంతో ప్రాణాన్నీ, జీవన వ్యాపారాన్నీ పోషిస్తూ ఆకాశం యెలా వున్నదో, అలా మన అస్తిత్వాన్నావరించి యీ బ్రహ్మానంద స్వర్గం లేకపోతే, గాలి పీల్చి, విడిచే శక్తి సైతం యే మనిషికీ ఉండదని కూడా వేదం చెప్తోంది. ఈ ప్రపంచం సారతః ఆనంద ప్రపంచం. ఇది వేదాంత దృష్టి, వేదద్రష్టల దృష్టి. బౌద్ధమత వైశ్వవిషాదానికి, మాయా వాద విముక్త భ్రాంత స్థితికి, ప్రజనన శక్తి గల తన తొలిదశలోని హిందూత్వానికి మధ్య తారతమ్యతను ఆ ద్రష్టల దృష్టి గుర్తించింది. అపరా ప్రకృతిలో నిమ్నస్వభావంతో నిజం చేసుకోకుండా, దానిని గ్రహించి, స్వాధీనం చేసుకోకుండా, ఈ మహదానందస్థితి నుండి పతనం చెందడం సంభవమే. మనిషి ఆనంద పరిపూర్ణతకు రెండు విషయాలు అవసరం — అతని అస్తిత్వపు పరిపూర్ణత, అతని జ్ఞానపరిపూర్ణత, వాటి ఐకమత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్త అభివ్యక్తులలో — వీర్యం, బలం, భ్రజస్, తేజస్, ఓజస్ — తన శక్తి పరిపూర్ణత. ఎందుకనంటే ఆనందం, సత్ , చిత్ మూడూ కూడా ఒకే సత్యత. కార్యనిర్వహణలో చిత్ , శుద్ధ క్రియాశక్తి అవుతుంది, దానికే ఋషులు తపస్సు అని పేరు పెట్టారు. సత్ , ప్రకాశం, క్రియాశక్తి పరిపూర్ణతల మీద ఆధారపడిన ఈ ఆనంద పరిపూర్ణత యిచట యీ భూమి మీద పొందడం వైపు మానవజాతి సహజంగా నడక సాగాలి. అది సాముదాయక మానవ కృషి. తనలో ఇచట, ఆవల “ఇహ చ అమృత చ”, దీనిని పొందడం మానవ సమిష్టి, వ్యష్టి కృషి కావాలి. ఈ ఆనందాన్ని అందుకొన్నానని, అతనిలోని జ్ఞానం యే స్థాయిలో అనుకొన్నా, ఆ స్థాయియే తన స్వర్గం అనుకొంటుంది.

CWSA 12:205-206

ఉన్నతతర, ప్రగాఢతర, విశాలతర పరమ సత్యం ఒకటున్నది

పరమ సత్యం, దివ్యవెలుగు, అమృతత్వం లను అన్వేషించడం చుట్టూనే

మన ఆలోచనంతా కేంద్రీకరించబడి వుంది. బాహ్యసృష్టి కంటే లేక అస్తిత్వం కంటె ఉన్నతతర, ప్రగాఢతర, విశాలతర పరమ సత్యం ఒకటుంది. వివేకము, ప్రేరణ వల్ల లభించే మానవ బుద్ధి వెలుగు కన్న మహనీయమూ, ఉన్నతమూ అయిన దివ్యవెలుగు ఒకటున్నది. వ్యక్తి ఉద్ధరితం కావలసి వున్న ఒక అమృతత్వం వున్నది. ఈ పరమ సత్యం, అమృతత్వం "సపంత ఋతమ్, అమృతమ్" తో సంబందం పెట్టుకొనడానికి, ఆ పరమ సత్యంతో జన్మించడానికి, అందులో యెదగడానికి, పరమ సత్యపు లోకం లోనికి తత్త్వతః ఆరోహించడానికి, అందులో జీవించడానికి మనం మార్గం కనుగొనాలి. అలా చేయడమంటే అధిదైవతంతో మనల్ని మనం యేకం చేసుకోవడం, మర్త్యత్వం నుండి అమృతత్వం లోనికి పయనించడం. ఎంతో అనృతత్వంతో, దోషంతో "అనృతస్యభూరే" కలగలసిపోయిన యీ ప్రపంచ నిమ్నసత్యం యిక్కడున్నది, ఎచట సమస్తం, సత్యచేతస్సు "ఋతచిత్" అయి వున్నదో, ఆ పరమ సత్యపు లోకం లేక గృహం "సదనమ్ ఋతస్య" "సత్యం, ఋతమ్, బృహత్" వున్నది. త్రివిధ స్వర్గాలు వాటి వెలుగుల వరకు మధ్య అనేక లోకాలున్నాయి. కాని ఇది సత్య సూర్యలోకం, "స్వర్" లేక మహాస్వర్గం, అత్యున్నత దివ్యవెలుగు లోకం. సత్యమార్గం "ఋతుస్య పంథా" లేక దేవతల మార్గం అని కొన్ని సందర్భాల్లో పిలువబడే, ఈ మహాస్వర్గానికి తీసుకుపోయే మార్గాన్ని మనం కనుగొనాలి.

*

'ఏకమ్ సత్' — ఒక్క పరమ సత్యం

వేదాంత బోధనకు ఋగ్వేద సూత్రం యెలా బీజమైందో దాని ఆంతరిక సాధన శిక్షణ తరువాతి కాలంలో యోగసాధనకు, శిక్షణకు బీజమైంది. చివరకు వైదిక మార్మికుల బోధనకు శిఖరాయమానంగా "ఏకం సత్" లేక "తదేకమ్" ల రహస్యం నిలిచింది. అది ఉపనిషత్తుల సారభూత పదం. దేవుళ్ళు, దివ్యవెలుగు, పరమత్వం సత్యంయొక్క శక్తులు, ఆ ఏకైకకుడి శక్తులు, నామాలు. ప్రతి దేవుడు స్వయంగా సమస్త దేవుళ్ళు కూడా లేక వారి నందర్నీ తనలో భరిస్తుండే దేవుడు.

ఒకే పరమ సత్యం "తత్ సత్యమ్" వున్నది, ఒకే ఆనందం వున్నది, అందులోనికి మనం తప్పక యెదగాలి.

CWSA 16:19-21

ఒకే సత్ అనేక నామాలతో వున్నది

సమస్తం వెనుక, పైన ఒక అజ్ఞేయం, కాలాతీతమైనది, నామరహితమైనది వున్నదనీ, క్రమాయుతమైన అన్వేషణ చేత మనస్సు దానిని చిక్కించుకోలేదనీ మార్మికవాదుల సిద్ధాంతం గుర్తించింది. నిర్వ్యక్తికంగా అది "తత్", "ఏకం సత్". మన వ్యక్తిత్వరూప అన్వేషణకు భగవంతుడు లేక దేవునిగా, వస్తువుల రహస్యం నుండి వెలువడి తనను తాను తెలుపుకొంటుంది — అనేక నామాలున్నప్పటికీ అతడు నామరహితుడు తనలో నామానికి, జ్ఞానానికి సంబంధించి సమస్త వర్ణన, రూపానికి సంబంధించిన సమస్త కొలతలు, ద్రవ్యం, క్రియాశక్తి, కార్యశీలతలను పట్టి వుంచుకొన్నప్పటికీ భగవంతుడు అపరిమేయునిగా, అవర్ణనీయునిగా కన్పిస్తాడు.

దేవుడు లేక అధిదైవతం, ఆది కారణం, చరమ ఫలితం కూడా. దివ్య సత్తావంతుడు లోకనిర్మాత, సమస్తానికీ ప్రభువు, సమస్తాన్నీ పుట్టించువాడు, పురుషుడు, స్త్రీ, సత్త, చేతన, లోకాలన్నింటికీ, వాటి నివాసితులకు, మనకు, పిత, మాత, పుత్రుడు కూడా. ఎందుకనంటే ప్రపంచంలో జన్మించన జీవి యెదుగుదలలో తనను తాను అభివ్యక్తం చేసుకొనే దివ్యశిశువు ఆతడు. ఆతడు రుద్రుడు, విష్ణువు, ప్రజాపతి, హిరణ్యగర్భుడు; సూర్యుడు, అగ్ని, ఇంద్రుడు, వాయువు, సోముడు, బృహస్పతి, వరుణుడు, మిత్రుడు, భగ, ఆర్యమన్, సమస్త దేవతలు. మన కర్మలు, మన యజ్ఞం నుండి జన్మించిన ఆతడు ప్రజ్ఞావంతుడు, బలవంతుడు, విమోచన గావించు దివ్యపుత్రుడు, యుద్ధరంగంలో వీరయోధుడు, మన జ్ఞానద్రష్ట, ఊర్ధ్వ మహాసాగరం వైపు మన అహోరాత్రులకు ముందు దౌడు తీస్తుండే శ్వేతాశ్వ మతడు.

మానవాంతరాత్మ మహాయానం

భౌతిక, మానసిక, చేతనా ధగధగల అంతరిక్షాన్ని పక్షిలా, హంసలా యెగురుతూ మానవాంతరాత్మ దాటిపోతుంది. భూమియొక్క దేహానికి మనసుయొక్క అంతరిక్షానికి ఆవలకు పయనించే బాటసారిలా, పోరాడే యోధుడిగా, పరమ సత్యమార్గారోహణ

వల్ల మన కోసం నిరీక్షిస్తున్న అధిదైవతాన్ని కనుగొనడానికి యెగ్రబాకుతుంది. అత్యున్నత పరమోత్కృష్ట రహస్యం నుండి క్రిందికి మన వైపుకు వాలి వున్నదది. ఆ అత్యున్నత పరమోత్కృష్ట రహస్యంలో మహదానంద స్థితి మూలంలో త్రివిధ సూత్రంలో ఆసీనమై వుంది. దేవుడు నిజానికి అక్కడో, యిక్కడో వుండి మనల్ని ఉద్ధరించి, ఆకర్షిస్తూ మహనీయ దేవతల రూపంలో మనకు సహాయపడ్తూ, సదా మానవునికి మిత్రుడు, ప్రేమికుడై వుండి, అనంతత్వానికి సంబంధించిన, ప్రకాశించు గోవు పొదుగు నుండి కమ్మని పాలను, స్వచ్ఛమైన వెన్నను మనకు అందించే పల్లెపట్టు పశుకాపరిగా వున్నాడు. ఆ అమృతతుల్య ద్రాక్షసవాన్ని, సృష్టి సప్తవిధ జలాల నుండి తోడి, లేక అస్తిత్వపు కొండపై వుండే ప్రకాశమయ మొక్క నుండి సేకరించిన ఆసవాన్ని పానం చేయగా కలిగిన పారవశ్యంతో మనం అమరుల మౌతాం.

వేదద్రష్టల ప్రధాన లోకాలు

1. శుద్ధ సత్ : సత్యలోకం. అస్తిత్వపు అత్యున్నత సత్యలోకం.
2. శుద్ధ చిత్ : తపోలోకం, అనంత దివ్యేచ్ఛ, చిత్ లోకం లేక చిచ్ఛక్తి లోకం.
3. శుద్ధ ఆనందం: జనలోకం: సృష్టి సృజనానంద, ఆనందలోకం
4. దివ్యజ్ఞాన లేక పరమ సత్యం: మహర్లోకం: బృహత్తు విజ్ఞాన లోకం.
5. మనస్సు: స్వర్ : జ్యోతిర్మయ లోకం
6: భువర్ : నాడీమయ అస్తిత్వం: నానావిధ సంభూతి లోకం
7. పదార్థం: భూర్ : పదార్థ లోకం

CWSA 15:372

మన జీవనమొక సంగ్రామం

అమరులైన దేవతలకు, జ్యోతిర్మయ శక్తులకు మరియు పరమ సత్యానికి, అంధకార శక్తులకు మధ్య జరిగే ఒక సంగ్రామం మన జీవితం. ఈ శక్తులకు వృత్ర, వృత్రాలు, వాల, పనిస్, దస్యులు వాళ్ల రాజు అని వివిధ పేర్లున్నాయి. మన నుండి పరంజ్యోతిని దాచివేసే లేక దోచుకొనే యీ అంధకార శక్తుల వ్యతిరేకతను నాశనం చేయడానికి మనం దేవతల సహాయాన్నర్థించాలి. అంధకార శక్తులు పరమ సత్యధారలను "ఋతస్యధారా", స్వర్గధారలను ఆటంకపరచి అంతరాత్మ ఆరోహణను

అన్ని విధాలుగానూ అడ్డుకొంటాయి. అంతరిక యజ్ఞం ద్వారా, మంత్రం ద్వారా మన లోనికి దేవతలను ఆవాహన చేయాలి — అది మంత్రాని కుండే ఒక ప్రత్యేక విశిష్ట శక్తి — మనం యజ్ఞంలో వ్రేల్చేవాటిని వారికి సమర్పించి, బదులుగా వారిచ్చే కానుకలను మనం స్వీకరించాలి. ఈ ప్రక్రియ ద్వారా మనం మన గమ్యాన్ని చేరే ఆరోహణా మార్గాన్ని నిర్మించుకో గలుగుతాం. వేదంలో చెప్పిన బాహ్య యజ్ఞాంశాలు ఆంతర యజ్ఞానికి, ఆత్మ-నివేదనకు సంకేతాలుగా ఉపయోగించబడ్డాయి. దివ్యసత్యం, దివ్యవెలుగుల శోభలను మన జీవితం లోనికి దిగివచ్చి, పరమ సత్యం లోనికి మన ఆంతరిక జననానికి మూలకాలుగా అయ్యేందుకు వీలుగా మనమేమై వున్నామో, మన కేమి వున్నాయో వాటిని సమర్పిస్తాం. అంటే ఉన్నతతర పరమ సత్య ఆలోచన, ప్రేరేపణ, కర్మ, ఋతస్య ప్రేష, ఋతస్య ధీతి అయినటువంటి సరైన ఆలోచన, సరైన అవగాహన, సరైన కర్మ అభివృద్ధి చెందడం అన్న మాట. దీనివల్ల ఆ పరమ సత్యంలో మనల్ని మనం అభివృద్ధి చేసుకొంటాం. మన యజ్ఞం ఒక ప్రస్థానం, ఒక తీర్థయాత్ర, ఒక సంగ్రామం — దేవతల వైపు ఒక పయనం, అగ్నితో సాగే పయనాన్ని మనకు దారి చూపిస్తూ, మనల్ని నడిపించే అగ్నితో, ఆంతరిక అగ్నితో కలిసి కొన సాగిస్తాం. మన మానవీయ విషయాలు, ఆ మార్మికాగ్నితో అమృతత్వం లోనికి, మహాస్వర్గం లోనికి ఉద్ధరితమౌతాయి, దివ్యమైన విషయాలు మన లోనికి దిగివస్తాయి.
CWSA 15:72

మనిషి — ఒక చిన్న సైజు జగత్తు

మనిషి భూమాతవడిలో నివసిస్తున్నాడు. అతనికి యీ ప్రపంచ అశాశ్వతత్వాన్ని గురించి మాత్రమే తెలుసు. కాని ఒక ప్రకాశమయ రహస్యంలో అధివసించి వున్న దివ్యమైన లోకాలు గల అత్యుత్కృష్టమైన చేతనత్వం గలది ఊర్ధ్వంలో ఆవలగా వున్నది. అతని జాగరిత మానసిక ఉపరితల భావాలకు క్రిందుగా ఒక ఉపచేతన లేగా నిశ్చేతన వుంది. అవన్నీ నిండి వున్న మహా నిశి నుండి ఆతడు చూస్తున్న విధంగా ప్రపంచాలు జన్మించాయి. ప్రకాశమయ ఊర్ధ్వ నిమ్న గాఢాంధకార సాగరం మధ్య ఈ అన్యలోకాలు ఎక్కడున్నాయి? అవి యిక్కడా వున్నాయి. మనిషి ప్రాణిక లోకం నుండి, తన ప్రాణిక అస్తిత్వాన్ని, మనోలోకం నుండి తన మనస్తత్వాన్నీ తెచ్చుకొంటాడు. అతడెల్లపుడూ వాటితో రహస్యంగా ఆదానప్రదానాలు

నెరపుతూనే వుంటాడు. అతడు సంకల్పిస్తే సచేతనంగా వాటిలో ప్రవేశించగలడు, జన్మించగలడు. పరమసత్య సూర్యలోకాల లోనికి సైతం అతడు యెగయగలడు, మహోన్నత చేతన నడవ లోనికి ప్రవేశించగలడు, పరాత్పరుని ప్రాంగణం లోనికి సాగిపోగలడు. వృద్ధి చెందుతూండే ఆతని అంతరాత్మకు దివ్యద్వారాలు భళ్ళున తెరచుకొంటాయి.

అతని బాహ్యదృష్టి తనకు బాహ్యమైనదిగా చూచే సమస్తాన్నీ నిజంగా ప్రతి జీవి తనలోనే కలిగి వున్నందున మానవ ఆరోహణ సంభవమౌతుంది. మనలో దాగి విషయగతమైన శక్తులున్నాయి, విషయంగా కన్పించే జగద్వ్యవస్థకు సంబంధించిన సమస్త శ్రేణులు, పొరలను పోలి వుండే విషయగత శక్తులు దాగి వున్నాయి. మనం నివసించడానికి సాధ్యమైన అనేక భూమికలుగా అవి రూపొందుతాయి. పదార్థ సంబంధం కల యీ జీవితం, భౌతిక ప్రపంచపు సంకుచితమైన, పరిమిత చేతన — అతడు వేయిసార్లు భూపుత్రుడైనప్పటికీ, మనిషికి అనుమతించబడిన యేకైక అనుభవం యెంత మాత్రంగాదు. మాతృరూప భూమి అతనిని భరించి, తన హస్తాల్లో పొదవి వుంచుకొన్నప్పటికీ, స్వర్గం కూడా అతని ఆది కారణాల్లో ఒకటి గనుక అది కూడా అతని మీద తన హక్కును ప్రకటిస్తుంది. అతడు తనలోని లోతైన లోతులకు, ఉన్నతతరమైన ఔన్నత్యాలకు జాగృతం కావడమనేది అతనికి అందుబాటులో వుంది. అతనుద్దేశించిన పురోగతి అలా జాగృతం కావడమే. అతడా విధంగా తన ఉన్నతోన్నత భూమికల లోనికి ఆరోహించినకొద్దీ, అతని జీవితానికి నూతన లోకాలు తెరచుకొని, అతని జీవి అనుభవ క్షేత్రంగా, ఆత్మ నివాసస్థానంగా తయారవుతాయి. వాటి శక్తులు, అధిదేవతలతో సంబంధం కలిగి వుంటూ యేకమై నివసిస్తూ, తనను తాను వాటికి ప్రతిరూపంగా తిరిగి రూపొందించుకొంటాడు. ఆ విధంగా ప్రతి ఆరోహణ అంతరాత్మకొక నూతన జన్మ అవుతుంది.

CWSA 15: 373-374

ఒక పురోగమనం, ఒక సంగ్రామం, ఒక తీర్థయాత్ర

ఈ యజ్ఞ ప్రతిరూపం కొన్ని సందర్భాలలో ఒక పయనం, లేక మహాయానం. ఎందుచేతనంటే యజ్ఞం ముందుకు పోతుంది, ఆరోహిస్తుంది, దానికో గమ్యం వుంది. ఆ గమ్యం వైశాల్యత, యథార్థ అస్తిత్వం, వెలుగు, సుఖస్థితి. శుభప్రదమైన

గమ్యానికి చేర్చే తిన్నని సుఖప్రదమైన దారి, శ్రమ కలిగించేదైనప్పటికీ పరమ సత్యపు సంతోషకర దారిని ఆవిష్కరించుకొనమనే ఆవేశం దాని కుంది. దివ్యేచ్ఛ కుండే జ్వలించే బలంతో పర్వత సదృశ, ఒక పీఠభూమి నుండి మరో పీఠభూమికి నడుపబడుతుంది. ఒక ఓడలో జలధిని దాటుతున్నట్లు, సృష్టి జలాలను దాటాలి. దాని నదులలో తిరుగాడాలి, వాటి లోతైన గోతులను, ఉరవడులను అధిగమించాలి. దాని లక్ష్యం సుదూరాన వున్న వెలుగు, అనంతాల సాగరానికి చేరడం.

ఇదేమంత తేలికైన, శాంతియుతమైన పురోగమనం కాదు. చాలాసార్లు చాలా కాలం పాటు, జరిగే ఒక భయంకర అవిరామ సంగ్రామం. ఆర్యజాతి మానవుడు సదా శ్రమించాలి, పోరాడాలి, జయించాలి. అతడొక అలుపెరుగని శ్రామికుడు, ప్రయాణీకుడు, ఒక పట్టువీడని యోధుడవ్వాలి. అతడు నగరం తర్వాత నగరంలోనికి, బలవంతాన ప్రవేశించి, తుఫానులా పైకొని, వశం చేసుకోవాలి, రాజ్యం తర్వాత రాజ్యాన్ని జయించాలి, శత్రువు తర్వాత శత్రువును నిర్దాక్షిణ్యంగా పడగొట్టి, అతనిపైగా నడచుకొంటూ పోవాలి. అతని పురోగతి మొత్తం దేవదానవుల; దేవరాక్షసుల, ఇంద్రుడు భూతాలు, ఆర్య దస్యుని మధ్య సాగే యుద్ధం లాంటిది. బహిరంగ క్షేత్రంలో అతడు పగవారైన ఆర్యులను సైతం ఎదుర్కొనవలసి వుంటుంది. ఎందుకనంటే, పాతస్నేహితులు, గతంలో సాయం చేసినవాళ్ళు అతడు ముందుకు పోతుంటే శత్రువులుగా మారతారు. అతడు జయించి, దాటి వచ్చిన ఆర్య సంస్థానాధీశులు దస్యులతో కలిసి జరుగబోయే సంగ్రామంలో అతని స్వేచ్ఛాయుతమైన కేవల గమనాన్ని అడ్డుకొనేందుకు అతనికి వ్యతిరేకంగా సంఘటిత మౌతారు.

CWSA 15:376-78

ఆర్య మనస్సు గలదానికి స్వయం ప్రకాశమగు 'ఏకం' గమ్యం. కాబట్టి ద్రష్టలు ఆతనిని సూర్యుని రూపంలో ఆరాధించారు. "ఏకం సత్ ". అతనిని ద్రష్టలు ఇంద్ర, అగ్ని, యమ, మాతరిశ్వన్ అని వివిధ నామాలతో సంబోధించారు. "తదేకమ్", "తత్సత్యమ్" అనే పదాలు అత్యుత్కృష్టమైనదానికి, ఇచట ఆయన పనిచేసేదానికి ప్రతీకయైన సూర్యునికి సంబంధించి వేదంలో సదా ప్రస్తావించబడ్డాయి. ఒక మహనీయ ఉదాత్తానుదాత్తాలు గల మార్మిక మంత్రోచ్చారణ అంతకు ముందు యెల్లప్పుడూ "దేవతల బృహత్ బలం — తదేకం" దగ్గరకు వస్తుంది. సత్యపథం వెంట సాగే సూర్యుని ఆ పయనం గమ్యం అక్కడున్నది. దానినే మనం జాగృతమైన, ప్రకాశితమైన

అంతరాత్మ పయనాన్ని కూడ చూచాం. మిత్ర, వరుణులు, "యెచట సూర్యుని అశ్వాలను కళ్ళేల నుండి విడిపిస్తారో అచట ఈ సత్యం చేత ఆ నీ పరమ సత్యం మరుగుపరచబడింది. దశ శతాలు అక్కడ ఒకటవుతాయి — తదేకం, దేహదారులైన దేవతలకు పరాత్పర భగవంతుడైనవానిని నేను దర్శించాను" స్వతహాగా "ఏకం' కాలాతీతం కూడా, మన మనస్సు, అస్తితత్వం కాలబద్ధమై కాలంలో వున్నాయి. "ఈ వేళ గాదు, రేపూ గాదు, ఆ అతీతమైన 'తత్' 'నెవ రెరుంగుదురు? మనం దాని దగ్గరకు పోయినకొద్దీ అది మన నుండి అంతర్ధాన మౌతుంటుంది." కనుక మనలోనే దేవతలను జన్మించేటట్లు చేస్తూ దాని వైపు మనం యెదగాలి. వారి ప్రబలమైన తేజరిల్లే రూపాలను మనలో పెంపొందించుకొంటూ, వారి దివ్యదేహాలను నిర్మిస్తూ, దాని వైపు మనం యెదగాలి. ఈ నూతన జన్మ, ఆత్మ-నిర్మాణం అనేవి అమృతత్వానికై మన చేతనను మేలుకొలిపే యజ్ఞం యధార్థ స్వభావం యిది.

CWSA 15:492-493

అనృతం స్థానంలో పరమ సత్యాన్ని ప్రతిష్టించడం ద్వారా మానవాంతరాత్మను మర్త్య స్థితి నుండి అమృతస్థితికి మార్పుచెందించడం, విభాగిత అస్తిత్వాన్ని సమగ్రత్వం, అనంతత్వంగా మార్పు చెందించడం వేదఋషుల ప్రాథమిక పథకం. మనస్సు, ప్రాణంతో పాటు చేసి వున్న పదార్థపు మర్త్యస్థితి మృత్యువు. అనంత అస్తిత్వపు సత్ చిత్ ఆనంద స్థితి అమృతత్వం. మనిషి రోదసి, స్వర్గం మరియు పృథ్వి, మనస్సు, దేహం అను రెండు అంతర్భాగాల ఆవలకు పరమ సత్యం, మహస్, అనంతత్వం లోనికి యెదుగుతాడు. అలాగే బ్రహ్మానందంలోని కెదుగుతాడు. పూర్వీకులు, పురాతన ఋషులచే ఆవిష్కృతమైన "మహాప్రస్థానం" యిదే.

CWSA 15:45-46

అవిద్య, అంధకారం నుండి పరమ సత్యాన్ని జయించడం, పరమ సత్య జయంతో అమృతత్వాన్ని కూడా జయించడం అనేది వేదంయొక్క కేంద్రీయ భావన. ఎందుకనంటే వేదం తెలిపిన 'ఋతమ్', ఒక ఆధ్యాత్మికమే గాక, ఒక మనోవైజ్ఞానిక భావన కూడా. దేహం అనబడే యీ భూమి, ప్రాణిక-క్రియాశక్తియైన యీ మధ్యంతర సీమ, మనస్సు అనబడే యీ సాధారణ ఆకాశం లేక స్వర్గం ఆవలగా వున్న యథార్థ సత్, యథార్థ చిత్, యథార్థ సృష్ట్యానందం. మనం దేవతల స్వగృహం, అమృతత్వ పునాది అయిన పరమోత్కృష్ట చేతనావంతమైన పరమ సత్యం

ఉన్నత భూమికకు చేరాలంటే, ఈ భూమిక లన్నింటినీ మనం దాటి పోవాలి.

CWSA 15: 241-42

ఈ అతిమానస వైశాల్యత అస్తిత్వపు ప్రాధమిక సత్యం కూడా. దీని నుండే సహజంగా కృషికి సంబంధించిన ఘర్షణ లేకుండా ఒక పరిపూర్ణ, దోషరహిత చలనం లోనికి దాని క్రియాశక్తి పెల్లుబుకుతూ వెలువడుతుంది. ఎందుచేతనంటే ఆ శిఖరాలపై విభజన వుండదు, చిత్ కు, శక్తికి మధ్య అగాధం వుండదు, జ్ఞానం, సంకల్పాల మధ్య యెడబాటు వుండదు, మన అస్తిత్వం దాని కర్మల మధ్య అసామరస్యత నెల కొనదు. అచట ప్రతిదీ "తిన్నగా" వుంటుంది, కాపట్యానికి అవకాశమే వుండదు. అందుచేత యీ అతిమానస బృహత్తు యథార్థ అస్తిత్వం "ఋతమ్", విషయాల యథార్థ వ్యాపారం కూడా. అది చలనం, కర్మ, అభివ్యక్తి, సంకల్పం, హృదయం, జ్ఞానాల దోషరహిత సత్యం, భావం, పలుకు, భావోద్వేగాల ఒక పరిపూర్ణ సత్యం. అది అన్యప్రమేయం అవసరం లేని యదార్థత, స్వేచ్ఛాధర్మం, విభజనకు లోనై, ప్రత్యేకత కలిగించే చేతన, అసత్యాల వల్ల స్పర్శించబడని ఆది దివ్య విధివిధానం. ఒక ప్రాధమిక యైకమత్యత నుండి పుట్టుకొచ్చిన స్వయం ప్రకాశమానమైన విశాల దివ్యసమన్వయం. దీని నుండి వెలువడిన మన అల్పసృష్టి, అభాగ్య, పాక్షిక, శకల సదృశ, వికృతంగా రూపొందించబడిన, విభజన మాత్రమే. వేదంలో ఆరాధించబడిన సూర్యుడు, పితరులు ఆకాంక్షించిన జ్యోతిర్మయ స్వర్గం, లోకం, అదితి పుత్రుడైన సూర్యదేహం అటువంటిది.

CWSA 15:475

విప్రుడు: జ్ఞాని, ప్రశాంతచిత్తుడు

విప్రుడు అంటే బ్రాహ్మణుడు అని అర్థం కాదు. 'వి' అనే ధాతువు అభివ్యక్తిని, ప్రకాశాన్ని తెలియజేస్తుంది. 'విప్' అనే ధాతువు క్రీడ లేక కంపనం లేక వరదలా వచ్చే పూర్ణ అభివ్యక్తిని, ప్రకాశాన్ని తెలియజేస్తుంది. ఎవరి మనస్సులో జ్ఞానం ఉదయిస్తుందో, జ్ఞాన సంబంధ బలీయ క్రీడకు యెవని మనసు తెరచుకొని వుంటుందో అతను నిజంగా 'విప్రుడు'. ధాతువు 'మా' పట్టుకొని వుండడాన్ని తెలియజేస్తుంది. తల్లి తన గర్భంలో బిడ్డను పట్టి వుంచుకొంటుంది, అందుచేత ఆమె "మాత" అయ్యింది. సర్వకర్మ, ప్రాణ వ్యవస్థాపకుడు, వాయుదేవుడు మాతరిశ్వన్ అని అన

బడతాడు. అంటే "యెవరు మాతలో తనను తాను విస్తరింప జేసుకొని, లేక యిముడ్చుకొని వుంటాడో ఆ ఆకాశం అతడు. అతడు సమస్త జీవజాలం యొక్క పుట్టుక క్రీడ, మృత్యువులను తన గర్భంలో నిలిపి వుంచుకొని కూడా శాశ్వతంగా ప్రశాంతచిత్తుడై, ఆందోళన రహితుడై వుంటాడు. పెనుతుఫాను క్షితిజాన్ని మెరుపులతో చీల్చివేస్తున్నా, భయంకరంగా ఉరుముతూ, వృక్షాలను, జంతువులను, గృహాలను, రౌద్రం నిండిన దివ్యపారవశ్య విలయతాండవం చేస్తూ పడగొడ్తున్నా, విశృంఖల క్రీడను భరిస్తూ, సహిస్తూ తన ఆనందంలో తాను మునిగిపోయి మౌనంగా వుండే ఆకాశంలా సహనంతో వుండగల, భరించలేని భౌతిక, ప్రాణిక బాధ కలిగించే క్రీడకు తన దేహాన్ని పూర్తిగా ఆత్మానందంతో నింపి, దానిని సాక్షిలాగా చూస్తు వుంచగలిగే శక్తిగలదానిగా మార్చగలవాడే, నిజంగా 'మా వాన్'. అటువంటి 'మా వానే' 'విప్రుడు' ప్రకాశం కలిగినవాడు. అటువంటి ప్రశాంతచిత్తుడైన జ్ఞాని తన దేహాన్ని యజ్ఞపీఠంగా చేసి, దేవతలను ఆవాహన చేసినపుడు, ఇంద్ర, వరుణులు అందులో స్వేచ్ఛగా సంచరిస్తారు. కొన్ని సమయాల్లో వాళ్ళంతట వాళ్ళే అందులోనికి దిగివచ్చి, నివేదించబడినదాన్ని రక్షించి, అతడు కోరిన కర్మ లన్నింటికీ ఆధారం, పునాది, "ధార్తారాకర్ష గీనామ్" గా తయారవుతారు, (వీరు నిజంగా సర్వ కార్యాచరణకు ఆధారభూతులు) అతనికి గొప్ప సుఖాన్ని, జ్ఞానశక్తిని, ప్రకాశాన్ని అనుగ్రహిస్తారు.

శ్రీఅరవిందుల బెంగాలీ రచనలు (52-53)

వేదఋషులు యెవరైనా అతిమానస భూమికకు చేరారా అనేది నేను చెప్పలేనుగాని, దాని కారోహించడం వారి లక్ష్యం. అతిమనస్సుకు, మానవబుద్ధికి మధ్య సూర్యుని కిరణాలచే రూపొందించబడిన మధ్యంతర ప్రకాశమానమైన మనః సీమలు 'స్వర్' అనే విషయం స్పష్టం. ఉపనిషత్తుల ననుసరించి సూర్యుని కిరణాల లోనికి ఆరోహించిన వాళ్ళు తిరిగి రాగలరు గాని, స్వయంగా సూర్యుని లోనికే ప్రవేశించినవాళ్ళు తిరిగి రాలేరు. అలా యెందుకన్నారంటే, అతిమనస్సు లోనికి ఆరోహణను ఊహించారు, కానీ అతిమనస్సును అవతరింపజేసి వ్యవస్థీకరించడం అనేది వాళ్ళూహించలేదు.(సూర్యకిరణాలను అవరోహింప జేయడం విస్మరించారు)

CWSA 29:417

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

ప్రస్తుత సామాజిక పరిస్థితులలో జీవిస్తూ, తన దైనందిన విధులు నిర్వర్తించుకుంటూ, లోలోన పరిణతి చెంది, ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపే వ్యక్తికి తన జీవితాన్ని గురించి మనసులో కలిగే ఆలోచనకు, ప్రశ్నలకు సమాధానంగా భగవద్గీత మొదటి అధ్యాయం పేరు "అర్జున విషాదయోగం" ఖచ్చితంగా సరిపోతుంది. మనిషి ధర్మబద్ధత అనే ముసుగు కప్పుకున్న ప్రాపంచిక దృశ్యాలను వీక్షిస్తూ, తన విజయాలకు సంతృప్తిపొందే లోపే, ధర్మబద్ధత అనే మాయ పొరలు కళ్ళ ముందు నుంచి తొలగిపోవడమే కురుక్షేత్ర యుద్ధం ద్వారా బయటపడిన విషయం. ఇదే విషయాన్ని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే, సృష్టికర్త సమయం వచ్చినపుడు తను సృష్టించినది తనే కబళించి అంతం చేస్తాడు అనే విషయం స్పష్టమవుతుంది. ఈశ్వరుడే సృష్టి, స్థితి, లయ కారకుడు. పురాణ గ్రంథాలలో సృష్టి కారకుణ్ణి, ఘాటైన పదజాలంతో వర్ణిస్తూ "భగవంతుని విందుభోజనానికి ఋషులు, నాయకులు ఆహార పదార్థాలుగా, మరణం ఒక సంబారంగా" చెప్పారు. ఇది అస్పష్టంగా, పరోక్షంగా కనపడే జీవిత సత్యం, మనిషి ఆత్మావలోకన చేసుకుంటే ఇది స్పష్టంగా, సూటిగా వ్యక్తమవుతుంది. బాహ్యప్రపంచానికి మనిషి ఉనికికి, ప్రాపంచిక ఉనికికి నిరంతర పోరాటం జరుగుతున్నట్టు అనిపించినా, యదార్థంగా దాని అంతర్గత భావం, జీవి ఈశ్వరుని సృష్టి, లయాలలో తన వంతు పాత్రను తాను నిర్వర్తించడమే.

CWSA 19:39-40

యుద్ధం — విధ్వంసం

పోరాటం, విధ్వంసం అనేవి మనిషి ఐహిక జీవనంలోనే కాకుండా, మానసిక, నైతిక వ్యవస్థలలోను భాగాలే. ఈ విషయం మనిషి నిజజీవితం ద్వారా వ్యక్తమవుతుంది, ఎందుకంటే మనిషి ఏ విధమైన నిర్ణయం తీసుకోవాలన్నా అంటే ఆధ్యాత్మిక, రాజకీయ, నైతికపరమైనవి, ముందడుగు వేయాలన్నా, ఎటువంటి వాస్తవిక పరిస్థితులలో ఉన్నాడో లేదా ఎటువంటి పరిస్థితులను ఆశిస్తున్నాడో దానికి ఘర్షణ, వివాదం తప్పదు. జీవితంలో మార్పు సర్వసహజం. ఎదుగుదల సాధించాలన్నా, ముందుకు వెళ్ళాలన్నా నిరపాయమైన, న్యాయపరమైన ఉన్నత మార్గం మన ముందు ఉంటుంది. అప్పుడు

మనిషి ఆత్మశక్తిని ఉపయోగిస్తాడే కాని యుద్ధ విధానంలో నిర్మూలన చేయడం లేదా భౌతిక బలలాని ఉపయోగించడం లేదా తనని తాను రక్షించుకోవడానికి ఆత్మ సంరక్షణ విధానాన్ని కూడా వాడుకోడు. మనిషిలో ఆత్మబలం దృఢంగా చెక్కుచెదర కుండా ఉంటే, చుట్టూ ఎంతటి అసురశక్తులు ఉన్నా అణచివేయబడతాయి. ఆత్మబలం దృఢంగా లేని పక్షంలో ఇవే అసురశక్తులు మానవజాతి మీద, ప్రపంచం మీద విరు చుకుపడి, ఛిన్నాభిన్నం చేసి విధ్వంసం సృష్టించగలవు. మనం ప్రస్తుతం చూస్తున్న మారణహోమం అంతా ఆ అసుర శక్తులదే. అసుర శక్తులను అడ్డుకోకుండా, ప్రక్కదారిలో వెళ్ళి నువ్వు కోల్పోయేదానికి, విధ్వంసం ద్వారా ఇతరులు సాధించినదాని మధ్య వ్యత్యాసం పెద్దగా లేదు ఎందువల్లనంటే ఆత్మబలం సమర్ధవంతంగా పనిచేయాలన్నా, అసురశక్తులను నిర్మూలించాలన్నా మనిషి సంపూర్ణ ఆంతరిక దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడు మారణాయుధాలైన ఫిరంగులు, కత్తుల కన్నా ఆంతరికశక్తి ఎంత శక్తివంతమో, చెడును ఎంత సమర్ధవంతంగా నిర్మూలించగలదో తెలుసుకోవాలంటే, వ్యక్తి తన పరిధిని విస్తృతం చేసి ఆంతరిక దృష్టిని కేంద్రీకరించి, తక్షణ ఫలితాలను ఆశించకుండా ముందుకు వెళ్లగలిగితే, దృఢమైన మానసిక, ఆంతరంగిక శక్తి ఎంతటి సత్ఫలితాలను ఇస్తుందో, చెడును ఎంతగా నిర్మూలించగలదో అవగాహన కలిగి అనంతమయిన ఆనందం కలుగుతుంది. దుష్టశక్తులను మాత్రమే అంతం చెయ్యడం వలన ప్రయోజనం అంతగా ఉండదు. వాటి చుట్టూ అల్లుకొని ఉన్న ఇతర శక్తులను కూడా నిర్మూలించాలి, అప్పుడే దుష్టశక్తులు పూర్తిగా నిర్మూలించబడతాయి. ఉద్వేగభరిత వినాశనం నుంచి తప్పించుకో గలిగినా అది మాత్రం సామాన్య విధ్వంసం కాదు.

CWSA 19:42

కాళీమాతలో ఉన్న రెండు లక్షణాలు

ఇక్కడ విషయం ఏమిటి అంటే మనిషి ఉనికిలో ఘర్షణ, విధ్వంసం మొదలు, తుది కాదు, సమైక్యత యుద్ధం కన్నా గొప్పది కాదు, మరణంతో పోల్చితే ప్రేమ ప్రత్యక్షంగా కనిపించే దైవిక శక్తి. వీటన్నిటి భౌతిక శక్తిని మానసిక శక్తితోనో, ఘర్షణలను శాంతితోనో, మరణాన్ని అమరత్వంతోనో మార్చివేయమని కాదు. భగవంతుడు అవసరమైనపుడు ప్రాణికోటిని అంతం చెయ్యగల లయకారకుడు మాత్రమే కాదు,

విశ్వంలోని అన్ని ప్రాణులతోనూ స్నేహం చెయ్యగల ప్రేమైకమూర్తి, సర్వోత్కృష్టమైన అతీత త్రిమూర్త్యాత్మక శక్తి. భీతిగొలిపే రూపంతో ఉండే కాళీమాత మానవాళిని చల్లగా చూసే దయగల తల్లి. శ్రీకృష్ణ భగవానుడు కురుక్షేత్రకర్త, ఆకర్షణశక్తి ఉన్న దైవిక సహచరుడు, రథసారధి, ప్రాణికోటికి ప్రభువు. ఏది ఏమయినా శ్రీకృష్ణ పరమాత్మ మన జీవనరథాన్ని నడుపుతూ కలహం, విరోధం, అవ్యవస్థల మధ్య నుంచి ఆకర్షణ శక్తితో మనల్ని ఆకట్టుకొంటూ మన లక్ష్యాలను, మనం చేరుకోవలసిన దైవిక శక్తిని చేరుకోవడానికి తోడ్పడడం ఆయన లీల. నిర్ద్వంద్వంగా ఈ అతీతమైన, సర్వోత్కృష్టమైన దయను పొందటం కోసమే మన ప్రయత్నం, ఆకాంక్ష. కానీ ఈ ప్రయత్నం ఎక్కడ, ఎలాగ, ఏ పరిస్థితులలో మనం మొదలుపెట్టామో వాటిని పరిశోధించి తెలుసుకోవాలి. దానికి మొదటి అడుగు ప్రపంచాన్ని యథాతథంగా చూడటం. అప్పుడు వ్యక్తులకు ప్రయత్న ప్రారంభ దశలో వారున్న పరిస్థితులకు ప్రస్తుత పరిస్థితులకు మధ్య గల వ్యత్యాసం, పరమాత్ముని కృప వలన కలిగిన అతీంద్రియ స్థితికి, అంతిమ లక్ష్యానికి చేరుకునే మన మార్గం దానంతట అదే మనకు స్పష్టమవుతుంది. ఇక్కడ మనం కురుక్షేత్ర యుద్ధనీతిని స్వీకరిస్తూ, అమరత్వానికి దారిని వెతుక్కునే ముందు మరణం జీవితసత్యమనే విషయాన్ని స్వీకరించాలి. మన దృష్టి అర్జునుడి చూపు లాంటి తీక్షణతతో వీక్షిస్తూ, పరమేశ్వుడి లీలలైన కాలాన్ని, మరణాన్ని ఖండించటం మాని, నిర్ద్వంద్వంగా లయకారకుడి న్యాయాన్ని గుర్తించగలగాలి.

CWSA 19:45-46

యోగులు అన్నిటా భగవత్స్వరూపాన్ని చూడగలరు

ధీరుడైనవాడు ప్రతి విషయాన్ని నిశిత దృష్టితో పరీక్షిస్తాడు. ఒక వేళ అది కుదరకపోతే అంతిమ లక్ష్యం, జ్ఞానోదయం కోసం నిరీక్షిస్తాడు; ప్రశాంతమైన మనసుతో ఎదురుచూచిన నాడు, జీవికి చిన్న, పెద్ద, మంచి, చెడు అన్నిటా గల అసంఖ్యాకమైన అర్థాలతో లక్ష్యంగా గోచరమవుతుంది. దీని వలననే ఈశ్వరుడే రుద్రుడనే విషయం స్పష్టమవుతుంది. సృష్టిలో సూక్ష్మ ప్రాణి అయిన ఒక పిచ్చుక నేల రాలినా, చీమ మరణించినా, భూకంపాలు భూమిని కుదిపినా, వరదలు వేలమందిని నిరాశ్రయులను చేసినా, దాని వెనుక గూడార్థం, పరమేశ్వరుని ముందు చూపు స్పష్టమవుతుంది.

యోగి ప్రతి ప్రాణిలోను, ఘటనలోను అన్నిటా భగవత్స్వరూపాన్ని చూస్తాడు. ఈశ్వరుడే వరదల రూపంలో, భూకంపాల రూపంలో, మరణం రూపంలో వచ్చి ప్రక్షాళన చేసి జీవి ఉన్నత స్థితికి మార్గం సుగమం చేస్తాడు. ఆయనే బాధ ద్వారా అనంతమైన బ్రహ్మానందాన్ని రుచి చూడడానికి మనిషిని సిద్ధం చేస్తాడు. ఈ విషయం తర్కానికి అతీతం, దాన్ని వీక్షించాలి, అనుభవించాలి. ఇది ప్రశాంత మానసిక స్థితిలో, ఈశ్వరునిపై చెక్కుచెదరని నమ్మకం అవగాహన ఉన్నవారికే సాధ్యపడుతుంది.

నిర్ణయాత్మక యుద్ధం

ఒక విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది, మానవజాతి అసాధారణ ఉద్రిక్త స్థితికి చేరుకుంది. చేసే ప్రతి ప్రయత్నంలో, పనిలో ఆందోళన, నిత్యజీవితంలో ఆందోళన, ఇంక మితిమీరిన చురుకుదనంతో, సంపూర్ణ వ్యాకులతతో ప్రాణికోటి అంతా ఒక బిందువు దరికి చేరుకున్నారు. అక్కడ నుంచి రెండే మార్గాలు గలవు. ఒకటి వ్యాకులతను నిరోధించి, బద్ధలైన నూతన చైతన్యం వైపుకి కొట్టుకువెళ్ళడం, రెండవ మార్గం దిగజారి అంధకారంలోకి, అగాధంలోకి, జడత్వంలోకి జారిపోవడం. ఈ వ్యాకులత సంపూర్ణమైనది, సర్వసాధారణమైనది ఖచ్చితంగా దాన్ని ఆపవలసిన అవసరం ఉంది, ఈ పరిస్థితి ఇలా కొనసాగడానికి వీలు లేదు. కాని ఈ ప్రక్రియలు ఇచ్చే ఖచ్చితమైన సూచన ఏమిటంటే సరికొత్త చైతన్యంతో, మూలశక్తి విషయ పదార్థంలోకి ఎక్కించడం వలన ఏర్పడిన వత్తిడి మూలంగా ఇంతటి క్లిష్ట పరిస్థితులు సంభవించాయి. అలవాటుపడిన పాతపద్ధతుల ద్వారా ప్రకృతిలో తిరుగుబాటు తీసుకురావచ్చునని మనం ఆశిస్తాం. కాని అంతా వ్యాపించి ఉన్నా కొన్నిటిలో మాత్రమే చూడగలిగే ఒక క్రొత్త దృగ్విషయం గోచరిస్తుంది. ఇది ప్రపంచంలోని అన్ని దేశాలలోను చూడగలం: క్రొత్త విషయాలను గ్రహించాలనే ఆకాంక్ష, ఉన్నతమైన ఆరోహణక్రమ పరిష్కారాన్ని ఆశించడం అనేది ఒక విస్తారమైన అలలాంటి ప్రయత్నం. ప్రపంచంలోని కొన్ని సర్వసాధారణ విస్తారమైన, సాముదాయక ఆలోచనలు పని చెయ్యడం జరిగింది, జరుగుతోంది. ఈ భావాలు కలిసి పనిచెయ్యడం వలన నూతన ఆవిష్కారాలు ఏర్పడి అవి ముందెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున విపత్తులను కలిగిస్తాయి. అదే సమయంలో ఉన్నతమైన, విస్తారమైన ఆలోచనలు, ఆవిష్కారాలు ప్రస్తుత సమస్యలకు, సంపూర్ణమైన, ఖచ్చితమైన విస్తృత పరిష్కా రాన్ని ఇవ్వగలవు.

నిర్మాణాత్మకంగా పనిచేసే పరిణామం, పరిపక్వత కలిగిన శక్తులు దైవికసిద్ధిని కలిగిస్తాయి. వాటికి ధృడమైన, ఆగని ఉన్మత్త వినాశకర శక్తులకు మధ్య ప్రయాస, ఘర్షణ ప్రత్యక్షంగా విశదమవుతోంది. ఎవరు ముందు లక్ష్యాన్ని చేరుకోగలరు అనే ఘర్షణ ఈ రెండు శక్తుల మధ్య పందెం లాంటిది. అన్ని దైవ, వ్యతిరేక శక్తులు భూమి మీదకు చేరుకుని పనిచెయ్యడం ప్రారంభించాయి. అదే విధంగా సరిక్రొత్త, ఉన్నత, ధృడమైన దైవికశక్తి కూడా క్రొత్త జీవనాన్ని ఇవ్వడానికి భూమికి చేరుకొంది, అందువలన ఈ యుద్ధం ఎక్కువ చేదుగాను, హింసాత్మకంగాను, ప్రత్యక్షంగాను చేస్తుంది. కాని ఈ ఘర్షణ నిర్ణయాత్మకం కూడా. అందుకే మానవాళి తొందరగా ఆశించవచ్చు.

భగవంతుని ఆట

ఈ విశ్వంలో అంతా ఈశ్వరుని కేళి

ఎందుకు?

ఎందుకు? అది ఒక రకంగా సంభాషించే విధం! అది అంత వినోదాత్మకంగా అనిపించ లేదా? అలాంటివాళ్ళు చాలామంది (నవ్వు) ఈ ఆట వినోదాత్మకం కాదు అని భావిస్తారు. అయినా ఇది ఒక సంభాషణ విధానం — కొంతమంది చెప్తారు — ఆలోచించకుండానే ఆనందదాయకమని — ఇంకొందరు — "శక్తుల ఆట అని"; అది కదలిక అని అనుకోగలిగితే. అంటే దైవికశక్తులు, దైవిక చైతన్యం, ఈ ప్రపంచాన్ని, ఇందులోని శక్తులను సృష్టించడానికి అవతరించింది. దీని అర్థం అదే, ఇంకేమీ కాదు. నేను మైదానంలోని ఆట గురించి మాట్లాడటం లేదు, దీనిలో ఎంతో గూడార్థం ఉంది

CWM 6:267 శ్రీమాత

దైవశక్తి అందరిలోను పనిచేస్తుంది

దైవశక్తి అన్నిటా పనిచేస్తుంది, మనిషి మంచిని ఆశించి చేసే తప్పులలోను, చెడు ఆలోచనలు అనువైన విషయాలలో అన్నిటా. మిశ్రమం కానిది ఏదీ లేదు, ఎక్కడా స్వచ్ఛమైన, వాస్తవమైన దైవిక సాధనం ఉండదు; ఎక్కడా దైవికశక్తి మనిషిని ముందుకు తీసుకువెళ్ళడానికి వాడుకోవడం అసంభవం కూడా కాదు. అంటే ఎంతవరకు

అనిశ్చితస్థితి ఉంటుందో అంతవరకు దైవశక్తి విశ్వమంతా పనిచేస్తుంది. మనిషి "పూర్తి ఉన్మాదం" లోకి వెళితే అది వేరు. అది ఖచ్చితంగా "పూర్తి ఉన్మాదమే" ఎందుకంటే దాని మూలంగా వ్యక్తులు, వాళ్ళ ఆలోచనలు కలిసి ఒక ముద్దలా పేరుకుని తిన్నగా వినాశనానికి — అంటే వాళ్ల యొక్క వినాశనానికి దారితీస్తుంది. నేను బాంబులు, పట్టణాలు లేదా మనుష్యుల వినాశనం గురించి చెప్పడం లేదు, భగవద్గీతలో చెప్పినట్టుగా అసురుడు తన వినాశనాన్ని తనే కొనితెచ్చుకుంటాడు, అదే జరుగుతుంది. అది చాలా దురదృష్టకరం, క్రూరవినాశనం కన్నా ఎప్పుడు రక్షించుకుంటూ, వికసింప చేసుకుంటూ, మార్చుకుంటూ పోవడమే శ్రేయస్కరం. యుద్ధం అతి భయంకరమైనది. దాన్ని ఎంచుకోవడం దారుణం, అది ఘర్షణను భయానకంగా తయారుచేసి శాంతి ద్వారా రక్షించుకోవలసిన వాటిని కూడా ధ్వంసం చేస్తుంది. మనుషులను, వస్తువులనే కాదు, మనుషుల అంతఃకరణను కూడా.

ప్రశ్న: ప్రస్తుత రాజకీయాలలో భారతదేశానికి ప్రత్యేక పాత్ర ఉందా?

ప్రపంచ దేశాలలో భారతదేశానికి ప్రత్యేకంగా నిర్వర్తించవలసిన పాత్ర ఉంది. కాని అది ఆదర్శవంతమైనది, కొన్ని మార్పులను ఆశిస్తుంది. నాకు తెలిసినంత వరకు ఇది ఇంకా జరగలేదు. చిత్తశుద్ధి ఉంటే అంత లోతుకు వెళ్ళకుండా బాహ్యంగానే భారతదేశం తన పాత్రను తను నిర్వర్తించ గలదు

CWM 7:302-03 శ్రీమాత

భూమి మీద జరిగే ప్రతి విషయం ప్రగతి వైపుకి వెళ్ళేదే. అందుకనే యుద్ధాలు ధైర్యాన్ని, నిర్భయత్వాన్ని, ఓర్పును నేర్పే పాఠశాలలు; నిరాకరించే, కాలం చెల్లిన, గతించినవాటిని తరిమివేయడానికి తోడ్పడతాయి, కొత్తవాటికి అవకాశం కల్పిస్తాయి. కురుక్షేత్ర యుద్ధం లాంటివి ధూర్తమైన, వినాశకర జాతులను వదిలించు కోవడానికి, హక్కులను, న్యాయాన్ని స్థాపించడానికి తోడ్పడతాయి. అవి ప్రమాద ఉనికి తెలియచేయడం ద్వారా, తామసికునిలోని ఉదాసీనతను తరిమికొట్టి నిద్రావస్థలో ఉన్న శక్తులను మేలుకొలపవచ్చు. చివరిగా భయానక పరిస్థితులు వెన్నంటి వెళ్ళకుండా, అనాగరిక, హింసాత్మక మార్గాలు కూడా అవసరం లేదనే భావాలను రేకెత్తించి మనిషిని మార్చగలగాలి.

CWM 10:52-53 శ్రీమాత

అనువాదం: రాజకుమారి

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2017



యజ్ఞయాగాది మార్గము

విషయ సూచిక

సంపాదకీయం:

శ్రీమాత చేపట్టిన రూపాంతరీకరణ కార్యక్రమం కేవలం మనిషికి మాత్రమే పరిమితం కాలేదు. అతిమానస అస్తిత్వంలోకి పరిణామం చెందే క్రమంలో మనిషితో పాటు ప్రభావితం కావలసిన వివిధ చేతనా దశలలో మరియు స్తరాలలో నున్న అనేక జీవులు కూడా వున్నాయి. అట్టి జీవుల వరుసలో మనిషి ఒకడు. పరస్పర అనుసంధానమై వున్న ఈ జీవు లందరినీ పరిగణనలోకి తీసుకొని, వాటిపై పనిచేయవలసి వుంటుంది. వాటిలో సృష్టి పునరావృతమయ్యే ప్రక్రియలపై ఇంతవరకు ఆధిపత్యం నెరపిన దేవత లున్నారు. పునరావృతమయిన తదుపరి పరిణామక్రమాన్ని అతిమానసచేతన చేపట్టడంతో, మనిషికి దేవతలతో నున్న సంబంధం మరియు దేవతలకు భూలోకంతో నున్న సంబంధం మార్పు చెందడం తప్పదు. శ్రీమాత భూలోకానికి, మనుషులకు, పశుపక్ష్యాదులకు, వృక్షజాతికి మాత్రమే తల్లి కాదు, దేవతలకు, దానవులకు కూడా తల్లి అయినందు వలన ఆమె బిడ్డలైన వీరందరి పైన తన దివ్యప్రేమను వర్షింపజేసి, అతిమానస సృష్టి ఆవిర్భావం సులభతరం కావడానికి, తాను తలపెట్టిన నవ్యదివ్య మార్గాన్ని వారికి సైతం నేర్పించవలసి వచ్చింది. శ్రీమాత చేపట్టిన మహత్తర కార్యక్రమాలలో ఆ విభాగాన్ని ఈ సంచికలో ప్రస్తావించడమైనది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



ప్రశ్న: సర్వేశ్వరుడు ఈ ప్రపంచాన్ని రూపొందించమని మిమ్ములను ఆదేశించినపుడు, చేయవలసిందేమిటో మీకు తెలిసిందా?

నాకు దానిని గురించి తెలుసుకోవలసింది ఏమీ లేకుండింది, ఎందుకనగా సర్వేశ్వరుడు సమస్తమును తనలోనే ఇముడ్చుకొని వున్నాడు: సమస్త లోకాన్ని, లోకజ్ఞానాన్ని, దానిని రూపొందించే విజ్ఞానాన్ని. ఒక ప్రపంచం వుండాలని ఆయన ఎప్పుడైతే నిర్ణయించుకున్నాడో ప్రప్రథమంగా ఆయన లోకజ్ఞానాన్ని, లోకాన్ని రూపొందించే శక్తిని వెల్లడి గావించాడు. అదే నేను. అప్పుడు ప్రపంచాన్ని రూపొందించమని నన్ను ఆదేశించాడు.

CWM 13:52`

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దేవమాత

దైవచింతన దారితప్పి కాలగమనం కుంటుబడిన
దౌర్భాగ్యపు కాలం వెనుక, మరణోన్ముఖ జన్మ వెనుక
చేతనావృత దివ్యశక్తి స్థిరనివాసమున్న దచట.

పరమేశ్వరుడు హృదయ గుహ్యామందిర మందుండి
అతని జ్ఞానపుత్రి జ్ఞానశక్తి జ్ఞానానికి జోడు
ఇంద్రచాప రంగులీను మనోప్రాణ లోకాలను
నిర్మించాలని దిగింది దివినుండి భువికి.

ఆమోఘమగు అతిచేతన అసామాన్య వెలుగు
అపారమగు అచేతన అనాలోచిత అవస్థ మధ్య
పదార్థ ప్రపంచ అనునిత్య నిద్రాస్థితిలో
స్వాప్నిక సుషుప్తి యందలి తారల తారాటాల్లో
తన జీవితకృత్యాల సాహస సౌరభాన్ని
గుండె కన్న కలలలోని ఆవేశ ప్రాభవాన్ని
నిర్వేద నిరుత్సాహ శూన్యంపై విధిస్తుంది.

అవచేతన చేతలలో నున్న ఆమె ఉనికి
లోకపు వైఫల్యాలను నివారించి నయం చేసి
వివేకహీన విశ్వమందు విషాదాంత సంఘటనలను
పరమాత్ముని పారవశ్య పరమానంద హేలలో
దివ్యమైన సుఖాంత నాటికలా మలుస్తుంది.

దైవానికి తల్లి ఆమె మన అంతరాత్మల మాత ఆమె;
మహాకాల గమనంలో దైవానికి సహజాతులం
మనం అనంత కాల భాగస్తులం శాశ్వతత్వ వారసులం.

CWSA 2:642-43 — శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

భగవంతుని సృజనాత్మక దివ్యశక్తి

ఏకైక మూలాధార మహోన్నత శక్తి

ఏకైకము, మూలాధార నిలయము, సర్వోన్నత దివ్యశక్తి యగు శ్రీమాత సర్వలోకాలకు అత్యున్నతమైన స్తరాలలో ప్రత్యక్షమై వుంటుంది, తన సత్యచేతనలో ఆ పరమేశ్వరుడిని నిలుపుకొని వుంటుంది. అప్రతిహతమైన దివ్యశక్తికి, అనిర్వచనీయమైన భగవానుని ఉనికికి ఆమెయే ఏకైక ఆశ్రయము. తనలోనే వున్న లేక తాను స్వాగతించిన, అభివ్యక్తం కావలసిన పరమసత్య సూత్రాలేవైతే దైవికమైన మార్మిక పరిధులలో దాచబడి వున్నాయో వాటిని తన అనంత చేతనా ప్రకాశంలో వెల్లడి చేసి, తన అమోఘ శక్తిలో, తన అపరిమిత చేతనాస్థితిలో ఒక శక్త్యాత్మక రూపాన్ని కల్పించి లోకమందు ప్రకటితం కాగల ఒక శరీరాకృతి నిస్తుంది. భగవంతుడు ఆమెలో ఒక శాశ్వత సచ్చిదానందంగా సర్వదా సాక్షాత్కరించి వుంటాడు, ఆమె ద్వారా తన ఏకైకము మరియు ద్వైతము అగు ఈశ్వర శక్తి చేతనగా మరియు పురుషుడు — ప్రకృతి అనబడు ద్వైదీ సిద్ధాంతంగా ప్రకటితమౌతాడు, ఆమెచే దివ్యలోకాలలోను, దివ్య స్తరాలలోను, దేవతలలోను, వారి దివ్యశక్తియుక్తులలోను నియుక్తుడై వుంటాడు, ఆమె మూలంగా ఎరుక కలిగిన మరియు ఎరుక లేని లోకాలలో నున్న వాటన్నింటిలోను గుర్తించబడతాడు. సర్వమూ ఆమె భగవంతునితో సల్పు క్రీడావిలాసమే, సర్వమూ ఆమెచే అభివ్యక్తం చేయబడిన ఆ శాశ్వతుడి అతీంద్రియ రహస్యాలే, ఆ అనంతుడి మహాద్భుతాలే. సర్వమూ ఆమెయే ఎందుకనగా సమస్తము దివ్యచేతనాశక్తి యొక్క పక్షాలే, భాగాలే. ఆమెచే నిర్ణయించబడి, భగవంతుడిచే ఆమోదించబడినది తప్ప వేరొకటి ఇచ్చటగాని, మరోచోటగాని వుండలేదు. భగవంతుని ప్రేరణతో ఆమెచే గ్రహించబడి ఆమె సృష్ట్యాత్మక దివ్యానంద హేలలో బీజంగా నాటబడినది తప్ప వేరొకటి రూపొందలేదు.

CWSA 32:14-15

మహాశక్తిగా శ్రీమాత

అజ్ఞానంధకార బంధురమైన త్రిలోకాలకు ఆధిపత్య మహాశక్తి యగు శ్రీమాత, అతమానస దివ్యతేజోమయము, పరమ సత్యమయమగు జీవితము, పరమ సత్యమయ

మగు సృష్టి నెలకొని వుండే స్థాయి ఏదైతే పైనుండి భువికి కొనితేవలసి వున్నదో, ఆ స్తరానికి మరియు ఊర్ధ్వముఖంగా ఎదిగి అధోముఖంగా దిగివచ్చే విభిన్న చేతనాస్తరాల వ్యవస్థ, ఏదైతే జోడు నిచ్చెనలపై సాగే కదలికల మాదిరిగా మహాపదార్థపు అవిద్యలోకి దిగజారి తిరిగి జీవితము, అంతరాత్మ, మనస్సుల వికసనంతో ఊర్ధ్వ ముఖంగా పరమాత్మ యొక్క అనంతత్వంలోకి చేరుకుంటుందో, ఆ స్తరానికి మధ్య ఉపస్థితయై వుంటుంది. ఈ విశ్వంలోను, ఈ భూలోక పరిణామక్రమంలోను ఏది వుండవలసి వున్నదో దానికి, తాను ఏది గమనిస్తుందో, అనుభూతి చెందుతుందో, తననుండి బహిర్గతమౌతుందో దానికి, అనుగుణంగా వుండి తీరాలని నిర్ధారించే మహాశక్తిగా సమస్త దేవతాగణానికి పైగా నిలిచి వుంటుంది. తన సర్వ దివ్యశక్తులను, దివ్యవ్యక్తిత్వ లక్షణాలను కార్యాచరణకై క్రియాశీలం గావిస్తుంది, వాటి అభివ్యక్తులను ఈ క్రింది లోకాలలో కొనసాగే కార్యక్రమాలలో జోక్యం చేసుకొనుటకు, వాటిని నిర్వహించుటకు, పోరాడి వశపరచుకొనుటకు, అవి సరైన దిశలో నడిచి నియమాను సారంగా వర్తించుటకు, వాటి శక్తులు సమిష్టిగాను మరియు ప్రత్యేకంగాను పనిచేయు విధానాలను నియంత్రించుటకు ప్రయోగిస్తుంది. ఆ దివ్యాభివ్యక్తులనే జనులు యుగాల తరబడి ఆమె విభిన్న రూపాలుగా, విభిన్న వ్యక్తిత్వాలుగా వేర్వేరు నామాలతో పూజిస్తున్నారు. ఈ దివ్యశక్తులు, వాటి అభివ్యక్తుల ద్వారా ఆమె తన దివ్య విభూతులను మానసిక, శారీరక స్థితులను సిద్ధపరచి రూపొందిస్తుంది — తాను సర్వేశ్వరుని దివ్య విభూతులకై మానసిక, శారీరక స్థితులను సిద్ధపరచి రూపొందించినట్లుగా, ఆ విధంగా భౌతిక ప్రపంచమందు తన శక్తి, తన లక్షణము, తన ఉనికి యొక్క కాంతికిరణం ఒకింతైనా మానవ చేతనారూపంలో ప్రచ్ఛన్నంగా ప్రకటిత మవుతుం దేమోననే ఆశతో. ప్రాపంచిక క్రీడావిలాస దృశ్యాలన్నీ ఆమె మానవరూపం ధరించి, స్వర్లోక దేవతలు ఉపచారకులుగా నటించిన ఒక పథకం ప్రకారం ఆమె స్వయంగా రూపొందించిన నాటకంగా వుంటాయి.

CWSA 32;16-17

శ్రీమాతయొక్క చతుర్విధ మహాశక్తులు

ఈ విశ్వానికి దిశానిర్దేశం చేయుటలోను, ప్రాపంచిక వ్యవహారాల నిర్వహణా కార్యక్రమంలోను శ్రీమాతయొక్క నాలుగు దివ్య క్రియారూపాలు, మరియు దివ్య

వ్యక్తిత్వ లక్షణాలు ప్రధాన పాత్రను పోషించాయి. ఒకటి, ఆమె ప్రశాంత విశాలత్వము, గ్రహణశక్తి యుక్తమైన వ్యావహారిక జ్ఞానము, అచంచల దయాళుత్వము, అక్షయమైన కనికరము, సర్వోత్కృష్టము, సర్వాతిశయమగు మహారాజ్ఞిత్వము. మరొకటి, మహత్తరమగు బలసంపద, ఆపశక్యంగాని తీవ్రోద్రేకంతో కూడిన దివ్యశక్తి, యోధ లక్షణ వైఖరి, సర్వాతిశయ సంకల్పబలం, ఉద్రేకపూరిత చురుకుదనం మరియు ప్రపంచాన్ని మొత్తం కుదిపి వేయగల మహాశక్తి. మూడవది, అతి సున్నితత్వము, లయబద్ధము, సౌందర్యము, సామరస్యతల సారభూతమైన మాధుర్యము, ఉత్సాహము, అవగాహన కందని సూక్ష్మ జ్ఞానసంపద, తప్పించుకోలేని ఆకర్షణ, పారవశ్యత గొలిపే సొగసు. నాల్గవది, సర్వ విషయాలపై సంపూర్ణమైన, అపారమైన, అతి సన్నిహితమైన విషయ పరిజ్ఞానము, శ్రద్ధాపూర్వకము, లోపరహితమగు కార్యాచరణ మరియు అన్నింటిలోను నిశ్చలమైన, నిర్దిష్టమై పరిపూర్ణత. దివ్యమైన జ్ఞానము, శక్తి, సామరస్యత, పరిపక్వత వాటికున్న ప్రత్యేక లక్షణాలు. ఈ మహాశక్తులనే అవి తమతో పాటు ఈ లోకంలోకి కొనివస్తాయి. ఎవరైతే వారి లౌకిక స్వభావాన్ని శ్రీ మాతయొక్క ప్రత్యక్ష, సజీవ ప్రభావానికి తెరిచి వుంచుకోగలరో వారిలోను, దివ్య పరిణామ దిశగా సాగేవారి ఊర్ధ్వముఖ గమనంలోను వాటి దివ్య విభూతులను మానవాకారంలో తప్పక ప్రత్యక్ష పరుస్తాయి. ఈ నాలుగింటికీ మనం నాలుగు విశిష్ట నామకరణలు చేసాము, మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి.
CWSA 32:17-18

శ్రీమాతయొక్క ఇతర విశిష్ట వ్యక్తిత్వాలు

శ్రీమాతయొక్క ఇతర విశిష్ట వ్యక్తిత్వాలున్నాయి, కానీ వాటిని భూమండలం లోనికి కొనిరావడం అంత తేలిక కాదు. అదీ గాక, పృథ్వీతత్వం పరిణామం చెందే క్రమంలో వాటికి అంత ప్రముఖ పాత్ర లేదు. అయితే, వాటిలో అతిమానస సాక్షాత్కారానికి అత్యావశ్యకమైన దివ్య వ్యక్తిత్వ ఉనికి వున్నది. అది అన్నింటినీ మించినది, అద్భుతావహమైన, అత్యంత శక్తివంతమైన పారవశ్యత, మహదానందం ఏవైతే మహోత్కృష్టమైన దివ్యప్రేమసాగరం నుండి ప్రవహిస్తాయో, ఏ దివ్యానందమైతే అతిమానసస్థితియొక్క శిఖరాగ్రపు ఎత్తులకు పదార్థ ప్రపంచపు అట్టడుగు లోతులకు మధ్యనున్న అగాధాన్ని సరిచేయగలదో, ఏ దివ్యానందస్థితి ఆధ్యాత్మిక దివ్యజీవనానికి

దారి తీయగలదో, ఏదైతే తన గుప్తశక్తుల నుండి విశ్వముయొక్క ఇతర దివ్యశక్తుల కార్యక్రమాలకు ఇప్పటికీ అసరా నందిస్తున్నదో — అదే ఆ దివ్యవ్యక్తిత్వము.
CWSA 32:23-24

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దేవమాత

(సత్యవంతునితో సహజీవనం సంవత్సర కాలం మాత్రమేనని తెలుసుకొని ఆతనినే పరిణయమాడిన సావిత్రి అంతర్ముఖ ఆలోచనా పథంలోని ఒక ఘట్టం. శ్రీ కె. వి. రావుగారి 'సావిత్రి' తెలుగు అనువాదం, రెండవ సంపుటి, పుస్తకం 7, ఆశ్వాసం 5, పుటలు 963-64 నుండి సేకరించడమైనది.)

అదివరకే ఆమెలో ఒక అభిన్నత్వం వుంది. అదింతవరకు మరుగున పడిపోయి వుంది. నిజానికి భగవంతునికి, జీవునికి మధ్య ఎప్పుడూ అభిన్నత్వమే వుంది, వుంటుంది. కాని అది జీవుడు తెలుసుకొనేంతవరకు మరుగునపడి వుంటుంది. అలా మరుగున పడిన అభిన్నత్వం ఇపుడు సావిత్రి దృష్టిలో పడేంతగా మేలుకొంది. తాను పరాత్పరునికి ప్రియాతిప్రియమైన దానినని ఆమెకు తెలిసిపోయింది.

ఆ దేవుళ్ళు, దేవేరులు అందరూ కూడా ఆమె, పురుషుడు, ప్రకృతి అనేది ఆమెకు తెలిసింది.

దివ్యసౌందర్యం, దివ్యానందంయొక్క మాతృమూర్తి, బ్రహ్మదేవుని విశాల సృజనశీలియైన ఆలింగనంలోని దివ్యవాణి తానేనని ఆమె గ్రహించింది. సర్వ శక్తివంతుడైన శివుని వొడిలో ఆసీనయైన పరాశక్తి తానేనని తెలుసుకొంది. తమ ద్వైదీభావన, లేక ఇరు కేంద్రాల నుండి వారి చూపు నిర్మించిన ఈ లోకాల నవలోకిస్తున్న ఈశ్వరుడు, దివ్యమాత, శివ శక్తులేనని సావిత్రి గ్రహించింది. బ్రహ్మానందంలో సదా పెనవేసుకుపోయి వున్న కృష్ణుడు, రాధ వారేనని దర్శించింది. ఆరాధకుడు, ఆరాధ్యుడు ఒకరిలో ఒకరు మునిగిపోయి ఒకటైపోయిన అభిన్నత్వాన్ని ఆమె దర్శించింది.

ఏ చూపూ వర్ణించలేని ఆకారంగల ఒకామె, చిట్టచివరి గదిలో బంగరు గద్దెపై కూర్చొని వుంది. ప్రపంచానికి సంబంధించిన, ఎవరు చేరలేని మూలాన్ని ఒక్కరు మాత్రమే, సావిత్రి మాత్రమే అనుభూతి చెందింది. ఆ మహాశక్తి నుండి చెదరి వెలికి

వచ్చిన శక్తియే తానని గ్రహించింది. దృష్టి కందని, దృష్టి కతీతమైన సౌందర్యమామె, ప్రపంచం చేరుకోవాలని తపించే గమ్యమామె. ఈ సమస్త జ్ఞానమూ ఆ మహాతేజస్విని యొక్క ఒక కాంతిపుంజం మాత్రమే. ఏది లేకుండా ఈ జీవనం, ప్రాణం మనలేవో ఆ మహత్తు ఆమె.

సావిత్రి: 525 శ్రీఅరవిందులు

నేను ఎల్లప్పుడూ ఉన్నాను

ఈ సృష్టి చరిత్రలో ఎక్కడైనా దివ్యచేతన ఆవిష్కరించ బడటానికి అవకాశ మున్నప్పుడల్లా అక్కడ నేనున్నానని ఒక రోజు చెప్పాను. ఇది ఒక సత్యం. ఇది సావిత్రి గాథ లాంటింది. ఎప్పుడూ ఉన్నాను, ఎల్లప్పుడూ ఉన్నాను, ఇక్కడ, మరొక చోట... అలా కొన్నిసార్లు ఒకేసారి నాలుగు విభూతులతో ఉండటం జరిగింది. ఇటలీ, ఫ్రెంచి పునరుజ్జీవన సమయంలో అలా జరిగింది. మరొకసారి క్రీస్తు ఉన్నప్పుడు కూడా... మీకు తెలుసా చాలా సార్లు... చాలా సార్లు నాకు జ్ఞాపకం ఉంది. అవన్నీ చెప్పాలంటే చాలా బృహద్గ్రంథా లవుతాయి. ఈ జన్మలోనో, మరో జన్మలోనో పాత్ర పోషించిన ప్రాణచేతన యొక్క నిర్దిష్టమయిన యోగసంభూతమయిన రూపాలు – మరొక విధంగా చెప్పాలంటే అమరమయినవి. (ఈ రూపాలన్నీ స్వతంత్రమూ, అమరమయిన మనుగడ కలిగినవి). ఈ సారి నేను వచ్చి యోగం ప్రారంభించగానే అన్ని దిశలనుండి ఈ శక్తులు వచ్చాయి, అవి కాచుకు కూర్చు న్నాయి. కొన్నయితే అలా కాచుకొనే వున్నాయి, కొన్ని మాత్రం పని చేస్తుండినాయి. (అవి తమ స్వతంత్ర జీవనాలను సాగిస్తూ ఉన్నాయి) అవన్నీ ఒక చోట మరో మారు గుమిగూడాయి. ఆ విధంగానే నాకు జ్ఞాపకాలు కలిగాయి. ఒకదాని తరువాత ఒకటి ఈ ప్రాణిక శక్తిరూపాలు వచ్చాయి, ఒక ప్రళయంలా. నాకు ఒక్కొక్కదాన్ని జీర్ణించుకోవటానికి సరిపడినంత సమయం ఉండేది కాదు. ఒకదానిని చూసి, గుర్తించి, సమగ్రపరిచేలోగా మరొకటి వచ్చేది. అవి చాలా స్వతంత్రమైనవి, అయితే తమ పని తాము చేసుకోగలవు, కానీ అన్నీ కేంద్రీకృతమైనవి, అన్ని రకాలయినవి, అన్ని రకాలు... ఎన్నయితే ఊహించగలరో అన్నీ ఉండేవి. అవి కొన్ని మనుషులలో కూడా ఉండేవి. అవి కేవలం స్త్రీ శక్తులే కాదు.

శ్రీఅరవిందులను నేను కలవక ముందు అవి వస్తూనే... వస్తూనే ఉండేవి.

రాత్రి తరువాత రాత్రి. కొన్ని సార్లు పగటి సమయంలో కూడా. కొన్ని సార్లు సమూహంలా వచ్చేవి. తరువాత శ్రీఅరవిందులతో నేనా విషయం చెప్పాను. ఆయన అది చాలా సహజం అని చెప్పారు. నిజానికి ప్రస్తుత మహాశక్తి అవతరణలో అది చాలా సహజం (శ్రీమాత తననే మూడవ వ్యక్తిగా చెపుతారు) ఆమెతో అనుసంధానమై ఉన్నదంతా పాలు పంచుకోవా లనుకుంటుంది. అది చాలా సహజం, ప్రాణిక చేతనలో అది మరింత నిజం. ప్రాణిక శక్తులను వ్యవస్థీకరించటం, కేంద్రీకరించటం, వృద్ధి చెందించటం, ఏకీకృతం చేయటం, నియంత్రించటంతో చాలా సార్లు నిమగ్నమై ఉండవలసి వచ్చేది. ఇలా చాలా అసంఖ్యాకమయిన ప్రాణిక రూపాలు తమ తమ ప్రత్యేకమయిన శక్తులతో చరిత్రలో తమ పాత్రను నిర్వర్తించి యిపుడు మళ్ళీ తిరిగి వచ్చాయి.

శ్రీమాత సాధకునితో సంభాషణలు, 26 జూన్ 1962

ద్వాదశ మౌక్తిక కిరీటం పైన... దేవతలకు కొంచెం పైన... అక్కడే మేడమ్ థియోన్ నన్ను గుర్తించింది, నా తలపై నున్న పన్నెండు ముత్యాల సమాహారంతో. "అలా ఉండటం చేత నువ్వు దివ్యశక్తివి, దివ్యమాతవి. కేవలం ఆమెకే యిలా ఉండటం సాధ్యం" అని నాతో అన్నది. నాకెపుడూ అలాంటి ఆలోచన ఏమాత్రం కలగలేదు. భగవంతుడికి ధన్యవాదాలు.

శ్రీమాత సాధకునితో సంభాషణలు, 11 మే, 1963

మహేశ్వరీ తేజం! అది ఎపుడూ నా చుట్టూ ఉన్నట్లు వుండింది. ఎందుకనగా మేడమ్ థియోన్ నన్ను మొదటిసారి చూసినపుడు ఆవిడ మొదట చెప్పిన విషయం అదే. ఆమె 'మహేశ్వరి' అని అనలేదు. "నీ చుట్టూ ఒక శ్వేత కాంతి ఉంది." అని అన్నది. అది స్వయంగా అన్ని దుస్సంకల్పాలను కరిగించి వేస్తుందని చెప్పింది. నేను అది అనుభవించాను. అట్టి జీవులు మట్టిలో కలిసిపోవడం చూశాను....

థియోనును కలవక ముందే నేనా శక్తిని ఉపయోగిస్తూ ఉండేదాన్ని. దాని గురించి నాకేమీ తెలియదు, కానీ నా కది కనిపించేది. మేడమ్ థియోన్ చెప్పింది 'అది నీ తేజస్సు' అని. నేనెవరిని అనేది నాకు తెలియజేసింది ప్రప్రథమంగా థియోనే. నా తలపై ద్వాదశ మౌక్తిక కిరీటాన్ని చూశానని చెప్పింది. నా మటుకు నాకు దాని అనుభవం ఉండేది. ఆ తర్వాత నా ఇచ్ఛ ప్రకారం నేను ఆ శక్తిని వాడుతూ ఉండేదాన్ని. నేను కేవలం పిలిస్తే చాలు. మిమ్మల్ని చూసినట్టుగానే ఆ శక్తుల్ని నేను ఒక

వస్తువులా చూడగలిగేదాన్ని.

శ్రీమాత సాధకునితో సంభాషణలు, 10 జూలై 1965

అనువాదం: డా. సరోజా ప్రసాద్

శ్రీమాత — దేవతలు

వైదిక దేవతలు

నేను వేదాలను చదువుతూనే వుంటాను. అది ఎంత కమనీయంగా వుంటుందో, ఆ బుక్కులను చదివినవారికి ఎంత ఫలవంతమో, సిద్ధిని పొందటానికి ఎంత శక్తి వంతమో నేను గ్రహించాను.

శ్రీఅరవిందులతో ఒక రోజు ఈ స్తోత్రాలను అన్నీ దేవుడికి అనువదించి చెపుతున్నపుడు — అగ్ని నాకు నిజంగా దర్శన మిచ్చాడు. అయితే నిన్న అగ్ని దేవుడు కాదు. అది ఒక జీవశక్తి ఉనికి. అది పరమోత్కృష్టమైన దైవికస్థితి, ఎంతో సన్నిహితమైనది, స్పష్టమైనది, తీవ్రమైనది, జీవంతో తొణికిస లాడేది, సజీవమైనది.

సాధకునితో సంభాషణలు 8 ఏప్రిల్ 1961

శ్రీమాత

నేనా దేవత లందరితో సంస్పర్శ కలిగి ఉన్నాను, ఆ మహనీయ మూర్తులతో; దాని తో చాలా వరకు వారి వైఖరి మారింది. మార్పు చెందాలని అనుకోనివారి పద్ధతులను కూడా ఎంతో కొంత ప్రభావితం చేసింది.

ప్రత్యక్షంగా అభివ్యక్తమైన పరమాత్మతో మనిషికి కలిగిన అనుభవం అసాధారణ మయినది. అది విశ్వచరిత్రకు ఒక సరికొత్త నిర్వచనాన్నిచ్చింది. వేదయుగానికి, వైదిక మార్గంలో పరమాత్మతో సంబంధానికి మరియు వేదాంత ఆవిర్భావానికి మధ్యగల తేడాను శ్రీఅరవిందులు ఉటంకించారు: ఆరాధన, ప్రేమ, భక్తి, అంతరంగ మందలి దైవం....

ఈ పరమాత్మతో సంబంధమనేది కేవలం మనిషికే సాధ్యం. ఎందుకంటే ఈ విశ్వచరిత్రలో మనిషి ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నాడు, అతనిలో దైవం కొలువై

ఉండటం వలన. ఎందరో దేవతలు ఈ అనుభవం కోసం మానవ శరీరాలను ధరించారు.

శ్రీమాత సాధకునితో సంభాషణలు, 30 జూన్ 1962

అనువాదం: డా. సరోజా ప్రసాద్

30 సెప్టెంబరు 1914 న శ్రీమాత ప్రార్థన

మన దివ్యమాత మనతోనే వున్నది. తలాతల లోతుల్లో నుండీ యింద్రియ గోచర బాహ్య ప్రపంచం పర్యంతం సంపూర్ణ చైతన్యంతో, సర్వేశ్వరునితో మనము తాదాత్మ్యం చెందునట్లు ప్రమాణం చేసింది. ఈ సందర్భాలలో అంతా అగ్నిదేవుడు తన పరిశుద్ధాత్మకమైన జ్వాలతో, అన్ని అవరోధాలను హరించివేసి, శక్తులను ప్రజ్వలింప జేసి, సంకల్పాన్ని ఉత్తేజపరచడంలో సహకరిస్తానని హామీ నిస్తాడు. తద్వారా సత్యసాక్షాత్కారం వేగవంత మవగలదు. ఇంద్రుడు మన జ్ఞానసంపదను సమగ్రంగా ప్రకాశవంతం చేయుటకు మనతోనే ఉన్నాడు. సర్వేశ్వరుని దివ్యానంద స్థితులను అందివ్వగల సోముడు మనల్ని తన అనంత, అద్వితీయ, అపూర్వ ప్రేమతో రూపాంతరీకరించాడు. ఓ దివ్య మధురమయి మాతా! పరవశంతో, వర్ణించ నలవికాని కోమలత్వంతో, అనంత విశ్వాసంతో, నీకు నతమస్తకమై నమస్కరిస్తున్నాను. ఓ జ్వాజ్వల్యమాన అగ్నిదేవా! నీవు నా యందు సజీవంగా నున్నవాడవు, నిన్ను ఆహ్వానిస్తున్నాను. మరింత సజీవంగా నాలో విరాజిల్లి, నీ జ్వలనం మరింత తీవ్రతరం గావించమని నిన్ను వేడుకొంటాను. నీ జ్వాలలు ఉవ్వెత్తున, శక్తి సంభరితంగా వెల్గొందాలి, దానిలో అస్తిత్వమంతా కేవలం తీక్షణ జ్వాలాక్షేత్రం గావాలి, ఒక పవిత్రీకరించు అగ్నిగుండం కావాలి. ఓ ఇంద్రా! నిన్ను అమితంగా గౌరవిస్తాను, కీర్తిస్తాను, నాతో ఏకమవాలని, నా ఆలోచనా సరళిలోని అంతరాయాలను తునకలు చేసి, దివ్యజ్ఞానాన్ని అనుగ్రహించాలని వేడుకుంటాను.

CWM 1:253-54

అధిమానస దేవతలు; దైవానికి శరణాగతి

అధిమానసానికి చెందిన దేవీదేవతలు ఆ జగదీశ్వరుడికి శరణాగతు లవలేదు. ఎందుకంటే వాళ్ల కంటూ తమదైన దివ్యశక్తి వున్నది. వాళ్ళు ఉన్నత చేతనలో వసిస్తారు. శ్రీఅరవిందులు సశరీరులై ఉన్నప్పుడు, నేను దుర్గాపూజా దినాల్లో ఆశీస్సుల

నిస్తుండేదాన్ని. అప్పుడు ఆ దేవతలు నన్ను సందర్శించడం జరిగేది. పై అంతస్తు నుండి దిగివచ్చి ధ్యానములో కూర్చున్నప్పుడు దేవీదేవతలంతా అరుదెంచి అక్కడ సమావేశమయ్యేవారు. కానీ వాళ్ళంతా నిజానికి స్వతంత్రులు, తెలుసా! ఉదాహరణకి కాళికి చెందిన అనేక అంశాల్లో, ఒక అంశారూపం వచ్చి ఈ మనుషులు చేసే తప్పులను గురించి వాపోయేది. నేను ఆమెను శాంతిప జేసేదానిని. క్రిందటి సంవత్సరం దుర్గాపూజా దినాల్లో ఒక రోజు దుర్గకు చెందిన ఒక అంశారూపం నా వద్దకు వచ్చింది. ఆమె అత్యద్భుతంగా వుండింది. నేనామెను సర్వేశ్వరునికి శరణాగతి చెందమని అడిగాను. అప్పుడు ఆమె అన్నది — "అవునవును, ఖచ్చితంగా ఇదే విషయాన్ని మీరు నాకు చెప్పాలని కోరుకున్నాను. నేను ఆ పరమాత్ముని శరణు పొందడానికి సిద్ధంగా వున్నాను." ఆమె నిజంగా అపూర్వమైనది. 1960 లో అతిమానస ఆవిర్భావ వార్షికోత్సవ దినానికి ముందు రాత్రి శ్రీకృష్ణుడు నా వద్దకు వచ్చాడు. ఇలా అన్నాడు — "రేపటి సందేశాన్ని నేను వితరణ చేస్తాను". అన్నట్లుగానే మరుసటి ఉదయం నేను క్రిందికి వెళ్ళినప్పుడు అతడు నా ఒడిలో కూర్చుని, వచ్చిన వారందరికి ఆశీస్సులు అందించడం మొదలుపెట్టాడు. అతడు చేసేదానిని చూస్తూ వుండటం నిజంగా ముచ్చట గొల్పింది. ఈ దేవత లందరూ వాళ్ళకున్న శక్తులతో స్వతంత్రులు, వాళ్ళ కిష్టమైనది చేయడంలో స్వేచ్ఛాపరులు.

ఇక్కడ కాదు, వేరే ఇంట్లో వున్నప్పుడు శివునితో ఎంతో గాఢానుబంధాన్ని కలిగి వుండేదానిని. ఆయనను ఈ భూమిపై అవతరించమని అడిగాను. ఆయన అన్నాడు "ఊ..హూ నేనలా చేయను. ఈ భూమిపై అతిమానసజాతి ఏర్పడినప్పుడు మాత్రమే నేను వస్తాను."

ఇహ నేనేమీ మాట్లాడలేకపోయాను, ఆయన స్వతంత్రుడు. నేను ఈ భూమిపై జన్మ ఎత్తినప్పటి నుండీ ఈ దేవీదేవతలు ఎల్లవేళలా నాతోపాటే ఉన్నారు. గడిచిన రోజుల్లో నేను వసారాలో పచార్లు చేస్తున్నప్పుడు శ్రీకృష్ణుడు నాతో పాటే నడిచేవాడు.

నాకు తెలుసు ఈ దేవీదేవతలు నూతన సృష్టిలో, నూతన అతిమానస జగత్తులో మానవులకు సహరిస్తారని.

Mother You said So

సర్వేశ్వరునికి 'దుర్గ' శరణాగత మవ్వడం

శ్రీఅరవిందులు ఇక్కడవున్నంతకాలం ఆయన చెప్పే నాలుగు రూపాలు, దివ్యమాతకు చెందిన నాలుగు దివ్య వ్యక్తిత్వాలు, ఎప్పుడూ యిక్కడే వున్నాయి... నేనెప్పుడైనా నీకు చెప్పానా? నేను దుర్గాపూజా దినాల్లో క్రింది అంతస్థులోకి వచ్చినప్పుడు, అది క్రిందటి సంవత్సరానికి ముందు 1960 లో, ఆ వార్షికోత్సవం తరువాత (అతిమానస ఆవిర్భావ తొలి వార్షికోత్సవం ఫిబ్రవరి 29, 1960) (ప్రతి సంవత్సరం జరిగే పూజాదినాల్లో రెండు మూడురోజులముందు దుర్గాదేవి నా వద్దకు వచ్చేది) నేను నడుస్తూవుండగా ఇట్లాగే ఒకసారి వచ్చింది. ఆమె అప్పుడే పరమాత్మకు తనకు తానుగా శరణాగతి చెందింది. ఈ దేవతలు శరణాగతమవ్వడమంటే ఏమిటో ఎఱుగరు. దుర్గలాంటి దేవతలు, గ్రీకు దేవతలు (కాకపోతే గ్రీకుదేవతల కాలం ముగిసిందనుకోండి. కానీ భారతావనికి చెందిన దేవతలు యింకా సజీవంగా నున్నారు!). వారిని శాశ్వతమైనదాని యొక్క కేంద్రీకృతమైన రూపాలు అనవచ్చు. కానీ ఆ సర్వోన్నతుడుగ పరమేశ్వరునికి సమర్పితమైపోవాలన్న జ్ఞానం వారికి లేదు. నేను పచార్లు చేస్తున్నప్పుడు దుర్గ నాతోనే వున్నది. నిజానికి అది ఎంతో చక్కని తరుణం. నిజానికి వ్యతిరేక శక్తులన్ని తరిమి కొట్టగల ఆమె తన అసాధారణ శక్తితో, విరోధశక్తుల్ని కనీసం గుర్తించని స్థాయికి సర్వోన్నతునికి సమర్పితమై పోయింది. ఇహ సర్వం పరమాత్మ మయం. అది ఆమె చేతన యొక్క విస్తృతిగా నుండింది.

శ్రీమాత: ఒక శిష్యునితో జరిపిన సంభాషణ, జూన్, 27, 1962

దేవతల ఆగమనాలు,

శ్రీఅరవిందులు యిక్కడనున్నప్పుడు నేను ధ్యానం నిమిత్తం సాధకులంతా సమావేశమైన హాల్లోకి వెళ్ళేరోజులు నాకు జ్ఞాపకమున్నాయి. హాల్లోని స్థంభాలపై చదునైన అంచు భాగంలో దేవతలువచ్చి కూర్చొనేవారు. శివుడు, కృష్ణుడు, లక్ష్మి, త్రిమూర్తులు, ఇలా అందరూ కూర్చునేవారు. చిన్నవారు, పెద్దవారు అందరూ. శివుడు, శ్రీకృష్ణుడు, మహాలక్ష్మి, త్రిమూర్తులు. ఒకరు పెద్దగా వుండేవారు. వారంతా నియమంగా నిత్యం ధ్యానంలో పాల్గొనడానికి విచ్చేసేవారు. ఆ దృశ్యం ఎంతో మనోహరంగా వుండేది. కానీ పరమాత్మ యెడల ఆరాధనా భావన లేదు. ఈ

రకమైన భావన వారికి పనిలేదు. వారిలో ప్రతి ఒక్కరు తనదైన ఉనికిని, అట్లాగే తన ప్రత్యేక శాశ్వత దివ్యత్వం పట్ల పూర్తి ఎఱుకను కలిగి వున్నారు. ప్రతివారికి తాము ఇతర దేవతలందరికి ప్రాతినిధ్యం వహించగలమనే ఎఱుక వుండేది. (ఆమోదయోగ్య మైన ఆరాధనకు అది పునాది అని వారికి తెలుసు) వారందరూ ఒక ప్రత్యేక సమాజానికి చెందిన వారమని భావించారు. కానీ వారిలో ఎవరికీ మానసిక పరమైన జీవనాన్ని ప్రసాదించే గుణగణాలు లేవు. వారికి ఒక లోతైన ప్రేమ, సానుభూతి, ప్రగాఢమైన ఐక్యతాభావన అన్నవి లేవు. వారికి తెలిసినదల్లా వారికి స్వయంగా తనదైన స్వంత దైవత్వ మొకటున్నదని మాత్రమే. వారికంటూ కొన్ని ప్రత్యేకమైన పోకడలున్నాయి. కాని పరమాత్మ నారాధించాలని గానీ, ఆయనకు ఉపకరణాలుగా ఉండాలన్న భావనగానీ లేదు. వారు సర్వేశ్వరునికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని భావించారు. కాబట్టి ప్రతి ఒక్కరు వారి ప్రత్యేక ప్రాతినిధ్యంతో పూర్తిగా సంతృప్తి చెందారు.

శ్రీమాత ఒక శిష్యునితో జరిపిన సంభాషణ ఆగస్టు 2, 1961

శ్రీమాత బిడ్డడు గణేశుడు

ఇది ఇలా జరిగింది తెలుసా: ఈ గణేశుడు.... ప్రస్తుతం ప్రాస్పరిటీ వితరణ చేయబడుతున్న గదిలో మేము అప్పుడు ధ్యానం చేసుకుంటున్నాం. మేము ఎని మిది లేక పదిమందిమి వుంటాం. పూలతో వాక్యాలను కూర్చుతూ వుండేవారం. నేనూ పూలను పేర్చేదాన్ని. అలా పేర్చినవాటిలో ఒక్కొక్కరూ ఒక్కొక్క వాక్యాన్ని ఏర్పరచేవారు. అలా ఒకరోజు సంపద అన్న ప్రస్తావన వచ్చినప్పుడు నేను ఆలోచిం చాను. (వీరంతా అంటారుగదా వినాయకుడు ఈ లోకానికి ధన దేవత అని, ప్రపంచ సంపదకు దేవత, సౌభాగ్యదాత అని.) ఈ కథంతా మనుషుల కల్పనలో ఏనుగు తలకాయతోవున్న, దేవతగురించేకదా! ఆపైన మేం ధ్యానం చేసాం. అప్పుడు నేనెవరిని చూసింది? లోనికి వస్తూ నాముందు నిలుచున్న ఒక సజీవరూపాన్ని స్పష్టంగా, ఒక పొడవైన తొండంతో, కాంతులు విరజిమ్ముతూ..... నవ్వుతూ "నీవు నిజంగానే వున్నావా "అని ధ్యానంలో ఉండే అన్నాను." "అవును నేనున్నాను. ఆర్థికంగా నీకేమి కావాలో నన్ను అడగవచ్చు. నేనది నీకు సమకూర్చగలను." అన్నాడు.

కాబట్టి నేనడిగాను — అంతే పదేళ్ళపాటు కుంభవృష్టిలా సంపద కురిసింది.

అది అత్యాశ్చర్యకరంగా నుండింది.

శ్రీమాత శిష్యునితో జరిపిన సంభాషమలు జూన్ 22, 1958

అనువాదం: సి.హెచ్. హర్షవర్ధనరాజు

దేవతారూపాలు, విధులు

ప్రాణిక ప్రపంచంలో చకితులను చేసే జీవులు

శ్రీఅరవిందులు ఎప్పుడూ చెప్పేవారు, గత యోగాలు ఎక్కడ ముగుస్తాయో తన యోగం ప్రారంభమవుతుందని. తన యోగం సాధించినగలగడానికి ముందే, పాతయోగాలు సాధించినవాని అంచులు చేరియుండాలని, అంటే దైవంపై అవగాహన, దైవంలో ఐక్యత, దైవంతో తన ఐక్యతను గుర్తించగలిగి ఉండాలి. కాని ఈ దైవం, అధిమానసం యొక్క దైవమని శ్రీఅరవిందులు చెప్పారు. ఇది మానవ చైతన్య ఆలోచనకు అందనిది, ఎందుకంటే ఇక్కడకు చేరడానికి కూడా అనేక స్తరాలు దాటాలి. అప్పుడు వారు చకితులు లేదా భయభ్రాంతు లవుతారు.

ప్రాణిక జీవులున్నాయి. వాటిని మనుషులు చూడటం తటస్థిస్తే — వాటివే అత్యున్నత దైవం అనుకుంటారు. కాని ప్రాణిక సత్తాలవి. వాటిని ముసుగు వేషాలు లేదా విజయవంతమైన ముసుగు వేషాలు అనుకోవచ్చు. ఎందుకంటే నిజంగా ప్రజలు వాటిని అత్యున్నత దైవంగా భావిస్తున్నారు గావున. అధిమానస సత్తాలు మనుష్యుల కంటె చాలా బలమైనవి. వీటితో సంబంధ మేర్పడినపుడు మనుష్యులు భయ కంపితులవుతారు. *CWM 5:283-84*

ప్రాణిక ప్రపంచ సత్తాలు — మతాలు

నేను చెప్పా — ప్రాణిక ప్రపంచంలో చిన్న చిన్న సత్తాలు, రూపాలు, చని పోయినవారి అవశేషాలు ఉంటాయి అని. ఇవే కాక, వీటితో సంబంధంలేని పెద్ద ప్రాణిక ప్రపంచ మున్నది. ఇక్కడ గొప్ప శక్తి, అందము గల సత్తా లుంటాయి. లోతైన ఆధ్యాత్మిక జీవనం లేకుండా గుప్త శక్తులతో వ్యవహరించేవారు, వీటిచే మోసగింపబడ్డారు. కొందరు వీటినే ఉన్నత దైవంగా భావిస్తారు, పూజిస్తారు. ఇలానే మతా లేర్పడతాయి సాధారణంగా. ఈ సత్యాలు ఈ విధంగా సఫలత పొందాయి.

చాలా మతాలు వాటిని అత్యున్నత దైవంగా గుర్తించాయి, కాని అవి ప్రాణిక సత్తాలు — అత్యంత అందమైన రూపం పొందగలవవి. ఇవి పెద్ద మోసగాళ్ళు, ప్రమాదకరమైనవి, ముసుగు వేసుకున్న మోసగాళ్ళు. నిజమైన ఆధ్యాత్మిక చైతన్యం, సహజ జ్ఞానం కావాలి, వీటిచే మోసగింపబడకుండా ఉండడానికి.

దర్శనాలు, అద్భుతాలు ఆధారంగా అనేక మతాలు, వాటి శాఖలు ఏర్పడ్డాయి. ప్రాణిక సత్తాల వల్లే ఇలా జరుగుతుంది. వీటి వల్లే జీవితంలో అనేక గొప్ప కష్టాలు, సమస్యలు ఏర్పడతాయి. జీవితానికి ఆవల ఉన్న వాటితో సంబంధా లున్నవారికి ఇట్టి కష్టాలు వస్తాయి, ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నవారికి కాదు.

ప్రాణిక ప్రపంచంలో ఆకాశా లున్నాయి. అవి స్వర్గాలు కావు, భోగభూములు. నిజమైన దైవాంశం లోపిస్తుంది వీనిలో. ఆధ్యాత్మిక స్వచ్ఛత, నిజమైన ఆధ్యాత్మిక బుద్ధి మాత్రమే వీని తేడా గుర్తించ గలవు. ప్రాణిక లేదా బుద్ధి ప్రపంచంలో వారు మోసగించబడ్తారు. అక్కడ వీరు అనేక అద్భుతాలు చూస్తారు. అత్యంత అద్భుత ప్రాణిక వెలుగులలో. ఆధ్యాత్మిక బుద్ధి గలవారికి ఏదో కృత్రిమం కన్పిస్తుంది. అవి మోసగించేవిలా ఉంటాయి. ఇక్కడ నీవు వాటి కతీతంగా ఉండాలి. నిన్ను నీవు మోసగించుకోకు, మోసగించబడకు.

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, జూలై 11, 1956

ప్రకృతి — దేవతలు

ఈ కోవకు చెందినవే తాంత్రికులతో వ్యవహరించే సత్తాలన్నీ. వీని మూలం ప్రాణికం కాదు, ప్రకృతికి చెందినది. ఇవి మూర్తి ధరించగల ప్రకృతి శక్తులు. ఇవి ప్రకృతి నియమాలకు లోబడి ఉంటాయి. ఇవి భౌతిక ప్రపంచానికి చెందినవి. ఇవి బలమైన శక్తులు, ప్రాణిక మూలం కలిగినవి కావు. నేను సూక్ష్మభౌతికంలో ప్రవేశించి పనిచేస్తున్నప్పుడు వాటిని చూస్తుంటాను. కొంతమంది ఆశ్రమవాసులు, ప్రపంచంలో ఇంకా కొందరు, వాటిని చూస్తుంటారు. నా పని సందర్భంలో నేను వీటితో కలుస్తా లేదా ఇవి నాతోనే ఉంటాయి తరచుగా. వీటికి గొప్ప శక్తి ఉంటుంది. తాంత్రికుల పూజలకు ఇవి స్పందిస్తాయి. కాళి, దుర్గలను పూజించే తాంత్రికులు వేరే కోవకు చెందినవారు. ఈ ప్రకృతి శక్తులు సహాయపడటానికి సిద్ధంగా ఉంటాయి. ఏది ఏమైన అవి నాకు చాల సహాయంగా ఉన్నాయి. కాని అవి పరిమిత జీవులు, వాటికి

సొంత భావాలు, నియమాలు, ఇచ్ఛలు ఉంటాయి. అవి సూక్ష్మ భౌతికంలో భౌతిక ప్రకృతియొక్క వ్యక్తిగత శక్తులు. అవి చాలా బాధాకరమైన పనులు చేస్తాయి వాటి కి కోపం వచ్చినపుడు.

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, మార్చి 11, 1956

అగ్నిదేవత

ఇదే విషయం, అగ్నిలో కూడ చూసాను, ప్రత్యేకంగా జపానులో. ఆ దేశంలో అగ్ని అసాధారణ విషయం. ఒక చోట అగ్నిప్రమాదం ప్రారంభం అవుతే, ఒక ఎన బై ఇళ్ళు ధగ్ధమౌతాయి, ఒక కాలనీ అంత. అక్కడి ఇళ్ళు కర్రతో చేయబడి ఉంటాయి, అగ్గిపెట్టెల్లా కాలిపోతాయి చూస్తుండగానే — ఒకటి, రెండు, పది, ఇర వై ఇళ్ళు కాలిపోతాయి. ఒక రోజున నేను పడుకొని అక్కడ ప్రజలపై దృష్టి కేంద్రీ కరించా. హఠాత్తుగా ఒక దృశ్యం కనిపించింది. అగ్నిశిఖలతో మేఘం వంటిది. అది ఒక ఇంటికి దగ్గరగా వెళ్తోంది. అది చైతన్యం గల సత్తా.

— ఏయ్! ఎందు కొచ్చా విక్కడికి?

— నాకు అధికారం ఉన్నది, ఒక ఇంటిని మండించి అగ్నిని ప్రారంభించేందుకు.

— కావచ్చు — నేను చెప్పా — కాని ఇక్కడ కాదు.

— అది నిరోధించ లేకపోయింది.

ఇక్కడ ఎవరు బలవంతు లన్నదే ప్రశ్న.

"కాదు — ఇక్కడ నీవు మండించలేవు — ఇక్కడ కాదంతే."

CWM 5:136-37

మృత్యుదేవత

ప్రశ్న: మృత్యువుకు ఒక దేవత ఉందంటారు, నిజమేనా?

స: అవును. దానిని నేను మృత్యుదేవత అంటాను. దానిని గురించి నాకు బాగా తెలుసు. అదొక అసాధారణ వ్యవస్థ. దాని హద్దు లేమిటో, ఎంత వరకు వ్యవస్థీకృతమైనదో తెలియదు.

మృత్యుదేవత లనేకమంది ఉంటారని నేను నమ్ముతున్నాను. వందల కొలది ఉండవచ్చు. కనీసం ఇద్దరు మృత్యుదేవతలను కలిశా. ఒకటి ఫ్రాన్సులోను, రెండవది

జపాన్‌లో. వీరిలో అనేక తేడా లున్నాయి. దేశము, నాగరికత, నమ్మకాలు, చదువు బట్టి వేరు వేరు మృత్యుదేవత లుండవచ్చు. ప్రకృతి ఎన్ని రకాలుగా వ్యక్తమవుతోందో అన్ని రకాల దేవతలు ఉండవచ్చు. అగ్ని, గాలి, వాన, నీరు, పెనుగాలికి దేవతలు ఉన్నారు. అలాగే మరణానికి కూడ దేవత ఉన్నది.

ప్రతి మృత్యుదేవతకు ప్రతి రోజు కొన్ని ప్రాణాలు తీసేందుకు హక్కు ఉంటుంది. ఇది ఒక అద్భుతమైన వ్యవస్థ. ఇది ప్రాణికశక్తులకు, ప్రకృతి శక్తులకు మధ్య గల ఒక రకమైన ఒప్పందంలా కన్పిస్తుంది. ఉదాహరణకు ఒక మృత్యుదేవత, "నాకు ఈ రోజున ఇంతమంది మనుష్యులపై హక్కు ఉన్నది" అంటే, అంతమంది మరణించాలని అది నిర్ణయించినట్లు. అది రోజుపై ఆధారపడ్తుంది, అది ఒకటి, రెండు, నాల్గు, ఆరు, ఎంతైనా కావచ్చు. అది సూటిగా వెళ్ళి, చావవలసిన వ్యక్తి పక్కకు చేరి స్థిర పడుతుంది. దీనిని నీవు గమనించగల్గితే — ఆ వ్యక్తి చావడం నీకు ఇష్టం లేకపోతే — నీకు తగినంత గుప్తశక్తి ఉంటే — నీవు దానితో చెప్పు "వద్దు — అతనిని తీసుకు వెళ్ళొద్దు." ఇది అనేక మార్లు జరిగిన విషయం, ఇక్కడ, జపాన్‌లోను. ఈ రెండు చోట్ల దేవత ఒకటి కాదు. అందుకే చెప్తా, అనేక మృత్యుదేవత లున్నారని.

— నేను అతని చావు కోరను.

— కాని నాకు హక్కు ఉన్నది, ఒక చావుకు.

— వెళ్ళి, మరియొకరిని చూసుకో, చావడానికి సిద్ధంగా ఉన్నవానిని.

— నీవు చెప్పగలవు — "నిన్ను నిషేధిస్తున్నా, ఈతనిని తీసుకువెళ్ళడానికి" నాకు దానిని పంపే శక్తి ఉన్నది. ఏమీ చేయలేదు ఆ దేవత,. వెళ్ళిపోతుంది.

కాని అది తన బాకీ వదులుకోదు. మరొక చోటికి పోతుంది. అక్కడ ఉంటుంది మరో చావు.

CWM 5:135-36

ప్ర: మృత్యువును దేవత అని ఎందుకంటారు? కపటానికి అధిపతిలా అది అసురుడు కాదా?

స; మనిషి చైతన్యంలో అతను దేవత అయాడు. అందుచే అతనిని మార్చటం కష్టం.

CWM 15:123

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

సర్వరాజు

జంతువులన్నింటిలో సర్పము ఆకర్షణ శక్తికి, సమ్మోహన శక్తికి స్పందిస్తుందని అంటారు. (ఆకర్షణ శక్తి భౌతిక శారీరక జీవశక్తి నుండి జనిస్తుంది). మీకు ఆ శక్తి వుంటే సర్పాలపై ఆధిపత్యాన్ని సులభంగా సంపాదించవచ్చు. సర్పాలను ఇష్టపడే వారందరికీ ఆ శక్తి వుంటుంది. వారు ఆ శక్తిని వినియోగించి సర్పాలను వశం చేసుకుంటారు. ఆ విధంగానే నేను టెమ్‌సెన్‌లో నాగు పాము బారి నుండి తప్పించుకున్నాను — ఆ కథ మీకు తెలుసునా? ఆ శక్తిని గురించి థియోన్ నాకు చెప్పాడు. ఆ శక్తి నాలో కూడా వుందని తెలుసు. అందువలన నాగుపాము నా ఆదేశం పాటించేటట్లు చేసుకోగలిగాను. అది నన్ను వదలి వెళ్ళిపోయింది. ఆ తరువాత సర్పజాతికి మూలశక్తి అగు నాగరాజు నన్ను కలవటానికి టెమ్సెన్ వచ్చాడు. ఆ సమయంలో మరొక సంఘటన జరిగింది. కాషాయవన్నెగల ఒక పెద్ద అంగోరా మార్జాలం ఒక చిన్న కట్ల పామును చంపేందుకు సహాయపడ్డాను. (క్లియోపాత్ర వద్ద వున్నటువంటి కట్లపాములు చాలా ప్రమాదకరమైనవి) ఈ రెండు సంఘటనలు జరిగిన తర్వాత ఒక రాత్రి సర్పరాజు వా వద్దకు వచ్చాడు. అతడు తన శిరస్సుపై ఒక దివ్యమైన కిరీటాన్ని ధరించి వున్నాడు — ప్రతీక లాంటింది. ఏమైనా అతడు సర్పజాతి అధి దేవత. నాగుపాము ఆకారంలో భయంకరంగా, అద్భుతంగా వున్నాడు. నాతో ఒక ఒడంబడింక చేసుకోవాలని వచ్చానని చెప్పాడు. నేను నా శక్తిని అతని జాతిపై ప్రదర్శించటంవల్ల ఒక ఒడంబడిక నాతో కుదుర్చుకోవాలని వచ్చాడు.

"సరే, మీ ప్రతిపాదన ఏమిటి?" అని అడిగాను

"సర్పాలు మీకు హాని చేయవని హామీ ఇస్తాను. మీ మాట అవి శిరసా వహిస్తాయని హామి ఇస్తాను" అని సమాధాన మిచ్చాడు. అందుకు బదులుగా ఏ ఒక్క సర్పాన్ని చంపనని వాగ్దానం చేయమని అడిగాడు. నేను ఒకింత ఆలోచించి చెప్పాను.

"నేను ఆ వాగ్దానం చేయలేను. మీ వాటిలో ఏదైనా మా వాటిపై దాడి చేస్తే నేను నీతో చేసుకున్న ఒడంబడిక దానిని నేను రక్షించకుండా ఆపదు. అయితే చంపటం మా పని కాదు. చంపాలనే చెడు తలంపులు నాకు లేవని రూఢిగా చెపు తున్నాను. నీవు కోరినట్లు వాగ్దానం చేయలేను. అది నా నిర్ణయ స్వేచ్ఛను అరి కడుతుంది" అని అన్నాను.

అతడు జవాబివ్వకుండా వెళ్ళిపోయాడు. పరిస్థితి యధాతథంగా వుండిపోయింది.

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, ఫిబ్రవరి 4, 1961

శ్రీమాత — మార్జాల లోకం

పసివాడి మనస్తత్వంగల ఒక మార్జాలం నా వద్ద ఉండేది. ఎవరో దానికి విషప్రయోగం చేశారు. విషప్రయోగంతో చచ్చేస్థితిలో అది వచ్చినపుడు పిల్లులపై విషప్రయోగం చేసే వారందిరినీ శపించాను.అది తీవ్రమయిన దనుకోండి.

అయితే ఒక మార్గం వుంది.

మార్జాలాలతోను, మార్జాల రాజుతోను ఒక ఒడంబడిక చేసుకున్నాను. మీకు తెలుసా? చాలా కాలం క్రితం జరిగిందది. అది అసాధారణమైనది. (తాంత్రిక స్థాయిలో టెమ్‌సెన్‌లో జరిగింది.) కొన్ని కారణాల వల్ల మార్జాల రాజు ఈ జీవులపై ఒక అధికారాన్నిచ్చాడు. ఇది వాస్తవం. కేవలం వాటిని నేను చూడాలి....

మార్జాలాలు జీవశక్తులు, జీవశక్తుల ప్రతి రూపాలు. మార్జాల రాజు — జాతి అధిష్ఠాన దేవత, జీవ ప్రాణిక ప్రపంచ అస్తిత్వము కలవాడు.

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, ఏప్రిల్ 12, 1961

అనువాదం: ఆకుల కృష్ణ

ఈ ప్రస్తుత మహాశక్తి అవతరణతో... ఆమె పరమాత్మ యొక్క తొలి సాక్షాత్కారం, సృష్టియొక్క మొదటి అడుగు, ఆమె ఆ శక్తులన్నిటినీ రూపొందించింది. ఇప్పుడు భౌతిక ప్రపంచంలో ఆమె అవతరణ వలన, పరమాత్మతో ఆమెకుగల సంబంధం వలన, ఆమె యిక్కడ మానవ శరీరంలో అవతరించుటతో పరమాత్మతో ఆమెకున్న సంబంధం విషయంలో ఇక్కడ ఆమె ఏర్పరుచుకున్న స్థాయితో యితర లోకాలన్నీ ప్రభావితమైనాయి, ఎంతో ఆసక్తికరంగా ప్రభావితమైనాయి....

అనువాదం: డా. సరోజా ప్రసాద్



ప్రశ్న: మధురమాతా, ఇచ్చట మీరన్నారు, శ్రీమాత విశ్వం యొక్క సృష్ట్యాత్మక శక్తి అని. కానీ, భారతదేశంలో మామూలుగా బ్రహ్మ దేవుడు సృష్టికర్త అని అంటారు.

సమా: కానీ శ్రీఅరవిందులు అన్నారు, శ్రీమాత బ్రహ్మదేవుని తల్లి అని. ఆమె సర్వ దేవతలకు మాత.

CWM 7:156

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దేవతలు — మానవజాతి

అనేక మతాల ప్రార్థనలు

ఊర్ధ్వమనస్సు దేవతల ప్రదేశం, దివ్యం మూలంగా గల అస్తిత్వాలు, పర్యవేక్షణ కార్యబాధ్యతను అప్పగించబడినవారు; విశ్వపరిణామమును లక్ష్యం దిశగా నడిపిస్తూ, వ్యవస్థీకృతం చేసేవారు; ఇంకా ఎక్కువ స్పష్టంగా, భూ ఆవిర్భావ సమయము నుంచి వారు సందేశకులుగా, మధ్యవర్తులుగా తోడ్పాటు నందించారు, ఉన్నతోన్నత సీమలనుంచి భూమికి సహాయం తీసుకురావటానికీ, మనస్సు రూపకల్పనకూ, క్రమాను గతికమైన దాని ఆరోహణకూ అధ్యక్షత వహించారు. సర్వసాధారణంగా ఊర్ధ్వమనస్సు లోని దేవతలకే విభిన్న మతాల ప్రార్ధనలు సంబోధించబడ్డాయి. ఈ మతాలు విభిన్న కారణాల ననుసరించి, తరచుగా ఈ దేవతలలో ఒకరిని ఎంపిక చేసుకొని వారిని తమ వ్యకిగత ఉపయోగం కోసం పరమోత్కృష్ట దేవతగా పరివర్తన చేస్తారు.

వ్యక్తిగతమైన పరిణామంలో, ఒకరు తప్పక ఊర్ధ్వమనస్సుకు, దానిని మించి పైకి అతిమనస్సుకు పోయేముందు లేదా దానికి తనకు తాను ఉన్మీలనము అవటానికి ముందుగా, ఊర్ధ్వ మనోచైతన్యానికి అనుసంధానం కలిగిన ఒక క్షేత్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి.

చాలామటుకు అన్ని తాంత్రిక సిద్ధాంతాలు, నియమావళులు అభివృద్ధికి, ఊర్ధ్వమనస్సును స్వాధీనం పరచుకోవటానికి ఉద్దేశించినవే.

CWM 16: 233-234

ఊర్ధ్వమనోదేవతలతో మనుషుల సంబంధాలు

" దేవతల పశువులు మానవులు" అని చెప్పబడింది, కాని మానవులు దానిని ఆమోదిస్తేనే అది సత్యమౌతుంది. మానవ ప్రకృతి అంతస్సత్వంలో అన్నింటి మీద సార్వభౌమత్వాన్ని కలిగి ఉంది, అది తనకు తానుగా అప్రయత్నంగా, ప్రకృతిసహజంగా ఉన్నటువంటిది. కాని అది ఒక రకమైనటువంటి కొన్ని భావాలు మరియు మనం చెప్పుకొనేటటువంటి జ్ఞానం వలన అపభ్రంశమై ఉండకూడదు.

మనిషి తన అస్తిత్వంయొక్క ప్రకృతిలోని అన్ని స్థితుల మీద సర్వ-ఆధిపత్య ప్రభువు అని ఒకరు చెప్పవచ్చు. కాని అతడు అదేనన్న సంగతిని మరచిపోయాడు.

అతని సహజప్రకృతి, స్థితి, సర్వ- ఆధిపత్యం అతడు దానిని మరచిపోయాడు....

సహజంగానే, పరిణామరేఖాచిత్రంలో, మనిషి తన సర్వశక్తిమంతత్వాన్ని మరచి పోవడం తప్పనిసరైన విషయం, కారణం అది అతడిని కేవలం స్వాతిశయంతో, ఆడంబరంతో ఉబ్బితబ్బిబ్బు చేసివేసింది. ఫలితంగా అతడు పూర్తిగా కృతకమై పోయాడు. అతడికంటే ఎన్నో దృఢతరమైన అనేక విషయాలున్నాయని, అతడికంటే ఇంకా ఎక్కువ శక్తివంతమైనవి వున్నాయని అతడికి అనుభూతిని కలుగజేయాలి. కాని ఆవశ్యకంగా అది నిజం కాదు. అది రేఖ పైపైకి పురోగతిలో సాగిపోవటానికై అనివార్యమైంది, అంతే.

అంతస్సత్వంలో మానవుడు దేవుడే. అతడు తనకు తాను యదార్థమైన దేవు డనని విశ్వసించాడు. అతడు భూమిమీద పాకే అత్యల్పమైన క్రిమికంటే ఎక్కువేమీ కాదనే విషయం అతడు తెలుసుకోవలసిన అవసరం ఉంది. అందువల్ల జీవితం అత డిని అనేక విధాలుగా చెక్కి, చెక్కి, చెక్కి, అతడికది తెలిసేదాకా.... తెలుసుకోలేదు. కాని చాలా కొద్దిగా మాత్రం అనుభూతి చెందాడు. కాని అతడు గనక సరైన దృక్ప థాన్ని తీసుకొంటే, వెనువెంటనే అతడికి తాను అంతస్సత్వంలో ఒక దేవుడినేనన్న విషయం తెలుస్తుంది. కేవలం అతడు తప్పక అయి తీరవలసింది ఇదే, అనగా, ఇది కాని దానినంతా అధిగమించవలసిఉంది.

దేవతలతో ఈ సంబంధం, అత్యంత ఆసక్తిదాయకమైనది.... ఈ దివ్య అస్తిత్వాల ఆధిపత్యశక్తి, సౌందర్యం, సాధించిన గొప్పకార్యాలకు మనిషి దిగ్భ్రమకు లోనయినంత కాలం, అతడు వారి బానిస. కాని అవి పరమేష్ఠి విభిన్న అస్తిత్వాలని, అంతకంటే ఎక్కువేమీ కాదని, తనకుతానుగా కూడా అదిగా పరిణమించాలని, అతడికి తటస్థించి నప్పుడు, అప్పుడే సంబంధాలలో మార్పు వస్తుంది. అతడిక ఎంతమాత్రం వారి బానిస కాడు — అతడు వారి బానిస కాడు.

CWM 11: 37-39

దేవతలకు భక్తిపూర్వకంగా చేసేపూజయొక్క ప్రాధాన్యత

ప్రియమైన మాతా, దుర్గ, కాళి దేవతలకు భక్తితో చేసే పూజకు ఏవైనా ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందా?

ఆ పూజా సమర్పణను ఎవరు చేస్తున్నారనే దానిమీద అది ఆధారపడి ఉంటుంది.

అది ఆధ్యాత్మిక విలువను కలిగి ఉన్నదేనా అనేది అంత ముఖ్యమైన విషయం కాదు. యోగ సమగ్రత, పూర్ణసత్యాల పరంగా ఒకరి ఆకాంక్ష ఒకరి రూపానికి లేక మరొకరి రూపానికి పరిమితమై పోకుండా ఉండటం ముఖ్యం. కాని ఆధ్యాత్మిక దృక్పథం ప్రకారం ఏ రూపానికీ పూజచేసినా, దాని గమనం పరిపూర్ణంగా, చిత్తశుద్ధితో కలిగినదైతే, ఆత్మ-సమర్పణ సమగ్రము, సంపూర్ణము అయినట్లైతే, ఆధ్యాత్మిక ఫలితం ఒకే విధంగా ఉండగలదు. కారణం, నీవు ఏ రూపాన్ని తీసుకొన్నా , దాని ద్వారా — ఒక్కొక్కప్పుడు అది ఉన్నా, లేకపోయినా — నీ ఏకాగ్రతయొక్క చిత్తశుద్ధికి ఉండే శ్రద్ధాసక్తుల ప్రకారం, నీ వెల్లప్పుడూ పరమోత్కృష్టమైన మహావాస్తవికతను చేరుకుంటావు.

అందువలననే, ఎల్లప్పుడూ ఏమని చెప్పబడిందంటే, దైవం యొక్క ఏ దృక్పథాన్ని నీవు ఆరాధించినా లేక గురువును ఎంచుకున్నా కూడా, నీవు నీ ఆత్మ సమర్పణలో పరిపూర్ణుడవై సంపూర్ణంగా చిత్తశుద్దిని కలిగిఉంటే గనక, నీవు రూఢిగా నీ ఆధ్యాత్మిక లక్ష్యాన్ని అందుకోగలవు.

కాని, నీవు పూర్ణయోగ సాక్షాత్కారతను కోరుకుంటే, ఫలితం ఎంతమాత్రం ఆ విధంగానే ఉండదు. అప్పుడు నీవు తప్పనిసరిగా ఏ మార్గానికీ నిన్ను నీవు పరిమితం చేసుకోకూడదు. ఏకాగ్రతా మార్గంలో కూడా .... కేవలం ఇవి రెండూ చాలా భిన్నమైన విషయాలు.

CWM 8:243-45

దివ్య అస్తిత్వాలు ఆరాధనకు ఇష్టపడవు

కాని నీవు అసలైనటువంటి దివ్యఅస్తిత్వాలనే తీసుకొంటే, దీనికి వారు ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వరు. వారు ఆరాధనకు ఇష్టపడరు. అది వారికి ఎటువంటి ఆహ్లాదమునూ ఎంతమాత్రమూ ఇవ్వదు! వారు ఆనందంగా ఉండరని అనుకోవద్దు. కారణం వారికి స్వాతిశయంలేదు. స్వాతిశయంవల్లనే మనిషి ఆరాధించబడటానికి ఇష్టపడతాడు, మనిషికి గనుక స్వాతిశయం అనేదే లేకపోతే అతడు ఆరాధించబడటానికి ఇష్టపడడు. ఉదాహరణకు ఒక మంచి ఉద్దేశాన్ని, లేదా ఒక సున్నితమైన అనుభూతిని లేక స్వార్థరహితమైన లేక అత్యుత్సాహంతో, సంతోషంతో, ఆధ్యాత్మిక ఆనందంతో కూడిన ఒక గమనాన్ని వారు గనుక చూస్తే, ప్రార్థనలూ ఆరాధనా పూజా కార్యక్రమాల

కంటే ఈ విషయాలు వారికి అపరిమితంగా గొప్ప ప్రాధాన్యత నిస్తాయి.

నేను చెప్పేది చాలా గంభీరమైన విషయమని నేను నీకు ఆశ్వాసన నిస్తున్నాను. అసలైన ఒక దేవునిని నీవు ఒక కుర్చీలో ఆసీనునిచేసి, ఆయనకు నీవు పూజ చేస్తున్నంతసేపూ అక్కడే ఉండాలని ఒత్తిడి చేస్తే, బహుశా ఆయన నీవు చేసేదానిని చూడటంలో కొంత వినోదం పొందవచ్చు. కాని ఆయనకు కచ్చితంగా అది సంతృప్తిని కలిగించదు. అదీకూడా , ఆయన ఆ పొగడ్తలకు ఉబ్బితబ్బిబ్బైపోడు సరికదా, నీ పూజవలన సంతోషపడడు లేక ఘనతనూ పొందడు. ఆ భావాన్ని నీవు తప్పక వది లించుకోవాలి. ఆధ్యాత్మిక, భౌతిక ప్రపంచాల మధ్య పూర్తిగా ఒక క్షేత్రం ఉంది. అది ప్రాణిక జీవులకు సంబంధించినది. ఈ క్షేత్రం పూర్తిగా వీటితో నిండిపోయి నటువంటిది, కారణం అవి దానిమీదనే జీవిస్తూ ఉంటాయి. దానితోనే అవి సంతోషంగా ఉంటాయి. అది వాటికి తక్షణ ప్రాముఖ్యతను కలిగిస్తుంది, అక్కడ ఎవరైతే అత్యధిక సంఖ్యలో విశ్వాసపాత్రులు, భక్తులు, ఆరాధకులు ఉంటారో, వారు అత్యంత ఆనంద దాయకులు, వారు అత్యధికంగా ఉబ్బిపోయి గర్వంతో ఉంటారు. కాని దేవతలు ఇటువంటి దానికి ప్రాధాన్యత నిస్తారని ఎవరైనా ఎట్లా తలచగలుగుతారు? దేవతలు — నేను అసలైన దేవతలు గురించి మాట్లాడుతున్నాను, వారు ఊర్ధ్వమనోసీమలోని వారైనప్పటికీ కూడా, వారికి కొంత ఇంకా కొంత ... అలా , అలా ... వారు.

చాలా మానవ దోషాలకు బాధ్యులైనట్లుగా, అనిపిస్తుంది. కాని ఇంకా అలా అయినప్పటికీ కూడా, వారికి వాస్తవంగా ఉన్నతోన్నత చైతన్యం ఉంది. వారికది ఏ మాత్రం ఉల్లాసంగా కలిగించదు. నిజమైన ఒక మంచితనం, మేధస్సు, స్వార్థరాహిత్యం లేక సూక్ష్మ మైన అవగాహన లేక ఎంతో చిత్త శుద్ధితో కూడిన ఒక ఆకాంక్ష, అల్పమైన మతకర్మకాండకంటే వారికది అపరిమితంగా ఉన్నతోన్నత మైనటువంటి దవుతుంది.అపరిమితంగా!

CWM 6:194-196

దేవతలు — వారి ప్రతి రూపాలు

చాలా చిన్నపిల్లవాడొకడు ఎవరిదైనా చిత్రాన్ని వేయాలనుకొంటే అది ఆ వ్యక్తి రూపానికి అదే మాదిరిగా పోలి ఉంటుందా? ఇది కూడా అటువంటిదే, ఒక్కొక్కప్పుడు అది ఇంకా అధ్వాన్నమౌతుంది! కారణం, పిల్లవాడు కల్లాకపటంలేని, చిత్తశుద్ధి

కలిగినవాడు, కాని దేవతల ప్రతిరూపాలను చేసే వ్యక్తి పూర్తిగా స్థిరమైన అభిప్రాయాలు, ముందే ఏర్పరుచుకొన్న భావాలు లేదా ఆ విషయంగా ఇతరులు చెప్పిన, పవిత్ర గ్రంథాలలో వ్రాయబడిన, జనులు చూసినవాటితో పూర్తిగా నిండిపోయినవాడై ఉంటాడు. అందువలన అతడు దాని సంతటితో పరిమితమై వుంటాడు. కొన్ని సమయాలలో, అప్పుడప్పుడు, కొంతమంది కళాకారులు, అంతరంగ దృష్టి కలిగినవారు, ఒక గొప్ప ఆకాంక్ష కలిగినవారు, ఒక గొప్ప ఆత్మ పరిశుద్ధి, దర్శనశక్తి కలిగినవారు ఉన్నారు. వారు యుక్తమైన రీతిలో మంచివాటిని చేశారు, కాని అది అత్యంత అరుదైన విషయం. సర్వ సాధారణంగా, అది చాలా మటుకు విరుద్ధంగానే ఉంటుందనే నేను అనుకుంటున్నాను.

నేను ఈ రూపాలను ప్రాణిక, మానసిక లోకాలలో చూశాను, అవి నిజంగా మానవసృష్టికి అనుగుణంగా ఉన్నాయి, సుదూరాల ఆవల నుంచి అభివ్యక్తమయ్యే ఒక శక్తి ఉంది. కాని అనృతంతో కూడినటువంటి ఈ మూడు విధాలైన లోకాలలో, మనిషి నిజంగా భగవంతుణ్ణి తన ప్రతిరూపంగా సృష్టించాడు — కొంత హెచ్చు తగ్గులతో — కొన్ని అస్తిత్వాలున్నాయి, అవి రూపధారణ చేస్తాయి. అవి మానవ ఆలోచనల రూపకల్పనా ఫలితాలు. తెలుస్తున్నదా, అది నిజంగా భయానకం! నేను ఇటువంటి రూపాలను కొన్నింటిని చూశాను.... (నిశ్శబ్దం) అది అంతా చాలా అర్థ రహితం, చాలా దుర్గ్రాహ్యం, మాటలలో చెప్పడానికి వీలు కానిది.... వీరిలో కొంత మంది దేవతలు తక్కినవారి కంటే, చాలా ఎక్కువగానే నిరాదరణకు గురి అయ్యారు. ఉదాహరణకు, పాపం మహాకాళి, నీకు తెలుసు కదా! ఆమెకు ఎటువంటివి ఆపాదించి చేస్తుంటారో!... అది చాలా భయానకం, అది ఊహించ నలవి కానిది! కాని ఈ రూపం కేవలం చాలా నిమ్నలోకంలో వసిస్తూ ఉంటుంది.... అవును, అత్యంత నిమ్నప్రాణిక లోకంలో; మూల అస్తిత్వంలోని దానిని, అది ఏమి కలిగి ఉన్నదనేది వేరే విషయం.... మూలం నుంచి ప్రతిఫలించింది లేశమాత్రం, అది గుర్తింపశక్యం కానిది....

CWM 6;275

ప్రాణప్రతిష్ఠ

...చూడు, ఒక విగ్రహం చేసినప్పుడు, మతగురువు ఒక రూపాన్ని తీసుకురావడం జరిగినప్పుడు — సాధారణంగా జరిగే పద్ధతిలో క్రతువు జరిగినప్పుడు, అతడు తనకు తనను అంతరంగ ఆవాహనస్థితిలో ఉంచుకుంటాడు, దానికి ఆధిపత్యశక్తి నివ్వటానికి ఒక రూపాన్నీ లేదా దేవత నుంచి బయటకు వచ్చేదానినీ కిందికి తీసుకు రావటానికి ప్రయత్నిస్తాడు — ఆ మతగురువు నిజంగా ఆవాహన చేయగలిగిన సామర్థ్యం కల మనిషైతే, అతడు సఫలీకృతుడౌతాడు. కాని సర్వ సాధారణంగా — ప్రతిదానికీ కొన్ని మినహాయింపు లుంటాయి — వీరు సాంప్రదాయానికి అనుగుణమైనటువంటి సర్వ సామాన్య భావాలతో శిక్షణను పొంది ఉంటారు. అందువలన, వారు ఆవాహన చేసేటటువంటి దేవతామూర్తిని గురించి ఆలోచించే టప్పుడు, వారు ఆ దేవతకు ఆపాదించబడ్డ లక్షణాలు, రూపాల గురించే ఆలోచిస్తారు. ఆ ఆవాహన సర్వసాధారణంగా, ప్రాణికలోకంలో ఉన్న అస్తిత్వాలకు, లేదా మహా అయితే మానసిక లోకంలోని వాటికే ఉంటుంది కాని, ఆ మహా అస్తిత్వానికి మటుకు కాదు. చిన్న అస్తిత్వాలు ఒక విగ్రహంలోకి లేక మరొకదాని లోకి వచ్చి అధివసిస్తాయి. ఈ చిన్న దేవాలయా లన్నింటిలో ఉన్న విగ్రహాలన్నీ లేక కుటుంబాలలో ఉన్నవి కూడా — కొంతమంది జనులకు వారి వారి చిన్న ఆరాధనా మందిరా లుంటాయి, నీకు తెలుసు కదా; వారి ఇళ్ళల్లో వారు ఆరాధించే దేవతా ప్రతిరూపాన్ని పెట్టుకుం టారు — ఈ అస్తిత్వాలు వాటిలో అభివ్యక్త మౌతాయి, ఒక్కొక్కప్పుడు పర్యవసానాలు కొంత దురదృష్టకరంగా ఉంటాయి, ఎందువల్లనంటే, ఈ రూపాలు అసలైన మూల దేవతకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంటాయి కాబట్టి.... అవి వక్రమైన రూప చిత్రీకరణలు.

CWM. 6:275-76

మానవరూపాలలోకి అవతరించే దేవతలు

చైత్యజీవితం యొక్క మూలం, మహాపదార్థంలోని దివ్యసన్నిధి రెండూ ఒకటే. అది తెలిసిన విషయం, కాని ఉన్నతోన్నత లోకాలలో కొన్ని అస్తిత్వా లున్నాయి, వారు ఎన్నడూ భూలోకంలో శరీరధారణ చేయలేదు, వారు అక్కడ నుంచే పనిచేయ

దలచుకొంటారు. అందుకోసం వారు కొన్ని చైత్య అస్తిత్వాలు పూర్తిగా అభివృద్ధి చెందేవరకు నిరీక్షించి, వారితో ఐక్యం అయి, వారి ప్రకృతిని బట్టి కొంత పనిచేయా లనుకొంటారు. వారి చైతన్యం భూమి మీద చైత్యచైతన్యంతో కలపబడుతుంది. ఈ అస్తిత్వాలు ఎన్నడూ భూమి మీద జన్మించ లేదు, ఆ అస్తిత్వాలు సృష్టి ముందుకు సాగుతున్న కొలదీ ఎక్కువెక్కువగా తమకు తాము రూపధారణ చేసుకొన్నాయి. బహుశా అవి మొదటి అంశలు, కొన్ని ప్రత్యేక కారణాలతో వాటిని విశ్వంలోకి పంపటం జరిగింది — మనుషులు వాటిని 'దేవతలు' లేదా 'పాక్షిక దేవతలు' గా సంబోధిస్తారు.కనుక వాటిలో ఒకటి, రూపు దిద్దుకున్న చైత్య అస్తిత్వాన్ని బహుశా ఎంపిక చేసుకొని ఉండవచ్చు — అతడు దానికి సహాయం చేస్తాడు, దాని అభివృద్ధిని అనుసరిస్తాడు, ఆ చైత్య అస్తిత్వం పూర్తిగా అభివృద్ధి పొందిన తరువాత, కావలసినంతగా తాదాత్మ్యతకు దృఢత్వాన్ని సంతరించుకొన్న తరువాత, అతడు దానితో ఐక్యం అవుతాడు. భూమిమీద దానితో ఏదో ఒక పనిచేయటానికి దానితో తాదాత్మ్యం చెందుతాడు. ఇది తరచుగా జరిగేదికాదు, కాని అది జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంటుంది. నీవు కథలలో చూసే ఉంటావు, ప్రాచీన సంప్రదాయాలలో దేవతలు భూమిమీద అవతరించడాన్ని, కొన్ని పౌరాణిక గాథలు వాటిని గురించి చెప్తాయి. అది అసలైన నిజానికి కొంత దగ్గర. కాని చైత్య అస్తిత్వాలన్నీ తప్పనిసరిగా ఉన్నతోన్నత లోకాల ఒక అస్తిత్వంతో ఐక్యమై ఉండే అవకాశం లేదు.

CWM 4:184

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

వేల్పుల నుండి ఉద్భవించే రూపాలు

నెమ్మదిగా పదార్థాన్ని ఉద్ధరించి, అది తిరిగి దైవం దగ్గరకు చేరేందుకు తగినట్లుగా అభివృద్ధి చేయడానికి పదార్థంలో విస్తరించుకొని వున్న దివ్య చేతన పరిణామ ఫలితం, చైత్యపురుషుడు. ఈ దివ్య కేంద్రం వల్ల జన్మలన్నింటి ద్వారా, చైత్య పురుషుడు క్రమక్రమంగా రూపం సంతరించుకొన్నాడు. ఎదుగుదలలోనూ, రూపం తయారుకావడంలోనూ ఒకవిధమైన పరిపూర్ణతా స్థితికి చేరుకొనే సమయం వస్తుంది. దైవసాక్షాత్కారం పొందాలనీ, దైవాన్ని యింకా ఉత్తమంగా అభివ్యక్తం చేయాలని దానికి ఆకాంక్ష వుంటుంది. పదార్థంలో అంతర్లీనమై వున్నదాని నుండి ఒక అస్తిత్వాన్ని

తనవైపు ఆకర్షిస్తుంది. దానినే అధిమానసమని శ్రీఅరవిందులు చెప్తారు. అస్తిత్వం అప్పుడు చైత్య పురుషునిలో అవతరించడానికి దిగివస్తుంది. ఈ కలయిక జరిగినపుడు సహజంగా చైత్యపురుషుడు అదివరకటి కంటె ఉన్నతుడౌతాడు. తనలోనికి దిగివచ్చిన అస్తిత్వపు స్వభావంలో పాలుపంచుకొంటాడు. అపుడు దానికి తననుండి తనలాంటి అస్తిత్వాలను ఉద్ధరింప జేయగల శక్తి లభిస్తుంది. అంటే తమలో ఒక అంశను తమ లోనుండి బయ టకు వెలువరించగలుగుతారు. అది స్వేచ్ఛకలదిగా తయారై యితరులలో తనను అవతరింప జేయగలుగుతుంది. అందుచేత రెండు మాత్రమే గాదు, మూడు లేక నాలుగు లేక అయిదు ప్రతిరూపాలుగా కూడా తయారవుతాయి. అది సందర్భాలను బట్టి వుంటుంది. అంటే, ఒకే అంతరాత్మిక దైవాన్ని మూలంగా కలిగివుంటాయి యివన్నీ అని చెప్పవచ్చు. సాధారణంగా అనేక ప్రతిరూపాలు వున్నప్పుడు విభిన్న వ్యక్తులు, తాము అదే జీవికి సంబంధించిన వారమని అనుకోవడం జరుగుతుంది. అది నిజం కూడా. ఎందుకనంటే అధిదేవతకు సంబంధించినది కొంత యేదో వాళ్ళలో వుంది. అధిదేవతలో ఒక అంశ తననుండి తననే మరో అస్తిత్వంగా పోత పోసుకొని, స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. అది తనకు తాను రెట్టింపు జేసుకోవడం గాదు, ఒక విధమైన ఆత్మ-ప్రక్షేపం.

CWM.5:263-64

మనిషిలో వున్న అంతరాత్మ అతనిని విశిష్టునిగా చేస్తుంది

మనిషిని విశిష్టజీవిగా చేసేది అతనిలోవున్న అంతరాత్మ. దీన్ని గురించి యెంతో యెక్కువగా చెప్పడం నా కిష్టం లేదు. ఎందుకనంటే అతడు ఈ సరికే తనను గురించి యెంతో గొప్పగా భావించుకొంటున్నాడు. తనమీద తనకెంతో ఉన్నతమైన అభిప్రాయం వున్నది గనుక, దానిని మరింతగా ప్రోత్సహించవలసిన అవసరంలేదు. అయినా అది వాస్తవం. ఎంత వాస్తవమంటే కొంత మంది, వాళ్ళు దైవాంశ సంభూతులు లేక దేవుళ్ళు అని కూడా పిలువబడే జగత్తుయొక్క యితర పరగణాలకు చెందిన జీవులున్నారు. ఉదా: శ్రీఅరవిందులు అధిమనస్సు అనిపించే పరగణాకు చెందినవారు. వాళ్ళకు అంతరాత్మ సంబంధమైనది వుండదు గనుక భూమిమీద, భౌతికదేహాన్ని స్వీకరించడానికి ఆరాటపడేవాళ్ళున్నారు. ఈ జీవులకు మనుషులకులేని అనేక లక్షణాలున్నాయనేది వాస్తవం. మరెక్కడాలేని, భూమిమీద మాత్రమేవున్న

పూర్తిగా విశిష్టమైన యీ దివ్య సన్నిధి వాళ్ళలో లేదు. ఉన్నత మనస్సు, అధిమనస్సు తదితర ఉన్నత లోకాల, పరగణాల నివాసులైన వీళ్ళందరకు చైత్యపురుషుడుండడు. ప్రాణికలోకాల జీవులకు కూడా అంతరాత్మిక సంబంధమైనది వుండదు. కాని వీళ్ళు అందుకు విచారించరు. వాళ్ళు దాన్ని కావాలనుకోరు. మార్పు చెందాలని కోరుకొనే వాళ్ళెక్కడో అరుదుగా కొద్దిమంది మాత్రమే వున్నారు. మార్పు కోసం వాళ్ళు ఆలస్యం చేయకుండా వెంటనే ఒక భౌతిక దేహాన్ని ధరిస్తారు. భౌతికదేహం తమను బంధిస్తుందని, ఒక నియమానికి కట్టి పడవేస్తుందని అనుకొని యితరులు దానిని కావాలనుకోరు. కాని అదొక వాస్తవం. అంతరాత్మికమైన దానిని తనలో కలిగి వుండడం అనేది మానవ జీవికి గల ఒక అపురూపమైన లక్షణం, నిజం చెప్పాలంటే అతడు దానినుండి, పూర్తి ప్రయోజనాన్ని పొందటం లేదని చెప్పక తప్పడంలేదు. ఈ సన్నిధానాన్నతడెలా గౌరవిస్తాడనేది చూస్తే, ఇది చాలా చాలా వాంఛనీయమైన లక్షణంగా భావించడం లేదన్నట్లు కన్పిస్తోంది — సరిగ్గా అతను చేస్తున్నదదే! దానివైపుకన్న మానసిక భావాలవైపే మొగ్గుచూపుతున్నాడు. అతని ప్రాణికపు కోర్కెల మీద, భౌతిక అలవాట్ల మీద యెక్కువ మక్కువ చూపిస్తున్నాడు.

CWM.6:161

వేల్పులను పట్టించుకోవడంలేదు

థియోను నాకు తెలిపిన సంప్రదాయానికి సంబంధించిన జీవులందరితోనూ, భారతీయ సంప్రదాయంలో వివరించబడిన జీవులందరితోనూ నాకు సచేతన సంబంధాలున్నాయి. వాస్తవానికి నాకు తెలిసినంతవరకు మతాలన్నింటి దేవతలందరితోనూ నాకు సంబంధాలుండివున్నాయి. ఒక శ్రేణి (సంజ్ఞ) వున్నది. మొత్తం క్రిందినుండి ... ప్రాణికంలో సైతం, మానసిక సీమలోనూ కొందరున్నారు. మనిషి అనేకమైన వాటిని దేవుళ్ళుగా చేసాడు. కచ్చితంగా తనలాగా లేనట్లుగా కన్పించే వాటన్నింటినీ వెంటనే దేవుళ్ళను చేసాడు. భావాలను యధాతథంగా గ్రహించగలిగిన వాడివైతే, వాటన్నింటితోనూ సంపర్కం పెట్టుకోగలుగుతావు. వాటన్నింటికీ వాటి స్వకీయ సత్యత, అస్తిత్వం వున్నాయి.

భూమికి దగ్గరగా, భూమికి ఊర్ధ్వంలో వుండి భూమిని (అత్యంత ఉన్నతోన్నత మనస్సుతో సహా) మనస్సును గమనిస్తున్నాయి. కాని పరిణామం — బాగా ఘనీ

భవించిన, అధికంగా కేంద్రీకృతమైన, దాని ప్రత్యేక నడక, మొత్తం జగత్పరిణామం మీదకంటె అధికంగా ఐహిక పరిణామం మీదకు త్రిప్పబడి వుంది. ఈ భూసంబంధ పరిణామం మానవ జాతితో అధిమానస పరగణాను, దేవుళ్ల పరగణాను దాటి, ఒక ఉన్నతతర ప్రధాన తత్త్వాన్ని సరాసరి చేరగల ఒక ఉన్నతతర ధీశక్తిని సృజించింది.

కాని యీ అధిమానస పరగణా జగత్తును, పాక్షికంగా భూమిని శాసించగల ఈ దేవుళ్ళ ప్రాంతానికి స్వకీయ సత్యతవుంది. నీవు దానితో సంపర్కం పెట్టుకోవచ్చు. దానినుపయోగించవచ్చు. వైదిక "పితరులు" దానినుపయోగించారు. రహస్యవాదులు దాన్ని ఉపయోగించారు. తాంత్రికులు సైతం దాని నుపయోగించారు. దేవుళ్ళను విశ్వసించకుండా వాళ్ళను ప్రక్కన పెడ్తూ, అతిమానస వెలుగు వైపు ఒక విధమైన బౌద్ధిక సన్యాసం ద్వారా రూపాలు, ప్రతిబింబాలను, ఛేదించే ప్రకటనలను ప్రక్కన బెట్టి, ఆభిజాత్యంతో, పరిశుద్ధంగా భాణంలా సరాసరి దూసుకుపోయే మరో మార్గం కూడా వుంది. అదొక సజీవ అనుభవం.

ప్రతి దాన్ని కలుపుకుంటూ పోయే ఒక పూర్ణయోగాన్ని శ్రీఅరవిందులు బోధించారు. కాబట్టి అన్ని అనుభవాలూ కలుగుతాయి. నిజానికి ఒకరి అనుభవ క్షేత్రంగా జగత్తు స్వచ్ఛంగా సృజించబడింది. కొంతమంది, దగ్గరి, తిన్నని, యిరుకైన దారులను యిష్టపడతారు. అది వాళ్ళ వ్యవహారం. మిగతావాళ్ళు దారి వెంట కాలక్షేపంచేస్తూ పయనించటానికి ఇష్టపడతారు. ఇది వీళ్ళ వ్యవహారం.

కొంతమంది అనుభవాలన్నింటినీ పొందడానికి ఆకర్షితులౌతారు. ఆ విధంగా వాళ్ళు అధిమానసలోకం ద్వారా సుదీర్ఘకాలంపాటు సంచరిస్తూ ముందుకు పోతారు. మతపరమైన ఆకాంక్షాపరులలో అధికులు అనేకరకాల దేవతల సంపర్కంలోనికి పోయి అచటే ఆగిపోతారు. అది చాలు వాళ్ళకు.

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, సెప్టెంబరు 26, 1962

దేవుళ్ళు లేకుండా జీవించగలం

దేవుళ్ళ అనుభవం, ఒక ప్రతిబంధకం కంటె నా కెప్పుడూ అధికమైనదిగా కన్పించలేదు — ఒక వినోదకర, ఆనందకర ప్రక్కదారి అది. అనుభవాల్లో యేదీ కూడా అత్యావశ్యకమైనదనీ, అనివార్యమైనదనీ అన్పించలేదు. నీ అనుభవాలన్నింటి విలాసంతో నిన్ను నీవు ఆనందింపజేసుకోవచ్చు. అవి నీ జ్ఞానాన్ని, నీ యిదినీ, నీ

అదినీ పెంచుతాయి.కాని అదేమంత ప్రత్యేకత గల విషయం గాదు. అసలు విషయం అందుకు పూర్తిగాభిన్నం.

దేవుళ్ళు లేకుండా మనం బ్రతకవచ్చు. ఈ అనుభవాల్లో యేదీ లేకుండా మనం అతిమనస్సుకు పోవచ్చు. అవి అనివార్యం కావు. కాని జగత్తు గురించి తెలుసుకొని అనుభవాన్ని పొందాలనుకుంటే, పరాత్పరుడు దర్శనమైనపుడు ఆతనితో తాదాత్మ్యత సిద్ధించాలనుకొంటే మంచిది. ఇదంతా వివిధ తరగతులలో, వివిధశక్తులతో ఆతని వ్యక్తీకరణలో భాగమే. ఇదంతా అతని అనుభవంలో భాగమే. కాబట్టి ఆ ఐశ్వ ర్యాన్నెందుకు భోగించవు? అది చాలా ఆసక్తికరంగా వుంటుంది — కాని అనివార్యం కాదు.

ఒకసారి నీవు పరాత్పరునితో తాదాత్మ్యంచెందినపుడు భూమిమీద ఒక కార్య నిర్వహణకు నిన్నాతడెంచుకున్నప్పుడు, అతడు సహజంగానే వీటన్నింటినీ నీకు అనుగ్రహిస్తాడు. ఎందుకనంటే అది నీ కార్యనిర్వహణాశక్తిని ఇతోధికం చేస్తుంది. అంతే. అది అంతవరకే....

నేను చెప్పినట్లు ఆ భూమికకు అవతలకి మనం వెళ్ళవచ్చు, లేక అదేమిటో తెలియకుండానే దానిలోనుండి సాగిపోవచ్చు. నీవు వెళ్లవలసివున్న మార్గంలో ఆరోహించకపోతే, దేవుళ్ళను పట్టించుకోకుండా ప్రక్కగా పోవ ప్రయత్నిస్తే, నీకు అమంగళం జరుగుతుంది, నీ దారి మూసుకు పోతుంది, అని వేదాల్లో నాకు ఆసక్తి కలిగించిన విషయాన్ని చదివాను — నీకు గుర్తుందా అది? అదంటే యేమిటో నీకో భావం ఏర్పడి ఉంటుంది. అదొక మధ్యస్థ ప్రదేశం, భూమికన్న యెంతో ఉత్కృష్టమైనది, కాని యింకా అది మధ్యస్థ ప్రదేశమే. అందులో ఆగకుండా ముందుకు పోవడానికి కొంతమంది ప్రయత్నించారు. అక్కడుంటే నీకు యిబ్బందులు కలుగుతాయని చెప్పారు. వ్యక్తిగతంగా నేను మాత్రం నా అనుభవాన్నే చెబుతాను. అక్కడ ఎప్పుడూ సోదరభావం వుంటుంది — అది నీ వూహకందుతుంది. వాళ్ళను నేనెరుగు దును. వాళ్ళతో నాకు స్నేహసంబంధాలున్నాయి. కాబట్టి వాళ్ళను కాదనడమా లేదా అనే ప్రశ్నలేదు.

ఆ లోకం, యింకా కూడా మనయొక్క ఒక అతిశయించిన రూపం అని నాకో దృఢ భావన ఉంది. పైగా అది పాత మార్గంలో ఒక భాగం. దానికీ అతిమానస సృష్టికీ యేమీ సంబంధం లేదు. అది అత్యుత్కృష్టమైనదానినని, ఒక ప్రత్యేకత

కలదాన్ననే భావనను భూమికి కలిగిస్తుంది.

ప్రాథమికంగా అది పాత దారి భాగం. మనకు తెలిసిన విశ్వరూపమంతటి ఒక పర్యవసానం. కీడు అత్యావశ్యకం అని నమ్మే వాళ్ళు, అది సృష్టి అనే అనూహ్య సంఘటన పర్యవసానం అంటారు. కాని అది అనూహ్యసంఘటనేనా? నా సందేహాలు నాకున్నాయి. అది ఇంకా బయటపడవలసివుంది. అది పూర్తయ్యేదాకా ... మనకు తెలియదు.

దేవుళ్ళు ఈ మలుపులకు చెందినవాళ్ళు. అధిమనస్సు ఈ వంపుకు చెందినది.

...

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, సెప్టెంబరు26, 1962

మతాల కాలం — నూతన సృష్టి

ఏదేమైనా క్లుప్తంగా చెప్పాలంటే స్వభావసిద్ధంగా, పాత ప్రపంచం, శ్రీఅరవిందులు చెప్పే అధిమనస్సు సృష్టి, దేవుళ్ళకు సంబంధించినకాలం, తత్ఫలితంగా అది మతాల కాలం అయింది. నేను చెప్పినట్లు మానవ జాతికి ఊర్ధ్వాన ఉన్నదాని వైపు వికసించే మానవ కృషి అనేక మతరూపాలను సృష్టించింది. అదృశ్యలోకానికి ఉత్తమ అంతరాత్మలకు మధ్య మతపరమైన బాంధవ్యం యేర్పడటానికి కారణమైంది. దానంతటి శిఖరంపైన ఒక ఉన్నత సాక్షాత్కారం వైపు జరిగిన కృషి ఫలితంగా మతాల ఏకత్వభావన ఈ అభివ్యక్తులన్నింటి వెనుక వున్న యీ ఒకే ఒక్క వస్తువును గురించిన భావన ఉద్భవించింది. చెప్పాలంటే ఈ భావన నిజానికి మానవ ఆకాంక్ష చిట్ట చివరి హద్దు. సరే, అది సరిహద్దు దగ్గరి విషయం. అదేదో అధిమనస్సు లోకానికి పూర్తిగా అధిమనస్సు సృష్టికి సంబంధించినదే యింకా. మానవాకాంక్ష అచటి నుండి యీ 'మరో వస్తువు' వైపు, అది గ్రహించలేని ఒక నూతన సృష్టి వైపు — చేరుకోవాలని ప్రయత్నిస్తుంది, గ్రహింపు కొస్తున్నట్లే సంవేదిస్తుంది, కాని గ్రహించ లేదు. దానిని గ్రహించడానికి, మొదటి నడకకు విరుద్ధమైన నడక అవసరం అవుతుంది. అధిమనస్సు సృష్టిని విడిచి వేయవలసిన ఆవశ్యకత కలుగుతుంది. నూతన సృష్టి, అతిమానస సృష్టి జరగవలసి వుంది. ఇప్పుడు గతకాలం నాటివన్నీ యెంతో పాతవిగా, కాబట్టి కాలం చెల్లినవిగా, అనుమానించ దగినవిగా కన్పిస్తాయి — నిజమైన సత్యం ఆ విధంగా నవ్వుల పాలైంది. అతిమానస సృష్టిలో, యెటువంటి మతాలూ యెంత

మాత్రం వుండవు. ప్రపంచంలో అభివ్యక్తమౌతున్న, దివ్య యేకతా రూపాలుగా వ్యక్తమౌతూ వికసిస్తున్నదే మొత్తం జీవనం. మనుష్యు లిపుడు చెప్తున్న దేవుళ్ళు యిక ముందుండరు. ఈ గొప్ప దివ్యజీవులు తమంత తాము నూతన సృష్టిలో పాలు పంచుకో గలుగుతారు. కాని అలాచేయడానికి భూమి మీద మనం 'అతిమానస ద్రవ్యం' అని పిలుస్తున్న దానిని వాళ్ళు ధరించివలసి వుంటుంది. తమ ప్రపంచంలో యిప్పుడున్నట్లుండి పోవాలని వాళ్ళు కోరుకొంటే, భౌతికంగా అభివ్యక్తం కాగూడదని నిశ్చయించుకొంటే, అతిమానస భువి జీవులతో వాళ్ళ బాంధవ్యం మిత్రులుగా, సహకరించుకొనేవారి మధ్య వుండే సంబంధంగా, సములుగా అవుతుంది. ఎందుకనంటే అత్యున్నత దివ్యతత్త్వం భువిపై నూతన అతిమానస ప్రపంచ జీవులుగా అభివ్యక్తమౌ తుంది గదా.

CWM 9:150-51 — స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

దేవతల నుండి విముక్తి

ఓ వరుణదేవా, నాలో నీ విశాలతను సంతరించుకో;
ఓ ఇంద్రా, నాలోని అంతర్గత శక్తిగా వెలుగొందు;
ఓ సూర్యదేవా, ప్రచండ తేజస్సుతో ప్రకాశించు;
ఓ శశాంకా, పరిపూర్ణ మాధుర్యంతో ఆకర్షించు;
ఓ రుద్రుడా, భయంకరుడవై విజృంభించు;
ఓ మరుత్తులారా, అతి వేగంతో ప్రచండ మవండి;
ఓ ఆర్యమా, బలోపేతుడవై, ధైర్యశాలివి కమ్ము;
ఓ మహాభాగా, భోగలాలసుడివై ఆనందించు;
ఓ మిత్రదేవా, మృదువై, దయార్ధ్రుడవై ప్రేమను సంతరించు.
ఓ ఉషోదయమా, వెలుగులు నింపి అంతా వ్యక్తపరచు;
ఓ నిశీధమా, భావుకతతో గంభీరు రాలవు కమ్ము;
ఓ ప్రాణమా, సమృద్ధమై, ఉత్సాహముతో సంసిద్ధురాలవు కమ్ము;
ఓ మరణమా, నా గమ్యం వైపు నన్ను మున్ముందుకు గొనిపొమ్ము;

ఓ బ్రాహ్మణ్య జీవీ, వీరందిరినీ సమైక్యపరచు;
ఓ కాళీమాతా, నన్ను ఈ దైవాల నుండి విముక్తుడను చేయుదువు గాక!

ఆ విధంగా శ్రీఅరవిందులు మహాకాళికను గొప్ప విమోచన శక్తిగా అభివర్ణిస్తారు. ఆమె నిన్ను అభివృద్ధి దిశగా సాగిపోవునట్లు ప్రేరణ చేయగలదు. నీ మార్గాన్ని ఆటంకపరచే బంధనాలను తొలగించ గలదు. ఇదే విషయాన్ని నీ ధ్యానానికి తగిన విషయంగా కూడా నీవు భావించవచ్చు.

శ్రీఅరవిందులు కాళీమాతకు ప్రముఖ స్థానం ఇవ్వటానికి గల కారణాలు

దైవాల గుణాలను మనం గ్రహించి పాటించటం అవసరమే. అందులకే శ్రీఅర విందులు వారిని తనలోనికి రమ్మని ప్రార్థిస్తారు. కాని, పరమోత్కృష్టమైన దివ్యత్వం పొందగోరేవారికి మాత్రం కేవలం ఈ శక్తులే చాలవు. అందుకే చిట్టచివరగా వారు కాళీమాతను అర్థిస్తారు. ఆమె మాత్రమే సాధకుని ఈ దేవతల ప్రభావాలకు అతీతంగా, ఊర్ధ్వదిశగా నడిపించగల దివ్యశక్తి అని వారి నమ్మకం. శ్రీకాళీమాత విశ్వమాత. సృష్టిలోని మిగిలిన దైవాల కంటె ఆమె శక్తి అతీతమైనది. ఆమెలో ఐక్యం కావటం అంటే అనంత శక్తినీ, పరిపూర్ణతనూ సంతరించుకోవడమే!

దైవ స్వరూపాలన్నీ ఒక యెత్తయితే, మహాకాళి ఒక్కటే ఒక యెత్తు. అందుకే శ్రీఅరవిందులు ఆమెకు అంత ప్రాధాన్యం ఇచ్చారు.

దేవతల కన్నా మానవుడే మిన్న, దైవానికి దగ్గరవాడు

భూమిపై కొలువున్న దేవతలూ, దానవులూ, అగోచర శక్తులూ మానవుల కంటె మిన్న కాదు. మానవులకు మాత్రమే ఉండగల మనోమయ అస్తిత్వం ఇతర జీవులకు లేదు. మానవులకు ప్రేమ, కరుణ, దయ వంటి సహజ లక్షణాలు వుంటాయి. ఇవి అతని బహిర్లోపాలను మరుగుపరచ గలవు. ఈ విధమైన మానవ లక్షణాలు దివిజులలోనూ ఉండవు; దైత్యులలోనూ ఉండవు. అందువలన మానవుడే భగవంతునికి సన్నిహితంగా ఉండగలడని చెప్పవచ్చును. దైవాలకు గుణ, దోషాలు అన్వయించవు. దైవాలు తమ తమ ధర్మాలను అనుసరించి యాంత్రికంగా చరిస్తూ వుంటాకు. ఊర్ధ్వం నుండి చూస్తే వాటికి గల లోపాలేవో తెలుస్తుంది.

ప్రేమ, త్యాగశీలత అనే లక్షణాలు ఉండటం వలన మానవుడు దేవతలకు కూడా ఉండని శక్తులు పొందినట్లయింది. అహంకారాన్ని అదుపులో వుంచుకోగలిగితే, మానవుడే దైవాల కన్నా అధికుడు కాగలడు.

ఈ విధంగా అదుపును సాధించిన నాడు మానవుడు దైవస్వరూపాల కంటే సహజంగా పరమాత్మను చేరగలడు. మానవులు తమంతట తాముగా, అసంకల్పితంగా పరమాత్మను చేరుకోలేరు. కాని ఆ రకమైన స్తోమత వారిలో అంతర్గతంగా వుంది. వారి నిర్మలమైన ప్రేమ ఈ విషయంలో వారికి తోడ్పడుతుంది. కాని దురదృష్ట వశాత్తూ ప్రస్తుతం మానవప్రేమ స్వార్థప్రేమ అయిపోయింది. అది త్యాగాన్ని కోరదు; స్వలాభాన్ని మాత్రమే కోరుతుంది. నీ స్వలాభం వదలుకొని నీవు ఎవరినీ ప్రేమించలేవు.

CWM 15:355-60

ప్రశ్న: శ్రీఅరవిందుల యోగంలో ఉన్న సాధకులు ఇతర దైవాల విషయంలో ఎలా వుండాలి?

సమా: వారికి ఇతర సాధకులపై మంచి భావన ఉండాలి. అందరు దేవుళ్ళనూ, మతాలనూ గౌరవించాలి. మతసామరస్యాన్ని సాధించాలి. అదే సమయంలో వివేకవంతమయిన నిరాసక్తత కూడా వుండాలి. అధిమానస చేతనలో ఉన్నవారు ఎవరి పరిష్కారం వారు వెతుక్కోవలసిందే. అంతే!

CWM 12:308

దేవుళ్ళపై నమ్మకం వున్నవారు వారి వారి ఆరాధనలను కొనసాగించవచ్చు. కాని మతాలతో, ఆరాధనలతో శ్రీఅరవిందుల సాధనకు ఎట్టి సంబంధమూ లేదు. వారి యోగంలో 'అతిమానస సిద్ధి' యే అంతిమ లక్ష్యం.

CWM 13:14

నా మట్టుకు నాకు ఈ దేవుళ్ళను ఆరాధించవలసిన అవసరం లేదనే అనిపిస్తుంది. అన్నిటా ఉన్న పరమాత్మను ఆరాధిస్తే, అందరినీ, అన్నిటినీ ఆరాధించినట్లే.

CWM 10: 244

శ్రీమాత

పరమాత్మ ఏ స్థాయిలోనైనై ఉండగలడు. ఆయన ఉన్నతుడు. ఇతర స్థాయిలన్నీ దానికంటే దిగువన మాత్రమే ఉండగలవు. అన్నిటినీ దాటినపుడే గదా పైస్థాయికి వెళ్ళగలిగేది!

పూర్ణయోగానికి 365 వ్యక్తిత్వాలు ఉంటాయని కొందరు అతీంద్రియవాదులు (మార్మికులు) అంటారు. ఇంకా ఎన్నయినా ఉండవచ్చు. వేదాలు ముగ్గురు దేవతలను గురించి, ముప్పది మూడు దేవతలను గురించి, మూడు వేల దేవతలను గురించి, ముప్పది మూడు వేల దేవతలను గురించి కూడా ప్రస్తావించాయి. ఇవన్నీ మానవులలోనే వుంటాయి. కాని దేహ, మనః, ప్రాణాలు మాత్రం మూడు ముఖ్యమైన స్థాయిలని భావించవచ్చు.

CWM 15:335

శ్రీమాత

ఒక్క విషయం. దేవుళ్ళు ఎవరూ పరమాత్మ విషయంలో మానవులకు సాటిరారు. దేవదేవునితో మానవులకు ఉన్న సాన్నిహిత్యం వారికి వుండదు. మానవులకు మనోమయ జీవితం ఉంటుంది. అందువలన మానవులు భగవంతునికి దగ్గరగా వున్నట్లే గదా! దైవాల రూపాలు కేవలం 'ఆవిర్భావాలు'. అవి ఒక ప్రత్యేక కార్యక్రమం కోసం ఆవిర్భవిస్తాయి. వాటి లక్ష్యం నెరవేరగనే అవి అంతర్థానం అవుతాయి. వాటికి పరమాత్మతో చేతనాత్మక సంబంధం వుండదు. అది మానవులకు మాత్రమే ఉంటుంది. జీవాత్మ మాత్రమే పరమాత్మను తనలో ఇముడ్చుకోగలదు.
ఇదే ఉన్న తేడా!

శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణలు, జూన్ 30, 1962

అసంఖ్యాక జీవాత్మల అద్భుత ఏకైక మాత

ఒక సాధకుని వ్యక్తిగత దినచర్య నుండి గ్రహించబడిన విషయం ఏమిటంటే శ్రీమాత తమ నిరంతర కార్య వ్యగ్రతలో కూడా సాధకుల వ్యక్తిగత, సామూహిక సాధనలో ముందుండి నడిపిస్తూ వుంటారు. సాయంత్రం వేళ సుమారు 8 గంటలప్పుడు పది లేక పన్నెండు మంది బాలికలు కనపడూతూ ఉండేవారు. అది ఆమె ధ్యానానికి క్రిందకు దిగే సమయం. చాలా సార్లు శ్రీమాతను దర్శించాలంటే ఆ బాలికలు రాత్రి 10 గంటల వరకు వేచి యుండాల్సి వచ్చేది. ఒక్కొక్కసారి భోజనం కూడా





నేనెవరో మీకు తెలియదు. మీ మధ్యన ఉన్న అజ్ఞానం లోనికి ఎందుకు దిగి వచ్చానో ఎందుకు భౌతికంగా మానవాకృతిలో ఉన్నానో మీరు తెలుసుకో లేరు. నేనెవరినో కూడా మీరెరుగరు. మీరు ఆరాధించే దేవతలు కూడా నన్ను చూడాలంటే తపస్సు చేయాల్సిందే! నా కోసమే, నా ద్వారానే ఈ ప్రపంచం ఆవిర్భవించి, నా చేతనలోనే ప్రతిస్పందిస్తున్నది. ఈ చరాచర జగత్తంతా వర్తించేది, నర్తించేది నా వల్లనే. నాలో లేనిది ఏదీ లేదు. కారణాన్ని, కార్యాన్ని నేనే. ఈ కనపడేది, లయమయ్యేది నా లోనే సర్వం నా ద్వారా ఉద్భవించి, నాలోనే లయం అవుతుంది. నా గురించి ఏ మాత్రం తెలిసినవారైనా వారి సర్వస్వం నాకు అర్పించటానికి సంసిద్ధులౌతారు. ఈ దృశ్యమాన జగత్తుకు ఈవల, ఆవల నేను ఉంటాను.

Supreme, p. 11

శ్రీమాత

వదులుకోవలసి వచ్చేది. ఆకలి వేసేది, నిద్ర వస్తుండేది. శ్రీమాత సాధకులతో సమావేశం ముగిశాక ధ్యానానికి దిగి వస్తూ వుండేవారు. ఒక రోజు ఆ బాలికలలో ఒకరు ఎదురు చూసి, చూసీ ఇంక వుండలేక, తెచ్చుకున్న పూవులు అక్కడ ఉన్న పళ్ళేరంలో ఉంచి వెళ్లింది. అనుకోకుండా అదే సమయంలో శ్రీమాత అక్కడకు వచ్చారు. ఇలా కాకతాళీయంగా జరగడం వారికి ఆశ్చర్యం వేసింది. ఇదొక మహత్తర పరీక్ష!

శ్రీమాత వారిని సమీపిస్తూనే "ఇక్కడ పువ్వులు వదలి వెళ్ళింది ఎవరు" అని అడిగారు. "ఓహో, ఫలానా అమ్మాయా, ఆశ్చర్యంగా వుందే! ఒక్క క్షణం కూడ ఓపిక పట్టలేరా నా కోసం? అంత అసహనమా? దేముళ్ళూ, దేవతలూ నన్ను చూడాలని ఎంత తహతహ లాడతారో మీకు తెలుసా? యోగులు, సాధువులు నన్ను ధ్యానంలో చూచి ధన్యుల మైనామని ఎంత ఆనందిస్తారో మీకు తెలియదు; ఒక్క నిముషం నన్ను చూచినా చాలు వారికి!"

"అమ్మా", అన్నది వాళ్ళలో ఒక అమ్మాయి, "మేము మిమ్మల్ని మా స్నేహితు రాలిగానే చూస్తాము. చెట్టు నీడన వున్నప్పుడు చల్లని నీడయే కదా మాకు అర్థమ య్యేది!" అంది.

ఈ కమనీయ భావం శ్రీమాతలో వున్న తీవ్రత నంతా పోగొట్టి ఆ బాలికను తన చేతుల్లోకి తీసికొనేలా చేసింది.

Twelve Years wih Sri Aurobindo, p. 16

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2017



ధనం విలువ

విషయ సూచిక

Statement about ownership and other particulars concerning

'AKHILA' AKHILA BHARATA PATRIKA Magazine


Form No. IV

(1) *Place of Publication*: Sri Aurobindo Society, 11, Saint Martin Street, Puducherry – 605 001; (2) *Periodicity of Publication*- Monthly; (3) *Printer's Name, Nationality, and Address*: Swadhin Chatterjee, Indian, Sri Aurobindo Ashram Press, Puducherry - 605002; (4) *Publisher's Name, Nationality, Address*: Pradeep Narang, Indian, Sri Aurobindo Society, 11, Saint Martin Street, Puducherry – 605 001; (5.) *Editor's Name, Nationality, Address*: A. Kailasapathi, Indian, Plot No. 25, Door No. 5-7-23, B.N. Reddy Colony, Behind Vanasthalipuram, R. R. District, Hyderabad – 500070, Telangana; (6) *Names and addresses of individuals who own the Newspaper and partners or shareholders holding more than one per cent of the total capital*: Sri Aurobindo Society, No. 11, Saint Martin Street, Puducherry – 605 001

I, Pradeep Narang hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1 March 2017

(Sd) Pradeep Narang
Signature of Publisher



సంపదలన్నీ దైవానికే చెందుతాయి. దైవమే వాటిని జీవరాసులకు అప్పుగా ఇస్తాడు, అవి తప్పకుండా సహజంగానే ఆయననే చేరి తీరాలి.

*

చైత్యప్రభావంలో సంపద: సంపద దాని అసలైన భోక్తయైన దైవానికే చేరడానికి సిద్ధంగా ఉన్నది.

*

ఈ ప్రపంచంలోని ధనమంతా చిట్టచివరికి దైవవ్యతిరేక శక్తుల బానిసత్వము నుంచి స్వతంత్రము గావించబడి, తనకు తానే అప్రయత్నంగా, సంపూర్ణంగా భూమి మీద దివ్యకర్మ సేవలో నియోగించబడే ఒక రోజు తప్పక వస్తుంది.

CWM 15:48-49 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ధనము — నూతన చైతన్యము

రాజకీయాలు, ద్రవ్యప్రపంచము గట్టిగా ప్రతిఘటిస్తాయి

రెండు విషయాలు గట్టిగా ప్రతిఘటిస్తాయి — రాజకీయాలతో ముడిపడినదంతా, ధనంతో ముడిపడినదంతా. ఈ రెండు విషయాల పరంగా మానవ వైఖరిని మార్చడం అత్యంత కష్టం. మేము ఈ వరకే చెప్పినట్లుగా, తత్త్వతః రాజకీయాలతో విభేదమేమీ లేదు, అదే విధంగా ప్రస్తుతం ఆచరించబడుతున్న రాజకీయాలతో మా కెటువంటి సంబంధమూ లేదనేదీ సత్యమే. కాని, రాజకీయాలు వాటి నిజమైన స్ఫూర్తితో వ్యవహరించబడితే, అనగా, మానవ సమూహాల వ్యవస్థగా, పరిపాలనాపరమైన వివరాలన్నింటితో, సమిష్టి జీవితాన్ని నియంత్రించేదిగా మరియు ఇతర సమూహాలతోటి సంబంధాలలో — అనగా, ఇతర దేశాలతో, ఇతర సీమలతో — అది తప్పనిసరిగా అతిమానస పరివర్తనలోకి ప్రవేశించవలసి ఉంటుందనేది పూర్తిగా స్పష్టమైన విషయం, ఎందువల ననగా దేశ జాతీయ జీవనం, ఇతర దేశాలతో సంబంధాలు ఇప్పుడున్న విధంగానే ఉన్నంత కాలం, భూమి మీద అతిమానస జీవనం గడపటం అసాధ్యం. కనుక అది తప్పనిసరిగా మార్పు చెందవలసి ఉంది, దానితో కూడా మనం వ్యవహరించవలసి ఉంది. ద్రవ్య విషయాల పరంగా, అనగా, మార్పిడికి, ఉత్పత్తికి ఒక తేలిక పద్ధతిని కనుగొన వలసిన విషయంలో — 'తేలిక' అన్నాను, అవును, అది తేలికైనదిగానే ఉండాలి, ప్రాచీనకాలపు మార్పిడి కంటే సులభతరమైన విధానం, దేనిలో జనులు ఒకదానిని తీసుకొనటానికి మరొకదానిని ఇవ్వవలసి వచ్చేది — తప్పకుండా అటువంటిదే ప్రపంచం మొత్తంలో ఉండ గలగాలి, సార్వజనీనంగా; జీవితాన్ని నిరాడంబరంగా చేయడానికి ఇది కూడా పూర్తిగా అనుల్లంఘనీయమైన దేమీ కాదు. మానవ ప్రవృత్తిలో ప్రస్తుతం పూర్తిగా దానికి వ్యతిరేకంగా జరుగుతున్నది. పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, చాలా మటుకు — సహింపరాని స్థితికి. ఇతర దేశాలతో కనీస సంబంధాలు కూడా చాలా మటుకు అసాధ్యమైపోయింది, అటువంటి అధిక — ఆడంబర మార్పిడి విధానం ఏదైతే సులభతరం కావలసి ఉండిందో, అది ఎంతగా సంక్లిష్టమై పోయిందంటే మనం తొందరలో పూర్తి ప్రతిష్టంభనకు చేరుకోబోతున్నాం — మనం ఏమీ చేయలేని పరిస్థితికి చాలా, చాలా దగ్గరకు వచ్చేస్తున్నాం, ప్రతిదానిలోను కట్టివేయబడబోతున్నాం....

తెలుస్తోంది కదా, ఈ రెండు విషయాలు అత్యంత ఆటంకదాయక మైనవి. మానవ చైతన్యంలో ఇవి అజ్ఞాన, అచేతన శక్తులకు లోనవుతున్నాయి. నేను తప్పకుండా చెప్పి తీరాల్సిన మాట, సర్వ సాధారణంగా ఇవి పూర్తిగా దుష్టబుద్ధికీ, శక్తుల ఆరవాలం. ఇదే మొత్తం పురోభివృద్ధినీ, మొత్తం సత్యం వైపు పురోగతినీ మీదు మిక్కిలిగా తిరస్కరించేవి. దురదృష్టవశాత్తు, ప్రతి మానవునిలోను ప్రతిఘటనకు ఇది కూడా కారణ మవుతున్నది, ఆ దృక్పథం ఎంత సంకుచిత్వంతో, బుద్ధిహీనతతో కూడినదంటే దానికి అలవాటు లేని దానిని దేనినీ అర్థం చేసుకోవటానికి తిరస్కరిస్తుంది. వీటిని చేపట్టి, మార్పు చేయబూనడం నిజంగా ఒక వీరోచిత కార్యమే. అవును, మేము దీనికి కూడా ప్రయత్నిస్తున్నాం, ఇది చేయగలిగితే తప్ప, భూస్థితిగతులు మార్చడం అసాధ్యం.

*

ఆవశ్యకమైనటువంటి తీవ్రయత్నం

రాజకీయమైన, ద్రవ్యసంబంధమైనవాటి కంటె, ఆర్థిక, సామాజిక స్థితిగతులను మార్చడం, సాపేక్షికంగా, చాలా సాపేక్షికంగా సులభతరం. ఆర్థిక, సామాజికి దృక్పథం ప్రకారం మానవ తలంపుకు చేరువ కాగలిగిన సర్వ సాధారణమైనటువంటి, ప్రపంచ వ్యాప్తమైన భావాలు నిశ్చయంగా ఉన్నాయి: కొన్ని విమోచనలు, ఒక విధమైన విశాలత, ఒక విధమైన సమిష్టి వ్యవస్థ ఉన్నాయి, అవి ఎంత మాత్రం పూర్తిగా బుద్ధిహీనమైనవిగా, సిద్ధించుకో లేనివిగా కనిపించవు. కాని నీవు తక్కిన రెండు ప్రశ్నలను స్పృశించిన వెనువెంటనే, అవి ప్రధానమైన ప్రాముఖ్యత గలవైనప్పటికీ, ప్రత్యేకించి రాజకీయాలు, అవి పూర్తిగా వేరుగా ఉంటాయి.... కారణం, ఒకరెవరైనా ద్రవ్యసంబంధమైన అన్ని సంక్లిష్టతలను లేకుండా చేసుకోగల జీవనశైలిని ఊహించుకోవచ్చును — అయినప్పటికి, మాటలను వదలివేస్తే, అది నిజంగా బీదరికమే. ఎన్నో చెప్పుకోదగిన విస్తారమైన సంభావ్యతలలో నుంచి, ఎటువంటి ద్రవ్య సంబంధ సంభావ్యతలను, పద్ధతులను తీసుకు వచ్చినప్పటికీ, వాటిని గనక సరైన పద్ధతిలో, నిజమైన స్ఫూర్తితో వాడినట్లైతే,అది చాలా మటుకు మానవ సంబంధ బాంధవ్యాలను, ప్రయత్నాలను తేలిక పరుస్తుంది. ఇతరములైన పరిస్థితులలో, అది, చాలా కష్టమయ్యే జీవన సంకీర్ణతను సుసాధ్యం చేస్తుంది. కాని, నా కర్థం కాని విషయం — ఎందువల్లనో,

సర్వ సాధారణంగా పూర్తిగా అధ్వాన్నమైపోయిన తరువాత మాత్రమే అత్యంత శ్రేయోదాయకమైనది వస్తూ ఉంటుంది — తేలిక మార్గాలను వదలివేసి, మనుషులు చాలా సంక్లిష్టమైన మార్గాన్ని ఎంత వరకు ఎంచుకున్నారంటే, రెండు రోజులలో ప్రపంచంలోని ఒక అంచు నుంచి మరొక అంచుకు తీసుకొని వెళ్ళే విమానాలున్నప్పటికీ, మనం ప్రపంచం చుట్టూ ఎనభై రోజులలో కాకుండా కొన్ని రోజులలో మాత్రమే వెళ్ళగలిగేటట్లుగా జీవితాన్ని ఎంతో 'చిన్నదిగా' ఎంతో 'దగ్గరగా' చేసే ఎన్నో ఆవిష్కరణ లున్నప్పటికీ, అవన్నీ ఉన్నప్పటికీ, ఉదాహరణకు, మార్పిడి సంక్లిష్టతలు ఎంతగా ఉన్నాయంటే జనులు తమ ఇంటిని కదల లేనంతగా — నేను చెప్తున్నది వారుంటున్న దేశం నుంచి — కారణం, వారు వేరే చోటుకు పోయే విధానాలు లేవు, ఒక వేళ వారు మరొక దేశంలో నివసించడానికి ధనాన్ని అడిగితే, "నీకు వెళ్ళడం అంత ముఖ్యమైన విషయమా? బహుశా నీవు కొంత కాలం ఆగవచ్చు కదా, ఎందువల్లనంటే ప్రస్తుత తరుణంలో అది చాలా కష్టమైన విషయం..." అనే సమాధానం వస్తుంది. నేను హాస్యమాడటం లేదు, ఇది ఎంతో గంభీరమైన విషయం. ఇది జరిగి తీరుతుంది. దీనిని బట్టి తెలుస్తున్నదేమంటే మన పుట్టిన చోటుకు మనం అత్యధికంగా

ధనం ధనాన్ని తయారు చేయడానికే కాదు, ధనం నూతన సృష్టి ఆగమనానికై భూమిని సంసిద్ధం చేయడానికి ఉద్దేశించబడింది.

*

ధనం అనేది ఒక శక్తి, గాలి, నీరు లేక అగ్నిని మించి ఎక్కువగా అది ఒక వ్యక్తి స్వాధీనంలో ఉండకూడదు.

దానికి ప్రారంభంగా, వారసత్వంగా సంక్రమించేదానిని రద్దు చేయడం....

ద్రవ్య ఆధిపత్యశక్తి భౌతికాన్ని సంతరించుకున్నటువంటి ప్రాణిక శక్తి కాగా, అది కార్యాచరణానికి అత్యంత శక్తివంతమైనదిగా మారిపోయింది: సంపాదించడానికి, వినియోగించడానికి ఆకర్షణ శక్తిగా అయింది. మొత్తం ఇతర ఆధిపత్య శక్తుల వలెనే, అది దైవసేవకు తప్పక సమర్పించబడాలి.

Undated 1958 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

బందీలమై పోతున్నాం — వైజ్ఞానిక ఆవిష్కారాలన్నీ దేశాలను ఎంతో దగ్గరకు చేరుస్తున్నప్పటికీ, దాని వలన మనం చాలా తేలికగా విశ్వానికి చెందినవారమవ గలుగుతున్నప్పటికీ, ఏ విధంగానైనా మొత్తం ప్రపంచానికి చెందినవారమవ గలుగు తున్నప్పటికీ.

CWM 9: 167-69

ధనం సమిష్టి ఆస్తి

ధనం ఎవ్వరికీ చెందదు: ధనం సమిష్టి ఆస్తి, దానిని కేవలం సమగ్రము మరియు సర్వ సాధారణము, సార్వజనీన దృష్టి కలిగినవారే వినియోగించాలి. ఇంకా దానికి నేను చేర్చేది: ఆ దృష్టి కేవలం సమగ్రం మరియు సర్వ సాధారణం అయినటువంటిది మాత్రమే కాకుండా, ఆవశ్యక మైనటువంటి మహా వాస్తవమైనదిగా నుండాలి, దానర్థం సార్వజనీన పురోభివృద్ధికి అనుగుణంగా ఉన్న వినియోగమునకు, అర్థం పర్థం లేనటువంటి భ్రాంతికారకమైనదిగా పిలవబడే వినియోగమునకు మధ్య తేడాను నీవు గుర్తించగలగాలి. కాని అవన్ని సూక్ష్మాంశాలు, కారణం, తప్పులు సైతం — ఒక విధమైన దృక్పథం ప్రకారం, వ్యర్థమైన వినియోగాలు కూడా — సర్వసాధారణమైన పురోభివృద్ధిలో సహాయమౌతాయి: అవి విపర్యయ పాఠాలు.

నా కిప్పటికీ థియోన్ చెప్తూ ఉండేది గుర్తుంది. (థియోన్ దాతృత్వ సేవకు పూర్తిగా వ్యతిరేకి), అతడు చెప్పాడు, "దాతృత్వం మానవ దైన్యాన్ని కలకాలం ఉండేటట్లు చేస్తుంది, కారణం, మానవ దైన్యం అనేదే లేకపోతే అది తన అస్తిత్వాన్ని కోల్పోతుంది!" నీకు తెలుసు కదా, గొప్ప మానవ సేవా కార్యకర్త.... అతడి పేరు? మాజరిన్ కాలంలోని వాడు,

'లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ఛారిటీ' ని స్థాపించినవాడు?

విన్సెంట్ డి పాల్.

అతడే. ఒకసారి మాజరిన్ అతడితో అన్నాడు, "నీవు వారి కోసం చూడడం మొదలు పెట్టక ముందు అంతమంది బీదవారు అక్కడ ఎన్నడూ లేరు!"

Conversation with a disciple, April 10, 1968

శ్రీమాత

*

ఆరోవిల్‌లో ధనం లేనటువంటి ఆర్థిక సమాజం — ఒక ప్రయోగం [1]

...అక్కడ డబ్బు లేదు; నాలుగు గోడల మధ్య, డబ్బు అనేదే లేదు; అనేక ప్రవేశ ద్వారాల వద్ద, జనులకు బ్యాంకులు, టిక్కెట్ కౌంటర్లు కనపడుతున్నాయి, అక్కడ వారు వారి డబ్బును జమ చేస్తున్నారు, దానికి బదులుగా టిక్కెట్లను తీసు కుంటున్నారు, వాటితో వారు వసతి, భోజనం, మొదలైనవన్నీ పొందుతున్నారు, కాని డబ్బు మటుకు లేదు, ఇక లోపల కూడా పూర్తిగా ఏమీ లేదు, ఎవ్వరి వద్దా డబ్బు లేదు — టిక్కెట్లు కేవలం సందర్శకులకు మాత్రమే, వారు కేవలం ప్రవేశాను మతితో మాత్రమే వచ్చినవారు. అది ఒక విచిత్రమైన అద్భుత వ్యవస్థ... డబ్బు లేదు, నాకు డబ్బు అక్కర లేదు.

June 23, 1965

*

సమిష్టి భాగస్వామ్యమే తప్ప పన్నులు లేవు

"అక్కడ జీవించే వారందరూ అక్కడి జీవనంలో, అభివృద్ధిలో పాలు పంచు కుంటారు...."

...వారి సామర్థ్యాలను బట్టి, వనరులను బట్టి, కాని అది యాంత్రికంగా 'కొలమాన మున కింత' అనే పద్ధతిలో మాత్రం కాదు. అదీ విషయం. అది తప్పకుండా ఏదో సజీవమైనదే, నిజమైనదే; యాంత్రికమైనది కాదు. 'వారి సామర్థ్యాలను బట్టి' అనగా, ఎవరైతే భౌతిక వనరులుంటాయో, ఒక కర్మాగారంలాగా, అతడు ఎంత ఉత్పత్తి చేస్తున్నాడో, ఆ ఉత్పత్తికి తగ్గ నిష్పత్తిలో ఇవ్వవలసి ఉంటుంది — ప్రతి వ్యక్తి ఇంత అని కాకుండా లేదా ప్రతి తలకు ఇంత అని కాకుండా ....

"అక్కడ పన్నులనేవి ఉండవు, కాని ప్రతి వ్యక్తి సమిష్టి శ్రేయస్సుకు పని ద్వారా, వస్తువు ద్వారా లేదా ధనముద్వారా తోడ్పాటునందిస్తుంటాడు."

కనుక అది స్పష్టం: ఏ విధమైనటువంటి పన్నులూ అక్కడ ఉండవు; కాని ప్రతి వ్యక్తి సృష్టిశ్రేయస్సుకు పనిద్వారా, వస్తువుద్వారా లేదా ధనము ద్వారా తోడ్పాటు

---

[1] శ్రీమాత ఆరోవిల్ ఎలా ఉంటుందో తాను దర్శించినదానిని వివరంగా చెప్తున్నారు.

నందిస్తుంటాడు. డబ్బు తప్ప మరేమిలేనివారు డబ్బు నిస్తారు. కాని నిజం చెప్పాలంటే, "పని" అనేది అంతరంగ పని (కాని దానిని చెప్పలేము, కారణం జనులు అంత నిజాయితీగా లేరు.) ఆ పని బహుశా తాంత్రికమైనది, పూర్తిగా ఆంతరంగికమైన పని, కాని సహజంగానే, అది అలా ఉండాలంటే, అది తప్పక పూర్తిగా చిత్తశుద్ధితో, నిజమైనదై, సామర్థ్యంతో ఉండాలి: ఎటువంటి కాపట్యమూలేకుండా. కాని అది తప్పనిసరిగా భౌతికమైన పనే కానక్కరలేదు.

Conversation with a disciple, December 30, 1967 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

నవ వ్యవస్థ బీజాలు

కష్టమంతా విషయాల విలువలను మెచ్చుకోవటంలో ఉంది. నీకు అర్థమౌతున్నది కదా, దానికి ఎంతో విశాలమైన దృష్టి కావాలి.... డబ్బు సౌకర్యం అది యాంత్రికమవటంలో వుంది... కాని ఈ కొత్త వ్యవస్థ పూర్తిగా యాంత్రికం కాబోదు, కనుక, ... ఉదాహరణకు, ఎవరైతే అరోవిల్లిలో ఉంటారో, వారివద్ద డబ్బు ఉండదనే భావన

నిజమైన అంశం, ప్రతిమానవ అస్తిత్వానికి భౌతికమైన హక్కు ఉన్నదనేది (కాని అది "హక్కు" కాదు) వ్యవస్థ ఉండవలసిన తీరు. అది అమరి ఉండవలసిన విధానం ఎలా ఉండాలంటే, ప్రతి వ్యక్తియొక్క భౌతికావసరం తీర్చబడాలి,.కాని హక్కు, సమత్వమనే భావాల ప్రకారం మాత్రం కాదు. కాని అది అత్యంత సామాన్య అవసరాలను ఆధారం చేసుకొని ఉండాలి. అప్పుడు, ఒకసారి అది నెలకొనబడిన తర్వాత, ప్రతివ్యక్తి తనదైన జీవితాన్ని వ్యవస్థీకృతం చేసుకోవడానికి స్వతంత్రుడై ఉంటాడు, కాని అది అతని ఆదాయంమీద ఆధారపడి ఉండేది కాదు, అది అతని అంతరంగ సామర్థ్యాల మీద ఆధారపడి ఉండాలి.

Conversation with a disciple, December 30, 1967

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

ఉంది — అక్కడ ధనం చెలామణిలో ఉండదు. — కాని తినడానికి, ఉదాహరణకు ప్రతివ్యక్తికి హక్కు ఉంది, సహజంగానే, కాని .... పూర్తిగా ఆచరణాత్మక పరిధిలో మేము ప్రతివ్యక్తియొక్క రుచులను లేదా అవసరాలను బట్టి అన్నిరకాలైన భోజన పదార్థాల గురించి ఆలోచించాము (ఉదాహరణకు శాఖాహార వంటకం, మాంసాహార వంటకం, ఆరోగ్యపరమైన వంటకం, మొదలైనవి), అక్కడినుంచి భోజనపదార్థాలు కావలసినవారు ఏదో ఒకటి దానికి మారకం చేయాలి — పని, లేదా..... కాని, ఇది పూర్తిగా ఆచరణాత్మకంగా వ్యవస్థీకరించటం చాలా కష్టం..... ఇటుచూడు, మేము నగరం వాడుక కోసం నగరం చుట్టూ ఎన్నో భూములను విస్తృత- పరిధిలో వ్యవసాయం చేయడానికి ప్రణాళికను రచించాం. కాని ఆ భూములను సాగుచేయటానికి, ప్రస్తుత తరుణంలో మాకు డబ్బు అవసరం లేదా ఇతర వస్తుసామగ్రి అవసరం. కనుక .... ఇప్పుడు నేను మొత్తం సమస్యను సూక్ష్మాంశాలతో ఎదుర్కోవాల్సి ఉంది. అది అంత తేలికైన వి,యం కాదు!

అర్థం చేసుకొనేవారు కొంతమందే ఉన్నారు.


మరొక విషయం, ఆరోవిల్లిలో సుంకాలు, పన్నులు ఉండబోవు, అరోవిల్లి వాసులకు సొంత ఆస్తి అంటూ ఏమీ ఉండబోదు. ఆ విధంగా కాగితాలమీద; అది బాగానే ఉంది. కాని, అది ఆచరణలో క్రియాశీలమయ్యేటప్పటికీ......

సమస్య ఎప్పుడూ ఒకేరకంగా ఉంటుంది: ఎవరికైతే బాధ్యత అప్పగించబడిందో వారు — సార్వజనీన చైతన్యంలో ఉండాలి. సహజంగానే, లేకపోతే .... ఎక్కడెక్కడ వ్యక్తిగత చైతన్యం ఉంటుందో దానర్థం, ఆ మనిషి పరిపాలనకు అసమర్థుడు — మనం చూస్తూనే ఉన్నాం, ప్రభుత్వాలు ఎలా ఉన్నాయో, అది భయానకం!

Conversation with a disciple, Febrary 14, 1968

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ



ధనాధిపత్యం నుంచి సన్యాసిదాకా వైరాగ్యంతో ముడుచుకొనిపోయి, అది అందించే ఉపయోగాలకు, అది తీసుకొనివచ్చే వాటికి విముఖుడవై మరలిపోవడంగాని, రజోగుణంతో వాటికి అంటుకుపోయి పెంచి పోషించడంగాని, వాటిని పొందడంలో ఆనందం పొందుతూ యధేచ్ఛగా వాటిలో పాల్గొంటూ ఆత్మానుగతంగా వాటికి బానిసై పోవడంగాని నీవు ఎంతమాత్రం చేయకూడదు. సంపదను కేవలం ఒక ఆధిపత్యశక్తిగా శ్రీమాత కోసం తిరిగి గెలవటానికి, ఆమె సేవకు అర్పించడానికి మాత్రమే చూడు.

సంపద సమస్తం దైవానిది. దానిని కలిగి ఉండేవారు ధర్మకర్తలేగాని, దానిని వశంలోఉంచుకొన్నవారు కాదు. అది ఈ రోజు వారివద్ద ఉంటుంది. రేపు బహుశా మరొకచోటుకి వెళ్ళిపోతుంది. అది వారివద్ద ఉన్నప్పుడు, వారికివ్వబడిన ధర్మ కర్తృత్వాన్ని ఏ విధంగా, ఏస్ఫూర్తితో, దానిని వారి వినియోగంలో ఏ చైతన్యంతో, ఏ లక్ష్యమునకు వారు వారి కర్తవ్యమును నిభాయించారో అనే దానిమీద అంతా ఆధారపడి ఉంటుంది.

CWSA 32:10

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

జాగ్రత్త వహించవలసిన మూడు విషయాలు

ఈ అహంకార ప్రతిక్రియలన్నీ లేకుండా ఉంటే, విషయాలు అల్పమై, తేలికయై పోతాయి. గొప్పతనం కోసం ప్రబలంగా అర్రులు చాచే గాఢమైన వాంఛ, ఘనతను చాటుకొనే ఇతరుల మీద అజమాయిషీ చేయాలనే తపన, స్వాతిశయం లేదా ఆడంబరం (నిజమైన నీ విలువకు నీవు ప్రశంసించబడకపోతే గాయపడిన హృదయంలో, అప్పుడు నీవు నీ సంయమనం కోల్పోతావు, పోట్లాడుతావు, కర్కశంగా పళ్ళుకొరుకుతూ ఘర్షణకు తలపడతావు), ఇక చిట్టచివరకిది డబ్బుకోసం తీవ్రవాంఛ, దురాశ, వశంలో ఉంచుకోవాలనే కోరిక, కాముకత: నీవు అవకాశాన్ని "అత్యంతలాభదాయకంగా" మలచుకోవడం — "నేను లాభం పొందాలి, నేను లాభం పొందాలి....." ఈ మూడింటితో ప్రతిదీ పెడదారి పడ్తుంది.

*

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

"ధనం ఏలుబడి" అంతానికి దగ్గరవుతున్నది.


మనం దేనినైతే ధనంతో ఏలుబడి అంటామో అది అంతం కాబోతున్నది.

కాని, ఇప్పటిదాకా ప్రపంచంలో ఉన్నటువంటి అమరికకూ, రాబోయేదానికీ ఉదాహరణకు, వంద సంవత్సరాల మధ్య ఉండే సంధికాలం), మధ్యకాలం చాలా క్లిష్టంగా ఉంటుంది. అది చాలా కష్టకాలం.

Conversation with a disciple, Febrary 14, 1968

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



ధనశక్తి నిర్వాహకత

ధనం చెలామణిలో ఉండవలసినది

ధనాన్ని ఖర్చు చెయ్యగలిగిన వాళ్ళకే అది చెందుతుంది. ఇది పరమ సత్యం. మనిషి డబ్బుని కూడబెట్ట గలగవచ్చు, కాని ధనాన్ని ఖర్చు చేయగలిగినపుడే అది ఆ వ్యక్తికి చెందిన ధనమవుతుంది. అప్పుడే ఆ వ్యక్తి డబ్బుని వినియోగించడంలోని విశిష్టతను గుర్తించి అందులోని ఆనందాన్ని సంతోషాన్ని ఆస్వాదిస్తాడు.

ధనం ఎప్పుడూ చెలామణిలో ఉండాలి. ఏది స్థిరంగా ఉండాలంటే భూమిమీద ఉత్పత్తి లోని ప్రగతి — నిరంతరం — విస్తరిస్తూ ప్రగతి పథంలో ముందుకు వెళుతూ, భూమిమీద ఉత్పత్తిని పెంచుతూ ఉనికిని మెరుగుపరుచు కోవాలి. అది భూమిమీద నివసిస్తున్న జీవియొక్క వస్తుపరమైన భౌతిక వృద్ధి. ఇంకా భూమిమీద ఉత్పత్తి నిరంతరాయంగా విస్తరిస్తూ, పెరుగుతూ, వృద్ధి పొందాలి తప్ప ఈ విలువలేని కాయితం రూపంలో లేదా జడమైన ఇనుము రూపంలో కూడబెట్టడం కాదు.

డబ్బు, డబ్బుని పెంచడానికి కాదు, డబ్బు వస్తోత్పత్తిని పెంచాలి, జీవన పరిస్థితులను మెరుగుపరచాలి, మనిషి మానసిక చేతనా ప్రగతికి తోడ్పడాలి. అదే నిజమైన డబ్బు వినియోగం. నా దృష్టిలో విద్య అంటే మనం వాడుక భాషలో చెప్పుకునేది కాదు, విద్య అంటే అన్ని రకాలుగా మనిషిలోని చేతనను వృద్ధి పరచి, ప్రగతి మార్గంలో తీసుకువెళ్ళడం. విద్యఅంటే కళ, విద్య అంటే .... శారీరకవిద్య, భౌతికప్రగతినుండి మొదలై ఆధ్యాత్మిక విద్య, యోగవిద్య ద్వారా సాగే ప్రగతిని సాధించడం, ఈ సంపూర్ణ వర్ణపటం మానవ జాతి భవిష్యత్తును గుర్తించడానికి తోడ్పడాలి. డబ్బు భూమి ప్రగతికి అవసరమైన భౌతిక అభివృద్ధికి మూలాధారంగా పనిచేయాలి, భూవనరుల వాడుక అంటే, నిరుపయోగమైన, శక్తిని క్షీణింపచేసేటటువంటి వాడుక కాదు, మన వాడుక ద్వారా వనరులను పూరించగలగాలి.

ధనశక్తి ఒక సాధనమే కాని, అంతిమలక్ష్యం కాదు

కానీ ఎంతమందికి డబ్బు వాడకంమీద అవగాహన ఉంది? చాలా తక్కువమందికి మాత్రమే. అందుకని అవగాహనను అందరికీ కలిగించాలి. నా ఉద్దేశ్యంలో నేర్పించడం,

అంటే, ఉదాహరణలతో చూపించడం. ఈ విశ్వంలో మనం నిజమైన జీవన విధానానికి ఉదాహరణగా ఉండాలి. దీనిని ఒక సవాలుగా నేను మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముందు ఉంచుతున్నాను. వాళ్ళందరికీ నేను చెప్పేది ఏమిటంటే ఈ మూర్ఖ వ్యవస్థ ద్వారా వాళ్ళు చేసే ప్రక్రియలన్ని భూమిని బీటలువార్చి నాశనం చేస్తు న్నాయి. పనికిరాని వస్తువులపై అధికంగా వినియోగిస్తున్నారు. జవసత్వాలు లేని వాటి విలువ కృత్రిమంగా పెంచుతున్నారు. అవి మనిషి జీవనానికి అవసరమైన సేవ చేయగల సాధనాలు మాత్రమే. వాటికి వాస్తవికత లేదు. లక్ష్యాన్ని చేరటానికి తోడ్పడే సాధనాలే, కాని లక్ష్యం మాత్రం కాదు. సాధనాన్ని లక్ష్యంగా మారుస్తున్నారు. దానిని లక్ష్యాన్ని చేరుకోవడానికి తోడ్పడే సాధనంగా గుర్తించాలి తప్ప అదే లక్ష్యం కాకూడదు. ఈ ఆలోచనా విధానం ద్వారా భూమిని ఎంతో తొందరగా పరివర్తన చెందించగలరు! పరివర్తన చెందిన దానిని అతిమానససిక శక్తితో పూర్తిగా కలపాలి. అపుడు ఆ శక్తి సమృద్ధిగా వృద్ధి చెందుతూ జీవితాన్ని సుసంపన్నం గావిస్తుంది. నిర్జీవచంద్రుడిగా వాడి వోవి, కుంచించుకుపోయాయి. ముడుచుకు పోకుండా, భవిష్య పూర్ణచంద్రుడిగా వికసిస్తుంది.

శ్రీమాత శిష్యునితో సంభాషణ, అక్టోబరు 4, 1958

నల్లధనం ప్రశాంతతను హరించి అనారోగ్యాన్ని అందిస్తుంది.

(శ్రీమాత చిరునవ్వు) మీకు తెలుసా చాలామంది ధనాన్ని గోడలలో దాస్తారు. వాటిని పరదాలతో లేదా కాగితాలతో మరుగుపరుస్తారు. కోట్లకికోట్ల రూపాయలు గోడలలో దాచిపెట్టి దాని గురించి చింతిస్తూ అనారాగ్యం పాలవుతారు. పోలీసులు దాడిచేస్తారనే భయం. అదే కనుక వాళ్ళు ఆ డబ్బును పంచిపెట్టగలిగితే సమాజంలో గౌరవంతో, ప్రశాంతంగా నిర్భయంగా జీవించవచ్చు. అదే నిజమైన అదృష్టం! భాగ్యం.

ఇంకొక ఆసక్తికర విషయం ఏమిటంటే (ఏవిధమైన మినహాయింపులు లేకుండా ఇంతవరకు) ఎవరెవరు నాకు డబ్బు ఇవ్వటానికి అవకాశం ఉండి, ఆ డబ్బుతో వాళ్ళకి ఉన్న అనుబంధం మూలంగా ఇవ్వలేకపోవుటతో వారు ఆ ధనాన్ని అంతా పోగొట్టుకున్నారు. ప్రభుత్వం స్వాధీనపరుచుకుంది. లేక ఆర్థిక పారిశ్రామిక పాలనా

పరమైన విపత్తులలో కోల్పోయారు. లేదా కేవలం దోపిడీకి గురి అయ్యారు.

శ్రీమాత: భక్తునితో శిష్యునితో సంభాషణ, సెప్టెంబరు 7, 1966

ధనం కార్యాచరణకు ఉద్దేశించబడింది. కూడబెట్టుటకు కాదు.

సంఘర్షణ ఇద్దరు వైరుధ్యభావనలు గల సొంతదారుల మధ్య ఏర్పడుతుంది. "అసలు యదార్థం ఏమిటంటే ధనం ఎవరికీ చెందనిది. డబ్బుని స్వాధీనంలో పెట్టుకోవాలని ఆలోచనే అన్నిటినీ వక్రమార్గంలోకి తోస్తుంది. డబ్బు ఎప్పటికీ దాచుకునేది కాదు, అది కార్యాచరణకు తోడ్పడే ఒక సాధనం. అది నీకు ఒక శక్తిగా ఇవ్వబడింది. దానిని నువ్వు ధాతృత్వసంకల్పంతో, అనగా నిస్వార్థంగా, ముందుచూపుతో వినియోగించాలి." నువ్వు డబ్బును మంచి పనిముట్టుగా వాడుకొని దాని ఉపయోగాన్ని విస్తృతపరిస్తే, అది నీ వద్దకు చేరుతుంది. ఎంతగానంటే నువ్వు ఎంత సవ్యంగా ధనాన్ని వినియోగించ గలవో దానికి సరిసమానంగా. అది నిజమైన పనితనం అనిపిస్తుంది. ధనం పట్ల యదార్థ వైఖరి ఇది. ఎందుకంటే ధనం ఒక సార్వజనీనశక్తి, అది భూలోకంలో కార్యాచరణ నిమిత్తం ఉద్దేశింపబడింది. అది ఎటువంటి పని అంటే భూమిని దివ్యశక్తులను అందుకునే స్థితికి సిద్ధపరచి, వాటిని లోకానికి తెలియజేసేది. అది ఎవరి చేతికి చేరాలంటే వినియోగించగల శక్తితో కూడిన స్పష్టమైన భవిష్య దర్శనం, సర్వసాధారణమైన ముందుచూపు గలవాళ్ళ చేతికి.

దానికి కావలసిన ప్రాథమిక లక్షణం (అతి ముఖ్యమైనది) డబ్బు దాచిపెట్టాలి అన్న బుద్ధి లేకపోవడం. ఇది నాది, దీని అర్థం ఏమిటి? ... నాకు ఇప్పుడు నిజంగా అర్థం కాదు, మనుషులు ఎందుకు డబ్బు వాళ్ళది అనిపించుకోవాలని అనుకుంటారు? దానిని వారికి నచ్చినట్లుగా, ఏం చెయ్యాలంటే అది చెయ్యటానికి, వాళ్ళ వాళ్ళ ఆలోచనకు అనుగుణంగా వాడుకోవటానికి. అందుకే ఇలా కాకుండా కొందరు డబ్బు రూపంలో దాచుకోవడం ఇష్టపడతారు. దానిని పోగుచేసుకుంటారు. మనిషి అర్థం చేసుకోవలసినది ఒకటి ఉంది, అదే మనిషి ధనాన్ని తీసుకొని పంపిణీ చేసే ఒక పనిముట్టు. యంత్రంలా ఉండాలి. ఆ యంత్రం ఎంత విశాలమైనదిగా, నిస్వార్థంగా, ధాతృత్వం కలదిగా ఉంటే అంత ఎక్కువగా శక్తులను తనలో ఇముడ్చుకోగలదు. (శక్తులు అనగా బ్యాంకు నోట్లు లేదా డబ్బు.) ఆ విధంగా ఇముడ్చుకోగల సామర్థ్యం దానిని సద్వినియోగపరచే సామర్థ్యానికి సరిసమానంగా ఉంటుంది —

అది అత్యుత్తమమైనది. అంటే అసాధారణ ప్రగతిశీల దృష్టిలో విశాలదృక్పథంతో, విస్తృత అవగాహనతో, మరియు అత్యంత వికాసవంతమైన, కచ్చితమైన సరియైన ఉపయోగం; మనిషి అహంకారపూరితమైన బూటకపు అవసరాలకు కాకుండా, భూ పరిణామానికి, అభివృద్ధికి కావలసిన అవసరాలకు వినియోగించటం. ఇంకా చెప్పాలంటే విశాల థృక్పథానికి విస్తృత సామర్థ్యం కూడా వుండాలి.

కూడబెట్టుట మరియు ఖర్చు చేయుట

అన్ని తప్పటడుగుల వెనకాల ఒక నిజమైన కదలిక ఉంటుంది. వృధా చేయడం కనీసస్థాయికి తెచ్చి, నిర్వహణ సామర్థ్యంతో అత్యధిక ఫలితాలను సాధించడానికి ధనాన్ని ఉపయోగించడంలోనే నిజమైన ఆనందం ఉంటుంది. డబ్బును విపరీతంగా సంపాదించ గోరే వారి వాస్తవమైన వైఖరి ఈ విధంగా నుండాలి. ఘనమైన విధంగా వినియోగపరచగల సామర్థ్యం.

నువ్వు నాకు చెప్పగలవా, పెట్టెలనిండా గోడలలోను కట్టలు కట్టలు డబ్బు దాచిన మనిషి పొందే ఆనందం ఏమిటన్నది! అలాంటివాళ్ళు నిజమైన ఆనందాన్ని పొందలేరు. ఒక లోభి అత్యధిక ఆనందాన్ని ఎప్పుడు పొందుతాడంటే డబ్బు దాచిన పెట్టె తెరచి ఆ ధనాన్ని చూసుకొన్నప్పుడు, కానీ అది అంత ఎక్కువ ఆనందాన్నివ్వదు! కొంతమంది ఖర్చు చేయండంలో ఆనందాన్ని పొందుతారు. వాళ్ళకి ఎక్కువ ధనాన్ని కలిగివుండి ఖర్చు చేయడం ఆనందం, అది వేరేవిషయం. వారు ఉదారస్వభావులే, కానీ వారు నియంత్రణ లేనివారు. క్రమపద్ధతి లేనివారు. నిజమైన అవసరాలను, ఆవశ్యకతలను వాటంతట అవి అభివ్యక్త పరచనీయటం లోని ఆనందం ఉత్తమమైనది. అది ఎటువంటి ఆనందం అంటే రోగంతో బాధపడుతున్న వారిని ఆరోగ్యవంతులుగా చెయ్యడం, అబద్ధాలను నిజాలుగా, కష్టాలను సంతోషాలుగా మార్చడంలో పొందే ఆనందం. సహజంకాని కృత్రిమమైన వ్యర్థమైన అవసరాన్ని అతి సహజమైన దానిగా మార్పు చెయ్యడమనే ప్రయత్నం వంటిది. చేయవలసిన ఏదో పనిని పూర్తి చేయడానికి అక్కడ ఇక్కడ పనులు చక్కబెట్టటానికి, మరమ్మత్తులు చేయడానికి, నిర్మించడానికి డబ్బు వెచ్చించడం మంచిది. నీకు ఈ పనులన్నీ చేయటానికి అవసరంగా మనిషి ప్రసారమాధ్యమంగా ఉండటానికి డబ్బు అవసరం ఎక్కడ ఉందో అక్కడికి తేవడంలో ఆనందం నేనర్థం చేసుకోగలను. అది మనిషి

నిజంగా ఆనందించగల చలనం. అదే కనుక అర్థంలేని స్వార్థంగా మారితే డబ్బు కూడబెడతారు.

కూడ బెట్టడం, ఖర్చు చేయడం అనే రెండు అవసరాలు (రెండూ తెలివిమాలినవి, గ్రుడ్డివి) జోడైతే సాధ్యమైనంత ఉపయుక్తమైన దృష్టిని, వినియోగించుకొనే వీలు కలిగిస్తాయి. అది మంచిది. అప్పుడు నెమ్మదినెమ్మదిగా వీటిని ఆచరణలోకి తేవడం సాధ్యమవుతుంది.

ఔదార్యము

నువ్వు చెప్పే అవగుణాలు లేదా లక్షణాల వెనుక ఎల్లప్పుడూ దాగి ఉన్నది ఒక విధమైన వైకల్యం, అది ఆ రెండింటికీ చెందని ఒక భిన్నమైన విషయం. కాని ఔదార్యం వెనుక దాగి ఉన్న సత్యం గురించి నేను చెప్తాను. అది విస్తరించే శక్తుల చలనం. ఈ శక్తులు విస్తరించాలంటే ముందుగా వాటిని ఒక చోటుకి చేర్చాలి. అప్పుడు వాటిలో వచ్చే స్పందనలాంటి చలనం కలుగుతుంది. ఈ శక్తులు ఏకాగ్ర మవుతాయి. తరువాత విస్తరిస్తాయి. నువ్వు ప్రోగుచేయకుండానే వ్యాపింపచేయాలి అనుకుంటే కొంతకాలం తరువాత నీ వద్ద పంచడానికి ఏమీ మిగలక పోవచ్చు. ఈ సూత్రం శక్తులన్నిటికీ ఒకే రకంగా వర్తిస్తుంది. నేను ఈ విషయం మీద ఇదివరకే వ్రాసి ఉన్నాను. (లేకపోతే ఎప్పుడో తప్పకుండా వ్రాయాలి) ధనం ఒకశక్తి, అంతకు తప్ప ఏమీ కాదు. అందుకే డబ్బుని వ్యక్తిగతంగా సొంతం చేసుకొనే హక్కు ఎవ రికీ లేదు. ప్రకృతిలోని ఇతర శక్తుల మాదిరిగా వెలుగును ఒక శక్తిగా నువ్వు అనుకొంటే, ఎవ్వరికి అది వారి సొంతమనుకొని దాన్ని ఒక గదిలో బంధించి ఎవ్వరికీ ఇవ్వకుండా దాచుకోవాలి. అన్న ఆలోచన రాదు. కానీ డబ్బు విషయానికి వచ్చే సరికి మనిషి ఆలోచన వక్రమై అది ఒక వస్తువని, దాన్ని దాచిపెట్టి వాళ్ళ ఆధీనంలో ఉంచుకోవచ్చని, దాని ద్వారా వ్యక్తిగతంగా ఏదో సాధించాలని అనుకుంటారు. సరిగ్గా అదే నేను చెప్పేది. డబ్బంటే కేవలం కాయితం కాదు. సహజంగా ఒక దీపం ప్రమిద వత్తి వేసి వెలిగించి ఆ దీపం నాది అన్నట్లుగా వుంటుంది. డబ్బు కేవలం కాయితాలో, నాణాలో అయితే నాదిగావచ్చుకాని నిజానికి అది ధనం కాదు. అది దాని వెనుకనున్న ఒకశక్తి, మార్చుకోవడానికి తోడ్పడే శక్తిని డబ్బు అంటారు. అది అందరికీ చెందుతుంది తప్ప ఏ ఒక్కరి సొంతము కాదు. వాడకంలో ఉన్నంతసేపే జీవించి ఉంటుంది.

నువ్వు కూడబెడదామనుకుంటే మాత్రం అది నశించి పోతుంది. నువ్వు ఒక కలశంలో నీరుపోసి, అది ఎప్పటికి అలాగే ఉండాలంటే కుదురుతుందా, కొన్నాళ్ళ తరువాత నీరు మురిగిపోతుంది. డబ్బు కూడ అంతే. ప్రజలకి ఈ నిజం ఇంకా అర్థం అవటం లేదు.

ధన దాహం

అన్నింటిపై అత్యాస - ఆధ్యాత్మిక విషయాలపట్ల కూడా అత్యాస వుంటుంది. కొంతమంది లోభులు శక్తులన్నింటినీ ఆధీనంలో ఉంచుకొని ఎవ్వరితోనూ పంచుకో కూడదు అనుకుంటారు. ఇప్పుడు చెప్పినట్లుగా ఎవరికైతే వ్యాపింపచేయగల శక్తి వుంటుందో వారికే కూడబెట్టగలశక్తి ఉంటుంది. ఈ రెంటిలో ఏదో ఒక్కటే ఉంటే అస మతౌల్యత ఏర్పడుతుంది. అప్పుడు అది అత్యాసగా మారుతుంది లేదా వ్యర్థం అయిపోతుంది. ఎవరైనా ఈ రెంటినీ సమానంగా క్రమబద్ధంగా నడపాలి. ఇప్పు డనుకున్న సమతౌల్యత అంటే అదే. ఇది చాలా తేలికగా నిరూపించవచ్చు. నిజం చెప్పాలంటే ప్రస్తుతానికి సమతౌల్యత నిజస్థితి. మనిషి ఇటు ఊగిసలాడకుండా బుద్ధుడు అన్నట్లుగా మధ్యేమార్గంలో ఉండాలి. అదే బుద్ధభగవానుడు చెప్పిన సమ తౌల్య స్థితి. మనిషి కసరసాయంతో తాడుమీద నడుస్తున్నప్పుడు సమతౌల్యత ఎలా నిలుపుకుంటాడో, ఆ విధంగా నేర్చుకోవాలి. మొదలు పెట్టడానికి ఏమీ లేకపోతే, ప్రపంచంలో ఎంత ఉదార స్వభావం ఉన్నవ్యక్తి అయినా సరే ఏమీ ఇవ్వలేడు అనేది సత్యం. అంటే అతని కోసం అతను ఏమీ దాచలేదు, ఎవరో అతనికోసం దాచిపెట్టారు కాని అతనికి జేబులో ఏమీ లేకపోతే ఎవరికీ ఏమీ ఇవ్వలేరు కదా! అని అర్థమయిందా — అందుకే పంచడం ఎంత ముఖ్యమో కూడబెట్టడం కూడ అంతే ముఖ్యం. ఈ రెంటికీ అహంతోడయితేనే వికృతతత్వం వస్తుంది. అప్పుడు అవి వాటిమొత్తం విలువను కోల్పోతాయి.

CWM 5, 357

డబ్బు వృధా చెయ్యడం

వృధా అయ్యేది డబ్బు ఒకటే కాదు!

బలం, చైతన్యం, డబ్బు కన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా అపారంగా వృధా

అవుతాయి. వృధా అవకూడదనుకుంటే నా మాటలో ఇక్కడ ఆశ్రమం ఉండలేదు. వృధా కాకుండా క్షణం కూడా గడవదు. కొన్ని సార్లు అంతకన్నా అధ్వాన్నంగా ఉంటుంది. ఈ అలవాటు – కనీస బుద్ధి జ్ఞానం లేదని నా ఉద్దేశ్యం – గ్రహించగలిగినంత దివ్య శక్తిని చేతనను గ్రహించి వాటిని వ్యక్తిగత సంతృప్తికై వాడుకోవటం ప్రతిక్షణం జరుగుతున్నది ఇదే. మీపై నిరంతరం వర్షిస్తున్న దివ్యశక్తిని దివ్య చేతనను అంతటినీ నిజమైన అవసరానికి అంటే దైవకార్యానికి అది చేయుటకు సంసిద్ధమవడానికి ఉపయోగించగలిగితే మనం ఈ ప్రయాణంలో మనం ప్రస్తుతం ఉన్న స్థానానికన్నా ముందుకు వెళ్ళగలిగేవాళ్ళం. కాని దాదాపుగా ప్రతిమనిషి స్వాభావికంగానో లేదా పూర్తి తెలివితోనో చేతనైనంతచేతనను జ్ఞానాన్ని గ్రహించి దానిని పొందాననే భావన కలగగానే అతను తన వ్యక్తిగత ప్రయోజనాలకు సంతృప్తి పరచటానికి వాడుకుంటాడు.

ఎవరనుకుంటారు. ఇక్కడ ఉన్న దివ్య శక్తి అంతా అనంత మహత్తు గలది అని. మొత్తం ధన శక్తి కన్నా చాలా విలువైనది అని, ఇక్కడవున్న ఈ మహత్తరశక్తి చైతన్యంతో, స్థిరంగా అంతులేని పట్టుదలతో నిధానంతో ఈయబడుతున్నదని, అది కేవలం ఒకే ఒక ప్రయోజనం కోసం దైవకార్యాన్ని సాధించటానికి – ఎవరు దానిని వృధా చేయకూడదన్న ఆలోచనతో వున్నారు? ప్రగతిని సాధించడం వారి పవిత్ర ధర్మమని అతడు అవగాహన కలిగి మెరుగైన జీవితం గడపాలని ఎవరు అర్థం చేసుకోగలరు? ఎందుకనగా తాము దైవశక్తితో, దైవ చేతనతో జీవిస్తూ వాటిని స్వార్థానికి సొంత ప్రయోజనాలకు వాడుకుంటారు.

CWM 6:156-57

శ్రీమాత

అనువాదం: డా. కోడూరు (తాడిమేటి) శేషు రాజకుమారి



దైవం మనకి అనేక విధాలుగా సమకూరుస్తారు.

ఇది నిజం. ఎవరికి ఎవరిపట్ల బాధ్యత లేదు. ఒక్క దైవంపట్ల మాత్రం సంపూర్ణంగా బాధ్యత ఉంది. ఎవరైనా ఏ షరతులూ లేకుండా ఏ విధమైన బహుమతినైనా దైవానుగ్రహంగా భావించి తప్పకుండా గ్రహించవచ్చు. దానికి బదులుగా ఏమి ఇవ్వాలి, చెయ్యాలి అన్న విషయాన్ని దైవానికి వదిలివేయాలి.

CWM 15, 51

శ్రీమాత

అనువాదం: డా. కోడూరు తాడిమేటి శేషురాజకుమారి

ధనంయొక్క శక్తి — దాని ప్రభావం

...ప్రాణికశక్తులు ధనంపై చాలా అధికమయిన ప్రభావాన్ని కలిగి ఉంటాయి.(కొంత నిశ్శబ్దం తర్వాత) చూడండి మీరెపుడైనా డబ్బును గురించి ఆలోచించినపుడు బ్యాంకు నోట్లు, నాణాలు, లేదా మరొక విధమయిన సంపద లేక ఏవైనా విలువైన వస్తువుల గురించి ఆలోచిస్తారు. కానీ యిది కేవలం ప్రాణికశక్తుల భౌతిక వ్యక్తీకరణ మాత్రమే. వీటిని వశం చేసుకొని నియంత్రించ గలిగినపుడు అది తమంత తామే ఈ ధనంయొక్క ప్రాపంచిక వ్యక్తీకరణలకు జోడుగా వస్తాయి.

(నిశ్శబ్దం) అది ఒక విధమైన భౌతిక ప్రకంపనలను ఆకర్షించే శక్తి లాంటిది. వాటిని వినియోగించుకోగల సామర్థ్యం వలన వాటి బలం పెరుగుతుంది — శారీరక వ్యాయామంలా వాడుకతో వాటి శక్తి పెరుగుతూ ఉంటుంది.

ఉదాహరణకి మీకా శక్తిపై నియంత్రణ ఉన్నపుడు — దానికి ప్రాణిక ప్రపంచంలో ఒక ఎర్రని, చాలా చిక్కనైన, తీక్షణమైన ఎరుపు, బంగారు వర్ణంతో కలసినది, — మరీ ప్రకాశవంతము కాదు, అలా అని పాలిపోయినది కాదు. ఎపుడైతే ఈ శక్తిని కదిలించి, భ్రమింప చేయటం మొదలు పెట్టగానే దాని పటుత్వం పెరుగుతుంది. అది కూడబెట్టుకొని, ఉపయోగించకుండా దాచుకోబడే శక్తి కాదు. ఆ శక్తి ఎల్లపుడూ వినిమయించ బడుతుండాలి. ఉదాహరణకి కొంతమంది లుబ్ధత్వంతో తమ వద్దకు వచ్చిన ధనాన్నంతా, తాము ఆకర్షించ గలిగిన సంపదనంతా కూడబెట్టి దాని చలనాన్ని ఆపినపుడు అది తప్పించక పోవటమో లేక స్తబ్దమై శక్తిని కోల్పోవడమో జరుగుతుంది.

ధనశక్తితో వ్యవహరించాల్సిన సరైన విధానం

నిజంగా ధనశక్తి ప్రవాహంలో ఉండాలంటే యిక్కడ చెప్పినట్లు ఖచ్చితంగా చెయ్యాలి: మీరొక సంపూర్ణంగా వ్యక్తిగతం కాని భావనను, ఏ మాత్రం సంపద పట్ల మమకారం లేదా నా స్వంతం అనే భావనను కలిగి ఉండ కూడదు. కేవలం ఒక శక్తిగా దానిని స్వీకరించి, ఉత్తమంగా వినియోగించ బడటానికి ఎక్కడకు వెళ్ళాలో అటు వెళ్ళేటట్లు ప్రయోగించాలి. ఈ చలనం వలన, నిరంతరమైన కదలిక వలన, దాని శక్తి పెరుగుతుంది, ఒక విధమయిన ఆకర్షణ శక్తి, ఒక విధమయిన వ్యవస్థీకరణ

కూడా ఏర్పడుతుంది. అనగా, ఈ శక్తి కలిగి ఉంటే ఒక వ్యక్తి భౌతికంగా మార్గం లేకపోయినా, ధనాన్ని పొందగల పరిస్థితులలో లేకపోయినా, ఈ శక్తి వశంలో ఉంటే అతడు దానిని క్రియాశీలం గావించగలడు, వినిమయంలోకి తేగలడు. అవసరమైనపుడు దాని నుండి కావలసినంత శక్తిని పొందగలడు. బాహ్యంగా అతనికి ధనం ఎటువంటి కారణం లేకుండా, గుర్తు తెలియకుండా ఎలానో వస్తూ ఉంటుంది. సాధారణంగా సంపద సమకూరే పరిస్థితులకు పూర్తిగా వ్యతిరేకమయిన పరిస్థితులలో అతను ఉండవచ్చు, అయినప్పటికీ ఆ శక్తి నతడు వాడగలడు, అతని పనికి కావలసిన ధన మెప్పుడూ అతనికి అందుబాటులోనే ఉంటుంది.

ధనశక్తి ఒక వక్రమైన ప్రపంచానికి చెందినది

ధనమనే శక్తి వక్రమార్గంలో సృజించబడిన ప్రపంచానికి చెందినది. ఇది ఒక విధంగా ప్రాణిక ప్రపంచానికి చెందినది. ఆయన అలాగే చెప్పారు కదా? ఇది ప్రాణికమూ, భౌతికమూ అయిన ప్రపంచానికి చెందినది అని అంటారు. అందుకే ఎల్లప్పుడూ యిది అసురశక్తుల అధీనంలో ఉంటుంది. చేయవలసిన దేమిటంటే దానిని అసురశక్తుల నుండి తిరిగి గెలుచుకోవాలి.

అందుకనే పూర్వం యోగమార్గాన్ని అనుసరించ దలచినవారు లేదా సాధనను ఎంచుకున్నవారు ధనాన్ని ముట్టుకో కూడదని అనేవారు. ఎందుకంటే దానిని ఒక దుష్టశక్తి లేదా అసురశక్తిగా భావించేవారు, లేదా పూర్తిగా అది దివ్యజీవనానికి విరుద్ధ మయినదని అనుకొనేవారు. కానీ విశ్వమంతా స్వయం వ్యక్తమగు భగవంతుని ఆవిష్కరణయే. అందువలన అది పూర్తిగా ఆయనకే చెందుతుంది. ఈ ఆధారంతోనే ఆయన ధనశక్తులు, సంపదలు అన్నీ భగవంతునికే చెందుతాయని చెబుతారు. వాటిని తిరిగి జయించి ఆయనకే సమర్పించాలి. ఇవన్నీ అసురశక్తుల ప్రభావంలో ఉన్నందున వాటిని జయించి తిరిగి దైవాధీనం చెయ్యాలి. అపుడాయన ఆ శక్తులను తన పరిణామ కార్యక్రమానికి వినియోగించ గలుగుతాడు.

ధనంయొక్క భౌతికమైన రూపం ఒక లోకాచారం

ఇది పూర్తిగా ఒక ఆచారం మాత్రమే. ఉదాహరణకి కొన్ని దేశాలలో డబ్బు బదులు చిన్న చిన్న గవ్వలను యిచ్చి పుచ్చుకుంటారు. కొన్ని దేశాలలో ఎవరో

ఒక కథలో వ్రాసారిలా. ఉత్తర ప్రాంతంలో సంపద అంటే చేపలు పట్టే గాలాలే. గాలాలంటే ఏమిటో తెలుసా? చేపలు పట్టడానికి ఒక కర్ర చివర గాలం త్రాడుకు బిగించిన చిన్న చిన్న ఇనుప కొక్కాలు. ఎన్ని గాలాలుంటే అంత పెద్ద కోటీశ్వరుడన్న మాట!

అది ఒక లోకాచారం. కానీ దాని వెనుక ఉన్నది నేను చెపుతున్న శక్తి. అది ఎన్ని రకాలుగా అయినా ఆవిష్కరించబడవచ్చు. ఉదాహరణకు బంగారం; మనుషులు బంగారానికి కొంత విలువ యిస్తారు. ఎందుకంటే అన్ని లోహాల కన్నా అది తక్కువగా తరుగుతుంది, అనంతకాలం యథాతథంగా నిలువ వుంటుంది. ఇదొక్కటే కారణం మరేమీ కాదు. కానీ అది కేవలం ఒక ఆచారమే. దీని ఋజువు ఒక కొత్త బంగారపు గని కనుగొనబడి బంగారం వెలికి తీయబడినప్పుడల్లా దాని విలువ పడిపోతుంది. ఇవి మనుషుల మధ్య ఆచారాలు మాత్రమే. కాని ధనాన్ని ఒక శక్తిగా చేసేది యిది కాదు, దాని వెనుక ఉన్న శక్తి. అన్ని భౌతికమయిన వాటినీ ఆకర్షించగల శక్తి.

ఇలా ఆచారాన్ననుసరించి ఇది వాడబడుతుంది. ప్రస్తుతం సంపద అనేది ఏవో ముద్రలు వేసిన మురికి కాగితాలుగా వ్యక్తమౌతున్నది, చూడటానికి ఏవగింపు కలిగిస్తుంది. కొన్ని సార్లు మంట వేసుకోవటానికే పనికి వచ్చేటట్లు ఉంటాయది.

కాని దాన్నే గొప్ప అదృష్టమని భావిస్తారు. ఎందుకు? అది ఆచారం కనుక. అయినప్పటికీ ఎవరైనా దానిని ఆకర్షించి ఒక సత్కార్యానికి విశ్వ సంక్షేమానికి వాడగలిగితే ఆ వ్యక్తి ధనశక్తిని వశపరచుకొన్న వాడవుతాడు, అంటే ధనం వెనుక ఉన్న శక్తిని అని అర్థం.

కాగితంపై ధనం

ఫ్రెంచి భాషలో మేము ధనాన్ని 'ఆర్జా' అని అంటాము. ఆర్జా అంటే తెల్లని లోహం, మిగిలిన లోహాల కన్నా కొంచెం సుందరమైనది, మన్నిక కలది, తొందరగా వాతావరణ మార్పులకు లోనయి ఆకృతిని పోగొట్టుకోనిది. ఈ లోహంతో చేసిన నాణాలను 'ఆర్జా', డబ్బు అని పిలిచేవారు. పోను పోను సంపదను 'ఆర్జా' గా పిల వటం వాడుక అయిపోయింది. నిజానికి అది కాగితం కావచ్చు, బంగారం కావచ్చు లేదా దస్తావేజు కావచ్చు. ఎందుకంటే అపారమైన ఐశ్వర్యాలన్నీ అంకెల రూపంలో కాగితం మీద వ్రాయబడినవే, చెలామణీ అయ్యే కాగితాలు కూడా కావు, కేవల

పుస్తకాలు! కొన్ని ప్రపంచాన్ని శాసించే అత్యంత విలువైన నిధుల లాంటి విషయాలు కేవలం కాగితం మీద వ్రాయబడినవే, మనుషుల మధ్య ఒప్పంద పత్రాలుగా, ఒడంబడికలుగా వున్నవే. ఒక నిధి పెరగవచ్చు — మూడురెట్లు, నాలుగురెట్లు, పదిరెట్లు లేదా ఏ విలువ లేకుండా తరిగిపోవచ్చు. అన్నింటిని అమ్మడం జరుగుతుంది. ప్రత్తిని, పంచదారను, ధాన్యాన్ని, కాఫీగింజలను, వేటినైనా. అక్కడ ఏమీ వుండదు. అంతా కాగితం పైనే జరుగుతుంది. నువ్వు కొన్ని లక్షల విలువైన ప్రత్తిని కొంటావు. అక్కడ దూదిపింజ కూడా ఉండదు అంతా కాగితం పైనే. కొంత కాలం తర్వాత అదంతా మళ్ళీ అమ్మేస్తావు. ప్రత్తి ధర పెరిగినట్లయితే నీకు అపారమైన లాభం వస్తుంది, తగ్గితే అపారమైన నష్టం. నీ దగ్గర ధనం వుండదు, ప్రత్తి వుండదు, ఏమీ వుండదు. కేవలం కాగితం తప్ప (నవ్వు) ఇది పూర్తిగా ఒక ఆచార వ్యవహారం.

CWM 6:250-52

ఎంత ఎక్కువ ధనం కలిగి ఉంటే అంత కన్నా ఎక్కువ అవసరమౌతుంది

అది ప్రమాదమే. ఎంత ఎక్కువ ధనం కలిగి ఉంటే అంత విపత్కారం. ఔను ధనాన్ని కలిగి ఉండటం విపత్కారం.

అది మిమ్మల్ని మూర్ఖులుగా, పిసినారులుగా, దుష్టులుగా చేస్తుంది. ప్రపంచంలో అన్నిటికన్నా గొప్ప వినాశకర శక్తి అది. మీకు కోరికలు పూర్తిగా అంతరించ నంతవరకూ

నిన్ను నీవు పూర్తిగా సమర్పించుకో. నీ కున్నదంతా యిచ్చివెయ్యి. అంతకన్నా నీ నుండి ఎక్కువ ఆశించబడదు. అంతకన్నా తక్కువ కూడా కాదు.

*

భగవంతునికి సమర్పించినదే నిజమైన సంపద.

*

నువ్వు భాగ్యవంతుడవయ్యేది భగవత్ప్రయోజనానికి యిచ్చిన ధనంతోనే

CWM 15:49 శ్రీమాత

మీరు ధనాన్ని కలిగి ఉండకూడదు. మీకు ఏ కోరికలు, వ్యామోహాలు లేనపుడు, ఈ ధరణి అంత విస్తృతమయిన చైతన్యం పొందినపుడు, ఈ పృథ్వీతలంపై ఉన్నంత సందద నంతా కలిగి ఉండవచ్చు. అది అందరికీ శుభకరం. కానీ అలా ఉండనపుడు అతనికున్న సంపద అతని కొక శాపం అవుతుంది.

ఈ విషయాన్ని ఎవరికైనా నేను ముఖం పైనే చెప్పగలను. ధనవంతుడు కావటం గొప్ప విషయం అనుకునేవారికి కూడా. అదొక విపత్తు బహుశా ఒక అవమానం కూడా, అనగా అది భగవంతుడి అప్రసన్నతకు వ్యక్తీకరణ. మీరు పేదవారుగా నున్నప్పటికైనా భాగ్యవంతులైనపుడు మంచిగా, తెలివిగా, ఉదారంగా, మరింత దాతృత్వాన్ని కలిగి ఉండటం అత్యంత కష్టతరం. మీ కర్థమవుతుందా? నాకు అనేక దేశాలలో అనేక మంది తెలుసు. దేశాలన్నింటిలో నేను కలసిన ఉదారులంతా నిరుపేదలే. ఒకసారి జేబులు నిండగానే ఒక విధమైన జాడ్యం అంటుకుంటుంది. అదే ధనం పట్ల వ్యామోహమనే జబ్బు. అదొక శాపం అని నేను నొక్కి చెప్తాను. అందుకని మీ దగ్గర డబ్బు ఉన్నపుడు చెయ్యవలసిన మొదటి పని దానిని యిచ్చి వేయటం. అలా అని వివేచన లేకుండా యిచ్చివేయమని కాదు. దానధర్మాలు చేసి తమను తాము ధర్మాత్ములు, పుణ్యాత్ములు, ప్రముఖులుగా భావించేవారిలా చేయకండి. మీరొక సాత్త్వికమయిన మార్గంలో ఆ ధనాన్ని సాధ్యమైనంతగా సద్విని యోగం చేయాలి. ప్రతి ఒక్కరూ తమ అత్యంత ఉన్నత చేతనలో తమ వద్ద ఉన్న ధనాన్ని ఉత్తమమైన పద్ధతిలో ఎలా సద్వినియోగం చేయవచ్చో తెలుసుకోవాలి. నిజంగా చలనంలో లేకపోతే ధనానికి విలువ లేదు. ప్రతి ఒక్కరికీ ఖర్చు చేసినపుడే వారి ధనానికి విలువ వస్తుంది.

సంపదయొక్క శక్తి

సంపద ఒక శక్తి అనేది నేను యింతకు మునుపే మీకు చెప్పి ఉన్నాను. అదొక ప్రకృతి శక్తి. అది చలిస్తూ ఉండాలి, అది చలనంలో ఉండే శక్తి, ప్రవహించే నీటిలా కదులుతూ ఉండే శక్తి.

అది వ్యుత్పత్తికీ, వ్యవస్థీకరణకూ ఉపయోగపడుతుంది. అదొక అనువైన సాధనం, ఎందుకంటే నిజానికి వస్తువులు పూర్తిగా, స్వేచ్ఛగా పంపిణీ కావాలంటే అదొక మార్గం.

ఈ శక్తి దానిని ఉత్తమ రీతిలో వినియోగించటం తెలిసినవారి చేతులలోనే ఉండాలి. నేను మొదట చెప్పినట్లుగా తమలో పూర్తిగా కోర్కెలను జయించినవారు లేదా ప్రతి వ్యక్తిగతమైన కామన నుండి, బంధాల నుండి ఏదో విధంగా బయటపడినవారు అయి ఉండాలి. దీనికి తోడు ఒక విస్తృతమైన దృష్టి — ఈ పృథ్వియొక్క అవసరాలను అర్థం చేసుకోగలిగి, ఆ అవసరాలన్నిటినీ పూర్తిగా వ్యవస్థీకరించగల జ్ఞానాన్ని కలిసి ఉన్న శక్తి వుండాలి. ఈ మార్గాలలో ఆ శక్తిని ఉపయోగించ గలగాలి.

అందుకు అదనంగా ఈ వ్యక్తులకు ఉన్నత ఆధ్యాత్మిక జ్ఞానం ఉంటే క్రమంగా వాళ్ళు ఈ శక్తిని వినియోగించి భూమిపై భగవంతుని శక్తినీ, బలాన్ని, కృపను ఆవిష్కరించగల సమర్థత నిర్మించ గలుగుతారు. అపుడు ఈ ధనశక్తి, సంపద, ఈ ఆర్థికశక్తి దేని నయితే నేనొక శాపంగా చెప్పానో అది అందరికీ శుభాన్ని కలిగించే ఒక ఉన్నతమయిన వరంగా మారుతుంది. ఉత్తమమయివే అధ్వాన్న మవుతాయని నేననుకుంటాను. బహుశా అధ్వాన్నమైనవి కూడా అత్యుత్తమమైనవి కావచ్చు. కొంతమంది అంటుంటారు చాలా చెడ్డమనిషి అయినవాడే ఎంతో మంచివాడుగా మారిపోతాడని. నేను ఉత్తమ మయినది అధమం కావాలని ఆశించను ఎందుకంటే అది చాలా భాదాకరం.

కానీ ఒక ధనశక్తిని చెడుగా వాడినపుడది గొప్ప విపత్కరం సంభవించవచ్చు. కానీ అదే శక్తిని సద్వినియోగం చేసినపుడు అదొక వరం అవుతుంది. మనం దానిని వినియోగించటంపై అంతా ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలో ప్రతిదానికీ దాని స్థానం, దాని పని, దాని సరైన ఉపయోగం ఉంటాయి. మరొక దానికి వాడినపుడు అది ఒక అస్తవ్యస్థతను, అయోమయాన్ని, అపాయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే ఇప్పటి ప్రపంచంలో చాలా తక్కువ వస్తువులు వాటి నిజప్రయోజనానికై వాడబడుతున్నాయి. చాలా తక్కువ వస్తువులు తమ సరియైన స్థానంలో ఉంటున్నాయి. అందుకు కారణం ప్రపంచమంతా భయంకరమైన గందరగోళంలో ఉంది. అందుకే ఈ బాధలు, కష్టాలు. ప్రతి వస్తువూ దాని స్థానంలో ఉండి ఉన్నట్లయితే, ఒక సామరస్యమయిన సంతులతను కలిగి ఉంటే, ప్రస్తుతమున్న కష్టాలు బాధలు లేకుండా ప్రపంచమంతా ప్రగతి చెందుతూ ఉంటుంది.

CWM 7:55-56

ప్రస్తుతం ధనం అసుర శక్తుల గుప్పెట్లో ఉంది

"ప్రస్తుత ధనశక్తి అంతా ప్రాణిక ప్రపంచపు జీవాలు, శక్తుల ప్రభావంలో, వారి చేతులలో ఉంది. ఈ ప్రభావం వలననే ధనం తగినంత మొత్తంలో పరమ సత్య ప్రయోజనాలకు అందటం లేదు. ఎప్పుడూ దుష్టశక్తుల చేతులలో చిక్కుకొని పెడదారి పడుతుంది. ఇదే దుష్టశక్తులు ఈ భూమిని తమ గుప్పెట్లో ఉంచుకోవటానికి ప్రధాన మార్గమౌతుంది. ధనశక్తిపై దుష్టశక్తుల కబ్జా చాలా శక్తివంతంగా, సంపూర్ణంగా, పటిష్టంగా వ్యవస్థీకృతమై ఉండటం చేత ఈ దట్టమైన వ్యవస్థ నుండి దానిని రాబట్టటం కష్టతరమైన కార్యం. ప్రతిసారీ కొంతమాత్రమైనా ఈ ధనాన్ని ప్రస్తుత సంరక్షకుల నుండి తీసుకోవలసి వస్తే నువ్వొక భయంకరమైన యుద్ధానికి తలపడవలసి వస్తుంది."

ప్రశ్నలు — సమాధానాలు 1929, మే 12

కథలలో నిధులని సర్పాలు కాపాలా కాస్తుంటాయని తరుచూ చెప్తుంటారు, అది నిజమేనా?

అవును. కానీ అది భౌతికమయిన సర్పం కాదు, అదొక ప్రాణికమయిన సర్పశక్తి. ఎందుకంటే ఈ నిధుల తాళాలు ప్రాణిక ప్రపంచంలో ఉంటాయి. అక్కడ నల్లటి సర్పం — చాలా పెద్ద సర్పం — మామూలు సర్పాల కన్నా పది రెట్లు, యాభై రెట్లు పెద్దది కాపలా కాస్తూ ఉంటుంది. అది మహాద్భుతంగా, నల్లగా, ఎప్పుడూ నిటారుగా, మెలకువగా ఉంటుంది. ఒకసారి నేను దాని ముందు నిలబడటం జరిగింది. (నేను ఆజ్ఞాపిస్తే సాధారణంగా ఈ ప్రాణులు అనుసరిస్తాయి) "నన్ను వెళ్ళనీ" అన్నానేన్నను. "నేను నిన్ను పంపించగలను కానీ అలా చేస్తే నన్ను చంపేస్తారు. అందుకని నిన్ను పంపించను" అని చెప్పింది. "లోపలికి ప్రవేశించాలంటే నేనేం చెయ్యాలి", అడిగాను నేను. "ఒక విషయం మాత్రమే అందుకు నాకు అనుమతినిస్తుంది. మనిషిలో కామోద్రేకాన్ని నీవు అధిగమించ గలిగితే, మానవజాతిలో దానిని నీవు జయించ గలిగితే, ఆపై నేనికి ఏమాత్రం అడ్డు నిలవను, నిన్ను ముందుకు పంపుతాను" అంది.

అది నాకింకా దారి నివ్వలేదు. నేనా షరతుని నెరవేర్చలేదని ఒప్పుకోవాలి.

నేను మానవు లందరిలో అటువంటి విజయాన్ని సాధించటానికి కావలసిన ఆధిపత్యాన్ని పొందలేకపోయాను.

అది చాలా కష్టం.

CWM 4:188-89

ధనంతో అనుబంధం — మరణం

ఒక పిసినారి తన నిధులపై ఉన్న మమకారంతో చనిపోతే అతని ప్రాణిక చేతన కరిగిపోతుంది కానీ, ధనం పట్ల మమకారం సజీవంగా ఉంటుంది. అది తన చుట్టూ కొన్ని ప్రాణికమయిన మూలపదార్థాలను నిర్మించుకొని ఒక సజీవమైన, సచేతనమైన భూతంగా ప్రాణిక ప్రపంచంలో ఆవిర్భవిస్తుంది. జీవించి ఉన్నపుడు ఆ వ్యక్తి ఎక్కడైనా ఒక నిధిని దాచి ఉంటే ఈ భూతం వెళ్ళి ఆ నిధిని కాపాడుకోవటానికి, ఎవరినీ దాని దగ్గరకు రానివ్వకుండా సరిగ్గా ఆ స్థలం పైన కూర్చుంటుంది. కొంతమంది సూక్ష్మంగా గ్రహించే వారుంటారు. వాళ్ళకి అక్కడ నిది ఏదో నిక్షిప్తంగా ఉందని తెలుస్తుంది. 'అక్కడ నిధి ఉంది' అని చెప్తారు. అది మొదటి ఫలితం. కానీ ఆ భూతానికి ఆ నిధి ఎవరూ ముట్టుకోవటం యిష్టంలేక దానిని కాపాడుకోవటానికి ఏదో ఉపద్రవాన్ని కలిగిస్తూ ఉంటుంది. దానిని సమీపించేవారిని జబ్బు పడేటట్లు చేయటమో, లేక వారికి ఏదైనా ప్రమాదం సృష్టించటమో చేస్తుంది. ఒక్కొక్కసారి చంపటానికి కూడా ప్రయత్నిస్తుంది. ఏ మార్గమయినా దానికి ఉపయుక్తమే. ఒక వేళ ఆ వచ్చిన వ్యక్తి కొంచెం సున్నితమయిన వాడయితే అతనిని ఎంతగా భయ పెడుతుందంటే అతను పిచ్చివాడయిపోతాడు. ఒక్కొక్కసారి ఎక్కువ సంఖ్యలో చిన్న చిన్న భూతాలు కూడా ఉంటాయి. చాలా అసహ్యంగా ఉంటాయి. అవి హేయమైన కామోద్రేకం నుండి ఉద్భవించినవి. ఆ కామం (దానికి సంబంధించిన ప్రాణులతో) మరణ సమయంలో కరిగిపోకపోతే ఈ భూతాలు మనుగడ సాగిస్తూ కొంచెం నెమ్మదయిన వ్యక్తులుండే వాతావరణంలో చేరి వాళ్ళని బ్రతిమాలి వారిపై వాలుతాయి, వారిని ప్రేరేపిస్తాయి. ఇవి సంభోగ సమయంలో వెలువడే ప్రాణశక్తి

ఆహారంగా జీవిస్తాయి. వాటి ఒకే ఒక కోరిక వీలయినంత పోషణను పొందటమే.
CWM 4:190-91

శ్రీమాత
అనువాదం: డా. సరోజా ప్రసాద్

డబ్బుకు దాసోహం

సంపదలు సమకూరటంతో కలిగే అలవాట్లకు మెతకబారి దాసోహం కావటం గురంచి శ్రీఅరవిందులు ప్రస్తావించారు.

Ibid, p. 14

నీవు ధనవంతుడివై, ఖర్చు చేయడానికి, బోలెడంత డబ్బు కలిగి వుంటే నీకు ఉల్లాసం కలిగించే విషయాలపై దానిని వినియోగిస్తావు, విషయ లంపటుడు వవుతావు, వాటిపై మమకారం పెంచుకుంటావు. ఏదో ఒక రోజున డబ్బు అంతా పోయినపుడు వెలితిని భరించలేక అసంతృప్తితో దుఃఖితుడవై అంతా పోగొట్టుకున్నవాడిగా తయారవుతావు. అందుకు కారణం నీవు ఏది కలిగి వుండటానికి అలవాటు పడ్డావో అది నీ వద్ద లేదు, దానికి దాసుడవైనావు. ఒక నిస్సారమైన అనుబంధం పెంచుకున్నావు. ఎవరైతే నిర్వ్యామోహిగా నుంటూ ఈ విషయాలలో చిక్కుకున్నా, లేకపోయినా, అతనికి అంతా సవ్యంగా నుంటుంది. అతను ఈ రెండు స్థితులకు తటస్థంగా నుండగలదు. ఇదే సరైన వైఖరి: తన వద్ద వుంటే ఉపయోగిస్తాడు, లేనపుడు దాని అవసరం లేకుండా వుండగలడు. అతని అంతఃచేతనలో తేడా వుండదు. ఇది నీకు ఆశ్చర్యం కలిగించవచ్చు, కానీ అది ఆ విధంగానే వుంటుంది.

*

ధనంపై ఆధిపత్యం

ఎవరికైనా కుప్పలు కుప్పలుగా డబ్బు సంపాదించగల శక్తి వున్నట్లయితే అతను పృథ్వీశక్తులపై నియంత్రణ కలిగి వున్నట్లా?

అది అతను ఆ డబ్బును ఏ మార్గంలో ఆర్జించాడనే దానిని బట్టి వుంటుంది. ఒక వేళ అక్రమ మార్గంలో ఆర్జించినట్లయితే, నియంత్రణ కలిగి వున్నట్లు కాదు. కానీ ఎవరైనా తాము తమ విధి నిర్వహణను నిక్కచ్చిగా నెరవేర్చే క్రమంలో వారికి

ధనం సమకూరితే, అందుకు కారణం వారు ఈ శక్తులపై నియంత్రణ కలిగి వుండటం మూలంగానని కచ్చితంగా చెప్పవచ్చు. కొందరికి డబ్బును ఆకర్షించే శక్తి వుంటుంది, వారికి డబ్బును రాబట్టడానికి అక్రమ మార్గాలను అనుసరించాల్సిన అగత్యం లేశ మాత్రమైనా కలగదు. ఇతరులకు కొన్ని కాసులు సంపాదించాలన్నా ఎన్నో పన్ను గడలు, కొద్దో గొప్పో సక్రమమైనవి, పన్నవలసి వస్తుంది. అందుకని ఇదమిద్ధమంగా తేల్చి చెప్పలేము. ఒక ధనవంతుడిని చూసినపుడు అతను ధనశక్తులను నియంత్రించ గలిగి వున్నాడని అనుకుంటాము — కాదు, అది ఆవశ్యకం కాదు. అయితే ఒక వ్యక్తి పూర్తి నిజాయితీతో ఒక పనిని తన విధిగా గుర్తించి, ధనార్జన లక్ష్యంగా పెట్టుకోకుండా దానిని నెరవేర్చినప్పుడు అతనికి డబ్బు సమకూరితే అతనికి ఆ ధనశక్తులతో సన్నిహిత సంబంధ మున్నదని కచ్చితంగా చెప్పవచ్చు.

*

పోగు చేయటం, చిల్లు పెట్టడం

'చిల్లు పెట్టకుండా పోగు చేయలేడు', అనగా ఒకరి ధనాన్ని హరించకుండా తనను తాను సంపన్నుని చేసుకోలేడు అంటారు. ఇది నిజమా?

ఇది నిజం కాదు. ఎవరైనా ఏదో ఒకదానిని ఉత్పత్తి గావించారంటే దాని అర్థం హరించడం కాదు, అధికం చేయడం; అది ఒక వ్యక్తి ధనానికి సమానమైన విలువగల ఏదో ఒకదానిని లోకంలో చెలామణిలోకి తేవటం అవుతుంది. చిల్లు పెట్టకుండా పోగుచేయ లేకపోవట మనేది సాహసిక వ్యాపార వ్యవహారాలు సాగించేవారి విషయం లోను, షేర్లు కొని అమ్మే వ్యాపారస్తుల విషయంలోను లేక ఆర్థిక లావాదేవీలు నిర్వహించేవారి విషయంలోను సక్రమ మవుతుంది. సాహసోపేత వ్యాపార వ్యవహారాలలో ఎవరైనా వేరొకరికి నష్టం కలగకుండా లాభ పడలేరు. కానీ అది అంత మేరకే పరిమితం కావాలి. లేనట్లయితే ఒక ఉత్పత్తిదారుడు తాను ఉత్పత్తి చేసిన దాని మార్పిడి క్రమంలో డబ్బును పోకు చేసినట్లయితే అది చిల్లు చేసినట్లు కాదు. ఉత్పత్తి చేయబడిన వస్తువుయొక్క విలువను తప్పక ధన రూపేణా నిర్ణయించ వలసి వుంటుంది, కానీ ఆ ఉత్పత్తి సమిష్టి మానవ సంపదను మరింత సంపన్నం చేయడానికైతే అది చిల్లు పెట్టడ మనిపించదు, సుసంపన్నం చేయడ మౌతుంది. వస్తు సంపద రంగంలోనే కాదు, కళలు, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రి రంగాలలోను

ఇతర ఉత్పత్తి రంగాలలో సైతం ఆ విధంగానే వుంటుంది.

*

నేను ఎగుమతి దిగుమతి వ్యాపారం చేస్తున్నపుడు నేను నా పొరుగువారిని దోచుకుంటున్నాననే భావన నన్ను వెంటాడుతుండేది.

ఇది స్వీయ మనుగడ సాగించడం కోసం ఇతరుల సంపదను వాడుకోవడం. ఎందుకనగా ఈ క్రమంలో మధ్యవర్తులు అనగా దళారీలు పెరుగుతారు. సహజంగానే బహుశా ఇది సౌకర్యమైన, ఆచరించదగిన ఏర్పాటు గావొచ్చు కానీ సాధారణ దృష్టిలో, అమలు జరుపబడుచున్న విధానంలో ఉత్పత్తిదారుడిని, వినియోగదారుడిని దోచుకోవడ మవుతుంది, ఈ తతంగంలో ఒక వ్యక్తి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తాడు, సేవ చేయాలనే ఉద్దేశంతో కాదు (ఎందుకనగా కోటిలో ఒక్కరికైనా ఈ భావన ఉండదు) కానీ ఇది కష్టపడకుండా డబ్బు సంపాదించటానికి సులువైన మార్గం కనుక. అయినప్పటికి కష్టపడకుండా డబ్బు సంపాదించే మార్గాలు ఇంత కన్నా హేయమైనవి వున్నాయి. అవి అసంఖ్యాకం.

*

నిజాయితీ — వ్యాపారం

బయటి ప్రపంచంలోని నా స్నేహితుడు తరచూ ఈ ప్రశ్న వేస్తుండేవాడు: "ఒక వ్యక్తి తన జీవితం గడపడానికి సంపాదించాలనే ఒత్తిడికి గురి అయితే అతడు సార్వజనీన నిజాయితీ సూత్రాలకు కట్టుబడాలా లేక అంత కన్నా కఠిన వైఖరి నవలంభించాలా?"

ఇది జీవితంలో నీ స్నేహితుడు అవలంభించిన వైఖరిపై ఆదారపడి వుంటుంది. సాధకుడిగా కొనసాగాలంటే సాధారణ నైతిక సూత్రాలకు అతడు అంత విలువ నీయ నవసర ముండదు. ఇక అతను సాధారణ జీవితం గడిపే సామాన్య జీవి అయితే వాటిని పాటించవలసినవా కాదా అనే విషయం ప్రశ్నార్ధకమౌతుంది కదా? ఇబ్బందులకు లోను కాకుండా జీవితం గడపాలంటే అతను దేశకాల నిబంధనలకు తప్పక అనువర్తియై వుండాలి. కాని ఎవరైనా యోగమార్గంలోకి, దివ్యజీవనంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్న క్షణాన, సామాన్య జీవితంలో ఒక విధంగా ఆమోద యోగ్యమైనవిగా భావించబడే అన్యోన్య విలువగల ఈ విషయాలన్నీ పూర్తిగా మార్పు

చెందుతాయి. అపుడు అన్ని విలువలూ పూర్తిగా మారిపోతాయి. సాధారణ జీవితంలో ఏది నిజాయితీ అనబడిందో అది ఇకపై నీకు నిజాయితీ అనిపించదు. దానికి తోడు విలువలు ఎంత తలక్రిందు లవుతాయంటే వాటిని సమానమైన అర్థమిచ్చే సాధారణ భాషలో వ్యక్తపరచ వీలు కాదు. ఎవరైనా దివ్యజీవన విధానానికి తనకు తానుగా అర్పితం కావాలనుకుంటే, దానిని అతడు యదార్థంగా చేయాలి, అనగా తనను తాను సంపూర్ణంగా, స్వప్రయోజనార్థం ఏదీ చేయకుండా, కేవలం తాను వశవర్తి గావించుకున్న దైవశక్తిపై ఆధారపడాలి. సర్వం పూర్తిగా మార్పు చెందుతుంది కదూ? — అంతా, ప్రతిదీ. అంతా తలక్రిందు లవుతుంది. ఇప్పుడు ఈ పుస్తకం నుండి నేను చదివిందంతా కేవలం యోగం చేసే వారికే వర్తిస్తుంది; ఇతరులకు అది నిరర్థకం, అర్థంకాని భాష, కాని యోగసాధకులకు తప్పని సరి. ఇప్పటి వరకు మనం చదివిన దానిలోని సారాంశమిదే. ఎవరైనా ఒక పాదం ఒక వైపు మరో పాదం వేరొక వైపు వేయకుండా, వేర్వేరు దిశలకు పోయే జోడు పడవలపై కాళ్ళు ఊన్చకుండా జాగ్రత్త వహించాలి. శ్రీఅరవిందులు చెప్పిన దేమిటంటే ఎవరైనా 'ద్వంద్వ జీవితం' గడపకూడదని. ఏదో ఒకదానిని విసర్జించాలి, రెండింటినీ అనుసరించ లేరు. ఏమైనప్పటికీ దీని అర్థం ఎవరైనా వారి జీవిత స్థితిగతుల నుండి తప్పుకోవడం ఆవశ్యకమని కాదు; పూర్తిగా మార్పుకు లోను కావలసింది అంతర్ వైఖరి. తాము ఏ పని చేయ డానికి అలవాటు పడ్డారో దానిని చేయవచ్చు గాని, ఒక విభిన్న వైఖరితో చేయాలి. యోగం చేయడానికై జీవితంలో ప్రతిదానిని వదలుకొని ఏకాంతంలోకి లేక ఒక ఆశ్రమంలో చేరడం అవసరమని నేనను. లోకంలో, ప్రస్తుత ప్రాపంచిక పరిస్థితులలో, యోగసాధన చేయడం బహు కష్టతరమైనప్పటికీ సమగ్రమైనదిగా కూడా నుంటుందనుట వాస్తవం. ఎందుకనగా , ప్రతి క్షణం సాధకుడు సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అవి సర్వాన్నీ త్యాగం చేసి ఏకాంతంలోకి ప్రవేశించినవారికి ఎదురు కావు. అట్టి వారి విషయంలో అవి కనీస స్థాయికి తగ్గుతాయి — జీవిత గమనంలో వ్యక్తి రక రకాల కష్టాలు ఎదుర్కొంటాడు. అవి నీవు వ్యవహరించే నీ చుట్టుపక్కల నున్న వారి తీరు నీకు అర్థం కాకపోవడంతో మొదలవుతాయి. అందుకు సంసిద్ధుడవై వుండాలి, సహనం కలిగి వుండాలి, తటస్థ వైఖరి నవలంబించాలి. కానీ, యోగమార్గంలో జనం ఏమనుకొంటారు, ఏమంటారు అనే విషయం పట్టించుకో కూడదు. ఇది తప్పనిసరిగా పాటించవలసిన ప్రాథమిక సూత్రము. లోకం నీ గురించి ఏ మంటుంది,

ఏ మనుకొంటుంది, నీతో ఏ మాదిరిగా వ్యవహరిస్తుంది అనే ఆలోచన నిన్ను తాక కూడదు. జనానికి నీ పై వున్న అవగాహన ఏ దైనప్పటికీ అది నీకు అప్రధానం, ఆ ఛాయ కూడా నీకు సోక కూడదు. ఆ కారణంగానే సాధారణంగా అలవాటైన పరిస రాలలో వుంటూ యోగసాధన చేయటమనేది, సర్వం విసర్జించి ఏకాంతంలోకి ప్రవేశించి సాధన చేయడం కన్నా అధిక కష్టతరం. అయితే, మన మిక్కడున్నది సులభతరమైన కార్యం చేయటానికి కాదు. సులభతరమైన కార్యాలను రూపాం తరీకరణను గురించి ఆలోచన లేని వారికి వదిలేద్దాం.

*

ధనార్జన మార్గాలు, వాటి సమిష్టి ఉపయోగం

ఎవరైనా అనైతిక మార్గాలలో ధనార్జన గావించినట్లయితే, దానిలో కొంతైనా దైవకార్యార్థం అర్థించవచ్చా?

శ్రీఅరవిందులు ఈ ప్రశ్నకు సమాధాన మిచ్చారు. వారంటారు, ధనం స్వయంగా ఒక వ్యక్తికి చెందిన శక్తి కాదు; ఏ మార్గంలో నైతే నీవు దానిని ఆర్జించావో అది వ్యక్తిగతంగా నీకు మాత్రమే సంబంధించి వుంటుంది. అది నీకు తీవ్రమైన హాని కలి గించవచ్చు, ఇతరులకు కూడా హాని కారకం కావచ్చు, కానీ తత్కారణంగా ఏ మాత్రం ధనంయొక్క లక్షణం మారదు. ఎందుకనగా అది పూర్తిగా వ్యక్తిగతంగా ఎవరికీ చెందని శక్తి. ధనానికి రంగు లేదు, రుచి లేదు, మానసిక చేతన లేదు. అది ఒక శక్తి — ఒక నిజాయితీపరుడు వదిలె ఊపిరి కన్నా ఒక నయవంచకుడు వదిలే ఊపిరి కల్మషమైనది అనగలమా? ఆ విధంగా నుంటుందని నే ననుకోను, ఫలితం ఒకే విధంగా నుంటుందనుకుంటాను. వాస్తవమైన కారణాల మూలంగా ఎవరైనా దొంగిలించబడిన ధనాన్ని నిరాకరించవచ్చు కానీ ఇది కేవలం ఆచరణాత్మక కారణాల వలన జరుగుతుంది, దైవికమైన కారణాల వలన కాదు. ఇది కేవలం ఒక మానవ సహజమైన భావన. ఒక క్రియాశీల దృక్పథంలో ఎవరైనా అనవచ్చు: "ఆహ్! కాదు, నీవు ఈ ధన మార్జించిన మార్గం హేయమైనది. అందువలన దానిని దైవార్పణం గావించ లేను". ఆ విధంగా అనటానికి కారణం అతనికి ఒక మానవీయ చైతన్యం వున్నందువలన. కానీ వేరొకరి విషయంలో (అతి నీచమైన వాడనుకుందాం) ఒక హత్య చేసి తద్వారా ధన మార్జించినవాడు; హఠాత్తుగా తీవ్ర మనోవేదనకు గురై,

పశ్చాత్తాపంతో తనను తాను ఈ విధంగా సమాధానపరచుకుంటే, "ఈ ధనంతో నేను చేయాల్సింది ఒకటే, ఎక్కడ సద్వినియోగపరచ బడుతుందో, వ్యక్తిగత ప్రయోజన మాశించకుండా, అక్కడ ఇవ్వాలి". ఆ ధనాన్ని స్వప్రయోజనానికై వినియోగించడం కన్నా, ఈ విధంగా వినియోగిస్తే మేలని నా కనిపిస్తుంది. అక్రమ మార్గాలలో ఆర్జించ బడిన ధనం స్వీకరించుటకు అడ్డుపడిన కారణాలు కేవలం ఆచరణాత్మకమైనవి కావచ్చు కానీ అంతకు మించిన ప్రగాఢమైన కారణాలు కూడా వుండవచ్చు. అవి నైతిక కారణాలే అని నే నరను కాని ఆధ్యాత్మికపరమైనవి కావచ్చు — ఒక వ్రతదీక్ష లాంటి దృక్కోణంలో, ఎవరైనా అనవచ్చు. "నీవు దుర్మార్గంగా ఆర్జించిన ఈ ధనంతో నీవు యదార్థ మేలును పొందలేవు, నీవు చేయగలిగిందల్లా దానికి తిరిగి యథాస్థానంలో వుంచడమే". అది పాప పరిహార మార్గమని అనుకోవచ్చు, ఆ విధంగా అతడు ధనాన్ని ఏదో ఒక పనికి వినియోగించడం కన్నా అభ్యున్నతిని సాధించటానికి ఉపయోగ పడుతుంది. వ్యక్తి ఈ విషయాన్ని ఈ విధంగా పరిగణించాలి. నిశ్చితమైన నియమ నిబంధనలు విధించ లేము. నేను పదే పదే చెప్పేది ఇదే, నిబంధనను విధించటం అసాధ్యం. ప్రతి ఒక్క సందర్భం వేరుగా నుంటుంది. కానీ అది ధనంపై ప్రభావం చూపుతుందని అనుకోకు. ధనం ఒక భూతల శక్తి, ఏ విధంగా ఆర్జించబడినా దాని లక్షణం మారదు. ధనం ధనంగానే వుండిపోతుంది, నోటు నోటుగానే వుంటుంది, బంగారపు తునక బంగారు తునకగానే వుంటుంది, అది దాని శక్తిని దానితో పాటే కలిగి వుంటుంది గనుక ఆ శక్తి అక్కడే వుంటుంది. తప్పు చేసిన వారికే అది హాని కలుగ చేస్తుంది. అది స్పష్టంగా వ్యక్తపడే విషయం.

*

మనస్సుయొక్క స్థితి మరియు ఇచ్చుటకు ప్రేరణ

అప్పుడు ప్రశ్న మిగులుతుంది. మనసుయొక్క ఎటువంటి స్థితిలో, ఏ కారణము వలన నిజాయితీ లేని వ్యక్తి తాను వినియోగించే ధనం దైవకార్యానికి చెందినదిగా పరిగణిస్తాడు? అది వివేకము ద్వారా తన హృదయమును కుదుటపరచడానికి భద్ర తగా చేసినట్టి కార్యమా? ఇది మంచి ఉద్దేశ్యము కాదన్నది స్పష్టం, ఇది ప్రోత్సాహిం చబడునది కాదు. కానీ ఒక వేళ అతడు తను చేసినదానికి ఒక రకమైన పశ్చాత్తాపము, వ్యాకులత చెందిన భావనతో, తాను అన్యాయముగా పొందినదాని నుండి తనను

తాను నిరోధించుకునేందుకు, సాధ్యమయినంతవరకు దానిని సాధారణమైన మంచి కొరకు ఉపయోగించినట్లయితే, అప్పుడు దాని గురించి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఏమీ వుండదు. అది సందర్భం మీద ఆధారపడి వుంటుంది.

ఒకవేళ నువ్వు అన్నదానిని గురించి నేను ఈ విధంగా అర్థం చేసుకున్నట్లయితే: మాట్లాడశక్యంగాని మార్గాలలో ఒక వ్యక్తి ధనం సంపాదించినట్లైతే, అతని వద్దకు వెళ్ళి దైవకార్యం కొరకు ధనాన్ని అడగటం ఖచ్చితంగా మంచిది కాదు, ఎందుకంటే అది సంపాదించిన మార్గాన్ని పరిహరించి నట్లవుతుంది. ఎవరూ అలా అడగ కూడదు, అది సాధ్యం కాదు. ఒక వేళ యాధృచ్ఛికంగా ఏదో ఒక కారణంగా అతడు ఇచ్చి నట్లైతే దానిని తిరస్కరించడానికి ఏ కారణము లేదు. కానీ దాని కోసమని అతడిని అడగటం అన్నది అసాధ్యం, ఎందుకంటే అతను డబ్బు సంపాదించే విధానమును చట్టబద్ధం చేసినట్లవుతుంది. ఈ వ్యత్యాసం గమనించ తగ్గది.

సాధారణంగా ఈ సందర్భాలలో ఎవరైతే తుచ్ఛుల వద్దకు వెళ్ళి డబ్బులు అడుగుతారో, వారిని భయపెట్టే మార్గాలను ఉపయోగిస్తారు. వారిని శారీరికంగా కాకుండా వారి భవిష్య జీవితం గురించి భయపెడతారు. వారికి ఏమి జరుగబోతంది అన్నదాని గురించి ఒక దిగులును సృష్టిస్తారు. ఇది మంచిది కాదు. ఇటువంటి కార్యవిధానములను ఉపయోగించ రాదు.

*

దైవకార్యము కొరకు ధనము ఆర్జించుట

శ్రీమాత కొరకు ధనమును తిరిగి ఎలా ఆర్జించాలి?

ఆహా! ఇక్కడ ఒక సూచన వున్నది. మూడు విషయాలు పరస్పరాధీనమై వుంటాయి. (ఇక్కడ శ్రీఅరవిందులు అంటారు): అధికారము, ధనము, కామము. ఈ మూడు ఒకదాని మీద ఒకటి ఆధారపడి వుంటాయి అని నే ననుకుంటాను. ఏ ఒక్కటి పొందాలన్నా ఈ మూడూ జయించవలసి వుంటుంది. నువ్వు ఒకటి పొందాలనుకుంటే మిగిలిన రెండు నీకు వుండాలి. ఈ మూడు అంశాలపై అధికారత సాధించకపోతే, కోరికను, ధనం పట్ల వ్యామోహాన్ని, కామవాంఛను అధిగమించ లేకపోతే వాటిలో ఏ ఒక్కదానిని స్థిరంగా, రూఢీగా పొందలేరు.

ప్రస్తుత ప్రపంచంలో డబ్బుకు అంత ప్రాధాన్యతను ఇచ్చేది కేవలం డబ్బు

మాత్రమే కాదు. డబ్బును పోగు చేసుకుని, దానిని పోగు చేసినందుకు, లెక్క పెడుతున్నందుకు సంతోషపడే కొంతమంది మూర్ఖులను ప్రక్కన పెడితే, సాధారణంగా ధనం కోరబడేది, పొందబడేది అది ఇచ్చే సంతృప్తుల కోసమే. ఇది పూర్తిగా పరస్పరానుగుణమైనది. ఈ మూడింటిలో ప్రతీది కోరికల ప్రపంచంలో కేవలం తన స్వంత విలువపై మాత్రమే కాక మిగిలిన రెండింటి మీద ఆధారపడి వుంటుంది. ఈ దృశ్యాన్ని మీకు వ్యక్తపరచాను: పెద్ద నల్లని సర్పము ప్రపంచ సంపదలను, భూసంపదను కాపలా కాస్తుంటుంది — అతను కామ ప్రచోదనలపై ఆధిపత్యం కోరాడు. ఎందుకంటే కొన్ని సిద్ధాంతాల ప్రకారము శక్తి యొక్క మౌలికావసరము ఈ తృప్తిలో తన లక్ష్యాన్ని చూస్తుంది. ఒకవేళ ఎవరైనా దీనిని సాధించ గలిగితే, మానవచేతన నుండి దానిని ఎవరైనా రద్దు చేసినట్లయితే, అధికారము, ధనము కొరకు కోరిక యాంత్రికంగా అదృశ్యమవుతుంది. అతి స్పష్టంగా భూసంబంధ మానవ జీవితంలో ఇవి మూడు గొప్ప అవరోధాలు. ఇవి మూడు జయించబడ లేక పోతే మానవజాతి పరివర్తనమునకు ఎటువంటి అవకాశము వుండదు.

CWM 4:380-81

*

బీదరికము మరియు సంపన్నత

శ్రీఅరవిందులు ఇక్కడ మహాలక్ష్మి గురించి ఇలా చెబుతారు: "బీదగా వున్నదంతా ... ఆమె ఆగమనమును ప్రతిఘటిస్తుంది"?

అవును, బీదరికం, దయాహీనమైన, నిరుత్సాహమైన, ఉదారతలేని, అంతరంగ సంపన్నత లేనిదంతా బీదతనమే. అనార్ద్రంగా, జడంగా, మూసుకుపోయి వున్నదంతా మహాలక్ష్మి ప్రవేశాన్ని నిరోధిస్తుంది. ఇది ఎక్కువ ధనమునకు సంబంధించిన విషయము కాదని మీకు తెలుసు. అమితమైన ధనవంతుడు కూడా మహాలక్ష్మి దృక్పథంలో అత్యంత బీదరికంలో నున్నవాడు కావచ్చు. అలాగే అతి బీదవాడయినా, అతని హృదయం ఉదారమైతే అతి ధనవంతుడుగా పరిగణించబడతాడు.

'బీదవ్యక్తి' అని మనం అన్నప్పుడు, ఆ పదంయొక్క ఖచ్చితమైన అర్థం ఏమిటి?

ఒక బీద వ్యక్తి అంటే ఏ గుణాలు, ఏ శక్తి, ఏ బలము, ఎటువంటి దయ దాక్షిణ్యాము

లేనివాడు. అలాగే అతడు సంతోషం లేకుండా, దౌర్భాగ్యుడై వుంటాడు. ఎవరైనా ఉదారత లేనపుడే దుఃఖంతో వుంటారు. స్వతహాగా, లెక్క కట్టకుండా ఈయగల ఉదార స్వభావంగల వ్యక్తి ఎప్పటికీ దుఃఖంగా వుండడు. తమలో తామే ముడుచుకొని ఎప్పుడూ వస్తువులను తమ వైపు రాబట్టుకోవా లనుకునేవారు, విషయాలను, ప్రపంచాన్ని తమ దృష్టితోనే చూసేవారు సంతోషంగా వుండలేరు. దుఃఖబాజితులు వీరే కానీ ఎవరైనా స్వయంగా లెక్కపెట్టకుండా ఉదారంగా ఇచ్చేవారు, ఎప్పటికీ దుఃఖంగా వుండరు. తీసుకోవాలనుకున్నవాడే దుఃఖంగా వుంటాడు, తనను తాను ఇచ్చుకునేవాడు. ఎప్పటికీ అలా వుండడు.

CWM 4:403-04

లక్ష్యభరితమైన కోరిక మరియు పరోపకారము

పాఠశాల కొరకు ధనము నివ్వటానికి సిద్ధపడ్డ ఈ ప్రత్యేక వ్యక్తులకు ఒకవేళ అక్కడ ఒక దైవకార్యము నేరవేర్చవలసి వున్నదని, దానిని ఒక ప్రత్యేక విధానంలో నెరవేర్చాలని దైవము నిర్ణయించాడని చెప్పినా, అది దైవకార్యమని వారు నమ్మినప్పటికీ ఏదైనా ఇవ్వటానికి నిరాకరిస్తారు, ఎందుకనగా అది దాతృత్వమైనదిగా పరిగణించబడ లేదు కనుక కొంత మంచి చేశామనే తృప్తి వారిక వుండదు. దీనినే నేను లక్ష్యభరిత కోరిక అన్నాను. ఒక ఆసుపత్రిని ప్రారంభించడానికి లక్షల కొద్ది డబ్బును ఇవ్వగలిగినవాళ్ళు నాకు తెలుసు, ఎందుకంటే ఒక గొప్పదాని కోసం, ఉదాత్తమైనదాని కోసం, ఔదార్యమైనదాని కోసం ఇచ్చామని వారికి సంతృప్తి కలుగుతుంది. దానితో వారు తమను తాము గొప్పగా ప్రస్తుతించుకుంటారు. దీనిని నేను లక్ష్యంతోలక్ష్యభరిత కోరిక అంటాను. నాకు తెలిసిన ఒక హాస్యమూర్తి ఇలా అనేవాడు "భగవంతుడి రాజ్యము అంత తొందరగా రాదు. మానవజాతి బాధలు పడకపోతే పాపం ఈ పరోపకారుల కొరకు మిగేలేదేమి? వారు పనిచేయడానికి ఏమీ వుండదు." దీని నుండి బ యటకు రావడం కష్టసాధ్యమే. ఏది ఏమైనా తనను తాను దైవానికి ఇచ్చుకుంటే తప్ప ప్రపంచం తానున్న ఈ స్థితి నుండి బయటకు రాదు. సర్వ సుగుణాలను నువ్వు స్తుతించవచ్చు, ఇది నీ ఆత్మసంతృప్తిని పెంచుతుంది, అనగా నీ అహంకారాన్ని. ఇవి నిన్ను యదార్థంగా దైవాన్ని తెలుసుకోవడానికి సహాయపడవు. ఈ ప్రపంచంలో తెలివైనవారిని, ఉదారమైనవారిని మార్చడం చాలా

కష్టం. వారు తమ జీవన విధానంతో ఎంతో సంతృప్తి చెంది వుంటారు. జీవితమంతా అన్నిరకాలైన తెలివితక్కువ పనులు చేసినవాడు బాధపడి, వెంటనే క్షమాపణ కోరి ఇలా అంటాడు, "నేను ఏమీ కాను, ఏమీ చేయలేను. నన్ను ఏం చేయాలనుకుంటావో అది చెయ్యి." అటువంటివాడు తెలివైనవాడి కన్నా, పూర్తి జ్ఞానంతో వున్నవాడి కన్నా ఎక్కువగా దైవానికి దగ్గరవుతాడు. మానవజాతికి సేవ చేసి ఔదార్యంతో వున్నవారు, తెలివైనవారు ఎంతో ఆత్మసంతృప్తితో వుంటారు. వారికి తమను తాము మార్చుకునే ఆలోచన వుండదు. అలాంటివారు సాధారణంగా ఇలా అంటారు "నేను ప్రపంచాన్ని తయారుచేసి వుంటే, ఇలా చేసి వుండేవాడిని కాదు. దీనికన్నా ఎంతో మంచిగా సృష్టించి వుండేవాడిని" దైవం చెడుగా చేసినదానికి మంచిగా అమర్చడానికి ప్రయత్నిస్తారు. వారి దృష్టిలో ఇదంతా పనికిమాలినది, నిష్ప్రయోజన మైనది. అటువంటి దృక్పథంతో నువ్వు భగవంతునికి చెందలేవు. నీకు, ఆయనకు మధ్యన ఎప్పటికీ స్వీయ మేధోపరమైన ఆధిక్యతకు చెందిన చైతన్యవంతమైన అహంకారము వుంటుంది, అది దైవాన్ని బేరీజు వేస్తుంది, ఎప్పటికీ తప్పు చేయననే గట్టి నమ్మకంతో వుంటుంది. ఒకవేళ ప్రపంచాన్ని వారు తయారుచేసి వుంటే భగవంతుడు చేసిన దుష్కార్యములను, మూర్ఖపు పనులను తాము చేసి వుండేవారము కామనుకొనేవారు. ఇదంతా గర్వమువలన, అతిశయమువలన, ఆత్మ-స్తుతివలన సంభవిస్తుంది. మానవజాతికి సేవ చేయాలనుకునే వారిలో దాని బీజం ఖచ్చితంగా వుంటుంది.

*

మానవజాతికి సహాయం చేయడం ఒక విధమైన అహంకారం

మిలియన్ల కొద్దీ ఆసుపత్రులను నువ్వు తెరవవచ్చు, కానీ అది ప్రజలను అస్వస్థత చెందడం నుండి నివారించలేదు. దీనికి వ్యతిరిక్తంగా వారు అస్వస్థత చెందడానికి ప్రతి సౌకర్యము, ప్రోత్సాహము వుంటాయి. ఈ రకమైన ఆలోచనల్లో మనం కూరుకుపోయి వున్నాము. "నేను ప్రపంచంలోకి వచ్చాను, నేను ఇతరులకు సహాయం చేయాలి" అనుకుని చేతనను సంతృప్తి పరుస్తారు. వారికి వారే ఇలా చెప్పుకుంటారు "నేను ఎంత శ్రద్ధ లేనివాడిని! నేను మానవజాతికి సహాయంచేయాలి." ఇదంతా అహంకారము తప్ప ఇంకేది కాదు. వాస్తవానికి నువ్వు మొదట పరిగణించే

వ్యక్తివి నువ్వే. నువ్వు బాధను తగ్గించాలనుకుంటున్నావు, కానీ నువ్వు దుఃఖంయొక్క సామర్థ్యాన్ని సంతోషంగా వుండగలిగే నిశ్చయతగా పరివర్తనం చెందించ లేకపోతే ప్రపంచం మారదు. అది ఎప్పటికీ అలాగే వుంటుంది. మనం చక్రభ్రమణంలో తిరుగుతూనే వుంటాము — ఒక నాగరికత ఇంకొక ఒక నాగరికతను అనుసరిస్తుంది, ఒక విపత్తు ఇంకో దానిని అనుసరిస్తుంది; కాని విషయంలో మార్పు వుండదు. ఎందుకంటే ఏదో ఒక లోటు కనిపిస్తున్నది, ఏదో ఒకటి అక్కడ లేదు, అదే చైతన్యం — అంతే.

ఇది నా అభిప్రాయము. అది నీ కిస్తున్నాను. దానికి నీ వెంత విలువ ఇస్తావో తెలియదు. నువ్వు ఆసుపత్రులు, విద్యాలయాలు నిర్మించాలనుకుంటే అలా చేయ వచ్చును. అది నీకు సంతోషాన్నిస్తే మంచిదే. కాని అది అంత ముఖ్యమైనది కాదు. నేను 'ముసియర్ విన్సెంట్' అన్న చలనచిత్రాన్ని చూసినపుడు చాలా ఆసక్తిగా అనిపించింది. తాను పదిమంది బీదవారికి అన్నం పెడితే, వందమంది రావడం కనిపెడతాడు. కోల్ బర్ట్ అతడితో అన్నది అదే, "వారిని పోషించి, ఆ బీదవాళ్ళని నువ్వు సృష్టించినట్లుగా కనిపిస్తున్నది!" ఇది పూర్తిగా అసత్యం కాదు. ఏది ఏమైనా విద్యాలయాలను ఏర్పాటు చేసి శిక్షణ గరపటం, ఖాయిలాపడినవారకి ఆసుపత్రులను నిర్మించడం నీవు నీ విధిగా తలిస్తే మంచిదే. కానీ దానిని నీవు ముఖ్యమైనదిగా భావించ కూడదు. అది నీ స్వతం సుఖము కోసము నువ్వు మహిమాన్వితంగా చేసేది. "ఇది నాకు సుఖాన్ని ఇస్తుంది గనుక నేను ఇది చేస్తున్నాను" అనాలి. అంతే తప్ప యోగం గురించి మాట్లాడకు. నీవు చేస్తున్నది యోగం కాదు. నువ్వు

తాము ఉపయోగించే ధనము దైవసంకల్పానికి అనుగుణంగా వున్నదని ఎవరైనా ఎలా తెలుసుకోగలరు?

ముందుగా దైవసంకల్పం ఏదో తెలుసుకుని వుండాలి. కాని ఇంకా ఖచ్చితమైన పద్ధతి వుంది. తనను గురించి తాను నిశ్చితంగా నిర్ధారించుకో లేనప్పుడు ధనాన్ని దైవకార్యానికి సమర్పించడం — 'దివ్యంగా' అని అనడంలో అర్థం స్వయం తృప్తి కొరకు ధనమును ఉపయోగించకపోవడం, దానిని దైవసేవలో వుంచడం.

CWM 4:374 శ్రీమాత



ఏదో గొప్పగా చేస్తున్నానని నమ్ముతున్నావు, అంతే. ఇది కేవలం నీ వ్యక్తిగత సంతృప్తి కొరకు మాత్రమే.

CWM 5:14-16 — శ్రీమాత

ధనము — దైవకార్యము

ఒక మంచి ఉద్దేశ్యంతో సహాయం చేయటం అంటే అందరికీ తెలిసేలా ఒక ఆస్పత్రిని నెలకొల్పటమో, బాలల సంరక్షణ కేంద్రాన్ని స్థాపించటమో అని అనుకోవచ్చు. ఇట్లాంటివి అందరికీ తెలిసేవి, ఉపయోగపడేవి కూడా. అట్లా కాకుండా, "మేము మానవ చేతనను మార్చా లనుకుంటున్నాము. ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించా లనుకుంటున్నాము" అని ఎవరైనా అంటే, వినేవారు "క్షమించండి, దైవకార్యం గురించి మీరు మాట్లాడకండి. భగవంతుడే తనకు తానుగా ఆ కార్యం నెరవేరుస్తాడు" అంటారు. "దేవుడే అట్లాంటి వాటికి సాధన సంపత్తిని సమకూరుస్తాడు" అని కూడా అంటారు. దానికి మా సహాయంతో పని లేదు అని కూడా అంటారు. కొందరు నాతో ఇలా అన్నారు కూడా! ఇంకో విషయం: "మీరు భగవంతుని ప్రతినిధివైతే, మీరు అన్నీ చేయగలరు; మా అవసరం ఏమీ ఉండదు," అని కూడా అంటారు.

ఇట్లాంటి అభిప్రాయాలు మీకు మాత్రం లేకుండా వుంటాయా! దేవుడు 'సర్వ శక్తిమంతుడు' అనీ, ఆయన తలచుకుంటే అన్నీ వాటంతట అవే జరుగుతాయనీ అందరూ నమ్ముతారు. ఇదే మొదటి నుంచీ ఉన్న వాదన. ఇది సిద్ధాంతం కూడా! భగవంతుడు సర్వశక్తిమంతుడు; అందువలన ఆయకు ఏదీ అసాధ్యం కాదు!

సరే, ఇక నేను చెప్పేది ఏమిటంటే ఇదే గనుక నిజమైతే భగవంతుడు ఒక వింత మృగంతో సమానం. ఎందుకంటే ఎవరు సర్వ శక్తిమంతుడో, ఎవరు ఈ ప్రపంచాన్ని సృష్టించగలిగాడో, అనేక మంది బాధా సర్వ దష్టులైన ప్రజానీకాన్ని చూచి కూడా మందహాసంతో తిలకిస్తూ "అంతా బాగానే వుంది" అని భావిస్తున్నాడో అట్లాంటివాడు ఒక మృగం కాక మనిషి ఎలా అవుతాడు! ఇది నా చిన్ననాటి భావన. అప్పుడు నాకు సుమారుగా ఐదు సంవత్సరాలు ఉంటాయి. కాని నాకు అదే సమ యంలో అలాంటి భావాలు సరియైనవి కాదని అనిపిస్తూనే వుండేది.

మీకు కొద్దో, గొప్పో తాత్విక చింతన వుంది కాబట్టి అలాంటి అసత్యమైన, ప్రమాదకరమైన భావాల నుండి ఎలా బయటపడ గలిగానో అర్థం అయేలా వివరించ గలను. ముందుగా అలాంటివి చిన్నపిల్లల మనస్తత్వానికి చెందిన భావాలని మీరు గ్రహించాలి; కొంచెం ఇంగిత జ్ఞానం ఉపయోగించాలి, అంతే!

సర్వ సాధారణంగా దైవాన్ని మీరు ఒక వ్యక్తిగానే ఊహించగలరు. ఆ విధంగానే మానవులకు బోధ పడుతుంది. అంటే ఒక 'వ్యక్తి' ఈ విశ్వాన్ని సృష్టించాడనేగా మీరు అనుకునేది! అంత శక్తమంతుడు ఏమైనా చేయగలడనేగా మీ నమ్మకం. ఆ చేయగలిగిన వాటిలో మంచివీ, చెడ్డవీ కూడా వున్నాయిగా! అట్లాగే భగవత్ సృష్టిలో అజ్ఞానం, అసహనం, మోసం, బాధలు, అసూయాద్వేషాలు కూడా వున్నాయిగా! వీటిని కూడా ఆ సృష్టికర్తకే ఆపాదించాలి కదా! అప్పుడు ప్రపంచం నరకప్రాయం అవటం లేదా? రోజంతా సంతోషంగా వున్నామని చెప్పగలిగేవారు ఎందరున్నారు? ఇది కూడా దైవసంకల్పమేనా? అలాంటి ప్రపంచాన్ని సృష్టించి అందులో దుఃఖాలను, బాధలను కూడా సృష్టించడాన్ని నేను నరకప్రాయం అంటాను. ఇట్లాంటి దైవం కొన్ని మతగ్రంథాలలోనూ కన్పిస్తాడు. నేను మాత్రం ఆయనను 'పరమాత్మ' గా అంగీకరించలేను.

CWM 5:161-62

భగవంతుడు అవినీతిపరులకు సంపదలను ఎందుకు అనుగ్రహిస్తాడు?

అమ్మా, నిజాయితీ లేనివారికి శక్తియుక్తులను దైవం ఎందుకు అనుగ్రహిస్తాడు?
బిడ్డా, పరమాత్మకు మానవ దృక్పథంతో సంబంధం ఉండదు. ఈ విషయం బాగా గుర్తించు. మనకు ఏది హేతుబద్ధంగా కనిపిస్తుందో అది పరమాత్మకు కూడా అలాగే కనిపించాలని అనుకోకూడదు. ఆయన కారణాలు ఆయనకు ఉంటాయి. మానవుల మంచిచెడ్డలు దేవునికి కూడా అదే విధంగా వుంటాయని అనుకోలేము. ఉదాహరణకు ఒక వ్యక్తి ధనకాంక్ష వలన అవినీతికి, మోసాలకు పాల్పడుతున్నాడనుకోండి. అట్లాంటి వాడు తన సర్వస్వం కోల్పోయి, దరిద్రుడు కావాలని అంతా అనుకుంటారు. కాని అందుకు విరుద్ధంగా జరగటం మనం చూస్తూ ఉంటాము. నిజానికి అట్లాంటి అవినీతి పరులే పైకి వస్తారు కూడా! చెప్పాలంటే ఇది పైకి కనపడే విషయమే కాని, అసలు విషయం అది కాదు. నీతిమాలి ధనార్జన చేస్తున్నవారు, నిజానికి సంతోషంగా

వుండలేరు. వారు తమ సంతోషాన్ని పణంగా పెట్టి ధనాన్ని ఆర్జిస్తున్నారు; అంతే! వారికి డబ్బు ఉండవచ్చు, కాని అదే సమయంలో లోలోన అశాంతే వుంటుంది. డబ్బు వుంటే శాంతి ఉండదు! సంపద పెరుగుతున్నకొద్దీ, శాంతి తగ్గుతూనే వుంటుంది. సంపదలు గొప్పలు చెప్పుకోటానికే. దీన్ని పొందగోరేవారు కొన్ని సంతోషాలను వదులుకోవాల్సి వస్తుంది. డబ్బు వుంటే 'అంతరాత్మ' వుండదు.అనేక సందర్భాలలో డబ్బు వున్నవాళ్ళకు సంతోషం కూడా వుండదు. డబ్బే కష్టాలకు మూలం అవుతుంది కూడా! పటాటోపాన్ని చూచి వ్యక్తి ఆనందాన్ని అంచనా వేయలేము.

భగవంతుడు అర్హతను బట్టి అనుగ్రహిస్తాడనుకోవటం సహజం. ఒక విధంగా ఇది నిజమే! మనసులో అజ్ఞానము, గర్వము, అహంభావము ఉందనుకో. నీవే సత్యానికి, జ్ఞానానికీ దూరంగా వుండాలను కుంటావు; చైతన్యం నుండి, సంతోషం నుండి దూరమౌతావు. ఇది దైవానికి దూరమౌతున్నట్లే గదా! ఆ విధంగా డబ్బును కోరేవారు ఆధ్యాత్మికతకు దూరం కావల్సివస్తుంది. దైవత్వానికి దగ్గర కావాలను కునేవారు దివ్యచేతనను అభివృద్ధి చేసుకోవాల్సిందే! భవబంధాలు మన మనసులో వున్నంత వరకే మనం భౌతిక లాలసత్వానికే చేరువౌతాము; దివ్యత్వ భావనకు దూరమౌతాము. ఆ విధంగా మన అంతిమ లక్ష్యమైన 'దివ్యత్వం' మనంతట మనమే విడిచిపెట్టి నట్లవుతుంది. ఇది పరాజయాన్ని వరించటం వంటిది. సత్యాన్ని వదలుకోవటమే ఆధ్యాత్మిక పరాజయం అంటే.

CWM 6:238

శ్రీమాత

కాసులు దాచే వ్యక్తి కానీ కూడా ఖర్చు పెట్టడు. దాచుకున్న బంగారం మకిలి పట్టక పోవచ్చు. కాని, దాన్ని సద్వినియోగం చెయ్యటం వల్ల వచ్చే ఆనందం రాకుండా పోతుంది కదా! చలామణిలో లేని డబ్బు ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే. ఇలాంటివారు డబ్బున్న దరిద్రులు.

CWM 7:52

శ్రీమాత

భక్తిశ్రద్ధల నిరూపణ

శ్రీమాతా, ఇక్కడకు వచ్చే ధనవంతులలో కొందరు చాలా భక్తి, శ్రద్ధలు కన బరుస్తారు. కాని ఖర్చు విషయం ఎత్తగానే బేరసారా లాడుతారు. వారి భక్తి ఎలాంటిది?

శ్రీమాత: దేవుడు ఇచ్చిన సంపద, దైవపరంగా వినియోగించటం విషయంలోనా?

అవును, అట్టి సందర్భాలలోనే వారు బేరాలాడటం మొదలు పెడ్తారు.

శ్రీమాత: చెప్తా విను. ఆ ప్రశ్నకు నేను ఇప్పటికే సమాధానం ఇచ్చి వున్నాను. అది అంతే. అట్లాంటి వాళ్ళకు భగవంతుని ప్రార్థించి ఆయన వలన అన్ని లాభాలనూ, అనుగ్రహాలను ఆశిస్తారు. వారంతా అడిగేవారే కాని, ఇచ్చేవారు కారు. వారి భక్తి కేవలం ఒక ముసుగు వంటిది. లోపల ఉన్న ఆరాటాన్ని కప్పి పుచ్చుకునే ప్రయత్నం అది. వారికి అనంతమైన కోరికలు వుంటాయి. అద్భుతాలు జరగాలనీ, అతీంద్రియ శక్తులు రావాలనీ, కొద్దో, గొప్పో సుఖభోగాలు అనుభవిస్తూ ప్రశాంతంగా జీవనం గడపాలని వారు కోరుకుంటారు. కాని వాళ్లు ఇవ్వవలసిన చోట వీలయినంత వరకు తక్కువ ఖర్చు పెట్టాలనే ఆలోచిస్తారు. ఇంకా, ఇంకా భక్తిప్రపత్తులు చూపుతారేమో కాని, వీలయినంత తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాన్ని పొందాలని ఆలోచిస్తారు. ఇది సరియైన దృక్పథమేనా? అలాంటిది ఆధ్యాత్మికం అవుతుందా, లేక సుఖజీవనం కోసం దేవుని ఆశ్రయించటం అవుతుందా?

ఆ విధమైన కపట భక్తి ఎక్కువ కాలం కొనసాగదు. మోసం ఎప్పటికైనా బయట పడుతుంది; చివరకు భంగపడుతుంది.

ఇచ్చి పుచ్చుకోవటం ఆధ్యాత్మికంలోనూ వుంటుంది; భౌతిక జీవనంలోనూ వుంటుంది. అసలు ఏ కోరికా లేకుండా, ప్రతిఫలం ఆశించకుండా, సర్వం దైవానికి సమర్పించుకునేవారు నూటికో, కోటికో ఒకరు ఉంటారు.

CWM 8:17 శ్రీమాత

ధనం భగవంతునికి సమర్పించటం

ప్రశ్న: నిత్యజీవితంలో ధనవంతుడు ఎవరైనా తన ద్రవ్యాన్ని దేవునికి వినియోగించాలని అనుకున్నా డనుకోండి. అతనికి దైవస్వరూపం ఎలాంటిదో తెలియనపుడు

దేవునకు ఎలా సమర్పించగలడు?

శ్రీమాత: నిజమే, కాని ఈ ప్రశ్న ఉత్పన్నం కానే కాదు. వ్యక్తి తనలోనూ, బయట ప్రపంచంలో అంతటా ఉన్న దైవాన్ని గుర్తించలేకపోతే సమర్పణకు అర్థమే లేదు. తెలియని వారికి ఎలా ఇవ్వగలము? అందువలన దైవం ఉనికిని గుర్తించి, ధార్మిక అవసరాలకు ఖర్చుపెట్టాలి. ఇదే దైవం కోరుకునేది. తనలోని దైవాన్ని గుర్తించి తనకు ధర్మంగా కావలసినది సమకూర్చు కోవాలి. ఇది ధర్మమైన ఖర్చే ఇక ఇతరుల శ్రేయస్సుకై వెచ్చించేది కూడా దైవం కోసం ఖర్చు పెట్టేదే. నిజానికి దైవం తన కోసం ఏమీ ఆశించడు. మనం దైవానికి అంకితం అయితే మనం పెట్టే ఖర్చు దైవానికి చెందుతుంది. అప్పటి దాకా దైవం కూడా మననుంచి ఏమీ ఆశించడు. ఆయన తీసికోటానికి సిద్ధంగా ఉన్నపుడే ఇచ్చినదానికి విలువ ఉంటుంది. దైవం నీ నుండి స్వీకరించినదానికి, నీ అంతట నీవు ఇవ్వకపోతే బాగా వుండదు. అని భావిస్తూ ఇచ్చేదానికి సంబంధమే లేదు. మారాలని నీలో వస్తేనే దైవానికి ఇచ్చినదానిలో అర్థం వుంటుంది.

మంచి ఏది జరిగినా అందరకూ మంచిదే. అది ఇతరులకూ, భావి తరాలకూ ఆదర్శం అవుతుంది కూడా. 'దివ్యజీవనం' చేయాలని నీవు అనుకున్నపుడే 'అర్పణ' ప్రారంభం అవుతుంది.

CWM 8:16 శ్రీమాత

సూత్రాలు

ఇవ్వటాన్ని బట్టే నీవు ధనవంతుడవు అనిపించుకుంటావు; ఉన్నదాన్ని బట్టి కాదు. సరియైన మార్గంలో ఖర్చు పెట్టటం కూడా అదృష్టమే.

*

వీలయినంత వరకు సన్మార్గంలో ఖర్చు పెట్టగలిగిన నాడే నీవు ధవవంతుడవు కాగలవు.

ఫిబ్రవరి 1962

*

స్వలాభం లేని సంపద: మిక్కిలి సంపద ఉన్నవాడు ఎక్కువ ధర్మకార్యలు చేయాలి కూడా!

*

ఉదార స్వభావం గలవారే నిస్సంకోచంగా ఖర్చు పెట్టగలరు.

*

ఆధ్యాత్మిక శక్తికి, అత్యధిక సంపదకూ సంబంధమే లేదు. ఈ రెండూ ఒకటే అనుకోవటం ప్రమాదకరం.

*

ఆడంబరం కోసం ఇచ్చే కానుకలు దాతలకు గాని గ్రహీతలకు కాని మంచి చేయవు.

*

ఇచ్చిన కానుకల కన్నా ఇచ్చేవారి హృదయంలోని భావన ముఖ్యమైనది.

*

ధనవంతులకు దైవం డబ్బు మాత్రమే ఇస్తాడు; కాని పేదవారికి తనకు తానే సమర్పించుకుంటాడు.

పేదవారు ధనాని కంటే దైవానికే ఎక్కువ విలువ నిస్తారు అనే దానిపై సర్వం ఆధారపడి వుంటుంది.

22 ఆగస్టు 1964

*

భవిష్యత్తును సుఖమయం చేయాటానికే ధనవంతులకు సంపద సమకూరుతుంది. సంపదలు చేరగానే వారు భవిష్యత్తుని మర్చిపోతారు. భయంకరమైన భవిష్యత్తుయొక్క ఒత్తిడికి నలిగిపోతామని వారు గ్రహించలేరు.

*

భౌతిక సుఖ లాలసత్వంలో వున్నవారికి దైవం గురించిన ఆలోచన రానే రాదు కదా!

12 మార్చి 1965

*

ధన పిపాస: ఇది అంతరాత్మను చిన్నదిగా చేసి భవిష్యత్తును దుఃఖమయం చేస్తుంది.

*

ధనం మీద వడ్డీ రాబట్టాలనే ఉత్సాహం నాకు లేదు.

*

కొన్నాళ్ళు 'షేరు మార్కెటు' వ్యవహారాలలో తల దూర్చాను. కాని నష్టపడ్డాను. ఆశలకు పోయి ఉన్నదాన్ని కూడా పోగొట్టుకున్నాను. అందులో తల దూర్చ కుండా వున్నా బాగుండేది. మీరైనా 'స్పెక్యులేషన్' కి పూర్తి వ్యతిరేకమా?

ఆ జూదంలో తల దూర్చనే కూడదు. నేను జూదాన్ని ఆమోదించను. జరిగిందేదో జరిగిపోయింది, ఆ విషయంలో.

17-12-1939

*

మాతా, చిత్త చాంచల్యం లేకుండా వుంటే, ఆర్థిక వనరులు స్థిరంగా, మెరుగుగా వుంటాయా?

శ్రీమాత: చైతన్యం (చేతన) మెరుగు పడాలంటే అది విశాలం కావాలి. దాన్ని సక్రమంగా అదుపులో ఉంచుకోవాలి. అప్పుడు ఇతర వ్యవహారాలు కూడా చక్కబడతాయి. ఆర్థిక విషయాలతో సహా. కాని చేతన విశాలం అయినాక ఆర్థిక విషయాలపై ఆసక్తి తగ్గిపోవటం మొదలవుతుంది.

CWM 15:51-52 శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

ధనం అనేది పైకి కనపడే ఒకానొక విశ్వశక్తి. ఇది ప్రపంచంలో భౌతిక, ప్రాణిక శక్తులపై ప్రభావం చూపుతుంది. భౌతిక జీవనానికి ఇది అనివార్యం! నిజానికి ధన మూలాలూ, నిర్వహణ దైవపరమైనవే! ఇతర దైవశక్తులకు లాగా ధనం కూడా అధోచేతనలో అహంకార, మమకారాలకు లోనై వుంటుంది. అసురశక్తుల ప్రభావానికి లోనై దారి తప్పి సంచరిస్తుంది. ప్రపంచాన్ని నడిపించే మూడు ముఖ్యమైన శక్తులలో ఇది కూడా ఒకటి. రెండవది బలము, మూడవది కామము. మానవుణ్ణి బలంగా ఆకర్షించేవి ఈ మూడే. అసుర శక్తుల వలననే తప్పులు జరిగేది. ధనం ఉన్నవారు వీటిని నియంత్రించటానికి బదులు వీటి ప్రభావంలో పడి దారి తప్పుతారు. ధనాశాపరులు చాలా వరకు ధనానికి స్వాధీనమై వుంటారు, ధనం వారి స్వాధీనంలో నుండదు. ఈ ప్రభావాల నుండి దాదాపు ఎవరూ తప్పించుకోలేరు. వేదాంతులు వీటికి వీలయినంత దూరంగా వుండటానికి ప్రయత్నిస్తారు. వారు ఈ కోరికలకు దూరంగా వుంటారు. కొందరైతే ధనాన్ని నిషిద్ధ వస్తువుగా పరిగణించి దానిని దగ్గరకు చేరనీయరు. అది ఆధ్యాత్మిక నిబద్ధతే! కాని ఈ మార్గం కూడా సరియైనది కాదు. ఎందుకంటే అప్పుడు ధనం గుణం లేనివారికి చెంది ఆధ్యాత్మికతకు వ్యతిరేక శక్తిగా పనిచేస్తుంది. ధనాన్ని దైవపరంగా పొంది, దైవపరంగా వెచ్చించటమే నిజమైన సాధకుడు చేయవలసినది — అదియే సాధకునికి అతిమానస మార్గము

CWSA 25:11-12

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

అఖిల

అఖిల భారత పత్రిక – ఏప్రిల్ 2017



ద్వంద్వమైన ఏకం

పాండిచ్చేరికి నా పునరాగమన వార్షికోత్సవం — ప్రతికూల శక్తులపై నిశ్చితమైన ఆధ్యాత్మిక విజయానికి ప్రత్యక్ష సంకేతం.


24 ఏప్రిల్ 1937

సంపాదకీయం

ఒక అవతారం ఆవిష్కరిపబడిన ప్రతిసారి దైవశక్తి సైతం ఏదో ఒక రూపంలో ఆవిష్కరింపబడింది. అయితే, మామూలుగానే ఆమె పరోక్షంగా నుండిపోయింది. వీరిద్దరూ జతగా కలిసి రావడమే కాదు, దైవిక క్రీడా విలాసంలో ఆమె వాస్తవంగా ముందుండడం కూడా మొట్టమొదటిసారి మనం చూస్తాం. అందుకు కారణం, బహుశా, ఈ సారి విషయం కేవలం ధర్మ సమతుల్యతను పునః పూరించుటయో లేక పరిణామక్రమ శ్రేణిలో మరొక మెట్టును పెంచడమో కాక అదనంగా ఒక నూతన సృష్టి నిర్మాణానికి, ఒక విధంగా ఒక నూతన సృష్ట్యారంభానికి తలపడటం కావచ్చు. నూతన సృష్టిని గురించిన ఆలోచనకు భూచైతన్యంలో అనేక మార్లు బీజం వేయబడినప్పటికీ దాని యదార్థ రూపకల్పన లోని శ్రమ, దాని పుట్టుకలోని పురిటి నొప్పులు, సమస్త సృష్టికి మార్మిక గర్భమగు దైవిక శక్తి మాత్రమే భరించగలదు. వారిద్దరి చేతనలో తేడా లేదని నిర్దుష్టంగా, నిరపేక్షంగా చెప్పటమే గాక, శ్రీమాతకు తెరుచుకొని, ఆమెలో ఆశ్రయం పొందటం తన సమగ్రయోగంలో వేసే ప్రధానమైన అడుగులలో ఒకటి అని శ్రీఅరవిందులు ప్రకటిచడంలో ఆశ్చర్యమేమీ లేదు.

శ్రీఅరవిందుల యోగంలోని పరమసత్యాలు ఈ సంచికలో ప్రస్తావించబడ్డాయి.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



పూజింప బడాలని నేను కోరను. నేను వచ్చినది పనిచేయడానికి, పూజింపబడటానికి కాదు. వారు మిమ్ములను తనివితీరా పూజించి, నన్ను విడిచిపెట్టనీ, మరుగున వుండి నిశ్శబ్దంగా నా పని నిరాటంకంగా నిర్వర్తించడానికి — మరుగుపరచే ముసుగు అన్నింటిలోకి శరీరమే అత్యుత్తమమైనది.

CWM 13: 46

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

ద్వంద్వమైన ఏకం

ఇద్దరున్నారు, కాని వారిద్దరూ ఒకటే. ఒకటిగానే అనేక ప్రపంచాల్లో వాళ్ళు క్రీడిస్తున్నారు. విద్యలో, అవిద్యలో వాళ్ళు సంభాషించుకుంటారు, కలుసుకుంటారు, వాటి గురించి మాట్లాడుతారు. చీకటి వెలుగుల మార్పిడి వారి కనులలో కనిపిస్తుంది. మన ఆనందాన్ని వారు ఆదరణతో అందుకుంటారు. మన బాధతో వారు పోరాడుతారు. మన చర్యలు, మన ఆశలు వారికి సుపరిచితం. మన ఆలోచనల్లో, మన జీవితాల్లో వారు గుప్తంగా ఏకమై వుంటారు.

ఈ విశ్వం ఒక అంతులేని వింత నాటకం. ఎందుకనగా ఇక్కడ వున్నదంతా ఉత్త బూటకం. అది సత్యదర్శనం యొక్క స్వాప్నిక వాస్తవం, స్వప్నం వినా వాస్తవ మవదు. అనంత కాల అస్పష్ట నేపథ్యాలలో స్పష్టంగా గోచరమయ్యే అద్భుత దృశ్యం. పైకి కనిపించే దాని నాటకీయతను గుడ్డిగా నమ్మి, మనం దాని ఆంతర్యమేమిటో పట్టించుకోకుండా సాగిపోతాం. ఆ నాటకం లోని ఏదో ఒక దృశ్యాన్ని చూసి సమస్తం గ్రహించా మనుకుంటాం. దానిలో మనలను పాత్రధారులను చేసి వారు తమ నాటకాన్ని రూపొందించారు. రచయితగా, నటుడిగానే గాక స్వయంగా దృశ్యమై దానికి తాను జీవాత్మగా, ఆమె ప్రకృతిగా ఆ నాటకరంగంపై క్రీడిస్తారు.

*

ఆకాశంలో తారలకు పరస్పర సంబంధమేర్పరచేది ఇదే. సమస్త శక్తి సంపదలోని మౌలిక రహస్యం ఆ ఒక్కటైన ఇద్దరే, వారే సమస్త వస్తు సంపదయొక్క బలం, ఔచిత్యం. ఆతని మౌన అంతరాత్మ ఆమెకు, ప్రపంచానికి ఆలంబనగా ఉంటుంది. ఆతని చర్యలు ఆమె దివ్యాదేశాల తాకిడులు. ఆనందంగా, అచేతనంగా అతను ఆమె పాదాల క్రింద పడి వుంటాడు. తన వక్షస్థలాన్ని ఆమె కరాళ నృత్యానికి వేదికగా అర్పిస్తాడు. మన జీవితాలు ఆమె భీకర నృత్య పదఘట్టనల తీవ్రతతో కంపించే రంగస్థలం. తనలో నిక్షిప్తమైయున్న శక్తితో ఆ ప్రకంపనలను అతను గనక భరించ గలుగుతున్నాడు, కానీ వేరెవరూ భరించలేరు, భరించలేక పోయినా తమ జీవితాలను రంగస్థలంగా అర్పించకుండా వుండలేరు, ఎందుకనగా

ఆతని ఆనందాన్ని ఆంటంక పరచ కూడదని

సావిత్రి: 61- 63 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

ఒక అవిభాజ్యమగు ఏకత

ఒకే చేతన

శ్రీమాత చేతనకు, నా చేతనకు మధ్యన వైరుధ్యమున్న దనటం పాత రోజులలో ప్రచారమందున్న కల్పిత కథ. (ముఖ్యంగా అప్పుడున్న X,Y, ఇతరుల కారణంగా). మొదట్లో ఇక్కడున్న కొందరిచే శ్రీమాత గుర్తించ బడని లేక అంగీక రించ బడని కాలంలో ఆ అపోహ ఏర్పడింది. ఆమెను గుర్తించిన తరువాత కూడా వారు ఈ నిరర్థక వైరుధ్య భావనను కొనసాగించారు. తత్ఫలితంగా తమతో బాటు ఇతరులకు సైతం హాని కలిగించారు. శ్రీమాత చేతన నా చేతన ఒకటే, ఒక్కటైన దివ్య చేతన ఇద్దరిలో నుంది, ఎందుకనగా మేము నిర్వహించ వలసి వున్న కార్యానికి అది అవసరం. ఆమెకు తెలియకుండా, ఆమె శక్తి లేకుండా, ఆమె చేతన తోడ్పడకుండా ఏమీ జరుప వీలు పడదు. ఎవరైనా నిజంగా ఆమె చైతన్యానుభూతిని పొందివుంటే దాని వెనుక నేనున్నానని తెలుసుకోవాలి. ఒకవేళ నా చైతన్యానుభూతిని పొందితే దాని వెనుక ఆమె వున్నదని తెలుసుకోవాలి. ఆ విధంగా వేరుచేసే ఆలోచనలు ప్రబలితే, (ఈ విషయంపై వారి మనసుల్లో ఆలో చనలు ఏ విధంగా మలుపులు తిరిగాయో. నేను పట్టించుకోను) పరమసత్యం తనంతట తాను ఏ మాదిరిగా ప్రతిష్ఠించుకోగలదు? పరమ సత్యం నుండి అట్టి వేర్పాటు జరుగదు.

ఒకే శక్తి

ప్రశ్న: మీ కార్యాచరణకు మరియు శ్రీమాత కార్యాచరణకు మధ్య వ్యత్యాస మేమైనా వున్నదా? అనగా బలంలోను, ప్రభావం చూపటంలోను ఏమైనా తేడా వున్నదా అని నా భావన.

సమా: లేదు, అది ఒక ఏకైక దివ్యశక్తి.

*

మే మిద్దరమూ ఒకటేనని, ఈయబడిన దేదైనా అది ఇద్దరమూ ఇచ్చినదేనని మీరు అనడం అవశ్యం సరియైనదే. నేను ఇచ్చినట్లయితే శ్రీమాత శక్తి దానితో బాటు ఈయ బడుతుంది. లేకపోతే సాధకుడి కేమి లభించదు. ఒకవేళ శ్రీమాత ఇచ్చినట్ల యితే, నా ఆసరా కూడా దానితో బాటు లభిస్తుంది. నా వెలుగుతో బాటు శ్రీమాత వెలుగు కూడా అందుతుంది.

అది ఒక్క అవిభాజ్యకార్యం యొక్క రెండు విభాగాలు, ఒకదానితో మరొకటి కూడి వుంటాయి. దానికి ఊతమిచ్చేది శ్రీమాత శక్తి, అంతేకాదు ప్రశాంతతను కూడా.

ఒకరు శ్రీమాత నుండి ఏది పొందినా అది నా వద్దనుండి కూడా పొందినట్లే - వ్యత్యాసమేమి లేదు. అదే విధంగా నేనేదైనా ఇచ్చినట్లయితే అది సాధకుడికి శ్రీమాత శక్తితోనే చేరుతుంది

ఒకేదారి

శ్రీమాత చేతన దివ్యచేతన, దానినుండి వెలువడే ప్రకాశం దివ్యసత్య ప్రకాశం. ఆమె క్రిందికి కొనివచ్చే మహాశక్తి దివ్య సత్య శక్తి. ఎవరైతే శ్రీమాత ప్రకాశాన్ని అందుకొని, దానిని అంగీకరించి, దానిలో జీవిస్తారో వారికి అన్ని స్తరాలలో అనగా మానసిక, ప్రాణిక, భౌతిక స్తరాలలో సత్యాన్ని దర్శించటం మొదలవుతుంది. వారు అదైవికమైన దాని నంతటినీ తిరస్కరిస్తారు. అదైవికమన్నది అసత్యము, అజ్ఞానము, దుష్టశక్తులాచరించే తప్పుడు పనులు. అదైవికమంతా అస్పష్టమైనది. దివ్యసత్యాన్ని, దాని శక్తిని, దాని వెలుగును నమ్మడానికి ఇష్టపడనిది. అందుమూలంగానే నేనెల్లవేళలా మీకు చెబుతుంటాను, మిమ్ములను మీరు శ్రీమాత తోను, ఆమె దివ్యవెలుగుతోను, శక్తితోను, సంపర్కం కలిగి వుండాలని, ఎందుకనగా గందరగోళం నుండి, అస్పష్టత నుండి బయటపడి, పైనుండి అరుదెంచే పరమ సత్యాన్ని అందుకోగలుగుటకు అదొక్కటే మార్గం గనుక.

శ్రీమాత వెలుగును గురించి లేక నా వెలుగును గురించి ఒక ప్రత్యేక అర్థమిచ్చే విధంగా మాట్లాడితే అది ఒక ప్రత్యేకమైన అతీంద్రియ కార్యక్రమం గురించి మాట్లాడినట్లుగా నుంటుంది, అతిమానసంనుండి వెలువడే కొన్ని వెలుగుల గురించి మాట్లాడుతున్నట్లుగా నుంటుంది.

ఈ కార్యక్రమంలో శ్రీమాతది దివ్యమైన శ్వేతవర్ణ కాంతి. అది పవిత్రీకరిస్తుంది, తేజోమయం చేస్తుంది, పరమసత్యం యొక్క శక్తిని, సారాన్ని సంపూర్ణంగా క్రిందికి కొనితెచ్చి రూపాంతరీకరణను సాఫల్యం చేస్తుంది. కానీ, నిజానికి పైనుండి వచ్చే వెలుగంతా, అత్యున్నతమైన దివ్య పరమ సత్యంనుండి వచ్చేది, శ్రీమాతకు చెందినది. శ్రీమాత మార్గానికి నా మార్గానికి మధ్య తేడా లేదు. మాకున్నది, ఎల్లప్పుడూ వుండినది, ఒకే బాట. ఆ బాట అతి మానస మార్పుకు, దైవ సాక్షాత్కారానికి దారి తీస్తుంది. కేవలం చరమాంకమందే కాదు. ప్రారంభ దశ నుండి మా బాట ఒక్కటే.

ఈ విధమైన విభజనను, ప్రాతికూల్యతను కలుగజేసి, నన్ను శ్రీమాతను పరస్పర వ్యతిరిక్తమైన లేక పూర్తిగా వేర్వేరు పక్షాలలో నుంచే ప్రయత్నం ఎల్లప్పుడూ సాధకుడిని పరమసత్యం చేరుకొనుటలో ఆటంక మేర్పరచుటకు అసత్యశక్తులు కపటోపాయంతో పన్నే పన్నాగం. అటువంటి అసత్యపు ఆలోచనలను నీ మనస్సునుండి పూర్తిగా తొలగించు.

శ్రీమాత యొక్క వెలుగు, శక్తి పరమసత్యం యొక్కవెలుగు, శక్తులని తెలుసుకో, శ్రీమాత యొక్క శక్తి, వెలుగులతో సదా సంపర్కంలోనుండు. అప్పుడు మాత్రమే నీవు దివ్యసత్యం లోకి ఎదగ గలవు.

CWSA 35: 455-56

నేనింతకు ముందొక సారి వ్రాసాను; నేను వేరు, శ్రీమాత వేరు, మా ఇద్దరివి వేర్వేరు మార్గాలు, వేర్వేరు లక్ష్యాలు, అనే ఊహాగానాలు పూర్తిగా పొరపాటు అని. మార్గం ఒక్కటే, మా లక్ష్యం కూడా ఒక్కటే — అతిమానస దివ్యత్వం.

*

శ్రీఅరవిందుల గురించి తెలియక ముందు నుండే లేక వారిని కలవక ముందు నుండే శ్రీమాత యోగసాధన చేస్తుండేవారు. అయితే సాధనలో వారిద్దరు స్వతంత్ర మార్గాల ననుసరించినా, అది ఒకే దిశగా సాగింది. వారు కలుసుకున్నప్పుడు వారి సాధనను సమగ్రపరచుటలో పరస్పరం సహకరించుకున్నారు. ఏదైతే శ్రీఅరవిందుల యోగంగా తెలియబడిందో అది శ్రీమాతారవిందుల సంయుక్త సృష్టి. ఇప్పుడు వారు పరస్పరం తాదాత్మ్యం చెందినట్లుగా గుర్తింప బడ్డారు. ఆశ్రమంలో చేయబడే సాధన, అందుకు అవసరమైన ఏర్పాట్లను శ్రీమాత ప్రత్యక్షంగా నిర్వహిస్తారు.

శ్రీఅరవిందులు పరోక్షంగా ఆమెకు సహాయ మందిస్తారు. యోగాభ్యాసం చేయడానికి ఇక్కడికి వచ్చే వారందరు తమకు తాముగా శ్రీమాతకు అర్పించుకోవలసి వుంటుంది. శ్రీమాత వారికి సదా సహాయపడుతూ, వారి ఆధ్యాత్మిక జీవిత ఔన్నత్యాన్ని పెంపొందిస్తారు.

CWSA 32: 81

హెచ్చు తగ్గులు లేవు

ప్రశ్న: అంతటా, అన్ని వేళలా దైవం క్రియాశక్తిగా నన్ను తనవైపు లాగుతున్నట్టి అనుభూతి చెందుతున్నాను. అతడు అందరి అధి ఆత్మ, అధినాయకుడు, శ్రీమాతకన్నా ఉన్నతుడని భావిస్తాను. అతడే నా తండ్రియగు శ్రీఅరవిందుల యందు శరీరధారిగా నున్న దైవమని భావిస్తాను.

సమా: అది దైవం గురించి మనకుండే ఒక దృక్పథం కానీ దైవం అధి ఆత్మగాను, ప్రభువుగాను మరియు శ్రీమాతగాను ఒక్కరే — అక్కడ హెచ్చు గాని, తగ్గు గాని లేదు.

ప్రశ్న: ఇక్కడ కొందరు మీరు శ్రీమాతకన్నా గొప్పవారని ఎందుకనుకుంటారు? మీరిద్దరూ ఒకే స్తరానికి చెందినవారు కాదా? ముసుగు కప్పబడిన మానవదృష్టి అట్టి భేదం చూపడానికి కారణం కాదా?

మనసులు ఉపరితలంలో కనిపించేవాటినే గమనిస్తాయి, కానీ వాటి వెనుకనున్న వాటిని కాదు.

శ్రీమాత, నేను ఒక్కటే కాని రెండు శరీరాలలో వున్నాము. రెండు శరీరాలకు సదా ఒకే పనిని నిర్వర్తించే అవసరం లేదు. అందుకు వ్యతికంగా, ఇద్దరమూ ఒకటే గనుక ఏ విధంగానైతే ప్రణామా లందుకోవడానికి లేక ధ్యానంకోసమో ఎవరో ఒకరం క్రిందికి పోతే సరిపోయేటట్లు, ఏ ఒక్కరమో ధృవ పరిచితే సరిపోతుంది.

శ్రీమాత, నేను ఒక్కటే గాక సమానులం కూడా. అదీగాక ఇక్కడ ఆమెకు ఒక విశిష్టత వుంది. ఏ పని ఏ విధంగా చేస్తే ఉత్తమమని ఆమె తలుస్తారో ఆ విధమైన ఏర్పాటు చేయడానికి ఆమెకు అధికారముంది. ఎవరికైనా వారి కప్పజెప్పబడిన పనిని ఆమె నిశ్చయించిన విధంగా నెరవేర్చడం తప్ప తమ ఇష్టానుసారం చేసే అధికారం లేదు. ఆశ్రమం శ్రీమాతచే రూపొందించబడింది. ఆమె వినా ఆశ్రమం

ఏర్పడేది కాదు. ఆమె చేసే పని ఆమె కల్పితమే, అది ఆమె కెవరిచే అప్పగించ బడలేదు, ఆమెనుండి తీసుకోబడలేదు కూడా. నీకు శ్రీమాతతో సవ్యమైన సంబంధం గాని వైఖరిగాని ఏర్పడాలంటే ఈ ప్రాథమిక సత్యాన్ని తెలుసుకొనుటకు ప్రయత్నించు.

CWSA 32: 83

యుగాల తరబడి కలిసి పనిచేయడం

ప్రశ్న: భూమండలం సృష్టించబడి నప్పటి నుండి మీరు శ్రీమాత దానిపై నున్నారని అంటారు. కానీ కోట్ల సంవత్సరాల తరబడి మారు వేషంలో మీరు చేస్తున్నదేమిటి? "మారు వేషం" అని ఎందుకంటున్నానంటే, ఇప్పుడు మాత్రమే ప్రపంచానికి మీకుగా మీరు మీ నిజ స్వభావానుగుణంగా వ్యక్తపరచుకుంటు న్నారు.

సమా: పరిణామ క్రమాన్ని కొనసాగిస్తున్నాము.

ప్రశ్న: "పరిణామక్రమం కొనసాగించటం" అంటే మీ ఉద్దేశమేమిటో నా కర్థం కావటంలేదు. మీరు దీనిని సమగ్రంగా వివరించగలరా?

సమా: అది చేయాలంటే మానవ చరిత్రను సంపూర్ణంగా వ్రాయడ మవుతుంది. కేవలం ఇది మాత్రం చెప్పగలను. పరిణామ ప్రక్రియను ఒక స్థాయి నుండి పైస్థాయికి కొనిపోవటానికి ప్రత్యేకమైన పారంపర్య దశ లేవిధంగానైతే తోడ్పడతామో, అదే విధంగా ఒక దశ నుండి మరొక దశకు ఎదిగే క్రమంలో దైవికమైన దేదో సహాయపడుతుంది.

ప్రశ్న: గతంలో సామాన్య జనులు మీ ఉనికిని ఎందుకని గ్రహించలేకపోయారో— ప్రత్యేకంగా పైకి కనబడటానికి మానవమాత్రులుగా జీవించినప్పుడు — నే నర్థం చేసుకోగలను. కానీ శ్రీకృష్ణుడు, బుద్ధుడు లేక ఏసుక్రీస్తు లాంటి మహాపురు షులు సైతం ప్రపంచంలో మీ ఉనికిని ఎందుకు గ్రహించలేక పోయారు?

సమా: ఉనికి ఎక్కడ, ఎవరిలో?

వారు మమ్ములను కలవక పోతే గుర్తించ లేరు కదా. ఒకవేళ కలిసినప్పటికీ శ్రీమాత, నేను మా వ్యక్తిత్వాలపై ఆవరించివున్న ముసుగును తొలగించి దాని వెనుకనున్న దివ్యత్వాన్ని వెలువరించ వలసిన కారణమేమీ లేదు. ఈ జీవితాలు అటువంటి ప్రయోజనానికై ఉద్దేశింపబడలేదు.

CWSA 32: 88- 89

ప్రశ్న: అన్ని కాలాలలో మీరు, శ్రీమాత భూమండలంపై ఉన్నారంటే అర్థం ఆ మహాపురుషులు అవతరించినప్పుడు కూడా మీరు ఇక్కడ వున్నారనే కదా. మీ ఉపరితల ఆచ్ఛాదన ఏదైనా కానీ, మీ అంతర్జీవిని — యదార్థ దివ్యత్వాన్ని — వారినుండి ఏవిధంగా దాచుకోగలిగారు?

సమా : అటువంటి జీవితాలలో అంతర్జీవిని అందరూ తెలుసుకో లేకుండా ఎందుకు వుంచకూడదు? మా ఉనికి భువిపై దివ్యావతారాలుగా వున్నట్లయితే, మీ తర్కంలో కొంత పస వుండేది, కాని కేవలం భగవంతుని విభూతులుగా నున్నప్పుడు కాదు.

CWSA 32: 89

ప్రశ్న: సృష్ట్యారంభంనుండి మీరు శ్రీమాత సదా భూమండలంపై వున్నారు గనుక దివ్యావతారాలుగా ఒకరి తరువాత ఒకరు ఇక్కడికి దిగివచ్చే అవసరమే ముండింది?

సమా: మేము భూమండలంపై నున్నది దివ్యావతారాలుగా కాదు.

ప్రశ్న: భూమండలంపై మీరిరువరూ దివ్యావతారాలుగా లేమని అంటున్నారు, అయినప్పటికీ పరిణామ క్రమాన్ని కొనసాగించామంటారు. భగవంతుడే స్వయంగా భువిపై పరిణామ క్రియను కొనసాగిస్తున్నందున ఆతని అంశలే అగు దివ్యావతారాలు దిగివచ్చే అవసరమే ముండింది?

సమా: ఒక ప్రత్యేక కార్యం నిర్వహించవలసినప్పుడు, మరియు పరిణామ క్రమంలో సంకట మేర్పడినప్పుడు దివ్యావతార ఆవశ్యకత ఏర్పడుతుంది. దివ్యావతార మొక ప్రత్యేక సందర్భంలో ప్రత్యక్ష మవుతుంది. మిగతా సమయంలో దైవం సాధారణ మానవ మాత్ర పరిమితులకు లోబడి ఒక విభూతిగా కార్యక్రమం నిర్వహిస్తాడు.

CWSA 28: 485

శ్రీఅరవిందులు


అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

మా ప్రేమ ఒక శాశ్వత పరమ సత్యము

CWSA 13: 32 శ్రీమాత

When in your heart and thought you will make no difference between Sri Aurobindo and me, when to think of Sri Aurobindo will be to think of me and to think of me will mean to think of Sri Aurobindo inevitably, when to see one will mean inevitably to see the other, like <u>one and the same Person</u>, —

then you will know that you begin to be open to the supramental force and consciousness.




ఎప్పుడు నీ హృదయంలో, నీ తలంపులో నాకు శ్రీఅరవిందులకు మధ్య వ్యత్యాసం కనబరచవో, ఎప్పుడు శ్రీఅరవిందుల గురించి ఆలోచిస్తే నా గురించి ఆలోచించి నట్లేనని, నా గురించి ఆలోచిస్తే తప్పక శ్రీఅరవిందుల గురించి ఆలోచించి నట్లేనని ఎప్పుడు ఒకరిని చూస్తే మరొకరిని చూచినట్లేనని, ఇద్దరినీ ఒకే వ్యక్తిగా భావిస్తావో అప్పుడు అతిమానస శక్తికి, చేతనకు నీవు తెరుచుకోవడం ప్రారంభమైనదని తెలుసుకుంటావు.

~~CWSA 13: 32~~
CWM : 13-32-33

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి


21-2-68

The reminiscenses will
be short.
I came to India to meet Sri Aurobindo.
I remained in India to live with Sri Aurobindo.
When he left his body, I continued to live here
in order to do his work which is, by serving
the Truth and enlightening mankind,
to hasten the rule of the Divine's
Love upon earth.

21 ఫిబ్రవరి 1968


స్మృతిపథంలో మెదిలే సంఘటనలు సంక్షిప్తమైనవిగా నుంటాయి.

నేను శ్రీఅరవిందులను కలవటానికి భారతదేశం వచ్చాను. నేను భారతదేశంలో వుండిపోయింది శ్రీఅరవిందులతో జీవితం గడపడానికి. వారు శరీరత్యాగం చేసి నప్పుడు వారు చేపట్టిన కార్య నిర్వహణార్థం ఇక్కడ జీవితం కొనసాగించాను. ఆ కార్యమేమిటనగా పరమసత్య సాధనకు సహకరిస్తూ, మానవజాతికి జ్ఞానోదయం కలిగించుటద్వారా భూమండలంపై దివ్యప్రేమ సామ్రాజ్య పాలన ప్రతిష్ఠాపన వేగ వంతం చేయడం.

CWSA 13: 45

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి


Do not ask questions about the details of the material existence of this body; they are in themselves of no interest and must not attract attention.

Throughout all this life, knowingly or unknowingly, I have been what the Lord wanted me to be, I have done what the Lord wanted me to do. That alone matters.

ఈ శరీరం యొక్క భౌతిక ఉనికిని గురించిన వివరాలపై ప్రశ్నలు వేయవద్దు. వాటంతట అవి అంత ఆసక్తికర మైనవి కావు, ఆకర్షణీయం కాకూడదు.

ఈ జీవితమాసాంతం, తెలిసో తెలియకనో, నేనే విధంగానుండాలని ప్రభువు కోరాడో ఆ విధంగానే వున్నాను. ప్రభువు నన్నేమి చేయమని కోరాడో నేను అదే చేసాను. కావలసింది అది మాత్రమే.

CWSA 13: 45

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

మానవాళి బరువు, బాధ్యతలు

ఈ విషయంలో శ్రీమాత శ్రమ గాని వత్తిడి గాని లేని ఒక మార్గం సూచించారు. ఆ మార్గం భానుడి వెలుగులా వుంటుంది. అది సహజమైనది కూడా. అది సూర్యకాంతిని కోరుతూ వికసించే పుష్పం లాంటిది. అది అవతారమూర్తులైన మీకైనా, శ్రీమాతకైనా తగి వుంటుంది, కాని మాలాంటి అల్పజీవులకు ఎలా మార్గం చూపగలుగుతుంది? నిరంతర ప్రార్థన, కఠిన తరమైన ధ్యానం, అయుక్తమైన ప్రేరణలను తిరస్కరించటానికి నిశ్చలమైన ప్రయత్నంలేకుండా ఈ మార్గాన్ని అనుసరించే అవకాశం ఉన్నదా?

*

ఈ మార్గం మీలాంటివారు కష్టసాధ్యం అని అనుకుంటున్నారు. శ్రీమాత వంటి, నా వంటి, అవతార మూర్తులకే ఇది వీలవుతుందని మీ భావన. ఇది కేవలం దురభిప్రాయం.

నిజానికి ఇది చాలా సులభమైన, సూటియైన మార్గం కాని నిజంగా దీన్ని ఎవరైనా ఆచరించవచ్చు. మనసును, ప్రాణిక శక్తులను ప్రశాంతపరిస్తే మీలో పదవ వంతు సమర్థత ఉన్నవారు కూడా ఆచరించవచ్చు. తపస్సు చేయటానికి అవసరమైన కష్టాలు, ఒత్తిడులు ఇందులో వుండవు. ఇక శ్రీమాత సంగతి నాసంగతి గురించి చెప్పాలంటే మేము పడ్డ కష్టాలు, అధిగమించిన అడ్డంకులు ఈ ఆశ్రమ వాసులకెవరికీ ఊహించ నలవి కాదు. బయటవాళ్ళకు అసలు ఊహకే అందదు. అవి ఎంత ఇబ్బందికర పరిస్థితులలో, మేము ఎన్ని పోరాటాలు చేయవలసివచ్చిందో! ఇక మాకు తగిలిన దెబ్బలకు, గాయాలకు లెక్కేలేదు. మా ప్రయాణం కాకులు దూరని కారడవులగుండా, అడుగుపెట్టలేని చిత్తడి నేలలగుండా, చుక్క నీరు కనిపించని ఎడారుల గుండా ముందుకు సాగింది. ఇట్లాంటి కార్యక్రమం ముందెవ్వరూ తలపెట్టలేదు, తలపెట్టలేరు కూడా!

ఈ మార్గంలో ముందుకు సాగి, దివ్యత్వాన్ని భూమ్మీదకు తీసికొని రావాలంటే సాధ్యమయ్యే పనేనా! ఇక మనం దివ్యత్వం దిశగా ఊర్ధ్వముఖంగా వెళ్ళటం ఎంత అసాధ్యమో ఊహకు అందదు. ఇది కేవలము 'లీల' అని భావించగూడదు. ఎన్నో కష్టాల నడుమ వ్యతిరేకతలతో అడ్డంకులతో మెల్లమెల్లగా విజయంవైపు కొనసాగించవలసిన మహత్తర కార్యం అది. అట్లా అని ఈ కష్టాలన్నీ అందరు సాధకులూ పొందాలని నేను భావించటంలేదు. మేము ఎలాగు వీటినన్నింటినీ అనుభవించాముగదా! కాబట్టి

ఇతరులకు సులభమైన, సూటియైన మార్గాన్ని అన్వేషించాలని అనుకున్నాము. అది కావల్సిన వాళ్ళు దాన్ని అనుసరిస్తారు. మేము ఎంతో శ్రమకోర్చి సాధించిన అనుభవాన్ని ఇతరులకు అందించాలి గదా! "మానసికమైన ఆ భౌతిక తత్వాన్ని అనుసరించి సూర్యకాంతివంటి వెలుగు బాటలో పయనించండి. దైవం మిమ్మల్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేయనివ్వండి పరోక్షంగానైనా ఆతడు త్వరలోనే తనను తాను అభివ్యక్తం చేసుకుంటాడు. కఠినమైన అడ్డంకులు వుండ గల అస్తవ్యస్త మార్గాలను ఎంచుకోవద్దు."

శ్రీమాత పడ్డ కష్టాలు ఆమె స్వతః చేసుకున్నవి కావు. అవి ఇతరుల కోసం పడ్డ కష్టాలు. భౌతికం ఆధ్యాత్మికంగా రూపొందించటంలో ఎదురయ్యే ప్రక్రియలో భాగమే. అట్లా జరుగకపోతే పరిస్థితి మరో విధంగా వుండేది.

వెలుగుబాటలో వుండే కష్టాలు

ఈ 'వెలుగుబాట' నేను సృష్టించినదని అనుకోవడం సరికాదు. ఇది పూర్వపు యోగ గ్రంథాలలో కూడా వుంది. ఆ గ్రంథాలు నేను ముప్పది సంవత్సరాల క్రిత మే చదివాను. వాటిలో 'చీకటిమార్గము', 'వెలుగుమార్గము' అనేవి ప్రస్తావించబడ్డాయి. కాని రెండవదైన వెలుగుబాటకే ప్రాధాన్యం ఇవ్వబడింది. నేను వెలుగుబాటను ఎం చుకున్నది కష్టాలనుండి ప్రమాధాలనుండి దూరంగా వుండటానికి కాదు. వాటన్నింటినీ ఎదుర్కొన్నాను. శ్రీమాత ఈ విషయంలో నాకంటే పదిరెట్లు ఎక్కువ బాధలను, ప్రమాదాలను ఎదుర్కొన్నారు. విజయం సాధించాలనుకునే వారికి ఉపద్రవాలు తప్పవు కదా! సాధకులకెదురయ్యే అవరోధాలన్నీ మా కెదురయినాయి. వచ్చిన ప్రతి కష్టం వలన మా మార్గం సుగమం అయ్యింది కూడా. ఒక్కొక్క ఇబ్బందిని దాటటానికి కొన్ని వందలసార్లు ప్రయత్నించాల్సి వచ్చేది. ఒక్కొక్క సందర్భంలో ఇంకా ఎక్కువ సార్లు కూడా! కొన్ని సమస్యలు ఇంకా అలాగే మిగిలి ఉన్నాయి. 'పరిపూర్ణ పరిపూర్ణత్వం' లభించేదాకా కొన్ని సమస్యలు వెనక్కు లాగుతూనే వుంటాయి. కాని ఇతరులకు ఆ బాధలు, సమస్యలు ఎదురు కాకూడదు అని భావిస్తు న్నాము. వారి మార్గం సుగమం కావాలనే కోరుతున్నాము. ఆ ఉద్దేశ్యంతో ఈ భా రాన్ని మా మీద వేసుకుంటున్నాము. ఇతరులను ఈ భాదలనుండి, ఇబ్బందులనుండి దూరంగా వుంచమని, వాటిని తనపై వేయమని శ్రీమాత దైవాన్ని ప్రార్థించారు.

ఇందు మూలంగానే శ్రీమాతపై పూర్తి విశ్వాసం ఉంచి సాధన కొనసాగిస్తూన్న వారంతా వెలుగుబాటలో ముందుకు పోగలుగుతున్నారు. అట్లా కొనసాగలేని వారికి కూడా విశ్వాసాన్ని దృఢపరచుకోగానే వారికి మార్గం సుగమం అవుతుంది. నమ్మక పోవటంకానీ, స్వాభిమానం, అహంకారం లాంటివి మళ్లీ తల ఎత్తితే, ఆ వెలుగు బాట ముళ్ళబాటగా మారిపోగలదు. వెలుగుబాట పయనం కట్టుకథ అనుకోవద్దు.

CWSA 32: 95-96

శ్రీమాతారవిందుల యోగంలో సాధన మార్గాలు

ఇవి నేను జవాబు చెప్పగలిగిన ప్రశ్నలు కావు. వాటిని చెప్పటం నా వంతు కాదు కూడా. కాని నేను చెప్పగలిగింది ఒక్కటే. అతిమానస శక్తిని భూమిమీదకు దించేందుకు ప్రయత్నించటం, దాని కార్యాన్ని అక్కడ నిర్వహించటం, ఇదే మా ఇద్దరి యొక్క ఉద్దేశ్యం. మా యోగం ఇందుకు సంబంధించినదే. (మిగతా ఉద్దేశ్యాలన్నీ ప్రాథమికమైనవి గాని, కారణభూతమైనవి గాని అయి వుండవచ్చు) ఈ ఆశ్రమ నిర్వహణ కూడా మా ఆశయ సాధనలో ఒక భాగమే. ఇక్కడి సాధకులు మమ్మల్ని అనుసరిస్తూ, ఈ అతిమానస సత్యాన్ని స్వీకరించటానికి సిద్ధంగా వున్నారు. అనుస రించకుండా దాన్ని సాధించటం అసాధ్యం. ఇంకేదైనా మార్గాన్ని వారు అన్వేషించా లనుకుంటే, స్వేచ్ఛగా వారు ఆయా మార్గాలను అనుసరించవచ్చు. కాని దానికి ఈ ఆశ్రమం స్థావరం కాకూడదు. ఇతర మార్గాలు ఈ ఆశ్రమ పరిధిలో సఫలం కావు. దైవశక్తి అందుకోసం ఇక్కడ పనిచేయటం లేదు. మా నుంచి జనిస్తున్న శక్తిని ఇంకోమార్గంలో ఉపయోగించటానికి ప్రయత్నిస్తే ఆ మార్గం వాళ్ళకు అనుకూలించదు. అట్లా చేస్తే వాళ్ళకు ఏ లాభం రాదు. మరో మార్గానికి ఈ ఆశ్రమ జీవన విధానానికి పొంతనే వుండదు. ఇంతకంటే ఏమీ వివరించలేను.

CWSA 32: 98

శ్రీమాతారవిందులవైపుగా మనసును తెరచియుంచుట

ప్ర: శ్రీఅరవిందులకు లేఖ వ్రాసినా, శ్రీమాతకు లేఖ వ్రాసినా ఒకటేనా? కొందరు వారిద్దరూ ఒకటే అంటారు. అంటే ఎవరికి జాబు వ్రాసినా శ్రీమాత వైపుగా

మనసును తెరచియుంచుటయేనా? ఇది సవ్యమైన మార్గమేనా?

స: అవును. మేమిద్దరమూ ఒకటే. కాని శ్రీమాతవైపుగా మనసును తెరచియుంచుటయే మంచిది.

ప్ర: ఇదే విషయంలో శ్రీఅరవిందులవైపు మనసును తెరచియుంచితే శ్రీమాత వైపు మనసు వికసింప జేయనట్లేనా? శ్రీమాతవైపుగా అంటే "శ్రీఅరవిందుల వైపుగా కూడా" అని అర్థం చేసుకోవచ్చా?

స: శ్రీమాత ఉనికి నిశ్చయ రూపం. శ్రీమాతను విస్మరిస్తే, శ్రీఅరవిందులను కూడా విస్మరించినట్లే.

ప్ర: "శ్రీమాత దివ్యశక్తికి మనలను శాసించే అవకాశం కల్పించాలి" అని శ్రీఅరవిందులు పదేపదే అంటూ అంటూండేవారు. అంటే వారి ఇరువురి శక్తులు వేరుగా వుంటాయి అని అర్థం వస్తుందా?

స: కాదు, కాదు. ఉన్నది ఒకటే. అది శ్రీమాత శక్తియే. అసలు విషయం ఏమిటంటే శ్రీమాతే శ్రీఅరవిందుల ద్వారా అభివ్యక్తం అయ్యే శక్తి!

CWSA 32: 104

శ్రీమాతారవిందులను స్వాగతించటం

ప్ర: శ్రీమాత శక్తిని, ఆమె నామధేయాన్ని ఆకాంక్షించే సందర్భంలో మీ నామం కూడా అందులో కలిసే వుంటుంది. ఆశ్చర్యంగా వుందికదా!

స: ఎప్పుడూ మీరు శ్రీమాతశక్తినే ఆకాంక్షించండి. ఆమె శక్తియే దివ్యత్వ సాధనను సుగమం చేయగలదు. అవసరం లేదనుకుంటే దాన్ని అదుపులో వుంచుకోవచ్చు. మా ఇద్దరినీ విడివిడిగా చూడవద్దు. (ఆమె పేరుకు బదులు నా పేరు ఉచ్ఛరించుట) అట్లాంటి భావాలను రానివ్వకండి. విభేదంగా భావించటంవలన అంతర్గత అనుభవంలో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయి.

శ్రీమాతారవిందుల నుండి ప్రభావాన్ని పొందటం

శ్రీమాతారవిందుల ప్రభావాన్ని పొందాలంటే ఉండాల్సిన అర్హతలు కేవలం రెండే రెండు. 1. ఆధ్యాత్మిక మార్గంపై నమ్మకం వుంచటం, 2. ఆవైపుగా మనసును

వికసింప జేసియుంచ గలగటం. సాధనా బలం కూడా నమ్మకం మీదనే ఆధారపడి యుంటుంది.

ఆశ్రమ వాతావరణంలో లేని వారు కూడా ఈ యోగాన్ని అనుసరించవచ్చును. మనదేశంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల్లో అలా అనుసరించేవాళ్ళు ఎంతోమంది ఉన్నారు.

CWSA 32: 106

శ్రీమాతారవిందుల ఏకత్వభావనయొక్క దర్శనాలు, అనుభవాలు, స్వప్నాలు

శ్రీమాత, నేను రెండు రూపాలుగా వున్న ఒకే దివ్యశక్తి. అందువలన కలలోని భావాలు హేతుబద్ధమైనవే. దైవశక్తి, మానవ శక్తి ఒకే దివ్యత్వానికి గల రెండు పార్శ్వాలవంటివి.

(బ్రహ్మ, 1933)

శ్రీమాతకు నాకు గల సామ్యం ఇద్దరినీ ఒకటిగా చూచినపుడే అనుభవంలోనికి వస్తుంది. ఇది అతి సాధారణమైన అనుభవం.

4 నవంబరు 1935


ప్ర: శ్రీమాత మీకు కుడివైపున ఉంటారు, మీరు ఎడమ వైపున దర్శనం ఇస్తారు. దీని అంతరార్థం?

స: అవును. ఆమె నిర్వహణా శక్తి. అందుకు కుడిచేయిలా పనిచెయ్యాలికదా! ఎడమవైపు అజ్ఞానానికి, కుడివైపు కార్యదీక్షకు నిదర్శనం. ఎడమవైపు వుండి చేసే కార్యనిర్వహణ ఎప్పుడూ సరిగా వుండదు. అది సగం ఫలితాన్ని మాత్రమే ఇస్తుంది. కుడివైపున ఉండటమే అతిమానస ఆవిర్భావానికి తగినదనిజమైన సంకేతం.

CWSA 32: 126

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్.ఎల్. నరసింహారావు



శ్రీఅరవిందుల శక్తిగా శ్రీమాత:

నేనే శ్రీఅరవిందుల శక్తిని, నా బిడ్డ లందరకు మాతృమూర్తిని.

నా బిడ్డలంతా నా చేతనలోని సమాన అంతర్భాగాలే, వారు నాలోని వారే. పరిణామక్రమంలో రూపాంతరం చెందనపుడు ప్రతి ఒక్కరికీ శ్రీఅరవిందుల శక్తిని, నా శక్తిని ఆవిష్కరించగల సమాన హక్కు వుంటుంది.

సమిష్టి సమైక్య భావ ప్రకటన మాత్రమే ఈ భువిపై నూతనమైన దివ్యత్వాన్ని ఆవిష్కరించగలదు. ప్రతివారు ఆ పూర్ణత్వ భావనలో ఒక్కొక్క అంశాన్ని మాత్రమే ప్రకటించగలరు. కాని మిగతా అంశాలు కూడా లేనిదే పూర్ణత్వానికి అర్థం వుండదు.

CWSA 32: 84

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్.ఎల్. నరసింహారావు

సమతౌల్యమును తెచ్చుటకై ఒకే చైతన్యం రెండురూపాలలో

.... ప్రధానంగా మేము ఒక్కటి లేదా అభిన్నము, తేడా ఏమీ లేదు అనేది నిజం. ప్రత్యక్షంగా రెండురూపాలలో ఉన్న ఒకే చైతన్యం, ఒకదానికి మరొకటి ఆధారంగా ఉండటానికి, సృష్టిలో సమతౌల్యానికి ఈ విభజన అవసరం, కాని సృష్టికి ఆవల అది 'ఏకం' లేదా 'అద్వితీయం' ఏక చైతన్యం ఇంకా ఒక్కొక్కమారు అవసర మైనప్పుడు సృష్టిలో సైతం ఏకత్వం ప్రస్ఫుటమౌతుంది. ఒకరు ఈ చైతన్యానికి ఉన్మీలనమైతే, వారు ఈ ఏకత్వాన్ని దర్శిస్తారు. వాస్తవానికి అది అదే.... ఒకరు దానిని ఇది అని తెలియజెప్పలేరు. అది కేవలం జీవించగలిగినది మాత్రమే. ఏకాగ్రతవల్లను, ఉన్మీలనమై ఉండటం ద్వారాను ఒకరు ఈ అనుభవానికి చేరగలరు. అది ఏదో మనస్సుద్వారా ఏర్పరచబడేదికాదు. మనస్సు ద్వారా ఈ ఏర్పాటు చేయబడదు.

*

వాస్తవంగా చెప్పాలంటే, శ్రీఅరవిందులు, నేను అభిన్నం, ఒకే చైతన్యం. ఇక్కడ పృథ్విపై విభజన ఉంది. ఇది కేవలం సృష్టిలో సమతౌల్యం తీసుకురావటానికే. అన్యథా, అది ఒకటే. మేము నిజంగా ఒక్కటే. దానిని వ్యక్తీకరించడం చాలా కష్టం. నాకు మాటలు దొరకటం లేదు. కాదు, అది సాధ్యం కాదు. అది వ్యక్తీకరించలేనిది....

నీవిది తెలుసుకో. సృష్టికి ఆవల, సమస్తం ఒకటే, అక్కడ తేడా అనేది లేదు. అది అభిన్నం, ఒక్కటే చైతన్యం, పరిపూర్ణమైన ఏకత్వం. మాకు వేర్వేరు ఉనికి లేదు. కాని మేము క్రిందికి ఇక్కడకు దిగివచ్చినప్పుడు మాకు వేర్వేరు రూపాలున్నాయనిపిస్తున్నది.ఒక ప్రత్యేకమైన ఉనికి, ఆవశ్యకమైనప్పుడు ఒకటైన ఉనికి ఉన్నదనిపిస్తుంది. కొన్ని సమయాల్లో నాతో కలిసి ఉంటారు, అదే సమయంలో ప్రపంచమందు అన్ని చోట్లా ఉంటారు. ఆయన ఇక్కడ నాలో ఉన్నారు, నాతో మాట్లాడుతారు. ఆయన తనకు తానుగా నాతో ఏకం అవుతున్నారు. ఒక్కొక్కప్పుడు ఆయన నాకు వేరుగా ఉంటారు, నాకు వేరైన ఉనికిలో జీవిస్తుంటారు. అదే సమయంలో ఆయన నాలో ఉంటారు. కాని వాస్తవిక దృష్టికి ఆయన నాకు వేరుగా ఉన్నారు. ప్రకటితమయ్యే క్రీడ అది. ఒకసారి ఆయన నాతో ఐక్యమవుతారు. మరొక సమయంలో

ఆయన తనకు తాను సృష్టిలో అభివ్యక్తమౌతారు. ఆయన ఇక్కడ ఉన్నారు. (శ్రీమాత తన శరీరాన్ని చూపిస్తారు) అక్కడ ఉన్నారు, ఆయన విశ్వంలో ప్రతి చోటా ఉన్నారు. ఆయన సృష్టిలో కనబడే ప్రతిదానిలో ఉన్నారు. ఒక్కొక్కప్పుడు తనకు తానుగా అభివ్యక్తమౌతారు. ఒక్కొక్కప్పుడు మరుగున దాగియుంటారు. ఎవరు ఏ మాత్రమూ చూడలేరు. ఈ విధంగా ఆయన సృష్టిని ఆడుకుంటారు. ఒకప్పుడు తనతో తాను ఐక్యం అవుతారు. మరొకసమయంలో అవసరమైనప్పుడు తనకు తాను వేరు పడతారు. ఏకం అన్యంతో కలిసి పోతుంది. అది ఒక ఉద్దేశ్యంతో, ఒక లక్ష్యంతో వారు తమ చర్యలను నిర్ధారిస్తారు. ఆయన ఇక్కడ ఉంటారు. అదే సమయంలో ఒకరు ఆయనను అక్కడ చూస్తారు. ఆయన ..... కాదు, అది వ్యక్తీక రించడం చాలా కష్టం. చెప్పటానికి మాటలేలేవు, ఒకరు అదేమిటో మనస్సుతో అర్థం చేసుకోలేరు.

*

శ్రీఅరవిందులు ప్రతి చోట ఉన్నారు

నీకు తెలుసా, ఆయన వెళ్ళిపోయినప్పుడు..... ఆయన తన శరీరాన్ని వదిలి వెళ్ళిపోదా మనుకున్నప్పుడు, ఆయన డిశంబరు 5 నుంచి 9 వరకు వున్నారు.... ఆ సమయంలో, ఊహించ లేనటువంటి చైతన్యంతో ఆయన దట్టించబడి ఉన్నారు. ఆయన శరీరంనుంచి అన్ని వైపులా కాంతికిరణాలు వెదజల్ల బడుతున్నాయి. అది చైతన్యం యొక్క క్రియాశీల కార్యశీలత. అది ఎంత నిర్దుష్టంగా ఉండిదంటే, ఎంత భౌతికంగా ఉండిందంటే, ఎంతో ఆశ్చర్యదాయకమైన ఆధిపత్య శక్తితో ఆయనలో ప్రతిదీ ప్రకంపించింది. అది ఎంతో భౌతికమై నిర్దుష్టమైనటువంటిది.... .... ఆ సమ యంలో నేను ఆయన పక్కనే ఉన్నాను. శ్రీఅరవిందుల చైతన్యం ఆయన శరీరంనుంచి బయటకువచ్చి సరాసరి నా లోనికి ప్రవేశించటాన్ని నేను చూస్తున్నాను, ఈ విధంగా భౌతికంగా అది ఒక అసాధారణ ప్రక్రియ. ఆయన చైతన్యం నా శరీర రోమకూపాల్లోకి రాపిడితో ప్రవేశించే అనుభూతిని నేను పొందగలిగాను. అది ఎంత నిర్దుష్టంగా ఉండాలో అంతగానూ ఉంది. అది ఎంత తీవ్రంగా ఉన్నదంటే అది నా శరీరంలోనికి రాపిడితో చొచ్చుకుపోతున్నది, నేను బాహ్యంలో అనుభూతి చెందగలిగే టంతగా, ఒక విధంగా పూర్తిగా భౌతికంగా. ఈ విధంగా, ఆయన చైతన్యమంతా

నా లోనికి ప్రవేశించింది. కారణం అది ఒకటే చైతన్యం కాబట్టి.

వదిలి వెళ్ళిపోయేముందు, ప్రతి ఒక్కదానినీ, ఆంక్షలు లేకుండా, సంపూర్ణ ఆత్మ సమర్పణతో, ఆయన చైతన్యం మొత్తం నాలో లీనమైపోయే విధంగా. ఆ విధంగా గంటలు, గంటలు గడిచాయి. ఆహా, అది ఎంతో భౌతికం, ఆ సంఘటన ఎవ్వరూ ఊహించ లేనటు వంటిది. నేను వర్ణించలేను. ... ప్రతి ఒక్కదానినీ ఆయన నాకు వదిలి వెళ్ళారు.

*

ఇప్పుడు, ఇది ఈ భౌతిక శరీరం పరిమితమైంది, అది హద్దు కలిగినదై, స్వేచ్ఛాయుత మైన క్రీడను అనుమతించదు. ఒకసారి గనక చైతన్యం దానిలోనికి (శరీరం) ప్రవేశిస్తే, అది పూర్తిగా ఈ భౌతిక రూపంలో పరిమితమైపోతుంది. కాని ఆయన, సర్వత్రా ఉన్నారు. ఆయన ఇక్కడ నాలో ఉన్నారు, అదే విదంగా ప్రపంచంలో ప్రతిచోటా ఉన్నారు. ఆయన నాతో మాట్లాడుతారు. నేను విషయాల గురించి అడుగుతాను, ఆయన సమాధానం ఇస్తారు. మా మధ్య సంభాషణలు జరుగుతాయి. అదే సమ యంలో ఇతరులతో, వేరువేరు ప్రదేశాలలో, అవసరమైతే ఆయన సంభాషిస్తారు. మేము ప్రపంచ విధిని, మానవ భవితవ్యాన్ని నిర్ణయిస్తాం, తరువాతి దశలో అవసరమైన దంతా జరిగితీరుతుంది. దీని నంతా మేము నిర్ణయిస్తాం.

ఆయన ఉనికి ప్రతిచోటా ఉన్నది. ఎక్కడెక్కడ ఒకరు ఆయనను కోరకుంటారో అక్కడక్కడల్లా, ప్రతిచోటా, ప్రతిచోటా, ఆయన నాతో ఐక్యమై ఉన్నారు. అదే సమయంలో ఆయన విభిన్న స్థలాల్లో ఉన్నారు. కేవలం ఇది, ఈ భౌతిక శరీరం మాత్రమే పరిమితమైంది, కాని సూక్ష్మభౌతికం కాదు. సూక్ష్మ భౌతికం ప్రతిదానినీ చీల్చుకుని దూరిపోతుంది, ప్రతిచోటుకు వెళ్ళగలుగుతుంది. అది శరీరానికి పరి మితమై ఉండదు. పరిమితిచేసేది ఇది (శరీరం) గ్రహించలేనిది మనస్సు మాత్రమే. నీ మనస్సుతో దీనిని అర్థం చేసుకోలేవు. మనస్సు వ్యక్త పరచలేదు. దీనిని వ్యక్త పరచటానికి దానికి వనరులు లేవు. కేవలం అనుభవంద్వారా మాత్రమే....నా బిడ్డా, కేవలం సాదృశ్యమైంది మాత్రమే సాదృశ్యమైనదానిని తెలుసుకోగలదు, కాబట్టి అదేమిటో తెలుసుకోవాలంటే, ఒకరు తప్పక ఆ చైతన్యానికి ఎదగవలసిఉంటుంది., ఆ ఏకం యొక్క ఇటువంటి తాదాత్మ్య చైతన్యానుభవం పొందటానికి.....

అవును, ఇది ఎప్పుడూ ఆ విధంగానే ఉంటుంది, నిరంతరం అక్కడ పూర్తి

ఏకత్వం, బాహ్యంవైపు ఒక గమనం ఉంటుంది. ... ఇదే, ప్రతిచోటా, ఒకే సమయమందు. ఇది నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఈ ఏకత్వం, ప్రతిచోటా ఈ విధంగా శాఖోపశాఖలుగా జరుగుతూనే ఉంటుంది. ఇది సత్యం, ఇది ఎడతెగకుండా జరుగుతూనే ఉంటుంది.ఎవరికైతే ఆ దృష్టి ఉంటుందో, దీనినే వారు చూడడం జరుగుతుంది. ఇది చైత్య దర్శనం.

*

పని ఒకటే

ప్ర: మాతా, శ్రీఅరవిందులను తెలుసుకోవటానికి ముందే, మీకు ఆయనతో ఏమైనా సంభాషణలు జరిగాయా? ఎందువల్లనంటే, నేను చదివిన కొన్ని పుస్తకాలలో ఆయన, మీరు చాలా మటుకు ఒకే విధమైన పనిని చేసారని చెప్పబడింది.

స: ఆపని, అప్పుడు, ఇప్పుడు ఒక్కటే. ఎందువల్లనంటే, ఆయనకు, నాకు స్ఫూర్తి మూలం ఒకటే. పరమపురుషుడు.

December 10, 1967, Blessings of the Grace pp. 98-102

(శ్రీమాత మరొక జాబు నుంచి)

ఆపనిలో మానవజాతిని మొత్తంగా నూతన సృష్టికి సంసిద్ధపరచటానికి సహాయం ఇమిడి ఉంది, అనగా, అతిమానస జాతి.

May 19, 1968

ప్ర: మాతా, ఈ పుస్తకంలోని ఆఖరి వాక్యం చాలా ఆసక్తిదాయకంగా, హృదయాన్ని స్పృశిస్తోంది. వారు లేక, మీ ఉనికిలేదు, మీరు లేక వారు అభివ్యక్త మవలేరు.

అవును, అది పరిపూర్ణసత్యం. దానిని ఆ పుస్తకంలో ఏ విధంగా పెట్టానో నాకు తెలియదు. కాని వారు లేక నేను ఉనికిలోకి రాలేను. నేను లేక వారు అభివ్యక్తమవలేరు. ఒకటి మరొక దానిని పరిపూర్ణం చేస్తుంది. కాని నిజానికి మేమిరువురము ఏకం, ఒకటే. అది ఒకే సత్త్వము, ఒకే అస్తిత్వం, సృష్టిలో రెండు వేరు రూపాలను సృష్టి ధర్మాన్ని నిలబెట్టడానికి తీసుకుంటుంది. అది లేనప్పుడు, అది ఒకటే, నేను మరియు ఆయన, తేడా లేదు, వేరుదనం లేదు విభజన లేదు. ఏకం, అద్వితీయం, ఒకటే. వారు ఏమిటో, అంతస్సత్వంలో నేను పూర్తిగా అదే. అది ఈ విధంగా

(శ్రీమాత రెండు చేతివేళ్ళను పెనవేసి చూపుతారు) మేము ఐక్యం, ఒకటే, తద్రూపం, విభజనలేని ఏకం, కాని సృష్టిలో, ఏకం తనను తాను విభజించుకున్నట్లుగా వుంటుంది, సృష్టి లోకి రావటానికి ఈ విధంగా (శ్రీమాత వేళ్ళను వేరుచేసి చూపుతారు) ఏకం రెండవుతుంది. కాని అది కేవలం కనబడేది మాత్రమే, సృష్టి ధర్మాన్ని నిలబెట్టడానికి ఏకం రెండుగా విడివడడం. యదార్థంలో, అది ఒకటే, రెండుశరీరాలను తీసుకొనే ఆ ఏకం నేను, ఆయన, కేవలం సృష్టికోసం. వాస్తవంలో రెండు అస్తిత్వాలు ఏకం, అద్వితీయం. ఈ విదంగా ఏకం సృష్టిలో కనబడుతుంది. కాని అతడు ఏమిటో, నేను అదే. తేడా ఏమీ లేదు. అది కేవలం సృష్టిలో తేడాగా రూపు దిద్దుకుంది. మాకు రెండు శరీరాలున్నాయి. కాని మేము, ఒకటి, మరొకటి, ఒకటే. తేడా ఎంత మాత్రం లేదు. మేము ఈ విధంగా ఉన్నాము. (శ్రీమాత అదే సంజ్ఞను మరలా చూపిస్తున్నారు) అయినప్పటికీ దానికి ఆవల, ఇంకా ఏదో ఉంది. వాస్తవంలో మే మేమిటో, ఆవల, పైన అక్కడ కాని అది చెప్పేదికాదు. అదేమిటో ఒకరు దానిని మాటలలో చెప్పలేరు. ఒకరు దాని గురించి చెప్పేదంతా పూర్తిగా బుద్ధిహీనమైనదే కాని మరేమి కాదు. ఆ ఉనికిని గురించి మాటలు ఏమీ వ్యక్తపరచలేవు. ఏమీ లేదు, ఏమీ లేదు, అది మాటలలో చెప్పవలసిన అగత్యం లేదు..... పరమపురుషుడే రెండు రూపాలలో తనకు తాను వ్యక్తమవుతున్నాడు.

Blessings of the Grace pp.104-05

కేవలం ఒక విషయంలో నేను సంపూర్ణంగా కచ్చితంగా, నే నెవరనేది, శ్రీఅరవిందులకు కూడా అది తెలుసు, దానిని ప్రకటించారు కూడా. మొత్తం మానవజాతి సందే హాలుసైతం ఆయదార్థతను ఏమాత్రం మార్చలేవు

కాని ఇంకొక ముఖ్యవిషయం మటుకు అంత కచ్చితంకాదు. ఈ శరీరంలో నే నిక్కడ ఉండడం, ఏ పని నైతే చేస్తున్నానో ఆ పనినిచేస్తూ ఉండడం. వ్యక్తిగతంగా ఏ విధమైన తీవ్ర వాంఛతోనూ నేను దానిని చేయడంలేదు. శ్రీఅరవిందులుచేయమని చెప్పారు. అందువలననే నేను పరమపురుషుని ఆజ్ఞానుసారం వినమ్రతతో పవిత్ర విధాయక కార్యంగా చేస్తున్నాను.

ఎంతగా భూమి దీనివల్ల లాభం పొందిందో కాలమే బయటపెడ్తుంది.

CWM 13: 47 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మా — శ్రీఅరవిందో — మా — శ్రీఅరవిందో

మాతా, శ్రీఅరవిందులు ఎల్లప్పుడు మీ గురించి చెప్పేవారు, మీరు మాలోనే ఉన్నారని

అవును, అది సత్యం, సంపూర్ణంగా యదార్థం.

శాశ్వత దివ్యాగ్ని జ్వాలలో ఉనికి వున్న దానిగా కార్యాచరణను ప్రారంభించి ఉత్తేజ పరచే దివ్యచైతన్యంగా, సమస్తాన్ని మధురమయం చేసే, శాంతిమయం గావించే దివ్య ప్రశాంతతగా, వెల్లువలా ఉప్పొంగి శుద్దపరచే మహదానందంగా, పవిత్రీకరించే దివ్యకాంతిగా, దివ్యానుగ్రహం ప్రసాదించే దివ్యస్పందనగా నేను అక్కడ వున్నాను.

శ్రీఅరవిందులు అక్కడ ఆదుకునే మహా అస్తిత్వంగా ఉన్నారు. ఇక నేను, నేనక్కడ దివ్యమార్గ దర్శిగా ఉన్నాను. యదార్థానికి, ఒకే వ్యక్తిత్వం రెండుగా ఉంది. ఏకం, ఏది పరికిస్తుంటుందో — దివ్యసాక్షి, ఇంకొకటి నేరవేర్చేది — దివ్యశక్తి.

ఒకరు దానిని వివరంగా గ్రహించనంత వరకు దేనినీ అర్థం చేసుకోలేరు. ఏమైనా కాని, నీ కృతజ్ఞతాభావన బాగా ఆమోదించబడింది. ఆయన నీ ప్రార్థన విన్నారు. నేను నీకు నా ఆశీస్తుల నిస్తున్నాను.

అవును, నా బిడ్డా, ఎవరైతే శ్రీఅరవిందులను, నన్ను గుర్తిస్తారో, — యదార్థానికి, అది ఒకటే, ఒకే వ్యక్తిత్వం — దివ్య సత్యం వైపు వేసే అడుగులలో అతడికి అన్ని అడ్డంకులు, అన్ని కష్టాలు, అన్ని చిక్కులు, మనం చెప్పుకొనేటటువంటి అన్ని చికాకులు, తుడిచిపెట్టుకు పోతాయి, ఎప్పటికీ తొలగించబడుతాయి, ఈ జన్మలోనే కాక మృత్యువు తరువాత రాబోయే జన్మలలోను, శాశ్వతంగా

అవును, అతనిని, దివ్యప్రభువు, సర్వశక్తివంతుడు. కేవలం జపించు.

"మా — శ్రీఅరవిందో — మా — శ్రీఅరవిందో" ... అది చాలు.

The Supreme, P. 63 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అతడులేక నా ఉనికి లేదు,
నేను లేక అతడు అవ్యక్తుడు

CWM 13: 32

నేను కేవలం పని కోసమే కొనసాగుతున్నాను

ఊర్ధ్వంనుంచి పనిచేయడం ద్వారా, ఒకరు ఈ విషయాలను అదుపులో పెట్ట వచ్చు, వాటిని ఒకచోట కదలకుండా పట్టి ఉంచవచ్చు, సంతోషదాయకం కాని పనులు తలపెట్టకుండా ఆపవచ్చు, కాని అది కాదు... పరివర్తన అంటే అర్థం పరి వర్తన గావించటమే.

వాటి మీద ఆధిపత్యం కూడా సాధించవచ్చు. దానిని పైనుంచి చేయడం చాలా తేలిక. కాని పరివర్తనకు ఒకరు తప్పక దిగిరావాలి, అది చాలా భయానకం.... లేని యెడల అధో చేతన ఎన్నటికీ పరివర్తన నొందదు, అది ఇప్పుడు ఏ విధంగా ఉందో ఆ విధంగానే కొనసాగుతుంది........

పని కోసం కాకపోయినట్లైతే, నేను శ్రీఅరవిందులతో వెళ్ళిపోయి ఉండేదానను, ఇప్పుడు బాగా అర్థమైందనుకొంటాను. నేను కేవలం పనికోసమే కొనసాగుతున్నాను. కారణం, చేయవలసిన కార్యమున్నది, ఆయన నన్నా పని చేయమని చెప్పారు, నేను దానిని చేస్తున్నాను..... అలా కాని పక్షంలో ఒకరు పరిపూర్ణమైన ఎరుకతో ఉంటే గనుక, శరీరం లేకుండా ఉన్నప్పుడు చాలా తక్కువ పరిమితికి లోబడి ఉంటారు: ఒకరు వందమందిని ఒకే సమయంలో, వందచోట్ల చూడగలరు, శ్రీఅరవిందులు ఇప్పుడు చేస్తున్నట్లుగా.

The Mother: conversations with a disciple, Feb 10,1961.

శ్రీఅరవిందులతో ఐక్యమవాలని కోరుకొనే కణాలు పొందే ఆనందం

కొన్ని నెలల క్రితం, ఈ శరీరం మరల యుద్ధభూమిగా మారినప్పుడు, అనేక అవరోధాలను ప్రతిఘటిస్తున్నప్పుడు, నిశ్చేతనంగా ఉన్నప్పుడు, తనకు తాను ఏమి చేయాలో ప్రశ్నించుకుంటున్నప్పుడు .... అది మేధోపరంగా పనిచేయవలసి ఉందా అని ఆలోచించడం లేదు, కాని ఒకరకమైన గ్రాహ్యతను అడుగుతున్నది, దేనినో స్పృశించాలని కోరుకుంటున్నది: అది ఏ దిశగా పోతున్నదా అని అబ్బుర పడటం జరిగింది, విషయాలు ఎటు వైపు మొగ్గు చూప బోతున్నాయా అని. అప్పుడు ఒక్కసారిగా, కణాలన్నింటిలో ఈ అనుభూతి కలిగింది (నాకు తెలుసు అది ఎక్కడి నుంచి వచ్చిందో) ఈ అమరికనుంచి మేము విడిపోయేటట్లైతే, ఇక ఏ మాత్రం

కొనసాగనట్లైతే, అప్పుడు మేమిద్దరము సూటిగా వెళ్ళిపోతాం, సరాసరి ఒక బాణం లాగ — అదీ ఒక అద్భుతమైన జ్వాల లాగ — ఇక్కడ మన ద్వారం దగ్గరే ఉన్న టువంటి, శ్రీఅరవిందుల అతిమానస ప్రపంచంలో సరాసరి తిరిగి ఆయనను కలుసు కోవటానికి; దానిలో ఎంతటి హర్షాతిరేకం ఉంది! ఎంతటి అత్యుత్సాహం, ఎంత ఆనందం కణాలన్నింటిలో వెల్లువెత్తింది. వాటికి తాము విడివడిపోతామేమో అనే దానిగురించి ఎటువంటి బెంగలేదు..... 'ఓహ్,' 'అయితే ఏమిటి!' అనుకున్నాయి.

శరీరానికి జ్ఞానప్రకాశం కలిగించే పనిలో ఇది నిజంగా ఒక నిర్ణయాత్మక ఘట్టం.

కణాలన్నీ, వాటిని చెల్లాచెదుర చేయాలనే ఆ మూఢశక్తికన్నా చాలా ఎక్కువగా శక్తిసామర్థ్యాలు కలిగిన అనుభూతిని పొందాయి. 'మృత్యువు' అని పిలువబడే దానికి ఇవి పూర్తిగా ఉదాసీనంగా ఉండిపోయాయి. "మనం దేనికోసం భయపడాలి? మన మక్కడకి వెళ్ళి శ్రీఅరవిందుల కార్యంలో ఎరుకతో పాల్గొందాం, ప్రపంచ పరివర్తనలో, ఏదో ఒక విధంగా కాకపోతే ఇక్కడ, అక్కడ, ఈ విధంగా, ఆ విధంగా — ఎలాగయినా ఫర్వాలేదు, ఏమీకాదు!"

అప్పుడు ఆ సమయంలో నేను ఇక్కడే ఇంత దగ్గరగా ఉన్నటువంటి (శ్రీమాత తన చేతిని ముఖానికి ఒత్తుకుని చూపించింది) పరమపురుషుని నుంచి దివ్యాదేశాన్ని పొందాను. ఆయన నాతో చెప్పారు, "ఇది వాగ్దానం చేయబడిన విషయం, ఇప్పుడు ఈ పని తప్పక జరిగితీరాలి."

ఇది వ్యక్తి పరంగా కాదు, సమిష్టిగా పని జరగవలసిఉంది. కనుక, సహజంగానే అది ఏ విధంగా వచ్చిందో ఆ కారణంగా, అది హర్షాతిపూరకంతో, ఆమోదించ బడింది, తక్షణం అమలు చేయబడింది.

కాని, ఆ అనుభవాన్ని నేను గుర్తుకు తెచ్చుకుని, ఇప్పుడు నేనేమిటో తలచు కొంటే........

అవునుకదా, శ్రీఅరవిందులు శరీరాన్ని వదిలి వెళ్తున్నప్పుడు చేసిందేమిటో, అదీ ఇప్పటి పరిస్థితి. ఒక రకంగా రెండూ సమానమే, కాని చాలా ఎక్కువ పూర్ణం, పరిపూర్ణం, సంపూర్ణం — కారణం. ఆ అనుభవం ఆయన కుంది, అది ఆయన కుండింది, అది ఆయన పొందారు. నేను ఆయనను చూశాను. ఆయన పక్కమీద అతిమానసాన్ని చూశాను. ఆయన పక్కమీద ఉపస్థితమై యుండగా.

(నిశ్శబ్దం)

ఆయన వ్రాశారు. నేను వ్యక్తిగతంగా, నాకోసం చేయడంలేదు, కాని ఇది సమస్త పృధ్వికోసం. ఇప్పుడదే కచ్చితంగా నాకూ వర్తిస్తుంది. ఓహ్, కాని ఆ అనుభవం! నా కింక ఏదీ లెక్కలోకి రాదు. మనుజులు, భూమి దానికదే — భూమికి కూడా సంపూర్ణంగా ఏ విదమైన ప్రాముఖ్యతా లేకుండింది.

The Mother: Conversations with a disciple, July 15, 1961

"...... ఎ.జి. [1] మరియు మిరా మధ్య నీవు దృఢమైన వేర్పాటును కలిగిస్తే అది పొరపాటే అవుతుంది. రెండు ప్రభావాలూ సాధనలో పూర్తి అభివృద్ధికి అవసరమే. కేవలం ఇద్దరూ కలిసి చేసే పనిమాత్రమే అతిమానస సత్యాన్ని క్రిందికి భౌతిక తలంలోకి తీసుకు రాగలుగుతుంది. ఎ.జి. సూటిగా మనస్సుమీద, ప్రాణికంమీద ప్రకాశమాన మనస్సుద్వారా పనిచేస్తాడు. ఆయన పురుష తత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రకాశమాన జ్ఞానంలోను (అంతఃస్ఫూర్తి, అతిమానసం లేక ఆధ్యాత్మికం) ఈ జ్ఞానంలో పనిచేసే ఆధిపత్యశక్తి లోను, ఆయన బలం ప్రబలంగా ఉంటుంది. దానితోపాటు చైత్యపురుషుడు ఈ చర్యకు దన్నుగా నిలుస్తాడు. భౌతిక, ప్రాణిక తలాల పరివర్తనకు సహాయం చేస్తాడు. మిరా సూటిగా చైతన్యంమీద, మానసిక ఉద్వేగభరిత ప్రాణిక, భౌతిక అస్తిత్వంమీద ప్రకాశమాన మానసిక చైతన్యం ద్వారా పనిచేస్తుంది. అదే సమయంలో అతిమానసం అస్తిత్వంయొక్క ప్రకాశమానమగు అంతఃస్ఫూర్తులు ఆమె సరైన దారులలో, సరైన క్షణాలలో పనిచేయటానికి ఆవశ్యకమైన జ్ఞానాన్ని ఇస్తాయి. దివ్య శక్తిత్వానికి ప్రాతినిధ్యం వహించే ఆమెశక్తి సూటిగా చైత్యము, ప్రాణికం, బౌతికం, ఆమె ఆధ్యాత్మిక జ్ఞానం దాని సహజప్రకృతిలో ప్రబలంగా ఆచరణాత్మకం. చివరగా చెప్పేదేమంటే, అది వినియోగంలో వున్న మానసిక, ప్రాణిక, భౌతికశక్తుల అతి విస్తృతమైన, వివరణాత్మకమైన జ్ఞానం, అనుభవం, ఆ జ్ఞానంతో పాటుగా, జీవితం, యోగం ఉద్దేశాలను చేపట్టే ఆధిపత్యశక్తి."

SriAurobindo, Mother India 1970, P. 613

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

[1] శ్రీఅరవిందుల పేరుకు 1920 చివరి వరకు శిష్యులు వాడిన సంక్షిప్త అక్షరాలు. తరువాతి కాలంలో శ్రీమాత శ్రీఅరవిందులపేరు దానికదే మంత్రమని బహిరంగ పరచారు.

శ్రీఅరవిందులు నేను ఒక్కటే

ఇప్పుడు ఒకటి గుర్తుంచుకో. శ్రీఅరవిందులు నేను ఒక్కటే, ఒకే చైతన్యం, ఒకే వ్యక్తి. కేవలం ఏకమైనటువంటి ఈ శక్తి గాని లేదా ఈ ఉనికిగాని నీ వ్యక్తిగత చైతన్యం గుండా ప్రసరించినప్పుడు అది ఒక రూపాన్ని, ఒక ఆకారాన్ని ధరిస్తుంది. నీ మానసిక ప్రవృత్తిని, నీ లక్ష్యాన్ని, నీ అవసరాన్ని, నీ అస్తిత్వం యొక్క ప్రత్యేక మలుపునుబట్టి, అది విభిన్నతను సంతరించుకుంటుంది. నేను బహుశా ఇలా చెప్ప గలను, నీ వ్యక్తిగత చైతన్యం ఒక వడపోత, ఒక సూచికవంటిది. అది ఎంపికను చేస్తుంది, అనంతమగు దివ్య సంభావ్యతలనుండి అది ఒక సంభావ్యతను నెలకొల్పు తుంది. వాస్తవంలో దైవం ప్రతివ్యక్తికీ అతడు తననుంచి ఏమి ఆశిస్తాడో దానినే ఇస్తాడు. నీవు దైవం చాలా దూరంగా ఉన్నాడని, క్రూరుడని విశ్వసిస్తే, ఆయన దూరంగానే క్రూరంగానే వుంటాడు. కారణం అంతిమంగా దైవానుగ్రహం నీ శ్రేయ స్సుకు ఆవశ్యకం కాబట్టి, నీవు ఆయన అనుగ్రహం అనుభూతి చెందుతావు. కాళిగా ఆరాధించేవారికి ఆయన కాళి, భక్తుడికి వరదప్రదుడు. దివ్యజ్ఞానాన్వేషకుడికి ఆయనే సర్వజ్ఞానము. అంతా భ్రమయని తలచేవాడికి అతీత వ్యక్తిత్వరహితుడు; నాస్తికుడికి ఆయన నాస్తికుడు, ప్రేమికుడి యొక్క ప్రేమ.ఆయన సోదరుడై, సన్నిహితుడై, స్నేహితుడిగా యెల్లప్పుడూ విశ్వాసపాత్రుడై, అవసరమైనపుడు సహాయపడుటకు సిద్ధమై వుంటాడు. ఆయనను అంతరంగ మార్గదర్శకుడిగా ప్రతి కదలికయొక్క అనుభూతి అనుక్షణం చెందేవారికి ఆయన ఎల్లప్పుడూ సహాయ మందించటానికి సంసిద్ధంగా ఉండే ఆపద్బాంధవుడు. ప్రతి దానినీ ఆయన తుడిచిపెట్టగలడని నీవు విశ్వసిస్తే, ఆయన నీ దోషాలన్నింటినీ, నీ తప్పుల నన్నింటినీ, అవిశ్రాంతంగా తుడిచివేస్తాడు, ప్రతి క్షణం ఆయన అనంత దివ్యానుగ్రహాన్ని నీవు అనుభూతి నొందగలుగుతావు. వాస్తవంగా, ఆయన, ఆయనను ముందుగా నీవు ఏ విధంగా ఊహించుకుంటావో ఆ దైవం.

CWM 13:75

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీమాత యందు ఆశ్రయం పొందాలి

ఈ యోగానికి గల రెండు గొప్ప అడుగులలో ఒకటి

శ్రీమాత శ్రీఅరవిందుని శిష్యురాలు గాదు[1]. నాకు కలిగిన అనుభవాలు, సాక్షాత్కారాలు ఆమెకు యెప్పుడో కలిగాయి. చాలా చిన్నతనంలోనే శ్రీమాత యోగం మొదలైంది. ఆమెకు పన్నెండు, పదమూడేళ్ళ వయస్సులోనే, ప్రతి సాయంత్రం, అనేక మంది గురువులు, ఆమె వద్దకు వచ్చి అనేక ఆధ్యాత్మిక ఆచరణా విధానాలను తెలియ జెప్పేవారు. వాళ్ళలో ఆసియా ఖండానికి సంబంధించిన, శ్యాముని ఛాయగల రూపం ఒకటి వుండేది. మేము మొదటిసారి కలుసుకొన్నప్పుడు, యెంతో కాలం క్రిందట మామూలుగా చూస్తూ వుండిన శ్యాముని ఛాయగల ఆసియాకు సంబంధించిన రూపంగా నన్ను వెంటనే గుర్తించింది. ఒక ఉమ్మడి గమ్యం కోసం ఆమె యిచటకి వచ్చింది. ఆ గమ్యసాధన కోసం నాతో కలిసి పనిచేయడం అనేది దైవనిర్ణయం. శ్రీమాత బౌద్ధుల యోగంలో, గీతాయోగంలో, భారతదేశానికి రాక ముందే, నిష్ణాతురాలు. ఆమె యోగం, ఒక ఘనమైన సమన్వయం వైపు నడుస్తూ ఉండింది. అందుచేత ఆమె యిచటికి రావడం సహజం. నా యోగానికి ఒక ఘనిష్ట రూపమివ్వటానికి ఆమె సాయపడింది, సహాయపడ్తూనే వుంది. ఆమె సహకారం లేకుండా ఇది సాధ్యమై వుండేది కాదు.

ఈ యోగంలోని రెండు గొప్ప అడుగులలో ఒకటి శ్రీమాత యందు ఆశ్రయం పొందడం.[2]

శ్రీమాతకు యథార్థమైన బిడ్డగా వుండేందుకు ప్రయత్నించు.

నీవు శ్రీమాత బిడ్డవు. ఆమె బిడ్డల యెడల ఆమె చూపే ప్రేమ అపారం. వారి స్వభావ దోషాలను ఆమె ఓపికతో భరిస్తుంది. శ్రీమాతకు యథార్థమైన బిడ్డగా వుండేందుకు ప్రయత్నించు. అలా ప్రయత్నించడ మనేది నీలో వుంది. కాని బాహ్యం

---

[1] తనను తాను తృతీయ పురుషలో చెప్పుకొన్న శ్రీఅరవిందులు యీ లేఖను చెప్పి వ్రాయించారు.

[2] తరువాత ఒకానొక సందర్భంలో ఆ రెండో గొప్ప అడగు యేమి అని శ్రీఅరవిందుల్ని అడిగినపుడు, వారు "దివ్యజీవనం కోసం సాధకుని ఆకాంక్ష" అని చెప్పారు.

వైపు తిరిగి వున్న నీ మనస్సును, అల్పమైన అర్థం లేని విషయాలు ఆక్రమించాయి. అంతేగాక చాలా తరచుగా వాటి చేత అతి తీవ్ర కలవరానికి గూడా గురౌతుంటుంది. శ్రీమాతను స్వప్నంలో దర్శించడమే గాదు, యెల్లవేళలా ఆమె నీతోనే, నీలోనే వున్నట్లు అనుభూతి చెందాలి. అప్పుడు నిన్ను నీవు అదుపు చేసుకోవడం, పరివర్తన చెందడం తేలికౌతుందని గ్రహించగలుగుతావు — ఎందుకనంటే ఆమె అచట వున్నందు వల్ల నీ కోసం ఆ పని చేయడానికి ఆమెకు వీలు కలుగుతుంది.

CWSA 32:452-53

ప్ర: శ్రీమాత సాన్నిధ్యం అతనిలో లేనపుడు సాధకుడు ఒంటరివాడై బాధ పడ్తుంటాడు. అలాగే శ్రీమాతకు కూడా తన బిడ్డ తన దగ్గర లేకపోతే అలాంటి అనుభూతి కలుగుతుందా? మానవ మాతృరాలైన కన్నతల్లి కంటే అధికంగా విచారిస్తుందా?

అలాంటిది వుంటే ఆమె యెల్లప్పుడూ వేల రెట్లు మహా విచారకర స్థితిలో వుండిపోవలసి వస్తుంది — కేవలం ఒక సాధకుని కోసం ఆమె అలా యెందుకుండాలి — అవిద్యలో సంచరిస్తున్న ప్రతి అంతరాత్మ కోసం అలా యెందుకు జరుగదు? బిడ్డ కూడా విచారపడవలసిన అవసరం లేదు, కాని శ్రీమాత పిలిచినప్పుడు తిరిగి ఆమె దగ్గర కొస్తే సరిపోతుంది.

CWSA 32:453

అంతరిక సాన్నిహిత్యం, భౌతిక సామీప్యత

ఆమెకై తెరచుకొన్నవారు, ఆంతరిక అస్తిత్వంలో ఆమెకు దగ్గరైనవారు, ఆమె సంకల్పంతో ఒకటై వున్నవారు, ఆమె కత్యంత సన్నిహితులైనవారు, శ్రీమాత బిడ్డలు — అంతేకాని దేహరీత్యా ఆమె దగ్గర చేరిన వారు గాదు.

CWSA 32:497

ప్ర: "ఆమెకై తెరచుకొన్నవారు ఆంతరిక అస్తిత్వంలో ఆమెకు సన్నిహితంగా వున్నవారు, ఆమె సంకల్పంతో ఒకటైవున్నవారు శ్రీమాత బిడ్డలనీ ఆమెకు అత్యంత సన్నిహితులని, దేహరీత్యా ఆమె దగ్గర వున్నవారు కాదు." అని ఒకసారి మీరు వ్రాసారు. ఆ సత్యాన్ని నేను కాదనను. అయినప్పుడు శ్రీమాత అసలెందుకు దేహం ధరించాలి? మేం పాండిచ్చేరిలో యెందుకుండాలి?

ఎచటున్నా అతడు ఆంతరిక బాంధవ్యాన్ని కలిగి వుండవచ్చుగదా, యిచటకి రావలసిన అవసరంలేదుగదా?

(భౌతిక ప్రపంచంలో పరివర్తనతో సహా) భౌతికస్వభావంగల ఒక కార్యం నిర్వహించవలసి ఉంది. గనుక ఆమె దేహాన్ని ధరించింది. జనంతో "భౌతిక భాంధవ్యాన్ని" యేర్పాటు చేసుకోవడానికి ఆమె రాలేదు. ఆమె కార్యంలో పాలు పంచుకోవడానికి ఆమెతో పాటు కొందరు వచ్చారు. ఇతరులను ఆమె పిలిచింది. మరికొంత మంది వెలుగును కాంక్షిస్తూ ఆమె వెంట వచ్చారు. ఇతరులను ఆమె పిలిచింది. మరికొంతమంది వెలుగును కాంక్షిస్తూ ఆమె వెంట వచ్చారు. వారిలో ప్రతివానితోనూ ఆమెకు వ్యక్తిగత బాంధవ్యం వుంది లేక అందుకు అవకాశం వుంది. ప్రతి బాంధవ్యం దాని కదే సాటి, అంతేగాని ఆమె ప్రతివ్యక్తితోనూ ఒకే విధమైన సంబంధం కలిగివుండాలని యెవరూ అనలేరు. ఆమె యితరులకు భౌతికంగా చేరువలో వున్నారు గనుక తనకూ భౌతికంగా చేరువ కావాలని ఎవరూ అనగూడదు. కొంతమందికి ఆమెతో సన్నిహిత వ్యక్తిగత సంబంధం వుంది, కాని వాళ్ళనామె పెద్దగా పట్టించుకోదు. కొంతమందికి వ్యక్తిగత సాన్నిహిత్యం చాలా తక్కువగా వుంటుంది. అయినప్పటికీ యేదో ఒక కారణంతో చాలా తరచుగా , లేక చాలా కాలం తరువాత ఆమెను చూడడం జరుగుతుంది. భౌతిక మనస్సుకు సంబంధించిన అర్థంలేని గణిత సంబంధ నియమాలను అన్వయింప జేయడం యిక్కడ కుదరదు.శ్రీమాత చేసేది నీ భౌతిక మనస్సుకు అర్థం కాదు. దాని విలువలు, దాని ప్రమాణాలు, భావాలు ఆమెవి కావు. నీ వ్యక్తిగత ప్రాణిక అభ్యర్థన లేక కోరికలను ఆమె చేసి తీరవలసినవేనని భావించడం యింకా దారుణమైన విషయం. ఆ మార్గంలో వెళ్తే దక్కేది ఆధ్యాత్మిక వినాశమే. ప్రతి సందర్భంలోనూ, ఆ సందర్భానికి తగిన కారణాలకు అనుగుణంగా ఆమె పనిచేస్తుంది.

CWSA 32:509

శ్రీమాత సహాయం, నా సహాయం యెల్లప్పుడూ నీకోసం సిద్ధంగా వుంటాయి.

శ్రీమాత సహాయం, నాసహాయం యెల్లప్పుడూ నీకోసం సిద్దంగా వున్నాయి. నీవు చేయవలసిందల్లా దానివైపుకు మరలడమే. ఆ సహాయం నీపై పనిచేస్తుంది.

మధ్యలో అడ్డుపడేవి, శ్రీమాత కటాక్షాన్ని నీ వందుకొనకుండా నివారించేవి, సాక్షాత్కారాన్ని, అనుభవాన్ని పొందకుండా నిన్ను ఆటంకపరచేవి, ఆకాంక్ష లేకుండా చేసే నీలోని యీ తప్పుడు భావాలే. ఈ భావాలు పూర్తిగా తప్పు, అసత్యం కూడా. ఆ భావాలు సైతం నీవి కాదు. నిరాశా నిస్పృహలను నీలో పుట్టించాలనే వుద్దేశ్యంతో నీ మీద కూడా, యితరసాధకుల పై వెదజల్లబడినట్లుగానే, ప్రయోగించబడ్డాయి. అనర్హతంటూ లేదు. అడ్డు తగిలే చెడు విషయాలు లోపల లేవు, అనుభవం ఆగిపోయేందుకు కారణమయ్యే ఆకాంక్ష రహిత స్థితికూడా కాదు. అది క్రుంగుబాటు, తన మీద తనకు నమ్మకం లేకపోవడం, నిస్పృహ చెందడానికి సిద్ధంగా వుండడం అనేవి కారణం, అంతకు మించి మరేం లేదు. నేను నీకు వ్రాసినట్లు సాధకులందరికీ, శ్రేష్టులైన, నిగ్రహం గల సాధకుల విషయంలో కూడా, సాధనా ప్రవాహానికి ఆంటంకాలు వస్తుంటాయి. తాను అనర్హుడనని అనుకోవడానికి, ఆశ లేదు. అనే భావంతో వెనుదిరగడాని కదొక కారణం కాదు. కొంచెం ప్రశాంతత, ఆ ప్రవాహాన్ని తిరిగి తీసుకొస్తుంది. ఆవశ్యకమైన అనుభవాలు, ఆవశ్యకమైన పురోగతి నీకున్నాయి. భౌతిక చేతనకు సంబంధించిన కొన్ని యిబ్బందులు తాత్కాలికంగా బయటపడడమే వాటిని ఆటంకపరచటానికి కారణం. అలా అందరికీ జరుగుతుంది. నీవు వివరించినట్లు అది నీకు మాత్రమే ప్రత్యేకం కాదు. ఈ యిబ్బంది లెల్లప్పుడు యెదురు పడుతూనే వుంటాయి. వాటిని అధిగమించాలి. దివ్యశక్తి చేసే పనివల్ల వాటి నొకసారి అధిగమించినప్పుడు మునిపటిలా సాధన కొనసాగుతుంది. కాని అనర్హత, ఆ కాంక్ష లేకపోవడం, కారణమనుకునే తప్పుడు భావాన్ని పోషించుకోవడం మొదలుపెట్టి పూర్తిగా కుంగిపోయావు. దాన్నంతా విదిలించి వెయ్యి, నీకు అందుతుండే భావరూప సూచనలను నమ్మకుండా తిరస్కరించు. ఏ సాధకుడు, అనర్హుడననే, ఆశలేదనే భావాలలో యెన్నడూ చిక్కుకొనకుండా వుండితీరాలి. అవి పూర్తిగా అసంగతమైనవి, యెందుకనంటే యెవరైనా విజయం సాధించారంటే అది వారి వ్యక్తిగత సామర్థ్యత, అర్హత వల్లగాక, శ్రీమాతకృప, శక్తి. ఆమె కృపను అంగీకరించిన అంతరాత్మ, ఆమె దివ్యక్రియాశక్తి పనుల వల్ల జరిగిన దౌతుంది.

ఈ అంధకార ఆలోచనలనుంచి ఫలితం కోసం, కోరికలకోసం అసహనంతో గాక, దృఢనమ్మకంతో, విశ్వాసంతో శ్రీమాత వైపు చూచి, ఆమె పనులు నీకు ప్రశాంతతను అంతరాత్మిక ఉన్ముఖతను, సాక్షాత్కారం వైపు పురోగతిని, కలిగేటట్లు

పునరుజ్జీవింపజేయనీ. అది నీవు కాంక్షించే పూర్ణ విశ్వాసం, ప్రేమలను నీకు తప్పక ప్రాప్తింపజేస్తుంది.

*

రెండు సంభావ్యతలు

రెండు సంభావ్యతలున్నాయి. ఒకటి చాలా కాలంపట్టే పురుష ప్రయత్నం వల్ల పరిశుద్ధత, రెండవది మామూలుగా వేగవంతంగా చర్య జరిపే దైవకృప జోక్యం ద్వారా జరిగేది. ఎందుకనంటే దైవకృపకు, సంపూర్ణ సమర్పణ ఆత్మార్పణ వుండి తీరాలి. పూర్తిగా ప్రశాంతంగా వుండి, ప్రతి అడుగులోను దానికే కట్టువడి వుంటూ అది సాధ్యం గాకపోతే నిశ్చలంగా, శాంతంగా నైనా వుండిపోతూ దైవక్రియా శక్తిని అనుమతించే మనస్సును కలిగి వుండడం అనేది సహజంగాఅవసరం. ఈ చివరి స్థితి రామకృష్ణులు చెప్పినట్లు మార్జాల కిశోర ధోరణిని పోలి వుంటుంది. దీనిని నిలుపుకోవడం కష్టం. వాళ్ళు చేసే దానంతట్లో తమ ఆలోచనలలో, సంకల్పాలలో, కార్యకలాపాలలో చాలా చురుకైన కదలికకు అలవాటు పడిన వారికి, ఆ కార్యకలాపాన్ని, నిశ్చలం చేయడం కష్టంగా కన్పించినందున మానసిక ఆత్మార్పణా ప్రశాంతతను అవలంబిస్తారు. అంటే అర్థం వాళ్ళు యోగం చేయలేరనిగాదు, ఆత్మార్పణ స్థితికి చేరుకోరనిగాదు. కాకపోతే పరిశుద్ధతను, ఆత్మార్పణను సాధించడానికి చాలా కాలం పడ్తుంది. అందుకు సహనం, స్థిరమైన పట్టుదల వుండాలి, ముందుకు సాగాలని అతడు తీర్మానించుకోవడం జరగాలి.

ఆధ్యాత్మిక పురోగతి, బాహ్య పరిస్థితులు

ఆంతరిక ఆధ్యాత్మిక పురోగతి, బాహ్యపరిస్థితుల మీద మనం వాటిని అంతర్గతంగా ప్రతి స్పందించే విధానం మీద ఆధారపడినంతగా ఆధారపడదు. ఆధ్యాత్మిక అనుభవపు తుది తీర్పు యెల్లవేళలా అదే. అందుచేతనే సరైన దృక్పథాన్ని అవలంబించి అందుకు కట్టువడి వుండడంపై, బాహ్యపరిస్థితులపై ఆదారపడివుండని ఒక ఆంతరిక స్థితిపై, సమత, ప్రశాంతతగల ఒక స్థితిపై ఆధారపడాలని నొక్కి చెప్తున్నారు. అది వెంటనే కలిగే ఆనందం గాకపోయినప్పటికీ అధికాధికంగా అంతరంగం లోనికి పోయి ఉపరితల మనస్సులో నివసించడానికి బదులుగా, ఆంతరంలో నుంచి

బయటకు చూస్తుండడం అవుతుంది. ఉపరితల మనస్సెప్పుడూ, జీవన ఆకస్మిక ఘటనల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వుంటుంది. ఆ ఆంతరిక స్థితి నుండి మాత్రమే, జీవితంకంటె, వ్యాకులత కలిగించే దాని శక్తులకంటె బలీయుడు కాగలరు, విజయం సాధించాలని ఆశించగలరు, ఎవరైనా.

అంతరంగంలో ప్రశాంతంగా వుండటానికి, ముందుకు పోవటానికి దృఢ సంకల్పం కలిగి వుండటానికి లేక కష్టాలు, ఊగిసలాటకు లోనుగాకుండా, కలవరపాటు చెందడాన్ని తిరస్కరించడానికి ప్రయత్నించటం ఆధ్యాత్మిక ప్రగతి మార్గం మీద అతడు నేర్చుకో వలసిన మొట్ట మొదటి విషయాల్లో ఒకటి. మరోవిధంగా చేయడమంటే నీవు పితూరీ చేస్తున్న, సదా అనుభవానికొస్తూ నిన్ను యిబ్బందికి గురిచేస్తున్న చేతన అస్థిరత్వాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. విరామాలు, ఊగిసలాటల సమయాలు లేకుండా ఉండడ మనేది యెప్పటికీ లేకపోయినా, నీవు ప్రశాంతంగా, స్థిరంగా వున్నప్పుడు మాత్రమే అనుభవ పంథా కొంత స్థిరంగా సాగిపోతూంటుంది. కాని వీటిని సరైన ధోరణిలో తీసుకొంటే, సాధనను తిరస్కరించే సమయాలుగా గాకుండా వాటిని వంట బట్టించుకొనే, యిబ్బందిని మట్టు బెట్టు సమయాలుగా తయారవుతాయి. బాహ్య పరిస్థితుల కంటె ఆధ్యాత్మిక వాతావరణం చాలా ప్రధానం. దాన్ని సాధిస్తే ఊపిరి పీల్చడానికి తన స్వీయ ఆధ్యాత్మిక వాయువును కూడా సృజించుకొని దానిలో నివసించ గలుగుతాడు. అది పురోగతికి సరియైన పరిస్థితి అవుతుంది.

శ్రీమాత సాన్నిధ్యాన్ని, శక్తిని ఆవాహన చెయ్యి

దైవప్రభావానికి తెరచుకొన్నాడా లేదా అనే దాని మీదే యీ యోగంలో అంతా ఆధారపడి వుంటుంది. ఎన్ని ఆటంకాలున్నా ఉన్నత చేతనకు చేరుకొనడానికి సహనంతో కూడిన సంకల్పం, ఆకాంక్షలో నిజాయితీ వుంటే అప్పుడు యేదో ఒక రూపంలో తప్పక తెరచుకోవడం జరుగుతుంది. కాని అది మనస్సు, హృదయం, దేహంయొక్క సంసిద్ధత లేక అసంసిద్ధత ననుసరించి తక్కువకాలం, లేక చాలా కాలం పట్ట వచ్చు.అందుచేత అతనికి ఆవశ్యకమైన సహనం లేకపోతే, ప్రారంభంలో వుండే యిబ్బంది వల్ల ప్రయత్నం విరమించుకోవడం జరుగవచ్చు. ఈ యోగంలో ఏకాగ్రత వహించడం, ముఖ్యంగా హృదయంలో యేకాగ్రత వహించి, అస్తిత్వాన్ని స్వీకరించి, ఆమె క్రియాశక్తి కార్యాలచే చేతనను రూపాంతరీకరించ వలసిందిగా

శ్రీమాత సాన్నిధ్యాన్ని, శక్తిని ఆవాహన చేయాలి. శిరస్సులో లేక కనుబొమల మధ్యలో కూడా యేకాగ్రత నిలుపవచ్చు, కాని చాలా మంది కది కష్టసాధ్యమైన ఉన్ముఖిత అవుతుంది. మనస్సు ప్రశాంతమైనప్పుడు, యేకాగ్రత బలీయమైనప్పుడు, ఆకాంక్ష తీవ్రతరమైనప్పుడు అనుభవం ఆరంభమౌతుంది. విశ్వాసం దృఢమైనప్పుడు ఫలితం వేగంగా లభించే అవకాశం వుంది. తక్కిన దానికి తన స్వప్రయత్నాల మీద మాత్రమే అతడు ఆధార పడకూడదు. దైవంతో సంపర్కం పెట్టుకోవడంలో సఫలుడవ్వాలి, శ్రీమాతశక్తి, సాన్నిధ్యాలను స్వీకరించ గలిగే శక్తిని పొందాలి.

CWSA 29: 34-35,83, 140

శ్రీఅరవిందులు

...నేను మొదట పనిచేయడం ప్రారంభించినప్పుడు (వ్యక్తిగతంగా థియోన్‌తో గాకుండా అతనికి ఫ్రాన్సులో తెలిసిన వ్యక్తితో, అతడి సోదరుని స్నేహితుడగు ఒక యువకుడు) నాకు పరంపరగా అంతర్దర్శనాలు జరిగాయి. (భారతదేశం గురించి నాకు తెలియదు, గుర్తుంచుకోండి, యెక్కువ మంది ఐరోపావాసులకు దానిని గురించి తెలియనట్లే ఆ దేశాన్ని గురించి నాకేమీ తెలియదు. "కొన్ని ఆచారాలు, మతాలు అస్తవ్యస్తంగా, అస్పష్ట చరిత్రగల అనేక 'అసాధారణ విషయాలు' సంభవించాయని చెప్పుకొనే ఆ దేశాన్ని గురించి నా కేమీ తెలియదు.)" అది సరే, అనేక యీ అంతర్దృశ్యాలలో శ్రీఅరవిందులను భౌతికంగా యిప్పుడెలా కన్పిస్తున్నారో అలా చూచాను, కాని వైభవోపేతంగా కన్పించారు. అంటే నేను మొదటిసారి వచ్చినప్పుడు చూచినట్లు, దాదాపు బక్కగా వుండి, స్వర్ణకాంతుల కంచు ఛాయతో, స్ఫురద్రూపుడైన, చిందరవందర గడ్డం, పొడుగాటి జుత్తుతో, ధోవతిని ధరించి దాని ఒక అంచును భుజం మీదే వేసుకొన్న పంచెకట్టుతో వున్న, చేతులకు, వక్షానికి ఆచ్ఛాదన లేకుండా, కాళ్ళకు చెప్పులు లేని శ్రీఅరవిందులను చూచాను. అప్పుడు దాన్ని నేను 'అంతర్దృశ్య వేషం' అనుకొన్నాను! అంటే నాకు భారతదేశం గురించి యేమీ తెలియదు. భారతీయ పద్ధతిలో దుస్తులు ధరించిన భారతీయు లెవర్నీ నేనెప్పుడూ చూడ లేదు.

అవును, ఆయన్ను చూచాను. ఒకే సమయంలో ప్రతీకాత్మక అంతర్దృశ్యాలు, ఆధ్యాత్మిక వాస్తవాలు అయిన వాటి అనుభవం కలిగింది. కలుసుకోవటంతో సాధించ వలసిన మహాకార్యాన్ని గురించిన, ఒక సమగ్ర స్ఫురణను కలిగి వుండడం అనే

పరిపూర్ణ నిర్ణయాత్మక ఆధ్యాత్మిక అనుభవాలు, వాస్తవాలు అనుభవాని కొచ్చాయి. భౌతికంగా నేనెప్పుడూ చేయని ఒక పనిని నేను యీ అంతర్దర్శనాల సమయంలో చేసాను. హిందూ పద్ధతిలో నేనాయన ముందు ప్రణమిల్లాను. నా చిన్మి మస్తిష్కంలో దీనిని గురించిన యెటువంటి గ్రహింపు లేకుండానే (నేనేం చేస్తున్నానో, యెలా చేస్తున్నానో నాకే తెలియదని దానర్థం — యేమీ తెలియదు) చేసాను, అదే సమయంలో బాహ్య అస్తిత్వం "యేమి టిదంతా?" అని సణుగుతూనే వుంది.

నేనా అంతర్దర్శనాన్ని వ్రాసి పెట్టుకున్నాను. (బహుశా తర్వాతెప్పుడో యేమో). కాని దానిని గురించి నేనెవ్వరికీ చెప్పలేదు. (సహజంగానే అటువంటి విషయాల్నెవరికీ చెప్పరు.) కాని నాకు కలిగిన అభిప్రాయ మేమిటంటే, జరుగ బోయేది ముందుగా తెలిసిందని, అదెప్పుడో ఒకప్పుడు భవిష్యత్తులో జరుగుతుందని. అది చేతనలో చురుకుగా లేకుండా, వెనకెక్కడో నిలిచి వుంది, సదా నిలిచి వుంది....

నేనిచటి కొచ్చాను.... కాని శ్రీఅరవిందులను మొదటిసారి నేనొక్కదాన్నే ఒంట రిగా కలవాలని నాలో యేదో అభిలషించింది. ఉదయం రిచర్డు ఆయన దగ్గరకు వెళ్ళాడు, ఆ మధ్యాహ్నం నేను కలవడానికి నిర్ణయమైంది. ఇప్పుడు "అతిథిగృహం" లోని రెండవ సామూహిక శయ్యాగారంలో భాగంగా వున్నచోట ఆయన ఆ రోజుల్లో నివసిస్తున్నారు. నేను మెట్లెక్కి పైకి వెళ్ళాను. ఆయనక్కడ నిలబడి వున్నారు, మెట్లపైన నా కోసం నిరీక్షిస్తున్నారు... సరిగ్గా నా అంతర్దర్శనంలో లాగా! అదే విధంగా దుస్తులు ధరించి, అదే స్థలంలో, అదే తీరులో, తలపైకెత్తి నిలబడి వున్నారు. ఆయన నా వైపు తల త్రిప్పారు... ఆయన కళ్ళలో యీయనే ఆయన అని చూచి గ్రహించాను. రెండు విషయాలు ఠక్కున స్ఫురించాయి. (ఆకస్మిక జలదరింపు) ఆంతరికానుభవం బాహ్యానుభవంతో ఒకటైంది, రెండూ ఒక దానిలో ఒకటి కరిగి పోయాయి. అదొక నిర్ణయాత్మక ఆకస్మిక ఘటన.

కాని యిది కేవలం నా అంతర్దృశ్య ఆరంభం మాత్రమే. అనేక అనుభవాల పరంపర తర్వాత మాత్రమే — పాండిచ్చేరిలో పది నెలల తాత్కాలిక నివాసం తర్వాత, ఐదు సంవత్సరాల యెడబాటు తర్వాత, పాండిచ్చేరికి తిరిగి రావడం, అదే యింట్లో, అదే విధంగా కలవడం అంతర్దర్శనం తుది ఘట్టం జరిగింది. నేను ఆయన ప్రక్కనే నిలబడి వున్నాను. నా తల ఆయన భుజంపై లేదు కాని ఆయన భుజం యెక్కడుందో సరిగ్గా అక్కడుంది. (దాన్నెలా విశదీకరించాలో నాకు

తెలియయడం లేదు. భౌతికంగా స్పర్శ లేదనే చెప్పాలి) ఆ విధంగా మేమిరువురం ఒకరి ప్రక్కనొకరం నిలబడి కిటికీ గుండా బయటకు చూస్తూ నిలబడి వున్నాం. అప్పుడు యిద్దరికీ సరిగ్గా ఒకే క్షణంలో "ఇప్పుడు మహాసాక్షాత్కారం సాధించ బడ్తుంది." అనే అనుభూతి కలిగింది.అంటే మహాసాక్షాత్కారం జరగడానికి ఆమోద ముద్ర పడిందన్నమాట. ఆ మహోన్నతమైనది, అతిభారంగా నాలోనికి దిగిరావడాన్ని నా అంతర్దర్శనంలో యెలాంటి నిశ్చితత్వంతో అనుభూతి చెందానో అలాంటి అనుభూతే కలిగింది. ఆ క్షణం నుండి చెప్పడానికి ఏమీ లేకపోయింది. మాటలు లేవు, యేమీ లేవు, మాకు తెలిసింది, అదేనని.

కాని మా యీ రెండు సమావేశాలకు మధ్య అనేక అనుభవాల పరంపరలో ఆయన పాలు పంచుకున్నారు. క్రమంగా వికసిస్తుండే యెరుకకు సంబంధించిన అనుభవాలవి. వీటిని "ప్రార్థనలు, ధ్యానములు" గ్రంథంలో పాక్షికంగా ఉంటంకించాను. (వ్యక్తిగతానికి సంబంధించిన భాగాలను నేను తొలగించాను) కాని అచట నేను చెప్పనటువంటి ఒక అనుభవం వుంది. (దాన్ని మొత్తంగా అచ్చట నేను వర్ణించలేదు. ముగింపు మాత్రమే చెప్పాను.) "మనిషి తిరస్కరించాడు గనుక, జగత్కార్యంలో, నూతన సృష్టి కార్యంలో భాగస్వామ్యాన్ని ఆ నూతన సృష్టిని కోరకుండా తిరస్కరించాడు గనుక ఇపుడు దాన్ని నేను భగవంతునికి సమర్పిస్తున్నాను." ఇదీ ఆ అనుభవం.

The Mother, Conversations with a disciple December 20, 1961

రూపాంతరీకరణం: మహాశక్తి

మానసిక, ప్రాణిక అస్తిత్వంలో పొందిన దాన్ని క్రిందికి, భౌతికంలోనికి పదార్థ దేహపు జీవకణాలలోనికి కూడా తీసుకు రాగలిగినపుడే రూపాంతరీకరణ సంపూర్ణ మౌతుంది. ఒక విధమైన ప్రగాఢ శాంతి, వైశాల్యత, బలం, శక్తి, నమ్యత, మనస్సు నుండి క్రింద వున్న జీవకణాలవరకూ నిలుపుకోగలగడం అందుకు ఆవశ్యక పరిస్థితులు. ఆ పరిస్థితులు ఏర్పడినపుడు పైనుండి పని ప్రారంభమౌతుంది. రూపాంతరీకరణకు ఒక గొప్పశక్తి అవసరంలేదు. దైవం దేహంలో అవతరించడమంటే అతిమనస్సులో వున్న నీ స్వకీయ దైవాత్మ అవతరించడమన్నమాట. రూపాంతరీకరణం ఒక వ్యక్తిగత వ్యవహారం. దానితో మహా శక్తికి గల పనేమిటో నేనర్థం చేసుకోలేక పోతున్నాను.

శక్తి చేసే పనికి ఒక ప్రత్యేకత వుంటుంది. నా స్వవిషయంలో నేను చేయవలసివున్న

పనికి అదొక ఆవశ్యక పరిస్థితి. నేను నా వ్యక్తిగత రూపాంతరీకరణాన్నే చేయవలసి వున్నట్లయితే లేక నా వ్యక్తిగత సంపర్కంలో కొచ్చిన, యెంపిక చేసిన కొద్దిమందికి ఒక నూతన యోగాన్నివ్వడం లేక ఒక క్రొత్త ఆదర్శాన్నివ్వడం మాత్రమే అయితే, యే శక్తీ లేకుండానే నేనా పని చేసివుండేదాన్ని. కాని నేను చేయవలసివున్న పనికి, రెండు పార్శ్వాలూ అవశ్యం దగ్గర కాక తప్పదు. నేను, మిర్రా దగ్గర కావడంవల్ల నీవు రూపాంతరీకరణను సాధించడాన్ని సులభతరం చేసే కొన్ని పరిస్థితులు సృజించబడ్డాయి. ఈ పరిస్థితుల వల్ల ప్రయోజనాన్ని నీవు పొందవచ్చు. నా విష యంలో అవసరమైంది గనుక, ప్రతివానికీ శక్తి అవసరం వుండదు. ఒకరివిషయంలో ఒకటి అవసరమైంది గనుక, అది అందరికీ అవసరం అని చెప్పలేం. అధికులు, అల్పులు అనేదిగాదు ఇక్కడి ప్రశ్న. నా కంటె నీవు తక్కువ సంక్లిష్టత గలవాడివై వుండవచ్చు. నేను చేసినవన్నీ నీవు చేయవలసివస్తే నీ వెన్నటికీ చేయలేవు. నీవు మహాశక్తిని పొందటానికి ముందు, దానిని పొందే అర్హతను నీవు పొందాలి. కామానికి సంబంధించిన సమస్త చలనాలను నీవు అదుపులో పెట్టుకోగలిగి వుండాలనేది ప్రథమ షరతు. ఇంకా యితర విషయాలు చాలా వున్నాయి. అంతఃశ్చేతన యొక్క ప్రతి భూమికపై సంపూర్ణ యేకత్వం తప్పక వుండాలనే మరో విషయం కూడా వుంది.

శ్రీఅరవిందులు "మదర్ ఇండియా" ఏప్రిల్ 1970; 147-48

ఆయన గురించి, ఆమె యెలా అనుభూతి చెందారో దాన్ని ఆయన పేరును ఆమె పలికిన ప్రతిసారి గమనించగలం. ఏదో అనిర్వచనీయమైన అమృత రుచి ఆమె పెదవులపై వున్నట్లు అన్పించేది. సుదూరాన వున్న ఆయన సన్నిధానాన్ని ఆవాహన చేస్తున్నట్లుగా, తన అంతరాంతర గంభీర లోతులనుంచి ఆమంత్రిస్తున్నట్లు దాని నొక మంత్రాలకే మంత్రమైన మహామంత్రంగా, సగం ఫ్రెంచి, సగం ఆంగ్ల యాసలో శ్రీలోని 'యస్' అనే ఆంగ్లాక్షరాన్ని తప్పకుండా 'ష్' గా, అందులోని 'ఆర్' ను, అలాగే 'అరవిందో' ను గూడా గొంతులోనుండి ఒక విధమైన బంగారు గురగుర శబ్దంతో పలికేది. ఆ ధ్వనిలో కేవలం భక్తి, కేవలం తాదాత్మ్యత యేక కాలంలో బహిర్గతమయ్యేవి. పూర్తిగా ఆమె హస్తాల్లో వుంచిన ఆశ్రమ పాలన, ఆమె రూపుదిద్ది విస్తరింపజేసిన బహుపార్శ్వసృజనాత్మకత, ప్రతిచోట ఆ గొప్ప

నామం ఓ గొప్ప రూపం తీసుకొంటున్నట్లుండేది. 1926 నవంబరు 24 సాయంత్రం నుండి ఆయన 'క్రియాశీల ధ్యానం' కు సంబంధించిన నేపథ్యంలోనికి, ఇంతవరకు అభివ్యక్తం కాని అతిమనస్సును, గ్రుడ్డిగా తోచే సుదీర్ఘకాలం నుండి బాధ పడుతున్న ప్రపంచ భౌతిక ద్రవ్యంలోనికి అవతరింపజేసే కార్యాన్ని వేగవంతం చేయడానికి ఉపసంహరించుకొన్నప్పటికీ బహుశా, 1930లో వ్రాసిన లేఖలో తెలిపిన వాస్తవాన్ని అనుసరించే ఆమె సదా పనిచేసింది. ఒక సాధకుడు శ్రీఅరవిందుల సూచనల ప్రకారం వ్రాయగా, వారే దానిని సరిచేయగా తయారైన లేఖ అది.

" ఆశ్రమాన్ని గురించిన ఒక ప్రాథమిక అపార్థంతో నీవు కుస్తీ పడుతున్నావేమో అన్పిస్తోంది. ఒక క్రమ పద్ధతిలో సూది గ్రుచ్చబడిన కొన్ని నిర్వహణా నియమ నిబంధనలతో శ్రీఅరవిందునిచే ఒక పథకం ప్రకారం తయారు చేయబడిన సంస్థ కాదు. అతడు అభివ్యక్తంచేసే పరమసత్యం శక్తినుండి ఆ పరమసత్యం పోకడలను మాత్రమే అనుసరించగల దానినుండి తనంతట తానే పెంపొందింది ఆశ్రమం. శ్రీఅరవిందులు మరియు ఆశ్రమం కలిసి ఒకే ఒక్క మొత్తం. ఆయన అస్తిత్వం లేక సత్తా ఆశ్రమమంతటా విస్తరించి కలిసి వుంది. ఆశ్రమపు మొత్తం జీవితాన్ని ప్రోదిచేసి తనలోనికి, ఒక సామరస్యపూర్వక ఆధ్యాత్మిక యేకత్వంలోనికి స్వీకరించింది. దాని జీవితం ఆధ్యాత్మిక జీవితం, దాని వికసనం ఆధ్యాత్మవికసనం. సాధకుల ఒక గుంపు లేక సమూహంగా దానిని చూడడం గాని శ్రీఅరవిందులనుండి విడివడిపోయిన ఒకలక్ష్యం, ఒక మనుగడగాని దానికున్నదని భావించడం పూర్తిగా తప్పు. దాని జీవితం, కదలికలు, కార్యకలాపాలు, ఆంతరంలో నుండి జరిగే దాని సమగ్ర వికాసాన్ని, అభివృద్ధిని తెలియ జేస్తాయి. ఆధ్యాత్మిక వికాసం, శ్రీఅరవిందుని ద్వారా వికాసం, అభివృద్ధి అనే ఒకే ఒక నియమం తప్ప వేరే నియమ నిబంధనలంటూ దానికి లేవు.

Amal Kiran : Our Light and Delight: 8-9

స్వేచ్ఛానువాదం: కె.వి.రావు

దైవానికి తల్లి ఆమె మన అంతరాత్మల మాత ఆమె

ల భారత పత్రిక

మే 2017



బ్రహ్మచర్యము

విషయసూచిక

సంపాదకీయం

ఆధ్యాత్మిక ఆకాంక్షాపరుల నిమిత్తం సిఫార్సు చేయబడిన అభ్యాసాలలో బ్రహ్మచర్య మొకటి. బ్రహ్మచర్యమనే పదం భాషణపై సంయమనాన్ని, ఆలోచనలలో, అనుభూతులలో సత్యశీలతను పాటించుటలో స్వీయనైపుణ్యత ఎంత అవసరమో అంత మేర పద ప్రయోగాన్ని, కార్యాచరణను అదుపులో నుంచే ప్రయత్నం చేయడం కూడా అవసరమనే విషయాన్ని తెలియబరుస్తుంది. దానితో పాటు, ఆశయాలు, ఉద్దేశాలు పవిత్రమైనవిగా నుండాలనే విషయం కూడా జోడించబడింది. ఎంతైనా, అన్నింటిలోను నియంత్రణ పాటించటం దాని సారాంశం. ఇక లైంగిక శక్తుల విషయంలో అది సూచించేది వాటిని అణిచి పెట్టడం లేక నిరాకరించడం కాదు కానీ వాటిని ప్రక్షాళణ చేసి జీవశక్తిగా, వీర్యంగా, మేథాపరమైన దయా దాక్షిణ్యాలుగా పరివర్తన గావించి, చివరిగా ఆధ్యాత్మిక అభ్యాసంయొక్క దివ్యజ్ఞాన మూలకాలుగా రూపొందించడం. ఎందుకనగా ఈ మానవ సహజమైన ప్రవృత్తి దైహిక నిర్మాణ వ్యవస్థలో లోతుగా పాతుకపోయి వున్నది కాబట్టి. ఈ నియంత్రణశక్తి లేకుండా స్థిరంగా కొనసాగే ఆధ్యాత్మిక ప్రగతి సాధ్యపడదు.

పూర్ణయోగంలో స్వీయనైపుణ్యతను సాధించే ప్రాథమిక ప్రక్రియలోని అనేక అంశాల ప్రస్తావన ఈ సంచిక ప్రత్యేకత.

సంపాదకుడు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



మనం స్థిరపరచుకో వలసిన నియమాలు ఏమిటంటే:

1) బ్రహ్మచర్యము, 2) సమత, 3) సత్యము, 4) ప్రశాంతి, 5) ఆత్మసంయమనము. బ్రహ్మచర్యం సమగ్ర లైంగిక నిష్ఠ. ప్రశాంతతో కూడిన సామరస్యమే సమత. అందులో క్రమశిక్షణ, అదుపు కూడా వుండాలి. నిజాయితీ తోనూ, నమ్మకంతోను మనలో స్వభావ సిద్ధంగా వుండ గలిగినదే సత్యము. నిశ్చలత శాంతి వున్న స్థితి — ప్రశాంతత, నిశ్శబ్దము కూడా అలాంటివే. ఇక ఆత్మసంయమనము అంటే మనం అలవాటుగా చేసే చర్యలపై ఉండవలసిన అదుపు.

CWSA 30:32 శ్రీఅరవిందులు

ప్రకృతి సహజ స్పందన

ప్రకృతి సహజమైన పోకడ

ప్రకృతిలో లైంగిక వాంఛ ఒకానొక శక్తి. వ్యక్తి ఇష్టాయిష్టాల మీద ఆధారపడి అది ప్రవర్తించదు. వ్యక్తిని అదుపులోనికి తెచ్చుకొని దాని ఆనందానికి ఆ వ్యక్తిని ఒక భూమికగా మార్చుకుంటుంది. ప్రాణిక శక్తిగా ఉన్నపుడు దానిని నిరోధిస్తే అది భౌతిక శక్తిగా అత్యంత శక్తివంతంగా మనపై దాడి చేస్తుంది. ప్రాణిక భౌతికం నుండి, కేవలం భౌతికం నుండి, దాన్ని పారద్రోల గలిగితే దానిపై విజయం సాధించినట్లే.

లైంగిక సంతృప్తి నిరపేక్షమైనది. కాని తన అనుభవం కోసం ఇతరులను ఆధారభూతం చేసుకుంటుంది, లేదా తన మాధ్యమంగా చేసుకుంటుంది. దాన్ని బయటనుండి ఎదుర్కొన లేము. అంతర్గతంగాను, పైనుండి వచ్చే పవిత్రతతో, ప్రశాంతతో దానిని జయించాల్సిందే.

CWSA 31:487

ప్రకృతిలో లైంగిక వాంఛ యొక్క పాత్ర

సృష్టి కార్యాన్ని ప్రోత్సహించటానికే ప్రకృతి ఈ వాంఛను జీవులలో కల్పించింది. జంతువులలో లైంగిక వాంఛ సంతానోత్పత్తికే పరిమిత మౌతుంది. తరువాత వాటికి ఆ ధ్యాసే వుండదు. మానవులలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నది. సంతానం చాలు అనుకున్నా, ఈ వాంఛ కొనసాగుతూనే వుంది. ఇది ప్రకృతి నియమానికి విరుద్ధం. మానవుని తాత్కాలిక ఆనందం కోసం ప్రకృతి లైంగిక వాంఛను సృష్టించ లేదు.

నియమబద్ధమైన యోగజీవితం కావాలనుకునే వారు చాలా అరుదు. కాని సంతతిని పెంచుకునే వారు మాత్రం ఎందరో ఉంటారు. యోగికి మానవ ప్రకృతిపై ఏ ద్వేష భావమూ ఉండదు. దాని ప్రయోజనంపై, స్థానంపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. కాని, దేన్ని, ఎంత అదుపులో ఉంచాలో ఆయనకు తెలుసు; ఆయనకు కోరికలపై అదుపు కూడా ఉంటుంది. ఊర్ధ్వచేతన అతనిని నడిపించటం వలన తనపై తనకు నియంత్రణ ఉంటుంది. అవసరాన్ని బట్టి దైవ ప్రేరణవలన యోగి కూడా కొన్ని బాధ్యతలు నెరవేర్చవలసి యుంటుంది. అది యుద్ధమైనా

కావచ్చు; వినాశమైనా కావచ్చు. ఇలాంటి చిన్న చిన్న సంఘటనల వలన యోగులు కూడా సాధారణ మానవ ప్రకృతికి వశు లగుటకు దానిని ఒక సాకుగా మార్చవచ్చు.

CWSA 31:485-86 శ్రీఅరవిందులు

ప్రాణిక శక్తిని లోగొనే ఇంద్రియాతీత వ్యవస్థ

ఈ జుగుప్సాకరమైన లైంగిక వాంఛల నుండి అనేక అనవసరమైన చేష్టలు పుట్టుకు వస్తాయి. ఈ కోరికలు మరణంతో కూడా అంతం కాకపోతే, అవి అలాగే మిగిలి యుండి సున్నిత మనస్కుల మనోవాతావరణంలో ప్రవేశించి వారిని ఎగ దోస్తాయి. లైంగిక కార్యంలో జనించే ప్రాణిక శక్తిని హరించి, వీలైనంత వరకు తమ బలాన్ని పెంచుకుంటాయి. నేను అట్లా ఈ విషవలయంలో చిక్కుకున్న వారిని డజన్ల కొద్దీ చూచాను. అది ముమ్మాటికీ నిజం!

CWM 4:192 శ్రీమాత

రతిక్రియ — ఆనందం

కామ కేళిలో ఆనందం ఉండదు. అది క్షణకాలపు పులకరింత మాత్రమే. వయసుతో పాటు అది కూడా క్షీణిస్తుంది.

*

ఈ కామ కేంద్రాన్ని, దాని ప్రతిచర్యలను మరొక రూపం లోనికి మార్చవచ్చు. పై స్థాయిలో వుండే ఆనందాన్ని ఆవిష్కరించి, ఈ పశు ప్రవృత్తి స్థానంలో దాన్ని ప్రతిష్ఠించ వచ్చు. కామ సంబంధమైన స్పందనలు 'దివ్యానందానికి' భ్రష్ట రూపాలుగా భావించాలి. భౌతిక చేతన పరిణామం చెందకుండా 'దివ్యానందాన్ని' ఆహ్వానించటం కూడా ప్రమాదకరమే. ఎందుకంటే నిమ్న ప్రకృతి ఈ అవకాశాన్ని చూచుకొని అధోచేతనలో లీనమై అసలు ఉనికి మొత్తానికే ప్రమాదకారిగా మారవచ్చు. దీని వలన అసలు గమ్యం మారిపోయి అధోచేతన లోని ఆనందాన్ని పొందటమే అసలైన సాధనగా మారే ప్రమాదం వుంటుంది. అంతా తల్లక్రిందై క్రింద నున్న శక్తులు పై స్థానాన్ని ఆక్రమింప జూస్తాయి. అసలైన ఆనందం పోయి, లైంగిక ఆనందమే ఆ స్థానం ఆక్రమిస్తుంది.

*

"లైంగికానందము, బ్రహ్మానందము సోదరుల వంటివి" అన్న భావనలో ఉన్న అసలు వాస్తవం ఏమిటంటే ఏ ఆనందమైనా బ్రహ్మానంద మూలాలలో నుండి పుట్టేదే అని నమ్మటం. దీని వలన లలిత కళలు గాని, యుద్ధంలో వచ్చే ఆనందం గాని, వస్తూత్పత్తి వలన కలిగే ఆనందం కాని సాహసకృత్యాల వలన జనించే ఆనందం కాని బ్రహ్మానందానికి సోదరులే కావాలి! కాని ఇది సరియైన నిర్వచనం కాదు.

బ్రహ్మానందం వలన జనించిన భౌతిక ఆనందం ఒకటి ఉందని, అది లైంగికానందం కంటే ఉన్నతమైనదీ, ఉత్తమమైనదీ, తీవ్రతరమైనదనీ చెప్పవచ్చు. లైంగిక ఆనందం మాత్రం అట్టి ఉన్నతమైన ఆనందంయొక్క "మొరటుగా నున్న ఉద్రేక భూయిష్టమైన భ్రష్టత్వం" అని కచ్చితంగా చెప్పవచ్చు.

CWSA 31:488-89

లైంగికానుభవము — దివ్యప్రేమ

ప్రేమను లైంగికానుభవంతో ముడి పెట్టకుండా చూడటం అసంభవమేమీ కాదు. కాని అవి మానవజాతిలో అనాది నుండి విడదీయరానివిగా ఉంటూ వచ్చాయి. ఇప్పుడు వాటిని వేరుగా చూడటం సాధ్యం కాదు. మానసికమైన ప్రేమకు లైంగిక వాంఛతో పని లేదు. కాని ప్రాణిక స్థాయిలో అనురాగం, భౌతికమైన కామోద్రేకం విడి విడిగా ఉండవు. సమయం, సందర్భం వస్తే ఒకదానిని మరొకటి జాగృతం చేస్తుంది. వయసులో నున్న వారి విషయంలో ఉన్నట్లే, ఇది ఇతరులలోనూ ఉండ వచ్చు. మానసిక శక్తులను ధృఢపరచుకొనటమే దీనికి సరియైన నివారణ. దానితో పాటు లైంగికోద్రేకాన్ని అదుపులో ఉంచుకొని 'ఓజో' శక్తిని పెంచుకోవడం, దైవం దిశగా ప్రేమను అభివృద్ధి చేసుకోవడం కూడా జరగాలి. వృధా కాకుండా వీర్యాన్ని కాపడగలిగితే అది 'ఓజో' శక్తిగా మారగలదు.

*

మానసిక శక్తినీ, ప్రాణిక శక్తులను అదుపులో ఉంచాలంటే ప్రాణికం వలన మానసికం గురి కాకుండా జాగ్రత్త పడాలి. వ్యామోహం వేరు, ప్రేమ వేరు. వ్యామోహం ప్రేమ యొక్క భ్రష్ట రూపము. ఇది ప్రేమ సామ్రాజ్యాన్ని అస్థిరం చేస్తుంది.

మానసికమైన ప్రేమ హృదయ కమలంలో వికసించగనే, దాని పరిధిలో వ్యామో హమును కాని, ప్రాణిక వాంఛలను కాని ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి. పైన

ఉన్న చేతన యొక్క సహకారం పొందాలంటే క్రింది స్థాయిలో ఉన్న గర్వాన్నీ, దురాశలనూ దూరం చేసుకోవాలి గదా! ఇవి ఏ రూపంలో మనలో ప్రవేశించినా మానసిక — ఆధ్యాత్మికం చెడిపోయి ఆశయం నెరవేరకుండా చేస్తాయి.

CWSA 31:490-91

వివిధ స్థాయిల్లో ప్రేమ

స్త్రీలలో కన్యాత్వాన్ని కాపాడుకోవాలనే కోరిక సహజమైనదే. ఇది సర్వసాధారణ మైనది. ఉన్నత స్థాయి స్త్రీలలో ఇది బలంగా ఉంటుంది.

ఇంద్రియ సంవేదనలకు, ఆలోచనలకు మనసే ఆధారం. ప్రేమ, ప్రాణిక వాంఛ లకు మాత్రం హృదయం ఆధారభూతంగా వుంటుంది. ఇది మానసిక ప్రేమను ఎలా నియంత్రించ గలదు? ఇదొక సందేహం. మనసుపై హృదయనికి ఎంత ప్రభావం ఉంటుందో అంత ప్రభావంతోనే మనసు హృదయంపై ఆధిపత్యం చెలాయించ గలదు.

ప్రేమ రెండు రకాలు: భౌతిక ప్రేమ, ప్రాణిక ప్రేమ. ప్రాణిక ప్రేమ స్త్రీ సాంగత్యం కోరుతుంది. ప్రేమ లేని చోట కూడా ఇది ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. ఒక విధంగా ఇది పురుషాధిక్యతను నిరూపించుకునే స్వభావం, లేదా స్త్రీపై ఆధిపత్యం చెలాయించటం కూడా కావచ్చు. పురుషుని ప్రాణిక శక్తి, స్త్రీ ప్రాణిక శక్తిపై విజయం సాధిస్తే, అతని స్వాతిశయం తృప్తి పడుతుంది. వేట గాడు జింకను వేటాడి తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటాడు. అట్లాంటి లక్షణం ఇది. ఇదే ప్రేమగా చెలామణి ఔతున్నది. కాని అది వ్యామోహమే.

ఒక ప్రాణిక వాంఛ, ఏది ఏమైనా, హృదయంలోని ప్రేమోద్రేకం జాగృత మవకపోతే అది ప్రాణికమైన ప్రేమే అవుతుంది. ఎన్ని ఉద్దేశాలు అందులో వున్నా అది కేవలం ప్రాణిక ప్రేమయే.

మరొక విధమైన ప్రేమ దేహసంబంధమైనదిగా ఉంటుంది. ఇలాంటిదే సౌందర్యం వలన ఆకర్షింప బడటం, కామోద్రేకాన్ని తీర్చుకోవటం మొదలైన లక్షణాలున్న ప్రేమ. ఇది హృదయావేశాన్ని శాంతిప జేసే ప్రేమ అని చెప్పవచ్చు. అట్లా హృదయ సంబంధం కూడ లేకపోతే, 'ప్రేమ' కేవలం 'కామం' మాత్రమే అవుతుంది. ఇలా జరుగుతూనే వుంటాయి.

ఇదే విధంగా మానసికమైన ప్రేమ కూడా మరొకటి వుంటుంది. అది భావాలు నచ్చటం వలన ఏర్పడుతుంది. మనకు నచ్చిన ఆదర్శాలు మరొకరికి కూడా నచ్చితే వారిపై మనకు ప్రేమ కలుగుతుంది. మెచ్చుకో దగిన భావాలు కాని, అద్భుతమైన నైపుణ్యం ఉన్నవారిపై కూడా మనకు ప్రేమ జనిస్తుంది. అట్లా భావ సారూప్యం కల వారంతా మిత్రులౌతారు. ఇదీ ప్రేమ వలననే ఏర్పడుతుంది. అదే విధంగా మన మార్గదర్శకులూ, నాయకత్వ లక్షణాలున్నవారూ, సద్గుణాలు ఉన్నవారు కూడా మన ప్రేమకు పాత్రులౌతారు. ఇట్లాంటి అనుబంధాన్ని ప్రేమగా వర్ణించలేక పోయినా అది ప్రేమ వంటిదే. కొన్ని సందర్భాలలో అట్టి అనుబంధం త్యాగానికి కూడ సిద్ధపడుతుంది. హృదయాన్ని తట్టి లేపే భావ సారూప్యం ఏదైనా అది 'మానసిక ప్రేమ' అనవచ్చు. ఇట్టి సందర్భాలలో మానసికము, ప్రాణికము ఒకటిగా పని చేస్తాయి. ఈ ప్రేమకు శారీరకమైన కోరికలతో సంబంధం ఉండదు. పురుషుల బలవంతం వలన స్త్రీలు లొంగవచ్చేమో కాని, అట్టి సందర్భాలలో వారి మనోభావాలు దెబ్బ తింటాయి.. ప్రేమ అన్ని చోట్లా కామప్రకోపమే అనుకోవటం మూర్ఖత్వం.

CWSA 31;492-93

తామసిక మాంద్యము, లైంగిక స్పందన

తమోగుణ ప్రధానమైన ఏ మాంద్యమైనా లైంగిక వాంఛను ప్రేరేపిస్తుంది.

*

వేరే ఏ పనీ లేకపోతే కామవాంఛ అధికం అవుతుంది.

*

శారీరకమైన, లేక మానసికమైన మాంద్యం ఏదైనా కామోద్రేకాన్ని రెచ్చగొట్ట గలదు. నా ఉద్దేశం ఏమిటంటే నీ అధోచేతన వలననే నీవు ఈ విధంగా ప్రవర్తిస్తావు. శారీరకమైన ప్రాణిక శక్తుల అధోచేతన కొంత వరకు దీనికి కారణం. నీలో ఇతరమైన ప్రేరణలు ఉండవచ్చు కాని, లైంగిక వాంఛ తీర్చుకోటానికి తగిన అవకాశం వస్తే మిగతా భావాలన్నీ కనుమరుగై బలహీన పడతాయి. అందువలన కామోద్రేకం నిన్ను వశం చేసుకొని నీ పై ప్రభావం చూపుతుంది.

ఈ చర్య ప్రాణికశక్తులకు ఊతం ఇవ్వటమే కాకుండా వాటిని ధృవపరుస్తుంది

కూడా. భౌతిక ప్రాణికానికి తగినంత పని లేకుండా బద్ధకంలో కూరుకుపోయినా, బలహీన పడినా లైంగిగవాంఛ పొడ చూపుతుంది.

పడకపై మగత నిద్రలో ఉన్నపుడు దానికి భౌతిక ప్రాణికం కూడా తోడైతే లైంగికవాంఛ అధికం అవుతుంది. విశ్రాంతి వలన కలిగే అచేతన కూడా దీనికి సహ కరిస్తుంది.

CWSA 21:522

మనో కల్పనలు

లైంగికానుభవాలను మనసులోనికి రానివ్వటం అంత మంచిది కాదు. అది కష్టాలను కోరి తెచ్చుకోవటమే అవుతుంది. ఒక వేళ ఈ లైంగిక స్పందనలను వది లించుకోవటం కష్టతరమైతే అంతర్గత ఆధ్యాత్మికత లేకుండా జీవించటం ఇంకా కష్టం.

లైంగిక వాంఛ ఒక విధంగా వదిలించుకోలేని కష్టమే! ఎందుకంటె అది పట్టువదలని బేతాళుని వలె మళ్ళీ, మళ్ళీ వస్తూనే వుంటుంది. దీనికి ఉన్న ఒకే ఒక నివారణ ఏమిటంటే సాధకుడు మరింత పట్టుదలతో దాన్ని త్రిప్పికొట్టాలి. ఇంతకు మించిన మార్గం మరొకటి లేదు.

ఇంకొక విషయం: స్త్రీలతో ఏ సంబంధమూ పెట్టుకొనక పోయినా ఈ వాంఛ ఆగిపోదు. అది కలలలోనో, ఊహలలోనో మరో విధంగానో ప్రత్యక్షం అవుతుంది. కల జాగ్రతావస్థలో నున్న మనస్సును ప్రభావితం చేయకపోతే అంత ప్రమాదకారి కాదు. అసలు దాని ఉద్దేశం అది కానేరదు. వాటిని క్రమంగా నిరుత్సాహపరచ వచ్చు. వద్దనుకుంటే క్రమేణా అవి కనుమరుగౌతాయి.

ఇక ఊహల విషయానికి వస్తే, వాటిని మానసిక వ్రతదీక్ష లాంటి తపస్సు ద్వారా మధ్యలోనే భంగపరచటంతోనే సాధ్యపడుతుంది. అదుపు చేయగా, చేయగా, ఆలోచనలు వెనుదిరిగి పోతాయి. నిద్ర మేల్కొన్న తరువాత ప్రక్క మీదనే వుంటే అది తమోగుణ స్థితి అవుతుంది. ఆ స్థితి వాటి రాకకు దోహద పడుతుంది. దాని నుండి బయట పడాలి; లేదా మనసు నుండి వాటిని ఖాళీ చేయించి లేక తామసిక స్థితిని వదిలించుకొని మరి కొంచెం సేపు నిద్రిస్తే అట్లాంటి ఆలోచనలు ఆగిపోతాయి. ఇంకొక విషయంపై మనసును మళ్ళించినా వాటిని (ఆలోచనలను) నివారించవచ్చు.

స్మృతి పథంలోనో లేక ఊహలలోనో లైంగిక వాంఛ సాధనకైనా, యోగ చేతన కైనా ప్రతిబంధకమే. అట్టి జ్ఞాపకాలను, ఊహలను నిరుత్సాహ పరచాలి.

CWSA 31:522,23

*

లైంగిక సంబంధ స్వప్నాలు, స్ఖలనము

అధిక శాతం అవివాహితులలో ఇట్లాంటి కలలు రావటం, వాటి వలన వీర్య స్ఖలనం జరగటం సహజమే. అవి అంత ప్రమాదకారి కాకపోయినా తరచుగా సంభవిస్తే ప్రాణిక శక్తి బలహీన పడుతుంది. వాటిని తప్పక ఆపవలసిందే. కాని ఇట్లాంటి విషయాల్లో అతిగా వేదన పడటం అంత మంచిది కాదు. వాటిని ఆపడానికి కనీసం జాగ్రతావస్థలో అట్లాంటి ఆలోచనలు రాకుండా మీరు ముందుగా జాగ్రత్త పడాలి. అందులో సఫలీకృతుడ వైనప్పటికీ నిద్రలో వాటి మీద మన అదుపు ఏమీ ఉండదు. కాబట్టి అవి పునరావృత మవుతాయి. అంతఃచేతన పాత అలవాట్లను పోగొట్టుకోలేదు. వాటిని నిరోధించాలంటే బలమైన సంకల్పమే సరియైన మార్గం. అదే విధంగా నిద్రకు ఉపక్రమించే ముందు కూడా లైంగిక భావాల కేంద్ర స్థానాన్ని ప్రయత్న పూర్వకంగా అణచి వేయాలి. క్రమంగా ఈ విధానం సత్ఫలితాలను ఇస్తుంది.

నిద్రలో వచ్చే స్ఖలనాలను తగ్గించాలన్నా, ఆపాలన్నా బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించాలి. ఈ పని త్రికరణ శుద్ధిగా జరగాలి. శారీరకమైన స్పందనల నుండి మాత్రమే గాక, ప్రాణిక, దైహిక చేతనల నుండి, ఊహల నుండి, మాటల నుండి కూడా అట్టి విషయాలను దూరంగా వుంచాలి. వాటిని (లైంగిక విషయాలను) ప్రస్తావించనే కూడదు. ఈ కలలూ, ఆలోచనలూ అంతః చేతన నుండి పుట్టుకు వస్తాయి. అక్కడ దాగి యుండి, అవి కలల రూపంలో పెల్లుబికి బయటకు వస్తాయి. జాగృతావస్థలో మనసును పరిశుద్ధిగా వుంచుకొని, దానితో పాటు అంతఃచేతన పైన కూడా అదుపు సాధించ గలిగితే, ముఖ్యంగా నిద్ర కుపక్రమించే పూర్వం, ఈ కోరికలూ, స్ఖలనాలు వాటంతట అవే అణగారి పోతాయి.

CWSA 31:526-27

అవచేతనలోని అభిప్రాయాలు

నవలలు చదివేవారు ఇలాంటి లైంగిక ప్రవృత్తికి చెందిన విషయాలను చదివితే అవి అంతర్గత మనసులో ప్రవేశించి దానిపై చెరగని ముద్ర వేస్తాయి. మన బహిశ్చేత నలో కామ సంబంధ కోరికలు పొడ చూపగానే దాగియున్న అంతఃచేతన పెల్లుబికి మనసుపై ప్రభావం చూపుతుంది.

*

ఆ విధంగా అవచేతనలో వేర్లు పాతుకుపోయిన ఈ లైంగికతను వదలించు కోవటం అంత సులభం కాదు. భౌతిక చేతన పూర్తిగా రూపాంతరం చెందితేనే దాన్ని సాధించవచ్చు. అందరిలో ఇది సాధ్యం కాకపోవచ్చు.

CWSA 31:521

స్త్రీలలో లైంగిక సమస్యలు

ఈ విషయంలో ఇదమిద్ధంగా ఏమీ చెప్పలేము. అందరికీ సరిపడే నియమాలు ఏమీ లేవు. ఒక విధంగా ఈ వాంఛ పురుషులలో వలెనే ఉంటుంది. స్త్రీలలో కొద్దో గొప్పో ఎక్కువే. చాలా మంది స్త్రీలు లైంగికానుభవానికి విముఖంగా ఉంటారు. ఇట్లా వుండేవారు పురుషులలో తక్కువే. లక్షలో ఒకడు "సుఖదేవుడు" ఉంటాడు. స్త్రీలలో అయితే "డయానా" వంటివారిని "పల్లాస్ ఎథీనే" వంటి వారిని అనేక మందిని (గ్రీకుదేవతలు) చూస్తాము.

కన్యాత్వము స్త్రీ కి చెందిన ఆదర్శము. పురుషులు ఈ రకమైన ఆదర్శాన్ని అభిలషించరు. పురుషుల బలవంతం లేకపోతే స్త్రీలు లైంగింక వాంఛను సహజంగా కోరరు. పురుషులలో ఈ విముఖత అరుదు. మరో కోణంలో పరిశీలిస్తే, స్త్రీలకు భౌతికమైన లైంగిక వాంఛ తక్కువ అనే చెప్పవచ్చు. కాని ప్రాణికమైన లైంగికవాంఛ సంగతి ఏమిటి? ఇది నాది. నేను ఒకరికి చెందుతాను అనే భావన స్త్రీలకు సహజంగా వుంటుంది.

సృష్టిలో ఒక నిగూఢ రహస్యం వుంది. అట్లాంటిదే పురుషుణ్ణి ఆకర్షించాలని స్త్రీ వాంఛించటం. ఇది ప్రాణిక ప్రోద్బలం వలను సంభవిస్తుంది. నేను ఇంకా బాగా వివరించలేను. స్త్రీలలో కామ సంబంధ వాంఛ కంటె ఇది బలమైనది. ఇలాంటి

కోరిక తమలో అంతర్గతంగా వుందని వారికి కూడా తెలియదు. ఇది సహజాత సంబంధిత స్పందన. అది అంతః చేతనలో వుంటుంది. కామవాంఛ వారి ఉద్దేశ్యం కాకపోయినా, అప్రయత్నంగా ఈ ప్రాణిక అవసరం వారిలో పొడచూపుతుంది. బలమైన ప్రాణిక వైఖరిగల స్త్రీలలో ఇది అధికంగా కనిపిస్తుంది. కొందరిలో కొంచెం ఎక్కువగాను, కొందరిలో కొంచెం తక్కువగాను ఉండచ్చు.

CWSA 31:534-35

లైంగిక స్పందనల ప్రారంభదశ:

చిరునవ్వుగాని, హావ భావ ప్రకటన గాని స్త్రీలలో ఈ కోరికకు ప్రారంభం అని చెప్పవచ్చు. చిరునవ్వే లైంగిక వాంఛకు సంకేతం కాకపోవచ్చు. కాని ఇలాంటి చేష్టలు పురుషులలో కామ ప్రకోపాన్ని రెచ్చగొడతాయి. ఈ హావ, భావాలు, స్త్రీ తనకు తెలియకుండానే చేస్తుంది. పురుషులను వశం చేసుకోవాలని గాని, సంతోషపెట్టాలని గాని ఉండకపోవచ్చు. ఆమె హావభావాలు కేవలం సహజాతానికి చెందిన స్పందన. పురుషులలో మాత్రం అటువంటి సంకేతాలకు ఆకర్షితుడయ్యే లక్షణం వుంటుంది. స్త్రీ ఆ విధంగా పురుషుని ఆకర్షిస్తుంది. మొదట్లో ఇలాంటివి యాంత్రికంగానే ప్రారంభం అవుతాయి. ఇది నేను ఇది వరకే సూచించాను. భౌతిక స్పందనలు, లేక హావభావాలు క్రమంగా ప్రతిఫలం ఇస్తాయి. కొంతకాలం తరువాత అవి వాటంతట అవే కనుమరుగౌతాయి.

*

స్త్రీల వస్త్రధారణ కూడా కామ వాంఛతో ముడిబడి ఉన్నదే. ఆ విధంగా వారు పురుషులను సహజంగానే ఆకర్షిస్తారు. పురుషులు కూడా వస్త్రధారణ మూలంగా స్త్రీలను ఆకర్షించే అవకాశం వుంది. ముఖ్యంగా సైనికుల దుస్తుల విషయంలో.

వస్త్రధారణకూ, అభిరుచులకు సంబంధం వుంది. కొన్ని రంగుల చీరలు చూపరులను బాగా ఆకర్షిస్తాయి అనేది నిజం. ఈ ఆకర్షణ కేవలం జ్ఞానేంద్రియాలకు, ప్రాణికానికి మాత్రమే పరిమితము. మనో నేత్రం మాత్రం వ్యక్తిలో మానసిక లోపాలను కూడా చూచి ఇంద్రియాల స్పందనలను నియంత్రణ చేయగలదు. కాని, భౌతిక ప్రేరణలే బలమైనవి.

ఇక స్త్రీలు చూపే ప్రేమాభిమానాలు వారి లైంగిక వాంఛను కప్పిపుచ్చే

బాహ్య ప్రయత్నాలే. ఇది వారి యుక్తి మాత్రమే. ఒక్కొక్కసారి తెలిసే వారు వీటికి వశులౌతారు. కొన్ని సార్లు భ్రమకు గురియై ఇలా చేస్తారు. అప్పుడప్పుడు ఈ ఆకర్షణలను నిజమని భ్రమించి ప్రాణిక స్పందనలకు లొంగిపోతారు కూడా! ఎట్లాగైతేనేం, ఏ విధంగా ఇట్లాంటివి సంభవించినా వీటి అంతిమ రూపం ఒకటే. సాధకులు కూడా ప్రాణికం వలన కలిగే భ్రమ, ప్రమాదాలకు అతీతులు కాదు. ఎన్ని ఆధ్యాత్మిక కారణాలు చూపి వారిని వారు సమర్థించుకున్నా బలహీనతల మూలంగా వారంతా దారి తప్పినట్లే!

*

ఇక స్పర్శ వలన కలిగే లైంగికానుభవం మాత్రం భౌతిక, ప్రాణిక స్థాయిదే. అందు వలననే కామ సంతృప్తికి స్పర్శ అంత అవసరం అవుతున్నది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో కుమారుడు — తల్లిగాని, సోదరుడు — సోదరిగాని గాఢాలింగనం చేసుకుంటే కామ సంబంధ ఆలోచనలు తల ఎత్తనే ఎత్తవు కదా! ఇట్టి సందర్భాలలో భావోద్రేకం భౌతికంగా మాత్రమే ప్రకటన ఔతున్నది. ఇది అలవాటుగా జరుగుతున్నది కాబట్టి ఎంత బలంగా వున్నా, దీనిని అదుపులో పెట్టుకోవచ్చు.

వివాహంపట్ల విముఖత — 'సెలిబసి'

ఈ పదం అవివాహితులకు వర్తిస్తుంది. "స్త్రీలతో లైంగిక సంబంధం లేక పోవటం" అని కూడా అర్థం చెప్పవచ్చు. కాని కేవలం ఇదే దాని అర్థం కాదు. వివాహం చేసుకోకుండా వుంటటం వేరు; బ్రహ్మచర్యం వేరు. బ్రహ్మచర్యము భక్తి మార్గంలో గాని , కర్మయోగంలో గాని ఆవశ్యక నియమం కాదు. కాని జ్ఞాన, హఠ, రాజ యోగులకు ఇది చాల అవసరము. గృహస్థ ధర్మంలో దీనిని అనుసరిం చాల్సిన పనిలేదు. ఈ యోగంలో లైంగిక వాంఛను అదిగమించటం తప్పనిసరి. అప్పుడే అధో స్థానంలో వున్న ప్రాణికం, భౌతికం రూపాంతరం చెంది ఊర్ధ్వ ముఖంగా ఎదుగుతాయి. శారీరకమైన కామ సంబంధాలు ఆగిపోవాలి. అలా జరుగకపోతే తీవ్ర ప్రమాదాలకు గురి కావలసి వస్తుంది.

లైంగికోద్రేకాన్ని కూడా తప్పక జయించాల్సిందే కాని పూర్తిగా జయిస్తేగాని సాధన కొనసాగదని లేక అనుభవం సిద్ధించదని భావించ కూడదు. దానిపై విజయం

సాధిస్తే మాత్రం గమ్యం చేరటం సులభతర మౌతుంది. ఈ మార్గంలో కామోద్రేకం తీవ్రమైన అవరోధం. అందులో ఆనందాన్ని కాంక్షించటం వీలయినంత చెరుపు చేస్తుంది.

అవివాహితుడుగా వుండటం వేరు, లైంగిక వాంఛనుండి విముక్తుడుగా వుండటం వేరు. వీటిని జయించి, వదిలించు కోవటమే సరియైన మార్గము, కాని వీటి నుండి విముక్తి పొందటమే యోగ మార్గానికి సరియైన పరీక్ష అని ఒప్పుకుంటే ఎందరు ఈ యోగమార్గానికి అర్హత సాధించగలరో నాకే తెలియదు.

అవరోధాన్ని జయించాలనే సంకల్పం ఉండాల్సిందే. కాని లైంగికోద్రేకాన్ని పారద్రోలడం మానవ స్వభావానికి చాల కష్టమైన పని. కాని కాలక్రమేణా అది కూడా సాధ్యపడుతుందని ఆశించటం సహజమే గదా!

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్ . ఎల్. నరసింహారావు

స్త్రీ, పురుషులు

వివాహము

సంపూర్ణ ఆధ్యాత్మిక జీవితం గడుపుటకు సంసిద్ధమయ్యేందుకు ముందుగా జీవుడు తన సాధారణ జీవన శైలిని పరిత్యజించుట ఉపయుక్తం కాదు. ఆ విధంగా చేసినట్లయితే, వివిధ ప్రకృతి శక్తులమధ్య అనాలోచితంగా ఒక పెనుగులాటను సృష్టించి దానిని ప్రకృతి భరించలేనంతటి తీవ్రస్థాయికి రెచ్చగొట్టినట్లుగా ఉంటుంది. నీలోని ప్రధానమైన ప్రకృతి శక్తులను పాక్షికంగా నీ జీవితానుభవాలతో, వర్తనా నియమావళితో అనుసంధించాలి. అదే సమయాన, ఆధ్యాత్మిక లక్ష్యాన్ని దృష్టిలో నిలుపుకొని అది కర్మయోగ స్ఫూర్తితో నీ జీవితాన్ని ప్రగతి పథంలో నడుపునట్లుగా ప్రయత్నించాలి.

ఈ కారణంగానే నీ వివాహానికి మా అనుమతి నిచ్చాము.

*

ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టాలనుకొనే వారికి వివాహ మాడటం ఉచితం కాదని మా అభిప్రాయం. మామూలుగా వివాహమంటే ఎంతో ఇబ్బంది పడవలసి

వుంటుంది, అధిక భారం మోయవలసి వుంటుంది. ఏకాగ్రతతో ఆచరించవలసిన ఆధ్యాత్మిక సాధనలో ఎనలేని కష్టాలు ఎదుర్కొనవలసి వుంటుంది. అది ప్రయోజన కారి ఎప్పుడవుతుందంటే, లైంగిక ధోరణిని అదుపులో నుంచడం అసాధ్యమయి నప్పుడు, దానిని నియంత్రణతో పరిమితంగా తృప్తి పరచే ప్రయత్నం చేసి నప్పుడు.వివాహం మనస్సును అదుపులో నుంచుటకు ఏ విధంగా తోడ్పడ గలదో నాకు తెలియదు. నిలకడలేని మనసుకు ప్రశాంతత అంతర్గతంగానే అందాలి.

*

ఒకసారి నీవు దైవం దిశగా మరలి నప్పుడు, ఏ విధమైన నిరాశా నిస్పృహలకు లోను కాకూడదు. ఎన్ని కష్టాలు, ఆటంకాలు, సంభవించినా, నీవు దైవంపై నమ్మకం కలిగి వున్నందున దైవమే నిన్ను వాటినుండి భద్రంగా కాపాడుతాడు అనే దృఢవిశ్వాసం నీలో నిలుపుకోవాలి.నీవు నీ జాబులో సంధించిన ప్రశ్నలకు ఇక సమాధాన మిస్తాను.

1. ఆధ్యాత్మిక పథంలో పయనించాలని నీవు తీర్మానించుకుంటే వివాహము, కుటుంబ జీవనము అడ్డుతగిలే అవకాశముంది. ఒక వేళ కామోద్రేకం తీవ్రతరమై, దానిని నిగ్రహించ కలిగి, మితమైన సంతృప్తిని పొందుతూ కొంత కాలం గడిపి, ఆ సమయంలో కామోద్రేకాన్ని నెమ్మదిగా సంకల్ప బలంతో వశం గావించుకుంటే తప్ప దానిని నిరోధించ లేకపోతే అప్పుడు వివాహమాడుట ఉచితంగా నుంటుంది. కానీ నీపై దాని పట్టు సడలుతున్నదని అంటున్నావు కాబట్టి ఆ ప్రయాస ఆవశ్యక మనిపించదు.

2. ఇక సర్వసంగ పరిత్యాగం గావించి బయట పడటమనేది కేవలం ఒక స్పష్టమైన, స్థిరమైన నిర్ణయం నీలో ఏర్పడినప్పుడు మాత్రమే చేయాలి. ఒక ఆకస్మిక ప్రేరణ కలగడంతో పరిత్యజించాలనుకుంటే పాతస్మృతుల అనుభూతులు నిన్ను వెంటాడి సాధనలో తీవ్ర అలజడిని రేపే అవకాశం కలిగించి నట్లవుతుంది. ఇతరవిషయాలన్నీ నీ నుండి విడిపోయి లేక తృంచి వేయబడినప్పుడు అది చేయవచ్చు. నీ ఆకాంక్షను కొనసాగించు, నీ ప్రాణికంలో దృఢవిశ్వాసం ఏర్పడే వరకు పట్టు వదలకు, మరింత ప్రశాంతంగా నుండు. అది సంభవించి తీరుతుంది.

CWSA 31:543- 44 — శ్రీఅరవిందులు

స్త్రీపురుషుల మధ్య అపార్థం నివారించుట

ఏది ఏమైనా, వివాదాస్పదం కానటువంటి విషయం ఒకటుంది. పురుషుడు తాను అధికుడు ననుకొని అధికారం చలాయించా లనుకొంటాడు. స్త్రీ అణచివేయబడు తున్నా ననుకొని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తిరుగ బడుతుంది. స్త్రీ పురుషుల మధ్య ఈ శాశ్వత కలహం తరతరాలుగా కొనసాగుతున్నది. దీనిలో సారాంశం ఒకటే అయినా అది రక రకాలుగా, రంగులు రంగులుగా వ్యక్త పడుతుంది.

ఏ విధంగానైతే స్త్రీ తప్పునంతా పురుషునిపై మోపుతుందో, పురుషుడు కూడా తప్పునంతా స్త్రీ పైనే మోపుతాడు. వాస్తవానికి, తప్పు చేయటంలో బాధ్యత ఇద్దరిదీ సమానమే. ఎవరూ మరొకరి కన్నా ఉత్తములమని గొప్పలకు పోకూడదు. అదీ గాక, ఈ ఎక్కువ తక్కువ లనే భావన పోనంత వరకు మానవ జాతులను రెండు పరస్పర ప్రతికూల వర్గాలుగా విడదీసే అపార్థాన్ని అంతం చేయడం దేనికీ సాధ్యపడదు, ఎవరూ చేయలేరు, సమస్య పరిష్కరించబడదు....

ఎందుకనగా, పరస్పర సంబంధాలలో ఇరు వర్గాలు ఒకేసారి నిరంకుశ నియంతలుగా లేక ఒకరికొకరు దీనమైన బానిసలుగా ప్రవర్తిస్తారు.

అవును, బానిసలే; ఎందుకనగా ఎవరైనా కోరికలు, మమతానురాగాలు కలిగి వున్నంత వరకు వారు వాటికి బానిసలుగా వుండ వలసిందే. వారు తమ సంతృప్తికై ఏ మనుషులపై ఆధారపడి వుంటారో వారికి బానిసలుగా వుండవలసిందే.

ఆ విధంగా స్త్రీ తనకు పురుషునిపైన, ఆతని బలంపైన గల ఆకర్షణతో, తనకో ఇల్లు వుండాలని, తద్వారా భద్రత పొందాలనే కోరికతో, చివరిగా మాతృత్వం పై గల మమకారంతో పురుషునికి దాస్యం చేస్తుంది. పురుషుడు కూడా స్త్రీ తనకు స్వాధీనపడి వుండాలనే ఆకాంక్షతో, ఆధిపత్యం నెరపాలని, అధికారం చలాయించాలనే గాఢ కోరికతో, లైంగిక సంబంధాలపైగల మక్కువతో, వైవాహిక జీవితంయొక్క అల్ప సుఖాలను, సౌకర్యాలను అనుభవించాలనే వాంఛతో, స్త్రీకి దాసుడవుతాడు.

అందువలన ఏ చట్టమైనా స్త్రీకి విమోచన కలిగించలేదు, వారిని వారు స్వేచ్ఛాపరులుగా చేసుకుంటే తప్ప. ఆవిధంగానే పురుషులు కూడా, అధికారం చలాయించే అలవాటున్నప్పటికీ, వారిని వారు తమ ఆంతరిక బానిసత్వం నుండి విముక్తులను గావించుకుంటే తప్ప స్త్రీకి దాస్యం నుండి విమోచన పొందలేరు.

ఈ విధమైన ముసుగులో గుద్దులాట లాంటి పోరాటస్థితి, ఏదైతే పరస్పర ప్రేమానురాగాలు పరిఢవిల్లు సందర్భాలలో సైతం వారి వారి భౌతిక మానసాలలో నిగూఢమైవుంటుందో ఇరు పక్షాలు ఒప్పుకోకపోయినా, అది ప్రత్యక్షంగా కొనసాగు తుంటుంది. అది అనివార్యమేమోనని అనిపిస్తుంది, మానవ జీవులు తమంతటతాము తమ సాధారణ చేతనావస్థ నుండి ఉన్నత స్థాయికి ఎదిగి, సమగ్ర చేతనతో తాదాత్మ్యం చెంది, పరమ సత్యముతో ఏకమవుతే తప్ప. ఎందుకనగా ఎవరు ఈ ఉన్నత చేతనా స్థాయికి చేరుతారో వారికి స్త్రీ పురుష బేధం కేవలం భౌతికమైన వ్యత్యాసమనే అవగాహన ఏర్పడుతుంది.

CWM 12:103- 04 శ్రీమాత

బ్రహ్మచర్యము, వైవాహిక జీవితము

సాధకుడు: సాంసారిక జీవితము ఏ విధంగా నుండాలో తెలుసుకోవాలని నా కోరిక. నేను బ్రహ్మచర్యం పాటించాలా — స్త్రీ సంపర్కం కూడదా?

శ్రీఅరవిందులు: ఈ యోగంలో మేము నియమాలను నిర్దేశించము. నీవు ప్రత్యక్షంగా అతిమానస యోగాన్ని అనుసరించితే అది తప్పనిసరిగా పాటించాలి. యోగాభ్యాసానికి సిద్ధపడుతున్న దశలో కూడా బ్రహ్మచర్యం అవలంబించ గలిగితే, మంచిది. నీవు మానవ మాత్ర స్థాయినుండి ఒక ఉన్నత స్థాయికి ఎదగవలసి వున్నందున నీవు పశుప్రాయ స్థితిని విడనాడాలి. అతిమానస యోగంలో ప్రాథమిక దశనుండి నిమ్న స్థాయి ప్రేరణలకు ప్రభావితుడవు కాకూడదు.

సాధకుడు: కాబట్టి బ్రహ్మచర్యం పాటించుట ఉత్తమం కదా?

శ్రీఅరవిందులు: అవును, నీవు పాటించగలిగితే మంచిదే. అయినప్పటికీ, దానిని గురించి ఓ కఠినమైన ఆవశ్యక నిబంధన అంటూ ఏమీలేదు. ప్రాణిక స్వభావంలో యోగానికి అడ్డుపడే మూడు అవరోధాలున్నాయి. 1. కామోద్రేకం, 2. గర్వాహంకారం, "నేను గొప్ప సాధకుడిని" మొదలైనవి, 3. గెలిచి తీరాలనే గాఢమైన కోరిక లేక ధన మార్జించాలనే కక్కుర్తి.

Evening Talks with SriAurobindo by A.R. Purani, P. 43.

('డి' తాను భవిష్యత్తులో యోగమార్గం అనుసరించ దలచినందున శ్రీఅరవిందుల అభిప్రాయాలను, ముఖ్యంగా వివాహంపై, తెలియ జేయమని కోరాడు. ఉన్నత ఆధ్యాత్మిక జీవితం గడపాలనే ఉద్దేశం గల వ్యక్తి వివాహ విషయంలో ఎలాంటి వైఖరి నవలంబించాలో తెలుసుకోవాలని ఆతని కోరిక. తనకు లైంగికాకర్షణ వున్నదని, దానిని కేవలం అణచివేయడం తన అభిమతం కాదని అతను ఒప్పుకున్నాడు)

శ్రీఅరవిందులు: సమాధానమీయటానికి ఇదిచాలా సున్నితమైన విషయం. బహుశా ఈ క్రింది సూచనలను అతనికి సూచించవచ్చు.

1. లైంగికాకర్షణ అనబడేది సాధారణంగా స్త్రీ పురుషుల మధ్య ప్రాణిక మరియు భౌతిక స్తరాలలో ప్రధానంగా పుంజుకొని వుంటుంది. సాధారణంగా ఈ ఆకర్షణ మానసికావేశాలతో, మనోభావనలతో మిళితమై, ఇంచుమించు ప్రేమ అని, లేక మానసిక సంబంధమని పొరపాటుగా అర్థం చేసుకో బడుతుంది.

ఎవరైతే జీవితాన్ని సంపూర్ణంగా పరిత్యజించా లనుకుంటారో, అనగా సన్యాసులు మొదలగు వారు, వారి విషయంలో వివాహమాడే ప్రశ్న అసులు ఉదయించదు. ఎందుకనగా వివాహమనే విషయం వ్యక్తిని ఆజన్మాంతం స్థిరంగా కట్టి వేస్తుంది. స్త్రీ స్వాభావికంగానే ఆజన్మాంత కట్టుబడికి ఉన్ముఖురాలు. సాధారణంగా ఆమె పురుషుడిని తనకు ఆకర్షితుడిని చేసి జన్మాంతం తనకు బందీని చేస్తుంది. జాతి మరియు జీవితం కొనసాగటానికి ఇది ప్రకృతి సిద్ధమైన పోకడ.

2. స్త్రీ పురుషు లిరువురి మానసిక శక్తుల కలయిక — ఆత్మల సంయోగం — వాస్తవానికి అది సంభవించడం కష్టం.

మొదటి అంశం ప్రాణిక మరియు భౌతిక స్తరాల సాధారణ జీవితానికి చెందినది.

రెండవది, ఉన్నతతర జీవితానికి చెందినది. ఉన్నతతర జీవితంలో స్త్రీ పురుషుల సంయోగం రెండు రకాలుగా, రెండు దశలుగా సాగుతుంది. ఒకటి మానసిక సంయోగం, మరొకటి ఆధ్యాత్మిక సంయోగం.

ఉన్నత ఆదర్శవాదికి — కవి, కళాకారుడు — ఒక వికసించిన మానసిక అస్తిత్వం వుంటుంది. సామాన్య వ్యక్తి లో అది వికసించి యుండదు. మానసికంగా వికసించిన వ్యక్తికి అతనికి సరిపడు లక్షణాలుగల స్త్రీ దొరకటం కొంత కష్టం.ఒకవేళ సరియైన

సమాగమం తటస్థించితే అది ఇద్దరికీ అమోఘమైన తోడ్పాటుగా నుంటుంది.

శిష్యుడు: ఆధ్యాత్మిక జీవితంపై ఆకాంక్షగల వ్యక్తి వివాహమాడితే అతని కేమి జరుగుతుంది?

శ్రీఅరవిందులు: అటువంటి వ్యక్తి వివాహమాడితే మూడు విషయాలు జరుగవచ్చు:

1. సాధారణ వివాహమైతే బాధ్యతలు, ఆరాటాలు, కర్తవ్యాల మోత భరించడమే గాక అధోచేతనా స్థాయికి దిగ జార్చబడతాడు. అప్పుడు ఉన్నతతర జీవితంపై తనకున్న ఆకాంక్షను కోల్పోయి స్త్రీ ప్రభావంతో విచలితుడై పూర్తిగా మారిపోవచ్చు.

2. వివాహం మూలంగా ఆధ్యాత్మికంగా పూర్తిగా చితికిపోవచ్చు.

3. లేక, తనకు తగిన స్త్రీ లభించినట్లైతే అది అతనికి గొప్ప తోడ్పాటు గావచ్చు.

ప్రస్తుత సమాజంలోని వివాహ వ్యవస్థలో శ్రీఅరవిందులకు నమ్మకం లేదని 'డి' కి వ్రాయి. వారు ఒకరిని వివాహమాడమని గాని, వద్దనిగాని చెప్పరు. ఆ నిర్ణయం సంబంధిత వ్యక్తి మాత్రమే తీసుకోవాలి.

Evening Talk with SriAurobindo by A.B. Purani, PP. 148-50

లైంగికాసక్తి, నైతికత, యోగం

శ్రీఅరవిందులు: నీతిపరులు నమ్మనట్లుగా సంభోగక్రియ, దాని మట్టుకు అది చెడుకాదు. అది ఒక ప్రకృతి సహజ ప్రేరణ. దాని ప్రయోజనం దాని కుంది. అది చెడ్డదీకాదు, మంచిదీకాదు. కాని యోగ దృష్టిలో లైంగిక శక్తి ప్రపంచ మంతటి లోకి అత్యంత శక్తివంత మైనది. సక్రమంగా వినియోగించబడితే జీవిని పునః సృష్టించుటకు, పునరుద్ధారణకు ఉపకరిస్తుంది. సాధారణంగా అర్థం చేసుకోబడే రీతిలో వినియోగించితే అది రెండువిధాలుగా ఆటంక పరుస్తుంది. మొదటిది. సంభోగ క్రియ ప్రాణికశక్తిని అతిగా నష్టపరుస్తుంది. అది మరణ దిశగా దారితీసే ప్రేరణ, క్రొత్త ప్రాణిని సృష్టంచి నష్టపరిహార మందించినప్పటికీ, ఆ చర్య తరువాత కలిగే నిస్త్రాణ ఆ ప్రేరణ మరణదిశగా కొనిపోతుందనే విషయాన్ని ఋజువు పరుస్తుంది. చాలామంది దానిని ఏవగించుకుంటారు కూడా.

రెండవది: సాధారణ సంభోగ క్రియతో పాటు రెచ్చిపోయే ఉద్రేకం పురుషుని మానసికోన్నతికి గల సంభావ్యతలను నాశంచేస్తుంది. అతడు తన ఉన్నత చేతనా

కేంద్రాలనుండి వేరుచేయబడి వాటితో సంబంధం కోల్పోయి, పతన మౌతాడు. తాము భోగానుభూతిని పొందుతూ మహాశక్తి మనోవైఖరిని అవలంబిస్తామని జను లంటారు. గాని అది కేవలం మాటవరుసకే. నిమ్న స్థాయి చర్యలు చేపడుతూ, ప్రతికూల శక్తులకు లొంగిపోయి, అదే సమయంలో యోగులుగా చలామణి అయే వారుంటారు. ప్రతికూల శక్తులకు లోబడటానికి తరచు వేదాంత వైఖరిని ఒక సాకుగా వాడుతారు. "ఇదంతా మాయ, భ్రమ, నీతి వైశిష్ట్యం లేదు. పాపం లేదు, పుణ్యం లేదు, చెరుపు లేదు" అంటూ తమంతట తాము నిమ్న ప్రాణిక శక్తుల బారిన పడతారు.

శిష్యుడు: కానీ ప్రకృతియొక్క నిమ్నస్థాయి ప్రేరణలు స్వయంగా ప్రతికూల మైనవి కావా?

శ్రీఅరవిందులు: కావు, కాని ప్రతికూలశక్తుల ప్రభావానికి ఉన్మీలనమయ్యే అవకా శాన్ని కలుగజేస్తాయి. ఇక ప్రతికూల శక్తులు నిమ్న స్థాయి ప్రేరణలను తమ స్వప్రయోజనానికి వాడుకుంటాయి.

శిష్యుడు: సంభోగక్రియ యొక్క నీచప్రభావాలపై వైవాహిక మరియు చట్టబద్ధమైన ఆంక్షలు ఏమైనా మార్పును కలిగిస్తాయా?

శ్రీఅరవిందులు: ఏమీ కలిగించవు. ఈ నైతిక ఆంక్షలు సమాజ శ్రేయస్సుకు, పసికందుల సంక్షేమానికి ఉద్దేశించబడినవి. యోగిక జీవితానికి సంబంధించినంత వరకు స్వంత భార్య తోటి సంభోగ క్రియకూడా పరస్త్రీతో జరిపితే ఎంత హాని కరమో అంత హానికరం. ఎవరైతే మానవమాత్ర స్థాయిని మించి ఎదిగారో, ఎవ రైతే ఒక విధమైన ఆధ్యాత్మిక మరియు ప్రాణిక శక్తులను కలిగి వుంటారో, వారికి సంభోగక్రియను ఆధ్యాత్మిక ప్రయోజనార్థం ఉపయోగించగల సంభావ్యత వుంటుంది. ప్రాథమిక దశలో సాధకులు ఈ అలవాటుకు పాల్పడితే పతన మవక తప్పదు.

Evening Talk with SriAurobindo by A. .B. Purani, P. 118 శ్రీఅరవిందులు

*

స్త్రీలతో నిర్మలమైన, నిర్వికార సంబంధం ఎప్పుడు ఏర్పడుతుందంటే వారు స్త్రీలనే విషయాన్ని విస్మరించి, వారిని కేవలం మానవజీవులుగా చూడగలిగి

నప్పుడు మాత్రమే, వారిపట్ల నీకున్న భావనలో, నీ చర్యలలో లైంగిక వివక్షతను విస్మరించగలిగినప్పుడు.

*

నిమ్న ప్రాణికం బలోపేతమై, పవిత్రమై హృదయం విశాలమై వున్న స్థితి ఇతరులను కలవడానికి — ముఖ్యంగా స్త్రీలను అత్యుత్తమమైనది. అట్టి స్థితిని ఎల్లవేళలా నిలుపుకోగలిగితే లైంగిక వాంఛ కనీసం తొంగిచూడదు.

CWSA 31: 350 శ్రీఅరవిందులు

ప్ర: నూతన జీవితంలో స్త్రీ, పురుషులు పోషించే పాత్ర ఏమిటి? వారి సంబంధాలు ఎలాంటివి?

స: ఇద్దరిమధ్య భేద మెందుకు కనబరచాలి? ఇద్దరూ మానవ జీవులే, ఇద్దరూ దైవ కార్య నిర్వహణకు తగిన ఉపకరణాలు గావాలని ప్రయత్నిస్తున్న వారే, ఇద్దరూ లింగ, కుల, వర్గ, జాతీయత విచక్షతను అధిగమించినవారే. అందరూ ఒకే దివ్య జనని బిడ్డలే, ఒక్కడైన శాశ్వతుడైన దైవాన్ని ఆకాంక్షిస్తున్నవారే.

CWM 8: 242 శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

బ్రహ్మచర్య సిద్ధాంతం

ప్రాచీన ఆర్య వ్యవస్థ మూలాధారం

మనిషి జగత్తునుండి విడివడి లేడు. అతడు దానితో యేకమై వున్న ఒక భాగం. సముద్రంలో ఒక భాగమైన దాని అలలాగా, జగత్తుతో అన్ని విధాలుగా కలిసిపోయి వున్న ఒకభాగం అని ప్రాచీన ఆర్యులకు తెలుసు. ఒక అనంత ఊర్జం, ప్రకృతి మాయ లేక శక్తి ప్రపంచమంతా వ్యాపించి తనంతట తాను ప్రతినామంలో, రూపంలో, మట్టిలో, మొక్కలో, క్రిమిలో, జంతువులో, మనిషిలో అది తనను తాను వెలువరించుకొంటోంది. కంటికి కనిపించే వాటి అస్తిత్వంలో ఈ మహా ఊర్జానికి కొంచెం అటూ యిటూగా ఇవి పటిష్టమైన ఆధారాలు. ఆ మహా ఊర్జపు అలలు జనించి, నిలువచేయబడి, నిత్యశక్తి పూరితమౌతూ, ఉపయోగించ బడుతూ తిరిగి నింప బడుతూ వుండే ఒక విద్యుతుత్పాదక యంత్రం

లాంటి వాళ్ళం మనం. మనలో నక్షత్రాన్ని, గ్రహాన్ని కదిలించే యేశక్తీ వున్నదో, అదే శక్తి మనలో ప్రతి ఒక్కరిలో కదలాడుతోంది. మన ఆలోచన, కర్మ అంతా కేవలం దాని క్రీడ, దాని వ్యవహార శైలి సంక్లిష్టతనుండి పుట్టినదే. వాటికి ఆధారాలుగా మనిషి తన సామర్థ్యాన్ని పెంచుకొనే ప్రక్రియలున్నాయి. తనకు జగత్ శక్తికి మధ్య సంబంధం పెట్టుకొనేందుకు యేర్పాటైన మార్గంలో వుండే అవరోధాలను తొలగించి దాని గొప్ప గొప్ప నిలువలను, తన అంతరాత్మలో, మస్తిష్కంలో, దేహంలో వెలువరించు కొనేందుకు యితర ప్రక్రియ లున్నాయి. ఆధారాలలో యీ విధమైన నిరంతర పెరుగుదల, ప్రోద్బలమిచ్చే ఊర్జపు కర్మ పరిమాణాన్ని, సంక్లిష్టతను వృద్ధి చేయడం అనేవి పరిణామపు మొత్తం లక్ష్యం. అత్యున్నతమైనది సమృద్ధ పరిమాణం కలదై వుండి, లోనికి దుముకుతూ వచ్చే ఆ ఊర్జాన్ని మానవ ఆధారాలు పూర్తిగా భరించ గలిగే విధంగా ఆ ఆధారాలే స్వయంగా శిక్షణ పొందినపుడు, అప్పుడే ఆ మనిషి సిద్ధుడౌతాడు, పరిపూర్ణుడౌతాడు. సమగ్రపరచబడతాడు. అతని పరిణామం పూర్తైనట్లే. యుగాల తరబడి మానవ జాతి దేని కోసం శ్రమిస్తున్నదో ఆ అత్యున్నత అభివృద్ధిని ఒక వ్యక్తిగా అతడు పూర్తిగా పొందిన వాడౌతాడు.

ఈ సిద్ధాంతం సరైనదైతే బుద్ధి పనిచేసే తీరుకు మూలమైన ఊర్జం మనలో తప్పక వుండాలి. అలా వుండడమే గాకుండా వాస్తవానికి గొప్పగా విస్తరించుకొనే, ఎంతో గొప్పగా ఉపయోగపడగల అమితమైన సామర్థ్యం కలదై కూడా వుండి వుండాలి. ఇదొక దృఢమైన సిద్ధాంతం కూడా అయి వుండాలి. మనం ఈ ఊర్జాన్ని యెంత ఎక్కువ పెంచుకొంటే, సుసంపన్నం చేయగలిగితే అంత గొప్పగా మానసిక కోర్కెల అంతర్నిహిత శక్తి విస్తృతి, కార్యకలాపం వృద్ధి చెందుతుంది. తత్పర్యవసానంగా మన భౌద్ధిక పటుత్వం, మన సాధనా ఫలితంయొక్క ఔన్నత్యం మెరుగు పడతాయి. ఊర్జ శక్తిని ఇనుమడింప జేసి, నిలువ వుంచుకొనడానికి ప్రాచీన ఆర్యులు వుపయోగించిన ప్రక్రియలలోని ప్రధాన సూత్రాలలో బ్రహ్మచర్యానుష్టానం ప్రప్రథమ సూత్రం.

CWSA 1: 370-71

ద్వివిధకష్టం

కష్టం రెండురకాలు, అవి అంతరాత్మికము, దైహికము. మొదటిది జీవితం మీద సంస్కరించబడని పశుతత్వ ప్రభావ ఫలితం, ముఖ్యంగా దేహ సంబంధమైన మొరటు సహజాతాల ప్రేరణల, కోరికల వత్తిడి వల్ల కలిగిన ప్రభావం. రెండవది మన దేహ చట్ర నిర్మాణం, సజీవ ఉపకరణ వ్యవస్థ ఉన్నత దివ్య ప్రభావపు క్రియాశీలతత్వం మీద తన పరిమితులను విధించడం ఫలితంగా కలిగే కష్టం. ఈ రెంటిలో మొదటిది కష్టాన్ని ఎదుర్కొని జయించడం తేలిక. ఎందుకనంటే యిక్కడ సంకల్పం జోక్యం చేసుకొని దేహంపై ఉన్నత స్వభావ శక్తిని విధిస్తుంది. వీటిలో కొన్ని దేహానికి సంబంధించిన ప్రేరణలు, సహజ ప్రవృత్తులు, ప్రత్యేకించి అపకారం కలిగించేవని ఆధ్యాత్మిక ఆశావహుడు తెలుసుకొని, దేహాన్ని సన్యాసిలా తిరస్కరించడంవైపు చాలా వరకు మొగ్గు చూపాడు. కామోద్రేకం, లైంగిక వ్యవహారం, వాటి కారణంగా యేర్పడే ఏదైతే దాని ప్రభావాన్ని రూఢి పరుస్తుందో దాన్నంతా ఆధ్యాత్మిక జీవితాన్నుండి నిషేదించాలి. తొలగించి వేయాలి. ఇది కష్టమైనప్పటికీ, యెంత మాత్రం అసాధ్యం కాదు గాని ఆధ్యాత్మిక ఆశావహులు పాటించ వలసిన ప్రధాన షరతు. సన్యాసాన్ని అనుష్టించుటలో తప్పించుకొనలేని షరతు ఇది. దీని నెరవేర్చడం, మొదట్లో తేలిక గానప్పటికీ, కొంతకాలం జరిగాక తప్పక సాధ్యమౌతుంది. కామ వాంఛను, ప్రేరణను అధిగమించడం అనేది, తనపై తాను అధికారతను సంపాదించి ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించే స్థాయిని పొందే వాళ్ళందరికీ ఇది విధించబడింది. ఆధ్యాత్మిక ఆకాంక్షాపరు లందరికీ దానిని అదుపులో నుంచడం ఆవశ్యకం. సంపూర్ణ విరాగి దానిని పూర్తిగా విడనాడాలి. ఇంతమాత్రం అనుభవానికి తెచ్చుకోవాలి. ఈ అతి ముఖ్య ఆవశ్యకతను, దాని సూత్రాన్ని, తక్కువచేసి చూడకూడదు.

కామప్రేరణకు మూలకారణం

కామవాంఛ యొక్క మొరటైన భౌతిక సంతృప్తినలా వుంచి, కామ సూత్రపు సమస్త అభిజ్ఞానాన్ని భూమిపై దివ్యజీవనం నుండి మినహాయించ లేవు. అది జీవితంలో వుండి పెద్దపాత్రనే పోషిస్తున్నది. అలాగే దానితో వ్యవహరించాలి.

అంతేగాని తేలికగా చూస్తూ అలక్ష్యం చేయగూడదు. కేవలం దాన్ని అణచివేసి లేక కట్టి పడవేసి, లేక దాని మీద దృష్టి పెట్టకుండా వుండ గూడదు. ప్రాథమికంగా అది ఒక విశ్వజనీన సూత్రం, దివ్యసూత్రం గూడా. అది ఈశ్వరుని మరియు మహాశక్తియొక్క ఆధ్యాత్మిక రూపాన్ని తీసుకొంటుంది. అది లేకుండా ప్రపంచ సృష్టి లేదు, లేక పురుష ప్రకృతికి సంబంధించిన ప్రపంచ సూత్రపు అభివ్యక్తి లేదు. ఆ రెండూ సృష్టికి ఆవశ్యకం. అంతరాత్మిక కార్యనిర్వహణకై, వాటి సాహచర్యంలోనూ, పరస్పర ఆధార ప్రధానంలోను, దైవలీలకు సంబంధించిన మొత్తం ప్రక్రియకు ప్రాథమిక తత్వాలైన అంతరాత్మ, ప్రకృతిగా వాటి అబివ్యక్తి కూడా ఆవశ్యకం. దివ్యజీవనంలో ఒక అవతారంగానో లేక ఏదో ఒక రూపంలో ఆ రెండు శక్తుల ఉనికితోనో లేక అవి రూపం ధరించడం ద్వారానో లేక వాటి ప్రతినిధుల ద్వారానో ప్రవేశపెట్టే ప్రభావం నూతన సృష్టి సాధ్యమయ్యేటట్లు చేయడానికి అనివార్యం అవుతుంది. మానవ కర్మాచరణ యొక్క మానసిక, ప్రాణిక స్థాయిలలో కామ వాంఛ పూర్తిగా దైవికమైనదానికి భిన్నంగాదు. దానికి దాని ఉదాత్తమైన పార్శ్వాలు, ఆదర్శ తత్వాలు వున్నాయి. ఏ విధంగా, యెంతవరకు వీటిని నూతన విశాల జీవితంలోనికి అనుమతించవచ్చో చూడవలసివుంది. కామవాంఛ ప్రేరణకు సంబంధించిన సమస్త పాశవిక విశ్రుంఖలత్వం విడనాడాలి. ఉన్నత జీవితానికిా సిద్ధంగా లేనివారిలో, లేక పూర్తిగా ఆధ్యాత్మిక జీవితాని కింకా సిద్ధం కాని వారిలో అది కొనసాగవచ్చు. దాన్ని ఆకాంక్షించినా యింకా పూర్తిగా దాన్ని స్వీకరించని వారిలో కామవాంఛ సంస్కరించబడాలి. దానిని, ఆధ్యాత్మిక లేక అంతరాత్మిక ప్రేరణకు, ఉన్నత మానసిక, ఉన్నత ప్రాణిక నియంత్రణకు లోబడునట్లు చేసి, దాని సమస్త తేలికపాటు, తుచ్ఛమైన నీచరూపాలను త్యజింపజేసి ఆదర్శపు పరిశుద్ధ స్పర్శానుభూతికి గురి చేయాలి. ఉన్నతోన్నత స్థాయిల లోని, ప్రేమ పరిశుద్ధ సత్య రూపాలన్నీ, తమ ఉన్నతోన్నత స్వభావాన్ని నిజం చేసుకొనేంత వరకు, విశ్వజనీన ప్రేమలోనికి విస్తరించుకొనేంతవరకు, దైవప్రేమలో లీనమయ్యేంతవరకు ప్రేమ నిలిచే వుంటుంది. స్త్రీ, పురుష ప్రేమకూడా ఆ ఔన్నత్యాన్ని, పరిపూర్ణతను అనుభవిస్తుంది. ఎందుకనంటే ఆ ఆదర్శాన్ని, ఆధ్యాత్మికతా స్పర్శను సందేహించ గలిగినదంతా, ఆది దివ్యసత్యతను చేరేంత వరకు ఆ ఆరోహణామార్గాన్ని అనుసరించ వలసిందే. దివ్యజీవనంలో దేహాన్ని,

దైహిక కార్యకలాపాలను తప్పక అంగీకరించాలి, ఆ ధర్మం క్రింద సాగనీయాలి. కాని యితర పరిణామాత్మక మార్పిడులలో లాగా దివ్యజీవన ధర్మాన్ని అంగీకరించ లేనిదేది వున్నదో అది అంగీకరించబడ కూడదు. ఉన్నత దిశగా ఎదిగే స్వభావము నుండి అది తప్పక రాలి పోవలసిందే.

CWSA 13: 543-44

లైంగిక సంతృప్తి, పూర్ణయోగం

తాంత్రికాభ్యాసాల వైపు మళ్లించే యే సూచన వచ్చినా అది తప్పక ప్రాణికానికి సంబంధించిన ఒక కుయుక్తి. తాంత్రిక అనుష్ఠానాలు లేకుండానే లైంగిక ప్రేరణలను వదిలించుకోవచ్చు. అవెందుకు కొనసాగుతాయంటే, వాటికొక స్థానాన్ని కేటాయించి వుంచాలని నీలో యేదో యింకా కోరుతోంది. మన యోగంలో కామానికున్న స్థానం యేమిటి? అన్న ప్రశ్నకు "స్థానం లేదు" అనేదే ఉత్తమమైన సమాధానం. లైంగిక సంపర్కం వల్ల కలిగే సంతృప్తిని కాదని దైవ ప్రేమ, ఆనందాలతో సంతృప్తి పడగలిగి వుండాలి.

*

(బహిరంగ లేక ప్రగాఢ భావనాత్మక ప్రేమలా ముసుగేసుకున్న) లైంగిక సంపర్కం, ఈ యోగం కలిసి సాగలేవు అనే స్పష్టమైన, పొరపడని దిశానిర్దేశం లేకపోవడమే అసలు పొరపాటంతా. లైంగిక సంపర్కం సాధనకు సహాయ పడుతుందనే అభిప్రాయం యేదో ఒక రూపంలో చాలా మందిని పట్టుకొని వుంది. దాని ననుసరించిన వారందరికీ అదొక బ్రహ్మాండమైన అవరోధం అనేది సదా ఋజు వౌతూనే వుంది. అది జీవిని, దాని ప్రాణికానికి కట్టి పడవేసి ఆధ్యాత్మిక విమోచనాన్ని అడ్డుకొంటుంది. ఆధ్యాత్మిక విముక్తి రూపాంతరీకరణకు ఆవశ్యక ఆధారం. ఉన్నత అనుభవాలు గూడా లైంగికేచ్ఛ ఛాయారంగు మారిపోవ మొదలై వాటి వాటి వాస్తవ మూలాలు భంగపడతాయి. ఈ భావ యదార్థతను గురించి శ్రీమాత నీకిదివరకే చెప్పారు. లైంగికపరమైన ఆకలిని పూర్తిగా సంతృప్తిపరిస్తే అది అంతమవుతుంది, శాశ్వతంగా అదృశ్యమౌతుంది అనే భావన తన కోరికకు అనుమతిని సంపాదించుకొనడానికి ప్రాణికం మనస్సు ముందు పెట్టిన ఒక మోస పూరిత నటన — ఆ భావన మనుగడకు మరో కారణంగాని వాస్తవికత గాని,

సమర్థన గాని లేదు. అప్పుడప్పుడు సంతృప్తి పరచటం ద్వారా, లైంగిక వాంఛ యెగిరెగిరి పడుతుంటే పూర్తిగా సంతృప్తి పరిస్తే అది నిన్ను దాని ఊబిలోనికి ముంచివేస్తుంది. ఈ ఆకలి మిగిలిన ఆకళ్ళలాగా తాత్కాలిక సంతృప్తి వల్ల లేకుండా పోదు. తాత్కాలికంగా దూరమై, తిరిగి తనను తాను తాజాగా చేసుకొని మళ్ళీ సంతృప్తిని కోరుతుంది. తాత్కాలిక ఉపశమనాలు గాని, అధికంగా అందులో పాల్గొనడం గాని, యేదీ కూడా దానికి ఉచితమైన చికిత్స కాదు. అది ఒక సమూలమైన అంతరాత్మిక తిరస్కృతి ద్వారా మాత్రమే వదిలి పోతుంది, లేక దానిని వాంఛించని, యదార్థ మహదానందాన్ని కలిగినటువంటి చేతన అధికాధికంగా దిగిరావడంతో జరిగే ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక ఉన్ముఖత జరిగినప్పుడే అది వదిలి పోతుంది.

దైవికమైన మహదానందం మరియు అధమస్థాయి సంతోషం మధ్య దేనిని యెంచుకోవాలి?

అది భయానికి సంబంధించిన సమస్య కాదు. దైవపరమగు శాంతి, మహదానందం మరియు అధమ స్థాయికి చెందిన సంతోషం, కామ సంతృప్తి సంతోషం మధ్య దైవం మరియు స్త్రీ ఆకర్షణ మధ్య దేనిని యెంచుకోవాలనే దానికి సంబంధించిన సమస్య. దేహానికి ఆదరువుగా ఆహారం తీసుకోవాలి, అది ఒక ఆవశ్యకత. కాని కామ సంతృప్తి ఒక ఆవశ్యకత కాదు. ఆహారంలోని రసాన్ని ఆధ్యాత్మిక స్థితితో సమరసం గావించడం కూడా ఆహారం మీద అధిక ఆపేక్ష, రుచిపై మక్కువ పూర్తిగా అదృశ్యమైనపుడు మాత్రమే సాధించగలం. భౌతిక లేక ఉత్తమాభిరుచికి సంబంధించిన ఆనందంకూడా, దానిమీద అనురాగం వుంటే, అది ఆధ్యాత్మిక సిద్ధికి ఒక ఆటంకం అవుతుంది. ఒక అనాగరిక, పరివర్తన చెందని దైహిక సంబంధమైన ఆకలి కన్న కూడా అది ఆధ్యాత్మికానికి బాగా దగ్గరగా వున్నప్పటికీ ఒక ఆటంకం కాగలదు. వాస్తవానికి ఆధ్యాత్మిక చేతనలో భాగంగా తయారు కావడానికి, బౌద్ధిక ఉత్తమాభిరుచికి సంబంధించిన ఆనందం కూడా పరివర్తన చెంది, ఉన్నతమైన దేదోగా అవ్వాలి. కాని రసభరితమైన విషయాలన్నింటినీ నిలుపుకో కూడదు. ఇతరులను గాయ పరచడంలోను, చంపటంలోను ఒక రసభావన ఉంది. అదే హింసించడంలో పొందే ఆనందం. తనను తాను చిత్రహింస

పెట్టుకోవడం లోనూ రసభావన వుంది. అది కామోద్రేక వేధింపులో వుండే ఆనందం — ఆధునిక మనో వైజ్ఞానిక శాస్త్రమంతా యీ రెండింటితో నిండి వుంది. ఆధ్యాత్మిక జీవితంలో భాగంగా వాటిని నిలుపుకోవడానికి వాటిలో రసభావం వున్నది అనేది సరైన కారణం కాలేదు.

పరస్పర ప్రాణిక మార్పిడి

ఈ యోగం మొత్తం సూత్ర మేమిటంటే, యింకెవ్వరికీ గాక, మరిదేనికీ గాక తనను తాను ఒక్క దైవానికి మాత్రమే పూర్తిగా సమర్పించి వేసుకోవడం, దైవమాత శక్తితో మమేకమై మనలోనికి అతిమానస దైవిక సమస్త విశ్వాతీత వెలుగు, క్రియాశక్తి, వైశాల్యత, శాంతి, పరిశుద్ధత, సత్య చేతన, మహదానందాలను క్రిందికి తీసుకొని రావడం. అందుచేత యీ యోగంలో ప్రాణిక బాంధవ్యాలకు లేక ఇతరులతో ఆదానప్రధానాలకు తావులేదు. అటువంటి బాంధవ్యమేదైనా లేక ఆదానప్రధాన మేదైనా వెంటనే అంతరాత్మను నిమ్న చేతనకు బంధించి వేస్తుంది, దైవంతో పూర్తి యదార్థ యేకతను అడ్డుకొంటుంది. అతిమానస సత్య చేతనలోనికి ఆరోహించడాన్ని, అతిమానస ఈశ్వరీశక్తి అవరోహించడాన్ని అడ్డుకొంటుంది. ఈ ఆదానప్రధానం గనుక లైంగిక బాంధవ్యరూపం లేక లైంగిక భోగరూపం తీసుకొంటే బాహ్య చర్య జరగకుండా స్వేచ్ఛగా వున్నప్పటికీ అది మరింత నికృష్ట స్థితి అవుతుంది. అందుచేత యీ విషయాలు సాధనలో పూర్తిగా నిషేదించ బడ్డాయి. ఈ విధమైన భౌతికచర్య అంగీకరించబడదు అని వేరే చెప్పనవసరమే లేదు. అంతేగాక తత్సంబంధిత ఏ విధమైన రహస్య కార్యక్రమం కూడా నిషిద్ధమే. అతిమానస దైవంతో యేకమైన తర్వాత మాత్రమే యితరులతో దైవికమైన మన యదార్థ ఆధ్యాత్మిక బాంధవ్యాలను కనుగొన గలం. ఆ అత్యున్నత యేకత్వంలో యీ విధమైన అనాగరిక నిమ్న ప్రాణిక చలనానికి తావే వుండదు.

లైంగిక సంతృప్తి యొక్క సూక్ష్మ రూపాలు

లైంగిక ప్రేరణలను అధీనంలో వుంచుకొనడానికి — లైంగిక వ్యవహారంలో ఊర్జాన్ని వృధా అయ్యేటట్లు బయటి వైపుకు నెట్టి వేయకుండా దానిని పైకి లేవనెత్త

గలిగే లైంగిక కేంద్రంపై ఆధిపత్యం సంపాదించడం — బీజంలోని క్రియాశక్తిని, యితరమైన వాటన్నింటికీ ఆధారమయ్యే ఆదిభౌతిక ఊర్జంగా రేతస్సును ఓజస్సుగా, నిజానికి మలచవచ్చు. కాని లైంగిక వాంఛను దానికి సంబంధించిన సూక్ష్మ సంతృప్తిని కలిపి దానిని సాధనలో భాగంగా అంగీకరించడం అనే విపత్కర స్థితిని మించిన ప్రమాదం వుండదు. అది ఆధ్యాత్మిక పతనానికి సరాసరి దారి తీయడానికి, అతిమానస అవతరణను నిలిపివేసి దానికి బదులు అలజడిని, పెను ముప్పును కలిగించడానికి, హానికర ప్రాణిక శక్తులను, క్రియాశక్తులను వాతావరణంలో వ్యాపింప జేయడానికి అది అత్యంత ప్రభావవంతమైన మార్గం అవుతుంది. అటువంటి దిశామార్పిడి మళ్ళీ జరుగకుండా వుండేందుకు దానిని చేతన నుండి బహిష్కరించాలి. పరమసత్యాన్ని క్రిందికి తీసుకొచ్చి పని పూర్తి చేయాలంటే ఈ అపసవ్య నడకను పూర్తిగా, సంపూర్ణంగా నెట్టివేయాలి.

భౌతిక లైంగిక చర్య నిషేదించబడినప్పటికీ అంతర్గతంగా దాని పునరుత్పత్తి లైంగిక కేంద్ర రూపాంతరీకరణలో భాగంగా ఊహించడం తప్పు. అవిద్యలో భౌతిక సృష్టికి సంబంధించిన వ్యవస్థలో ఒక ప్రత్యేక ప్రయోజనార్థం, ప్రకృతిలో పశుప్రాయమైన లైంగిక ఊర్జం ఒక సాధనం. కాని దాని వెంట వచ్చే ప్రాణిక ఆవేశం, అవే ప్రాణిక క్రియాశక్తులు జీవులు దూకుడుగా లోనికి ప్రవేశించడానికి వాతావరణంలో చాల సానుకూల అవకాశం కలిగిస్తుంది. ఆ ప్రాణిక క్రియాశక్తుల, జీవుల మొత్తం వ్యాపారం అతిమానస దివ్య వెలుగు అవతరణను అడ్డుకోవడమే. దానితోబాటు కలిగే సంతోషం ఒక అధమస్థాయికి చెందినదే గాని దివ్య మహదానందపు యదార్థ రూపం కాదు. భౌతికంలోని యదార్థ దివ్య మహదానందానికి ఒక విభిన్న మైన లక్షణం, చలనం, ద్రవ్యం వున్నాయి. సారతః అది స్వయం సిద్ధం. దాని అభివ్యక్తి దైవంతో ఆంతరంగిక సంయోగం మీద ఆధారపడి వుంటుంది. నీవు దైవప్రేమను గురించి మాట్లాడటం కాని దైవప్రేమ భౌతికాన్ని స్పృశించినపుడు గాని అది నీచ ప్రాణిక ఆసక్తులను మేలుకొలుపదు. వాటిని సంతృప్తి పరచినందువల్ల దివ్యప్రేమను జుగుప్స పరచడ మౌతుంది. తత్కారణంగా అది రూపాంతరీకరించగల పదార్థ సృష్టి మొరటుదనం లోనికి యే శిఖరాలనుండి క్రిందకు తీసుకురావడం కోసం యిప్పటికే యెంత కష్టపడవలసివచ్చిందో ఆ శిఖరాలకు అది ఉపసంహరించుకొనేటట్లు చేస్తుంది. ఏ ఒకే ఒక ద్వారం నుండి

దైవ ప్రేమ ప్రవేశించడాని కంగీకరిస్తుందో , ఆ చైత్యపురుష ద్వారం ద్వారా దైవ ప్రేమను కాంక్షిస్తూ అధమ ప్రాణిక పొరపాటును నిరాకరించాలి.

లైంగిక ప్రేరణ వల్ల సాధనలో కలిగే ప్రమాదం

లైంగిక వాంఛ మార్గాన్ని అడ్డుకొంటున్నంత కాలం సంపూర్ణ ఆరోహణ అసాధ్యం. ప్రాణికంలో లైంగికవాంఛ శక్తివంతంగా వున్నంతకాలం అవతరణ ప్రమాదకరం. ఎందుకనంటే ఏ క్షణంలోనైనా కోతకు గురికాని లేదా అంతర్నిహితంగా వున్న లైంగిక వాంఛ యదార్థ అవతరణను ఇతర కార్యాల కోసం సముపార్జించు కొన్నప్పుడు ఊర్ధ్వపు ప్రయోజనాలను వెనక్కు నెట్టి వేసి లేక చేతన సర్వ శక్తులను తప్పుడు గందరగోళ, భ్రాంతిమయ అనుభవం వైపు మళ్ళిస్తుంది. అందుచేత, మార్గంలోనుండి యీ అవరోధాన్ని తొలగించి వేయాలి, లేకపోతే రక్షణ వుండదు. సాధనలో శిఖర స్థాయికి చేరడంవైపు స్వేచ్ఛాయుత కదలిక వుండదు.

CWSA 31: 494-505

ఆత్మ నింద

హస్త ప్రయోగం ఒక శారీరక ఆవశ్యకత అనేది అత్యంత అసాధారణ భావన. అది నాడీ క్రియాశక్తిని, నాడీశక్తి సమతూకాన్ని బలహీన పరుస్తుందనేది సహజం. యెందుకనంటే, అది కృత్రిమం. ఊర్జాన్ని తిరిగి నింపలేని విధంగా వృధా చేయడం. అది లైంగిక కేంద్రాన్ని అవ్యవస్థితం గావిస్తుంది. దానికి అతిగా సంతృప్తి చెందే వాళ్లు వాళ్ళ నాడిశక్తి సమతూకాన్ని పూర్తిగా తల క్రిందులు చేసి నరాల బలహీనతను లేక యింకా నికృష్ట స్థితిని కొని తెచ్చుకుంటారు. లైంగిక కేంద్రాన్ని, లైంగిక చర్యను అవ్యవస్థీకరించడంవల్ల లైంగిక చర్య పర్యవసానాలను నివా రించుకోవడం జరుగదు. కాని స్వయంగా లైంగిక వాంఛను ఊర్ధ్వపు ఉన్నత రూపాలలోనికి మళ్ళించడం ద్వారా దానిని నియంత్రించవచ్చు. ఆ అలవాటును నిరాకరించడం బహు బాగా సాధ్యమే. దానిని సంవత్సరాలపాటు కలిగివున్నప్పటికి, దానిని ఆపి వేయగలిగిన వారు కోకొల్లలు.

*

నీవు చెప్పిన అలవాటు చాలా ప్రమాదకర మైనది, అపకారం కలిగించేది కూడా. సాధన కోసం భద్రపరచుకో వలసిన ఊర్జాన్ని వృధాచేస్తుంది. అది మనస్సును బలహీన పరుస్తుంది, చేతనను స్థానభ్రంశం చేస్తుంది, నాడీ శక్తిని పూర్తిగా ఖర్చు చేస్తుంది, ప్రాణశక్తిని క్షీణింపజేస్తుంది. దేహంలో తమస్సును, నపుంసకత్వాన్ని సృజిస్తుంది. దానితోపాటు కలిగే ఉద్రేకాలు వగైరాలు దేనినీ నిర్మించలేవు. వాటి ధోరణి ప్రతిదానినీ అస్తవ్యస్థం చేయడమే. తరచుగా యీ అలవాటు ఆరోగ్యాన్ని పాడుచేసి, క్షీణింపజేసే జబ్బుల్ని కొనితెస్తుంది. అదుపు లేని విధంగా దాని కల వాటుపడితే అది ఆపని చేస్తుంది.

ఎవరు దాని కలవాటుపడినా వాళ్ళు చేయవలసిన దొకటే. ఆ అలవాటును పూర్తిగా రాజీలేని విధంగా, శాశ్వతంగా భగ్నం చేయాలి, లైంగిక కేంద్రాన్ని యెన్నడూ స్పృశించనే కూడదు.

CWSA 31: 531-32

శ్రీఅరవిందులు

ఆధిపత్యం, అణచివేత మద్యగల భేదం

నీవు చెప్పిన విరుద్ధ అభిప్రాయం, లైంగికేచ్ఛ అనేది మానవ ప్రాణిక భౌతిక మొత్తం లో ఒక సహజ భాగమని, ఆహారం, నిద్రలా ఒక ఆవశ్యకత అనీ దాన్ని పూర్తిగా నిషేదిస్తే, అది అసమతుల్యతకు, తీవ్రమైన అనారోగ్యాలకు దారి తీస్తుందనే భావనవల్ల యేర్పడినదై వుండవచ్చు. బాహ్యాచర్యలో బయట పడ కుండా అణచివేసినా యితర పద్ధతుల్లో సంతృప్తి చెందితే, నాడీ వ్యవస్థలో, మెదడులో తీవ్రమైన అస్వస్థతలకు దారి తీయవచ్చు. లైంగిక కార్యానికి దూరంగా వుండడాన్ని వైద్య సిద్ధాంతం నిరుత్సాహ పరచడాని కిదే మూలకారణం. మామూలు లైంగిక కార్యానికి బదులు ఒక వక్రగతిన రహస్యంగా తృప్తి పొందడం జరుగుతుంటే, లేక ఒక గుహ్యమైన విధానానికి సంబంధించిన ప్రాణిక ఆదాన ప్రధానం ద్వారా అది జరిగినప్పుడు మాత్రమే ఇటువంటివి సంభవిస్తాయనేది నేను గమనించాను. ఆధిపత్యం నిషేదంవైపు ఒక యదార్థ ఆధ్యాత్మిక కృషి వున్నప్పుడు అపకారం యెప్పుడు కూడా జరుగుతుందని నే ననుకోను.

ఆధిపత్యం సాధించే పద్ధతి విషయంలో, అది భౌతికంగా అందులో పాల్గొనక

పోయినందు వల్ల మాత్రమే సాధ్యం కాదు. అది నిస్సంగత్వం, తిరస్కృతిని జతగా అభ్యసించడం ద్వారా సాగుతుంది. లైంగిక ప్రేరణ నుండి చేతన వెనుదగ్గి నిలుస్తుంది. అది తన స్వంతం కాదనుకొంటుంది. తన మీదకు విదేశీయ మైనదేదో ప్రకృతి-శక్తిచే విసరబడినందున దానికి తాను అంగీకరించనట్లు కాదని లేక దానితో తాదాత్మ్యం చెందడంలేదని అనుకొంటుంది. ప్రతిసారి తిరస్కారానికి సంబంధిం చిన ఒకానొక చలనం దాన్ని అధికాధికంగా బయటి వైపుకు నెట్టి వేస్తుంది. మన స్సు ప్రభావితం గాకుండా వుండిపోతుంది. దానికి ప్రధాన ఆధారమైన ప్రాణిక అస్తిత్వం కొంత కాలం తరువాత అదే విధంగా ఉపసంహరించు కుంటుంది. చివరగా భౌతిక చేతన యికనెంత మాత్రం కలలో కూడా దానిని రెచ్చగొట్టకుండా చేస్తుంది. ఈ నిమ్నాగ్నిని బాహ్య ప్రకృతి శక్తి నుండి తిరిగి రగిలింప జేసే సుదూర చలనం కూడా లేకుండా వుండేంత వరకు యీ ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది. లైంగికాసక్తి వదిలిపెట్టకుండా గట్టిగా పట్టుకొనివుంటే అనుసరించవలసిన పద్ధతి యిది. కాని ఒక్కసారిగా తమ స్వభావం నుండి రాలిపోనిస్తూ దృఢ నిశ్చ యంతో సమూలంగా తొలగించి వేసుకొన్న వారు కొందరున్నారు. ఏదేమైనప్ప టికీ, అలాంటి వారు చాలా అరుదు.

లైంగిక ప్రేరణను పూర్తిగా తొలగించి వేయడమనేది సాధనలో అత్యంత కష్టమైన వాటిలో ఒకటని చెప్పి తీరాలి. సమయం పట్టినా అందుకతడు సిద్ధమై వుండాలి. కానీ దానిని పూర్తిగా తొలగించుటలో సఫలత లభించినా వాస్తవమైన విమోచనను అప్పుడప్పుడు అధోచేతన నుండి స్వాప్నిక చలనాలు అడ్డుపడుట సర్వసాధారణం.

కామకలాపాలకు వ్యతిరేకత - రూపాంతరీకరణం

మానవజాతికి ఒక విధంగా పూర్తిగా సహజమై, అన్యప్రమేయంలేని లైంగిక ప్రేరణ వుంది... సమస్యను చక్కగా బహిరంగ పరచే అతి ఘనిష్ట విషయాలలో ఇదొకటి. ఇది న్యాయసమ్మతమైనది అని కూడా నేను చెప్పగలను. ఈ ప్రేరణ సహజంగా, అప్రయత్నంగా, పశుత్వంతో పాటు అదృశ్యమౌతుంది. తినవలసిన అవసరం, బహుశా యిప్పుడు మనం నిద్రపోతున్నట్లు నిద్రించవలసిన అవసరం, యితరమైనవి చాలా అదృశ్యమౌతాయి.... ఆనందం అనేది పెద్ద మాట. సంతో

షం, ఆహ్లాదం అనే వాటికి మూలంగా శ్రేష్ట మానవజాతిలో కొనసాగిన అత్యంత సచేతనమైన ప్రేరణ తప్పకుండా లైంగిక వాంఛకు సంబంధించినదే. శ్రేష్ట మానవజాతిలో ఆ విధంగా సృష్టించవలసిన అవసరం యికనెంత మాత్రం లేనపుడు ప్రకృతి వ్యాపారాలలో అది మనుగడ సాగించడానికి కారణం అసలుండదు. కాబట్టి జీవనానందంతో సంబంధంలోనికి ప్రవేశించే సామర్థ్యం ఒక మెట్టు పైకి ఉద్ధరించ బడుతుంది. లేక భిన్నరీతిలో మొలకెత్తుతుంది. లైంగిక ప్రేరణల వ్యతిరేకత దశను దాటిపోయిన వారిలో జంతు స్వభావం యే మాత్రం వుండదు గనుక వారి విషయంలో ప్రాచీన ఆధ్యాత్మిక ఆకాంక్షలు అభిప్రాయ పడ్డట్లుగా లైంగిక సంబంధ వ్యతిరేకత సహజంగానే ఏ ప్రయత్నం లేకుండా ఏ పెనుగులాట లేకుండా రాలిపోవాలి. సంఘర్షణకు కేంద్రంగా దానిని తయారుచేయడం హాస్యాస్పదం. చేతన, మానవ చేతన గాకుండా ఉన్నతమైనపుడే చాలా సహజంగా అది రాలిపోతుంది. ఇక్కడ కూడా ఒక మార్పు జరగాలి. అది ఎంతో కొంత కష్టమైనది కావచ్చు. ఎందుచేతనంటే మార్పు చెందుతున్న అస్తిత్వాలెప్పుడూ ఒక అస్థిర సమతుల్యతలో వుంటాయి, కాని స్వయంగా అతనిలో ఒక విధమైన జ్వాల వుంటుంది. అది బాధాకరమైనది గాకుండా చేసే ఒక అవసరం కూడా వుంది. అది బాధాకరమైంది కాదు, చిరునవ్వుతో చేయగలిగిన దేదో అది. ఈ మార్పుకు సిద్ధంగా లేని వారి మీద దానిని రుద్దాలనుకోవడం పొసగని విషయం.

అది లౌకిక జ్ఞానం, వాళ్ళు మనుషులు, కాని అలా కానట్లు వాళ్ళు నటించ గూడదు. నీకు ఆ ప్రేరణ అప్పటికప్పుడు అసాధ్యమైన విషయంగా తయారైనపుడు మాత్రమే, అదేదో బాధ కలిగించేది అని నీ కన్పించినప్పుడు నీ లోతైన అవసరానికది విరుద్ధమైనదని అనిపించినపుడు, అది నీకు తెలికొతుంది. సరే, అపుడు బాహ్యంగా యీ బంధాలను కత్తిరించి వెయ్యి, దాని పని అయిపోతుంది.

CWM 11: 27-28

శ్రీమాత

ఊర్ధ్వ రూపాంతర పరివర్తన

వ్యక్తిలోపలవున్న క్రియాశక్తిని వృద్ధిచేసి, దానిని కలిగివున్న వానికి లేక మానవాళికి ప్రయోజనం కలిగించే వాటికై ఉపయోగపడే విధంగా మరల్చడానికి

ప్రప్రథమంగా అవసరమైనది బ్రహ్మచర్యం. సమస్త మానవ ఊర్జానికి ఒక భౌతిక ఆధారం వుంది......

భౌతికాన్ని ఆధ్యాత్మికానికి ఉద్ధరించడానికి బ్రహ్మచర్యం తప్పదు. ఎందుక నంటే ఆ రెండింటి కలయిక వల్ల ఒకదానినుండి ఆరంభమై రెండోదానిని ఉత్పత్తి చేసే ఊర్జం తనను తాను వృద్ధి చేసుకొని సఫలం చేసుకొంటుంది.

ఇది తాత్త్విక సిద్ధాంతం. దాని అన్వయం ఊర్జాన్ని స్వీకరించే మానవ పాత్రకు సంబంధించిన భౌతిక మరియు మనో వైజ్ఞానిక అనుసరణ యొక్క సరైన అవగాహన మీద ఆధారపడి వుంటుంది. ప్రాథమిక భౌతిక వస్తువు రేతస్సు, అందులో మనిషిలోని ఊష్ణం, వెలుగు, విద్యుత్తు అయిన తేజస్సు యిమిడి, దాగి వున్నాయి. సమస్త ఊర్జం, రేతస్సులో అంతర్నిహితంగా వుంది. ఈ ఊర్జాన్ని భౌతికంగా ఖర్చు చేయనూ వచ్చు లేక నిలువ ఉంచుకోనూ వచ్చు. సమస్త గాఢావేశం, తృష్ణ, కోరిక ఊర్జాన్ని మొరటు రూపంలోనో, లేక ఒక పరి శుద్ధ సూక్ష్మ రూపంలోనో దేహంనుండి దానిని బయటకు గ్రుమ్మరిస్తాయి లేక వ్యర్థం చేస్తాయి. చర్యలో అనైతికత మొరటు రూపంలోనూ, భావ అనైతికత సూక్ష్మ రూపంలోనూ దానిని బయటకు నెట్టి వేస్తాయి. రెండు సందర్భాలలోనూ వృధా అనేది ఉంది. మనస్సు, వాక్కు, మరియు దేహ సంబంధమైన అపవిత్రత వుంది. అందుకు విరుద్ధంగా సమస్త ఆత్మ-నియంత్రణ ఊర్జాన్ని రేతస్సులో భద్రపరుస్తుంది. భద్రత ఎప్పుడూ తనతోపాటు వృద్ధిని కూడా తీసుకొస్తుంది. కాని భౌతిక దేహావసరాలు పరిమితమైనవి — ఊర్జం అవసరానికి మించి ఉన్న ప్పుడు అది భౌతికం కాని మరేదైనా ప్రయోజనానికి తానుగా మరలుతుంది. ప్రాచీన సిద్ధాంతం ప్రకారం రేతస్సు, వెలుగు, ఉష్ణం, విద్యుత్తు నిండిన ఒక్క మాటలో జలము, అధిక రేతస్సు మొత్తం వ్యవస్థను ఉత్తేజింప జేసే అగ్నిగా లేక తపస్సుగా మారుతుంది. ఈ కారణం చేతనే ఆత్మ నియంత్రణ నైష్ఠికతకు సంయమనం సంబంధించిన విధానాలన్నీ తపస్సు లేక తపస్య అన్నారు. ఎందుచేతనంటే అవి వేడిని లేక ఉత్తేజాన్ని పుట్టిస్తాయి. ఇవి శక్తివంతమైన కర్మకు, విజయానికి మూలం. రెండవ దశలో అసలు తేజస్సుగా — వెలుగును సమస్త జ్ఞానానికి మూలం ఊర్జంగా మారుతుంది. మూడవదశలో అది విద్యుత్తుగా మారు తుంది. ఇది భౌద్ధికమైన లేక భౌతికమైన సమస్త శక్తివంతమైన కర్మకు ఆధారం.

మళ్ళీ విద్యుత్తులో ఈథర్ నుండి వెలువడే ఓజస్సు లేక ప్రాణశక్తి ఆపరిశుద్ధ మౌతూ తపస్సుకు తేజస్సుకు, విద్యుత్ మరియు శక్తి, ఆది ఊర్జం యిమిడి వుంది. జలం నుండి పరిశుద్ధమౌతూ తపస్సుకు, తేజస్సుకు విద్యుత్‌కు మరియు విద్యుత్ నుండి ఓజస్సుకు మారి దైహిక వ్యవస్థలో భౌతికశక్తి, ఊర్జం బౌద్ధికంగా నింపి వేస్తుంది. దాని చివరి రూపమైన ఓజస్సు మస్తిష్కంలోని కెగసి దానికీ, మూలాధారంలో వున్న ఊర్జానికీ సంపర్కం కలిగిస్తుంది. ఈ మూలాధారం ఊర్జం అత్యంత పరిశుద్ధమైన పదార్థ రూపం, ఇది ఆధ్యాత్మికతలకు అత్యంత దగ్గరగా వుంటుంది. ఆధ్యాత్మిక శక్తిని, వీర్యాన్ని సృజించేది ఓజస్సు. దానివల్ల మనిషి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక ప్రేమను, విశ్వాసాన్ని, ఆధ్యాత్మిక బలాన్ని పొందుతాడు. మనం బ్రహ్మచర్యానుష్టానం వల్ల తపస్సును, తేజస్సును, విద్యుత్తును, ఓజస్సు నిలువను యెంత ఎక్కువగా పెంచుకోగలిగితే అంత ఎక్కువగా మనం మన దేహ, హృదయ, మనస్సు, ఆద్యాత్మిక కర్మలకు సంపూర్ణ ఊర్జంతో నింపివేసుకుంటాం.

CWSA 1: 372-73

లైంగిక ఊర్జాలను పురోగతి ఊర్జంలోనికి మార్చడం

ప్ర: పాఠ్యపుస్తకంలోని ఈ అంశం నాకు అర్థంకాలేదు, "కాబట్టి పురోగతికై కాంక్షించే వారందరికీ వున్న నియమం యేమిటంటే 'సంయమనం' కాని ముఖ్యంగా అతిమానస అభివ్యక్తికై తమను తాము సంసిద్ధం చేసుకోగోరే వారందరికీ వత్తిడి వల్ల , అణచివేత వల్ల సాధించబడిన సంయమన స్థానంలో ఒక విధమైన ఆంతరంగిక సమూల మార్పువల్ల సాధించబడిన ఒక సంపూర్ణ నిషేదం నెలకొల్పబడాలి. తత్ఫలితంగా మామూలుగా, సంతానోత్పత్తి కార్యంలో వినియోగించే ఊర్జాలు పురోగతికి, సమగ్ర రూపాంతరీకరణకు ఉపయోగపడే ఊర్జాలుగా మార్పు చెందుతాయి."

స: భారతదేశంలోని యౌగిక శిక్షణా విధానాల్లో ఇది బాగా తెలిసిన విషయమే. వ్యక్తి తన ఊర్జాలను తాను తెలుసుకొని ప్రారంభించిపుడు వాటిని నియంత్రించ నారంభించ గలుగుతాడు. ఎచట ఊర్జాలు కేంద్రీకృతమై వుంటాయో ఆ విభిన్న కేంద్రాల గురించి నీకు తెలియదా? సాధారణంగా అయిదు కేంద్రాలున్నాయని

చెప్తారు. కాని యదార్థ సంఖ్య యేడు లేక పన్నెండు కూడా. ఏదైతే నేం, ఇవి ఊర్జాలు పోగుపడి వున్న కేంద్రాలు. ఈ ఊర్జాలు కొన్ని వ్యాపారాలను నియంత్రిస్తాయి. ఆ విధంగా లైంగిక శక్తి కేంద్రంలో గూడ ఊర్జం చేరివుంటుంది. ఆ ఊర్జం చాలా పెద్ద ఎత్తున నిలువ ఉంటుంది. ఆ ఊర్జాలమీద నియంత్రణ కలిగినవారు, వాటిపై ఆధిపత్యం వహించి వాటిని ఉద్ధరించడంలో సఫలురవుతారు. వాటిని యిక్కడ వుంచుతారు. (శ్రీమాత హృదయ కేంద్రాన్ని చూపిస్తారు.) ఇచట పురోగతి ఊర్జాల కేంద్రం వుంది. అగ్ని కొలువుండే చోటు అని కూడా అంటారు. ఇచటుండేవి పురోగతి ఊర్జాలు, పురోగతి ఇచ్ఛ, కనుక లైంగిక కేంద్రంలో కేంద్రీకృతమైన ఊర్జాలను పైకిలాగి యిక్కడుంచుతారు. అవి చెప్పుకోదగినంతగా వృద్ధి అవుతాయి. అందువల్ల లైంగిక కేంద్రం పూర్తిగా ప్రశాంతంగా, అలజడి లేకుండా నిశ్చల మవుతుంది.

ఈ ఊర్జాలను నియంత్రించడానికి మామూలుగా చేసేది మూలాధారంలో వున్న కుండలిని "చుట్టలు వీడి" లేచేటట్లు చేసి ఊర్జాలను వెన్నుబాము ద్వారా వేర్వేరు కేంద్రాలకు ఎదుగునట్లు చేసి, ఆ కేంద్రాలను జాగృతం చేస్తూ, వాటిని తెరచి, ఒకదాని తర్వాత మరొకటిగా శిరస్సు పైవున్న సహస్రారం వరకూ తీసుకుపోయి అచటి నుండి పైకి, బయటకు పోయేటట్లు ఉద్ధరిస్తారు. ఇలా చేయడంలో సఫలుడైతే (ఇది మొదటి అభ్యాసం) కుండలినీ చుట్టలు విప్పుకొనేటట్లు చేసి

లైంగిక ఊర్జరూపాంతరీకరణ

(వీర్య ఊర్జాన్ని ఓజస్సుగా మార్చడం) అనేదాన్ని ఒక ప్రక్రియ ననుసరించి చేయాలి. అది తపస్సుకై మనోవాక్కాయ కర్మలను తనకు తానుగా నియం త్రించు కోవడంతో దివ్యఇచ్ఛ ద్వారా వీర్య ఊర్జాన్ని పైకి లాగడం వల్ల జరగాలి. కాని దివ్య క్రియాశక్తి అవతరించి అది లైంగికశక్తి కేంద్రంమీద పనిచేయడంవల్ల తత్ఫలితంగా యీ యోగంలో యితర విషయాలన్నింటి లాగానే కలిగే రూపాంతరీకరణ వలన బాగా జరుగుతుంది.

CWSA 31: 508 — శ్రీఅరవిందులు

తరువాత దాని మీద ఆధిపత్యం వహించి అన్ని కేంద్రాలకు వెళ్ళేటట్లు చేసి ఈ కేంద్రాలన్నీ మేలుకొన మార్గనిర్దేశం చేస్తూ అభివృద్ధి చేస్తాడు. ఒకసారి పనిపై సర్వాధికారత సంపాదించ గలిగితే, ఎక్కడ ఊర్జాల అవసరం లేదో అక్కడ వాటిని విడువకుండా వాటిని పైకి లాగి, అవెక్కడ వుపయోగ పడ్తాయో అచటకు వాటికి చేరుస్తాడు. ఈ విధంగా వాటిని పురోగతికి, రూపాంతరీకరణకు వినియోగిస్తాడు.

ఇదంతా జ్ఞానోదయంతో, పట్టుదలతో, ఎంతో ఓర్పుతో కూడిన అభ్యాసం.ఏదో విషయాలను ఆలోచిస్తూ, లేక ఆషామాషీగా చేసే పనికాదు ఇది. ఇవి శిక్షణ పద్ధతులు, సహజంగానే ఒక్కసారి ఆ పనిపై నైపుణ్యత సాధించినట్లయితే, అది చాలా ఆసక్తిదాయక మవుతుంది. కానీ అవసరమైనవి చేయకుండా, చిటికలో ఈ పని చేయ వీలుపడదు.

CWM 6: 76-77

శ్రీమాత

అనువాదం: కె.వి. రావు

బ్రహ్మ చర్యాచరణ

నిగ్రహం - సమ్యమం

నిగ్రహం, సమ్యమం మధ్య భేదం, మొదటి పద్ధతిలో దాన్ని అణచివేయడానికి ప్రచండమైన పోరాటం, నిర్బంధంతో, సాధ్యమైతే, ఆ ధోరణిని చితకకొట్టి వేయాలని అనుకోవడం జరుగుతుంది, దాని వాస్తవికతను ప్రశ్నించటం జరుగదు. కాని రెండవ పద్ధతిలో దానిని మృతమైన దానినిగా లేదా అంతరించిపోయే శక్తిగా తలచటం జరుగుతుంది. తరువాత ఏవగింపు, అసహనంతో, చిట్టచివరిగా కేవలం ఒక పిశాచం లాగ, క్షయించిపోయే దానిలాగా లేదా డీలా పడిపోయిన ప్రతిధ్వని లాగా దానికి ఉదాసీనత వహించుతూ, ఒకప్పుడు వాస్తవమే కాని ఇప్పుడు ప్రాధాన్యం కోల్పోయి వట్టిపోయిన దానినిగా తలచడం జరుగుతుంది. ఇటువంటి అవాంఛితమై, అదృశ్యమై పోయేటటువంటి గుణం మొత్తంగా వదిలించుకోవడానికి ఆవిధంగా అది పురావృత్తి కావటం మహా ప్రకృతి విధానంలో భాగం.

ఆ శక్తి, లక్షణం లేదా ధోరణి శైశవ స్థితిలో గాని, లేదా ఉద్ధతిలో గాని ఉన్నా, దాని అర్హతకు తగిన భోగానికి, పూర్తి కార్యాచరణకు ముందే సమ్యమం

చేయబూనితే అది అకాలమై, నిరర్థకమై పోతుంది. ఒకటి ఏదైనా పుట్టడం జరిగితే అది తప్పక తన యవ్వనాన్ని, వృద్ధిని, భోగాన్ని, జీవితాన్ని చివరికి క్షయాన్ని, మృత్యువును పొంది తీరాలి. సృష్టిలో ఒకసారి గనక మహాప్రకృతి ఒక ప్రేరణను ఇవ్వడం జరిగితే అది అంతరించి పోయే లోపల దాని చలన వేగం సహజ పద్ధతిలో దానికదే ఖర్చయిపోయే విధంగా ఆమె ఒత్తిడి చేస్తుంది. బలవంతంగా దాని వృద్ధిని లేదా అకాలంగా దాని వేగాన్ని ఆపేయడం అనేది నిగ్రహం, అది కొంత సమయం సమర్థవంతంగా ఉంటుంది, కాని యెల్లకాలం కాదు. గీతలో ఈ విధంగా చెప్పబడింది. విషయాలు వాటి ప్రకృతివలన పరిపాలింప బడతాయి. వాటి ప్రకృతికి అవి తిరిగి వెళ్ళిపోతాయి. నిగ్రహం, అణగద్రొక్కడం నిరర్థకం. అకాలంగా, దౌర్జన్యంగా నిహితం చేయబడింది వాస్తవంలో మరణించదు, కాని కొంతకాలం వరకు ఏ మహాప్రకృతి అయితే దానిని పంపిందో అందులోకి ఉపసంహరించుకొని, అపారమైన శక్తిని కూడగట్టుకుని, అసాధారణ ఉగ్రరూపంలో హక్కుగా భోగించడానికై ఆత్రంగా తిరిగి వస్తుంది. యోగమార్గానుసరణ ప్రాథమిక దశలో మనకు సంస్కారాలను, సాంగత్యాలను వదిలించుకొనుటకు మనం చేసే ప్రయత్నాలలో ఇది కనబడుతుంది. కోపం మన ప్రకృతిలో చాలా శక్తివంతమైన విషయం అయ్యుంటే, కేవలం శక్తి నుపయోగించి కొంతసమయం దానిని త్రొక్కిపట్టి ఉంచవచ్చు. దానిని మనం ఆత్మ-నిగ్రహం అంటాం, కాని చివరకు అసంతృప్తి చెందిన మహాప్రకృతి పరిస్థితులను ఆసరాగా చేసుకొని మనల్ని అధికతరమైన శక్తితో కైవసం చేసుకొని, తీవ్రమైన వాంఛతో మన మీద ఆశ్చర్యం గొలిపే శక్తితో ఒక ఆకస్మిక క్షణంలో మనమీద విరుచుకు పడుతుంది.

CWSA 13: 33- 34

తీవ్రవాంఛా బానిసత్వం పీడను వదిలించు కోవడానికి రెండు మార్గాలు

మనల్ని బానిసలు గావించటానికి చూసే తీవ్రవాంఛను సమర్థవంతంగా అధికతర శక్తితో కైవసం చేసుకోవడానికి రెండుమార్గాలున్నాయి. ఒకటి, దానికి బదులుగా దాని స్థానంలో మరొకదానిని ప్రత్యామ్నాయంగా ఉంచటం, అది ఎప్పుడెప్పుడు పైకి విజృంభించినా వ్యతిరేక లక్షణంతో భర్తీ చేయడం, కోపాన్ని

క్షమాగుణం, ఆలోచనలతో, ప్రేమతో, ఓరిమితో, మాట్లాడకుండా ఉండటంతో, కామోద్రేకాన్ని పవిత్రతమీద ధ్యానంతో, గర్వాన్ని వినమ్రతతో, స్వయం మన లోని దోషాలతో లేదా అభావంతో. ఇది రాజయోగ పద్ధతి, కాని ఇది నెమ్మదిగా సాగే, కష్టంతో కూడుకొన్న అనిశ్చిత పద్ధతి, ఎందువల్లనంటే, ప్రాచీన సాంప్రదాయాలు, ఆదునిక యోగానుభవము రెండూ చూపిస్తున్న విషయం, ఏ మనుషులైతే ఎన్నో ఏళ్ళుగా అత్యున్నతమైన ఆత్మ-ఆధిపత్యం సాధించారో వారు తాము మృతి చెందిందని లేదా ఎప్పటికీ అధీనమైయున్నదని తలచిన దాని యొక్క ప్రచండమైన పునరాగమనానికి హఠాత్తుగా ఆశ్చర్యానికి లోనయ్యారు. అయినప్పటికీ, ఈ ప్రత్యామ్నాయం, చాలా నెమ్మదైనప్పటికీ మహాప్రకృతి యొక్క అత్యంత సర్వసామాన్యమైన పద్ధతులలో ఒకటి. మనిషి స్వభావం జన్మల పరంపరలో లేదా ఒక జీవితకాలంలోని పరిమితులలో మార్పును, అభివృద్ధిని సాధించ టానికి తరచు ఎరుక లేకుండాను లేదా సగం ఎరుకతోను చాలావరకు ఈ పద్ధతులే వినియోగించ బడ్డాయి. అది వాటిని వాటి బీజరూపంలో నాశనం చేయదు. యోగసాధన ద్వారా భస్మంకాని బీజం ఎల్లప్పుడూ తిరిగి మొలకెత్తే సామర్థ్యాన్ని కలిగి యుండి, పూర్తిగా బ్రహ్మాండమైన వృక్షంగా వృద్ధి చెందుతుంది. తొందరగా వదిలించు కోవడానికి దానికి భోగాన్ని లేదా తీవ్రవాంఛకు సంతోషాన్ని ఇవ్వడం రెండవ పద్ధతి. అది సంతృప్తి పడి, మితిమీరిన సంతోషంతో వెగటు పొందితే, అది బలహీనమై, ఖర్చయిపోగా దాని ప్రతిక్రియా పరిణామం కొంత సమయం వ్యతిరేకమైన శక్తినీ, ధోరణినీ లేదా లక్షణాన్ని నెలకొల్పుతుంది. నిగ్రహించడానికి యోగి స్వాధీనం చేసుకొంటే, ఆ విధంగా ప్రతి ఉచితమైన సదవకాశంలో మళ్ళీ మళ్ళీ చేయబడిన నిగ్రహం చిట్టచివరకు సమ్యమమును అనువర్తింపజేయడానికి ఆ వృత్తి యొక్క బలాన్ని, జీవశక్తినీ తగ్గించి వేసేటంతగా సమర్థవంతమైన దవుతుంది. ఇటువంటి సంతోషం మరియు ప్రతిక్రియలను పొందే పద్ధతి కూడా మహాప్రకృతియొక్క ఒక ఇష్టమైనటువంటి సార్వజనీన పద్ధతియే, కాని అది ఎప్పుడూ దానికదే పూర్తి కానేరదు, ఒకవేళ దీనిని శాశ్వతమైన శక్తులకు లేదా లక్షణాలకు అనువర్తించితే అది వ్యతిరేక ధోరణులు కిందు మీదయే డోలాయమాన పరిస్థితి ఏర్పడడానికి మొగ్గుచూపుతుంది, మహాప్రకృతి ప్రక్రియలకు అత్యంత ఉపయోగకారి అవుతుంది, కాని, తనమీద

తాను స్వాధిపత్యాన్ని నెలకొల్పుకొనే దృక్పథం ప్రకారం చూస్తే, అది నిరుపయోగం, అనిశ్చితం. ఇది కేవలం సమ్యమంతో ఉపయోగించి అనుసరించితే మాత్రమే సమర్థవంతమైన దవుతుంది. వృత్తిని కేవలం యోగి మహాప్రకృతి క్రీడగా తలుస్తాడు, దానితో అతనికి ఎటువంటి అనుబంధం లేదు, దావి కతడు కేవలం వీక్షకుడు మాత్రమే. కోపం, వాంఛ లేదా గర్వం అతనివి కాదు, అవి సార్వజనీన జగజ్జననివి, ఆమె తన సొంత ఉద్దేశాల కనుగుణంగా ఆ పనిని కొనసాగిస్తుంది, దానిని నిశ్చలమూ చేస్తుంది. అయినప్ప టికీ వృత్తి చాలా బలంగా ఉన్నప్పుడు, నియంతలాగా పరిపాలిస్తూ, ఖర్చుకాన ప్పుడు, ఈ వైఖరిని చిత్త శుద్ధితో కొనసాగించ వీలుపడదు. అది మిథ్యాచారంగా, నమ్మదగని నియమావళిగా లేదా దంభాచారంగా చిత్తశుద్ధితో అనుభూతి చెంద కుండా దానిని మేధోపరంగా పట్టి ఉంచే ప్రయత్నం జరుగుతుంది. కేవలం అది ఎంతో కొంత పునరావృతమయ్యే ఆనంద, పీడనాల ద్వారా పూర్తిగా వినియోగించ బడితే మాత్రమే దివ్యప్రకృతి లేదా మహాప్రకృతి ఆత్మ లేదా దివ్యపురుషుని ఆజ్ఞమేరకు తన సొంత సృష్టితో వాస్తవరీతిలో ప్రవర్తించగలదు. దానితో మొదట ఆమె వైరాగ్యంతో, మొరటు పద్ధతిలో, ఏవగింపు రూపంలో, ప్రవర్తింపజేస్తుంది, కాని ఇదికూడా శాశ్వతంగా ఉండలేని ఉగ్రమైనటువంటి అనుభూతి; అయినప్పటికీ అది దాని కారణాన్ని లేకుండా చేసుకోవడానికి గాఢంగా పాతుకుపోయిన కోరిక యొక్క గుర్తును వదలి వెళ్తుంది. అది వాంఛయొక్క పునరాగమనం, దాని తాత్కాలిక ఏలుబడి పునరావృతంమయ్యే వరకు నిలిచి వుటుంది. తదనంతరం అది తిరిగి రావటాన్ని ఆతురతతో చూడటం జరుగుతుంది. అయినా ఎటువంటి తీవ్రానుభూతితో కూడిన అసహనం అనేది లేకుండా చూడటం అవుతుంది. చిట్టచివ రికి పరమోత్కృష్ట తాటస్థ్యం, లేదా ఉదాసీనత తటస్తిస్తాయి. చిట్టచివరిగా మహా ప్రకృతి సర్వసాధారణ ప్రక్రియద్వారా ధోరణినుంచి బయటకు వెళ్ళిపోవడాన్ని ఎవరికైతే తాను సాక్షిగా దర్శించే ఆత్మనని, తనను తాను కేవలం ఒక ప్రక్రియ అంతమైపోవడానికి వేరైపోవాలనే జ్ఞానం ఉంటుందో, వారు అటువంటి సమ్యమికి ఉండేటటువంటి అసలైన స్ఫూర్తిలో చూడటం జరుగుతుంది.

CWSA 13: 33- 34

అటువంటి ప్రేరణ ఒకటి కలిగినప్పుడు (స్త్రీలవైపు ఆకర్షణ) సర్వసాధారణంగా దానికి సరైన కారణమే ఉంది. అది భౌతిక చైతన్యంలో ఏదో ఒక దానితో వ్యవహరించ వలసిన అగత్యం. తలక్రిందులై, నిరుత్సాహ బడే బదులు, ఒకరు ఈ దృక్కోణంనుంచి దానిని పరిశీలించి, ఏం చేయాలో తెలుసుకోవాలి.

ఈ విధంగా అధైర్యపడటం వలన ఏ ఉపయోగమూ లేదు. ఎందువల్లనంటే విషయాలు పునరావృత మవుతూనే వుంటాయి. ఎల్లప్పుడూ అవి అదే పని చేస్తుంటాయి. మనం చేపట్టినటువంటి పరివర్తన లాంటి దానిలో గమనాలను చివరిసారిగా వదిలించు కోవడమనేది ఉండదు. అవి స్వభావం లోని ఒక స్థాయి నుంచి మరొక స్థాయికి కిందికి వెళ్తాయి. ఒకరు దానిని కేవలం భౌతికం నుంచీ, అధోచేతన నుంచీ బయటకు పంపించి వేసినప్పుడు మాత్రమే, అప్పుడు వారు, "ఇప్పుడది చెయ్యబడింది." అని చెప్పగలరు. ఈ పునరావృత్తాలను ఓటమికి ఋజువులుగా అనుకొంటే ఓటమి పొందలేదని చెప్పటానికి ఆశ్రమంలో కొద్దిమంది కూడా మిగలరు. ఏదో ఒక లైంగిక ఇబ్బందిని అధిగమించిన వారు ఇద్దరు లేక ముగ్గురికంటే ఎక్కువమంది ఉంటారని నేననుకోను; ఇక్కడివారు చెప్తున్నట్లుగా "శ్రేష్టమైన స్థితిని పొందాము." అనే వారిలోనూ అది ఏదో ఒక రూపంలో మిగిలే ఉంటుంది. దానికి కారణం కామం మనిషి ప్రకృతిలోని అత్యంత బలీయమైన విషయాలలో ఒకటి. ఒకరు దానిని అధోచేతన నుంచి బయటకు పంపించితే తప్ప దానిని అదిగమించలేరు. అటువంటప్పుడు నీ ఒక్కడి విషయమే అసదృశమైనదని ఎందుకు అనుకుంటావు లేదా దాని మీదనే నీ వ్యక్తిగత అసాధ్యతను లేదా అర్హత లేదనే భావాన్ని ఎందుకు ఏర్పరచుకుంటావు? తలపెట్టిన కార్యం విరమించి వేయాలనే భావన వల్ల ఏ ప్రయోజనం లేదు. నీవు విరమించలేవు. కాబట్టి కేవలం చేయవలసిన పని నిన్ను నీవు సంభాళించుకోవడం, ఈ విషయాల వంక ఏ సంబంధం లేకుండా నిర్లిప్తంగా చూడటం, రాబోయే ఆత్మ సాక్షాత్కారానికి ముందుకు సాగిపోవడం.

CWSA 31: 497

శ్రీఅరవిందులు

లైంగిక కష్టానికి సంబంధించి ఉండవలసినటువంటి సరి అయిన వైఖరి

ఇక నీ ఇతర విషయం గురించి — దాని మీద ఉండవలసిన సరిఅయిన వైఖరి లైంగిక బలహీనత గురించే ఎల్లప్పుడూ దిగులు పడకుండా, దాని ప్రాముఖ్యతనే అంతులేకుండా ఆలోచిస్తూ, ఫలితంగా దానితో నిరంతర సంఘర్షణకు క్రుంగుబాటుకు లోనుకాకుండా ఉండడమేకాకుండా, అది వృద్ధి పొందటానికి ఒప్పుకుంటూ నిర్లక్ష్యంగా ఉండటమూ కూడదు. పూర్తిగా వదిలించుకోవటంలో బహుశా అది అన్నింటికంటే అత్యంత కష్టమైనది. ఒకరు దాని ప్రాముఖ్యతను, ఇబ్బందిని ప్రశాంత చిత్తంతో గుర్తించి, ప్రశాంతంగా, నిలకడగా దాని నియంత్రణ దిశగా సాగిపోవాలి. కొన్ని అల్పలక్షణాలు గల ప్రతిక్రియలు, ఏమైనా మిగిలుంటే, వాటిని గురించి కలవరం చెందవలసిన అవసరంలేదు. వాటి సాధనను అస్థిర పరచే విధంగా అధికమయ్యేందుకు మాత్రం అనుమతించకూడదు. లేదా మానసిక మరి యు ఉన్నతోన్నత ప్రాణిక అస్తిత్వం యొక్క నిగ్రహించ గల సంకల్ప బలాన్ని అధిగమించనీయ కూడదు.

*

కామాన్ని అణగద్రొక్కడానికి, ఎక్కువగా దాని గురించి ఆలోచించడం కూడా విషయాన్ని ఇంకా జటిలం చేస్తుంది. నీవు ఎక్కువగా గుణాత్మకమైన అనుభవానికి ఉన్మీలన మవాలి. కాలమంతా నిమ్న ప్రాణికంతో సంఘర్షణలో గడపటం అనేది చాలా నెమ్మదైన పద్ధతి.

పరిశుద్ధి చేసే యోగాగ్ని ద్వారా బహిర్గతం కాబడిన రహస్యమైన ప్రేరణలను ముఖాముఖీ ఎదుర్కొనడం

యోగం పరిశుద్ధి చేసేదాని ప్రక్రియలో నీలో రహస్యంగా దాగిఉన్న ప్రేరణలను, కోరికలను, అన్నింటిని పైకి బహిర్గతం కావిస్తుంది. నీవు విషయాలను రహస్యంగా దాచటం గాని, వాటిని ప్రక్కకు పెట్టేయడం గాని తప్పక చేయకూడదు. నీవు వాటిని ముఖాముఖీ ఎదుర్కొని, జయించి, వాటికి క్రొత్త రూపాన్నివ్వాలి. అయినప్పటికీ యోగంయొక్క మొదటి ప్రబావం మానసిక నియంత్రణను తొలగించివేయడం, నిద్రావస్థలో ఉన్న తీవ్రవాంఛలను హఠాత్తుగా స్వతంత్రం గావిం

చడం, అప్పుడవి పైకి తన్నుకువచ్చి, అస్తిత్వాన్ని ముట్టడిస్తాయి. ఈ మానసిక నియంత్రణ దైవ నియంత్రణచే పునః స్థాపితం చేయబడనంతవరకు ఒక సంధి కాలం ఉంటుంది. అందులో నీ చిత్తశుద్ధి, సమర్పణలు పరీక్షకు గురిచేయబడ్తా యి. కామానికి సంబంధించిన ఈ ప్రేరణలకు బలం, సర్వసాధారణంగా జనులు చాలా ఎక్కువగా వాటిని గురించే తలపోయటంలోనే వుంది, వారు చాలా ఉద్రేకంతో వాటిని అడ్డుకొని వాటిని బలాత్కారంగా నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. వాటిని తమ లోలోన అదిమి పెడ్తారు. కాని నీవు ఎంత ఎక్కువగా ఆ విషయం గురించి ఆలోచించి, "నాకది అవసరంలేదు, నాకది అవసరంలేదు" అని అంటావో, నీవు అంత ఎక్కువగా దానికి కట్టుబడతావు. నీవు చేయవలసిందల్లా ఆ విషయాన్ని నీకు దూరంగా ఉంచి, దాని నుంచి వేరైపోయి, ఎంతగా సాధ్యమైతే అంతగా దానిమీద చాలా తక్కువగా దృష్టిని పెడ్తూ, ఒకవేళ దాని గురించి ఆలోచించ వలసి వచ్చినా దానికి ఉదాసీనంగా, పట్టనట్టుగా ఉండటం.

యోగం ఒత్తిడివలన పైకి పొటమరించే ప్రేరణలు, కోరికలను పట్టించు కోకుండా అనాసకత్తతో, నిర్మలత్వంతో, అవేవో నీకు పరాయివిగా లేదా బయటి ప్రపంచానికి చెందిన వాటిగా ముఖాముఖీ ఎదుర్కోవాలి. వాటిని దైవానికి నివే దించాలి, దానివలన దైవం వాటిని చేపట్టి, పరివర్తన గావిస్తాడు.

CWM 3: 5

ఇది ఒక కష్టాన్ని భరించే దానికన్నా చాలా ఎక్కువ కష్టం! ఆ కష్టాన్నుంచి వెను దిరిగి నిలబడటం చాలా ఎక్కువ కష్టం, అదేదో నీకు పట్టని దానిగా నీకు ఆసక్తిదాయ కం కాని దానిగా, నీకు చెందని దానిగా, నీకు చెందకుండా ప్రపంచానికి చెందిన దిగా చూడటం. కాని ఇది చేస్తేనే నీవు సఫలీకృతుడవవ గలుగుతావు. ఇది ఒక రకమైన ఆత్మ విమోచనను, నీ అంతరంగ అస్తిత్వంలో ఒక ప్రగాఢమైన విశ్వా సాన్ని గట్టిగా కోరుతుంది. నీవు సరి అయిన వైఖరిని తీసుకొన్నట్లైతే, అత్యుత్తమ మైనదే నీ విషయంలో జరుగుతుందని నీవు తప్పక విశ్వసించాలి. కాని నీకు అయిష్టమైన దేదైనా నీలో జరిగినప్పుడు నీవు భయడపడితే, నీవు ఏమీ చేయలేవు. నీలో తప్పక ఈ ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. ఎటువంటి కష్టమైనా, ఎటువంటి ఆటంకమైనా ఎదురైనప్పుడు, చాలా సమయాల్లో అయిష్టమైన దేదైనా జరిగినప్పుడు, "ఇది ఇంకా అధికమౌతుందా? ఇంకా ఏ ప్రమాదం జరగబో

తోంది!" అంటూ, ఇంకాఇంకా ఏదేదో అంటూ ఉంటావు. నీకు నీవు ఈ విధంగా తప్పక చెప్పుకోవాలి, "ఈ విషయాలు నాకు సంబంధించినవికావు. అవి అధో చేతనా ప్రపంచానికి చెందినవి; సహజంగానే వాటికీ నాకూ ఏ సంబంధమూలేదు. అవి తిరిగి మళ్ళీ నన్ను వశపరచు కోవాలని వస్తే, నేను వాటితో పోరాడతాను." సహజంగానే నీవిచ్చే సమాధానం, ఇది తేలికగానే చెప్పగలనని, కాని ఆచరించడం అతి కష్టం. కాని నీవు నిజంగా ప్రగాఢ విశ్వాసంతో కూడిన వైఖరిని తీసుకుంటే, నీవు గెలవ లేనటువంటి అసాధ్యమైన ఎటువంటి కష్టమూ ఏదీ ఉండదు. ఆందోళన కష్టాన్ని అధికతరం చేస్తుంది.

CWM 4: 73

వేరుగా ఉండటం, తిరస్కరించడం ద్వారా ఆధిపత్యం

లైంగిక ప్రేరణా విషయంలో దానినేదో పాపకర్మగా, భయంకర మైనదిగా తలచవద్దు. అదే సమయంలో దానిని ఆకర్షణీయ మైనదిగానూ తలచవద్దు, బదులుగా దానిని ఒక పొరపాటుగా, నిమ్నతర ప్రకృతియొక్క తప్పు గమనంగా పరిగణించు. దానితో సంఘర్షణకు తలపడకుండా పూర్తిగా తిరస్కరించు, కాని దాని నుంచి ఉపసంహరించుకుని, నిన్ను నీవు దానినుంచి వేరుచేసుకొని దానికి అనుమతిని తిరస్కరించుతూ, దానిని ఏదో నీకు సొంతంకాని దానినిగా చూడు, కాని మహాప్రకృతి శక్తివలన బయటనుండి నీమీద బలవంతంగా రుద్దబడినదిగా భావించు, బలవంతంగా రుద్దబడిన దానికి మొత్తం అనుమతిని నిరాకరించు. నీ ప్రాణికంలో ఏదైనా ఒప్పుకుంటే గనక, ఆ భాగం అనుమతిని ఉపసంహరించునట్లుగా ఒత్తిడి తీసుకురా. నీ ఉపసంహరణలో, నిరాకరణలో సహాయానికై దైవశక్తిని పిలు. ఇది నీవు ప్రశాంతంగా, దృఢసంకల్పంతో, ఓర్పుతో చేస్తే, ఆఖరున బాహ్య మహాప్రకృతి అలవాటుకు వ్యతిరేకంగా నీ అంతరంగ ఇచ్ఛ ప్రాబల్యాన్ని పొందుతుంది.

*

మొదటి అడుగు దాని (లైంగిక గమనం) ఎరుకను పొందడం, కాని అది ఒక్కటే చాలదు; ఏ క్షణాన కోరిక, తీవ్ర వాంఛ రేకెత్తుతాయో వాటిని తిరస్కరించే యాంత్రిక శక్తి ఒకటి అక్కడ తప్పక రావాలి, ఫలితంగా మనస్సు నుండి లేదా

ప్రాణికంనుండి లేదా ఎక్కడెక్కడ అది స్పృశించినా అక్కడి నుంచి అది వెనక్కి తిరోగమిస్తుంది. ఇది గట్టి తిరస్కార ఇచ్ఛతో, చైతన్యం మీద తన చర్య అలవాటుగా మారడంతోను లేక కార్యకారి అయిన పరిశుద్ధ పరచే ఆదిపత్యశక్తి ద్వారా వేరుపడిపోయిన అంతరంగ అస్తిత్వం స్వయంచాలకంగా క్రియాశీలమైన శక్తిని తనకు తాను అభివృద్ధి చేసుకోవడంతోను లేక చిట్టచివరగా, సంపూర్ణంగా బయటకు వచ్చిన చైత్యం దాని మనోప్రాణ శరీరాల ప్రభుత్వంతోను వస్తుంది. చివరిది, అత్యంత వేగవంతమైన తేలికైన పద్ధతి. అప్పటి వరకు ఈ విషయాలు పునరావృతమవుతూనే ఉంటాయి. కాని బహుశా నీలో ఇంకా ఒక విధమైన పాపం లేదా అపరాధమనే పాతభావన ఉండి, నిన్ను బాధానుభూతికి లోను కావిస్తోంది. దీనిని నీవు ఆవశ్యం స్వభావంలో ఒక సర్దుబాటు జరుగుతున్నదని, ఆ క్రమంలో పాత గమనాలు నీవు ఇంక ఎంతమాత్రమూ నీవిగా ఆమోదించనివి అలవాటుగా తిరిగి వస్తున్నవని, అస్తిత్వంలో ఏదో ఒక భాగంనుంచి అలవాటైన ఒక ప్రత్యుత్తరం వస్తున్నదని గ్రహించాలి. కాని అస్తిత్వం యొక్క ఆ భాగం దానిని తిరస్కరించేటట్లు చేయగలిగితే అప్పుడు ప్రతిస్పందన క్రమంగా అంతరించి పోవడం మొదలవుతుంది. నిన్ను నీవుగా గాని లేదా నీమనస్సును గాని పునరావృతాలతో బాధపడడానికి గాని ఆమోదించకూడదు. ఎందువల్లనంటే, అది కేవలం నిరోధపు ఆధిపత్య శక్తిని బలహీనపరుస్తుంది. ఈ విషయాలనుంచి నీకు నీవుగా ప్రశాంతంగా వేరైపోవడం జరగాలి. అప్పుడు, వైరైపోయిన అంతరంగ అస్తిత్వం ఇంకా ఎక్కువ తేలికగా క్రియాశీలమై, వాటిని ప్రాణిక ప్రకృతినుంచి సమర్థంగా తిరస్కరించ గలదు.

CWSA 31:508-09

ప్రాణాయామం, ఆసనాల లాంటి ఇతర భౌతిక అభ్యాసాలు లైంగిక కోరికను తప్పనిసరిగా కూకటివ్రేళ్ళతో సహా పెకిలించి వేయలేవు — ఒక్కొక్కప్పుడు శరీరంలోని ప్రాణశక్తిని విపరీతంగా పెంచి వేయడంతో ఇంచుమించు ఆశ్చర్యం గొలిపే రీతిలో లైంగిక ధోరణి కుండే శక్తిని గూడా అవి గోరింతలు కొండంతలు చేసి ప్రకోపింప చేయగలవు. అది భౌతిక జీవితానికి మూలంలో ఉండటంవలన గెలవడం ఎప్పుడూ కష్టసాధ్యమే. చేయవలసిన ఒకే ఒక పని, ఈ గమనాలనుంచి ఒకరు తమకు తాము వేరుచేసుకోవాలి, తమ అంతరంగ ఆత్మను కనుగొని,

దానిలో జీవించాలి. అప్పుడు ఈ గమనాలు ఇక ఎంతమాత్రము తనకే చెందిన విగా ప్రత్యక్ష మవవు, కాని బాహ్య మహాప్రకృతి అంతరంగ ఆత్మమీద లేదా దివ్యపురుషుని మీద బలవంతంగా రుద్దినవిగా కనిపిస్తాయి. అప్పుడు వాటిని చాలా తేలికగా విసర్జించ వచ్చు లేదా ఉనికిలో లేకుండా చేయవచ్చు.

CWSA 31: 511-12

పవిత్రతా శక్తి ద్వారా ఆధిపత్యం

పవిత్రతా శక్తి ఒకటి ఉన్నది. అది నైతికుని పవిత్రత కాదు, కాని అత్యావశ్యక మైన ఆత్మ-పవిత్రత, అస్తిత్వం యొక్క అత్యంత సత్యమైన పదార్థంలోనిది. అది ఒనగూడితే, అప్పుడు కామ- తరంగాలు సమీపించలేవు, లేదా ఎక్కడైనా గాని స్పృశించలేక అవి ఏ ప్రేరణనూ కలిగించలేవు.

*

బ్రహ్మచర్యానికి అడ్డంగా నిలిచే హృదయ, శరీరాల కోరికలు ప్రాణికానికి, భావో ద్వేగ ప్రకృతికి ఎట్టని కాంతిని ఇచ్చి, వాటిని వట్టి పోయేటట్లు చేయకుండా అను భూతులకు దూరం కాకుండా చేస్తాయి. హృదయాన్ని వెచ్చగా ఉన్మీలనంలో ఉంచటానికి వట్టిపోకుండా లేదా మూయబడకుండా అదే సమయంలో ఆధ్యాత్మిక పవిత్రతను అందుకొనేటట్లు చేయటానికి అత్యుత్తమమైన మార్గం, దానిని శాశ్వతము, పవిత్రమూ, ఎల్లప్పుడూ సత్యమూ అయినటువంటి ఈ ప్రాపంచిక భావోద్వేగాలకు వెనుకగా, ఆవలగా ఉన్నదానివైపుకు తిప్పాలి — ఎప్పటికీ సజీవ మైన దివ్యప్రేమ, దివ్యానందం, దివ్య సౌందర్యాలకు.

*

ఉన్నతోన్నత దివ్య చైతన్యం మరియు దివ్యశక్తి ద్వారా ఆధిపత్యం

కామానికి నీ శారీరక వ్యవస్థమీద గట్టి పట్టు ఉంటే దాని పీడను వదిలించు కోవడం ఎల్లప్పుడూ కష్టసాధ్యమే. దానికి బహుశా ఒక మానసిక ఇచ్ఛ కంటే అధికమైన దానియొక్క అవసరం ఉంది. — పైనుంచి ఒక దృఢతరమైన దివ్యశక్తి దాని పీడను పూర్తిగా వదిలించుకోవడానికి.

*

'ఎక్స్' తన జాబులో కేవలం లైంగికాలోచనల నుంచి, కోరికల నుంచి మాత్రమే విమోచనం మరొకరి ఇచ్ఛ ద్వారా కావాలని కోరుకొంటున్నాడు, కాని ఇది ఆ విధంగా జరిగేది కాదు. ఈ యోగాన్ని ఆచరించేవారు శ్రీమాత ద్వారా పనిచేసే దివ్య ఆధిపత్య శక్తి ప్రభావం ద్వారా సహాయాన్ని పొంది లైంగిక సూచనలను తిరస్కరించి దానినుంచి తప్పించుకోవచ్చును, కాని అది సంపూర్ణంగా శీఘ్రం గా గ్రహించగలిగిన సామర్థ్యం మరియు సంపూర్ణ విశ్వాసం కలిగిన వారిలో తప్ప, క్షణంలో అప్పటికప్పుడు జరిగేది కాదు. సర్వసాధారణంగా జీవితకాలపు అలవాటును లేకుండా చేసుకోవాలంటే నిలకడైన తపస్సు అవసరమవుతుంది.

*

ప్రకృతిలోని అనేక భాగాలనుంచి తిరస్కరణ

కేవలం మానసిక, ప్రాణిక ఇచ్ఛల సమ్మతి పొంద గలిగినంత కాలం మాత్ర మే లైంగిక బాధ ఆందోళనకర మౌతుంది. అది మనస్సులో నుంచి తరిమివేయ బడితే, అనగా మనస్సు దానికి సమ్మతి నిరాకరిస్తే, అయినా ప్రాణిక భాగం దానికి ప్రత్యుత్తర మిస్తే, అది ఒక పెద్ద ప్రాణికం కోరిక అలలాగ వచ్చి, దానితో పాటుగా శక్తిమంతంగా మనస్సును తుడిచిపెట్టివేస్తుంది. అది ఉన్నతోన్నతమైన ప్రాణికం నుంచీ, హృదయము క్రియాశీలమై వశపరచుకొనే జీవశక్తి నుంచీ కూడా తరిమివేయబడితే అది నిమ్న ప్రాణికంలో ఆశ్రయ మేర్పరచుకొని అల్ప సూచన లుగా ప్రేరేపణలుగా తలెత్తుతుంది. నిమ్న ప్రాణికం నుంచి కూడా తరిమి వేయబడి అస్పష్టతతో, జడత్వంతో తిరిగి తిరిగి వచ్చే, భౌతికం లోనికి కిందికి అది వెళ్ళిపోయి, లైంగికకేంద్రంలో ఇంద్రియోద్వేగాలుగా, సూచనలకు యాంత్రి కమైన ప్రత్యుత్తరంగా వస్తుంది. అక్కడినుంచి కూడా తరిమివేయబడితే, అది క్రిందికి అచేతనలోనికి వెళ్ళిపోయి కలల రూపంలో లేదా స్వప్నం కూడా లేని నిద్రలో స్ఖలనాలుగా పైకి వస్తుంది. కాని అది ఎక్కడెక్కడికి వెనక్కి పడి తిరోగ మించినా, కొంతకాలం ఇంకా ఆ ఆధారమూలం ఆశ్రయంనుంచే కలవరానికి లోను చేస్తూ, ఉన్నతోన్నత భాగాల అనుమతిని తిరిగి పొందటానికి ప్రయత్నం చేస్తుంది — శత్రువు పూర్తిగా పరాజితుడయే దాకా అది చుట్టు పట్లనుంచి లేదా సాధారణము లేక సార్వజనీనమైన మహాప్రకృతి ఏదైతే మన విస్తృతియో అటు

వంటి పరిసరచైతన్యం నుంచి కూడా తరిమి కొట్టబడే దాకా.

*

ప్రాణిక సంబంధమైన లైంగిక కష్టాన్ని లేకుండా చేసుకోవడం అత్యంత కఠినమనే దానికి కారణం. లైంగిక ఆనందం — భౌతిక రూపంలో దానిని చిత్తశుద్ధితో వదలి వేసినవారు కూడా ప్రాణిక రూపంలోని ప్రేరణను అనుభవించడానికి మొగ్గు చూపుతారు. కాని అది హాని కారకం, కారణం, సూక్ష్మరీతిలో రహస్యంగా చొర బడే శక్తులకు అది తావిచ్చి సాధనా మార్గంలో అడ్డుగా నిలుస్తుంది. ప్రాణికం పూర్తి పవిత్రతను, దివ్యప్రేమను, దివ్యానందాన్ని నిలుపుకోగల సామర్థ్యం పొందాలంటే ఒకరు తప్పక వాటి పీడను వదిలించుకోవాలి.

CWSA 31:512-16

చిత్తశుద్ధి ఆధిపత్యశక్తి

ఒక ఇబ్బంది సుస్పష్టంగా కనబడుతున్నది. ఎరుక గలిగిన నీ అస్తిత్వంలో ఏదో ఆ కష్టాన్ని కోరుకోవడం లేదు. చిత్తశుద్ధితో దానిని అధిగమించాలని కోరు కుంటున్నది. కాని అక్కడ నీకు ఎరుకలో లేని, నీ చైతన్యంలోని ఇతర భాగాలలో లెక్కనేనన్ని గమనా లున్నాయి. నీవు "నేను దానినుంచి నివారణను కోరుకుంటు న్నాను." అని అంటావు. దురదృష్టవశాత్తు "నేను కోరుకుంటున్నాను" అనేది సరిపోదు, చైతన్యంలో ఇతర భాగాలున్నాయి. అవి తమకు తాముగా దాగి ఉంటాయి. ఫలితంగా వాటితో నీవు సంపర్కంలోకి రాలేవు. ఎప్పుడైతే నీ శ్రద్ధ వాటినుంచి మరల్చబడుతుందో, ఈ భాగాలు తమకు తాముగా తమ హక్కుల కోసం పట్టుబట్టే ప్రయత్నం చేస్తాయి. ఆ కారణంగానే నేను చెప్తుంటాను, ఎప్పుడూ మళ్ళీమళ్ళీ చెప్తుంటాను, పరిపూర్ణమైన చిత్త శుద్ధితో ఉండు, నిన్ను నీవు మోసం చేసుకోవద్దు. "నేను చేయగలిగినదంతా చేశాను" అని అనవద్దు. అని నీవు సఫలీకృతుడవు అవకపోతే దాని అర్థం నీవు చేయగలిగినదంతా చేయ ఎందువల్లనంటే నిజంగా నీవు చేయగలిగినది 'అంతా' చేస్తే, నీవు ఖచ్చితంగా సఫలుడవుతావు. ఒకవేళ నీలో ఏదో దోషం ఉండి, దానిని నీవు వదిలించు కోవాలనుకున్నా అది ఇంకా వదలక ఒత్తిడి చేస్తుంటే, నీవు "నేను చేయగలిగిన దంతా చేశాను" అని అంటే, బహుశా నీవు చేయగలిగినదంతా చేయలేదని

కచ్చితంగా అనుకోవచ్చు. నీవు చేసి ఉంటే, నీవు విజయంపొంది ఉండేవాడవు. ఎందువల్లనంటే నీకు వచ్చే కష్టాలు కచ్చితంగా నీకు ఉండే బల నిష్పత్తిలోనే వస్తాయి – నీ చైతన్యానికి కాని దేదీ నీకు సంభవం కాలేదు. నీ చైతన్యానికి సంబంధించిన సమస్తాన్ని నీవు తప్పక వశపరచుకో గలవు. బయటినుంచి వచ్చే విషయాలు సూచనలు సైతం కేవలం నీ చైతన్యం సమ్మతి కొసగిన నిష్పత్తిలో మాత్రమే నిన్ను స్పృశించ గలవు. నీవు నీ చైతన్యానికి ప్రభువుగా చేయబడ్డావు. నీవు "నేను చేయగలిగినదంతా చేశాను, అయినప్పటికీ, అంతా యధాప్రకారంగా కొనసాగుతూనే ఉన్నది, కాబట్టి నేను ప్రయత్నం విరమిస్తాను" అని అంటే నీవు చేయగలిగినదంతా చేయలేదనే విషయాన్ని నీవు బహుశా అప్పటికీ కచ్చితంగా ఒప్పుకుంటున్నట్లే. ఒక దోషం పట్టుకొని వెంటాడుతుంటే, "అంతా చేసినప్పటికీ" దానర్థం నీ అస్తిత్వంలో ఏదో దాగి ఉండి హఠాత్తుగా మూత తీయగానే బయటకు దూకే బొమ్మలాగా పైకి పొడుచుకు వచ్చి నీ జీవితంమీద అధికారం చెలాయిస్తుందని, కాబట్టి కేవలం చేసినదల్లా ఒక్కటే. నీలో దాగి ఉన్న కటిక చీకటి మూలలన్నింటినీ వెతికి వేటాడి, నీవు కేవలం ఈ కటిక చీకటి మీద నిప్పుకణమంత సౌహార్థ్రితను చూపిస్తే, అది లొంగిపోతుంది, మాయమవుతుంది. నీకు అసాధ్యంగా కనిపించింది, కేవలం సాధ్యంకావటం ఆచరణాత్మక మవటమే కాకుండా అదితప్పక జరిగిపోయిన దవుతుంది. ఈ విధంగా నిన్ను ఏళ్ళతరబడి వేధించబోయే ఒక కష్టాన్ని ఒక నిమేష కాలంలో వదిలించుకో గలవు. దానికై నేను నీకు పూర్తి ఆశ్వాసన నిస్తున్నాను. అది కేవలం ఒక్క దానిమీదనే ఆధారపడి ఉంది. అది నీవు నిజంగా, చిత్తశుద్ధితో, దానిని వదిలించుకోవాలని కోరుకోవడటం.

CWM 4: 73-74

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మనసుతో, చైతన్యంతో, ప్రాణికంతో (హృదయం) ప్రేమించగలిగిన స్త్రీలు చాలామందే ఉన్నారు. కాని వారు శారీరక స్పర్శకు కుంచించుకు పోతారు. ఒకవేళ అది అంతరించినా భౌతికచర్య వారికి అసహ్యం కలిగిస్తుంది. వారు దానికి ఒత్తిడివలన అంగీకరించవచ్చు. కాని ఆ చర్య వారి మనస్సును కుదుటపడ

నీయదు. అది వారికి ఎల్లప్పుడు పశుప్రాయ మైనదిగా నీచస్థితిగా అనిపిస్తుంది. స్త్రీలకది తెలుసు, కాని మగవారికది నమ్మశక్యం కానిదిగా అనిపిస్తుంది. కాని అది పరిపూర్ణ సత్యం.

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

విజ్ఞాపనము

'అఖిల' అఖిల భారత పత్రిక చందాదారులకు తెలియజేయునదేమనగా — తమ తమ సెల్ ఫోను నెంబరు, ఈ-మెయిల్ ఎడ్రసు మరియు మీ చిరునామా — ఇంటి నెంబరు, వీధి పేరు, పోష్టు, జిల్లా, స్టేటు మరియు పిన్ కోడ్ నెంబరుతో సహా ఒక పోష్టు కార్డుపై వ్రాసి క్రింద నుదహరించిన మా చిరునామాకు వీలయినంత తొందరలో పంప ప్రార్థన

శుభాకాంక్షలతో


అమ్మ పాదాల చెంత
గాంధీ

చిరునామా:

ఎ. గాంధీ
శ్రీఅరబిందో సొసైటి
సొసైటీ హవుసు
నెం. 11, సెయింటు మార్టిన్ స్ట్రీట్
పాండిచ్చేరి 605001

ఈ-మెయిల్ లేనివారు కనీసం సెల్ ఫోను నెంబరు పంపండి

అఖిల భారత పత్రిక — జూన్ 2017



దివ్యదరహాసము

రక్షిత విశ్రాంతి నిచ్చు దివ్యధామమందు సేదదీరి పొందగలరు కోల్పోయిన ఆనందమయ అలవాట్లను, గ్రోలగలరు జ్యోతిర్మయ ఝురులలో జీవన మధురిమలను.

CWSA 33:15

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సంపాదకీయం

సాఫీగా సాగేది కాదు జీవనయానం. అంధకార బంధురమగు సీమలందు చరిస్తూ, జ్ఞాన శూన్య శక్తుల ప్రేరణతో తరమ బడుతున్నంత వరకు ఆ పయనం మరో విధంగా నుండదు. అయినప్పటికీ, దీనంతటి వెనుక నున్నది తరగని దివ్యకటాక్ష భరిత దరహాసం. దాని ఒక్క చూపు చాలు అంధకారాన్నంతటిని అంతం చేసి, ఆశను చిగురింప చేయడానికి. దివ్య ప్రేమానురాగ రంజిత దాక్షిణ్యాల నందించే బాహువులు మనలను చేతబట్టి పెనుతుఫాను సృష్టించిన దారి తెన్ను కనిపించని సంక్షోభం నుండి, అల్లకల్లోలం మొందిన పరిసరాల నుండి ప్రశాంతమైన దివ్య సుందర, దివ్యజ్ఞాన, దివ్యానంద సీమలకు చేర్చడానికి సిద్ధమై వున్నాయి. సృష్టి కంతటికీ ఆధారభూతమై నిలిచి, మనందరి జీవిత గమనానికి అవసరమగు సమ యాన ఆవశ్యకమగు సహాయ సహకారాలను, శక్తిని సమకూర్చే ఆ దివ్య దరహాసా నికి ఈ సంచిక అంకితం.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్యదరహాసం

చెరగని పరమాత్మ చిరునగవు

అన్నిటా వసించే ఓ మధురసమతా! నా హృదయాన్ని నింపిన తీయని సమతా! అత్యంత బాహ్య జీవన రూపాలలో, ప్రతి భావనలో, ప్రతి తలపులో, ప్రతి చర్యలో ఆవిష్కృతమై నిలిచిపో.

బాహ్యమందున ఎంత గందరగోళ మున్నా అంతా నాకు సౌందర్యమయం, సామరస్యం, నిశ్శబ్దం. ఓ ప్రభూ! ఈ నిశ్శబ్దంలో నేను చూసేది నిన్నే. నిన్నొక అద్వితీయమైన రీతిలో దర్శిస్తాను. ఈ అనుభూతిని ఒక చెరగని చిరునవ్వుగా మాత్రమే వ్యక్తం చేయగలను. నిన్ను అలా చూసినపుడు కలిగే భావన ముందు నిజానికి ఒక మధురమైన, నిశ్చలమైన, ఎంతో ఆప్యాయమైన చిరునవ్వును చూసినపుడు కలిగే భావన తేలిపోతుంది.

నీ శాంతి అందరిలో విరాజిల్లు గాక!.

CWM 14.27



ఆమె వీక్షణ మామె దరహాసము
మృత్తికను సైతము దివ్యత మేల్కొలిపె
ఆ హర్షాతిరేకము మానవ జీవనము లందు
మహాద్భుత సౌందర్య ధారల వర్షించె.

CWSA 33:15 శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజా ప్రసాద్

సహనోపేతము, వివేకవంతము, దయార్ద్రపూరితము అగు దివ్యదరహాసం

'నేను' అని నీవు పిలిచే ఈ ప్రస్తుత ఉపకరణంలో అంతా అతి సామాన్యంగా, అసంపూర్ణంగా, తటస్థంగా, ఇంచుమించు జడంగా నాకు తోస్తుంది. నీవు నన్ను 'నేను' అని పిలిచేటట్టు చేస్తున్నావు. నీతో మరింత మమేక మవుతున్న కొద్దీ ఆ ఉపకరణ లక్షణాల సామాన్యతను మరియు ఆవిష్కరణ యొక్క సామాన్యతను అధికంగా గ్రహించాను. దానిలో అంతా నాకొక సరిదిద్ద లేని ఉజ్జాయింపుగానే కనిపించింది. అది నన్ను ఏమాత్రం చలింప చేయలేక పోయినందుకు కారణం నా నిజ ఆత్మ నీ పాదాలపై వాలి ఉంది, లేక నీ హృదయంలో ఒదిగి ఉంది, లేక నా చేతన నీ శాశ్వత మయిన, మార్పు చెందని దివ్యచేతనతో మమేకమై, ఈ సృష్టినంతా ఒక సహనపూర్వకమైన దయార్ద్రి దృష్టితో వీక్షిస్తున్నది.

CWM 1:146 - 145

ఐక్యత యొక్క పరిపూర్ణ విశ్వాసపు దివ్య దరహాసం

స్వచ్ఛత, ప్రేమ నిండిన ఓ దివ్య ప్రభూ! నీకు పనికి వచ్చేటట్లు సేవ చేయాలనుకొనే ఈ ఉపకరణం తన అల్పమైన దశలలో, చిన్న చిన్న కార్యక్రమా లలో తన అహంకారం నుండి, దోషాల నుండి, అజ్ఞానం నుండి ప్రక్షాళింపబడి — తనలో ఏదీ కూడా నీ దివ్య కార్యక్రమాన్ని నష్టపరచేది, వక్రీకరించేది, అంత రాయం కలిగించేదీ కాకూడదు. ఇంకా నీ ప్రకాశపు సంపూర్ణ కాంతి చొరబడ కుండా దూరంగా చీకటిలో యింకా చిన్న చిన్న మూలలు ఎన్ని మిగిలిపోయా యో — వాటి కోసం నేను నీ తేజస్సు యొక్క ఉన్నత ఆనందాన్ని అర్థిస్తున్నా ను. నీ దివ్యకాంతి కిరణం నిస్తేజం చేయబడకుండా, వేరే రంగులతో అలమ బడకుండా, వక్రీకరరించ బడకుండా ఉండగల స్వచ్ఛమైన, నిర్మలమైన, స్ఫటికం గా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఇది పరిపూర్ణతను కోరుకోవటం కాదు, నీ కా ర్యాన్ని సాధ్యమయినంత సమగ్రంగా నెరవేర్చ బడాలనే ఆకాంక్ష.

నేను నిన్నిది అడిగినపుడు, నీతో మాట్లాడే 'నేను' అనేది ఈ పృధ్వీమండల మంతా: అటువంటి స్వచ్ఛమైన వజ్రంలా మారి మహోజ్వల కాంతిని ప్రతిబింబిం

చాలని ఆకాంక్షిస్తున్నది. అందరి హృదయ స్పందనలు నా హృదయంలో ప్రతి స్పందిస్తున్నాయి. అందరి ఆలోచనలు నా ఆలోచనలతో ప్రకంపిస్తున్నాయి. ప్రతి విధేయత గల సాధు జంతువు, ఆడంబరం లేని ప్రతి చెట్టూ తమ అల్పమైన ఆకాంక్షని నా బలమైన ఆకాంక్షతో ఏకం చేసి, నీ దిశగా నిలచి, మీ ప్రేమను, వెలుగును చూరగొనటానికి, ఆత్మ శిఖరాల నధిరోహించి మిమ్ము పొందటానికి, మీ నిశ్చల సౌందర్యంతో పరవశురాలినై, ఈ బాధల చీకట్లను మీరు దివ్యానందం గా, పరమ దివ్య ప్రశాంత స్థితిగా పరివర్తన చెందించాలనీ కాంక్షిస్తుంది. ఈ తీవ్ర భావన తనను తాను సమర్పించుకోగల అనంతమయిన ప్రేమతో మీతో ఐక్యం చెందగలననే విశ్వాసభరిత ప్రశాంతత వెలిబుచ్చే, చిరునవ్వులు చిందిస్తూ చేయబడింది.

ఓ మధుర ప్రభూ! విజేతవు, విజయానివీ నీవే. గెలుపొందినవాడివి, గెలుపువు నీవే!

CWM 1:156 155

సృష్టి దరహాసం

మీ దివ్యశ్వాస స్పర్శతో హృదయం స్పందించే ప్రతిసారీ, ఈ భూమండలం పై మరి కొంత సౌందర్యం ఆవిర్భవించినట్లుంటుంది, ఈ గాలి ఒక తీయని పరిమళాన్ని అలదుకుంటుంది, సమస్తం మరింత స్నేహపూర్వక మవుతుంది.

సర్వ సృష్టికి ప్రభువైన ఓ దేవా! మీ శక్తి ఎంత గొప్పదనగా మీ అణుమాత్ర ఆనందమే చాలు, ఇంతటి అంధకారాన్ని, అనేకమైన బాధలను చెరిపి వేయటా నికి. మీ తేజోమయమగు వైభవ కిరణ మొక్కటి ఒక నిస్తేజమయిన గులక రాయిని, అంధకార బంధురమైన చేతను దీపింప చెయటానికి!

మీరు నాపై వరాలను కురిపించారు, నాకు ఎన్నో రహస్యాలను

"ఉన్నదాని, ఉండబోయేదాని, లేనిదాని, సమస్తంలో మీ దివ్యమైన చెరగని చిరునగవు ఉన్నది."

CWM 1:170 164

శ్రీమాత

వెల్లడించారు, నే నూహించని, ఆశించని ఎన్నో ఆనందాలను నాకు రుచి చూపించారు. కాని మీ దివ్య శ్వాస స్పర్శ కలిగించే ఈ హృదయ స్పందనకు మీ అవ్యాజ కరుణా కటాక్షం దీటు కాదు.

ఈ శుభఘడియలలో పృధ్వి అంతా ఓ ఆనంద గీతాన్ని ఆలపిస్తుంది, నేలపై పచ్చిక బయళ్ళు సంతోషంతో పరవశిస్తాయి, గాలి వెలుగుతో కంపిస్తుంది, వృక్షాలన్నీ తమ భక్తిపూరిత ప్రార్థనలను స్వర్గం వైపు ఎలుగెత్తి ఘోషిస్తాయి, పక్షుల కిల కిల రావాలు కీర్తనలై వినిపిస్తాయి, సముద్రపు అలలు ప్రేమతో పొంగుతాయి, పసిపిల్లల దరహాసాలు పరమాత్మను గుర్తు చేస్తాయి, మనుషుల ఆత్మలు వాళ్ళ కళ్ళలో దర్శన మిస్తాయి.

CWM 1:361 356

భగవంతునితో కలిసి నవ్వండి

అన్నిటా ఉన్న ఈ దివ్య సాన్నిధ్యం... అదొక ప్రకంపన, కానీ అది తనలోనే అన్నింటినీ యిముడ్చుకున్న ప్రకంపన. అనంతమయన శక్తినీ, అనంతమయిన ఆనందాన్ని, అనంతమయిన శాంతినీ, అనంతమయిన విశాలతను కలిగిన ప్రకంపన హద్దులు లేకుండా విశాలమై, విస్తరించింది. అది ఒక ప్రకంపన మాత్రమే. ఓ ప్రభూ అది ఆలోచన కందనిది. కాబట్టి మాటలలో వ్యక్తం చేయలేనిది. నువ్వు ఆలోచించటం మొదలిడితే, వెంటనే గందరగోళ మంతా ప్రారంభమౌతుంది. అందువలననే మాటలలో చెప్పలేరు.

ప్రశ్న: "మన విలువలన్నీ మనం వాటిని ఎలా వెలకట్టుతామో దానిపై ఆధారపడి వుంటాయి. శ్రీమాత ఎవరినైనా చిరునవ్వుతో చూస్తే, వాళ్ళు మంచివాళ్ళనీ, ఆమె నవ్వకపోతే వారిలో ఎక్కడో దోషం ఉందనీ భావించి జాగ్రత్తగా ఉంటాం".

సమా: ఎంత తప్పు! మీకు తెలియదా దైవం దుర్మార్గులనీ, మంచివాళ్ళనీ సమానమైన చిరునవ్వుతో చూస్తాడని?

శ్రీఅరవిందులతో నిరోద్ బరన్ సంభాషణలు, పుట 551

మనం దైవం దూరంగా ఉన్నాడనుకుంటాము గనుక ఆయన చాలా దూరంగానే ఉంటాడు. మీకు తెలుసా? దైవం అక్కడ ఉన్నాడనుకుంటే అక్కడే ఉంటాడు యిలా (శ్రీమాత తమ ముఖానికి దగ్గరగా చూపిస్తారు) మిమ్మల్ని స్పృశిస్తున్నట్లు — మీరు అనుభూతి చెందగలిగితే — అది మనిషి స్పర్శలా వుండదు, అది ఏదో పరాయిదైనదిగా, బాహ్యమయినదిగా, బయటి నుండి వచ్చే దానిలా ఉండదు. అలా కాదు. అది అంతటా ఉంటుంది. అంతటా, అంతటా... మీరు అనుభూతి చెందుతారు. లోపలా, బయటా, అంతటా దైవమే తప్ప మరేమీ లేదు... ఆయనే... దైవ ప్రకంపనే.

మీరు దానిని ఆపాలి — శిరస్సులో తలంపును. అది ఆగేంత వరకూ మీరు సత్యమయిన విషయాన్ని గమనించ లేరు. మీరు ఉపమానాలకై వెతుకుతారు... "అది యిలా ఉంది.... అది అలా ఉంది" అని. ఓహ్!

(నిశ్శబ్దం)

ఎంత తరచుగా ఆ అభిప్రాయం కలుగుతుంది! ఆకారం లేదు... ఒక రూపం ఉంది... రూపం లేదు... మాటలలో చెప్పలేరు. అక్కడ ఎవరో చూస్తున్నట్లుగా ఉంటుంది, కళ్ళు లేవు — కళ్ళు లేవు గాని ఒక చూపు వుంది. ఒక చూపు... ఒక చిరునవ్వు... నోరు లేదు — ముఖం లేదు! అయినప్పటికీ అక్కడొక మందహాసముంది... ఒక చూపు వుంది. (శ్రీమాత నవ్వుతారు) "ప్రభూ నేను నిజంగా మూర్ఖురాలిని" అని అనకుండా ఉండలేరు. కానీ దైవం నవ్వుతారు, వ్యక్తి నవ్వుతాడు, వ్యక్తి ఆనందిస్తాడు.

CWM 10:153-54

పరమాత్మ అందరిపై చిరునవ్వు చిందిస్తాడు

శ్రీమాత చిరునవ్వును గురించి, ఆమె గురుత్వం గురించిన దంతా ప్రాణిక చేతన యొక్క మాయ మాత్రమే. చాలా సార్లు జనాలు మాట్లాడుకోవటం నేను విన్నాను. ఏ కారణం లేనపుడు ప్రణామ మాచరించే సమయంలో కూడా శ్రీమాత గంభీరంగా, పరుషంగా, అప్రసన్నంగా, కోపంగా ఉన్నారని అంటూ ఉంటారు. వారు వారి ప్రాణిక చేతన యొక్క ఊహాజనిత భావనను శ్రీమాతకు ఆపాదిస్తారు. శ్రీమాత నవ్వుతున్నారా లేదా అనేదానికీ, సాధకుల మంచి చెడ్డ

లకీ, అర్హత అనర్హతలకు సంబంధం లేదు. అది అభినందించేటప్పుడు గాని, శిక్షించేటప్పుడు గానీ శ్రీమాత ఉద్దేశపూర్వకంగా చేసేది కాదు. ఈ విషయాలకు అతీతంగా శ్రీమాత అందరినీ చిరునవ్వుతో గమనిస్తారు. ఆమె నవ్వినపుడు ఆమె సమాధి స్థితిలోనో లేదా ఆ సాధకునిలో ఆమె దృష్టి నిలపవలసిన అంశంపై లీనమై లేక కేంద్రీకరించో ఉంటారు. ఆ సాధకునికి చేయవలసినదాని పైనో లేదా అతనిలో తగ్గించవలసినదాని పైనో ధ్యాస ఉంచుతారు. దాని అర్థం అతనిలో ఏదో దోషమో, చెడో ఉందని కాదు. నేను ఎంతో మంది సాధకులకీ విషయం కొన్ని వందల సార్లు చెప్పి ఉంటాను, కానీ వారి ప్రాణిక చేతన దానిని సమ్మతించ డానికి ఒప్పుకోదు, ఎందుకంటే అది తాను ముఖ్యమని తలచే వ్యథ, తిరుగుబాటు తనం, అభిమానం మూలాలను వదులుకోవలసి వస్తుందని, యోగాన్ని విడిచి వెళ్ళిపోవాలనే కోరికను వదులుకోవలసి వస్తుందని, ఈ ఫలితాలు సంభవిస్తాయని, అవి ఎటూ దారి తీయవని. ఈ అచేతనా పరిస్థితులు చాలు శ్రీమాత చిరునవ్వు చిందించక పోవటానికి ఆమె అనుగ్రహాన్ని, ప్రేమను మరుగుపరచడానికి ప్రతి కూల శక్తుల పన్నుగడలని రుజువు చేయడానికి. మీరు యిలాంటి వాటిని తరిమే యాలి, మీ చైత్యపురుషుని కొక అవకాశం యివ్వాలి, అతను తన నిజమైన లోతైన ప్రేమ సమర్పణతో ముందుకు వచ్చి దైవిక ఆధారాన్ని తన సామ్రాజ్యం చేసుకొమ్మని

శ్రీఅరవిందులతో నిరోద్ బరన్ ఉత్తర ప్రత్యుత్తరాలు, పుట 55

అనువాదం: డా. సరోజా ప్రసాద్

జీవితాన్ని చూసి చిరునవ్వు నవ్వుట

సమత్వ మందహాసం

నీవు వసించే మొత్తం మానసిక ప్రపంచం పరిమితమైనది. నీకు దాని పరిమితులు తెలియకపోయినప్పటికీ లేదా అనుభూతి కానప్పటికీ కూడా, ఏదో ఒకటి తప్పక వచ్చి, నీ మనస్సు తనకు తానుగా మూసివేసుకున్న ఈ భవనాన్ని పగులగొట్టి, దానికి విమోచనం కల్పించాలి. ఉదాహరణకు, నీకు కొన్ని స్థిరమైన నియమాలు, భావాలు లేదా సిద్ధాంతాలు ఉండి, వాటికి నీవు పూర్తి ప్రాముఖ్యతను ఆపాదించా వనుకొందాం. చాలా తరచుగా అది కొన్ని నైతిక సిద్ధాంతాలకు లేక సూక్తులకు అంటిపెట్టుకుని ఉండటమే అవుతుంది, ఉదాహరణకు, విధాయకంగా చెప్పే, "నీ తల్లిదండ్రులను గౌరవించు" లేక "నీవు ఎవరినీ చంపరాదు" మొదలైనవి. ప్రతి మనిషికీ ఒక విధమైన వ్యామోహం లేదా ప్రత్యేకమైన సంకేతం లేదా మరొకటి ఉంటాయి, ప్రతి వ్యక్తి ఇతరులకు ఉండి, దాని వలన వారు బాధ పడే టటువంటి ఏదో ఒక పక్షపాత ధోరణి నుండి తాను స్వతంత్రుడనని, అటువంటి వన్ని నమ్మదగనివని అనుకుంటూ ఉంటాడు; కాని తనవి వారివి లాంటివి కావని ఊహించుకుంటాడు. అది అతనికి సత్యం, వాస్తవికమగు సత్యం. మనస్సు పెట్టే నియమావళికి అంటిపెట్టుకొని ఉండటం ఇంకా ఎక్కడో ఒక చోట గుడ్డితనం దాగి ఉన్నదనే దానికి సూచన. ఈ ఉదాహరణనే తీసుకో, ప్రపంచమంతటా వ్యాపించియున్న సార్వజనీన మైనటువంటి మూఢ విశ్వాసం, సన్యాసం మరియు ఆధ్యాత్మికత ఒక్కటే, రెండూ ఒకే విషయమనేది. నీవు ఎవరినైనా ఆధ్యాత్మిక పురుషుడు లేక ఆధ్యాత్మిక స్త్రీ అని వర్ణిస్తే, ప్రజలు ఒక్కసారిగా ఏమీ తిననటువంటి వ్యక్తిని లేదా కదలకుండా రోజంతా కూర్చునే వ్యక్తిని, చాలా బీదరికంతో గుడిసెలో జీవిస్తూ ఉండే వ్యక్తిని, తన కున్నదంతా ఇచ్చేసి తన కోసం ఏమీ ఉంచుకోని వ్యక్తిని ఊహించుకుంటారు. ఆధ్యాత్మిక మానవుడని నీవు అనగానే నూటికి తొంభై తొమ్మిది మందికి తక్షణం ఈ చిత్రమే మనస్సులో మెదలుతుంది. వారికి ఆధ్యాత్మికతకు ఋజువు బీదరికం మరియు సుఖాన్నిచ్చే లేదా సదుపాయం కలిగించే ప్రతిదాని నుంచి దూరంగా ఉండడం. నీవు ఆధ్యాత్మిక సత్యాన్ని చూసి, అనుసరించాలనుకొంటే, ఈ మానసిక నిర్మాణాన్ని తప్పక విసిరి కింద పడే

యాలి — నీవు ఆధ్యాత్మిక సత్యాన్ని గ్రహించి అనుసరించడానికి స్వేచ్ఛ కలిగి వుండాలంటే. ఎందువల్లనంటే, నీవు చిత్తశుద్ధితో ఆధ్యాత్మిక జీవితానికి వచ్చావు, నీ చైతన్యంలోను, జీవితంలోను దైవాన్ని కలుసుకొని, దైవాన్ని సాక్షాత్కరించుకోవాలను కొంటున్నావు; అప్పుడు ఏం జరగుతుందంటే నీవు ఒక చోటికి చేరుకుంటావు, అది గుడిసె ఏ మాత్రమూ కాదు. సదుపాయాలతో సుఖంగా జీవిస్తూ, హాయిగా భుజిస్తూ, సౌందర్యవంతమైన, విలాసవంతమైనవి పరివేష్టించి యుండగా, తన దగ్గర ఉన్నదానిని బీదలకు పంచకుండా, జనులు తన కిచ్చిన దానిని గ్రహించుతూ, ఆనందిస్తూ ఉండే దివ్యపురుషుడిని నీవు కలుసుకుంటావు. అప్పుడు ఒక్కసారిగా స్థిరమైన మానసిక సూత్రాన్ని కలిగిన నీవు నిశ్చేష్టుడవై అంటావు, "ఎలా, ఏమిటిదంతా? నేను ఒక ఆధ్యాత్మిక మనిషిని కలవాలనుకున్నాను!" బూటకము, అనృతమై నటువంటి ఈ దృక్పథాన్ని ముక్కలు చేయాలి, అది మాయమైపోవాలి. ఒకసారి అది పోతే, సంకుచితమైన నీ సన్యాస నియమానికి చాలా ఉన్నతంగా ఉన్న ఒక దానిని నీవు చూస్తావు, అప్పుడు ఒక సంపూర్ణమైన ఉన్మీలనం నీ అస్తిత్వాన్ని స్వేచ్ఛగా ఉంచుతుంది. నీవు ఒక దానిని పొందవలసి వుంటే, నీవు దానిని స్వీకరించాలి, ఒక వేళ పూర్తిగా అదే విషయాన్ని వదలివేయవలసి వస్తే, అదే సమత్వంతో దానిని వదలి వేయాలి. విషయాలు నీ దరి జేరుతుంటాయి, నీవు వాటిని పరిగ్రహించు; విషయాలు వదలి వెళ్ళిపోతాయి, నీవు వాటిని పోనివ్వు, గ్రహించటంలోను లేదా వదలివేయటంలోను ఒకే విధమైన సమత్వంతో కూడిన చిరుమందహాసంతో.

CWM 3:53-54

కష్టాలను చిరునవ్వుతో చూడు

ఈ ప్రపంచం హేయమైనదని , అది ఉండవలసిన విధంగా ఉండలేదనే విషయం మన మందరం ఒప్పుకుంటాం. అప్పుడు కేవలం మనం చేయవలసింది అది మరొక విధంగా ఉండేందుకై పని చేయడం. పర్యవసానంగా, మన మొత్తం కార్యనిమగ్నత అంతా దానిని వేరైన విధంగా చేయడానికి వలసిన అత్యుత్తమమైన వనరుల కోసం వెతకడం; మనం ఒక విషయం అర్థం చేసుకోగలం, దానికి వలసిన అత్యుత్తమమైన వనరు (మనకది పూర్తిగా తెలియకపోయి నప్పటికీ) మనమే

ననే విషయం, కాదంటావా? కచ్చితంగా నీ పొరుగువాని గురించి నీకు తెలిసిన దాని కంటే నిన్ను గురించి నీకు బాగా ఎక్కువ తెలుసు — ఉదాహరణకు, ఒక మానవ అస్తిత్వంలో అభివ్యక్తమైన చైతన్యాన్ని నక్షత్రాలలో అభివ్యక్తమైన చైతన్యం కంటే నీవు బాగా అర్థం చేసుకోగలవు: కనుక, కొంత తడబాటుతో నీవు చెప్పగలుగుతావు, " ఏది ఏమైనా, నేనేమిటో అదే అత్యుత్తమమైన వనరు. నేనేమిటో నాకే బాగా తెలియదు, అయినా కాని ఈ రకమైన విషయాల కూర్పే నేను, బహుశా ఇదే నా పని, బహుశా ఇదే నా పనిలో భాగం, దీనిని నేను నా శక్తి కొలదీ చేయగలిగితే గనక, బహుశా నా శాయశక్తులతో నేను చేయగలిగిన దానిని అత్యుత్తమంగా చేస్తున్నా ననుకోవచ్చు". ఇదే ఒక చాలా గొప్ప ప్రారంభం, చాలా గొప్పది. ఇదేమీ తలమునకలు కావించే పని కాదు, నీ సాధ్యాసాధ్యాలను మించినదేమీ కాదు, నీ పని నీ చేతిలో ఉంది, అది ఎల్లప్పుడూ నీకు అందుబాటులోనే ఉంది, చెప్పవచ్చేదేమంటో, అది ఎల్లప్పుడూ నీవు చేపట్టడానికి సిద్ధంగానే ఉంది — అది నీ బలానికి తగ్గ నిష్పత్తిలో, కార్యాచరణ గావించగల క్షేత్రం — కాని వైవిధ్యభరితమైనది, సంక్లష్టమైనది, బృహత్తరమైనది, ఎంతో గాఢతతో ఆసక్తి దాయకమైనది. తెలియని ఈ ప్రపంచాన్ని నీవు శోధించ బోతున్నావు.

నీతో అప్పుడు చాలా మంది అంటారు, "కాని ఇది అహంకారం!" నీవు నీ స్వార్థాహంకారంతో చేస్తే అది అహంకారమే అవుతుంది, నీవు వ్యక్తిగత లాభం కోసం, నీవు శక్తులను పొందటానికి, ఇతరులను ప్రభావితం చేయడానికి ఎక్కువ శక్తివంతుడవు కావాలని ప్రయత్నిస్తే లేదా నీ జీవితాన్ని సుఖప్రదం చేసుకోవటానికి మార్గాలను అన్వేషిస్తే. నీవు ఇదే స్ఫూర్తితో చేస్తే, సహజంగానే, అది స్వార్థపూరిత అహంకారం, కాని దాని వల్ల ఒరిగేదేమీ లేదు. అది నిన్ను ఎక్కడికీ తీసుకు వెళ్ళదు! నిన్ను నీవు మోసం చేసుకోవడంతో మొదలుపెడ్తావు, నీకు నీవు ఎక్కువెక్కువగా భ్రమల్లో జీవిస్తుంటావు, నీవు ఇంకా ఎక్కువైనటువంటి, అధికతరమైనటువంటి అస్పష్టతలోకి వెనక్కి పడిపోతావు. పర్యవసానంగా, ఒకరు ఆలోచించేదాని కంటే ఇంకా బాగా విషయాలు వ్యవస్థీకరించ బడతాయి; నీవు నీ పనిని స్వార్థాహంకారంతో చేస్తే (మనం చెప్పుకున్నాం, మన కార్యక్షేత్రం మనకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటుందని), అది ఎందుకూ కొరగాదు. కనుక ఆవశ్యకమైన నిబంధన ఏమిటనగా దివ్యకర్మ సాక్షాత్కారత కోసం, దానిని నీ

ఆకాంక్షలో సంపూర్ణమైన చిత్తశుద్ధి కలిగి చేయడం. కనుక, నీవు ఆ విధంగా చేయడం మొదలుపెడితే, అది చాలా కాలం తీసుకున్నప్పటికీ, అది చాలా ఆసక్తిదాయకమైన ప్రయాణమౌతుందని, నీవు ఎప్పటికీ అలసిపోవని, నేను కచ్చితంగా చెప్పగలను. కాని దీనిని నీవు తీవ్రమగు ఇచ్ఛతో, పట్టుదలతో, కష్టాలను చిరునవ్వుతో చూసే, పొరపాట్లను నవ్వేసే అనుల్లంఘనీయమైన ఆహ్లాదంతో తప్పక చేయవలసి ఉంటుంది. అప్పుడు అంతా సవ్యంగా జరిగిపోతుంది.
CWM 4:253-54

వివేకం వలన వెలువడే మందహాసం

ఒకరు తనలో దాగి వున్న ఎన్నో చిన్న మడతలను, అల్ప విషయాలను, వారు మొదట్లో చూడనివాటిని కనుగొంటారు: అప్పుడు వారు ఒక విధమైన అంతరంగ వేటకు పూనుకుంటారు, చిన్న చిన్న చీకటి కోణాలను వెంటాడుతూ తమకు తాము చెప్పుకుంటారు, "ఏమిటి, నేను ఆ విధంగా ఉన్నానా! ఇది నాలో ఉందా, నేను ఇంత చిన్నదానికి ఆశ్రయమిస్తున్నానా!" — అవి ఎంతో తుచ్ఛమైనవిగా, ఎంతో నీచమైనవిగా, ఎంతో అభ్యంతరకరమైనవిగా వుంటాయి. ఒక్కసారి ఆ లక్షణాలను కనుగొనటం జరిగితే, అది ఎంతో అద్భుతం! ఒకరు దాని మీద వెలుతురును (వివేకాన్ని) ప్రకాశింప జేస్తే, అది మాయమై పోతుంది, నిన్ను దుఃఖానికి గురిచేసిన ఆ ప్రతిక్రియలు ఇక ఎంత మాత్రం నీలో ఉండవు, నీవు ఎప్పుడూ చెప్తూ ఉండే "ఓహ్, నేను మళ్ళీ ఎన్నడూ ఆ పని చేయకూడదు". ఉదాహరణకు, నీవు ఒక చిన్న తీర్మానం జేసావనుకో (వాస్తవానికి చాలా అల్పమైనదే): "నేను మళ్ళీ అబద్ధం చెప్పను". తరువాత హఠాత్తుగా, ఎందుకు లేదా ఏమిటి అనే వాటితో నీ ప్రమేయం లేకుండా అబద్ధం దానతంటదే పైకి తన్నుకు వస్తుంది. నీవు పలికిన తరువాతనే నీవు దానిని గుర్తించడం జరుగుతుంది: "కాని ఇది సరైన పద్ధతి కాదు — నేను ఇప్పటి కిప్పుడు చెప్పింది; నేను చెప్పదలచుకొన్నది వేరే ఉన్నది". ఆ విధంగా నీ శోధన, శోధన సాగుతుంది... "అది ఎలా జరిగింది? నేను ఆ విధంగా ఎలా ఆలోచించాను, ఎలా మాట్లాడాను? నాలో నుంచి ఎవరు చెప్పారు, ఎవరు నన్ను ముందుకు నెట్టారు?..." నీకు నీవు పూర్తిగా ఒక సంతృప్తికరమైన వివరణను ఇచ్చుకుని, చెప్పుకోవచ్చు,

"అది బయటి నుంచి వచ్చింది" లేదా "అది ఒక ఎరుక లేని క్షణం", దానితో ఇక దాని గురించి ఏ మాత్రం ఆలోచించటం జరగదు. తరువాత మరొక సమయం లో, అది తిరిగి మొదలవుతుంది. దానికి బదులుగా నీవు శోధిస్తావు: నీవు బలంగా ఒత్తిడితో ప్రయత్నించు, — నీవు ఒత్తిడి చేయి, ఒక్కసారిగా హఠాత్తుగా ఒక చిన్న మూలలో తనను తాను సమర్ధించుకొనే దేదో నీవు కనుగొంటావు, బలంగా తనకు తాను ముందుకు వచ్చి లేదా తనదైన పద్ధతిలో తన వాదాన్ని సమర్ధించు కొనే విధానంతో (అది ఏమైనా కాని, దాని కక్కడ ఎన్నో కారణా లుంటాయి), తాను ఉన్నదాని కంటే మరి కొంత వేరుగా తనను చూపించుకుంటుంది. అది జనులకు నీ గురించి ఉన్న మంచి అభిప్రాయం కావచ్చు, నిన్ను ఏదో చాలా గుర్తింపు పొందిన వ్యక్తిగా తలుస్తూ ఉండవచ్చు.... నీలో నుంచి మాట్లాడింది అది — క్రియాశీలమైన నీ చైతన్యం కాదు, కాని అది అక్కడ ఉన్నది, వెనుక నుంచి నీ చైతన్యాన్ని ముందుకు తోసింది. నీవు పూర్తిగా ప్రమత్తంగా లేనప్పుడు, అది నీ నోటిని, నీ నాలుకను వాడుకుంది, అంటే నీవు ఆ విధంగా ప్రవర్తించావు! అబద్ధం బయటకు వచ్చింది. నేను ఈ ఉదాహరణనే ఇస్తున్నాను — చెప్పాలంటే అన్యమైనవి ఎన్నో లక్షలు ఉన్నాయి. ఇది చాలా ఆసక్తిదాయకమైంది. దీనిని ఒకరు ఎంత విస్తృతంగా తనలో తాను కనుగొని, "అది తప్పక మారాలి" అని చిత్తశుద్ధితో చెప్పగలిగితే, వారు ఒక విధమైన అంతరంగ సుస్పష్ట-దృష్టిని సంపాదించినట్లుగా ఎరుక నొందుతారు, అంతట వారిలో ఏమి జరుగుతున్నదో తెలుసుకో గలుగుతారు. అవతలివారు ఏ విధంగా ఉండాలని తాము కోరుకుం టారో తద్భిన్నంగా పూర్తిగా వారు ఉన్నప్పుడు కోపం తెచ్చుకోవటానికి బదు లుగా, విషయాలు ఏ విధంగా జరుగుతాయి, ఒకరు 'ఈ విధంగా' ఎలా ఉన్నారు, ప్రతిక్రియలు ఏ విధంగా ఉత్పత్తి అవుతున్నాయి అర్థం చేసుకోవడం మొదలు పెడ్తారు. అప్పుడు, జ్ఞానపరితృప్తితో, మందహాసం చేస్తారు. ఒకరు ఇక ఎంత మాత్రం కఠినంగా న్యాయ నిర్ణయం చేయరు, ఒకరు తనలోని లేదా ఇతరులలోని ఆ ఇబ్బందిని, దాని అభివ్యక్తతా కేంద్రం ఏదైనాకాని, దానిని పరివర్తన చేయమని అర్థిస్తూ, దివ్య చైతన్యానికి నివేదిస్తారు.

CWM 4:336-37

మృత్యువు యెడ చిరునవ్వు

కొంతమంది జను లున్నారు, వారు ఎంతగా మనస్సుతో వారి శరీరం మీద నియంత్రణ కలిగి ఉంటారంటే, వారు దేనినీ అనుభూతి చెందరు; నేను దీని గురించి ఇంతకు ముందు రోజు కొందరు మార్మికుల విషయంలో నీతో చెప్పాను. వారి మీద విధించబడిన బాధానుభవం ఒక్క క్షణంలో వారు తాము దాటవలసిన దశల నన్నింటిని దాటిపోవడానికి సహాయపడితే, సాక్షాత్కారం అందు కోవడానికి అడుగు వేసే ఒక విధమైన ఆధారశిలను అది ఇచ్చే దైతే, దైవంతో కలయికనే వారు తమ ముందు పెట్టుకున్న లక్ష్యం అయినట్లైతే, వారు ఏ మాత్రం బాధానుభూతిని చెందరు. మానసిక భావనతో వారి శరీరం లోహపు పూత పూసినట్లుగా అయిపోతుంది. ఇది చాలా తరచుగా జరిగినటువంటి విష యమే. ఎవరికైతే అసలైన అత్యుత్సాహం ఉంటుందో వారిలో ఇది సర్వ సాధార ణానుభవం. అసలు చెప్పాలంటే, ఒక వేళ ఒకరు ఏదో కారణాన లేదా మరొక కారణాన శరీరాన్ని వదలివేసి మరొకటి ధరించవలసి వస్తే వారు వారి మృత్యు వును ఒక విధంగా శ్రేష్టమైనదిగా, ఆనందభరితంగా, అత్యుత్సాహ పూరితంగా చేసుకోవటం అనేది ఏవగింపు కలిగించే ఓటమి కంటే మంచిది కాదా? ఎవరైతే పట్టుకుని వేళ్ళాడుతారో, ఎవరైతే సాధ్యమైన ప్రతి ఉపకరణం ద్వారా అంత్య కాలాన్ని ఒకటి లేక రెండు నిమిషాలైనా ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తారో, ఎవరైతే భయంకరమైన తీవ్ర పరితాపాన్ని నీకు ఉదాహరణగా చూపిస్తారో, వారు వారి ఆత్మను గురించి ఎరుక లేని వారుగా గోచరమవుతారు.... మహా అయితే, బహుశా అది ఒక ఉపకరణం, కాదంటావా? ఒకరు ఈ దుస్సంఘటనను వారి కార్యసాధనలో ఉపకరించే సాధనగా మార్చుకోవచ్చు; ఒకరు ఎరుక కలిగి ఉంటే వారు దానిని ఒక మనోహరమైనదానినిగా చేయువచ్చు, చాలా మనోహరమైన దానినిగా, ప్రతిదానితో మాదిరిగానే, ఒకటి గుర్తు పెట్టుకో, దానికి భయపడనివారు, దానికి వ్యాకులత్వం చెందనివారు, ఎటువంటి నీచత్వమూ లేకుండా చనిపో గలి గినవారు ఎవరంటే దానిని గురించి ఆలోచించనివారు, తప్పకుండా దానిని తప్పించుకోవాలని, సాధ్యమైనంతగా దానిని వారికి దూరంగా నెట్టివేయాలని ప్రయత్నిస్తూ వారి కెదురయే ఈ 'మహా భీతి' తో కాలమంతా అదే జ్ఞాపకాలతో

వెంటాడుతూ ఉండనివారు. వీరు తరుణ మానస్సమైనప్పుడు, తమ తలను పైకెత్తి, చిరునవ్వు చిందిస్తూ చెప్తారు, "ఇదిగో, ఇక్కడ నేనున్నాను".
CWM 4:354

వెనక్కి తగ్గి చిరునవ్వు నవ్వు

నీ కెప్పుడైనా తటాలున — తటాలున ఏ ప్రయత్నమూ లేకుండా — నీవు తప్పు చేసావని నీకు స్ఫురించిందా? నేను నీకు ఒక గట్టి దెబ్బతో గాఢముద్ర వేసిన దాని బాహ్య ప్రతిక్రియతో, నిన్ను హఠాత్తుగా తట్టి లేపి: "ఓహ్, నా దేవుడా, ఏమిటి నేను చేసింది?" అని అనిపించే దానిని గురించి మాట్లాడటం లేదు, నేను దానిని గురించి మాట్లాడటం లేదు. నీవు ఏది చేసినా, ఏది అనుభూతి చెందినా, ఏది మాట్లాడినా — కేవలం అప్రధానమైన, అల్పమైన తగాదాలనే తీసుకో, రోజుకు అటువంటివి నేను కనీసం ఒక డజను అయినా వినేవి (కనీసం), బుద్ధిహీనమైనవి, (హేతుబద్ధంగా ఆలోచించగలిగేవారు, అటువంటి వాటి గురించి ఏ విధంగా తగాదా పడగలరని నేను ఆశ్చర్యపడుతుంటాను), అది అలా ఉంచి, ఆ సమయంలో నీవు అనకూడని మాటలను, కేవలం చాలా అవివేకమైన వాటిని అనడం అనేది నీవు నిజంగా ఎంత బుద్ధిహీనుడవు అనేది కనబడుతున్నది కదా — ఇంకా అంతకంటే చెడు చెప్పనక్కర లేదు — ఏలాంటి ప్రేరణా లేకుండానే... నీవు ఎప్పుడూ ఒక సాకు చెప్తావు. నీవు ఎప్పుడూ అనుకుంటావు, అవతలి వ్యక్తిదే తప్పని, నీవు సక్రమంగానే ఉన్నానని, అందువల్ల, అతడిదే తప్పని అతడికి చెప్పి తీరవలసినదే, అవును కదా? అలా చేయని పక్షంలో అతడికి ఎన్నటికి ఆ విషయము తెలియదు. అదే కదా ఆలోచించేది? నేను ఈ విషయాన్ని కొద్దిగా కొట్టవచ్చినట్లుగా చెపుతున్నాను, ఒక చిన్న సూక్ష్మదర్శినిలో చూస్తున్నట్లుగా, అందువల్ల అది కొంత పెద్దదిగా కనబడ వచ్చునని, కాని అది అదే విధంగా జరుగుతూ వుంటుంది. అది ఆ విధంగా ఉన్నంత కాలం, అసలైన చైతన్యానికి నీవు లక్షల మైళ్ళు దూరంగా ఉన్నట్లే. నీవు దానిని వెంటనే జరగనివ్వకుండా చేసి, క్షణాలలో వెనకడుగు వేసి, అవతలి వ్యక్తి స్థానంలో నిన్ను నీవు నిలబెట్టుకుని, అతనికి ఈ అనుభూతి ఎందుగు కలిగిందో అర్థం చేసుకుని, నీ బలహీనతను క్షణ కాలంలో దర్శించి, రెండింటినీ పోల్చి ఒక నిర్ణయానికి రావాలి: "తెలిసింది, అది

ఆ విధంగా ఉంది, అదీ అసలైన విషయం". దానర్థం నీవు ఇంకా వెనుక ఎక్కడో చాలా దూరంలో ఉన్నట్టు. నీవు దానిని అప్రయత్నంగా తటాలున చేయగలిగి నప్పుడు, అది ఎక్కువ సమయం తీసుకోనప్పుడు, అది సహజమైన గమన మైనప్పుడు, అప్పుడు నీవు పురోభివృద్ధి చెందినట్లుగా నీవు సంతృప్తి చెంద వచ్చు.... నీకు రోజులో ఎన్ని సార్లు అనుభూతి ఉంటుంది? నీవు బహిరంగంగా తగాదాకు రాకపోయినప్పటికీ, ఎన్ని సార్లు, నీ తలలో ప్రతిక్రియ ఉంటుంది, సమచిత్తమనే మహా వివేకానికి బదులుగా తలలో ఏదో ఒకటి గెంతుతూ ఉంటుంది, అదే క్షణంలో విషయాలు జరుగుతుండగా, అది వాటిని చూస్తూ ఉంటుంది — అవి ఏ విధంగా జరుగుతున్నాయో, ఇదంతా ఎందుకు జరుగుతున్నదో అనే విషయాన్ని అర్థం చేసుకుంటూ ఉంటుంది — వ్యక్తిత్వరహితమైనది అది చాలు, ఎల్లప్పుడూ చిరునవ్వు నవ్వ గలగటానికి, తీవ్రమైన ప్రతిక్రియ అనేది ఎన్నటికీ తలెత్తకుండా వుండటానికి, ఎన్నటికీ.

CWM 5:63-64

శత్రువును చూసి చిరునవ్వు నవ్వడం

మాతా, ఇక్కడ మీరు ఈ విధంగా చెప్పారు: "శత్రువును చూసి చిరునవ్వు చిందించడం అంటే అతడిని నిరాయుధుణ్ణి చేయటమే". 'చిరునవ్వు' అంటే అర్థం ఏమిటి? ఒకరు శత్రువు తట్టు చిరునవ్వుతో వారిని చూడటం ఔచిత్యం కాదు కదా!

ఒకరు అట్లా చేయనే రాదు! ఇక్కడ నేను చెప్పింది ఒక అనుభవాన్ని. స్మృతి పథంలోని ఒక అనుభవాన్ని నేను సర్వ సాధారణమైన మాటలలో వ్యక్తీకరిం చాను. కాని ఒక వేళ, ఒకానొక ప్రత్యేకమైన క్షణంలో, ఒకరెవరైనా చాలా ప్రాణాం తకమైన దుష్టభావాలతో వచ్చినప్పుడు, అతడి యెడ చిరునవ్వు నవ్వగలిగితే, అతడు పూర్తిగా నిరాయుధు డవుతాడు, అతడిక ఎంత మాత్రం ఏమీ చేయలేడు. కాని వారు తప్పక చిత్తశుద్ధితో చిరునవ్వు నవ్వాలి. కేవలం పూర్తిగా పళ్ళు ఇకి లించడం కాని లేక కృత్రిమమైన చిరునవ్వు నవ్వడం గాని చేయ రాదు, (నవ్వు). నేను 'నవ్వడం' అనే దానిని ఒక విధంగా పూర్తి అర్థంలో వాడాను. నేను చెప్పదల చుకున్నది, ఒకరు తనపై తాను ప్రభుతను పాటించగలిగి, విషయాలకు అతీ

తంగా నుండగలిగి. పైనుంచి చూడగలిగిన ఉన్నతోన్నతమైన చైతన్యంలో — సర్వ సాధారణ మానవ చైతన్యానికి అత్యంత విపరీతంగా, అత్యంత నాటకీయంగా కనపడేది కూడా కుర్రతనపు చేష్టలుగా నిన్ను చిరునవ్వు నవ్వించే విధంగానే కనపడుతుంది. ఒకరు అటువంటి చైతన్యంలో ఉండి, ప్రతిదానికీ చిరునవ్వు నవ్వగలిగినప్పుడు (ఎందువల్ల నంటే, ఒకరికి ప్రతి దానికి కారణాలు అవగతమౌతాయి, ఒకరు అన్ని విషయాలలోనూ పనిచేసే శక్తులను సైతం చూడ గలుగుతారు), ఒకరు ఆ చైతన్యంలో ఉండగలిగి, జురుగుతున్న దానికి చిరునవ్వు నవ్వ గలిగితే, విషయాలు తక్షణమే మారిపోతాయి. ఇది కొంత బాహ్యంలోని, సామాజిక చిరునవ్వు లాంటింది మాత్రం కాకూడదు. అది తప్పక చైత్య అస్తిత్వం నవ్వే చిరునవ్వు.

CWM 5:369-70

అన్నింటినీ చిరునవ్వుతో చూడు

నీవు చెప్తావు, "నేను అట్లా ఉన్నాను, నేనా విషయంలో ఏమి చేయగలను? నేను మహా ప్రకృతి నుంచి వేరైపోయాను, ఆమె ఏ విధంగా చేయాలనుకుంటే నేను ఆమెను ఆ విధంగా చేయనిస్తాను, నేను ఈ మహా ప్రకృతిని కాను, నేను దివ్యపురుషుడను. ఆహా! ఆమె దారిన ఆమెను పోనీ; నా చేతిలో ఏముంది, నే నామెను మార్చలేను". ఇలా అనుకుంటే ఎంతో సౌకర్యంగా నుంటుంది. అందు వలననే జనులు దానిని అనుసరిస్తారు, ఎందువల్లనంటే వారు దివ్యపురుషుడిలో ఉన్నామని ఊహించుకుంటారు. కాని ఎంత చిన్న గాయానికైనా వారు తిరిగి వెనక్కి మహా ప్రకృతిలోకి పడిపోతారు. అప్పుడు వారు ఉద్రేకంతో ఊగిపోతారు లేదా నిరాశలో కూరుకు పోతారు లేదా జబ్బు పడతారు. దాని పర్యవసానం ఆ విధంగా ఉంటుంది.

కచ్చితంగా దివ్యపురుషుడితో ఇటువంటి తాదాత్మ్యతను పొంది, ఒక అత్యంత అసాధారణమైన వాతావరణాన్ని అన్ని వైపులా ప్రసరింప జేసిన ఒకరిని గురించి నేను విన్నాను; కాని అతడు భూప్రకృతిలో దేనినో మార్చాలని కోరుకునే ప్రమాదకరమైన విప్లవకారు లందరినీ పిలిచాడు, వారందరూ భూమి మీది విషయాలలో మార్పు కావాలని కోరుకున్నవారు — ఉదాహరణకు, బాధ లేకుండా పోవాలని

ఆ విధంగా ఉంది, అదీ అసలైన విషయం". దానర్థం నీవు ఇంకా వెనుక ఎక్కడో చాలా దూరంలో ఉన్నట్టు. నీవు దానిని అప్రయత్నంగా తటాలున చేయగలిగి నప్పుడు, అది ఎక్కువ సమయం తీసుకోనప్పుడు, అది సహజమైన గమన మైనప్పుడు, అప్పుడు నీవు పురోభివృద్ధి చెందినట్లుగా నీవు సంతృప్తి చెంద వచ్చు.... నీకు రోజులో ఎన్ని సార్లు అనుభూతి ఉంటుంది? నీవు బహిరంగంగా తగాదాకు రాకపోయినప్పటికీ, ఎన్ని సార్లు, నీ తలలో ప్రతిక్రియ ఉంటుంది, సమచిత్తమనే మహా వివేకానికి బదులుగా తలలో ఏదో ఒకటి గెంతుతూ ఉంటుంది, అదే క్షణంలో విషయాలు జరుగుతుండగా, అది వాటిని చూస్తూ ఉంటుంది — అవి ఏ విధంగా జరుగుతున్నాయో, ఇదంతా ఎందుకు జరుగుతున్నదో అనే విషయాన్ని అర్థం చేసుకుంటూ ఉంటుంది — వ్యక్తిత్వరహితమైనది అది చాలు, ఎల్లప్పుడూ చిరునవ్వు నవ్వ గలగటానికి, తీవ్రమైన ప్రతిక్రియ అనేది ఎన్నటికీ తలెత్తకుండా వుండటానికి, ఎన్నటికీ.

CWM 5:63-64

శత్రువును చూసి చిరునవ్వు నవ్వడం

మాతా, ఇక్కడ మీరు ఈ విధంగా చెప్పారు: "శత్రువును చూసి చిరునవ్వు చిందించడం అంటే అతడిని నిరాయుధుణ్ణి చేయటమే". 'చిరునవ్వు' అంటే అర్థం ఏమిటి? ఒకరు శత్రువు తట్టు చిరునవ్వుతో వారిని చూడటం ఔచిత్యం కాదు కదా!

ఒకరు అట్లా చేయనే రాదు! ఇక్కడ నేను చెప్పింది ఒక అనుభవాన్ని. స్మృతి పథంలోని ఒక అనుభవాన్ని నేను సర్వ సాధారణమైన మాటలలో వ్యక్తీకరిం చాను. కాని ఒక వేళ, ఒకానొక ప్రత్యేకమైన క్షణంలో, ఒకరెవరైనా చాలా ప్రాణాం తకమైన దుష్టభావాలతో వచ్చినప్పుడు, అతడి యెడ చిరునవ్వు నవ్వగలిగితే, అతడు పూర్తిగా నిరాయుధు డవుతాడు, అతడిక ఎంత మాత్రం ఏమీ చేయలేడు. కాని వారు తప్పక చిత్తశుద్ధితో చిరునవ్వు నవ్వాలి. కేవలం పూర్తిగా పళ్ళు ఇకి లించడం కాని లేక కృత్రిమమైన చిరునవ్వు నవ్వడం గాని చేయ రాదు, (నవ్వు). నేను 'నవ్వడం' అనే దానిని ఒక విధంగా పూర్తి అర్థంలో వాడాను. నేను చెప్పదల చుకున్నది, ఒకరు తనపై తాను ప్రభుతను పాటించగలిగి, విషయాలకు అతీ

తంగా నుండగలిగి. పైనుంచి చూడగలిగిన ఉన్నతోన్నతమైన చైతన్యంలో — సర్వ సాధారణ మానవ చైతన్యానికి అత్యంత విపరీతంగా, అత్యంత నాటకీయం గా కనపడేది కూడా కుర్రతనపు చేష్టలుగా నిన్ను చిరునవ్వు నవ్వించే విధంగానే కనపడుతుంది. ఒకరు అటువంటి చైతన్యంలో ఉండి, ప్రతిదానికీ చిరునవ్వు నవ్వ గలిగినప్పుడు (ఎందువల్ల నంటే, ఒకరికి ప్రతి దానికి కారణాలు అవగతమౌతాయి, ఒకరు అన్ని విషయాలలోనూ పనిచేసే శక్తులను సైతం చూడ గలుగుతారు), ఒకరు ఆ చైతన్యంలో ఉండగలిగి, జురుగుతున్న దానికి చిరునవ్వు నవ్వ గలిగి తే, విషయాలు తక్షణమే మారిపోతాయి. ఇది కొంత బాహ్యంలోని, సామాజిక చిరునవ్వు లాంటింది మాత్రం కాకూడదు. అది తప్పక చైత్య అస్తిత్వం నవ్వే చిరునవ్వు.

CWM 5:369-70

అన్నింటినీ చిరునవ్వుతో చూడు

నీవు చెప్తావు, "నేను అట్లా ఉన్నాను, నేనా విషయంలో ఏమి చేయగలను? నేను మహా ప్రకృతి నుంచి వేరైపోయాను, ఆమె ఏ విధంగా చేయాలనుకుంటే నేను ఆమెను ఆ విధంగా చేయనిస్తాను, నేను ఈ మహా ప్రకృతిని కాను, నేను దివ్యపురుషుడను. ఆహా! ఆమె దారిన ఆమెను పోనీ; నా చేతిలో ఏముంది, నే నామెను మార్చలేను". ఇలా అనుకుంటే ఎంతో సౌకర్యంగా నుంటుంది. అందు వలననే జనులు దానిని అనుసరిస్తారు, ఎందువల్లనంటే వారు దివ్యపురుషుడిలో ఉన్నామని ఊహించుకుంటారు. కాని ఎంత చిన్న గాయానికైనా వారు తిరిగి వెనక్కి మహా ప్రకృతిలోకి పడిపోతారు. అప్పుడు వారు ఉద్రేకంతో ఊగిపోతారు లేదా నిరాశలో కూరుకు పోతారు లేదా జబ్బు పడతారు. దాని పర్యవసానం ఆ విధంగా ఉంటుంది.

కచ్చితంగా దివ్యపురుషుడితో ఇటువంటి తాదాత్మ్యతను పొంది, ఒక అత్యం త అసాధారణమైన వాతావరణాన్ని అన్ని వైపులా ప్రసరింప జేసిన ఒకరిని గురించి నేను విన్నాను; కాని అతడు భూప్రకృతిలో దేనినో మార్చాలని కోరుకునే ప్రమాద కరమైన విప్లవకారు లందరినీ పిలిచాడు, వారందరూ భూమి మీది విషయాలలో మార్పు కావాలని కోరుకున్నవారు — ఉదాహరణకు, బాధ లేకుండా పోవాలని

లేదా చిట్టచివరికి మృత్యువు ఆవశ్యకత లేని విధంగా చేయాలని, ఒక పరిణామం — ప్రళయం లేని ఒక ప్రకాశవంతమైన పురోభివృద్ధి — జరగాలని కోరుకున్న వారు: "ఆహా! ఆ విధంగా ఆలోచించిన వారందరూ ప్రమాదకరమైన విప్లవకారులు. అవసరమైతే వారిని జైలులో పెట్టాలి!"

కాని ఒకరు ఒక గొప్ప యోగిగా తయారవకపోయినా కూడా వివేకవంతుల వ్వాలని ఆశిస్తే, వారు తప్పక ఈ విషయాల నన్నింటినీ ఒక చిరునవ్వుతో చూడగలిగి, వాటి వల్ల ప్రభావితులు కాకూడదు. నీకు నీ సొంత అనుభవం ఉంటుంది; అది ఎంతగా నిజమవటానికి, పూర్తిగా సాకార మవటానికి సాధ్యమౌతుందో అంతగా ప్రయత్నించు. కాని ప్రతివారిని వారి సొంత అనుభవానికి వదలి వేయి.
CWM 8:62-63

దివ్యానుగ్రహం ప్రతి చోటా పని చేస్తున్నది

నేను ఈ విషయాన్ని చాలా సార్లు చెప్పాను. నీవు ఒక ప్రత్యేకమైన పరిస్థితుల కూడలిలో ఉన్నప్పుడు, కొన్ని సంఘటనలు జరిగి, అవి ఈ నీ కోరికను లేదా నీకు చాలా అత్యుత్తమమైనదానిని అనేక పర్యాయాలు వ్యతిరేకించి నప్పుడు, తరచుగా నీవు దానికి చింతించటం జరిగి, నీకు నీవు చెప్పుకుంటే, "ఆహా! ఇది మరొక విధంగా జరిగి ఉంటే, అది ఈ విధంగా లేదా ఆ విధంగా ఉన్నట్లైతే ఎంత బాగుండేది" అని. చిన్న విషయాలకు, పెద్ద విషయాలకు అదే ధోరణి.... ఆ విధంగా సంవత్సరాలు గడచిపోతాయి. సంఘటనలు కాలక్రమంలో వెల్లడి అవుతాయి. నీవు పురోభివృద్ధితో పాటు ఇంకా ఎరుకను పొందుతావు, ఇంకా బాగా అర్థం చేసుకో గలుగుతావు. అప్పుడు నీవు వెనక్కి తిరిగి చూసుకుంటే, నీవు గమనిస్తావు — మొదట ఎంతో ఆశ్చర్యంతో, అటు తరువాత ఒక చిరునవ్వుతో — అవే పరిస్థితులు ఏవైతే నీకు పూర్తిగా గొప్ప విపత్కర మైనవిగా లేదా అనుకూలం కానివిగా కనిపించినాయో, అవే కచ్చితంగా నీకు అత్యుత్తమంగా జరగవలసినవిగా, నీవు ఏ విధంగా అభివృద్ధి కావాలో ఆ విధంగా పురోభివృద్ధి కావించటానికి తగినవిగా కనపడతాయి. నీవు లేశ మాత్రమైనా వివేకవంతుడవైతే నీకు నీవు ఈ విధంగా చెప్పుకుంటావు, "నిజంగానే, దివ్యానుగ్రహం 'అనంతం' అని.

కనుక, ఈ విధమైనవే ఎన్నో సార్లు నీ విషయంలో జరిగితే, మనిషి అజ్ఞానంతో అంధుడైనప్పటికీ, విషయాలు మోసపూరితంగా కనబడుతున్నప్పటికీ, దివ్యానుగ్ర హం సర్వత్రా పని చేస్తూనే ఉంటుందని, ఫలితంగా ప్రతి క్షణం ఆ క్షణాలలో ప్రపంచం ఉన్న స్థితిలో ఏది అత్యుత్తమంగా జరగటానికి సాధ్యమో అదే జరుగు తుందని నీవు అర్థం చేసుకోవడం మొదలుపెడతావు. మన దృష్టి పరిమితమైన కారణంగా, లేదా మనం మన ఇష్టాయిష్టాల వలన గుడ్డివాళ్ళ మయినందు వలన, విషయాలు ఈ విధంగా ఉన్నాయని వివేకించి తెలుసుకో లేకపోతాం.

కాని, ఒకరు దానిని చూడటం మొదలుపెడితే, వారు ఏదీ వర్ణించ లేనటు వంటి ఒక అయోమయ స్థితి లోనికి ప్రవేశిస్తారు. కారణం, వారు కనబడుతున్న వాటి వెనుక ఈ దివ్యానుగ్రహాన్ని గ్రహిస్తారు — అనంతమైనది, అద్భుతమైనది, సర్వ శక్తివంతమైనది — అన్నింటినీ తెలిసినదీ, అన్నింటినీ వ్యవస్థీకరించేదీ, అన్నిం టినీ అమర్చేదీ, మనలను ముందుకు మనం ఇష్టపడినా, పడకపోయినా, మనకది తెలిసినా లేక తెలియకపోయినా, పరమోత్కృష్ట లక్ష్యం వైపుకు మనల్ని నడిపిం చేది అనగా దైవంతో సమాగమం, దైవం గురించిన ఎరుక, ఆయనతో సంయోగం వైపు.

అప్పుడు ఒకరు దివ్యానుగ్రహం యొక్క దివ్యకర్మ, దివ్య సన్నిధిలో, ఆనంద మయమైన, అద్భుతమైన, ఒక ఆశ్చర్యం గొలిపే శక్తి అనుభూతితో, అదే సమ యంలో, ఎంత మాత్రం ఇక ఏదీ కదిలించ లేనటువంటి ప్రగాఢ విశ్వాసంతో, ఎంతో ప్రశాంతతతో, ఎంతో సంపూర్ణతతో జీవితం గడుపుతారు.

ఒకరు ఇటువంటి పరిపూర్ణంగా గ్రహించ గలిగి నటువంటి, పరిపూర్ణంగా దానికే అంటిపెట్టుకొని ఉండగలిగి నటువంటి స్థితిలో ఉన్నప్పుడు, దివ్యకర్మకు ప్రపంచ ప్రతిఘటన ఎంత మేరకు ఉంటుందో అంత మేరకు తగ్గించి వేస్తారు; ఫలితంగా ఇది దైవం యొక్క దివ్యకర్మకు ఒకరు అందించ గలిగిన అత్యుత్తమ మైన సహకారం అవుతుంది. ఒకరికి దైవం ఏమి కోరుతున్నదో అవగత మౌతుం ది, వారి యొక్క మొత్తం చైతన్యంతో ప్రభువు దివ్య ఇచ్ఛకు అంటిపెట్టుకుని ఉంటారు.

CWM 8:256-57

ప్రతిదానిని దయతో నిండిన చిరునవ్వుతో చూడు

ఒకరు కలహం లేకుండా జీవించడం సాధ్యమే. ఇది చాలా వింతగా అనిపిస్తుంది, కారణం, దానికి వ్యతిరేకంగా, విషయాలు ఉన్నటువంటి విధంలో జీవితం కలహించుకోవటానికే ఉన్నదనిపిస్తుంది. ఇద్దరు వ్యక్తులు కలసి ఉంటే, వారి ప్రధానమైన వ్యాపకం కలహమే ననిపిస్తుంది, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ. నీవు ఎల్లప్పుడూ మాటలతోనే తగాదా పడవు, నీవు ఎల్లప్పుడూ ముష్టిఘాతాలతోనే ఘర్షణకు దిగవు — అదృష్టవశాత్తు — కాని నీవు అంతరంగంలో నిరంతరం చిరచిరలాడే కోపంతో ఉంటావు, కారణం, నీవు నీ చుట్టూ నీవు వాస్తవం చేసుకోవాలనుకొన్న పరిపూర్ణత కనపడదు, అది నీకు వాస్తవం చేసుకోవడం ఒక విధంగా కష్టంగా కనిపిస్తుంది — కాని ఇతరులు దానిని వాస్తవం చేసుకోవటం పూర్తిగా సహజమైన విషయమని నీవు అనుకుంటావు.

"వారు అలా ఎలా ఉండగలుగుతారు?.." నీవు నీలో 'ఆ విధంగా' ఉండకుండా ఉండలేక పోవటం ఎంత కష్టమో నీవు మర్చిపోతావు.

ప్రయత్నించు, నీకే తెలుస్తుంది.

ప్రతిదానిని దయతో నిండిన చిరునవ్వుతో చూడు, నిన్ను కోపానికి గురిచేసే వాటన్నింటిని నీకు ఒక పాఠంగా తీసుకో, నీ జీవితం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది, ఇంకా ఎక్కువ సమర్థవంతంగా ఉంటుంది, ఎందుకంటే నీ శక్తిలో అధికశాతం కచ్చితంగా నీలో వాస్తవం చేసుకోవాలనుకొన్న పరిపూర్ణత ఇతరులలో కనపడనప్పుడు వచ్చే కోపంతో వ్యర్థమై పోతూ ఉంటుంది.

CWM 10:22-23

మరొక విధంగా చూడటం

శ్రీఅరవిందులు ఆరోహణంలో ఉన్న అనుభూతి కలిగింది; అంతర్బుద్ధి మనస్సు చొచ్చుకుపోతూ ఒక రంధ్రాన్ని చేస్తూ, అతిమనస్సు తోటి సంపర్కంలోకి వస్తున్నది, కనుక అది వచ్చే విధానం అదన్న మాట, పాప్! (బిరడా తీసినప్పుడు వచ్చే ధ్వని), తలపులో ఒక పేలుడు సంభవించినట్లుగా, తరువాత

ఆయన ఈ విషయాలు వ్రాసారు. నీవు ఆ గమనాన్ని అనుసరిస్తే, నీకు మూలం తెలుస్తుంది.

స్పష్టంగా ఆయన అన్నదాని ఉద్దేశం, 'తప్పని' అనేది లెక్కించ లేనటువంటి, అనంతమైన సంభావ్యతలలో ఒకటి అనేది. 'అనంతం' అంటే అర్థం సంభావ్యతకు పూర్తిగా సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు అని. కాబట్టి, అందులో తప్పు ఎక్కడ సరిగ్గా సరిపోతుంది? మనం దానిని తప్పు అని పిలుస్తాం, కాని అది పూర్తిగా అభిప్రాయం మీద ఆధారపడింది. మనం అంటాం, 'ఇది తప్పు' అని — దేనితో సంబంధించి? 'ఇది నిజం' అనే దానితో పోల్చినటువంటి మన న్యాయనిర్ణయం అది, కాని కచ్చితంగా ప్రభువు న్యాయనిర్ణయంతో పోల్చినది మటుకు కాదు, కారణం అది ఆయనలో భాగం కాబట్టి!

అతి కొద్ది మంది మాత్రమే ఈ విధమైన విస్తృతపరచే అవగాహనను తట్టు కోగలరు.

ఇప్పుడు నేను ఈ విధంగా చూస్తున్నప్పుడు '(శ్రీమాత తన కన్నులు మూస్తారు), అక్కడ ఒకే సమయంలో రెండు విషయా లున్నాయి: ఈ చిరు నవ్వు, ఈ సంతోషం, ఈ నవ్వు అక్కడ ఉన్నాయి, ఎటువంటి ప్రశాంతత! ఎటు వంటి సంపూర్ణత, ప్రకాశం, పూర్ణ ప్రశాంతత. అందులో ఇక ఎటువంటి ఘర్షణలు లేవు, ఇక ఎటువంటి వైరుధ్యాలు లేవు. అది ఒకే ఒక్క ప్రకాశవంతమైన సామ రస్యత — అయినప్పటికీ తప్పు, బాధ, దైన్యం అని మనం పిలిచే ప్రతిదీ, ప్రతి దీ అక్కడ ఉంది. అది దేనినీ పరిహరించదు. అది మరొక విధంగా చూడడం.

CWM 10:149-150

ప్రతిదానినీ ఎంతగానో సరళం చేసే ఆ దివ్యమందహాసం

నిన్న ఒకరెవరో నాకు వ్రాసిన దానిలో నన్ను అడిగారు, "ఆఖరున, దైవం అంటే ఏమిటి?" నేను సమాధానం ఇచ్చాను. నేను అతనికి సహాయపడే ప్రత్యు త్తరం ఇస్తున్నానని చెప్పాను, కాని అటువంటివి, అన్నీ మంచివే అయినవి, ఒక వంద ఉండగలవు, ఒకదాని కంటే మంచిది మరొకటి.

"దైవం జీవించ వలసింది, కాని నిర్వచించ గలిగేది కాదు".

దానిని నేను మరి కాస్త జత కలిపాను: కాని నీవు నాకు ఆ ప్రశ్న వేసావు, నా



Smile of Nature

Nature rejoices in her beauty.

తనను దెబ్బ కొట్టినవాని యెడల, తనను ఆరాధించినవాని యెడల సమమైన ప్రేమను సర్వావస్థలలో ప్రసరింప జేయడం అనేది దైవ సంకేతమని శ్రీఅరవిందులు మనకు తెలియ జేస్తున్నారు — మానవజాతి కదెంత మహత్తరమైన బోధన.

CWM 10:295-96

శ్రీమాత

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

సమాధానం: "దైవం అనేది పరిపూర్ణత యొక్క సంపూర్ణత, ఉన్నవాటన్నింటికీ శాశ్వతమైన మూలం, దేని గురించి అయితే మనం క్రమేణా ఎరుకలోకి వస్తామో, అది శాశ్వతత్వ మంతటి నుంచి నిరంతరంగా తానే అయి ఉన్నటువంటిది." ఒకసారి నాకెవరో ఇది కూడా చెప్పారు, అది అతడికి కేవలం అచింత్యమైనదని. అప్పుడు నేనతనికి సమాధానం ఇచ్చాను: "కానే కాదు! అది నీకు ఏ సహాయమూ చేయదు. నీవు కేవలం అంతా దైవమేనని తలచావు (మహోన్నతంగా, అవును), మన మందరం మన అత్యున్నతంలో తయారు కావాలని అనుకొనే అత్యంత ప్రకాశవంతమైన ఆకాంక్ష. మన మందరం పరిణమించాలని కోరుకొనేది, ఆ దైవంగా అవాలని."

అతడెంతో సంతోషించాడు, అతడు నాతో చెప్పాడు, "ఓహ్! ఆ విధంగా అది తేలిక అయింది!"...

అదే సమయంలో ఈ దృష్టి ఆ 'ఏదో ఒక దాని' వైపు పడినప్పుడు, దానికి నిర్వచనం అవసర మౌతుంది, అక్కడ అంతటా ఒక గొప్ప నిశ్శబ్దం, ఒక గొప్ప ఆకాంక్ష (జ్వాల పైకి లేస్తున్న సంజ్ఞ), ఈ ఆకాంక్ష చేపట్టిన అన్ని రూపాలు. అది చాలా ఆసక్తిదాయకం.... పుడమి ఆకాంక్ష గాథ.... ఒకరు దానిగా కావాలని కోరుకొనే అద్భుతమైనటువంటి ఆ తెలియనిదాని వైపుకు.

ఇక ప్రతివారు — ఎవరైతే సమాగమానికి విధి నిర్దేశితులో — వారు తమ నిరాడంబరత్వంలో తాము ఏ వంతెన నైతే దాటిపోయారో, కేవలం ఉన్నది అది ఒక్కటేనని తలుస్తారు. ఫలితం: మతాలు, తాత్త్విక పద్ధతులు, సిద్ధాంతాలు, సూక్తులు — యుద్ధం.

మొత్తంగా చూస్తే అది ఎంతో ఆసక్తిదాయకం, చాలా ఆహ్లాదకరం, ఒక దివ్య మందహాసం చూస్తుంది. ఓహ్! ఈ దివ్య మందహాసం... అది చూస్తుంది. ఈ దివ్య మందహాసం, అది చెప్తున్నట్లుగా ఉంది, "నీవు ఎంతో సంక్లిష్టం చేశావు కాని అది ఎంతో సరళం కాగలదు!"

దీనిని సాహిత్యపరంగా వ్యక్తీకరించాలంటే, ఒకరు ఈ విధంగా చెప్పవచ్చు:

"అన్ని సంక్లిష్టతల్లా అంత సరళమైనదానికి: తనకు తాను కావటానికి".
CWM 11:64-65

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆనందంగా ఉండుట

ఆనందంగా, సంతోషంగా ఉండడంలో ఆధ్యాత్మికంగా తప్పు లేదు; కానీ అదే సరియైనది.

ఆకాంక్షలు, పోరాటాల గురించి చెప్పాలంటే పోరాటాలు వాస్తవంగా పురోగమించడానికి అత్యవసరం కాదు. కాని చాలా మంది వీటికి అలవాటు పడ్డారు. వీరి కాలమంతా పోరాటాలే తప్ప ఇంకేమీ ఉండదు. అది కోరుకో తగ్గది కాదు. సూర్యకాంతి ప్రసరించే దానితో పాటు విచారగ్రస్థ దారి కూడా వున్నది. వీటిలో — శ్రీమాతపై సంపూర్ణ విశ్వాసం, నమ్మకంతో ముందుకు పోయేది మంచిది. దేని గురించి భయం, విచారం లేని దారి ఇది. తేజోమయమైన ఆకాంక్ష, పూర్తి విశ్వాసం, నమ్మకం, సంతోషంతో కూడిన ఆకాంక్ష అవసరం. ఆటంకాలు ఎదురైతే, వాటిని కూడ చిరునవ్వుతో ఎదుర్కోగలం ఈ దారిలో.

*

నీవలా ఆనందంగా ఎల్లప్పుడూ ఉండాలని మేము కోరుకుంటాం — నీలో ఉన్నది

నీ బలహీనతలతోనే సతమతమయ్యే ఓ మూర్ఖుడా, భగవంతుని ముఖాన్ని నీ నుంచి భక్తితో కూడిన భయంతో కప్పివేయవద్దు, దీనంగా యాచించే బలహీనతతో ఆయనను సమీపించవద్దు, బాగా చూడు! నీవు ఆయన ముఖంలో గంభీరమైన చక్రవర్తిని, ధర్మాధికారిని చూడబోవటం లేదు, కాని దివ్యప్రేమికుడి చిరుమందహాసాన్ని చూస్తావు.
CWM 10:355

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మానసిక ఆనందమే. ఎటువంటి కష్టాలొచ్చినా, తప్పకుండా అది నిన్ను ముందుకు తీసికెళ్ళి గమ్యానికి చేరుస్తుంది. ఎప్పుడైతే ఒక సాధకునికి ఈ ఆనందం స్థిరంగా ఉంటుందో అతడు అతి ఘోరమైన కష్టాలను కూడ దాటి ఉంటాడని, అతడు భద్రమైన దారిలో స్థిరంగా ఉన్నాడని మనకు తెలుసు.

*

హాస్యమాడడంలో ఉండే ఆనందం, ఉల్లాసం ప్రాణికమైనది. అలా ఉండ కూడదని కాదు కాని, ఇంకా లోతైనా ఆంతరంగిక ఆనంద మొకటి ఉన్నది, అదే సుఖ హాస్యం. అదే ఆనందానికి ఆధ్యాత్మిక చిహ్నం.

*

అంతర ఆనందం ఉల్లాసం సహాయపడ్తుంది. కాని ఈ తేలిక పాటి హాస్యం ఉపరి తలం పైకి వచ్చే ప్రాణిక బుడగల వంటిది. సాధారణ జీవితంలో అది వుండ తగ్గదే కానీ ప్రాణిక శక్తిని వృధా చేస్తుంది.

CWSA 31:173:174

శ్రీఅరవిందులు

ఆటంకా లెదురైనప్పుడు ఆనందంగా కాపాడుకో

అనేక విషయాలు జరుగుతాయి. మధ్యలో హఠాత్తుగా ఒకరు అనుకుంటారు, తాను ఆటంకాలను దాట గలిగానని. నేనంటాను అనుకుంటారు అని. ఎందుకంటె అతడు దానిని దాట గలిగినా, పూర్తిగా దాట లేదని. ఒక చిన్న ఉదాహరణ చెప్తా. ఒకరు కనుగొన్నారు, తన ప్రాణికం అదుపు చేయ వీలుబడదని, అదుపులో లేదని, అది ప్రతి చిన్న విషయానికి అకారణంగా, తీవ్రంగా కోపగించుకుంటుందని. అప్పుడు అతడు దానికి బోధించ ప్రారంభిస్తాడు. ఆ ధోరణిలో కొనసాగ కూడదని, ఉద్రేకపడ వద్దని, నిదానంగా ఉండమని జీవితంలో వచ్చే కష్టాలకు తీవ్రంగా ప్రతి స్పందించకుండా, ఓర్పుతో భరించాలని, కోపగించుకో కూడదని. ఈ పనిని అతడు 'ఆనందంగా' చేయగల్గితే, అది వెంటనే సద్దు మణుగుతుంది. (ఇది జాగ్రత్తగా గమనించండి, ముఖ్యంగా ప్రాణికంతో వ్యవహరించేటప్పుడు, నిదానంగా, ఆనందంగా ఉండాలి. లేకపోతే చిక్కులలో పడతావు.) ఒకరిలో కోపం తీవ్ర మవడం చూసి నప్పుడు, రెండవవారు నిదానంగా, ఆనందంతో నవ్వడం ప్రారం

భించాలి. అలా కాకుండా, నిస్పృహ చెంది, "నే నెంత ప్రయత్నించినా కథ మళ్ళీ మొదటికి వచ్చింది", అని అనుకో కూడదు. "అతడు ఇంకా దాని తుది చూడలేదు, చూడు నీ వెంత పరిహాసాస్పదంగా ఉన్నావో నీకు తెలుసు. అలా కోపగించడం ప్రయోజనకరమా?". ఈ పాఠం ఆనందంగా నవ్వుతూ ఇవ్వాలి. నిజంగా, కొంత సేపు తర్వాత అతడు కోపం మానుకుని స్థిమిత పడ్తాడు. అప్పుడు కొంత నెమ్మది పడి, ఆటంకాన్ని అధిగమించానని అనుకుంటాడు. ఎట్టకేలకు ఫలితం దక్కిందని భావిస్తాడు. "నా ప్రాణికం నన్ను ఎంత మాత్రం చికాకు పర్చదు, కోపగించదు, అంతా బాగుంది." కాని ఆ మరుసటి రోజు అతడు మళ్ళీ ఉద్రేక పడతాడు. ఇక్కడే అతడు జాగ్రత్తగా ఉండాలి. అతడు అనకూడదు, "ఉపయోగం లేదు. నే నేమీ సాధించలేను. నా ప్రయత్నాలన్నీ వ్యర్థం, అంతా మిధ్య, ఇది అసంభవం" అని. దీనికి వ్యతిరేకంగా అతడు అనగల గాలి ఇలా, "నేను తగినంత జాగ్రత్తగా లేను." అతను చాలా కాలం వేచి ఉండాలి ఇలా చెప్పగల్గడానికి, "అది జరిగింది, పూర్తి అయింది" ఒక్కోసారి చాలా సంవత్సరాలు వేచి ఉండాల్సి వస్తుంది.


హాస్యభరిత అంతరంగం నిలుపుకో

సాధారణంగా, ఎంతో పురోగతి ఒక వైపు సాధించి నప్పటికి, రెండో వైపు అంతా కొట్టుకు పోతుంది దుష్టశక్తుల దాడి వల్ల. అందుచే ఎంత ఎక్కువ పురోగతి సాధిస్తే, అంత ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్య లక్షణం ఏది అంటే, 'ఓర్పు పట్టుకు వ్రేలాడడం, అంతరంగంలో మంచి హాస్యం'. ఇది నీకు సహాయపడ్తుంది, నిరుత్సాహ పడకుండా, క్రుంగిపోకుండా, చిరునవ్వుతో కష్టాల నెదుర్కోడానికి. ఈ విషయం వ్యక్తపరచే ఒక ఇంగ్లీషు పదం వుంది 'cheerfulness' (ఆనందంగా ఉండుట). దీనిని నీలో నిలుపుకో గలిగితే, ఆ కాంతిలో నీ పురోగతిని నిరోధించే చెడు ప్రభావాలను నిరోధించగలవు, బాగా పోరాడగలవు.

CWM 8:23

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు



Cheerfulness

A joyful smile of nature.

ఆనందంగా ఉండడం, సాధనకు ఉప్పు వంటిది. దిగులుగా ఉండడం కంటె ఇది వేయి రెట్లు మెరుగైనది.

*

ఇంకా ఎక్కువ ఆనందంతో, ఆత్మస్థైర్యంతో ఉండాలి. లైంగిక వాంఛ, సందేహం వంటివి ఉన్నాయి, నిస్సందేహంగా. కాని దైవం కూడా నీలో ఉన్నాడు. కళ్ళు తెరిచి చూడు. మళ్ళీ మళ్ళీ చూడు — తెర తొలగే దాకా — అతనిని లేదా ఆమెను, చూసే దాక.

CWSA 31:173

శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు



"ఇవిగో తీసుకోండి — పువ్వులు, ఆశీర్వచనములు, దివ్యప్రేమ చిరునవ్వులు! అవి పక్షపాతం లేనివి, వికర్షణ లేవిని. ఇవి ప్రవహిస్తున్నాయి అందరి వైపు ఉదారంగా, ఇష్టతలను తన అద్భుత కానుకలను ఎన్నడూ వెనుకకు తీసుకోకుండా."

శ్రీమాత కాలాతీత శ్రీమాత, ఆనంద పారవశ్యంలో చేతులు చాచుతోంది ప్రపంచం వైపు వెదజల్లుతోంది ఆపు లేని తన స్వచ్ఛాతి స్వచ్ఛమైన ప్రేమ తుషారాన్ని.

CWM 1:367

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

చిరునవ్వును చెదరిపోనీయ వద్దు

స్వాతిశయ భావన

తనను తాను చిత్తశుద్ధితో నిర్మొహమాటంగా, నిశితంగా పరిశీలించుకొంటే, కోరికలతో కలుషితంగాని విషయాలు, చేతన కదలికలు అతి కొద్దిగానే వున్నాయని చాలా త్వరగా గ్రహిస్తాడు. ఎంతో ఉన్నతమైన విషయం అని నీ వనుకొన్న దానిలో కూడా, యెప్పుడూ... కాదు, యెప్పుడూ కాదు, కాని చాలా తరచుగా ఒక కోరిక కలగలసిపోయి వుంటుంది. అది తాను గొప్ప అనే భావానికి, ఒక రక మైన ఆత్మ-సంతృప్తికి నేను యెంతో కొంత అధికుడననే సంతృప్తికి చెందిన కోరిక.

తమ పొరుగువారిని ఆశ్చర్యపడేటట్లు చేయడానికీ, యితరుల మీద పెత్తనం చెలాయించడానికి, యితరులు తమను బాగా మెచ్చుకొని గౌరవిస్తారనే వుద్దే శ్యంతో, యోగు లవ్వాలని కోరుకొనే వారి కంటె వీళ్ళు చాలా మెరుగు. యదా ర్థంగా, అసలు కల్మషం లేని శుద్ధమైన విషయాలు యెన్ని వున్నాయి? శుద్ధ ఆకాంక్ష గలవి? నీవు యిప్పటికే చాలా ఉన్నత స్థాయికి, నేను చెప్పిన స్థాయికి చేరుకొని వుంటావు. అచటి నుండి నిన్ను నీవు చిరునవ్వుతో పరికించుకోగల స్థాయి అది, కొంచెం వ్యంగ్య దరహాసంతో పరికించి, చాలా చిన్నవాడినని చాలా చాలా చిన్నవాడినని, యెంతో అల్పుడనని, యేమాత్రం ప్రాముఖ్యత లేనివాడి నని, యెంతో బుద్ధి తక్కువ వాడినని సంవేదనకు లోనవుతావు. ఆ తరువాత విషయాలు మెరుగవుతాయి. కాని ఆ చలనాలన్నీ, ఎప్పుడూ తమ చుట్టూనే తిరుగుతూ యెంత కాలం నుంచి వుంటున్నాయో! ఈ జగత్తులో ముందుకు గెంతుతూన్నట్లు ఒక్కసారిగా మొదలుపెడ్తావు. చాలా చిన్న ఫలితాన్నాశిస్తూ, ఒక అల్ప సంతృప్తి కోసం, చాలా కొద్ది సంతృప్తి కోసం నీ చుట్టూ నీవు తిరుగు

> చిరునవ్వు చిందించలేని ఒక భగవంతుడు యీ హాస్యమయ జగత్తును సృజించ లేడు.
>
> *CWM 10:345* — శ్రీమాత

తుంటావు. అది నీ ఆత్మ-స్తుతికి సంబంధించినదే అయ్యుండవచ్చు. "ఓహ్! యెంత మంచి ఆకాంక్ష నాది!" అనే సంతృప్తి, అయినా సరే ఆశిస్తావు!

CWM 6:337-38

కోపమెప్పుడూ ఒక బలహీనతకు చిహ్నం

అలజడి, హింస, కోపం, యివన్నీ యెప్పుడూ, యెట్టి మినహాయింపు లేకుండా, బలహీనత చిహ్నాలే. ముఖ్యంగా తాను మాట్లాడేటపుడు, అనగూడని విషయాలు అంటూ పోతుంటే, అది నిజంగా ఒక భయంకరమైన మానసిక చిహ్నం — మానసికము, ప్రాణికమైనది — భయంకరమైనది. ప్రపంచంలోని దూషణ లన్నింటినీ నీవు విని వుండవచ్చు, పలు విధాలైన మతిలేని మాటలు జనం నీతో పలికి వుండవచ్చు, నీవు బలహీడుడివి గానట్లైతే, బయటకు కన్పించేటట్లు చిరునవ్వు నవ్వకపోయినా — ఎందుకనంటే యెప్పుడూ చిరునవ్వు నవ్వుతూండడం కూడా మంచి లక్షణం కాదు — నీ లోలోపలే నవ్వుకుంటూ వుంటావు. అది అలా సాగి పోతుంది, అది నిన్ను తాకనే తాదు.... మామూలుగా, యిక్కడ అనుకొన్నట్లుగా, నీ మనసును ప్రశాంతంగా వుంచడాన్ని అలవాటు చేసుకొంటే, నీ లోలోపల సత్యాన్ని గ్రహించగలగి వుంటే, దేనినైనా వినగలుగుతావు. అది నీలో ఒక కంపనం బోలిన దాన్ని గూడా పుట్టించ లేదు, అంతా ప్రశాంతంగా, నిశ్చలంగానే వుండి పోతుంది. మనం ఓ క్షణం క్రింద చెప్పుకొన్న సాక్షి భావన వుంటే జరుగుతున్న హాస్య నాటకాన్ని చూచి, తప్పుకుండా నవ్వుకొంటావు.

తన కోపాన్ని, ద్వేషాన్నంతా నీ మీదకు చిమ్ముతున్న యితర వ్యక్తి నుండి వచ్చే కంపనాలను గనుక నీవు సంవేదిస్తే — మొదట్లో అదే జరుగుతుంది — తరువాత అకస్మాత్తుగా నీ నుండి ప్రతిస్పందన వుంటుంది. అప్పుడు నీవే స్వయంగా కోపానికి లోనవడం మొదలైతే కచ్చితంగా అతని లాగానే నీవూ బలహీనుడవు అవుతాయి.

CWM 6:372-73

రచ్చ చేయగూడదు

ఒక విషయం మీద, సరియైన, దృఢమైన, స్పష్టమైన, కచ్చితమైన భావం

యేర్పరచుకోవడంలో విజయం సాధించాలనుకొంటే, నీవు కృషి చేయాలి, నిన్ను నీవు కూడదీసుకోవాలి, స్థిరంగా వుండాలి, యేకాగ్రత వహించాలి. ఇది మొదటి సారైతే, అక్షరాలా అది నీకు కష్టం అనిపిస్తుంది, అలసిపోయేటట్లు చేస్తుంది! దాన్ని నీవు అలవాటుగా చేసుకోకపోతే నీ జీవితమంతా యెటువంటి నిర్ణయాలు చేయలేని స్థితిలోనే గడిచిపోతుంది. లౌకిక వ్యవహారం దగ్గర కొచ్చేటప్పటికి నీవు — ఏదెలా వున్నా అనేక సమస్యలను పరిష్కరించవలసి వస్తుందెవరికైనా — చాలా వ్యావహారికమైన వాటిని పరిష్కరించవలసి వస్తుంది. సమస్యకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను తీసుకోవడానికి బదులు వాటన్నింటినీ ఒకదాని కొకటి ముఖాముఖిగా చూడడానికి బదులు, సమస్యను ప్రతి వైపు నుండీ చూడడానికి బదులు, చూచి సమస్యకు అతీతంగా వెళ్ళి పరిష్కారాన్ని చూడడానికి బదులు, అస్థిరమైనదాని అజ్ఞానపు సుడులలో చిక్కుకొని కొట్టుకు పోతుంటావు. అనేక సాలె పురుగులు నీ బుర్రలో యిటూ, అటూ పరుగులు పెడ్తున్నట్లుగా వుంటుంది — కాని అసలు పరిష్కారాన్ని నీవు కనుగొనలేక పోతావు.

నేను చాలా మామూలు విషయాలను గురించే మాట్లాడుతున్నాను. ప్రపంచ విధిని గాని, మానవజాతి విధిని గాని లేక ఒక దేశం విధిని గాని నిర్ణయించడం గురించి కాదు, అటువంటి వేటిని గురించి కాదు.

నీ దైనందిన జీవిత సమస్యల గురించే మాట్లాడుతున్నాను. అవి నీకు అయోమయంగా కన్పించవచ్చు.

ఈ అయోమయాన్ని తొలగించుకోవాలనే నీ కిదంతా చెప్తున్నాను. నీ మస్తిష్కం ఒక రూపాన్ని సంతరించుకొంటున్నపుడు "అటువంటి లక్షణాలు, అలవాట్లచే అది తయారవ్వకుండా, దానికి కొంచెం కచ్చితత్వా న్నివ్వడం కోసం, సునిశిత త్వాన్ని, సావధానం కాగల సామర్థ్యాన్ని, దేన్నైనా యెంచుకొనడాన్ని, నిర్ణయిం చడాన్ని, విషయాలను ఒక పద్ధతిలో పెట్టడాన్ని అలవాటు చేయడం కోసం ప్రయ త్నించు, నీ హేతుబుద్ధి నుపయోగించడానికి ప్రయత్నించు."

నిజమే! మనిషికిగల అత్యున్నత సామర్థ్యం హేతుబుద్ధి కాదనేది అందరికీ బాగా తెలిసిన విషయమే. ఆ బుద్ధిని దాటి పోవాలి, కాని అది నీకు లేకపోతే నీ జీవితం పూర్తిగా అస్తవ్యస్త జీవితం అవుతుంది. సహేతుకంగా ఎలా మెలగాలో నీకు తెలియదు. అత్యల్ప విషయం గూడా నిన్ను కలచి వేస్తుంది. కారణం

కూడా తెలియదు, దాన్నెలా చక్కదిద్దుకోవాలో అంత కన్నా తెలియదు. తమలో క్రియాపరమైన, స్పష్టమైన హేతుబుద్ధిని స్థిరంగా నిలబెట్టుకొన్న వారెవరైనా, సర్వ విధ దాడులను, భావావేశపరమైన మరే విధమైన కష్టాలనైనా యెదుర్కో గలుగుతారు. ఎందుకనంటే వీటన్నింటితో తయారైందే జీవితమంటే — అసహ్యా కరమైన, నిరాశా నిస్పృహలు – అవి అల్పమైనవే, కాని వాటిని అనుభూతి చెందే వానిని బట్టి వాటి తీవ్రత వుంటుంది. కాబట్టి అవి అతనికి పెద్దవిగా కన్పి స్తాయి, ఎందుకనంటే అవి అతని స్థాయిని బట్టి ప్రభావం చూపుతాయి గదా! హేతుబుద్ధి కొంచెం వెనుదగ్గి, అన్నింటి వైపూ చూచి "ఓహ్! అటువంటి చిన్న విషయాలకు అంత రచ్చ చేసి వుండ గూడదు" అని చిరునవ్వుతో చెప్తాడు.

CWM 8:182-83

స్వేచ్ఛ: ప్రేమ

"నేను స్వతంత్రంగా జీవించా లనుకొంటున్నాను! నేను స్వేచ్ఛా జీవిని, నేసు స్వతంత్రుడ నైనప్పుడే, మనగలను" అని అన్న ఒక వ్యక్తికి, ఒక ఋషి, గుప్తజ్ఞాని అయన పాత కాలం వ్యక్తి యిచ్చిన ఒక చక్కటి సమాధానం ఈ సందర్భంగా నాకు గుర్తు కొస్తోంది. అతడు చిరునవ్వుతో "అయినప్పుడు, నిన్నెవరూ ప్రేమించరు, ఎందుకనంటే నిన్నెవరైనా ప్రేమిస్తే, నువ్వు వెంటనే ఆ ప్రేమ మీద ఆధార పడిన వాడి వవుతావు."

అదో చక్కని సమాధానం. ఎందుకనంటే యేకత్వానికి దారి తీసేది ప్రేమ, ఆ యేకత్వమే స్వేచ్ఛకు యధార్థ రూపం. తమకు స్వేచ్ఛగా వుండే హక్కున్న దనే వంకతో, తమకు స్వాతంత్ర్యం కావాలని యెవ రనుకొంటారో వాళ్ళు యీ యధార్థమైన స్వేచ్ఛకు పూర్తిగా వెన్ను చూపుతున్నారన్న మాట, ఎందు కనంటే వాళ్ళు ప్రేమను తిరస్కరిస్తున్నారు.

ఈ వికృతి ఒక నిర్బంధం ఫలితంగా తయారైంది.

బలవంతం చేసినందు వల్ల ప్రేమించ రెవ్వరూ. బలవంతం చేస్తే నీవు ప్రేమించవు, ప్రేమించినా అది ప్రేమ అవదు. అందుచేత వత్తిడి చోటు చేసు కొన్న వెంటనే, అది అసత్యం అవుతుంది. ఆంతర అస్తిత్వపు చలనాలన్నీ అప్రయ త్నంగా జరిగేవిగా అవ్వాలి. అప్రయత్నంగా జరగడ మనేది ఆంతరిక సామ

రస్యత, అవగాహనల వల్ల ప్రాప్తిస్తుంది — స్వచ్ఛందమైన ఆత్మసమర్పణ ద్వారా — లోతైన సత్యం దగ్గరకు, దైవికమైన మూలము, గమ్యము దగ్గరరు తిరిగి చేరుకొన్నందువల్ల ప్రాప్తిస్తుంది.

CWM 9:51-52

ఇష్టాయిష్టాల నధిగమించటం

దాదాపు, ప్రాథమికంగానే చెడ్డవైన కొన్ని స్వభావాలు, జన్మతః మోసం చేసేవి, అపకారం చేయాలని చూచే జీవులు కొన్ని వున్నాయి. తార్కికంగా పరిశీలిస్తే ఎవరైనా సరే, వికృతం గాకుండా, అతి సజహంగా, జంతు సహజ స్వభావంతో వుంటే — ఎందుకంటే ఈ విషయంలో అవి మనుష్యుల కన్నా చాలా ఉత్తమమైనవి, వికృతత్వం మానవ జాతితోనే మొదలైంది — అపుడతడు ప్రాథమికంగా అపకారం కలిగించేదాని నుండి ప్రక్కకు తొలగి నిలబడినట్లు, తనను తాను దాని దారి నుండి ప్రక్కకు తొలగించుకొని నిలబడ్తాడు. కాని సంతోష మేమిటంటే, యిలా జరిగే సంఘటనలు అరుదు. జీవితంలో మామూలుగా యెదు ర్కొనేవి ఒక విధమైన సమతుల్యత గల, చాలా కలగాపులగపు స్వభావం కలిగి వుంటాయి, అంటే శుభాశుభాలకు మధ్య సమతుల్యత అని చెప్పవచ్చు. అదీ గాక ఒకరు శుభాశుభ సంబంధాలను రెండింటినీ కూడా ఆశిస్తూండవచ్చు. గాఢ మైన అయిష్టతను సంవేదించాల్సిన కారణం కూడా లేదు. ఎందుకనగా తనలో కూడా అవన్నీ కలిసే వున్నాయి గదా (నవ్వుతూ) ఒకరి నొకరు యిష్టపడితేనే గదా కలుసుకొనేది.

పిశాచాల్లాంటి వాళ్లు కొంతమంది వుంటారని కూడా అన్నారు. వాళ్ళొక వ్యక్తి దగ్గర కొచ్చినప్పుడు, అప్రయత్నంగానే అతని ప్రాణిక శక్తిని, ఊర్జాన్ని పీల్చి వేస్తారు. అటువంటి వాళ్ళతో పెద్ద ప్రమాదమని, జాగ్రత్తగా వుండాలి. అటువంటి వాళ్ళు లేరని గాదు, కాని తరచుగా తటస్థపడరు. అదీ గాక, అటువంటి వాళ్ళు తారసిల్లినపుడు వాళ్ళ నుండి దూరంగా పారిపోవాలనీ అనడం లేదు.

కాబట్టి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలంటే మొట్టమొదట చేయవలసింది

తన యిష్టాయిష్టతల నధిగమించాలి. అది ముఖ్యం. ఒక చిరునవ్వుతో అన్నింటినీ చూడాలి.

CWM 9:181-82

ఒక నిశ్చిత విముక్తి


నీవు ఆధ్యాత్మిక మార్గంలో బాగా ముందుకు పోవాలనుకొంటే ముందుగా నూతన జన్మ వైపుకు వినయపూర్వకంగా పయనం ప్రారంభించాలి. అతిమానస అనుభవాలు ప్రాప్తిస్తాయనే భ్రాంతి ఆశించక ముందే ఆ జన్మ ఉపలబ్దిని పొందాలి.

నీకు ఊరట కల్గించడానికి ఒక్క విషయం చెప్తాను — నీకు తెలిసినా, తెలియక పోయినా, నీవు కావాలనుకొన్నా, అనుకొనక పోయినా — నీవు యీ కాలంలో భూమి మీద వున్నందున, నీవు పీల్చే గాలితో పాటు భూవాతావరణంలో విస్తరిస్తున్న యీ నూతన అతిమానస ద్రవ్యాన్ని గూడా పీలుస్తున్నావు. నీ వొక నిశ్చయాత్మకమైన అడుగు వేయగానే అది అందుకు అవసరమైన స్థితిగతులను నీలో సన్నద్ధంచేస్తుంది ఆకస్మికంగా వ్యక్తపడటానికి.

నీవు నిశ్చయాత్మకమైన అడుగు వేసేందుకు యిది నీకు సహాయ పడ్తుందో లేదో అనేది వేరే ప్రశ్న. దాన్నధ్యయనం చేయవలసి వుంది. ఎందుకనంటే, ఇప్పుడు ప్రాప్తిస్తున్న, అధికాధికంగా ప్రాప్తించబోతున్న అనుభవాలు పూర్తిగా క్రొత్తవి, ఏం జరుగబోతోందో ముందుగా తెలుసుకోలేం. విషయాన్ని మనం అధ్యయనం చేయవలసి వుంది. కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాతే యీ అతిమానస పదార్థం, నూతన జన్మ తేలికగా ప్రాప్తించేటట్లు చేస్తుందా లేదా అనేది చెప్పగలుగుతాం... దీన్ని గురించి నేను కొద్ది కాలం తర్వాత చెప్తాను. ప్రస్తుతానికి మనం వీటి మీద ఆధారపడకుండా, ఆధ్యాత్మిక జీవితం లోనికి ప్రవేశించడం మంచిది.

అది జరిగినపుడు, నీలో రేకెత్తిన ప్రశ్నలకు లేక నీవు నన్నడిగే ప్రశ్నలకు అన్నింటికీ సమాధానాలు లభిస్తాయి.

ఆధ్యాత్మికంగా జీవించాలని యెవరైనా అన్నపుడు దానర్థ మేమిటో నీవు తెలుసుకో గలుగుతావు, అపుడు జీవితమంటే నీ కున్న వైఖరి యెంతో భిన్నంగా తయారవుతుంది. ఆ క్షణంలో అహం లేకుండా జీవించడమనే ఒక గొప్ప విష



Cheerful endeavour

The joy that one finds in the effort towards the Divine.

యాన్ని, చాలా గొప్ప విషయాన్ని ,తెలుసుకొంటావు.

అప్పటి వరకూ నీవు దాని నర్థం చేసుకోలేవు. అహం వల్ల, లేక అహంతో తప్ప జీవించడం, కర్మ చేయడం పూర్తిగా అసాధ్యం అన్నట్లు కన్పిస్తోందని, మొత్తం జీవితమంతా అహం మీద ఆధారపడే వున్నదని అనుకొన్నావు. కాని యీ నూతన జన్మ తర్వాత, అహం వైపు చిరునవ్వుతో చూచి దానికి "మిత్ర మా! నీ అవసరం నాకిక ఎంత మాత్రం లేదు", అని చెప్పగలుగుతావు.

ముక్తికి సంబంధించిన ఒక గట్టి నిశ్చయాత్మకమైన భావాన్ని కలిగించ గల ఫలితాల్లో యిది కూడా ఒకటి.

CWM 9:337-38

ప్రాణికం వేసే మారు వేషం

వెంటనే ఫలితాలు కన్పించాలని జనం తొందర పడ్తుంటారు.

తరువాత అతిమానసాన్ని క్రిందికి లాగుతున్నామని నమ్ముతారు. నిజానికి వాళ్ళను చూచి పరిహసించే ఒక చిన్న ప్రాణిక వ్యకిత్వాన్ని దేన్నో వాళ్ళు లాగుతుంటారు. అది చివరకు వాళ్ళను వెర్రివాళ్ళను చేసి వదిలేస్తుంది. చాలా తరచుగా నూటికి తొంభై తొమ్మిది మందిలో జరిగేదిదే.

పెద్ద ఆటాడే, అట్టహాసం చేసే ఒక చిన్న వ్యక్తిత్వం, ఒక ప్రాణిక అస్తిత్వం వెలుగు క్రీడలవన్నీ. దాన్ని క్రిందికి లాగిన అర్భకుడు విభ్రమంతో "అదిగో అతి మానసం" అంటూ గోతిలో పడి పోతాడు. నీవు యదార్థమైన దివ్యవెలుగుతో సంపర్కంలో కొచ్చినపుడు, దానిని ఏదో విధంగా చూచి దానిని స్పృశించినపుడు మాత్రమే ప్రాణికాన్ని గుర్తించగలవు. అది పూర్తిగా ఒక రంగస్థలంపై కృత్రిమ వెలుగు క్రీడ లాంటిదనీ తెలుసుకొంటావు. కాని అలా కాకపోతే ఇతరులు దిగ్భ్రిమ చెందుతారు, కనులు మిరుమిట్లు గొలిపేవిగా వుంటాయి, 'అద్భుతం' అన్పించేవిగా వుంటాయి. ఆ తరువాత నిన్ను దగా చేస్తాయి. పరమ సత్యంతో సంపర్కం కలిగినపుడు, దానిని దర్శించినపుడు మాత్రమే చిరునవ్వు చిందించ గలవు.

అది బూటకం, దానిని గుర్తించడానికి నీవు సత్యాన్ని తెలుసుకొని వుండాలి.

అన్నింటికీ అట్టడుగున ప్రతిదానికీ ఆలాగే వుంటుంది. దృశ్యాలు చూపించే

అద్భుత రంగస్థలం లాంటిది ప్రాణికం — చాలా ఆకర్షణీయంగా వుంటుంది, కనులకు మిరుమిట్లు గొలిపేటట్లు వుంటుంది, మోసపూరితంగా వుంటుంది. నీవు యదార్థ దివ్యసత్యాన్ని తెలుసుకొన్నపుడు మాత్రమే, వెనువెంటనే, సహజంగా, కారణం లేకుండా "నా కది అవసరం లేదు" అని చెప్పగలిగే విధంగా దానిని గుర్తించ గలుగుతావు.

ప్రతిదాని విషయంలోనూ అంతే. మానవ జీవితంలో అది అత్యంత ప్రాధాన్యం ఎక్కడ వహించిందంటే, ప్రేమ విషయంలో. దాదాపు ప్రతి చోటా, ప్రాణిక ఆవేశాలు, ప్రాణిక ఆకర్షణలు, ప్రశాంతంగా కనుపించే యదార్థ సంవేదనల స్థానం ఆక్రమించాయి. కాని యితర సంవేదనలు నిన్ను కల్లోల మరుస్తాయి, సజీవమైనవనే సంవేదనను కలిగిస్తాయి. అది మోసం, నీకా విషయం తెలియదు, దాని ననుభూతి చెందలేవు. యదార్థ విషయ మేమిటో నీకు తెలియకపోతే దానిని స్పష్టంగా చూడలేవు. మానసిక మరియు దైవిక సంయోగం ద్వారా ప్రేమను స్పర్శిస్తే, అప్పుడు ఆ విషయం, డొల్లగా, బలహీనంగా, శూన్యంగా కన్పిస్తుంది. అది పైకి మాత్రమే కనిపించేదిగా, హాస్యాస్పదమైనదిగా చాలా సార్లు తమాషాగా కనిపించే కన్నా విషాదంగా కనిపిస్తుంది.

CWM 11:22-23

కుంగుబాటుకు తలుపు తెరవొద్దు

నీకు దృఢసంకల్పం వుండవలసిన అవసరం లేదు — నా సంకల్పాన్ని ఉపయోగించడం మాత్రమే చెయ్యి.

బిడ్డా! కుంగుబాటుకు, నిరుత్సాహానికి, తిరుగుబాటుకు తలుపు తీయొద్దు. ఇది నిన్ను సరియైన యెరుకకు చాలా దూరంగా తీసుకొని పోతుంది. సంతోషం ప్రవేశించను గూడా వీలులేని అంధకార లోతుల లోనికి కూరుకు పోయేటట్లు చేస్తుంది. నీ గొప్ప బలం నీ చిరునవ్వే. ఎందుకనంటే జీవితాన్ని చూచి యెలా హసించాలో నీకు తెలుసు, ధైర్యస్థైర్యాలతో, పట్టుదలతో, యెలా పని చేయాలో నీకు తెలుసు. ఈ విషయంలో నీకు ప్రత్యేకత వుంది. కాని నీవు యితరులన ఉదాహరణగా తీసుకొని వాళ్ళ ననుసరించావు. అసంతృప్తితో వుండడం, వ్యతిరేక వైఖరి కలిగి వుండడం, కుంగిపోవడం, వాళ్ళ దగ్గర్నుండే నేర్చుకొన్నావు,

ఇప్పుడు నీ చిరునవ్వును చెరిగి పోనిచ్చావు, దానితో పాటు నీకు నీపై నీ విశ్వాసాన్నీ, నమ్మకాన్ని సడలి పోనిచ్చావు. ఈ పరిస్థితిలో సమస్త దివ్యక్రియాశక్తులూ నీ మీద కేంద్రీకరించినా వ్యర్థమే — వాటిని స్వీకరించడానికి నీవు ఒప్పుకోవు.

ఒకే ఒక తరుణోపాయం వుంది, దాన్నంగీకరించడానికి నీవే మాత్రం తాత్సారం చేయవద్దు. నీ చిరునవ్వును తిరిగి తెచ్చుకో, నీ విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకో, యిదివరకటి ఆత్మవిశ్వాసం గల బిడ్డగా తయారవ్వు; నీ కష్టాల మీద, తప్పిదాల మీద మనసు పెట్టకు — నీ చిరునవ్వే వాటన్నింటినీ ప్రారద్రోలుతుంది.

CWM 16:67-68

ప్రాణికాన్ని మార్చడం

అగ్నిప్రభావం వల్ల నీ ప్రాణికంలో చోటు చేసుకొన్న మార్పుకు మరో గొప్ప సంకేతం నీ యిబ్బందులను, ఆటంకాలను ఒక చిరునవ్వుతో యెదుర్కోవడం. నీవు ఇంకెంత మాత్రం, నీ పొరపాట్లకు చింతిస్తూ, పూర్తిగా మిన్ను విరిగి పడ్డట్లు కుంగిపోయి — ఎందుకనంటే, ప్రస్తుతం నీవు యెలా వుండాలో అలా లేవు గనుక — అతి దైన్యస్థితిలో పడి వున్నట్లుండి పోయావు. నీ చిరునవ్వుతో కుంగుబాటును తేలికగా పారద్రోలుతావు, వంద తప్పులైనా లెక్క చేయవు, నీవు తప్పు చేసానని చిరునవ్వుతో గ్రహించి, చేసిన తప్పును యిక ముందు మళ్ళీ చేయనని తీర్మానించుకుంటావు. నీ మీదకు ఒక విషాద వాతావరణాన్ని బరపి నప్పుడు పొందే ఆనందం కంటె మించిన ఆనందాన్ని మరెప్పుడూ పొందని ప్రతికూల శక్తులచే సమస్త క్రుంగుబాటు, విషాదం సృష్టించబడ్డాయి. వినయం వేరు, కుంగుబాటు వేరు, మొదటిది దైవిక చేష్ట, తరువాతిది చీకటి శక్తుల అత్యంత అనాగరిక వైఖరి. అందుచేత, సంతోషంతో, సుస్థిర ఆనందంతో రూపాంతరీకరణ మార్గంలో నున్న అవరోధాలను వ్యతిరేకించు. శత్రువును మట్టు బెట్టేందుకు ఉత్తమమైన ఉపాయం, అతని నెదుర్కొని, ఆతని ముఖంపై నవ్వడమే. అతనితో నీవు రోజుల తరబడి కుస్తీ పట్టవచ్చు, అయినా అతడు క్షీణించని బలంతో పోరాడుతూనే వుండవచ్చు, కానీ ఒక్కసారి అతడిని చూచి నవ్వితే, ఇహ చూడు! కాళ్ళకు బుద్ధి చెప్తాడు, పలాయనం చిత్తగిస్తాడు. ఆత్మ-విశ్వాసంతో, దైవం యెడల విశ్వా

సంతో నవ్వే నవ్వుకు దేన్నైనా చెదర గొట్టి వేయగల అత్యంత అధిక బలం వుంటుంది. అది శత్రుమూకను కకావికలం చేస్తుంది, అతని సైన్యంలో భయాన్ని వ్యాపింప జేస్తుంది, నిన్ను విజయవంతంగా ముందుకు తీసుకుపోతుంది.

మార్పు చెందిన ప్రాణికం, సాక్షాత్కార ప్రక్రియలో ఆనందాన్ని కూడా పొందుతుంది. ఆ ప్రక్రియలో యిమిడి వున్న సమస్త యిబ్బందులను అది ఆస్వాదిస్తుంది. దానికి పరమ సత్యం దర్శనమైనపుడు, దాని నిమ్న స్వభావంలో తొణికిసలాడే అసత్యాన్ని నగ్నంగా చూపినప్పుడు పొందే ఆనందం కంటె, యెక్కువ ఆనందాన్ని అదెన్నడూ పొందలేదు. పెనుభారాన్ని మోసుగు పోతున్నట్లు అదెప్పుడూ యోగసాధన చేయదు, దాన్నొక ఆనందదాయక కార్యక్రమంగా చేస్తుంది. రూపాంతరీకరణ చేయవలసి వున్నట్లైతే, యెంత అధికతర కష్టాన్నైనా అది చిరునవ్వుతో చేసుకుంటూ పోవడాని కిష్టపడుతుంది. దానిని గొణగకుండా, పితూరీ చేయకుండా, సంతోషంగా భరిస్తుంది. ఎందుకనంటే దైవం కోసం గదా అది ఆ పని చేస్తున్నది. విజయం సాధిస్తామనే అచంచలమైన దృఢ విశ్వాసం దాని కుంది.

CWM 3:138-39

బాధ: సమర్పణం సంపూర్ణం కాలేదనే దానికి సంకేతం

బాధ పడ్తున్న వాళ్ళందరికీ చెప్పే విషయం ఒక్కటే. సమస్త బాధ, సమర్పణ సంపూర్ణం కాలేదనే దానికి చిహ్నం. ఆ విధంగా నీలో ఒక 'విస్ఫోటనం' అనుభూతమైతే "ఓహ్, యిది మంచిది కాదు" అని చెప్పే బదులు, లేక "యీ పరిస్థితి దుర్భరం" "నా సమర్పణ సంపూర్ణం కాలేదు" అని చెప్పుకోవాలి. అలా చేయడం మంచిది. నీకు సహాయం చేసి, నిన్ను నడిపే దైవకృపను అనుభూతి చెందుతావు, ముందుకు పోతుంటావు. ఏదో ఒక రోజు, నిన్నేదీ యిబ్బంది పెట్టలేని మహాశాంతి లోనికి ఎదుగుతావు. సమస్త విరుద్ధ శక్తులకు, విరుద్ధ కదలికలకు, దాడులకు, అపార్థాలకు, దుస్సంకల్పాలకు దైవకృప యందుండే నమ్మకం నుండి వెలువడే అదే చిరునవ్వుతో నీవు సమాధానం చెప్ప గలుగుతావు. అదొక్కటే బయటపడే దారి, మరొకటి లేదు. ఈ ప్రపంచం సంఘర్షణాత్మకం, బాధామయం, వ్యధామయం, ఒత్తిడితో నిండినది, వాటితోనే అది తయారైంది, అదింకా మార

లేదు, మారడానికి కొంత సమయం పడ్తుంది. ప్రతివాడూ బయట పడడం సంభవమే. పరాత్పరుని కృపాకటాక్షం పైనే నీవు ఆధారపడాలి, బయటపడే ఒకే ఒక మార్గం అదే.

CWM 5:398-99

యోగి యొక్క యథార్థ వైఖరి

నీవు దైవానికి చేరువైనపుడు, సమస్త మానసి అవగాహనలను విడిచి వేయాలి. అందుకు బదులుగా, నీ భావనలను దైవానికి ఆపాదించి వాటి ప్రకారం నీవు నడచుకోవాలని దైవాన్నడుగుతావు. దైవాజ్ఞ యేదైనప్పటికీ దానికి విధేయమై వుండేందుకు నమ్యంగా తయరు గావడం, సంసిద్ధంగా వుండడం అనేది యోగికి ఒకే ఒక యధార్థ వైఖరై వుండాలి. అతని కేదీ అవర్జనీయం కాకూడదు, యేదీ భారం అనిపించ కూడదు. ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించా లనుకొనేవాళ్ళు తరచుగా మొదట్లో చేసే పని, వాళ్ళ కున్నదాన్నంతా త్యజించడం. భారం వదలించుకొందామని వాళ్ళలా చేస్తారు, గాని దైవానికి సమర్పిద్దామని గాదు. భాగ్యవంతులు వాళ్ళకు విలాసవంతమైన జీవితాన్నిచ్చే వాటితో, భోగం కలిగించే వాటితో చుట్టబడి వున్న వాళ్ళు దైవం వైపు తిరిగిన వెంటనే వాటన్నింటికీ దూరంగా పోవాలనుకొంటారు — లేదా 'వాటి పాశాల నుండి తప్పించుకొనడానికి' అని వాళ్ళంటారు. కాని అది మంచి నడక కాదు, నీ కున్న వాటిని నీవే అని అనుకో కూడదు — అది దైవానివి. నీ వేదైనా భోగించాలని దైవం అనుకొంటే దాన్ని భోగించు — కాని మరుక్షణమే చిరునవ్వు వదలి వేయడానికి కూడా సిద్ధంగా వుండాలి.

CWM 3:54-55

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

భగవంతుని దరహాసం

శాశ్వతత్వంలో తేలియాట

కొన్ని సార్లు విషయాలు ముందుకు సాగకుండా నిలిచిపోతాయి. ఎంతగానో అస్పష్టమైనవిగా, అవివేకమైనవిగా కనిపిస్తాయి. అప్పుడు నీవు వాటిని కేవలం నిరపేక్షంగా ధారపోసినట్లు వదిలించుకుంటే (ధారపోసిన సంజ్ఞ), కనీసం వాటిని గురించి ఆలోచించకుండా ఉండగలిగితే — తక్షణం ఒక దివ్యానందం వర్షించి నట్లుగా నుంటుంది. ఒక చిన్న విషయం అల్పమైనదిగా, అత్యంత మూర్ఖమైన దిగా, తెలివిమాలినదిగా, పట్టు వీడనిదిగా కనిపించేదానిని, నీవు ఆ విధంగా చేసినట్ల యితే (చేయాలనుకుంటే చేయగలవు): "తీసుకో, తీసుకో" అంటూ దైవార్పణ గావిస్తే, నిజంగా అర్పించినట్లయితే: "అది నీవే, అది నీదే, తీసుకో. నీ కిష్టమైనట్లు గా వాడుకో" అంటూ అర్పించితే, తక్షణం ఈ విధంగా కుంచించుకు పోతున్న అత్యంత బాధాకర అనుభూతికి బదులు, "దీనంతటితో ఈ లోకంలో నేను చేసేదే మిటి?" అన్నట్లుగా వాస్తవమగు పరమానందం ఒక వర్షపు జల్లులా కురుస్తుంది. కానీ, ఈ ప్రతిబంధకాన్ని పునరాహ్వానం చేసేటంతటి మూఢుడవైతే, అది తిరిగి దాపురిస్తుంది. కానీ నీవు నిశ్చలంగా నుండ గలిగితే,నీ మస్తిష్కాన్ని ప్రశాంతంగా నుంచ గలిగితే, అది తొలగిపోతుంది. అయితే, అలాంటి అంశాలు వేలకు వేలుం టాయి....

ఈ పరిస్థితిని కూడా ఆనందంగా అనుభవించవచ్చు.

ఈ విధమైన దేదో జరిగినట్టి అనుభూతి చిరస్థాయిగా నిలుస్తుంది. అది ఆనంద దాయకమైనది, ప్రశాంతంగా నుంటుంది, ఒక శాశ్వతత్వంలో తేలియాడుతున్న ట్లుగా.

నీ గురించి గానీ, లోకం గురించి గానీ, మరే విషయం గురించి గానీ చింతించ నవసరం లేని ఒక స్థాయిని చేరుకుంటావు. దానిని చేరుకున్నప్పుడు, ఎల్ల వేళలా చిరునవ్వు చిందిస్తావు, సర్వదా సంతోషంగా నుంటావు. ఎప్పుడు, ఏమి జరిగినా పట్టించుకోవు, ఒక చిరునవ్వుతో పరికిస్తావు. చిరకాలం చిరునవ్వు కొనసాగుతుంది

The Mother: Conversations with a disciple, July 23, 1960

సానుభూతితో కూడిన అవగాహన వెలిబుచ్చే చిరునవ్వు

ఎందరో స్నేహితులు గల ఒక స్త్రీమూర్తి విషయం పరిశీలిద్దాం. ఈ స్నేహితు లంతా, ఆమె కున్న కొన్ని ప్రత్యేక లక్షణాల పట్లా, ఆమె సహవాసమొసగే సరదాల పట్లా ఆకర్షితులై, ఆమె నుండి ఏదో ఆనందం పొందగలమని ఆశించి, ఆమెపై మక్కువ పెంచుకుంటారు. పరిస్థితులు తారుమారవటంతో — బహుశా ఆమె మరొక పురుషునితో లేచిపోవటమో లేక చట్టబద్ధమైన వైవాహిక స్థితిని విడిచి వేరొక పురుషునితో సహజీవనం సాగించటం లాంటివి చోటు చేసుకోవడంతో, అర్థరహిత సామాజిక కట్టుబాట్ల ఉల్లంఘన జరిగినందున, ఇది వరలో ఆమె ఎదురై నపుడల్లా చిరునవ్వుతో స్వాగతించిన స్నేహితులు ఇప్పుడు వారి చూపులు మరలించి తిరిగి చూడకుండా సాగిపోతారు. తాను సామాజిక బహిష్కరణకు గురియైనట్లుగా ఆమె గ్రహిస్తుంది. ఇటువంటి సంఘటన ఇక్కడ ఆశ్రమంలోనే జరిగింది! నేను వివరాలు వెల్లడించను గాని, సామాజిక కట్టుబాట్లకు విరుద్ధంగా జరిగినపుడంతా ఆ విధంగానే జరిగింది. ఎంతో ఆప్యాయత, ఆదరణ కనబరచిన వారంతా ఓహ్! కొన్ని మార్లు "ఆమె ఒక పతనమైన స్త్రీ" అని కూడా అన్నారు.

అలాంటిది ఇక్కడనే జరిగిందంటే, ఇక ఈ విశాల ప్రపంచంలో అలా జరగడం మామూలే అని అంటాను. కానీ, అలాంటి సంఘటనలు ఇచ్చట చోటు చేసుకున్న ప్పుడల్లా నాకు కొంత దిగులు కలుగుతుంది. అందువలన నన్ను నేను ఇలా సంబాళించుకుంటాను, "కాబట్టి వారింకా ఆ స్థాయిలోనే వున్నారు!", అని.

తాము విశాల భావనలు గల వారమని, ఇట్టి 'సాంప్రదాయాలను' అధిగమిం చిన వారమని చెప్పుకొనే వారంతా వెంటనే ఉచ్చులో పడిపోతారు. ఇక వారి అంతరాత్మలను కుదుట బరచుకొనడానికి, "శ్రీమాత అట్టి దానిని జరుగనీయరు, శ్రీమాత అలాంటివి ఆమోదించరు, శ్రీమాత దానిని సహించరు", అని అంటూ మరింత శుష్కవాదాన్ని జోడిస్తారు.

ఇటువంటి స్థితి నుండి బయల్పడటం చాలా కష్టం. అది వాస్తవానికి తాను నీతిపరుడనని వంచించే లక్షణం — సామాజిక గౌరవం అనే ఇట్టి అహంభావం, ఇట్టి సంకుచిత మనస్తత్వం — ఎందుకనగా అణుమాత్రం తెలివితేటలు గలవాడు కూడా ఇలాంటి గోతిలో పడడు! ఉదాహరణకు, ప్రపంచమంతా చుట్టి వచ్చిన

వారు, ఇట్టి అర్థరహిత సామాజిక అతిశయాలు పూర్తిగా వాతావరణ పరిస్థితుల పైన, జాతులు, ఆచారాల పైన, అంతకు మించి గడుస్తున్న కాలపరిస్థితుల పైన, దేశ చరిత్ర పైన ఆధారపడి వుంటాయని స్వయంగా గ్రహించినవారు — వీటన్నింటిని చిరునవ్వుతో గమమించ గలుగుతారు. కాని ఆత్మగౌరవం అతి ముఖ్యమని తలచేవారు... గమనించ లేరు.

ఇది ఒక ప్రాథమిక స్థాయి. ఈ స్థితిని అధిగమించి పోనంత వరకు, నీవు యోగానికి తగవు. ఎందుకనగా ఇట్టి ప్రాథమిక స్థితికే కట్టుబడి వుండే వారెవరు కూడా యోగాభ్యాసానికి సంసిద్ధులు కారు.

The Mother: Coversations with a disciple, January 12, 1961

భగవంతుడు గావించే ప్రక్షాళణ

ఆ స్థితి నేను చైతన్యవంతమైనట్లుగా నుండింది, శరీరం చైతన్యవంతమైన ట్లుగా నుండింది (లెక్క లేనన్ని రోగాలు, దాడులు, దుస్సంకల్పాల తాకిడులు దానిని అస్తవ్యస్తం గావించినప్పటికీ) ఒక దివ్యమైన పులకరింతల చేతనలో ప్రక్షా ళణ గావించబడినట్లు — ఏదో ఒక సమృద్ధమైన దానిలో, బ్రహ్మాండమైన దానిలో, అమితమైన దానిలో, ప్రక్షాళించబడినట్లుగా నుండింది — ఎంత నిశ్చలమగు అనుభూతి! దానిలో దేహం ఈ విధంగా (శ్రీమాత తేలియాడుతున్నట్టి అభి నయం) సచేతనమై వుంటుంది. మనం దైహికమైన బాధ అని దేని నంటామో ఆ బాధ ననుభవిస్తున్నప్పటికి, ఆత్మవిశ్వాసాన్ని కృంగదీసే తాకిడులు తగులుతున్న ప్పటికీ (ఒక షరాబు నిన్ను పైకం చెల్లించమని ఒత్తిడి పెంచినా ఈయడానికి నీ వద్ద ఏమీ లేనట్టి) అలాంటి వెన్నో ఎదురైనప్పటికీ, ఒకేసారి చిక్కు పరిస్థితులన్నీ ఎదురైనప్పటికీ, ప్రస్తుతం సంభవించేది ఏదైనా, మన మనోభావనలను, మానసిక స్పందనలను కించపరచే అసహ్యకర మగునవి ఏవైనా, అన్నీ ఒక ప్రక్షాళన లాంటి వే. దివ్యప్రేమ పులకరింతలలో జలకమాడి నట్లుండేవే. ఆ అనుభూతి ఎంత తీవ్రంగా నుంటుందంటే, నా దేహాన్ని అదుపులో నుంచకపోతే, అన్నింటి పట్ల, అన్ని వేళలా ఒక మూఢురాలిగా చిరునవ్వు లొలక బోస్తుండే దానిని. ప్రతిదానికి

ఒక దివ్యానంద మందహాసం వుంటుంది. (నన్ను నేను అదుపులో నుంచుకుం టాను కాబట్టి దానిని ప్రదర్శించను.)

The Mother: Coversations with a disciple, March 27, 1961

ప్రశాంతమైన మందహాసం

నేను చూడటం ప్రారంభించానంటే, నీకు తెలుసా, రెండు విషయాలు జతగా జరుగుతాయి (శ్రీమాత తన కళ్ళను మూస్తారు): ఆ మందహాసం, ఆ ఆనందం, ఆ అంతర్హాసం, అటు పిమ్మట... ఆ ప్రశాంతం! ఓహ్, నిజంగా అంత ప్రశాం తత... అంత — నిండైన, వెలుగులు విరజిమ్మే ఒక ప్రశాంత స్థితి... సంపూర్ణమై నది: ఇక పెనుగులాటలు లేవు, వైరుధ్యాలు లేవు, ఒకే ఒక తేజోమంయ సామ రస్యత... అయినప్పటికీ అన్నీ వున్నాయి — పొరపాటు, బాధ, దుఃఖము అని మనము అనేవి అన్నీ అక్కడ వున్నాయి. ఏదీ లేకుండా చేయబడ లేదు. ఇది పరిస్థితిని, మరొక కోణంలో చూడటం.

(దీర్ఘ నిశ్శబ్దం)

ఇక చెప్పాల్సిందేమీ లేదు — నీకు అందులో నుండి నిజంగా బయటపడాలనే చిత్తశుద్ధి గల కోరిక వుంటే, నిజంగా అది ఏమంత కష్టం కాదు: చేయాల్సిందేమీ లేదు, అంతా ఆ ప్రభువుకు వదిలేయటం తప్ప. ఇక అంతా ఆయనే చేస్తాడు. అంతా ఆయనే చేస్తాడు, అతడు... అది ఎంత అద్భుతం! ఎంత ఆశ్చర్యం1

అతడు దేనికైనా బాధ్యత వహించగలడు, మనం అతి సాధారణ మేధాశక్తి అనే దానితో సహా. అటు పిమ్మట మామూలుగా దానిని ఏ విధంగా పక్కన పెట్టాలి, ఏ విధంగా దానిపై ఆధారపడకుండా వుండాలో చూపిస్తాడు. "ప్రస్తుతానికి అక్కడ వుండు, చప్పుడు చేయకు, కదలకు, నన్ను చికాకు పరచకు, నాకు నీ అవసరం లేదు" అన్నట్లుగా. అప్పుడు ఒక ద్వారం తెరుచుకుంటుంది — దానిని తెరవాలనే భావన కూడా నీకు కలుగదు. అది బార్లా తెరచుకొని వుంటుంది. దాని గుండా నీవు ఆ దరికి చేర్చబడతావు. ఇదంతా చేసేది వేరెవరో మహా పురుషుడు, నీవు కాదు. అటు పిమ్మట... మరొక మార్గం అసాధ్యమౌతుంది.

ఓహ్! ఈ ఘోర ప్రయాస అంతా, అర్థం చేసుకొనుటకు మనస్సు చేసే ప్రయత్నమంతా!

పెనుగులాడుతూ, తనకు తాను తలనొప్పి కొని తెచ్చుకుంటూ — విసుగ్గా లేదూ! పూర్తిగా నిష్ప్రయోజనం, పూర్తిగా నిరుపయోగం. ఎక్కడికీ దారి తీయదు, మరింత గందరగోళానికి తప్ప.

ఒక 'సమస్య' అనబడే దానిని ఎదుర్కొంటున్నానని స్వయంగా తెలుసుకుంటావు. "నేనేం అనాలి? నేనేం చేయాలి? నేనేవిధంగా ప్రవర్తించాలి?..." చేయడానికి ఏమీ లేదు! ఏమీ లేదు, భగవంతునికి. "నీవే చూడు, ఇదీ పరిస్థితి" అనటం తప్ప. అంతే. ఇక నిశ్చలంగా వుండు. అప్పుడు అమాంతంగా, ఆలోచించకుండానే, జ్ఞప్తికి తెచ్చుకోకుండానే, ఊహించకుండానే, ఏమీ చేయకుండానే, ఏదీ కూడా, కనీస ప్రయత్నం చేయకుండానే.... చేయవలసిందేదో చేసేస్తావు. కానీ అది చేసేది ఆ ప్రభువు. ఏ మాత్రం నీవు కాదు. అతనే చేస్తాడు, అతనే అందుకు అనువైన పరిస్థితులను కల్పిస్తాడు, మనుషులను ఏర్పాటు చేస్తాడు, నీ నోటికి లేదా నీ కలం క్రింద, అవసరమైన మాటలను అందిస్తాడు — అంతా ఆయనే చేస్తాడు, అంతా, అంతా, అంతా. ఆ పైన నీవు చేయాల్సిందింకేమీ వుండదు, ఏమీ వుండదు, నీవు స్వయంగా ఆ దివ్య కృపాకటాక్ష ఆనందమయ ఆవాసంలో వసించడం తప్ప.

జనులు నిజంగా దీనిని కోరటం లేదనే నమ్మిక నాలో మొదలయింది.

The Mother: Coversations with a disciple, October 12, 1962

దివ్యజ్ఞానం, దివ్యప్రేమ లొలికే మందహాసం

ఇది చూడ చోద్యంగా నుంటుంది: భూలోకంలో జీవితం గడపటానికి, సాఫల్యం చేసుకోవడానికి మనుషులు ప్రయత్నించి చూచిన మానసిక పథకాలన్నీ ఆదేశించ బడుటకు, పారదర్శకం గావించ బడుటకు, వాటి ప్రత్యేక లక్ష్యాల సాధనకు నిర్దేశించబడిన విధంగా తీర్చిదిద్ద బడుటకు, సంయోగపరచ బడుటకు, నలు ధిశల నుండి నా వద్దకు ఇలా చేరతాయి. ఆ విధంగా 'గొప్పవి' అని ఊహించబడే సమస్యలన్నీ నన్ను చేరగానే, వెంటనే ఓ శిశువు తడుములాట చూచినపుడు ఆప్యాయతను వెలిబుచ్చే చిరునవ్వు లాంటి మందహాస మొకటి వెలువడుతుంది. అది ఒక ఆధిక్యతా భావనతో కూడినది కాదు — అలాంటి దేమీ లేదు — కేవలం సమస్యను సరిదిద్దడానికి వాడే పరికరం నిరుపయోగ మైనప్పుడు కలిగే భావ

వ్యక్తీకరణ. ఒక విధంగా నిశ్చయాత్మకమైన పరిష్కార అవకాశం భౌతిక ప్రపంచపు లోతుల్లో నుంటుంది. అది ఒక బలమైన భావన, చాలా బలమైన భావన. ఓహ్, ఎంత హడావిడి, ఎంత హడావిడి, ఎంత నిరర్థక ప్రయత్నం చేసావు! అవసరమై నంత అంతర్ముఖమై ఆలోచించు, తగినంత ప్రశాంతంగా నుండు, అప్పుడు అది సార్థకమౌతుంది. నీవు దానిని అర్థం చేసుకోలేవు: అది జరిగి తీరుతుంది.

అది నీవు అర్థం చేసుకోలేవు. ఎందుకనగా నీవు అవగాహనారహిత సాధనలను వాడుతున్నావు. కానీ అది అర్థం కాదు: జరిగి తీరాల్సిందే.

నీవు ఏ విధంగా నుంటే, నీవు అదే అవుతావు, అంతే. ఇక ఏ సమస్య వుండదు.

ఇదంతా క్రిందనే వుంది. భూ ఉపరితల స్థాయిలో. కానీ, ఆ గొప్ప సైద్ధాంతిక ఆధ్యాత్మ విద్యా సాంప్రదాయాలన్నీ, ఆ విశిష్ట ఆధ్యాత్మిక ఆలోచనా స్రవంతు లన్నీ, ఆ ఉన్నత దివ్యానుభూతులు, ఆ గొప్ప... మత సాంప్రదాయాలు — అంత కన్నా క్రింది స్థాయికి చెందినవి — అవన్నీ, ఎంత కుర్రతనపు చేష్టలు!

ఇక ఆ విజ్ఞానం!... అది ఇంచుమించు ఖండ ఖండాలుగా విభజింప బడింది (అదొక వింత). ఉదాహరణకు అతి గొప్ప అధిమానస మరియు అంతకు మించిన స్థాయికి చెందిన జీవులందరి సమగ్రమైన కర్మానుష్ఠానాన్ని గురించి వారితో నాకున్న సన్నిహిత సంబంధం గురించి, శాశ్వత దివ్యజననిగా నుండుటలోని నా అంతరంగ స్ఫూర్తిని గురించి ఆలోచిస్తున్నప్పుడు — అదంతా బాగానే వుంటుం ది కానీ నాకు అది ఒక పురాతన చరిత్ర. ప్రస్తుత మిక్కడ వున్న నేను, భూ ఉపరితల స్థాయిలో అస్తిత్వం కలిగి వున్నాను. అది శరీరం, అది భౌతిక పదార్థం, భూ ఉపరితల స్థాయిలో నున్నది. నిజం చెప్పాలంటే, అది ఆ జీవులందరి జోక్యా న్ని అంతగా ఖాతరు చేయదు... అసలు వారందరికీ ఏ మాత్రం అవగాహన లేదు! వారికి నిజంగా సమస్య ఏమిటో తెలియదు. వారు సమస్యలే లేని క్షేత్ర స్థాయిలో నివసిస్తారు. వారికి సమస్య యొక్క వాస్తవికత తెలియదు — నిజమైన అసలు సమస్య ఇక్కడ వుంది.

ఇది అన్ని మతాలను, అందరు దేవుళ్ళను చోద్యంగా చూడటం లాంటింది — అవన్నీ రంగస్థల ప్రదర్శనల్లా వుంటాయి. అన్నీ కాలక్షేపానికి పనికొచ్చేవే, కానీ అవి నిన్ను నీవు స్వయంగా ఎలా తెలుసుకోగలవో నేర్పించ లేవు. ఏ

మాత్రమైనా! అందుకు నీవు అట్టడుగు దాకా వెళ్ళాల్సిందే.

ఇది, ఈ అట్టడుగు వరగు దిగటం, అన్వేషిస్తూ... అది తెలియనిది కాదు, అది తెలియనిది కాదు — అది ఒక విస్ఫోటనం (అది నిజంగా ఒక విస్ఫోటనంలా వుంటుంది). దివ్యప్రేమ ప్రకంపన ఉప్పొంగి బద్దలైనట్టి అద్భుతం అది.... అది స్మృతి పథంలో నిలిచిన జ్ఞాపకం. దానిని క్రియాశీల వాస్తవంగా మార్చటం మనం చేసే ప్రయత్నం.

The Mother: Coversations with a disciple, October 30, 1964

మనం కేవలం చిరునవ్వును వెలబుచ్చగలం, అది అత్యుత్తమమైన చికిత్స — నవ్వు, చిరునవ్వు. మనం నవ్వడం నేర్చుకోవాలి, అధికంగా, అత్యాధికంగా.

The Mother: Coversations with a disciple, May 11, 1964

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శూన్యమైన విశాల సీమలందు వెలసిందొక
కారుణ్య కాటాక్షమొలుకు దివ్య మనో స్పందన,
స్వచ్ఛమైన ఆధ్యాత్మిక చెలమలందు ఉప్పొంగిన
గాఢమైన దివ్యప్రేమ వాహినిలో విలీన మొందె
అజ్ఞాన అగాధాల నలముకొన్న విషాద చాయలన్ని,
బాధలన్ని ఆమె అమరమైన చిరుహాస మందు అంతరించె.

CWSA 33:313-14

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



ఆమె మన కోర్కెలను తీర్చే తల్లి, మన కష్టాలలో ప్రశాంత చిత్తంతో తోడుగా నుండే సన్నిహితురాలు, పరమ శాంతమూర్తి యగు పట్టు వీడని మార్గదర్శనం చేసే అనుభవజ్ఞురాలు, తన తేజోవంతమైన చిరునగవుతో సమస్త విచారాన్ని, చికాకును, అధైర్యాన్ని అంతం చేసి, సర్వ కాల, సర్వావస్థలలో ఆసరా అందుబాటులో నుంటుందని గుర్తు చేస్తూ, సూర్యకాంతిలో విలసిల్లే తేజమయ స్థితి వైపు మన దృష్టిని సారిస్తూ, మనలను ఉన్నత స్వభావ సమగ్రత దిశగా తరలించుటకు దృఢ చిత్తంతో, తడబడకుండా, తీవ్రమైన పట్టుదలతో ప్రేరేపిస్తుంది.

CWSA 32:23

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దైవ దరహాసం

"సేద దీర్చగల సుఖనిద్ర, తియ్యనైన చిరునవ్వు అడ్డంకులను తొలగించే సూర్యకిరణం వంటివి. సూర్యతాపం వెన్నను కరగించినట్లు అవి అపోహలను అంతమొందిస్తాయి".

Mother Said So, 24-12-57

ఆయన అరుపులను నీవు చిరునవ్వుతో, ప్రశాంత చిత్తంతో, హృదయపూర్వకంగా స్వీకరించ గలిగితే అదే పదివేలు. నీవు నీ లక్ష్యానికి చేరువగా ఉన్నట్లే.

ఈ విధంగానే సత్యం ఎంత బలమైనదో అతనికి తెలుస్తుంది. నీ కార్యసాధనను సులభం చేస్తుంది. నీ సాధనకు నేనూ తోడుంటాను.

White Roses, p. 198

కష్టాలు వస్తూనే వుంటాయి, కాని చిరునవ్వుతో, మరింత చిరునవ్వుతో స్వీకరిస్తూనే వుండు. అది కారుమబ్బులను అంతం చేసే కాంతిరేఖ వంటిది. మంచి ఫలితాన్ని ఇచ్చే నివారణ కావాలంటే నిష్కల్మషంగా ఉండు. పూర్తి నిజాయితీతో ఉండాలి సుమా! ఉన్నదున్నట్లు నాకు చెప్పు. త్వరలోనే నివారణ లభిస్తుంది. అది సంపూర్ణం గాను, ఆనందంగాను ఉంటుంది కూడా.

CWM 16:101

పరిస్థితులు ఏ విధంగా వున్నా, చిరునవ్వుతో స్వీకరించ గలగటం దివ్యమైన జ్ఞానానికి దగ్గర మార్గం.

CWM 17:366

మబ్బులను విచ్ఛినం చేసే సూర్యరశ్మి వంటిది చిరునవ్వు.

*

అతిగా వుండే చిరునవ్వు ఎప్పుడూ ఉండదు. దేన్నయినా చిరునవ్వుతో స్వీకరించ గల వ్యక్తి నిజమైన అంతరాత్మ సమతుల్యతకు అతి చేరువగా ఉంటాడు.

*

సాధారణంగా చెప్పాలంటే మృగం లాంటి మానవుడు తనకు చెందిన విషయాలను అతి తీవ్రంగా తీసుకుంటాడు. అందువలన ఎవరి కష్టాలను వారు చిరునవ్వుతో స్వీకరించ గలగటం, ఇతరుల కష్టాలను, భ్రాంతులను, ఆకాంక్షలను, బాధలను, కోపతాపాలను, తిరుగుబాట్లను వాటితో పాటు తమ ఆశయాలను చిరునవ్వుతో

చూడ గలగటం నేర్చుకోవాలి. ఎందుకనగా చిరునవ్వు తనపై తనకు గల అధికారాన్ని పటిష్టం చేసి రక్షించగల పదునైన శస్త్రిం వంటిది

*

అన్ని పరిస్థితులలో, అన్ని వేళలా, నీ కష్టసుఖాల్లో, నీ ఆశయ సాధనలో, నీ బాధలలో చిరునవ్వు నవ్వడం నేర్చుకో. ఎందుకనగా చిరునవ్వులో వుంది నీపై నీకు గల అధికారాన్ని పటిష్టం చేసే మహోన్నత శక్తి.

*

జీవితాన్ని చిరునవ్వుతో అవగాహన చేసుకుంటే అది నిన్ను ఎప్పుడూ చిరునవ్వుతోనే ఉంచుతుంది.

*

ఒకరు చిరునవ్వును శాశ్వతంగా నిలుపుకో గలిగితే, వారు యవ్వనాన్ని శాశ్వతంగా నిలుపుకో గలరు.

*

నిరంతర దరహాసం: దైవం మాత్రమే చూపగలిగే దయ.

*

మానావమానాలను జయించినవాడే శత్రువు నైనా చిరునవ్వుతో చూడగలడు. ఇది యోగిక వైఖరి యొక్క ప్రాథమిక నియమం.

*

చిరునవ్వు ఎదుటివారిని నిరాయుధులను చేస్తుంది.

CWM 14:177-78

*

మందహాసంతో ఉద్యమించటం అంటే దివ్యత్వం వైపుగా సాగుతున్న కృషిలో ఆనందం ఆస్వాదించటం.

*

మానసిక ఉల్లాసం అంటే అన్నింటిలో ఆనందాన్ని గుర్తించటం.

*

మనసులో ఉల్లాసంగాను, హృదయంలో ప్రశాంతంగాను ఉండటం ఆశించండి. సమతౌల్యాన్ని ఎప్పుడూ చెదరనీకండి. దిన దినమూ మీ లక్ష్యం దిశగా నాతో

పాటు ముందుకు సాగుటకు అవసరమైన పురోగతిని పొందండి.

*

హృదయానందం అంటే: చిరునవ్వుతో, ప్రశాంతంగా, సంకుచిత భావన లేని, మచ్చలేని మనుగడ.

*

నాటకీయంగా ఉన్నప్పటి కన్నా, ప్రశాంతమైన ఆనందంగా నున్నప్పుడే నీవు అధికంగా సహాయపడ గలవు అనే విషయం ఎప్పుడూ మరవకు.

*

సంతోషాన్ని పొందే ప్రయత్నం సఫలమౌతే నీవు దివ్యజ్యోతికి చేరువౌతావు.

CWM 14:179

*

నా బిడ్డా, సంతోషంగా నుండు, అది పురోగతికి నిశ్చితమైన మార్గం.చిరాకు పడవద్దు. ప్రతికూల శక్తులు ప్రవేశించి నిన్ను క్రుంగదీస్తాయి. చిరునవ్వు చిందిస్తూ వుండు. నేను ఛలోక్తులను విసురుతూనే వుంటాను. నాది కేవలం హాస్యం కాదు; అది ఆత్మ విశ్వాసం, మనోజనితమైనది. దివ్యత్వాన్ని ఏదీ అడ్డుకో లేదనటానికి చిరునవ్వే సంకేతం; చివరకు అంతా సవ్యంగానే జరుగుతుందనే దానికి సూచిక!

CWM 14:221

*

కష్టాలను దాటాలంటే చిరునవ్వే బలం ఇస్తుంది; నిట్టూర్పు కాదు.

*

అందరికీ ఆటంకాలు వస్తూనే వుంటాయి. వాటిని ఎదుర్కోవటంలోనే తేడా లుంటాయి. కొందరు చిరునవ్వుతో ఎదుర్కొంటారు, కొందరు కలవర పడతారు.

CWM 14:229

*

దివ్యత్వాన్ని ఆకాంక్షిస్తూ నిరంతరం అంతర్గతంగా జీవించటం అంటే జీవితాన్ని మందహాసంతో గడపటం, బాహ్యంలో పరిస్థితిలు ఎలా వున్నా, ప్రశాంతంగా నుండటం.

CWM 14;232

*

అహంను జయించగలిగితేనే దివ్య మందహాసం గురించి ఆలోచించగలము.
CWM 14:257

*

చెడుతలంపులు, అసూయాద్వేషాలు, కక్షలు, కార్పణ్యాల విషయంలో చిత్తశుద్ధితో వాటికి అతీతంగా వుండి, పరుష వాక్యాలకు దయార్ద్ర హృదయంతో, చిరునగవుతో స్పందించాలి. నిందలకు చిరునవ్వే సరియైన జవాబు. పూర్వాపరాలు ఆలోచించి, చెప్పదగినవి చెప్పవలసినవే అని గట్టిగా విశ్వసించిన సందర్భాలలోనే తగిన విధంగా స్పందించాలి. లేదంటే మౌనమే సరియైన సమాధానం!
CWM 14:264

*

దేనినైనా చిరునవ్వుతో స్వీకరించ గలగటమే మానసిక పరిపూర్ణత్వం.
CWM 14:338

*

ప్రాణిక అర్పణ అంటే సంతోషంతోను, లజ్జాభిమానాలతోను, కుసుమ పరిమళం లాంటి దరహాసంతోను జీవితాన్ని గడపటం. కానీ అది ఆకర్షణీయం కావాలనుకో కూడదు.

CWM 14:354

*

ఓ ప్రభూ, జరుగుతున్న దాంట్లో జరుగనున్న దాంట్లో నీ దివ్యమైన, చెదరని చిరు నవ్వు విలసిల్లుతుంది.
CWM 15:219

*

ప్రశ్న: విజ్ఞాన శాస్త్ర అద్భుత విజయాలు మీ మందహాసానికి కారణమా?
సమా: "అద్భుత విజయాలా!" సరే, అది వాళ్ళ కార్యక్రమం. కాని వారి స్వోత్కర్ష మాత్రం నాకు నవ్వు తెప్పిస్తుంది. అంతా తమకే తెలుసని వారు భావిస్తారు. అందులోని కీలకం తమకు మాత్రమే తెలుసని కూడా విశ్వసిస్తారు. అందుకే నాకు నవ్వు వస్తుంది.

*

వారు నేర్చుకున్న విజ్ఞానంతో ప్రకృతి తమ గుప్పెట్లో వుందనుకుంటారు. అది పసిపిల్లల మనస్తత్వం. సృష్టికి కారణమైన శక్తి గురించి గాని, సృష్టి కర్త్రిణి యొక్క సంకల్పాన్ని గాని గ్రహించనంత కాలం, వారికి అర్థం కానిది ఏదో మిగిలే వుంటుంది.

CWM 10:205

*

దివ్యత్వంలో అనుక్షణం వుండాలనే ఆకాంక్ష ఉంటే మందహాసంతో జీవితాన్ని గమనించడానికి, బాహ్య ప్రకృతిలోని పరిస్థితులు ఎలాంటివైనా ప్రశాంతంగా వుండటానికి మనం తయారవుతాం.

CWM 10:266

*

జీవితంలో ఏ చిక్కు సమస్య ఎదురైనా దానిని వినోదపూరిత దరహాసంగా తీసుకోవచ్చు. పరిస్థితులు అవకాశానికి అనుగుణంగా ఏర్పడతా యనేది వాస్తవం. అందువలన వాటిని వ్యక్తి తనకు అన్వయించుకోవటం అతని ఇష్టం మీద ఆధారపడి వుంటుంది. ఇది ప్రజలు మరచినట్లున్నారు. తమాషాగా వుంది కదూ?

CWM 11:30

*

బిడ్డా, చిరునవ్వును నిలుపుకో; అదే నీ బలం.

CWM 16:65

*

అన్నిటినీ పరిపూర్ణ విశ్వాసంతో అవగాహన చేసికొని చిరునవ్వుతో స్వీకరించటమే వివేకము. ఎందుకనగా ఇప్పుడు ఉన్న చేతనతో దైవం యొక్క లక్ష్యాన్ని అర్థం చేసుకోలేము.

CWM 10:278

*

సహనంలో అనేక రకాలు ఉన్నాయి. నా అనుభవంలో పిరికివాడొకడు తనను కొట్టా లనుకున్న వాడికి తలారి ముందు తన చెంపను అందించటం చూశాను. ఒక బల హీనుడు తనను వేధిస్తున్న వ్యక్తిని ప్రశాంతంగా వీక్షించటం నేను చూచాను. ఒక అవతార పురుషుడు తనపై రాళ్ళు రువ్వే వారిని చిరునవ్వుతో తిలకించటం

నేను చూచాను. మొదటిది అర్థం లేనిది, రెండవది భరించ రానిది, ఇక చివరిది దివ్యమైనది, పవిత్రమైనది అని చెప్పవచ్చు.

CWSA 12:462 శ్రీఅరవిందులు

*

ఉల్లాసంగా ఉండే విశ్వ పౌరుడు

పర్షియా దేశంలో తేనె అమ్మే స్త్రీ ఒకతె ఉండేది. ఆమె ప్రవర్తన ఆహ్లాదకరంగా వుండేది. అందువలన ఆమె అంగట్లో అనేక మంది ఖాతాదారులు గుమిగూడి ఉండేవారు. ఆమె విషం అమ్మినా, అది తేనె కొన్నట్లుగానే అమె వద్దే కొనేవారని ఈ కథ వ్రాసి న కవి అభిప్రాయం.

ఇది చూసి తాను కూడా ఆమె మాదిరిగానే మంచి లాభాలు గడించాలని అదే వ్యాపారం చేయడానికి ఒక కుళ్ళుబోతు వ్యాపారి ఆ సమీపంలోనే తేనె అంగడి తెరిచాడు. తన వద్దకు వచ్చిన వారందరి పట్ల చిరచిర లాడేవాడు. అందువలన వారు కూడా అతని అంగట్లో కొనేవారు కాదు. కనీసం ఈగలు కూడా అటు వాలేవి కాదని కవి చమత్కరించాడు. ఈ విధంగా రోజంతా గడిచినా అతనేమీ సంపాదించ లేపోయాడు. ఒక స్త్రీ ఇది గమనించి తన భర్తతో అన్నది: "ముఖం ఖిన్నంగా వుంటే, తేనె కూడా చేదు అవుతుంది" అని.

మొదట తేనె అంగడి పెట్టిన స్త్రీ కేవలం ఖాతాదారులను ఆకర్షించటానికే చిరునవ్వును ప్రదర్శించేదా? కాదు; అది ఆమె తత్వంలోనే వుండిందని ఆశిద్దాం. ఎప్పుడూ సంతోషంగా కలుపుగోలుగా వుండేది. కేవలం అమ్మడం, కొనటమే వ్యా పారం కాదు. మన మిక్కడ ఒకరి కొకరు సహచరులుగా మెలగాలి. ఆమె ఖాతాదారులు ఆమెను కేవలం తేనె అమ్మేదానిగా కాక, అంతకు మించిన మంచి మనిషి అని భావించారు. ఆమె ఒక చైతన్యపూర్వకమైన ప్రపంచం మెచ్చే పౌరురాలు.

CWM 2:190


అనువాదం కె. ఆర్. ఎల్. నరసింహారావు

లక్ష్మీభాయి 'గోల్డీ' అనే కుక్కను శ్రీమాత వద్దకు తీసికొని వస్తూ వుండేది. అది అసాధారణమైన కుక్క. అక్కడి నుండి అది నేరుగా శ్రీఅరవిందుల గదికి కూడా వస్తూ వుండేది. నిజంగా అదొక వింత. దాన్ని ఎత్తి పట్టుకొని వారి దగ్గరకు స్వయంగా మోసుకొని పోయేవాడిని. వారు చిరునవ్వుతో దాన్ని రెండు చేతులతో నిమిరేవారు.

ఒక రోజు దానంతట అదే శ్రీఅరవిందుల గది లోనికి వెళ్ళి వారి పాదాలు నాకటం మొదలు పెట్టింది. శ్రీఅరవిందులు దానిని అప లేదు. సరిగదా, పైపెచ్చు వారే దాని వైపు వంగి దానిని ప్రేమగా తట్టారు.

Champaklal speaks

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహా రావు



అఖిల
అఖిల భారత పత్రిక
జూలై 2017
రసో వై సహ ఆనందో బ్రహ్మ

సంపాదకీయం

హాస్యం జీవితం పట్ల నవ్వగలిగే సత్తా. అది మానవజాతి జీవిత గమనంలో కష్టతర మైన పరిణామ దశను సునాయసంగా దాటడానికి ప్రసాదించబడిన దైవదత్తమైన అనుగ్రహం, లోకం పోకడ క్లిష్టమైనపుడు మనలను ఆనందోత్సాహాలలో ముంచెత్తి లోకమంతటినీ సంతోషభరితం గావించగల దివ్యలక్షణం. ఈ లక్షణం శ్రీఅరవిం దుల యందు ఉన్నతమైన, దైవికమైన ప్రమాణాలలో ప్రత్యక్షంగా మనకు గోచరి స్తుంది. 'సావిత్రి' మహాకావ్యంతో సహా, దాదాపు వారి రచన లన్నింటిలో, ఇది ఒక మెరిసే పోగులా సాగుతుంది. వారి ఉత్తరాలలో, ప్రత్యేకించి కొందరు సన్ని హిత శిష్యుల నుద్దేశించి వ్రాసిన వాటిలో, ఈ లక్షణం ఎంతో ప్రస్ఫుటంగా ప్రక టిత మౌతుంది. ఆ శిష్యులతో పాటు మనకు కూడా కాంతివంతమైన, ఉల్లాస పూర్వక బహుమతులను అంద జేస్తుంది. శ్రీఅరవిందులు మరియు శ్రీ నిరోద్ బరన్ గార్ల మధ్య సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలలోను, శ్రీ జుగల్ కిషోర్ ముఖర్జీ గారు వ్రాసిన *'The Smiling Master'* అను అద్భుత పుస్తకంలోను ఈ విషయం చాలా వరకు ప్రస్తావించబడింది.

వీటిలో కొన్నింటిని, ఆ విస్తారమైన సాహితీ సంచయం నుండి, ఎంపిక చేసి ఈ సంచికలో ప్రచురించాము. సామాన్య పాఠకు లెవరైనా అంతగా అందుకోలేని శ్రీఅరవిందుల ఈ ప్రత్యేక దృక్పథ మేదైతే వారి పరిపూర్ణ దివ్య వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకొనుటకు అవసరమో, దానిని ఇవి వెల్లడి చేస్తాయి.

సంపాదకుడు



భగవంతుడు హాస్యరస స్ఫూర్తి గలవాడని, అతనిని ప్రధానంగా ఒక కఠినమైన మొండి వైఖరి గల వాడిగా చిత్రీకరించాలనే అభిలాషగల వాళ్ళం మనమేనని, ఇదివరలోనే శ్రీఅరవిందులు పలుమార్లు సెలవిచ్చారు. దైవాన్ని నమ్మని ఒక నాస్తికుడిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొనడం ఆయనకు సరదాగ వుండవవచ్చని కూడా అన్నారు. మొన్నటి రోజునే ఎవరో, "దైవమనే వాడు అసలు లేడు, నాకు అతనిలో నమ్మకం లేదు, అదంతా ఒక అవివేకం, అజ్ఞానం.... " అని చాటారు. ఆ వ్యక్తిని దైవం తన బాహువుల్లోకి తీసుకొని తన గుండెకు హత్తుకుంటాడు, అతని తెలివిమాలినతనానికి అతని ముఖం పైనే నవ్వుతాడు.

CWM 10: 33

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

హాస్యరస స్ఫూర్తి

హాస్యరస స్ఫూర్తి? అది జీవితాన్ని ఆనందమయం, ఉల్లాసభరితం గావించ గల లక్షణం, తినుబండారాలకు ఉప్పు రుచి కలిగించినట్లు. అది లేకుండా జీవితం సమతుల్యతను పూర్తిగా కోల్పోయేది. ఇప్పటికే చాలా వరకు అసమతుల్యంగా వున్నది, చాలా కాలం క్రిందటే మాడి మసి అయిపోయింది.

*

అత్యున్నతమైనసమగ్ర వ్యక్తిత్వ వికసనం పొందిన మహనీయులకు హాస్యరస స్ఫూర్తి వుండదని గాని లేక అట్టి సంవేదన లోపించిన వ్యక్తి సమగ్రమైన వ్యక్తిత్వం గల వానిగా ఎలా పరిగణించగలమని గానీ నాకు తెలుయదు. 'నిగ్రహ లోపం' — కేవలం సత్తాలేని, ఆదరువు లేని విషయాలకే వర్తిస్తుంది. వివేచనాత్మకమగు జ్ఞానం చిరునవ్వుకు నోచుకొని కఠోరమైన సంస్కారం గలదిగా నుండాలనే చట్ట మేమీ లేదు.

*

మనుషులు వారి జీవితాలపట్ల కనబరచే శ్రద్ధాసక్తులను తీవ్రతరం చేయడానికి

వాతావరణమంతా ఎప్పుడైతే గంభీరంగా మారుతుందో వెంటనే ఏదో పొరపాటు, ఒక కష్టం కలిగించే ప్రభావమేదో పొడచూపిందని, పాత అలవా టొకటి పునరావృతమై తన ప్రాబల్యం తిరిగి పెంచటానికి ప్రయత్నిస్తున్న దని కచ్చితంగా తెలుస్తుంది. దానిని అనుమతించ కూడదు. ఈ పశ్చాత్తా పం, ఈ విచారం, ఎందుకు కొరగాని వాడిననే భావన, తప్పు చేసాననే భావన. అబ్బా! నాకైతే ఇదంతా మరొక తరానికి, అంధకారమలముకొన్న తరానికి చెందినదని అనిపిస్తుంది.

కాబట్టి మనం ప్రభువుతో పాటు ఎలా నవ్వ గలగాలో నేర్చుకోవాలి. ఇది నిశ్చయం.

CWM: 10, P. 156-57

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

బదులు కొంత నెమ్మది కనబరిస్తే వాళ్ళు వారి జీవితాలను అతి త్వరగా మరింత సమగ్రమైనవిగా చేయగలుగుతారు. భగవంతుడు ఎప్పుడూ తన కార్యక్రమాల ను అంత తీవ్రంగా పట్టించుకోడు. అందువలన వ్యక్తి ఈ అద్భుత విశ్వంపై ఆశ తో కాచుకొని అవకాశానికై ఎదురుచూస్తాడు.

CWSA 12: 432

శ్రీఅరవిందులు

ప్రభువుతో పాటు నవ్వు

ఈ ఆనందం, ఈ అద్భుత అంతర్హాసం ఏవి జీవితంలో ఏర్పడే ప్రతి నీలి నీడ ను, ప్రతి వేదనను, ప్రతి కష్టాన్ని కరిగించి వేయగలవో! నీవు చేయవలసింది ఒక్క టే. నీ అంతరంగంలో వెలుగుతున్న సూర్యుడిని దర్శించటానికి, ఆ కాంతి నిన్ను ముంచెత్తడానికి నీఅంతట నీవు అంతర్ముఖుడవై, నీ అంతరాత్మ లోతుల్లోకి వెళ్ళాలి. ఇక ఆ పైన అక్కడ సూర్యకాంతిలో ధగధగ మెరుస్తున్న తేజోమయ, సామరస్యపూర్వ క నవ్వుల జల్లులు కురుస్తున్న వాతావరణం తప్ప వేరొకటి వుండదు. ఎటువంటి నీలి నీడకుగాని, బాధకు గాని తావుండదు.

ఇక ఈ సూర్యుడు, ఈ దివ్య దరహాస మొలకించే భానుడు సర్వ విషయా లకు, వాటి వాస్తవికతకు కేంద్రబిందువుగా నిలుస్తాడు. దానిని దర్శించ గలుగు టకు, దాని అనుభూతి పొందుటకు, దానిలో జీవించుటకు మనంనేర్చుకోవాలి.

అందుకోసం జీవితాన్ని అతి గంభీరమైనదిగా పరిగణించే వారి నుండి తప్పు కోవాలి. వారు విసుగు గొలిపే మనుషులు.

CWM: 10: 156

వ్యక్తి ఎప్పుడూ నవ్వుతూ వుండాలి, ఎల్లవేళలా. భగవంతుడు నవ్వుతాడు, ఆ దివ్యపురుషుడు నవ్వుతాడు. ఆతని నవ్వు ఎంతో బాగుంటుంది, ఎంతో బాగుం టుంది, ఎంతో ప్రేమతో నిండి వుంటుంది. అది నిన్ను ఒక అసాధారణమగు ఉల్లాసభరిత మధుర పరిమళాలలో ముంచెత్తుతుంది.

దీనిని కూడా మనుషులు అపభ్రంశ మొందించారు, — అన్నింటినీ అపభ్రంశం గావించారు (శ్రీమాత నవ్వుతారు).

CWM 11:56

సెమైట్లు (నైఋతి ఆసియా ఖండవాసులతో బాటు అక్కాడియన్లు, క్యాననైట్లు, ఫోనీషియన్‌లు, హీబ్రూలు, అరబ్బులు) అనబడువారు, భగవంతుడిని ఒక కఠినాత్ముడుగా, రాచఠీవి వెలిగించే రాజుగా, ఆనందోత్సాహాలు మచ్చుకైనా లేనివాడిగా, గంభీరమైన న్యాయాధీశుడిగా చిత్రీకరించి, ఒక ప్రగాఢమైన భావనను మానవ జాతికి కలిగించారు. కానీ మనం శ్రీకృష్ణునిలో ఆటపాటలందు అమితానురక్తి గల, ఆనందోత్సాహాలతో కేరింతలు గొట్టే తుంటరి బాలుని దర్శించాము.

CWM 10:344 శ్రీఅరవిందులు

*

భగవంతుని మహత్వము, వైకల్యము

భగవంతుడు అధిమానసము మొదలగు వాటి యొక్క మహత్వము, వైకల్యమంటూ గతంలో నీవు చేసిన పొరపాటునే తిరిగి చేయటం తప్పుడు భావనలు, విషాదాలు పునరావృత మగుటకు కారణం. ఈ మహత్వము, వైకల్యముల గురించిన చర్చ అంతా శుష్కవాదం — ఈ విధంగా వ్యక్తపరచినందుకు నేను క్షంతవ్యుడను, కానీ, అందుకు చాలిన పదజాలం వేరొకటి లేదు. అసలు నిజమేమిటంటే, బహిరంగంగా భావప్రకటన చేయడం గాని, విపులంగా విశదీకరించడం గాని నాకు చేత కాదు, నాకు ఆ లక్షణం ఎపుడూ లేదు. సూరత్ నేషనల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న నన్ను చూచి నెవిన్సన్ మహాశయుడు — అదేమీ హాస్యాస్పదం కాదు, ఇతరులు కూడా నా అంతటి గాంభీర్యత కలవారే — నేను రాజకీయంగా అత్యంత ప్రమాదకరమైన వ్యక్తులలో ఒకడిగా అభివర్ణించాడు. "ఎప్పుడూ నవ్వని వ్యక్తి" అనడంతో, నన్నెరిగిన వారంతా ఎంతగానో నవ్వుకున్నారు. నెవిన్‌సన్‌కు నాపై వున్న అభిప్రాయం నీలో ఎక్కడో వున్న దనిపిస్తుంది. లేదా, బహుశా, నేను పెదవులతో మాత్రమే నవ్వుతా నెందుకని, అది శ్రీమాత నవ్వులా సంతృప్తికరంగా ఎందుకు లేదని, శాంత గారు నా గురించి వ్రాసిన దానితో నీవు ఏకీభవిస్తున్నావేమో. ఏదైనప్పటికీ, నేను జ్యోతిర్మయికి ఏమి చెప్పి వున్నా లేక జ్యోతిర్మయి నీకు ఏమి చెప్పి వున్నా, నా ఉత్తరాలలో సంతోషానికి, ఆహ్లాదానికి అధిక ప్రాధాన్యత నిచ్చాను. అది సహజంగా బహిర్గతమైన నా వ్యక్తిత్వ శైలి. నా జీవితంలో నే నెప్పుడూ 'వికలం' గా లేను, అది స్టాలిన్, ముస్సోలినీల శైలి, నాది కాదు. ఆ విధంగా 'వికల' మగు

వ్యక్తులతో నేను పంచుకున్న ఒకే ఒక లక్షణం, నా జీవిత లక్ష్యాన్ని అనుసరించుటలో గల మొండి పట్టుదల., కానీ దానిని నెమ్మదిగా, అతి సాధారణంగా, ఎల్లప్పుడూ చేసినట్లుగానే చేయడం నాపై వైక్లవ్య ఊహలను మోపి, శ్రీఅరవిందుల నిజ వ్యక్తిత్వం అలాంటిదని అనవద్దు.

Sri Aurobindo to Dilip, p. 223

శిష్యుడు: ఆధ్యాత్మిక పరిపూర్ణతలో హాస్యరస స్ఫూర్తికి స్థాన మున్నదా?

శ్రీఅరవిందులు: సిద్ధి పొందిన వ్యక్తి ఎప్పుడూ హాస్యమాడకపోతే, అది ఒక అసంపూర్ణత.

Evening Talks, p. 243

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

చమత్కారం, విజ్ఞానం


గురువు, తండ్రి

ప్రశ్న: మీరు గురువు గావడానిక కంగీకరించ లేరు, ఒక తండ్రి గావడానికీ ఒప్పుకోరు. ముఖ్యంగా మహిళలు మిమ్మల్ని తండ్రిగా భావిస్తారు, అలాగే మిమ్మల్ని పిలుస్తున్నారు కూడా. మీ అనంగీకారం గనుక వాళ్ళకు తెలిస్తే, 'స్మెల్లింగ్ సాల్ట్' (అంటే స్పృహ కోల్పోయిన వాళ్ళకు స్పృహ తెప్పించేందుకు వాసన చూపే మందు) పట్టుకొని ఒకామె దగ్గర్నుండి మరొకామె దగ్గరకు పరుగులు పెట్టవలసి వస్తుంది!

శ్రీఅరవిందులు: నాన్న అనే మాట మరీ సాంసారిక జీవితానికి సంబంధించిన మాటగా ధ్వనిస్తోంది — అబ్బ నాన్న! నేను ఆకస్మికంగా ప్రభు యెహోవాకు కవల సోదరుడినై పోయినట్లు అన్పిస్తోంది. అదీ గాక, తండ్రిలా చిరునవ్వు వుండాలనీ, కొట్టడానికి సిద్ధంగా వుండేటట్లు చేయెత్తి వుంచాలనే సూచన లున్నాయి. ఆ రెండూ నాకు సరిపడనివే.

'స్మెల్లింగ్ సాల్ట్' తప్ప వేరే మార్గం లేదనుకొంటే మహిళలు నాకు తండ్రితనం కట్ట బెట్టవచ్చు, కానీ అది సాధారణ అలవాటు కాకూడదు.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో పుట. 126



కేవలం తీవ్రతరమైన ధ్యానం చేయడం కోసమే, ఒక అయిదారు సంవత్సరాల పాటు మీరు యేకాంతానికి వెళ్ళారా?

శ్రీఅరవిందులు: అలా చేసానని నాకు తెలియదు. నా జీవిత చరిత్ర వ్రాసేవాళ్ళకు దానిని గురించి, బహుశా, యెక్కువ తెలిసి వుంటుంది.

CWSA 32:745

ప్రశ్న: మీరు నా మతినెందుకు పోగొడుతున్నారు? అర్జునుడు తనకు సఖుడిగా, గురువుగా, ఆటలో జతకాడిగా చెప్పుకొన్న శ్రీకృష్ణుని విశ్వరూపం దర్శించి తాను యెలా మతిపోగొట్టుకొన్నాడో, భయపడ్డాడో, దిగ్భ్రాంతి చెందాడో మీరు మరచి పోయారా? లిప్తమాత్రం నేను మీ విశ్వరూపాన్ని దర్శించితే అలా అయిపోతానా?

శ్రీఅరవిందులు: అలా యెందుకు జరిగిందంటే, ఆ విశ్వరూపుడు అర్జనుని స్నేహితులు, బంధువులందర్నీ 'దంష్ట్రాని కరాళాని' కరాళ దంష్ట్రిల మధ్య యిరుక్కునేటట్లుచేసి సర్వనాశనానికి నాందిగా విందారగిస్తున్నాడు, కాని నా విశ్వరూపానికి అటువంటి దంతాలు లేవు. అయ్యా! అసలే మాత్రం లేవు. అది ఒక శాంతిమయ విశ్వరూపం.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో పుట. 480

తెలివిగలవాడు: ఆసక్తిగలవాడు:

ప్ర: ఎంత విచిత్రం, అయ్యా! ఉండబోయే మీ అతిమానస జాతిలో ఒక్క తెలివిగలవాడు కూడా లేడా? దయచేసి చెప్పండి, అలాంటప్పుడు మీ ఆశల హర్మ్యాలను దేని మీద నిర్మిస్తారు?

శ్రీఅరవిందులు: నీవు తెలివిగలవాడు, ఆసక్తి కలవాడు అన్నావు. విడివిడిగా వీటిలో ఒకటి కలిగి వున్నవాడిని నీవు కనుగొనవచ్చు, కానీ అలా విడిపోయివున్న యిద్దర్నీ ఒకనిగా చేద్దామని యెలా ఆశిస్తున్నావు? ఏదేమైనా నీవు కోరుతున్న అటువంటి జంతువును వేటాడి పట్టుకోలేం, ఆ పనేదో నీవే చెయ్యాలి.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట. 19

ప్ర: దైవం వైపు వెళ్ళే మార్గం అంత కష్టంగా యెందుకుంటుంది? మనం ఎందుచేత అనేక పరస్పర విరుద్ధాంశాలతో తయారయ్యాం?

శ్రీఅరవిందులు: మంచి భక్ష్యభోజ్యాలు తయారు చేయటానికి అనేక పదార్థాలు అవసరం.

ప్ర: అందరూ సాదారణ ప్రపంచాన్ని వదలివేస్తారనా, దైవానికి చేరేమార్గాన్ని

సుగమం చేయ వీలుకానిది?

శ్రీఅరవిందులు: మహదానంద స్థితి లోనికి జగత్తంతా దుముకడం వల్ల ప్రపంచం హఠాత్తుగా అంతం గాకుండా నివారించేందుకు కావచ్చు.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట. 19

దుఃఖించే యంత్రం

ఈ రోజు 'పి' తన కళ్ళను చూపించుకొనేందుకై వచ్చింది. హఠాత్తుగ ఆమె వెక్కిళ్ళు పెడ్తూ, దుఃఖించడం మొదలు పెట్టింది. దేవుడికే తెలియాలి యెందు కనో!

శ్రీఅరవిందులు: దేవుడికి తెలియదు. 'పి' ఒక విధమైన దుఃఖించే యంత్రం. ఉద్దేశించకుండానే అయినప్పటికీ ఆ యంత్రంలో యే భాగాన్ని తాకినా, అది మొదలవుతుంది.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట.72

'పి' ఆర్తనాదాలకు మీరెందుకంత భయపడ్తారు. యోగులు కొంచెం బాధను ఓర్చుకోగలగాలి, మీరు దాన్ని ప్రోత్సహించాలి లేక అనుమతించాలి సార్!

శ్రీఅరవిందులు: ఆమె అటువంటి యోగి కాదు. ఆర్తనాదం మాత్రమే చేయగల దామె, పైగా దుర్వాసునిలా ఉగ్రరూపం దాల్చి ఆసుపత్రికే రాకపోవచ్చు, విరి విగా దుఃఖించడం వగైరాలు అలా వుంచి....

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 456

స్త్రీత్వము, పుంసత్వమూ గల స్త్రీలు:

స్త్రీత్వం లేక పుంసత్వం గల స్త్రీలు అంటే అర్థం యేమిటి?

శ్రీఅరవిందులు: ఇక్కడ స్త్రీత్వాన్ని, పుంసత్వాన్ని వ్యతిరేకార్థంలో వాడలేదు. కాని స్త్రీత్వం అనే పదం ఉపశమనం పొందని స్త్రీ అనే అర్థం. చపలచిత్తురాలు. విచిత్రమైనది, హేతుబద్ధతలేనిది, ప్రేమచూపించేది — పోరుబెట్టేది, ఇంద్రియ సుఖంపై ఆసక్తి కలది — మానసిక స్పందన కలది, ఆదర్శవాది — ప్రాణిక అవస రాలకు ప్రాధాన్యతనిచ్చేది, అంచనాల కందనిది ఆకర్షణీయమైనది — భరించ నలవిగానిది, తానేమిటో లేక తానేదిగాదో తానెప్పటికీ తెలుసుకోలేనిది యింకా

యేదైనా వుంటే అదంతా కూడా అయిన జీవి. అది నిజంగా స్త్రీత్వం గాదు. పురు షుడు ఆ విధంగా తయారుచేసిన స్త్రీ ఆమె. మనలో మాట, నీవింకా వంద విశేషాలను లేక దానికి రెట్టింపు విశేషాలను ఆక్స్ఫర్డ్ నిఘంటువు వెదికి పట్టుకొని చేర్చాలను కొంటే, స్వేచ్ఛగా చేయవచ్చు. ఎలాగో లాగా వాటన్నింటినీ ఆ జాబితాలో చేర్చవచ్చు.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట. 21

జలుబు: మాయను తెలుసుకోవడం

ఈ ప్రపంచంలో వున్నదంతా — దైవంతో సహా — మాయేనని నాకు పట్టిన జలుబువల్ల త్వరగానే అనుభవమైంది. శంకరుడు, బుద్ధుడు, సాధన వల్ల గ్రహించిన దాన్ని నేను తేలికైన జలుబు ద్వారా గ్రహించాను!

శ్రీఅరవిందులు: దానికి సాధన అవసరంలేదు. ఎవరైనా, ఒక పెద్ద కష్టం కలిగినపుడు అదంతా మాయ అని తేలిగ్గానే గ్రహిస్తాడు. మాయనుండి బయటపడటానికే సాధన అవసర మౌతుంది.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట .273

దైవానుగ్రహంగా తేలిన 'కురుపు' కు సంబంధించిన బాధామయగాథ.

ఎడమ ముక్కు రంధ్రంలో మళ్ళీ దైవానుగ్రహంగా ఒక కురుపు లేచింది. బాధగా వుంది, జ్వరంగా కూడా ఉంది. దయచేసి ఒక మోతాదు దివ్య క్రియాశక్తిని యిప్పిం చండి.

శ్రీఅరవిందులు: ఒక ఆధునిక కవి చెప్పినట్లు

ముక్కులోని దేవుడిచ్చిన ఓ కురుపా!
పరిశుద్ధానందంతో నీ యజమాని కెంత పులకింత కలిగిసున్నావు.
అతడు నిన్ను కంపిత స్వరంతో మళ్ళీ మళ్ళీ గానం చేస్తున్నాడు.
ముక్కులోని దైవదత్తమైన కురుపా!

ఈ స్తోత్రంతో ముక్కులోని కురుపు సంతృప్తి పడి క్షీణించి అదృశ్యమై పోతుందనుకొంటాను.

శ్రీఅరవిందులతో పన్నెండు సంవత్సరాలు, పుట. 242

మీరు వ్రాసిన దాన్లో ఒకమాట తెలియటం లేదు. అది 'బౌస్' అనేమాట!

శ్రీఅరవిందులు: నీవు తడబడతావనే అనుకొన్నాను. అది బాస్ అయ్యా బాస్. నువ్వే ఆ కురుపుకు యజమాని, హక్కుదారు, పోషకుడివి, పెట్టుబడిదారువి.

*

గురూజీ నా తల, నా తల పగిలిపోతోంది,

దానికి తోడు ఈ పాపిష్ఠి జ్వరం.

నేను సగం చచ్చాను!

శ్రీఅరవిందులు: హుషారు తెచ్చుకో! పరిస్థితులు అతి నికృష్ట స్థాయికి దిగజారి వుండవచ్చు. నీవు మాడ్రిడ్ లోవున్న స్పెయిన్ దేశస్థుడి వనుకో, రాజకీయబందీల శిబిరంలో వున్న జర్మన్ కమ్యూనిస్టు ననుకో. అలా నిన్ను నీ వూహించుకున్నప్పుడు, కేవలం జలుబు, తలనొప్పి మాత్రమే వున్న నీకు హుషారు పుట్టుకొస్తుంది. అందుచేత జలుబును త్రోసి వెయ్యి, జ్వరాన్ని తిట్టి పొయ్యి, ఉల్లాసంగా ధైర్యంగా కలకాలం జీవించు.

*

కురుపు నొప్పి పెడ్తోంది ఏం చేయాలి, చిరునవ్వుతో బాధపడాలా?

శ్రీఅరవిందులు: క్షణమాత్రం చిరునవ్వు చిందించు.

*

భగవంతుడా, నా ఎడమబుగ్గపై మళ్ళీ కురుపు లేచింది. ఏమీ మెరుగవ్వడం లేదు.

శ్రీఅరవిందులు: రేనే గారి వైద్యుడు చెప్పినట్లు టట్, టట్, టట్! టట్, టట్, టట్!" అనుకుంటూ వుండు.

*

అధికంగా మాట్లాడుతున్నందుకు, లేక తింటున్నందుకు లేక అధోచేతన పైకి ఉప్పొంగినందుకు శిక్షా?

శ్రీఅరవిందులు: బహుశా!

*

కురుపు కొంచెం పక్కాని కొచ్చింది, కాని యింకా మీరు అనమన్నట్టు టట్, టట్, టట్ అన్నప్పటికీ అదింకా బఠాణీ గింజంత పెద్దదిగా గట్టిగా వుంది.

కనీసం ఇంకా ఒక్క మోతాదైనా యివ్వండి. లేకపోతే నేను అమ్మా అని ఓంద్ర పెడ్తాను!

శ్రీఅరవిందులు: నట్, టట్,టట్ కాదు, టట్ నట్,టట్!

ఒక తాంత్రిక మంత్రాన్ని పోలి వున్న ఇది ప్రభావాన్ని చూపుతుందని ఆశిసున్నాను. నీ కిష్టమైతే ఓమ్, లింగ్, బ్లింగ్, హ్రింగ్, కింగ్! వీటిలో దేన్నైనా 15,000 సార్లు నీ కురుపు మీద పునశ్చరణచేస్తూ కేంద్రీకరించి చూడు.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 553-54

నేనా మంత్రం పఠించాలని నిజంగా మీరు నాకు చెప్తున్నారా? పరిహాసానికి అన్నారని అనుకున్నాను.

శ్రీఅరవిందులు: టట్, టట్, టట్ అనేది అనేక సంభావ్యతలుగల ఒక తీవ్ర ప్రభావంగల మంత్రమని నీవు గ్రహించలేదా? అది ఒక గొప్ప శక్తిగల మంత్రానికి ఆధునిక రూపమని ప్రతివానికీ తెలుసుగదా! చెప్పింది వెంటనే చేయలేదుగనుక ప్రాయశ్చితంగా రోజుకు 15,000 సార్లు గాదు, 1,50,000 సార్లు చకచక వల్లె వేయాలి. ఉదా: ఓమ్ టట్ లేక టట్‌టట్ ఎ టట్, టట్ టట్ ఎటట్ అంటూ, బెర్హంపూరుకు గాని (పిచ్చాసుపత్రి ఉన్న పట్టణం) లేక నిర్వాణ స్థితికి గాని చేరుకొనే దాకా, వేగం, స్వరం రెండూ పెంచుతూ వల్లెవెయ్యి.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 553-54

దైవసాక్షిగా! మీ చేతివ్రాత ప్రజ్ఞావంతమైన ఒక ప్రత్యేకత గల నమూనా! కాబట్టి నోటు పుస్తకాన్ని మీకు తిరిగి పంపాలి. బాగానే వుంది. కాని చికిత్స యేమిటి? 10.4.36 న మీ రిచ్చిన *అసాధ్యమైన* ఆ *మంత్రాన్ని* నేను ఆగి *ఆగి సాగుతూ ప్రయత్నిస్తున్నాను.*

శ్రీఅరవిందులు: ఓ భగవాన్! ఓమ్ టట్ ఎ టట్, టు, టు టొహిత్ టుః, ఏం మనిషి వయ్యా! కాని ఏ విధమైన లైంగిక ఆలోచనలు లేని పరిశుద్ధులైన 5 అడుగుల 7 అంగుళాల యెత్తున దానికి తగ్గట్టు పొట్ట వున్న నలుగురు బ్రాహ్మణుల మధ్యలో టీ తీసుకొంటున్నప్పుడు మాత్రమే ఆ మంత్రాన్ని వల్లె వేయాలి. అలా చేయక పోతే అది ప్రభావం చూపించదు.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 572

నన్ను అనుకరించవద్దు

“యస్” కు “వైట్స్”పుష్కలంగా వున్నాయి.

శ్రీఅరవిందులు: ఈ మాట ఎక్కడిది? వింటర్ ? వింటస్ అది పుష్కలమే అయ్యుం డవచ్చు. కాని స్పష్టంగా లేదు. దేవుడి మీద ఆన, నన్ను అనుకరించవద్దు.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 246

మీరు తడబడిన మాట వైట్స్ అంటే స్త్రీకుసుమవ్యాధి కాని మిమ్మల్ని అనుక రించుటకు అది మా ఆదర్శం అయ్యి తీరాలి అనుకొన్నాను.

శ్రీఅరవిందులు: ఓ భగవాన్, ఏమి దృష్టి నాకర్షించే పదం అది, నా మటుకు నేను అంత నికృష్టం చేయలేను.

శ్రీఅరవిందోస్ హ్యూమర్, పుట .70

కలవరపాటుకు గురైన మొత్తం కుటుంబం:

మేడమ్ “సందేహం” గారు వెనుకనుండి తొంగి చూస్తున్నప్పటికీ, రెండు మహిమలు నన్ను నన్నుగా ఉండనివ్వడంలేదు. అయ్యా! అవి 1. “ఆర్” లేక మీ చికిత్సావిధానం 2. యన్.కె. గారి ఆంగ్లకవిత్వం ఏదేమైనా నా కవ కాశం లేకుండా పోయింది, సార్ ! ఏం చేయమంటారు?

శ్రీఅరవిందులు: నీవు నీవుగా యెందుకని ఉండలేవు? అది కీళ్ళను యోగ ప్రయా ణానికి బలోపేతం చేయాలి. ఏమాత్రం కాదు సార్, మనస్సు సార్ మనస్సు మేడమ్ సందేహం! సార్, మేడమ్ సందేహం! కుమారి పదార్థ భౌతిక వాదం సార్! పెత్తల్లి నిరాశ సార్, తనపై తనకు విశ్వాసం లేని బాబాయి సార్! బాబాయి సంతతి ఆత్మ న్యూనత సార్. మొత్తం కుటుంబమంతా కలవరం చెందినది సార్ !

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 423

ఉగ్రుడైన కొరివి లాంటి వైద్యుడు

సరే! కారణమేమిటో నాకు తెలియదు. జబ్బు పడి రోగులవడం నేరం అని భావించే ఒక ఉగ్రుడైన కొరివిలాంటి వైద్యుడవనే ఖ్యాతి నీ కున్నది. నీ వనేది

యదార్థమే గావచ్చు. కాని వైద్యుడనే వాడు వెన్నలా మృదువుగా వుండాలనీ, లేత పంచదార పాకంలా ఉపశమనం కలిగించాలనీ, పంచదారలా తీయగా వుండాలనీ, పండ్లజాములా ఆనందం కలిగించేదిగా వుండాలనీ సంప్రదాయం అభ్యర్థన.
నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 489

హృదయంలేని మూర్ఖులు, ప్రేమించదగ్గ వైద్యులు

"కన్నీళ్ళు పెట్టకుండా వుండేటట్లు చేయకుండా రోగిని తాకలేక పోతున్నాను. ఈ వైద్యులెంత హృదయంలేని మూర్ఖులు?" అని మహిళలు అనుకొంటున్నారు!
శ్రీఅరవిందులు: "ఈ వైద్యులెంత ప్రేమించదగ్గవారు ప్రియులు, దేవతలు" అని అనుకొనేదాని కన్న చాలా సురక్షితమైన భావన అది
శ్రీఅరవిందులతో పన్నెండు సంవత్సరాలు, పుట. 241

భౌతికరూపాంతరీకరణ స్వభావం:

భౌతిక రూపాంతరీకరణ స్వభావం యెలా వుంటుంది? శరీరానికి రంగునిచ్చే ద్రవ్యంలో మార్పు జరుగుతుందా? ఆర్య-గ్రీకు జాతి సంబంధం గల వాళ్ళలోనికి మంగోలియా జాతి రూపు రేఖలు చేరడమా? బట్టతల బాగా ఒత్తైన జుట్టుతో నిండి పోతుందా? వృద్ధులు, శాశ్వత యవ్వన వంతులుగా మారి పోతారా?
శ్రీఅరవిందులు: యేడు తోకలతతో కూడి నెత్తిమీది యెనిమిదవ తోకతో సహా ఎందుకు కాకూడదు. ప్రతివాడూ విభిన్న రంగు అంటే ముదురునీలం, లేతనీలం, ఎరుపు, ఆకుపచ్చ, సిందూరవర్ణం వగైరాలే గాక, ఒత్తైన జుట్టు, పైగా కెంపురంగులో వుండి ఆకాశంవైపు నిక్క బొడుచుకొని దానికి సరితూగే యితర వివరాలతో కూడి ఎందుకు కాకూడదు. తథాస్తు.
శ్రీఅరవిందులతో పన్నెండు సంవత్సరాలు, పుట. 242

ద్రష్ట, లోకోత్తర పురుషుడు (సూపర్ మేన్)

ఓ గురూజీ, మిమ్మల్ని అభిమానించే మిస్టర్ ఎఫ్యూజివ్ (శిలలా కరుడు గట్టిన వ్యక్తి) పంపిన ఒక బెంగాలీ కవితను నాకు పంపగా, యిప్పుడే అందింది. దానిని తప్పకుండా మీకు పాడి వినిపించమని అర్థించాడు. నేనలా చేస్తే మీరెలా

ప్రతిస్పందిస్తారా అని ఆలోచిస్తున్నాను. ఎందుకనంటే ఆయన ఋషిత్వానికి చావు గంట మోగించినట్లుగా మిమ్నల్ని ఋషి సాంప్రదాయానికి చివరి వాడిగా అభివర్ణించారు. నేను కేవలం రెండు ప్రారంభ చరణాలను మాత్రమే ఆంగ్లం లోనికి తర్జుమా చేస్తాను. అలా చేస్తే శ్రీమాత కూడా ముందుగా తెలుసుకో గలుగుతారు.

తీరని కోరిక గల, భారత దేశాన్నిపట్టుకొని వ్రేళ్ళాడుతున్న చివరి ఋషి, నీకు విజయం!

ఇక నెప్పుడూ కనుపించని నా ప్రభూ, నన్ను మీతో మరణించ నివ్వండి.

ఇక్కడ నవ్వడం, యేడ్వడంలో యేది యుక్తమో తెలియడం లేదు. ఏమంటారు?

పైగా ఆతడు మీ ఆశీస్సులు కోరుతున్నాడనే విషయాన్ని గుర్తు పెట్టుకోండి!

శ్రీఅరవిందులు: దిలీప్, నీ కర్థం కావడం లేదు! నా శిష్యగణ మంతా సూపర్ మేన్‌లు (లోకోత్తర పురుషులు) అవుతారని అతని అభిప్రాయం. కాబట్టి ఒక ఋషి తిరిగి కనిపించడమనే చిన్న విషయం జరిగేందు కెటువంటి అవకాశం లేదు — నేను ఆ గుంపుల్లో ఆఖరి వాడి నవ్వడానికే యెక్కువ అవకాశం వుంది! అతనికి నా ఆశీస్సులు అందించవచ్చు. మన కంత ఉజ్వల భవిష్యత్తు నందించి నందుకు, అతను నా ఆశీస్సులు పొందేందుకు చాలా అర్హుడు.

శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 81

విలక్షణ వ్యక్తి

అయ్యో భగవాన్! మీ అతిమానసం యెటువంటి విలక్షణ వ్యక్తిగా నుంటుంది!

శ్రీఅరవిందులు: మానసిక జీవి కంటె విలక్షణంగా వుండదా! — విలక్షణ భౌతికమైన జెల్లీ చేపకు విలక్షణ కోతిలా, విలక్షణ ప్రాణిక కోతికి విలక్షణ మానవునిలా, విలక్షణ

అతిమానస జ్యోతి అంటే సర్వ శుభ లక్షణాల యందు సంపూర్ణుడు, అదే విధంగా అతడు హాస్యంలో గూడా సంపూర్ణుడుగా నుండాలి.

శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 15

మానసిక మానవునికి ఆతడు విలక్షణంగా కన్పిస్తాడనుకొంటాను. అంతా కలిసి విలక్షణమే! ఒకరి కొకరు!

శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 93

పొడవైన కట్టుతాడు

దీనంతటికీ అదనంగా, మీరు చొరవ తీసుకొని జనాన్ని, యిది చెయ్యండి, అది చెయ్యండి అని అడగరు. ఒక పొడుగాటి తాడును, తనను తాను ఉరి తీయడానికో లేక విషాన్ని రుచి చూడడానికో యివ్వడం మీ సిద్ధాంతం.

శ్రీఅరవిందులు: నేను చేయాల్సింది ముందు నడవడం, ప్రతి వ్యక్తినీ ప్రేరేపించడం, వారితో కలిసి నడవడం లేక వారికి ముక్కుతాడు వేయడానికా? సూపర్ మేన్‌లు (లోకోత్తర పురుషులు) ఆ విధంగా తయారవ్వరు — పొడవాటి తాడు అవసరం.

నిరోద్ బరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 93

టీ: సంభాషణ

శ్రీఅరవిందులతో యేదో సాధనా విషయం మీద అతను వాదించుటకు ప్రయత్నించాడు. ఆయన తర్కమంతా కుతర్కంగా నుండింది. శ్రీఅరవిందులు ఈ విధంగా యెదురు వాదించారు.

శ్రీఅరవిందులు: టీ, సంభాషణ అనే వాటిని నేను 'డి' పరిస్థితిని బట్టి ఒక మినహాయింపుగా అనుమతించాను. ఎందుకనంటే తనను తాను కించబరచుకొంటూ, నిస్పృహ సంద్రం లోనికి స్వయంగా నెట్టుకొంటాడు, బ్రహ్మమును చేరే పద్ధతిగా గాదు... అటువంటి చిన్న విషయాన్ని అర్థం చేసుకోవడం గూడా కష్టమేనా? అత్యంత మందబుద్ధికి కూడా అది స్పష్టంగా తెలిసిపోయే విషయమేనని అనుకొని వుంటాను.

అతను మాట్లాడడానికి నేను అనుమతి నిచ్చినందు చేత, తనను తాను ఒక డాంబిక సన్యాసి గాడిదగా తయారు చేసుకొనేందుకు అడ్డుపడ్డాను గనుక, అతని యోగంలో భాగంగా టీ, సంభాషణలను అంగీకరించానని అనవచ్చా? భౌతికంగా యెదగడానికి 'వై' కి వెన్న లేక గ్రుడ్లు, శ్రీమాత అనుమతించారు కాబట్టి బ్రహ్మం

కు వెన్న, గ్రుడ్లు మూలాధారలని అనవచ్చా? ఎవరికైనా కడుపు నొప్పి వస్తే, అతనిని వైద్యశాలకి పంపిస్తే అది వైద్యశాల డాక్టరు నిరోద్ , అల్లోపతి మందులు ఆధ్యాత్మిక మవడానికి పరిపూర్ణ మార్గ మవుతుంది?

ఒక విధమైన, అంటే... ఒక శుద్ధ తార్కికునిగా తయారవ్వకు.

శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 111

కుతర్కం

మీకు యిక ముందేదైనా వ్రాయబోయే ముందు నా 'కుతర్కాన్ని' గురించి యెంతో కొంత తెలుసుకోవా లనుకొంటున్నాను.

శ్రీఅరవిందులు: అది నీ కుతర్కాన్ని గురించి తెలుసుకోడానికి సాయపడ్తుంది. నీ వాదనలలో బయట పడిన లేదా యిమిడి వున్న దృష్టాంతాలను కొన్ని నీకు యెత్తి చూపిస్తాను.

కుతర్కం 1: విషయాలు ఇప్పుడు లేవు కాబట్టి, అవి ఎప్పటికీ వుండబోవు.

2: శ్రీఅరవిందులు అవతార పురుషులు గనుక, ఆయన సాధన మానవజాతికి నిరర్ధకం.

3: శ్రీఅరవిందుల సాధనలో జరిగేది, మరెవ్వరి సాధనలోనూ జరుగదు. (అంటే అవతరణ గాని, సాక్షాత్కారం గాని, రూపాంతరీకరణ గాని, అంతః స్ఫురణలు గాని, క్రొత్త శక్తులు లేక సామర్థ్యాలు పుష్పించడం జరుగదు) — ఎందుకనంటే శ్రీఅరవిందులు అవతార పురుషులు, సాధకులు కాదు గనుక.

4: వీధిలో బిచ్చ మెత్తుకొనే వానికి యే ఆధ్యాత్మికతా వుండదు లేదా కనీ సం, మాట వరసకు, ఒక విశ్వవిద్యాలయ పట్టభద్రుని కుండేటంత వుండదు — ఎందుకనంటే, సరే, యెందుకనో యెవరికీ తెలియదు.

5: నేను ఒక వైద్యుని గనుక ఒక చతురోక్తి విసిరినప్పుడు, నేను దానిని గ్రహించలేను.

CWSA 35:411

గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదిస్తుంది లేక గురి తప్పిపోతుంది

చికిత్సలు, చంపటాలు లాంటి అనేక అనుభవాల వల్ల వైద్యులు పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారా?

శ్రీఅరవిందులు: వందల మందిని చంపిన తర్వాత కొద్ది మందిని మాత్రమే చంపడాన్ని నేర్చుకొనేవాళ్ళు కొందరున్నారు. కాని అది అంతఃస్ఫురణ వల్ల కాదు, కేవలం అనుభవం ద్వారా నేర్చుకోవడం.

ది స్మైలింగ్ మాస్టర్, పుట. 129-30

... నా మీద పెద్ద బాధ్యతే ఉందనుకొంటున్నాను, అటువంటి తీవ్ర రోగానికి నేను వైద్యం చేయవలసి రావడం నా దురదృష్ట మనుకొంటున్నాను. అందులో నా పరువు ప్రతిష్టలు కూడా యిమిడి వున్నాయి.

శ్రీఅరవిందులు: అది నిన్ను పరీక్షించే స్థితి అనుకొంటాను. కాని పరువు ప్రతిష్టల మీద యెందుకంత గట్టి పట్టు? ఎప్పుడూ కూడా వైద్యులు ఊహించి, పని చేస్తుంటారని అందరకూ తెలుసని, స్వస్థత అనేది లక్ష్యాన్ని ఛేదిస్తే ఛేదిస్తుంది లేకపోతే లేదు అన్నట్లుంటుంది. తరచుగా నీవు లక్ష్యాన్ని ఛేదించ గలిగితే, తెలివైన వైద్యుడి వవుతావు — తెలివిగా జనాన్ని చంప గలిగితే, అప్పుడు కూడా అంతే. చివరకు జరిగేదదే.

నిరోదబరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 119

ఆస్ప్రిరిన్ మాత్ర, ఆకాంక్ష

కృష్ణ అయ్యరుకు కొంచెం జలుబు, కొంచెం జ్వరం వున్నాయి. ఆస్ప్రిరిన్ మాత్ర యిచ్చాను, దైవసహాయం కూడా కావాలి.

శ్రీఅరవిందులు: ఒక ఆస్ప్రిరిన్ బిళ్ళ, మరో ఆకాంక్ష బిళ్ళ సరిపోతాయి.

ది స్మైలింగ్ మాస్టర్, పుట. 128-29

స్వస్థత కొక మందు

నేను యేమీ తోచని స్థితి లాంటి జలధిలో పడిపోయాను, దేని కోసమో బాగా దప్పికగా వుంది. దానితో పాటు అలలు అలలుగా పాత కోరికలు. అందుబాటులో

వుండే చికిత్సేమైనా వుందా?

శ్రీఅరవిందులు: ఊర్ధ్వం నుండి దైవ ప్రసాదిత ఇంజక్షన్, క్రింద నుండి విరోచన కారి విసర్జన ద్రవాహారం, అంతరాత్మిక పళ్ళరసం, ఆత్మక్షీరం.

నిరోదబరన్: కరస్పాండెన్స్ విత్ శ్రీఅరబిందో, పుట. 231

ఈ నిరాశా జీవికి ఆశీస్సులివ్వమని దయచేసి మదర్ కు చెప్పండి.

R/

విన్. ఆశీర్వ. యమ్ VII

రిసెప్ట్ క్లోర్. జి ఆర్ XXV

ఆక్వాజోల్లిటి ఎడి.లిబ్

టైని ఫెయిత్ యమ్. XV

సిరప్ ఆప్ట్. జడ్. యస్. యస్

ప్రతిగంటకు పన్నెండు మోతాదులు

శ్రీఅరవిందోస్ హ్యూమర్ పుట. 80

మీరు వ్రాసిన జాబితాలో రెండోమందు యేమిటో తెలియలేదు సార్! అల్పజ్ఞానినైన నాకు అది మరీ లాటిన్ భాషలా వుంది.

శ్రీఅరవిందులు: మందును స్వీకరించడానికి సంబంధించిన క్లోరెట్.

మీరు వ్రాసినది సిద్ధాంతపరంగా కచ్చితమైనదిగా తయారుగావడానికి నేను ఆక్వా అనే పదాన్ని చివర్లోకి చేరుస్తున్నాను.

శ్రీఅరవిందులు: అలాగే, కాని చివర ఉన్న రెండుమందులు నేను తరువాత ఆలోచించినవి.

ప్రతి గంటకు పన్నెండు మోతాదులు — ఈ టింక్చర్లు, ద్రాక్షాసవాలా?

శ్రీఅరవిందులు: 12 మోతాదులు - ప్రతిగంటకు (గంటకొక మోతాదు చొప్పున) నీ భాషనుంచి చౌర్యం చేసాను.

మరి యీ ఖర్చుకు సొమ్మెలా?

బీదలకు ఉచితంగా .

శ్రీఅరబిందోస్ హ్యూమర్ , పుట. 80

అనువాదం: కె.వి.రావు

దైవానికి నైవేద్యం

ప్ర: స్నేహితుడు 'సి' మీ కోసం ఏదైనా కొనమని ఒక రూపాయి పంపాడు. కాని మీ అవసరాలు చాలా తక్కువ, శుభ్రత విషయంలో మీరు చాలా కచ్చితం. నేను అప్పుడప్పుడు ఆశ్చర్యానికి లోనవుతుంటాను, దైవము సంక్రమించే వ్యాధులు, అంటువ్యాధులు గురించి ప్రత్యేకించి అంత కచ్చితంగా ఉన్నాడేమని. అతడేమైనా వైరస్లు, వ్యాధికారక జీవాణువులు, సూక్ష్మ జీవులు మొదలైనవాటికి అంత త్వరగా ప్రభావం చెందేవాడా?

స: అయినా నీవు దైవం వ్యాధికారక క్రిములను, సూక్ష్మజీవులను, అన్నిరకాల విషపదార్థాలను భుజించాలని అంతగా ఎందుకు ఎదురు చూస్తున్నావు? నీది ఎంత అసాధారణ మతప్రామాణికం!

శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 304

అమాయకమైన ప్రమాదకర చిరునవ్వు

ప్ర: 'ఎక్స్' నన్ను అప్పుడప్పుడు మధ్యాహ్నసమయంలో ఆమె తయారుచేసిన దానిని రుచి చూడమని అడుగుతుంటుంది. నేను వైద్యశాలకు వెళ్ళేటప్పుడు దారిలో 15 నుంచి 20 నిముషాలు అక్కడ గడుపుతాను. నేను 'ఎక్స్' చిరు నవ్వును ఇష్టపడతాను. అది చిన్నపిల్లల, అమాయకపు చిరునవ్వు. అందులో ఏ విధమైన వగలాడితనం, కృత్రిమం లేక వశపరచుకొనే ప్రయత్నం లేదు.

స: చాలా ప్రమాదకరం! ప్రత్యేకించి నీవు కృత్రిమం కానటువంటి నిరాడంబరమైన ఆమె భావనలో సుఖానుభూతి పొందడం మొదలు పెడితే కృత్రిమం లేకపోనీ లేదా ఉండనీ, ఒకసారి గనుక ప్రాణికమైన బంధం ఏర్పడితే, ఇతరమైన వాటివలెనే అధికతరమైన బలత్కారపూరిత హక్కుతో, దెబ్బతిన్న అనుభూతులతో, ఇంకా ఇతరములైన వాటితో గట్టిగా బిగించి, చిట్టచివరకు బంధం తెగిపోయినప్పుడు అంతా నీ తప్పేనని, నీవు చాలా దుర్మార్గుడవని, ఆమె బుద్ధిహీనతను అమాయ కత్వాన్ని అడ్డుపెట్టుకొని లాభంచేసుకొన్నానని ఆమె చెప్పడం, తలపోయడం చేస్తుంది. సరే, సరే, అది అలా ఉంచి, ఇంటి-పిల్లికి అడవిని గురించి అందులో నివసించేవాటి గురించి ఎంత తెలుసో నీకు స్త్రీల విషయం అంత తెలుసు. ఈ

క్షేత్రంలో ఆశ్చర్యం గొలిపేటంత అమాయకంగా ఉన్నది నీవే.
శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 332

శక్తిని మూడు విధాలుగా క్రిందికి తీసుకువచ్చే పద్ధతి

ప్ర: నేను ఎక్కువెక్కువగా ఆశాభంగానికి లోనవుతున్నాను. యోగాలో ఇంకా ఎక్కువగా ఎందువల్లనంటే అనుభవం కంటే ప్రకృతి పరివర్తనకు మీరు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారని నేను విన్నాను.

స: దానికి కారణం ప్రకృతి పరివర్తన లేకుండా సంతోషదాయకమైన అనుభవం ఎటువంటిదంటే పంది తలమీద బంగారు కిరీటంలాంటిది — అది సరైనది కాదు. బహుశా ఆకర్షణీయం, కాని —

ప్రశ్న: ఏం చేయాలి? మహాశక్తిని క్రిందికి తేవడం ఎలా?

స: ఏ విధంగానా? అసలు పద్ధతేమైన వుందా?

నీవు పిలువు, నీవు ఉన్మీలనం చెందు, అది వస్తుంది(కొంత కాలం తర్వాత)

లేదా, నీవు పిలవకు, నీవు ఉన్మీలనము చెందకు. అది వస్తుంది.

లేదా, నీవు పిలువు, నీవు ఉన్మీలనం చెందకు. అది రాదు.

మూడు సంభావ్యతలు. కాని ఏ విదంగా? దేవుడికే తెలియాలి. లేదా బహుశా ఆయనకూ తెలియదేమో!

ప్ర: నీవు పిలువు, నీవు ఉన్మీలనం చెందు. నీవు పిలవవు. నీవు ఉన్మీలన మవుతావు. నీవు పిలువు, నీవు ఉన్మీలన మవవు. ఈ మీ వాగ్వైఖరికన్నా లోతైన మార్మికత వుండదు.

స: కానే కాదు. ఇది ముక్కుసూటిగా గమనించినంత స్పష్టం. ముక్కుకు క్షమాపణలు. నీకు మూడు వేరువేరు పద్ధతులు ఇచ్చాను. వాటిని కలగాపులగం చేయవద్దు.
శ్రీఅరబిందోస్ హ్యూమర్, పుట. 339-40

అభివృద్ధిచెందిన సాధకులు

ప్ర: నేను "గొప్ప" లేక "పెద్ద" సాధకులకు వ్యతిరేకంగా మీ అసమ్మతిని అర్థం చేసుకోగలను, కాని "అభివృద్ధి చెందిన" సాధకుల విషయంలో అసమ్మతి

ఎందుకో? ఇతరులకంటే కొంతమంది అభివృద్ధి చెందటమనేది యదార్థమైన విషయం కాదా? మనం 'ఎక్స్' ను అభివృద్ధి చెందిన సాధకుడనటంలో మనకు వేరే భావన లేదు.

స: నిజంగా అభివృద్ధే. ప్చ! ఎందుకంటే ఒకరు మరొకరికంటే 3 అంగుళాలు ముందున్నారు కాబట్టి అభివృద్ధి చెందినవారు, అభివృద్ధి చెందనివారు అనే వర్గ విభజన చేయాల్సిందేనా? అభివృద్ధి అనే దానిలో గొప్ప లేదా పెద్దలో ఉండే స్వార్థాహంకార అతిశయపు మోత ఉంటుంది. అది అన్ని రకాలైన మూర్ఖతలకు దారి తీస్తుంది. రజోగుణసంబంధమైన స్వోత్కర్షతో కూడిన అహంకారం కొంత మందిలో తమోగుణ సంబంధమైన ఆత్మ-నింద అహంకారం తదితరులలో 3 అంగుళాలు వై కంటే ముందున్న అభివృద్ధి చెందిన సాధకుడు 'ఎక్స్' ఎందుకు తడబడతాడో, పిల్లిమొగ్గలు వేస్తాడో లేదా తడుముకుంటాడో మరి వై 3 అంగుళాలు 'ఎక్స్' కంటే వెనుక ఉండి ఇంకా శ్రమిస్తూ భారంగా నడుస్తూ, నిలకడగా పోతూ ఉంటాడో, మొదలైన వెన్నింటినో, కళ్ళు పెద్దవి చేసుకొని కనుగుడ్లు గుండ్రంగా తిప్పుతూ అబ్బురపడటమే అవుతుంది. అంతెందుకయ్యా, 'ఎక్స్' లో అతడు అభివృద్ధి చెందాడనే భావన నీతిపరుడైన మత నిష్ఠాగరిష్ఠుడిలాగా, "కృతజ్ఞతలు ఓ ప్రభూ, నేను ఇతరులవలె అభివృద్ధి చెందని శిష్యుడను కాను", అనేది చాలు, అతడు తడుముకుంటా పిల్లిమొగ్గలు వేస్తూ, తడబడటానికి. కనుక ఇక అటువంటి దేమీ వద్దయ్యా, అటువంటిదేమీ వద్దు.

CWSA 35: 671

ప్రశ్న: ఆశ్రమాన్ని ఒకరెవరైనా వదిలేసి వెళ్తున్న ప్రతిసారి, నాలో ఒక తాకిడి, ఒక ఆఘాతం, ఒక గుండెపోటు అనుభూతి కలుగుతుంది.

స: ఎందుకో నేను అడగవచ్చా? ఇప్పుడే కాదు, ఆశ్రమం మొదలుపెట్టిన దగ్గర్నుంచి జనులు వదలి వెళ్తూనే ఉన్నారు. సుమారు 30 లేదా 40 మంది వెళ్ళిపోయారు, 130 లేదా 140 మంది ఇతరులు వచ్చారు. పెద్ద మరాఠాలైన 'ఎక్సె', 'వై', 'జడ్ ' లు చాలా రోత పుట్టించే ఈ ఆశ్రమాన్ని వదిలేశారు, గొప్ప వారిని వారిష్ట ప్రకారం పని చేయనీయ రిక్కడ. రోత పుట్టించే ఆశ్రమం బతికే వుంది, వృద్ధి పొందుతూ ఉంది. 'ఏ','బి', 'సి' లు యోగంలో విఫలమైపోయారు — కాని యోగం దాని దారిన అది ముందుకు పోతూ, వృద్ధి చెందుతూనే

వుంది. అటువంటప్పుడు తాకిడి, ఆఘాతం, గుండెపోటు లెందుకు?

CWSA 35:64

గంభీరమైన సాధన

ప్ర: అందరూ అతడు గంభీరంగా సాధన చేస్తున్నాడని అనుకున్నారు.

స: గంభీరంగా? నీ వనేది నిద్రపోక పోవటం, అటువంటివన్నీ? నిజమే, అందుకనే అటువంటి గాంభీర్యం ఇటువంటి దాడులను తెస్తుంది — ఇటువంటి హృదయ పూర్వకంగా చేసేది, అటువంటి పురుషోత్తముడిని కిందికి పిలుస్తుంది లేదా సరిగ్గా లోనికి పిలుస్తుంది — కారణం అది సమాంతరం, నిలువుగా దిగింది కాదు.

ప్రశ్న: హృదయపూర్వకంగా చేసిన సాధన పర్యవసానంగా పురుషోత్తముడు కిందికి దిగి వచ్చాడు, కనుక అతడు శ్రీఅరవిందులను వచ్చి, తనకు వంగి నమస్కారం చేయమంటున్నాడు! ఆ తరువాత?

స: తరువాత? బహుశా అతడు నిన్ను కూడా రమ్మని కోరుతూ, వంగి నమస్కరించ మంటాడు, నీవా పని చేయకపోతే పిడిగుద్దులు గుద్దుతాడు.

ప్రశ్న: నాకు ఎముకల లోనుంచి వణుకు పుడుతున్నది!

స: కేవలం ఎముకలలో మాత్రమేనా?

Sri Aurobindo's Humour, p. 347

ఎరుక గల గాడిద

ప్ర: కవిత్వంలోను, చదవడంలోను ఆసక్తి తరిగిపోయింది, ఇప్పుడు నేను 'అధో చేతనా గాడిద' గా తయారు కాబోతున్నాను.

స: ఎరుకతో గూడినదిగా ఎందుకు కాకూడదు!

Sri Aurobindo's Humour, p. 305

చైనా ఋషి

ప్ర: పాల్ బ్రంటన్ మిమ్ములను చూసినప్పుడు మీ మీద అతడికి ఒక చైనా ఋషి భావన కలిగింది.

స: కన్‌ఫ్యూసియస్? లావో-ట్సే? మెన్సియస్? హేంగ్ వాంగ్ -పూ? చివరి వారె

వరో తెలియదు, కాని ఆయన పేరు వినసొంపుగా ఉంది!

Sri Aurobindo's Humour, p. 350

పాత, కొత్త పదబంధాలు

ప్ర: దయచేసి ఘాటైన మా వ్యాఖ్యానాలకు ఏమీ అనుకోవద్దు. మేము మిమ్మ బెంగాలీ తండ్రిలాగా చూడటం లేదు, కాని ఒక ఆంగ్ల జాతీయుడిగా — ఎవ రైతే ఒక తండ్రి, స్నేహితుడో.

స: ఆ నీవు ఎవరు? నేను అవాస్తవ ఆరోపణ అయిన ఒక ఆంగ్ల జాతీయుడినైనా లేదా ఎటువంటి తండ్రినైనా తిరస్కరిస్తున్నాను!

Nirodbaran: Correspondence with Sri Aurobindo, p. 227

ప్ర: కాని, మీరు తిరస్కరించని సంబంధం ఏది ఉంది? అదేమైనా ఆధ్యాత్మిక చరిత్రలో గుర్తించిన దానికి వైరైనదేదోనా?

స: నాకు తెలియదు. నేను ఎప్పుడూ పాత పదబంధాని కన్నా ఏదో కొత్తవాటిని కోరుకుంటాను. నేను అతిమానసాన్ని చూసి, బహుశా ఏదో ఒక దానిని తెలుసు కుంటాను.

Nirodbaran: Correspondence with Sri Aurobindo, p. 227

వైద్యులు — కొత్త సహస్రాబ్ది స్వప్నం

ప్ర: మీరు వారికి మందుల వల్ల, వైద్యుల వల్ల ఏ ప్రయోజనం లేదని విశ్వసింప జేసారు, కాని అదే సమయంలో వారిలో మీపై కావలినంత విశ్వాసాన్ని చొప్పించ లేకపోయారు. ఫలితం — వారు రెంటికి చెడిన రేవడి అయ్యారు!

స: అలాగా, 'టి', 'ఎస్' లు ఇద్దరు ఒకానొక సమయంలో మందుల అవసరం లేకుండా నయం చెందాలని నడుం కట్టారు. తరువాతి పరిణామం నీకు స్పష్టంగా అనుకూల మయింది, దాని మూలంగా సమత్వంలో ప్రాథమిక అభ్యాసాలు మొద లుపెట్ట గలిగావు. ఆ మార్గంలో నేను అనేక పాఠశాల తరగతులను పూర్తి చేసి, ఎమ్. ఎ డిగ్రీ పూర్తి చేసాను. ఇప్పుడిక నీ వంతు

ప్ర: శ్రీమాత ఒక చాలా పెద్ద వైద్యశాలను నిర్మిస్తున్నట్లుగా నేను కల గన్నాను. అందులో నేను ఒక ఉద్యోగిని... ముందస్తుగా సహస్రాబ్ది కల?

స: ఒక వేళ వైద్యశాల అవసరమే అసలు లేకుండా, ఇంకా వైద్యులు వారు పొడిచే సూదులను ఇంకు-పెన్నులుగా మార్చితే, అది ఇంకా ఎక్కువగా సహ ప్రాప్తి కల అయ్యేది — సహజంగానే, వారు పెన్నులను కూడా దుర్వినియోగం చేయకుండా ఉన్నప్పుడే.

ప్ర: కాని, ఆ పరికరాల స్థానంలో ఇంకు పెన్నులు పెట్టమనే కొంటెతనం ఎందుకు? వైద్యులను కవులుగానో లేదా గుమాస్తాలగానో తయారవాలని మీరు కోరుతున్నారా? లేదా మందుల చీటీలు వ్రాసేదాని కన్నా నాకు కవిత్వం వ్రాయమని సూచనా?

స: నేను కేవలం ప్రవక్త ఏసు చెప్పిన దానిని ఎంచుకొన్నా, 'కత్తులు నాగేటి కర్రు లుగా మారిపోతాయి', కాని వైద్యపరికరం నాగేటి కర్రు అంత పెద్దది కాదు, అందువలన దానికి బదులుగా నేను ఇంకు-పెన్నును ప్రత్యామ్నాయంగా వాడాను.

Sri Aurobindo's Humour, p. 308, 361

పరనిందలో ఆనందం

ప్ర: నేను తిరిగి ప్రజల చేత దూషణలకు గురి అయ్యాను. నేను చేసే కొన్ని పనులకు, అవి ఎవరికీ హానికరం కాకపోయినా, ఒకరెవరో చాలా నీచమైన ఉద్దే శాలను అంటగడుతున్నారని తెలియవచ్చింది.

స: ఇతరులను విమర్శించడానికి ఏదైనా 'కారణం' ఉండాలని నీవు అనుకుంటు న్నావా? దానిలో ఉండే స్వర్గపరమైన ఆనందాన్ని పొందడానికి ఆ పని చేయడం జరుగుతుంది. పరనింద (ఇతరులను నిందించడం) మానవ ప్రాణికానికి దివ్యా నందనోద్యాన ఫలా లన్నింటి కన్నా ఎక్కువ మధురం.

ప్ర: ఏ కారణం లేకుండానే ఇటువంటి విమర్శల విషబాణాలు నా మీద ఎందుకు వేయబడుతున్నాయో మీరు వివరించ గలరా?

స: ఊహ+ అనుమానం+ కుశాగ్రబుద్ధి కలిగిన మానసిక శాస్త్రవేత్త ఆనందం+

స్వర్గరాజ్యంలో హాసం ఉంది, అక్కడ బహుశా వివాహం లేకపోయినప్పటికీ.

Sri Aurobindo: Letters to Dilip Kumar Roy, p. 27

దోషం వెతకటంలో ఆనందం అనేకమైన ఇతరప్రాణిక ఆనందాలు+ ఇతరులకు దానిని చెప్పడంలో ఆనందం; దానినే సర్వసాధారణంగా ఉబుసుపోక మాట్లాడటం (చిలవలు పలవలు) అంటారు. వివరించటానికి ఇది పూర్తిగా సరిపోతుంది. ఇంకే కారణం అవసరం లేదు.

Sri Aurobindo's Humour, pp. 362, 363

తేనీటి తుల్యం — దైవతుల్యం

ప్ర: ఆసక్తి లేకపోవటం, శక్తి లేకపోవటం, వైద్యశాలకు వెళ్ళడానికి అనిష్టత — కొన్ని రోజులుగా ఇదీ నా పరిస్థితి. చాలా తమాషాగా, ఉదయం పూట నేను ఎప్పుడైనా ఒక కప్పు తేనీరు సేవిస్తే, ఈ లక్షణాలన్నీ మాయమైపోతాయి. మొత్తం వ్యవస్థ అంతా హుషారెక్కి, నా పనిని నేను పూర్తి ఉత్సాహంతో చేసుకో గలను. కాని ఇటువంటి ఫలితాలకి ఒకరు తేనీరు మీద ఆధారపడటం!

స: నీ మీద జాలిపడుతున్నాను. ఒకప్పుడు నేను ఆ విధంగా ఉన్నాను. కణాలు తేనీటి తుల్యం — దైవతుల్యం బదులుగా.

Nirodbaran: Correspondence with Sri Aurobindo, p. 227

స్వాప్నిక విపరీత భావనా శాస్త్రవిజ్ఞానం

ఒకరు కలగని చూచెనొక రసగ్రంధిని, వ్రాసెనంతట హామ్లెట్ను, త్రాగెను
మెర్మాయిడ్ చెంత, అమృతత్వమును ఒడిసి పట్టెను;
ఏజియన్ ఒడ్డున ఉత్తేజక స్రవాల ఒక కూటమి
సొంపుగా కూర్చెను ఇలియడ్, ఒడిస్సీలను

ఒక మృదులాస్థి, ఇంచుమించు నగ్నముగ ధ్యానించుచు
బోధివృక్షము కింద, దర్శించె శాశ్వత దివ్యప్రకాశమును
ఆనక, ప్రబలమైన దాని ఏకాంతమునుండి లేచుచు,
ధర్మచక్రము మరియు సమస్తము ఋజువర్తనమైన
అష్టమంగళా మహా మార్గములను చెప్పె.

అవ్యవస్థిత అన్నకోశపు ఉరవడిలో కొట్టుకుపోయిన ఒక మస్తిష్కము
గర్జించెను ఐరోపా ఖండముగుండా, జయించెను, పాలించెను పతనమైపోయెన
బహుశః హెలీనా ద్వీపమునుంచి, స్వర్గమునకు,
ఆలాగున ఊగెను విపరీత భావనాప్రపంచముపై.

ఒక శాస్త్రివేత్త అణువులతో ఆటలాడి ఊదెను
దైవము కేక వేయు లోపల విశ్వమును.

CWSA 2: 64

(*రసగ్రంథి: ఉత్తేజక స్రవాలు; హార్మోన్స్; మృదులాస్థి: థైరాయిడ్*)

ఆత్మ

అతడనెను, "నేను అహములేని, ఆధ్యాత్మికుడను, స్వేచ్ఛాజీవిని,"
అంతట శపించెను అతడి రాత్రి భోజనము తయారుకాని కారణాన.
కారణ మరసితి నేను. అతడనెను,"అది నేను కాదు,
కాని ఆకలిగొన్న పొట్టదేవుడు నిలకడ కోల్పోయెను."
నేను కారణ మరసితి, అతడనెను, "అది ఆతని క్రీడ
నేను అంతరంగమున చలించని వాడను, కోరిక లేనివాడను, పవిత్రుడను
దినదినాన ఏమి జరిగినా నాకు సంబంధములేదు."
నేనాతనిని ప్రశ్నించితిని, "నీవనేది పూర్తిగా కచ్చితమా?"
అతడు సమాధాన మొసగెను, "నేను నీ సందేహము నర్థము చేసుకోగలను
కాని స్వేచ్ఛయే సమస్తము. దానికెటువంటి ప్రాముఖ్యము లేదు
నీవు ఎలా తన్నినా, బొబ్బలు పెట్టినా, పిచ్చిగా అరచినా, పోలికేక పెట్టినా
నీ భోజన పళ్ళెరము గురించి చేయు నల్లరి మూలముగా.
"ఆత్మను గురించిన ఎరుకయే విమోచనం,
దొరికింది నాకు ఆత్మ, ఆత్మతో అల్లరిచేస్తూ
నేను స్వతంత్రుడను."

CWSA 2: 620 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

హాస్యరస నిందాస్తుతి

బహుళార్థ సాధక పళ్ళెరము, గిన్నె

మేము ఉన్నచోటు — ఆలీపూర్ జైలు — అటువంటిదే. ఉదార స్వభావంగల మా అధికారులు మా సరంజామాలో పనికి వచ్చేది దేన్నీ మిగల్చ లేదు. ఇదీ మాకు లభించిన ఆతిథ్యం! జైలు గదిముందు మాత్రం ఒక పళ్ళెము, గిన్నె మాత్రం అలంకార ప్రాయంగా వుంచారు. శుభ్రంగా తోమితే అవి వెండివాటిలా మెరుస్తూ వుండేవి కూడా. ఇది నాకు సంతృప్తి. 'దైవదత్తమైన' బ్రిటిషువారి సామ్రాజ్యంలో వారి ఘనతకు ప్రతీకలుగా వాటిని నేను భావించేవాడిని, ఆ విధంగా బ్రిటిష్ సామ్రాట్టుకు నా కృతజ్ఞతలు తెలిపే వాడిని. అది నాకు ఆనందదాయకం కదా మరి! నా దురదృష్టవశాత్తు నా పళ్ళెం కూడా నా ఆనందంలో కొంత అదీ పంచుకున్నది. ఎవరైనా దానిపై చేయివేస్తే, అది అరేబియాలోని "డెర్విష్" (ముస్లిం జోగి) లా మెలికలు తిరిగేది. అందువలన భోజనం చేస్తున్నప్పుడు ఒక చేత్తో దాన్ని కదలకుండా పట్టుకొని, మరొక చేత్తో భోజనం చేయవలసి వచ్చేది. లేకపోతే అది గుండ్రంగా తిరుగుతూ అక్కడి నుండి చల్లగా జారుకునేది. దానితో పాటే వడ్డించిన సాటిలేని తిను పదార్థాన్ని కూడా తీసుకుపోయేది!

ఇక గిన్నె పళ్ళెం కంటే బాగానే ఉపయోగపడేది. అచేతనమైన వస్తువులలో బ్రిటిష్ పౌరుని కంటె అది ఏ మాత్రం తీసిపోదు. సాధారణ బ్రిటిష్ పౌరుడు ఏ విభాగంలో అయినా పనిచేయగలడు. న్యాయాధికారిగా, రక్షక భటుడుగా, రెవిన్యూ అధికారిగా, నగరపాలక అధ్యక్షునిగా, ఆధ్యాపకునిగా, అర్జీదారునిగా, న్యాయనిర్ణేతగా, పోలీసు అధికారిగా, అవసరమైతే ముద్దాయి తరఫు న్యాయ వాదిగా ఆయనను నియోగించ వచ్చు. పైవారి ఆజ్ఞ ఆయన అన్ని వేళలా శిర సా వహిస్తాడు. ఎన్నో విధాలుగా ఆయన ప్రభుత్వానికి ఉపయోగ పడగలడు.

అదే విధంగా నాకు చాల ప్రియమైన ఆ గిన్నె కూడా అనేక పనులు చేసి పెట్టేది. దానికి కుల విచక్షణ లేదు! ఎక్కువ, తక్కువ తేడాలు లేవు. జైలు గదిలో కాల కృత్యాలు తీర్చుకోవాలన్నా, నీటితో నోటిని పుక్కిలించాలన్నా అదే! శాక పాకాలు అందులోనే వడ్డించేవారు. అన్నిటికీ స్నానం చేయాలన్నా, భోజన సమ యంలో మంచినీరు త్రాగాలన్నా అదే! అన్నింటికీ అదే.

అటువంటి విలువ కట్టలేని బహుళ ప్రయోజనకర వస్తువు కేవలం బ్రిటీషు కారాగారాల్లోనే కనపడుతుంది! ఈ విధంగా అది నా ఆధ్యాత్మిక సాధనకు గూడ సహకరించింది. అసహ్యాన్ని అధిగమించాలంటే దాన్ని మించిన వస్తువు మరొకటి దొరకదు. ఈ సాధనలో అదే సరియైన గురువు!

శిక్షలో మొదటి విడత జైలు గదులలో ఒంటరిగానే గడపాలి. కొంత కాలానికి మేము కలిసి యుండటానికి అనుమతించారు. మా పౌరసత్వ హక్కులు విభజించి పునరుద్ధరించారు. పాయిఖానా నిమిత్తం మాకు మరొక తారుపూసిన బొక్కెన కూడా ఇవ్వబడింది. ఆవిధంగా ఒక్క నెలలోనే 'అసహ్యం' పై విజయం సాధించాను. మల, మూత్ర విసర్జన నాకు ఆత్మ నిగ్రహంలో మొదటి పాఠంగా తీర్చి దిద్దబడింది!

Bengali Writings p. 272-73

అనుబంధ (అటాచ్డ్) మరుగుదొడ్డి ఒక విలాసవంతమైన సౌకర్యం

ఒంటరి జైలు జీవితమే ఒక ప్రత్యేకమైన శిక్ష. ఇతరులతో సంబంధం లేకుండా, ప్రకృతిని చూడకుండా బ్రతకటమే దాని ముఖ్యోద్దేశం.

కాలకృత్యాలకు బయటకు వెళ్ళటం ఈ నియమానికి విరుద్ధం. కాబట్టి, జైలు గదిలోనే రెండు తారుపూసిన బొక్కెనలను ఉంచేవారు. ఉదయం, సాయంత్రం పాకీవాడు వచ్చి వాటిని శుభ్రంచేసేవాడు. మేము నిరసనలు తెలపటం వలనగాని, మేము హృదయవిదారక నినాదాలను చేయటం వలనగాని ఇతర వేళలలో కూడా బొక్కెనలు శుభ్రం చేయించేవారు. ఎప్పుడైనా అనుకోకుండా ఒక ఖైదీ పాయిఖానాకు వెళ్ళవలసివస్తే, మళ్ళీ బొక్కెనను శుబ్రం చేసే దాకా దుర్వాసనను భరించాల్సిందే.

మా శిక్ష రెండో దశకు చేరుకున్న తరువాత కొన్ని సంస్కరణలు జరిగాయి. పాత విధి విధానాల్లో మార్పు రాలేదు కాని పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని మార్పులు చేశారు. ఈ మార్పుల వలన భోజనసమయంలో గాని, రాత్రులందు గాని చిన్న చిన్న గదులలో ఇంకా ఎక్కువగా అసౌకర్యమే కలిగింది.

అనుబంధపు మరుగుదొడ్డి పాశ్చాత్యుల సంస్కృతి. ఒక చిన్న జైలు గదిలో పడక, పాయిఖానా కలిపి ఉంచడం ఏం మంచిది? భారతీయులకు కొన్ని అనాగరిక

అలవాట్లు ఉన్నమాట నిజమే, కాని పాశ్చాత్యులను అనుకరిస్తూ అంత నాగరికంగా వుంచటం కూడా మనకు కష్టమే కదా!

Bengali Writings p. 273- 74

త్రిమూర్త్యాత్మక అంబలి

ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల 15 నిముషాలకు ఒక గంట మ్రోగేది. అది ఖైదీలకు మేలుకొలుపు. కటకటాలు ఐదు గంటలకు తెరిచేవారు. కాలకృత్యాల అనంతరం నేను నా గదిలోనే వంటరిగా కూర్చొనే వాడిని. కొద్ది సేపట్లో 'లప్సీ' అనే ఖైదీల అంబలిని గదుల వద్దకు తెచ్చేవారు. ఆ రోజు అది నేను తీసుకోలేదు. కాని అది ఎలా వుందో నేను గ్రహించాను. ఎన్నో రోజుల తరువాత ఆ గొప్ప భోజనం రుచి చూచే అదృష్టం వచ్చింది. జావలా కాచిన బియ్యం అది. చూట్టానికది త్రిమూర్తుల మేళవింపులా వుంది. అది మూడు రూపాలను ధరిస్తుంది. మొదటి రోజున అది పరిశుద్ధమైన ప్రజ్ఞలా గోచరించింది. అది కల్తీలేని స్వచ్ఛమైన ఈశ్వరాంశ! రెండోరోజు "కెడ్ గెరీ" అనే పసుపు పచ్చని పదార్థంతో కలియటం వలన హిరణ్య గర్భునిలా కనిపించింది. మూడవరోజున అందులో బెల్లం కలపడంవలన తినటానికి కొంత అనుకూలంగా వుండి "విరాట్" పురుషుడిగా "విష్ణువు" యొక్క అంశను సూచించింది. ఈశ్వరుని స్వచ్ఛత, బ్రహ్మ యొక్క విజ్ఞానము, మానవాతీతం కావున నేను వాటిజోలికి పోలేదు. విరాట్ స్వరూపాన్ని మాత్రం నేను బలవంతంగా దేహానికి అప్పుడప్పుడు అందించాను. బ్రిటీష్ వారి మానవతా వాదం నాకు అర్థమైంది. ఆ చమత్కారం నాకు పాశ్చాత్యుల ఔన్నత్యాన్ని ఎత్తి చూపించింది. 'లఫ్సీ' మాత్రమే బెంగాలు ఖైదీలకు తగిన పోషకాహారం అని అనిపించింది. మిగతా వంటకాలకు పోషక విలువ ఏమీ లేదు. అయితే ఏమి, దానికో రుచి వుండేది. విపరీతమైన ఆకలి వలన ఏదైనా తినవలసి వచ్చేది. అట్లాంటి ఆహారం తినడానికి ఎవరిని వారే బలవంతం చేసుకోవాల్సి వచ్చేది, సమాధాన పరచుకోవాల్సి వచ్చేది.

Bengalin Writings, 280-81

శ్రీఅరవిందుల నడవడి లక్షణం

శ్రీ ఆనందరావు వ్రాసిన లేఖ చూసే వుంటారు. దాన్ని వ్రాయటానికి ఆయన వెచ్చించిన సమయాన్ని బట్టి చూస్తే, లేఖల చరిత్రలోనే అది ప్రత్యేకమైనది. వ్రాయటానికి దాదాపు మూడు వారాలు, శుద్ధప్రతిగా చేయటానికి మరో పదిహేను రోజులు, చిరునామా వ్రాయటానికి ఒక వారం, పోస్టులో వేయటానికి ఇంకో మూడు రోజులు! దీన్ని బట్టి తెలిసేది ఏమిటంటే ఆయన 'ఉదర బాధ' గురించి ఆవేదన చెందే అవసరం లేదు. దేవఘర్ స్టేషన్‌లో రైలు ఎక్కగానే అది సర్దుకొని ఉంటుంది. నిజానికి ఇంటి దారి పట్టగానే ఆయన ఎంతో ఉల్లాసంగా, ఉద్రేకంగా కనిపించారు కూడా!

జబల్పూరులో మేము బెడ్డింగులు పరుచుకున్నాం కాబట్టి సరిపోయింది. లేకుంటే మా బెర్తులు వేరేవారు ఆక్రమించేవారు. ఆనందరావు బర్తును అప్పటికే కొందరు పల్లెటూరు వారు ఆక్రమించారు, మేము వాళ్ళతో తీవ్రంగా ఘర్షణ పడ్డాము. కాని చివరకు ఆనందరావుకు కూడా నా బెర్తు మీదనే అవకాశం కల్పిం చాల్సి వచ్చింది. బెర్తు అంచున కొందరు మహమ్మదీయులు ఇరుక్కొని కూర్చు న్నారు. వారు సౌమ్యంగా కనిపించినా, వాళ్లు కూడా ఆ పల్లె ప్రజలలోని వారే అనుకొని వారిపై ఆనందరావు తిరగబడ్డాడు. అది మరాఠీ తరహా యుద్ధంగా అనిపించింది. తాను నిద్రను నటిస్తూ, వాళ్ళను కావాలని తన బూటుకాళ్ళతో తన్నటం ఆరంభించాడు. చివరకు నేను సగం బెర్తు ఆనందరావుకే వదలవలసి వచ్చింది. ఇప్పుడు కాళ్ళు, అవతలి వైపుకు రావటం వలన ఇంకా ఎలా తన్న గలడు? అందుకని రాత్రంతా వాళ్ళను తలతో నెట్టటం ఆరంభించాడు. తెల్లవారిన తరువాత తాను వారితో ఎలా యుద్ధం చేసి సగభాగం స్వాధీనం చేసుకున్నదీ సగర్వంగా వివరించాడు. ఆయన యుద్ధ తంత్రం అలాంటిది!

CWSA 36-13: 44

బ్రిటిషువారి న్యాయస్థానం లో ద్రోణాచార్యులు

న్యాయస్థానంలో సాక్ష్యం చెపుతున్నపుడు, శ్రీఅరవిందులు మిడ్నాపూర్ సమావేశం జరుగుతున్నపుడు సురేంద్రబాబు విద్యార్థులకు గురుభక్తిని గురించి

చెప్పిన విషయం ఉటంకించారు. "ద్రోణుడేం చేసాడంటే," అని శ్రీఅరవిందులు అనగనే జడ్జిగారైన నార్టన్‌కు కేసులో ఏదో రహస్యం బైటపడినంత ఉత్సాహం వేసింది. ద్రోణుడు ఈ బాంబు కేసులో ఒక నేరస్తుడనీ "మానిక్ తోలా" తోటలోనో, విద్యార్థుల స్టోర్స్ లోనో కుట్రదారులతో సంబంధాలు కలిగి వుంటాడని భావించాడు. దీన్ని బట్టి శ్రీఅరవిందులు శ్రీసురేంద్రబాబుకు గురుభక్తికి బదులుగా బాంబులు ఇవ్వమన్నారని జడ్జి భ్రమపడ్డాడు. ఇలా అన్వయించడం అభియోగానికి బలాన్ని కూడా చేకూర్చి వుండేది. అది వివరణకు కావలసిన అంశమే. వివరాలు రాబట్టాలని, "ద్రోణుడు ఏం చేశాడు" అని జడ్జి ప్రశ్నించాడు. ఈ ప్రశ్న ఎందుకు వేశాడో సాక్షికి అర్థం కాలేదు. ఈ వాగ్యుద్ధం ఐదు నిముషాలు గడిచాక "ద్రోణుడు అనేక మానవాతీత శక్తులు ప్రదర్శించాడు," అని కారన్ జడ్జితో అన్నాడు. ఇది జడ్జికి సంతృప్తి నీయలేదు. ద్రోణునికి ఆ "బాంబు" ఎలా అందిందో తెలుసుకోవాలి గదా? అలా అనటంలోని నీ ఉద్దేశ్యమేమి? ఏం జరిగిందో చెప్పు, అని జడ్జి కరన్ తో రెట్టించాడు.

సాక్షి ఎన్నివిధాల ప్రయత్నించినా, జడ్జి గారికి ద్రోణాచార్యుని జీవిత రహస్యం బోధపడలేదు. అతని కోపం కట్టలు తెంచుకుంది. బిగ్గరగా అరవటం ప్రారంభించాడు. సాక్షి కూడా దానికి శృతి కలిపాడు. బహుశాః అసలు ద్రోణుడు ఏం చేసాడో సాక్షికి తెలియదేమోనని ఒక న్యాయవాది నవ్వుతూ తన అభిప్రాయం వ్యక్తం చేసాడు. దీనితో కారన్ స్వాభిమానం దెబ్బతిన్నది. అతడు ఉగ్రుడై "ద్రోణుడు ఏం చేసాడో నాకు తెలియదనుకున్నావా? మహాభారతం ఊరికేనే ఆసాంతం చదివినాను కున్నావా?" ఈ విధంగా జడ్జి గారికి, శ్రీకరన్ కు మధ్య ద్రోణుని గురించిన వాగ్వివాదం చెలరేగింది. ప్రతి ఐదేసి నిముషాలకు నార్టన్ దొరగారు అక్కడ ఉన్న పత్రికా సంపాదకుని ఉద్దేశించి అసలు ద్రోణుడు చేసినది ఏమిటయ్యా, బయటపెట్టు, అని గద్దించటం మొదలు పెట్టారు. చేసేది లేక ఆ సంపాదకుడు ఏదో కాకమ్మ కథలు చెప్పటం మొదలుపెట్టాడు. ఇంతకూ అందులో ద్రోణాచార్యుడు ఏమిచేసాడనే దానిని గురించి ఒక్క ముక్కైనా లేదు. కోర్టు హాలు నవ్వులతో మారుమ్రోగిపోయింది. ఎట్టకేలకు అల్పాహార విరామ సమయంలో శ్రీకరన్ సమస్య కొంత ఆలోచించి, మనసును కుదుట పరచుకొని కోర్టులోనికి వచ్చి ఒక పరిష్కారం సూచించాడు. అదేంటంటే అసలు ద్రోణుడు

ఏమీ చేయలేదనీ, అనవసరంగా అరగంటనుండి మనం తలలు బ్రద్దలు కొట్టుకోవటం వృధా ప్రయాస అనీ, అసలు అర్జునుడే తన గురువైన ద్రోణుని చంపాడనీ దాని సారాంశం.

ఈ విధంగా అసత్య నిందారోపణ చేయటం వలన ద్రోణాచార్యుడు అభియోగం నుండి విముక్తుడై, కైలాసవాసుడైన సదా శివునకు కృతజ్ఞతలు తెలిపి వుంటాడు. శ్రీకరన్ ఇచ్చిన వాఙ్మూలంవలన బోనులోనికి రావలసిన ప్రమాదం ఇక ద్రోణునకు ఉండదు! ఆవిధంగా ఆలీపూర్ బాంబు కుట్రకేసు ముగిసింది. పత్రికా సంపాదకుడి నోటినుండి ఒక్క మాట వెలువడి వుంటే, అతనికి ఉన్న సంబంధం బుజువై వుండేది. దయామయుడైన శ్రీమహదేవుని ఆశీస్సులు వారిని ఆ ఆపత్తునుండి కాపాడినాయి.

CWSA 7: 306-07

మానవ మనస్తత్వం

కొన్నిసార్లు "మానవుడు రాజకీయ జంతువు" అనీ, మరికొన్నిసార్లు తార్కిక జంతువు అని అంటారు. కాని అన్నిటికంటె మించి అతడు పేరుగాంచిన సారస్వత జంతువు అయినాడు. రాజకీయాలను కలుషితం చేస్తే అతడు రాజకీయ మృగం. ఇక తన తార్కికత వలన తప్పులను కూడా ఒప్పులుగా చెప్పి మెప్పించ గలిగితే అతడు హేతువాద జంతువు.

మానవుడు తన సారస్వత విజ్ఞానం వలన ఒక పదబంధానికి బానిసగా మారి, ఏ విధమైన భావనా బలం లేకపోయినా అదే పట్టుకొని వ్రేలాడ గలడు. మానవాళికి అట్టి దానికి ఆ పదజాలంవలన ఏ ప్రయోజనం ఒనగూడుతుందో ఎప్పుడూ పరిశీలించ బడలేదు. ఆ విధంగా కొన్ని పద బంధాలు మన ఊపిరిలో అంతర్భాగమైనాయి. ఒంటె ముక్కున వేసిన లోహపు కడియం లాగా అదుపు కోల్పోయిన మనలను చెప్పుచేతలలో ఉంచుతున్నాయి. పదకర్త మనలను తనకు ఇష్టమైన మార్గంలోకి మళ్ళించగలడు. జ్ఞాని మాటలకు కొంత అర్థం వుంటుంది. కాని కుతర్కం చేసేవారి విషయంలో కొంత అర్థం వున్నట్లు భ్రమింపజేస్తుంది. అంతే. శ్రీమార్లేగారు ప్రస్తుతం చేస్తున్న పని అదే! వారు అందులో ఆరితేరినవారు.

CWSA 7: 754

శ్రీ ఆర్చర్ మహాశయుని అద్భుత వ్యాఖ్యానం

భారతీయుల సాంప్రదాయ ఆలోచనా పద్ధతి ప్రకారం పురుషుని దేహం రెండు ప్రత్యేకతలను గలిగి వుండాలి. భుజాలు విశాలంగాను, కటిభాగం సన్నగాను ఉండాలి. ఇది సింహం యొక్కశరీర నిర్మాణం. భారతీయ కవులూ, చిత్రకారులు, ఇదే అనుసరించారు. ఇది శ్రీఅర్చరుకు పాక్షిక ఆటవికతకు ప్రతీకగా అనిపించింది. భారతీయులు అరణ్యంలోని జంతువులను ఆదర్శంగా తీసుకున్నారంటే దానికి కారణం వారు చేసే జంతుపూజ! ఒక బలమైన అడవిజంతువు వారికి ఆదర్శం అన్నమాట! ఇదీ ఆర్చర్ ఆలోచనా ధోరణి.

ఇదే తెలివి తక్కువ తనాన్ని ఆయన సీతమ్మవారి కన్నుల వర్ణనలో గూడా ప్రదర్శించాడు. కంబరామాయణంలో సీతమ్మ వారి కన్నులు సముద్రపు నీటి నీల వర్ణంలో ఉన్నట్లు కవి పోల్చాడు. ఇది శ్రీ ఆర్చర్ గారికి ఇంకా అనాది నాగరికతా అవశేషంలా తోచింది. మానవుల ముఖకవళికలను అప్రాణివాచకమైన నీరు మొదలైన వాటితో ఆనాటి భారతీయులు పోల్చారనీ, ఇది ఇంకా అనాది నాగరకతకు నిదర్శనమనీ వారు భ్రమించారు. అలాగే సీతమ్మవారి కన్నులు మత్తు గొలిపే మధిరతో పోల్చటం వలన భారతీయ కవులు మాదకద్రవ్యాల వలన ప్రభావితం అయివుండేవారని వ్యాఖ్యానించారు. ఇదీ ఆర్చర్ గారిచ్చిన అమోఘమైన ఉదాహరణలలో ఒక్కటి.

CWSA 20: 256-257

శిష్యుని ప్రతిపాదన, గురువుగారి పరిష్కారం

ఓ, గురువర్యా, నేను చాలా సేపు గాలిలో ఊగిస లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఎక్కడో ఒకచోట ఎలాగైనా దిగాలికదా? మీరు అనుమతిస్తే, ఒక ప్రతిపాదన చేస్తాను. అది నా బలం పుంజుకోలేని ఆత్మకు సంబంధించినది.

ఒకటి: నాకు ఇష్టమైన తేనీరు త్రాగటం మానేస్తాను.

రెండు: నా కిష్టమైన జున్ను ను కూడా అలాగే వదిలేస్తాను.

మూడు: రుచికరమైన భోజనాలకు స్వస్తి చెప్పి, మధ్యమధ్య ఉపవాసం చేస్తాను.

నాలుగు: తలనూనెతో పనిలేకుండా గుండు చేయించుకుంటాను.

ఐదు: దిండు లేకుండా కేవలం దుప్పటి పై నిద్రిస్తాను.

ఆరు: దోమతెర లేకుండా నిద్రిస్తాను. ఇది నాకు చాలా కష్టమైనదే, నేను దోమల జోలపాటకు అలవాటు పడిన వాడను కాదు!

దయచేసి నన్ను నమ్మండి. నా మాటలు మీకు అనాగరికంగా అనిపించినా నా గుండె బరువెక్కి కన్నీరు మయమైనట్లు వున్నది. నా ముక్తికి ఇంతకంటె దగ్గిర మార్గం కనిపించటంలేదు. కాబట్టి ఈ విషయంలో మీరూ శ్రీమాత నా నిర్ణయాన్ని ఆమోదిస్తారా లేక మార్పును మార్పులతో సూచిస్తారా?

శ్రీఅరవిందులు: నాకు నీ ప్రతిపాదనలు ఆశ్చర్యం కొల్పాయి. ఉపవాసాలా? నేనూ వాటిని ఆచరించాను. కాని వాటిపై నాకు నమ్మకం లేదు. ఉపవాసం తరువాత నిజంగా ఒక రాక్షసుడిలా తింటావు.

ఇక గుండు గీయుంచుకోవటమా? దీని పరిణామం ఎలా వుంటుందో తెలుసుకున్నావా? నవంబరు 24 దర్శనం దినాన కలిగిన విస్మయం నుండి అసలు తేరుకోలేనేమో అనిపిస్తున్నది, కాని కాశ్మీరునుండి కన్యాకుమారివరకు రేగ బోయే అలజడిగురించి ఏమనాలి? నీ పాత వైభవంపై నీడలు గ్రమ్మే నూతన విధానం నీకు కీర్తిని గొనివస్తుంది. అదీ గాక నీవు అహం నుండి, కీర్తి కండూతి నుండి బయటపడే ప్రయత్నం చేస్తున్నప్పుడు ఇట్లాంటి భావాలా? లేదు, లేదు. అందులో సగం ప్రమాదం కూడ వుంది.

దోమతెర లేకుండా పడుకుంటావా? అంటే అసలు నిద్రే పట్టదు. భోజనం చేయకపోవడం ఎంత చెడుపో, నిద్రలేక కళ్ళు కాయలు కాయటమే కాదు, నీవు కూడా ఆసాంతం మత్తుగాను, పాలిపోయి బలహీనంగాను అవుతావు. నీ అతి మానసాన్ని గురించిన అపోహల కన్నా అనూహ్యామైన అనుమానాలకు లోనవుతావు. ఆ పని మాత్రం ముమ్మాటికీ చేయకు. నీవు చెప్పిన మిగతా విషయాలు శ్రీమాత దృష్టికి తెచ్చాను. ఆమె పరిశీలన అనుకూలమైనదిగా లేదు....

నాకు కొందరు తాపసులను (సన్యాసులు) గురించి తెలుసు. నియమం అయిపోగానే వారు ఇతరుల వలెనే ప్రవర్తిస్తారు. (అందరూ అలానే వుంటారని కాదు). దీన్ని బట్టి వారిలో అసలైన పరివర్తన రాలేదనే చెప్పాలి. కొందరు మాత్రం కొన్నాళ్లు నియమం ఆపి, విడతలు విడతలుగా మళ్ళీ ప్రారంభిస్తారు. క్రమంగా వారిని వారు పరీక్షించుకుంటూ సాధన కొనసాగిస్తారు. ఈ విధంగా లక్ష్యాన్ని

చేరుకున్నవారు కూడా ఉన్నారు..

ఉదాహరణకు: బంగాళాదుంపలు తినటం మానివేస్తే మానెయ్. ఆశ్రమంలో లభించే ఆహారమే కొన్నాళ్ళు తీసుకో. మార్పు వచ్చిందో లేదో అని నిన్ను నీవు పరిశీలించుకున్నప్పుడు ఇంకా బంగాళా దుంపలు తినాలనిపిస్తుంటే, నీలో మార్పు రాలేదన్న మాట. ఆ కోరిక మళ్ళీ కలగక పోయినా వాటిని తినాలనే వాంఛ తగ్గనంత వరకూ మార్పు రాలేదనే భావించాలి, ఆ వాంఛ మళ్ళీ కలగక పోతే ఆశించిన ఫలితం దక్కిందనుకో వచ్చు.

ఏమైనా గాని ఇదంతా సన్యాస మార్గంలో నేను తగిన గురువును కాదని అనిపించవచ్చు. ఇది సరియైన భావనే. నేను అంతర్గత వ్యవస్థలో వచ్చే మార్పు లకే ప్రాధాన్యం ఇస్తాను. నీ మనస్సులో పరివర్తనకు అవకాశం ఇచ్చినపుడే అన్ని అడ్డంకులు తొలగిపోతాయి. ఇది నేను బాగా గమనించాను.

ఈ ఐహిక వాతావరణంలో ఈ రకంగా 'సన్యాస' నియమావళి మేము నీపై రుద్దుతున్నామని నీ కెందు కనిపించింది? ఇది ఆశ్చర్యంగా వుంది. ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా అనిపించింది? ఈ విషయం నీవు మాట మాటకూ ప్రస్తావిం చటం వలననూ, కఠినమైన నియమాలపై నీకు తిరుగులేని నమ్మకం ఉండటం వల్లనూ నేను కూడా దాన్ని ఒక అవకాశమే అని అంగీకరించా.

ఒక అసాధారణ నేత్రకాంతి, చిన్న అంగ వస్త్రధారణ, ఈశ్వరుని ముందు ఇనప మేకుల పానుపుపై పడుకున్న విధము, వేరుసెనగలు మొదలైనవి తినటమూ వంటిని చేస్తున్న సన్న్యాస మార్గంలో నున్న దిలీప్ కు కలిగిన ఊహతో కఠిన నియమాలు కాదనలేక పోయాను. కాని ఒక్క మాట. ఇది నేను మీకు సూచించిన పద్ధతి కాదు. మీరే తాపత్రయ పడుతున్నారు. అందువలన నేనూ మెత్త బడాల్సి వచ్చింది. మీ విధానంలో వుండే ప్రాధాన్యతను అర్థం చేసుకోటానికి ప్రయత్నిం చాను. క్రమంగా మీకే తెలుస్తుందని ఊరుకున్నాను. శ్రీమాత మాత్రం ఈ ప్రయోగాలు 'నిరర్థకం' అని తోసేసారు.

నిజానిక మీరు అనుకున్నది నేను ఊహించుకున్న చిత్రం కంటె భయంకర మైనది. బోడి తలతో, చింకి గోచీతో ఉన్న దిలీప్ ఒంటి నిండా దోమకాట్లతో మిగతా ఇబ్బందులతో! ఈ విసర్జన క్రియ వలన కలిగే నాశనం యొక్క తార్కిక పర్యవసాన మిదంతా.

బంధాలపై విజయం సాధించటం వేరొక విషయం. నీకు ఇష్టమైనవాని కోసం తాపత్రయ పడకుండా, అవి లభించనప్పుడు బాధపడకుండా వుండటం నేర్చుకోవాలి.

దీనిని బట్టి మా ఉద్దేశాలపై నీ సూక్ష్మ విశ్లేషణ ఏ మాత్రం చెల్లదు.ఏది ఏమైనా, సవ్యంగా ముగిసేది ఏదైనా సవ్యమైనదే. గండం గడిచినట్లేనని భావిస్తాను.

Sri Aurobindl: lettersto Dilip, pp. 313-15

అనువాదం; కె. ఆర్. ఎల్. నరసింహారావు

మాధుర్యం మరియు మందహాసం

కడుపు నొప్పికి ఔషదం

నాకు తెలిసిన వైద్యుడు నరాల వ్యాధి నిపుణుడు. ఆయన కడుపు నొప్పిని నయం చెయ్యడానికి వైద్యం చేసాడు. ఆయన చెప్తూ వుండేవారు, కడుపులో కలిగే బాధలకి మూలకారణం నరాల బలహీన స్థితి అని. ఆయన దగ్గర వైద్యానికి ఎక్కువగా పని లేని ధనికులు వెళ్తూ ఉండేవారు. వాళ్లు ఆయన దగ్గరకు వెళ్ళి తమకు తలనొప్పి, కడుపు నొప్పి, అజీర్ణం అని వివిధ బాధలను చెప్పేవారు! ఆయన వాళ్లు చెప్పే బాధల నన్నిటిని శ్రద్ధగా వినేవారు. నాకు తెలిసిన ఒక స్త్రీ ఆయన దగ్గరకి వైద్యానికి వెళ్ళింది, అప్పుడు ఆ వైద్యుడు ఆవిడకి చాలా పెద్ద సమస్య ఉందని చెప్పారు. ఆవిడ ఏ అంతస్తులో నివసిస్తున్నారో అడిగి తెలుసుకుని, ఆవిడ కడుపులో బాధ తగ్గించుకోడానికి ఒక చిట్కా వైద్యం చెప్పారు. (ఉదయం అల్పాహారం తీసుకోకుండా) ఒక పెద్ద ద్రాక్షపళ్ల గుత్తిని తీసుకొని, చేతిలో జాగ్రత్తగా పట్టుకుని, గుమ్మం లోంచి కాకుండా కిటికి లోనుంచి బల్ల వేసుకుని దిగి బయటకి వచ్చాక అడుగులు వేస్తూ నడక ప్రారంభించి ప్రతి రెండు అడుగులకి ఒక ద్రాక్ష పండు తింటూ, అంతకన్నా ఎక్కువ కాదు, నిజంగా ఎక్కువ కాదు! లేదంటే మళ్ళీ కడుపు నొప్పి వస్తుంది. ఒక ద్రాక్ష పండు రెండు అడుగులు పూర్తయ్యాక తింటూ, గుత్తిలో ద్రాక్షలు పూర్తయే వరకు వెనక్కి తిరిగి చూడకుం

డా తిన్నగా నడవాలి. ద్రాక్ష గుత్తి పెద్దది ఎంచుకోవాలి, అవి పూర్తవగానే వెనక్కి తిరిగి నడిచి రావాలి, అంతేకాని ఏ విధమైన వాహనం తీసుకోకూడదు. లేదంటే సమస్య మళ్ళీ మొదటికి వస్తుంది. ఇలా మూడు రోజులు చెయ్యగలిగితే మీ సమస్య పూర్తిగా తీరిపోతుంది, దానికి నాది పూచీ అని చెప్పారు, నిజానికి ఆ స్త్రీకి పూర్తిగా నయమయింది.

భార్య మరియు ప్రియమైన ఆందాలు ప్రదర్శించే స్త్రీ

నాకు రోడేన్ చెప్పిన చాలా వినోదకరమైన కథ జ్ఞాపకానికి వస్తోంది. నీకు రోడేన్ తెలుసా, వ్యక్తిగా కాదు, అతను ఏం చేసాడో తెలుసా? రోడేన్ ఒక రోజున నన్నొక ప్రశ్న అడిగాడు. "ఇద్దరు స్త్రీలు ఒకరినిచూసి ఇంకొకరు అసూయ పడకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?" అని. (నవ్వు) నేను అతనితో చెప్పాను, నిజంగా అదో సమస్యే అని.! కాని, నీ సమస్య ఎందువల్ల అనేది చెప్పగలవా అని అడిగా? అప్పుడు అతను ఇలా చెప్పుకు వచ్చాడు. నేను ఒక బొమ్మని రాతిలో మలచే ముందు, కంచుతో పోత పోసే ముందు, మట్టి నమూనాను తయారు చేసుకుంటాను. నేను ఒక్కొక్కసారి రెండు మూడు రోజుల కోసం బయట ఊళ్ళకు వెళ్ళవలసి వస్తుంది. అప్పుడు నేను నా మట్టి నమూనాలను తడిగుడ్డతో కప్పి వెళతాను, ఎందుకంటే అవి ఎండిపోతే బీటలువారి పోతాయని, పడిన శ్రమ అంతా వృధా అవుతుందని, నేను ఆ పనిని మళ్ళీ మొదటి నుంచి ప్రారంభించవలసిన అవసరం లేకుండా. శిల్పులు అందరికీ ఈ విషయం తెలుసు. కాని ఆ పిచ్చి రోడేన్ ఇంటిలో జరిగే విషయం ఇది. అతని ఇంటిలోకి భార్య కాకుండా అతని శిల్పాలకు నమూనాగా పనిచేసే అందమైన ఆకృతి కలిగిన ఒక స్త్రీకి కూడా పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆమె అతని ఇంటికి తనకిష్టమయి నప్పుడల్లా వచ్చి వెళ్ళేది. అతని భార్య, భర్త ఊళ్ళోలేనప్పుడు, అతని శిల్పశాలలో గుడ్డలు కప్పబడి ఉన్న నమూనా లన్నిటి పైనా మొక్కలకు నీరు చిలకరించినట్లుగా, నీరు చిలకరించి ఆ శిల్పాలు ఎండి పోకుండా చూసుకొనేది తరువాత ఆ శిల్పాల కు నమూనాగా పనిచేసే అందమైన ఆమె దగ్గరకూడా ఆ శిల్పాశాల తాళం ఉండేది. రెండుమూడు గంటల తరువాత అందులోకి ప్రవేశించి, తిరిగి నీరు చిలక రించేది, అన్ని తడి కలిగి ఉన్నాయా లేదా అని ధృవీకరించుకొనేది. తనను

నమూనాగా వాడుకొని ఆ శిల్పి తయారుచేసే బొమ్మలను, శిల్పాలను రక్షించు కోవడం తన బాధ్యతగా భావించేది. పర్యవసానంగా రోడిన్ తయారుచేసి పెట్టు కున్న శిల్పాలన్నీ అతను ఊరినుంచి వచ్చేసరికి కరిగిపోయి ఉండేవి, తను తయారు చేసుకున్నది ఏదీ మిగిలేది కాదు. పడ్డ శ్రమంతా వృథా అయ్యేది అని రోడిన్ వాపోయాడు.

అతను అప్పటికే వృద్ధుడు, ఒక అద్భుతమైన శిల్పి. అతను గ్రీకు గ్రామ దేవత లాంటి శిరస్సుతో, పొట్టిగా, లావుగా తీక్షణమైన కళ్ళతో ఉండేవాడు. అతనిది అసాధరణ వ్యంగ్య నైజము మరియు కొంత...... ఇదంతా తలచి నవ్వే వాడు, కానీ తన శిల్పాలను చెక్కు చెదరకుండా కాపాడుకోవాలనే ఆకాంక్ష ఉండేది.

ప్ర: దీనికి మీ సమాధానం (నవ్వు)

నా కిప్పుడు సరిగ్గా జ్ఞాపకం లేదు, నవ్వుతూ బహుశా పరహసించి ఉండ వచ్చు. నాకు ఒక్కటి గుర్తుంది, నేను అతన్ని ప్రశ్నించాను, "పని ఏ ఒక్కరికో ఎందుకు అప్పచెప్పవు"అని? అతను తన తలమీద మిగిలిఉన్న కొద్ది వెంట్రుకలను లాక్కుంటూ, అప్పుడు అది కత్తులతో సాము అయ్యేది. అన్నాడు. (నవ్వు)

CWSA 6: 72-73

నీ కోరికను దిగమింగు

ఒకరోజు కొన్ని తిను బండారాలను తినాలని ఆపుకోలేనంత కోరిక కలిగింది. దానికి తగ్గ సాకు వెదకడంలో మనస్సు పూర్తిగా లగ్న మయింది. చివర్లో నేను శ్రీమాతకు రాసాను, "శ్రీమాతా, నేను ఈరోజు అత్యంత దురాశతో ఉన్నాను. మీకు తెలుసా, ఈ రోజు నాకు ఏది తినాలని ఉందో? కోడిగుడ్లు, పీతలు, ఊరబెట్టి న చేపలు, మీరు ఈ నా కోరికను అణచివేయండి లేదా మీ రక్షణలో వాటన్నింటినీ తినటానికి అనుమతినివ్వండి." మరునాడు శ్రీఅరవిందులు జవాబు వ్రాసారు! ఖచ్చితంగా తినవద్దని ! నువ్వు నీ కోరికను దిగ్రమింగు, అదే నీ కివ్వబడే చేప లేక మాంసం. అది అంతః చేతననుంచి లేచే పాత సంస్కారం. వాటితో ఎప్పుడూ జోక్యం చేసుకోకూడదు. అది తలెత్తేది ఎందుకంటే తిరస్కరించ బడటానికి. పరి హాసాస్పదమైన నవ్వు వచ్చింది. చెప్పటానికి వింతగానున్నా ఈ లేఖ పంపిన

తదుపరి తినాలి అన్న వాంఛ పూర్తిగా పోయింది. ఇది నన్ను స్వచ్ఛమైన ఆనందం మరియు సంతృప్తితో ముంచేసింది. ఒక వ్యక్తి కోరికను అధిగమించ డంలో పొందే ఆనందం మొట్టమొదటి సారిగా ఆనాడు నాకు అనుభవ మయింది.

Sahana devi : Forty years aga p. 123

తన మీద నృత్యం చేయటానికి అడ్డుపడే గాంభీర్యత

నేను శ్రీఅరవిందులు చేసిన రెండు హాస్యపూరిత వ్యాఖ్యలను చెప్పకుండా ఉండలేక పోతున్నాను. శ్రీమాతకు నృత్యంచూపించాలి అన్న అలోచన కలగ గానే , మాకు అభ్యాసానికి ఒక ముఖ్యమైన గదిని కేటాయించమని అడిగాము. ఆ గది క్రిందగదిలో ఒక సాధకుడు ఉండేవాడు. శ్రీఅరవిందులు మా విన్నపానికి సమాధానంగా, "అతను చాలా గంభీరమైన వ్యక్తి. అతనిమీద నృత్యం చెయ్యడం సాధ్యపడని విషయం." ఆ తరువాత మరి మేము రాధ నృత్యాన్ని ఎక్కడ సాధ న చేయాలి అని అడిగినపుడు శ్రీఅరవిందులు ఆ ముఖ్యమైన గదినే చూపారు. నేను ఎంతో ఆశ్చర్యంగా ఆ సాధకుని గురించి గుర్తు చేస్తూ రాసాను. "మరి మీరు ఆ సాధకుని తల మీద నృత్యసాధన చెయ్యడం కుదరదు. అతను చాలా గంభీర స్వభావుడు అన్నారు కదా!" అని దానికి శ్రీఅరవిందుల సమాధానం "బహుశా అతను తన గాంభీర్యాన్ని ఎంతో కాలం గడవక ముందే విడిచిపెడతా డేమో," అని.

Sahana Devi: forty:years since

ఒక వివేకవంతుడైన యోగి మరియు అవివేకమైన గాడిద

గురువుగారు? ఒకానొక కాలంలో ఒక అవివేకి గాడిద, ఒక వివేకవంతుడైన యోగికి సమీపంలో నివసించేది. ఒకరోజు అకస్మాత్తుగా అక్కడికి దగ్గరలో ఉన్న నదికి వరదలు వచ్చి నీరు గట్లు తెంచుకొని ప్రవహించి చుట్టుప్రక్కల గ్రామాలన్నింటినీ ముంచెత్తింది. వివేకవంతుడైన యోగి తను నిత్యం రాత్రి పగలు ధ్యానం చేసుకొనే కొండ దిగువనున్న గుహ నుండి కొండపైకి పరుగెత్తి సురక్షితమైన ఎత్తుకు చేరుకున్నాడు. కానీ ఆ గాడిద , తెలివి తక్కువతనం కారణంగా, అనాలోచితంగా, ఆ ఉధృత నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది."

అయ్యో పాపం, ప్రపంచమంతా పోతున్నదే అనే మునిగి ఓండ్ర పెట్టింది! కొండపైనుంచి యోగి కోపంగా గాడిదలా అలా అనకు అని చివాట్లు పెట్టాడు. మునిగిపోతున్నావు నీవే. ప్రపంచం మొత్తం కాదు, అన్నాడు. ఆ మూర్ఖపు గాడిద వాదనకు దిగి, నా అంతట నేను మునిగిపోతున్నప్పుడు ప్రపంచం అంతా జీవించి ఉంటుందని నాకు ఎలా నమ్మకం కుదురుతుంది? అన్నది! యోగి ఒక్కసారిగా అవాక్కయి, మాటలురాక ఆశ్చర్యంలో మునిగి, మొట్ట మొదటిసారిగా ఆశ్చర్యపడ్డాడు. ఎవరిది లోతైన జ్ఞానం మానవులదా లేక మూర్ఖపు గాడిదదా? అప్పుడు నేను కూడా ఆశ్చర్యంలో మునిగిపోయి గురువును ప్రశ్నించాను. "నేను మిమ్మల్ని అర్థిస్తున్నాను. తీర్పు చెప్పండి. యోగి మరియు గాడిద వారిద్దరిలో ఎవరు ఎక్కువ దయనీయ స్థితిలో ఉన్నారు? అలాగే, నా పరిస్థితిని గురించి కూడా చెప్పండి నా ఆలోచనలు అదుపు తప్పుతున్నాయా? ఎందుకంటే నా దృష్టిలో మూర్ఖపు గాడిద వాదన దాదాపు వివేకవంతుడైన యోగి వాదనంత వివేకవంతంగా అనిపిస్తోంది."

గాడిద అతి తెలివి గలది కాదు. కానీ అది వేసిన ప్రశ్నకు రెండు పంక్తులలో సమాధానం చెప్పలేం. ఇంకా ఇవాళ సోమవారం. మనుష్యులు బలవంతపు ఆదివారపు ఉపవాసానికి, నిషేదాలకు ప్రతీకారం తీర్చుకుంటారు. అందుకని నేను సమాధానాన్ని రేపటికి వాయిదా వేస్తాను. ఏమైనా, అపనింద పాలైన ఆ గాడిద తరఫున చెప్పాలి. అది చాలా అనుభవంగల తెలివైన గాడిద. దానికి మూర్ఖత్వం ఆపాదిస్తున్న మానవులే ఎక్కువ బుద్ది హీనులు. మనిషి దెబ్బలు కొడుతున్నా లెక్క చెయ్యదు, చెప్పింది చెయ్యదు కాబట్టి దానికి మూర్ఖత్వం అంటగడతాం. కానీ గాడిద అలా ప్రవర్తించటానికి మొదటికారణం దానికి ఉన్న హాస్య ప్రవృత్తి. అది రెండుకాళ్ళ మృగప్రవృత్తి గల మనిషిని రెచ్చగొట్టుటకు ఇష్టపడుతుంది. రెండవది, ఏ మాత్రం ఆత్మగౌరవం కలిగిన గాడిద నుంచి ఆశించకూడని అసంబద్ధమైన బాధకలిగించే హేయమైన చికాకు కలిగించే పని మనిషి తన నుంచి ఆశిస్తున్నాడని దానికి తెలియడం. అదీ కాక ఆ గాడిద ఒక వేదాంతి. అది కఠోరంగా మొరపెట్టిందంటే అది ముఖ్యంగా దుర్బలమైన మనిషి పట్ల తిరస్కార భావన వల్లనే గాక లోకంపై గల తిరస్కార భావనతో, గార్ధభ భాషలో మనిషికి అది ఇచ్చే ప్రాధాన్యత, మనం వాటికి ఇచ్చే విలువ వంటిదే అనటానికి నాకు ఎటువంటి సందేహం

లేదు. ఈ లోతైన ఆలోచలనలను పక్క నుంచండి, వాటి ద్వారా మీకు తెలియు చేసేది ఏమిటంటే వివేకవంతుడైన మనిషి మరియు వివేకి అయిన గాడిదకు మధ్య సమతూకం అంత భయం కలిగించే లక్షణం కాదు అని.

Letters to Dilip. 28-29

శ్రీ అనటోల్ ఫ్రాన్స్ గారికి భగవంతుని వివరణ

శ్రీ అనటోల్ ఫ్రాన్స్ తను రాసిన Les Dieux ont soif (Gods are thirsty) అనే పుస్తకంలో ఆక్షేపించేవాడగు బ్రూటో అనే అతని మాటలలో దేముడిపై చేసిన పరిహాసాన్ని నేను చదివి ఎంతో ఆనందించాను. అది మీరు తప్పనిసరిగా చదవాలి.

ఆయన ఫాదర్ లాంగ్ మేర్ ను ఇలా అన్నాడు. "దేవుడు దుష్ట శక్తులను ఆపగలగాలి కానీ చెయ్యి లేక పోయాడు. లేదా ఆపగలిగే శక్తి ఉంది కానీ చేయాలనుకోడు; చెయ్యలేడు చెయ్యడు; చెయ్యగలడు చేస్తాడు, — చేద్దామని ఉండి చేయలేకపోతే అతడు అశక్తుడు, చేతకాని వాడు; చేయగలిగి చేయకపోతే అతడు వక్రబుద్ధి గలవాడు: చేయగలడు కానీ చేయకపోతే అతను అశక్తుడు, వక్రబుద్ధి గలవాడు. కానీ చేయగలడు, చేస్తాడు అంటే ఈ భూమిపై ఆ పని ఇంకా ఎందుకు చేయడు తండ్రీ!"

దేవుడు దుష్టశక్తులను ఆపటానికి మొగ్గు చూపించినప్పుడు ఆయన దగ్గర ఈ ప్రశ్నకు ఏం సమాధాన ముంటుందన్నది నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

అనటోల్ ఫ్రాన్స్ ఎప్పుడూ వినోదభరితంగానే ప్రవర్తిస్తాడు – దేవుడిని గురించి, క్రైస్తవమతాన్ని గురించి, పశుప్రవృత్తిగల వివేకవంతమైన మానవ ప్రభావం గురించి, తన ప్రవర్తనా విధానం గురించి, అనాలోచిత కుర్దచేష్టల గురించి మాట్లాడినప్పుడు. కానీ అనటోల్ ఫ్రాన్స్ మరియు దైవం ఒకరినొకరు కలుసు కున్నప్పుడు — వ్యంగ్యమయమగు స్వర్గంలో అని నా ఊహ — తన విష యంలో దేవుడు ఎందుకు జోక్యం చేసుకోడు అన్న దానికి ఇచ్చిన వివరణ నువ్వు ఎప్పుడూ విని వుండవు. నా ఊహలో అది కార్ల్ మార్క్స్ స్వర్గం కాదు. మరణానికి పూర్వం అనటోల్ ఫ్రాన్స్ పరివర్తన చెంది చేరిన స్వర్గం అయి వుండ దు. దైవం వివరిస్తూ తన దగ్గరికివచ్చి చెప్పాడు:

"అనటోల్, నీకు తెలుసా, అది నీవు చేసిన గొప్ప పరిహాసం. కానీ, నేను జోక్యం చేసుకోక పోవడానికి ఒక మంచి కారణం కూడా వుంది. ఆలోచన నా వెంటబడి వచ్చి అన్నది, "ఇటు చూడు, నీవు నిజంగా ఉన్నట్టుగా ఎందుకు నటిస్తావు? నాకు తెలుసు, నీకు ఉనికి లేదని, ఎప్పుడూ లేదని. ఒక వేళ ఉన్నా, నీవు సృష్టిని ఎంత గందరగోళం గావించావంటే, మేము నిన్ను ఏ మాత్రం భరించ లేనంతగా. ఒక్కసారి మేము నీ అడ్డు తొలగించుకున్నామంటే, అంతా బ్రహ్మాండంగా, అతి విశిష్టమైనదిగా వుంటుంది. నేను, నా పుత్రికయైన శాస్త్రి విజ్ఞానం ఒక ఏర్పాటు చేసుకున్నాం, మా ఇద్దరి మధ్య మనిషి గౌరవంగా, సమానంగా, సౌభ్రాతృత్వంతో, ప్రజాస్వామికంగా, ఎవ్వరిపై ఆధారపడకుండా, తనకు తానుగా, తన కన్నా ఈ సృష్టిలో ఏదీ గొప్పది కాదు అని తన కనుబొమలను అహంకారంతో ఎగరేస్తూ, సృష్టికి అధిపతిగా నిలుస్తాడు. దేవుడు, దేవతలు, దేవాలయాలు, పౌరోహితులు, మతాలు, అణచివేతలు, దారిద్ర్యాలు, యుద్ధాలు, విరోధాలు అన్నవేవీ వుండవు. పరిశ్రమలు భూమిని సమృద్ధి పరుస్తాయి; వ్యాపారం సఖ్యతతో తన బంగారు రెక్కలను అన్ని వైపులా విస్తరిస్తుంది; విశ్వవ్యాప్తి చెందిన విద్య అజ్ఞానాన్ని పారదోలుతుంది; మనిషి మెదడులో ఎక్కడా మూర్ఖత్వానికి, అన్యాయానికి తావు లేకుండా చేస్తుంది; మనిషి సంస్కారవంతుడై, క్రమశిక్షణ, విచక్షణ, శాస్త్రి పరిజ్ఞానం గలవాడై, జ్ఞానవంతుడై, సర్వదా సంపూర్ణ అవగాహన గలవాడై, సరియైన నిర్ధారణ తీసుకో గలుగుతాడు. శాస్త్రివేత్తలు, నిపుణుల గొంతు ఈ భూమి మీద మరింత బిగ్గరగా వినపడి, మానవాళిని భూలోక స్వర్గం వైపుగా నడిపిస్తుంది. ఏ కొరతా లేని ఒక పరిపూర్ణత చెందిన సమాజం అభివృద్ధి చెందిన వైద్య విజ్ఞానంతో, దృఢమైన పరిశుభ్రమగు అలవాట్లతో, సార్వత్రికమైన ఆరోగ్య సౌభాగ్యంతో, వికసించిన శాస్త్రి విజ్ఞానంతో, పొరపాట్లకు తావీయకుండా, సర్వ శక్తివంతమై, సర్వజ్ఞతతో విరాజిల్లుతుంది. సృష్టి యొక్క అతి చిక్కు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మానవ ప్రాతినిధ్యం గల చట్ట సభలు, ఐక్యరాజ్య సమితి ఏర్పడతాయి. పరిణామ క్రమమంతా, ముఖ్యంగా మనిషి పరిణామం, వైభవోపేతమైన మానవునిగా ఎదగడం, అంతిమ లక్ష్య మౌతుంది. ఘన చరిత్ర గల తెల్ల జాతీయులలో సైతం మానవీయ వాత్సల్యం ప్రబలుతుంది; ఇప్పటికీ వెనుకబడి వున్న నల్ల, పచ్చ, గోధుమ వర్ణ జాతి

సోదరులను ఉద్ధరించడానికి శాంతి, శాంతి, శాంతి, వివేకం, క్రమం, సర్వజన ఐకమత్యం — ఇవే కాకుండా ఇంకా చాలా వున్నాయి, అనటోల్. నేను ఇట్టి స్థితి యొక్క సౌందర్యాన్ని, సానుకూలతను దర్శించి చాలా ప్రభావితుడ నయ్యాను. కారణం, ఇక నేను పర్యవేక్షణ చేయాల్సింది ఏమీ మిగల లేదు గనక, నేను నా వ్యాపారం విరమించుకున్నాను. నీకు తెలుసు, నేను ఎల్లవేళలా విశ్రాంతి నొందే స్వభావం కలవాడినని, తెర వెనుక నుండడానికి మొగ్గు చూపుతానని — సమయాన్ని ఆనందంగా గడపటానికి. కానీ, నేను వింటున్న దేమిటి? ఈ నివేదికను బట్టి శాస్త్రి విజ్ఞానంతో సమకూరిన సహాయంతో కూడా, ఆలోచనా సరళి తన వాగ్దానం నిలుపుకో లేదని అనిపిస్తుంది ఎందుకు? ఎందుకోసం? అందుకు కారణం తాను ఆ పని చేయదలచ లేదు అనా లేక చేయలేక పోయినందునా? లేదా చేసే శక్తి లేక చేయలేదనా' లేదా, చేయాలని వుండి ఏవో కారణాల వల్ల చేయలేదనా? అనటోల్, నేను చెప్పేదేమిటంటే, వాళ్ళ సంతానమైన ఈ దేశం, ఈ పారిశ్రామిక వాదం, పెట్టుబడిదారీ విధానం, సామ్యవాదం, మిగతా వన్నీ కూడా వింతైన, విపరీత ధోరణులు గలవి. అవన్నీ రాక్షసుల్లాగా కనబుడు తున్నాయి. అవి శాస్త్రి విజ్ఞానంతో సమకూరిన ఆయుధ సంపత్తి, బౌద్ధిక శక్తి, వ్యవస్థలతో కూడి వున్నాయి. నా దృష్టిలో సమస్త మానవాళి రాజులు, మత గురువుల క్రింద ఎంత స్వేచ్ఛ లేకుండా మన గలిగిందో, ఇప్పుడు అంతకు మించి స్వతంత్రంగా మాత్రం లేదు! ఏం జరిగింది — ఆలోచనా విధానం సర్వోత్కృష్టమైనది, నిర్దిష్టమైనది కాకుండా వున్నదా ఏమి? అది నేను చేసిన గందరగోళాని కన్నా మరింత ఎక్కువ చేసిందా?"

సంభాషణ నివేదిక ఇక్కడితో ముగిసింది. దేనికున్న విలువ దాని కీయాలి. ఎందుకనగా, నాకు ఈ దైవంతో సాన్నిహిత్యం లేదు, అనటోల్ ఫ్రాన్స్ మీద వుంచిన నమ్మకంతో ఆయనను స్వీకరించాలి.

Letters to Dilip, pp. 229-30

అనువాదం: డా. టి. యస్. రాజకుమారి

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగష్టు 2017



శ్రీఅరవిందుల కారుణ్యం

సంపాదకీయం

శ్రీమాత ఎల్లప్పుడూ శ్రీఅరవిందుల అపార కారుణ్యాన్ని మనకు జ్ఞప్తికి తెస్తుంటారు. అసలు వాస్తవమేమిటంటే శ్రీఅరవిందులు తీర్చిదిద్దిన అనేకమైన వాటిలో ఈ లక్షణం అనుపమాన మైనది. అనుపమాన మెందుకనగా వారి కవితలు, రచనా వ్యాసంగాల పూర్వాపరాల వెనుక ఈ లక్షణం అతి సౌమ్యంగా గోచరిస్తుంది. భూలోకానికి, మానవునికి దైవికమగు వెలుగును అందించడానికి, భవిష్యత్తుపై విశ్వాసం కలగడానికై శ్రీఅరవిందులు గాఢాంధకారంలో మునుగుటకు గల కచ్చితమైన కారణం ఈ లక్షణమే అని స్పష్టమౌతుంది.

శ్రీఅరవిందుల 145 వ జన్మదిన సందర్భంగా వెలువడిన ఈ సంచిక, వారి దివ్య కారుణ్య లక్షణాన్ని క్షణకాలం స్ఫురణకు తెచ్చుకొని, దానిపై ఒక లోతైన అవగాహన ఏర్పరుచుకొనే ప్రయత్నానికి అంకితం.

సంపాదకుడు



శ్రీఅరవిందులు తమ కరుణతో —
వారి కరుణ వారిని సేవించే అవకాశాన్ని మనకు ప్రసాదిస్తుంది.

The Mother, Coversation with a diciple, April 25, 1961

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దైవ కారుణ్యం

విశ్వధర్మం, కరుణ, దైవ కృప

మానవ మేధ కన్నా పెద్దగా భిన్నం కానటువంటి విధానాల్లో పనిచేసే ఒక దైవిక తార్కిక బుద్ధి లాంటి దేదో అని నీవు అనుకొంటున్నట్లు కన్పిస్తోంది గనుక, దైవ కృపను గురించి నీకు కొంత చెప్పాలనుకొంటున్నాను. కాని అది కాదు. ఒక విశ్వజనీన దైవ కారుణ్యం కూడా కాదు. దాని వైపు తిరిగి, దానిని వేడుకొనే వాళ్లందర్నీ అనుమతిస్తూ, నిష్పాక్షికంగా పనిచేస్తూ వుండే విశ్వజనీన దైవ కారుణ్యం సైతం కాదు. అది పుణ్యం చేసిన వాళ్ళను దగ్గరకు తీయదు, పాపం చేసిన వాళ్ళను దూరంగా నెట్టివేయదు. ఎవరిలో మార్పు, మానవ నైతిక బుద్ధి శుద్ధ పవిత్రతను భ్రష్టు పట్టించేటట్లు చేస్తుందో అటువంటి హింసించే వాడైన (సాల్ ఆఫ్ టార్సస్) కు, నీతి బాహ్యుడైన (సెయింట్ అగస్టెయిన్) కు, అపకీర్తి పాలయిన (జగై, మదై) లకూ, బిల్వమంగళునికీ, తదితర చాలా మందికి దైవకృప లభించింది. అది పుణ్య పురుషులకు లభించింది. మేము పుణ్యపురుషుల మను కొనే వారి అభావన నుంచి బయట పడవేసి దాని కావల వున్న ఒక పరిశుద్ధ చేతన లోనికి నడిపించింది. అది ఏ విధమైన నియమానికైనా, శ్రేష్టమైన విశ్వధర్మానికి సైతం — అతిశయించిన ఒక శక్తి అది — ఎందుకనంటే ఆధ్యాత్మిక ద్రష్ట లంద రూ, ధర్మాన్ని, దైవకృపను విడదీసి చూడ గలిగారు. అయినప్పటికీ అది విచక్షణా రహితమైనది కాదు, కాకపోతే దానికే స్వంతమైన విచక్షణ దాని కున్నది. ఆ విచక్షణ వస్తువులను, వ్యక్తులను, సరైన సమయాలను, ఋతువులను, మనస్సు కున్న దృష్టితో గాక మరో దృష్టితో చూస్తుంది. మనస్సు అంచనా వేయలేని సాధనోపాయాల ద్వారా తరచుగా తెర వెనుక వుండి, వ్యక్తిలో దివ్య కృపా కటా క్షం వలన కలిగే ఒక స్థితిని సన్నద్ధం చేస్తుంది. ఆ స్థితి సిద్ధించినపుడు దైవకృప స్వయంగా పనిచేస్తుంది. ఇక్కడ మూడు శక్తు లున్నాయి. 1) కర్మకు, తదితరా నికి సంబంధించిన విశ్వధర్మం, 2) ధర్మ ప్రచారాల ద్వారా, అది చేర గలిగినంత మందికి అవకాశం యిస్తూ పనిచేసే దైవాధిపత్యం, 3) ఇతరమైన వాటి కన్న అంచనా వేయలేని అధిక స్థాయిలో, అత్యధిక నిర్నిరోధ రీతిలో పనిచేసే దివ్య కృప. దైవకృప ప్రకాశం కోసం తయారయ్యేంత వరకు, అదెంత కష్టంతో జరి

గినా, పిలుపుకు బదులు పలికే, తనను తాను ఉన్మీలనం చేసుకొనే దేదైనా జీవన విపరీత నడతల వెనుక వున్నదా అనేది అసలు ప్రశ్న — అదీ గాక, ఆ యేదో అని మనం అనుకొనేది, మానసిక, ప్రాణిక చలనం అయి వుండ గూడదు. అంతర్ నేత్రంతో స్పష్టంగా చూడగలిగిన, ఆంతరికమైన దేదో అయి వుండాలి. అదక్కడ వుండి వున్నట్లైతే, అది ముందుకు వచ్చి క్రియాశీల మైనపుడు, ఒక నిశ్చయాత్మక మైన నిర్ణయానికి, లేక మార్పుకు సంబంధించిన పని చేస్తూ దివ్యకృప తన సంపూర్ణ చర్యకై నిరీక్షిస్తూ వున్నప్పటికీ, దివ్య కరుణ పని చేయగలుగుతుంది. ఇది భవిష్యత్తులో జరిగేటట్లు వాయిదా పడవచ్చు, యెందు చేతనంటే, అస్తిత్వపు కొంత భాగం లేక అంశం స్వీకరించడానికి యింకా సన్నద్ధమై లేనటువంటిది మధ్యలో చొరబడ వచ్చు.

CWSA 29:168 - 69 — శ్రీఅరవిందులు

దివ్య కారుణ్యం, దివ్య కృప

మొన్న యెప్పుడో యెవరో నవంబరు 24 వ తేదీ నాటి సందేశాన్ని గురించి అడిగారు. ఉన్నట్లుండి అకస్మాత్తుగా నేను దేన్నో చూచాను. శ్రీఅరవిందులు మాట్లాడుతున్నప్పుడు అదెంతో అద్భుతంగా వుండింది. నేను దివ్య కరుణను, దివ్య కృపను, 'ధర్మం' ను, ఆ దివ్యకృప ప్రతివానిపై ఎలా పనిచేస్తున్నదీ చూచాను — ప్రతివానిపై, ప్రతిదానిపై, విచక్షణా రహితంగా, షరతులు లేకుండా — దైవకృపను వారు స్వీకరించ గలిగే స్థితికి వారిని ఉద్ధరించుటలో ఆ కరుణ యెలా కన్పిస్తుందో చూచాను. అది చాలా అద్భుతం అనిపించింది.

అదీ, ఆ అనుభవం. ఈ దివ్య కరుణ వల కన్నాల గుండా యెలా పని చేస్తున్నదో అనుభూతి చెందాను. 'ధర్మం' యిక నెంత మాత్రం అవరోధం కాదనే అర్థాన్ని తెలిపినట్లు, ఆ దివ్యకృప యెంత శక్తివంతమో నేను చూచాను. ఈ దివ్య కరుణ ప్రతివానికీ అవకాశమిస్తు, ప్రతివానినీ స్పర్శిస్తూండడాన్ని నేను చూచాను. "అది ప్రతివానికీ అవకాశమిస్తుంది." అన్న దానికి వారి దృష్టిలోవున్న అర్థమేమిటో గ్రహించాను. సమానంగా, ఏ విధమైన ప్రాధాన్యత, లేక షరతు, లేక మరే విధమైనది, లేక ఏ స్థితికి సంబంధించిన విచక్షణ చూపకుండా ప్రతివానికి, అందరికీ కచ్చితంగా ఒకే విధమైన అవకాశం గాబట్టి ఈ కరుణ ఫలిత మేమిటంటే

దైవకృప ఉనికికి వీరి నందర్నీ మేలు కొలపడం, జగత్తులో దైవకృప లాంటి దొక టున్నదనే అనుభూతిని వారికి కలిగించడం. దానితో ఆకాంక్షించే వారి మరియు దృఢనమ్మకం వున్నవారి విషయంలో దైవకృప తక్షణమే పనిచేస్తుంది, సదా పనిచేస్తుంది, కాని దృఢ నమ్మకం వున్నవారి విషయంలో దాని ప్రభావం పూర్తిగా వుంటుంది.

ఇదంతా కూడా చాలా స్పష్టమైన యెంతో కచ్చితత్వం గలదిగా నుండింది! అదొక నూతన అనుభవం లాంటిది, నూతన జ్ఞానోదయం లాంటిది. శ్రీఅరవిందులే అనుభవించిన యీ దివ్యకరుణ ఆయన నేత్రాలలో దానిని చూడగలం. అది ముమ్మాటికీ నిజం, ఆయన నేత్రాలు పూర్తిగా కరుణామయం...

వారొకచోట యిలా వ్రాసారు. "ఏ ఒక్కరి విషయంలోనూ ఆ దివ్యకృప పెడమోము పెట్టదు. ఒక వేళ జరిగినా అది చాలా అరుదుగా జరుగుతుంది. కాని చాలామంది దివ్యకృపనుడి తాముగా దూరం పోతారు. కాని మనుష్యులే దైవకృపకు పెడమోము పెడ్తారు." కచ్చితంగా ఆ మాట లేవో గుర్తు లేవుగాని, ఆయన "వంకర" అనే మాట ఉపయోగించారనుకుంటాను, అది కూడా యెంతో యదార్థంగా నుండింది. అది దివ్యకృప తన చర్యను ఉపసంహరించు కోవడం కాదు. యెంతమాత్రం కాదు. ("దివ్య కృప పనిచేస్తూనే వుంటుంది. కాని మనుషులు మాత్రమే నిజంగా వక్రబుద్ధులు, వికృత రూపులు...")

వ్యక్తి వక్రగతిలో పడ్డాడంటే సర్వదా ఆవిధంగానే వుండటం అని అర్థంకాదు. దాని భావం ఏమిటంటే క్రియాశక్తి ముక్కు సూటిగా లక్ష్యం వైపు నడిచే బదులు స్వయంగా తన పైకే మలుపు తిరిగి రకరకాల కంపనలకు, తికమకలకు, మెలికలకు గురికాబడి అతని స్పందనలను వక్రగతి పట్టిస్తుందని. వక్రీకరించేది స్వయంగా వారి అస్తిత్వ విధానం (వక్రీకరణ అనేమాటే నాకు తరచు స్ఫురిస్తుంటుంది.) తిన్నగా వుండటానికి బదులు వంకరటింకరగా తయారైంది. అందుచేత దైవకృప యేమాత్రం ప్రభావం చూపలేదు. దానికి ప్రభావం ఉండదు.

Conversations with a deciple December 7, 1966

ఆధ్యాత్మిక బలం, చిత్తశుద్ధి, దైవకృప

బలాన్ని గురించి, దైవకృపను గురించి నేను చెప్పిన దాన్లో అర్థం కాని

దంటూ యేం లేదు. ఆధ్యాత్మిక ఉపలబ్ధి పొందటంలో బలాని కొక విలువ ఉంది. కాని బలం వల్ల మాత్రమే తప్ప మరే ఆలంబనతోనూ అది జరుగదని చెప్పడం ఒక విపరీతమైన అతిశయోక్తి. దైవకృప అనేది క్రొత్తగా కనుగొనబడింది గాదు, అదొక వాస్తవమైన ఆధ్యాత్మిక అనుభవం. పండితులు, పటిమ గలవారిచే యెందుకూ పనికి రానటువంటి వారని భావించబడిన చాలామంది దివ్యకృప వల్ల లబ్ధి పొందారు. మానసిక శక్తి లేక శిక్షణ లేక నైతిక శక్తి లేక సంకల్పబలం లేనప్పటికీ, వాళ్ళు ఆకాంక్షించి ఆకస్మికంగా, లేక త్వరగా, ఆధ్యాత్మిక సాక్షాత్కార స్థితి లోని కెదిగారు. ఎందుకనంటే వాళ్ళకు విశ్వాసం వుంది లేక చిత్తశుద్ధి వుంది. ఆధ్యాత్మిక చరిత్రకు సంబంధించిన అతి సాధారణ ఆధ్యాత్మిక అనుభవాలైన యీ వాస్తవాలను చర్చకు పెట్టి, అవి కేవలం ఊహా విషయాలు కాబట్టి తిరస్కరించాలి అని ఎందుకంటున్నారో నాకు తెలియడంలేదు. బలం ఆధ్యాత్మికమైనదైతే అది ఆధ్యాత్మిక సాక్షాత్కారానికి ఒక శక్తి. అంతకంటె గొప్ప శక్తి చిత్తశుద్ధి. అన్నిటి కంటే మహనీయశక్తి దైవకృప. ఒక మనిషి గనుక నిజాయితీ గలవాడై వుంటే, సుదీర్ఘమైన ఆలస్యం జరిగినా, అతడిని అతలాకుతలం జేసే కష్టాలెదురైనా, వాటన్నింటి గుండా అతను ముందుకు పోతాడని నేను లెక్కలేనన్ని సార్లు చెప్పాను. నేను దైవకృపను గురించి పదేపదే చెప్పాను. నేను భగవద్గీతలోని ఒక చరణాన్ని యెన్నో సార్లు ప్రస్తావించాను. అది "అహం త్వా సర్వ పాపేభ్యాం మోక్షయిష్యామి మాశుచః", దుఃఖించకు, సర్వపాపాల నుండి నిన్ను విడిపిస్తాను.

CWSA 29:72

ఆంతరిక దైవతం తీర్పు చెప్పదు, ఖండించదు

మన అనియంత్రిత ఊహా ధోరణి వల్ల అనవసరంగా నాటకీయం చేయబడిన మన ప్రేరణలు మన కోరికలకు, మన వ్యధలు, మన తిరుగుబాట్లకు, మన బాధలు, మన సంఘర్షణలకు యేమి విలువ ఉంది! మన అస్తిత్వ ఆంతరిక లోతుల నుండి మనపై వాలుతున్న మన బలహీనతలను భరిస్తూ, మన తప్పులను సరిదిద్దుతూ, మన గాయాలను మాన్పుతూ, మన అస్తిత్వాన్నంతా పునః శక్తివంతం జేసే తన శక్తి ధారలచే తానమాడిస్తున్న యీ గొప్ప, మహనీయ, దివ్య ప్రేమ ముందు వీటికేమాత్రం విలువ వుంది? ఎందుకనంటే యీ ఆంతరిక దైవతం

తనను తానుగా మన మీద యెన్నడూ వత్తిడి కలిగించదు, బలవంత పెట్టదు, భయపెట్టదు. తనను తాను మనకు అర్పించుకుంటుంది. సమస్త జీవుల హృదయాలలో, వస్తువుల కేంద్రంలో, తనను దాచుకొని మరచిపోతుంది. ఆమె యెన్నడూ నిందించదు, యెన్నడూ తీర్పు చెప్పదు, యెన్నడూ దూషించదు, ఖండించదు, కాని నిరంతరాయంగా యెట్టి వత్తిడినీ కలిగించకుండా చక్క జేయడానికి, మందలించకుండా మార్పు తీసుకు రావడానికి, అసహనం లేకుండా ప్రోత్సహించడానికి అతడు ఊహించగల సమస్త సౌభాగ్యాన్ని అతనికిచ్చి అతనిని సంపన్నుని చేయడానికి కృషిచేస్తూనే వుంటుంది. ఏ తల్లి ప్రేమ ఫలం మనల్ని పోషిస్తుందో, కాపు కాచి రక్షిస్తుందో, నచ్చజెప్పి సేద తీరుస్తుందో ఆ తల్లి ఆమె. ఎందుచేతనంటే ఆమె ప్రతి విషయాన్ని అర్థం చేసుకొంటుంది, ప్రతిదాన్ని సహిస్తుంది, ప్రతిదాన్ని మన్నించి క్షమిస్తుంది, ప్రతిదాన్ని అందుకోవాలని ఆశించేటట్లు చేస్తుంది. అందుకు సన్నద్ధమయ్యేటట్లు చేస్తుంది. తనలోనే సమస్తాన్ని భరిస్తూ, సమస్తానికీ సంబంధించిన దానినే గాక, దేనినీ తనదనుకొనకుండా, ఎందుకనంటే, సమస్తానికీ పైన ఆమె అధివసించి వుంటుంది గనుక, ఆమె సమస్తానికీ సేవకురాలు. అందుచేత పిన్నలు, పెద్దలు ఆమెతోపాటు రాజులుగా వుండాలను కొనేవారు, ఆమెతో పాటు వేల్పులుగా వుండాలనుకునే వారు, నిరంకుశులుగా గాక, ఆమెలాగా తోడబుట్టిన వారిమధ్య సేవకులుగా తయారౌతారు.

CWM 2: 42-43

పాపికి దైవకృప ప్రాప్తించడం

పాపికి దైవకృప ఎలా ప్రాప్తిస్తుంది?

అది పాపికి పాపిగా వుండడానికి సహాయం చేయదు! పాపం నుండి బయట పడటానికి పాపికి సాయం చేస్తుంది. అంటే "నీ కోసం నేనేమీ చెయ్యను" అని చెప్తూ, పాపిని దూరంగా నెట్టి వేయదు. పాపం చేస్తున్నప్పుడు కూడా దాని నుండి బయట పడటానికి సహాయం చేసేందుకు గాని అతడు పాపాన్ని కొనసాగించడంలో సహాయం చేసేందుకు గాదు, అది సదా అక్కడుండేది.

ఈ పాపానికి, నీవు చెడ్డవాడివనే భావానికి మధ్య గొప్ప భేదం వుంది, గనుక "నేను నిన్ను పట్టించుకోను. నానుండి దూరంగా నెట్టివేస్తాను. నీకేం

జరగాలనుందో అదే జరుగుతుంది. దాన్ని గురించి నేను పట్టించుకోను," అని అంటుందని సాధారణంగా అనుకొంటారు."భగవంతుడు నన్ను అలక్ష్యం చేసాడు" అని అనుకొంటారు కాని అసలు విషయం అది కాదని గ్రహించాలి నువ్వు. దైవకృపను నీవు అనుభూతి చెందలేక పోతున్నావు. కాని అత్యంత నికృష్టులైన పాపులు, అత్యంత దారుణమైన నేరస్తులు వారి నేరప్రకృతి నుండి, పాప ప్రవృత్తి నుండి వారు కోరితే వారిని మార్చడానికి సదా అచట వేచి చూస్తూ వుండనే వుంది. అది వారిని తిరస్కరించదు. కాని వారు కీడుచేయడానికి సహాయం చేయదు. అలా చేస్తే అది దైవకృప కానేకాదు.

CWM 6: 216-17

తనను తాను చాటుకొనని అనంత కరుణ

విశ్వాసం వున్నవారు గూడా, వారికోసం అంతా జరిగిపోవాలనుకొంటారు. వారికి అపనమ్మకం, మతిహీనత, అసామర్థ్యత వున్నప్పటికీ, వాళ్ళు మహాశక్తి పరాత్పరుడు తమకు అన్నీ చేయాలనుకొంటారు. దాన్నే వాళ్ళు సర్వశక్తి మంతత అంటారు. ఈ పరమసత్య కంపనం (దైవకృప, కరుణను కంపనాలుగా శ్రీమాత చెప్తున్నారు,) వారిమీద పడితే మొత్తం సర్వనాశనం అవుతుందనే సంగతి కూడా వాళ్ళకు తెలియదు, అంటే స్వయంగా వాళ్ళే నాశనమై పోతారు. వాళ్ళు తామేమిటని అనుకొంటున్నారో అది నాశనమై పోతుంది.

ఈ అనంత కరుణ దేనినీ నాశనం చేయదు, అది నిరీక్షిస్తూ వుంటుంది. అందుకు దానికి కృతజ్ఞతలు. ఇదో అద్భుతం, అద్భుతం తన పూర్తి శక్తితో తన పూర్తి క్రియాశక్తితో అది వేచి వుంటుంది. తనను తాను వారిపై విధించుకొనకుండా నష్టాన్ని వీలైనంత తగ్గించేందుకు అక్కడున్నానని తెలుపు తూంటుంది.

అది మహామహిమాన్విత కరుణ!

బుద్ధిలేని వాళ్ళు అందరూ దానిని అశక్తత అంటారు!

The Mother's conversations with a disciple, p.17, 1966

ప్రపంచంలో కరుణ, దైవికమైన విషాదం

ఒక ప్రగాఢ కరుణామయ స్థితినుండి, దైవం పదార్థంలో పనిచేస్తుంది. ఇచట

చెప్పిన యీ అంతరాత్మిక విషాదం ద్వారా, ఈ ప్రగాఢ కరుణ పదార్థంలో ప్రకటితమౌతుంది. దానినే మనం ఈ రోజు సాయంత్రం చదివాం. అది దేనినో తల క్రిందులు చేసినట్లుగా వుంది. చెప్పబడిన విషయం అదే గాని అది యీ విధంగా క్రిందుమీదైంది (శ్రీమాత తమ రెండు చేతులను కలిపి, తరువాత దేన్నో సమర్పిస్తున్నట్లుగా తెరుస్తారు) అహంకారమైన విషాదంగా గాక, సార్వజనీనమైన విషాదం యెడల సానుభూతిద్వారా, అభిన్నత్వాన్ని వ్యక్తం చేసే విషాదమైనటువంటి దానిలాగా అంతరాత్మిక చేతనలో ప్రకటితమైన దైవస్థితి ఆ కరుణ. ("ప్రార్థనలు, ధ్యానాలు" తరువాత చెప్పిన దాన్లో) నేను దీనిని చెప్పాను. "నేను దుఃఖించాను. నా జీవితపు అత్యంత మధురమైన కన్నీటిని కార్చాను" అని చెప్తూ, ఒక అనుభవాన్ని సుదీర్ఘంగా వివరించాను. ఎందుకంటే నేను దుఃఖించినది నాకోసం కాదు అని నీవు అర్థం చేసుకోవాలి. సరే అది అలా వుంది. మానవులు యెప్పుడూ అహంకారిక కారణాలవల్ల మానవీయంగా బాధ పడ్తారు. ఉదా: వారు ప్రేమించిన వ్యక్తిని వారు కోల్పోయి నపుడు బాధ పడ్తారు, దుఃఖిస్తారు. వారు దుఃఖించేది చనిపోయిన వ్యక్తి స్థితికి గాదు, అధిక భాగం, నూటికి తొంభై తొమ్మిది వంతులు చనిపోయిన వ్యక్తి స్థితి అతడు సంతోషంగా నున్నాడా లేక దుఃఖితుడుగా వున్నాడా. బాధలోవున్నాడా లేక ప్రశాంతంగా వున్నాడా వాళ్ళకు తెలియదు. తమకు తాముగా అనుభవించే యెడబాటుకు వాళ్ళు దుఃఖిస్తారు. తాము ప్రేమించే వ్యక్తి తమ దగ్గర వుండాలని కోరుకొన్నారు గాని అతనేమో వెళ్ళిపోయాడు. అందుచేత మానవ విషాదానికి మూలంలో, ఎప్పుడూ, తనమీదకే తాను తిరిగే మలుపు ఒకటుంటుంది. కొంచెం అటు యిటుగా అది యెరుక గలిగినదే, కొంచెం అటుయుటుగా — యెలా చెప్పాలి? అది వారి అంగీకారం పొందినదే అయి వుంటుంది. మరొకరి దైన్య స్థితి కతడు దుఃఖించినా అందులో యెప్పుడూ వ్యక్తిగతమైనదేదో కలిసిపోయే వుంటుంది. అది మిశ్రమం, ఆ విషాదంలో అంతరాత్మికమైనది కూడా కలిస్తే, "వ్యతిరిక్తమైన కరుణ" అంశం అందులో వుంటుంది. (దాన్నే నేను ఓ క్షణం క్రితం వివరించ యత్నించాను) అది అస్తిత్వంలో ప్రవేశిస్తుంది. రెండింటిని వేరు చేయగలిగితే, ఆ పనిమీద కేంద్రీకరిస్తే, తన అహం నుండి బయటపడి, యీ వ్యతిరిక్త కరుణతో మమేకమైతే, దీని ద్వారా మహనీయమైన విశ్వజనీన కరుణతో అతడు సంపర్కం లోనికి రాగలడు.

ఆ విశ్వజనీన కరుణ అపార మైనది, బృహత్తర మైనది, ప్రశాంత మైనది, శక్తివంత మైనది, లోతైనది, పరిపూర్ణశాంతితో నిండివున్నది, అనంత మాధుర్యం కలది.

CWM 6: 144

అంతరాత్మిక ద్వారం గుండా కరుణ లోనికి ప్రవేశించడం

తన విషాదాన్ని యెలా ప్రగాఢం చేయడమో తెలిస్తే, దాని సరైన హృదయం లోనికి చేరి, అహంకారిక వ్యక్తిగత భాగంనుండి ఆవలకు యెగసి, మరింత లోతుకు పోతే, అతడు ఒక గొప్ప వివేకద్వారాన్ని తెరువ గలుగుతాడు. విషాదం కోసమే విషాదాన్ని కాంక్షించాలని గాదు దీనర్థం. అది సంప్రాప్త మైనపుడు నీ విషాదపు అహంకారం, ఊర్థ్వానికి లేవగలిగితే యేది అహంకారిక భాగమో మొదట చూచి, నిన్ను బాధించినదేదో దాన్ని చూచి, నీ బాధకు అహంకారిక కారణమేదో చూచి, పైకి పోయి, దాని కావలకు, విశ్వజనీనమైన దేనివైపుకో, లోతైన ప్రాథమిక సత్యంవైపు సదా లేవగలిగితే అప్పుడు నీవు అనంత దివ్య కరుణలో ప్రవేశిస్తావు. అప్పుడు అక్కడ తెరచుకొనేది యదార్థంగా ఒక అంతరాత్మిక ద్వారం కాబట్టి, నేను కన్నీళ్ళు కార్చడాన్ని ఎవరైనా చూచినపుడు, చూచిన క్షణంలోనే సంపూర్ణంగా యేకం గావడానికి ప్రయత్నిస్తే — ఈ కన్నీళ్ళలో ప్రవేశించడానికి వాటిలో కరిగిపోవడానికి, అర్థమైందనుకొంటాను. అది ద్వారాన్ని తెరుస్తుంది. ద్వారాన్ని తెరచి పూర్ణానుభవాన్ని పొందితే, చాలా అపురూప అనుభవం కలుగుతుంది. అది నీ చేతనపై చాలా గట్టి ముద్ర వేస్తుంది. మామూలుగా అది చెరగి పోదు, కాని ద్వారం గనుక తిరిగి మూసుకుపోతే, నీ సాధారణ నడకలలో నీ వేమిటో అదిగా నీవు మరోసారి తయారైనప్పుడు కూడా అది నిన్ను విడువక యెక్కడో వెనుకగా ఉండనే వుంటుంది. తీవ్రమైన యేకాగ్రతలో మునిగిన క్షణాలలో దాని లోనికి వెనక్కు వెళ్ళగలవు. వెనక్కు వెళ్ళి ఒక అనంత మాధుర్యపు అపరిమేయ తను, గొప్పశాంతిని తిరిగి అనుభూతి చెందగలవు. బుద్ధితో గాక ప్రతిదానినీ అర్థం చేసుకొనే, అన్నింటి యెడల కరుణ చూపించే, సమస్తాన్నీ ఆలింగనం చేసుకొని, సమస్తానికీ స్వస్థతని కలిగించే స్థితి అది.

CWM 6:145-46

దివ్యకరుణ, దైవికమగు ప్రాతికూల్యత

అమ్మా! దైవికమగు ప్రాతికూల్యత అంటే ఏమిటి?

సంపూర్ణ కరుణ నిండుగా గల ఒక ప్రాతికూల్యత అది. ఇతరులను చెడు కంపనం నుండి రక్షించడానికి తనపైకి ఆ చెడు కంపనాన్నే తీసుకొనేదేదో అది... ఒక అపసవ్య, నీచ కదలిక పర్యవసానాలు (మౌనం) తప్పు చేసిన వాని పైకి ఉదాసీన వైఖరితో దానిని త్రోసివేయడానికి బదులుగా దానిని జీర్ణించు కొంటుందది. అలా చేయడం దానిని తనలోనే రూపాంతరీకరించడం కోసం, వీలైనంతవరకు చేసిన తప్పు భౌతిక పర్యవసానాలను తగ్గించడం కోసం అలా చేస్తుంది.

శివుడు ప్రపంచంలో వున్న చెడునంతా పానం చేసినందు వల్ల అతని కంఠంపై యేర్పడిన నల్లని మచ్చను గురించిన కథ, యీ దైవిక ప్రాతికూల్యతను తెలియజేసే ఊహా దృక్పథం అని నేను భావిస్తున్నాను. అది అతని కంఠంపై నల్లని మచ్చ పడేటట్లు చేసింది.

CWM 6: 286

దివ్యకరుణ, దివ్యకృప

దివ్యకరుణ అనేది, నిలబడే వానికి ఆసరా యిచ్చే దానితో సమానం. పూర్ణ బలం, దయకలిగిన జాలి, క్షమించి చక్కదిద్దే, అపరాధాల నన్నింటినీ మరచిపోయి ప్రతి దాని శుభాన్నీ యెల్లప్పుడూ కోరుతూండే ఒక జాలి అది.

CWM 17:10

వారికి అర్హత వున్నా లేకపోయినా, అందరూ బాధను ఉపశమింప జేయాలని కాంక్షిస్తుంది కరుణ.

బాధకు జీవించే హక్కున్నదని దివ్య కృప గుర్తించదు. బాధను రద్దు చేస్తుంది.

CWM 16:345 శ్రీమాత

ప్రపంచభారాన్ని మోయడం

అమ్మా! మానవ బాధను, దైవం తన పైకి తీసుకొన్నప్పుడు ... మన మీద

చూపించినట్లుగానే ఆతనిపైన కూడ ప్రభావం చూపుతుందా? అంటే మనం వాటిని సంవేదించినట్లుగానే, బాధ, విషాదాలను ఆతడు గూడా సంవేదిస్తాడా?

లేదు, లేదనే నేను చెప్పగలను. ఎందుకనంటే అజ్ఞాన స్థితికి జ్ఞానస్థితికి మధ్య స్వతహాగా భేదమున్నదనేది స్పష్టం. ఉదా: నీకు బాధ కలిగించే దేదైనా జరిగి నపుడు అజ్ఞాతస్థితిలో బాధ కలిగించిన విషయం ఒక ప్రత్యేక లక్షణాన్ని సంత రించుకొంటుంది. కాని బాధకలిగించిన విషయాన్ని జ్ఞాన స్థితిలో స్వీకరించి నపుడు దానికి అదే ప్రభావం వుండదు. భౌతిక విషయాన్ని చాలా భౌతికమైన ఒక దెబ్బను గట్టిగా కొట్టిన ఒక దెబ్బను ఉదాహరణగా తీసుకొందాం. (యిలా అని సంజ్ఞ చేసి, చూపిస్తారు) వ్యక్తి సాధారణ అజ్ఞాన స్థితిలో వున్నప్పుడు, ఆ దెబ్బ ప్రభావం చాలా యెక్కువగా వుంటుంది. పూర్తిగా అది దాని తీవ్రత మీద, ఆధారపడి వుంటుంది. దెబ్బ దేని వల్ల తగిలింది, అది యెవరికి తగిలింది అనే వాటి మీద ఆధారపడి వుంటుంది, కాని అజ్ఞాన స్థితికి బదులు జ్ఞానస్థితిలో వున్న వానికి అదే విధమైన దెబ్బను అదే వ్యక్తి కొడితే, వెంటనే దేహ ప్రతిచర్య, పర్యవసానాలను కనీస స్థాయికి తగ్గించే విధంగా వుంటుంది. ఇది పచ్చి నిజం! కొన్ని సందర్భాలలో పర్యవసానాలనే పూర్తిగా రూపుమాపడం వరకూ పోతుంది. అది అసలు పర్యవసా నాలనే లేకుండా చేసేంత వరకూ కూడా పోతుంది. ఎందుకనంటే ప్రతిచర్య అజ్ఞానానిది గాక జ్ఞానానిది గనుక. అందుకని రెండింటి పర్యవసానం ఒకటేనని చెప్పలేరు. నైతిక విషయాలలో యిది స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకనంటే, ఉదా: సాధారణ భావావేశాల అహంకారిక అంధత్వ మంతటితో ఒక భావావేశ కుదుపుకు లోనవ్వడానికి బదులు, అతడు దానిని విషయంగా, అంటే తనకు బాహ్యమైన దానిగా అదేమిటో చూచి, ఆ కంపనలో యేమేమి కూడి వున్నాయో చూస్తాడు. తక్షణమే దానిపై వెలుగును, జ్ఞానాన్ని, సత్యాన్ని ప్రసరింప జేసినందున సమస్త అంశాలు వాటి వాటి స్థానాల్లో పెట్ట బడతాయి. అది తక్షణమే జరుగుతుంది. అత్యంత పదార్థ దేహంపై సైతం, అత్యంత పదార్థ సంబంధమైన రీతిలో అయినప్పటికీ ప్రభావం ఒకటి కాదు అని గట్టిగా చెప్పగలను. పైగా దాన్ని అర్థం చేసుకోవడం కూడా చాలా తేలిక. ఎందుకంటే ప్రభావం గనుక ఒకటే యైతే, దైవం చెడును తన మీద వేసుకొన్నందు వల్ల యెటువంటి మంచి పర్యవసానమూ వుండదు. చెడు చెడుగానే మిగిలి పోతుంది. అందువలన జగత్తు

కూడా యిప్పుడున్నట్లుగానే కొనసాగు తూంటుంది. ఎందుకనంటే అతడు తన పైకి తీసుకొన్న దాన్నంతటివీ, అజ్ఞాన కంపనా లన్నింటినీ, తేజోమయమైన కంప నాలుగా రూపాంతరీకరించే శక్తి అతనికుంది. లేకపోతే, అది నిరుపయోగం గావడ మే గాక, అది అసాధ్యం కూడా అవుతుంది, పొంతన లేనిదిగా తయారవుతుంది.
CWM 6:286-88

దైవ వ్యవహార శైలి

ఇక ప్రతివానినీ ఒకే విధంగా ఆదరించడం అనేది బాగా తికమక పెట్టే విష యమే! దైవం, ప్రతి దానినీ ఒకే విధంగా ఆదరించాలని చెప్పినప్పుడు, ఆ విధ మైన తికమక ఏర్పడుతుంది. అందు వలన ప్రపంచంలో వైవిధ్యం వుండడంలో ప్రయోజన మేమీ లేదు, ఇద్దరు ఒకే రకమైన వ్యక్తులు లేకపోయినా యిబ్బందేమీ లేదు. ఎందుకంటే ఇది వైవిధ్య సూత్రాన్నే విరోధించి నట్లవుతుంది. జగత్తులో వున్న దానంతటి యెడల, యేకత్వం, ప్రేమ, పరిపూర్ణ కరుణను అర్థం చేసుకోవ డంలో ఒకే విధమైన ప్రగాఢ ధోరణి కోసం నీవు ఆకాంక్షించ వచ్చు — అది వుండి తీరవలసిన ఆకాంక్ష. కాని యిదే ధోరణిని ప్రతి సందర్భానికి ఒక భిన్న మైన రీతిలో అ సందర్భపు సత్యానికి, అవసరానికి తగినట్లుగా అన్వయించ వచ్చు. కర్మ ఉద్దేశ్యం లేక మూలం అనేది ఒకటే. కాని సందర్భాన్న ననుసరించి, ప్రతి సందర్భపు సత్యాన్ని అనుసరించి, ఆచరణ పూర్తిగా వ్యతిరేకంగా వుండవచ్చు. కాని దానికి కచ్చితంగా బాహ్య యాదృచ్ఛిక సంఘటన లన్నింటి నుండీ స్వేచ్ఛ కలిగి వున్న అత్యున్నత ధోరణి, అత్యంత గంభీర, అత్యంతావశ్యక సత్యం అత నికి తెలిసి వుండి తీరాలి. అప్పుడతడు ప్రతి నిముషం అత్యంతావశ్యక సత్యాన్ని మాత్రమే గాక ఆచరణలోని సత్యాన్ని కూడా చూడగలుగుతాడు. ప్రతి సందర్భం లోనూ అది భిన్నం. అయినప్పటికీ — మనం 'అనుభూతి' అని అంటున్నది — యిది చాలీ చాలని పదం అయినప్పటికీ — లేక అతడు యే చేతనా స్థితిలో కర్మ చేస్తున్నాడో అది సారతః ఒక్కటే. కాని విషయాల సారభూత లోతులలోనికి ప్రవేశించి అత్యున్నత శిఖరాల నుండి వాటిని చూడకపోతే, యిది అర్థం కాదు. అర్థమైనప్పు డదొక చాలినంత ఔన్నత్యం గల చేతన, వెలుగు కేంద్రంలా లేక విషయాల నన్నింటినీ ఒకే సమయంలో, సారతః అవేమిటో మాత్రమే గాక, అభి

వ్యక్తిలో గూడా అవేమిటో చూడ గలుగుతాడు. చేతన కేంద్రం ఒకటే అయినప్పటికీ, అభివ్యక్తి యెంత వైవిధ్య మైనదో అంత వైవిధ్యంగా, కర్మకూడా వుంటుంది. అదే అభివ్యక్తిలో దివ్య సత్యసాక్షాత్కారం లేనియెడల ప్రపంచంలోని సమస్త వైవిధ్యతనూ, దాని సారభూత అనభివ్యక్త యేకత్వానికి వెనక్కు తీసుకురావడాన్ని వదలుకొన్నట్లే. ఎందుకనంటే అభివ్యక్తి లేనపుడే, ఆ యేకైకుడు, ఒకే ఒక్కనిగా అభివ్యక్తమయ్యాడు. కాని వ్యక్తి అభివ్యక్తిలో ప్రవేశించగానే, ఆ యేకైకుడు నానాత్వంగా అభివ్యక్తమయ్యాడు. నానాత్వంలోనే నానాకర్మలు, నానా విధానాలు యిమిడి వున్నాయి.

CWM 8: 407-408 స్వేచ్ఛానువాదం: కె.వి. రావు

సృష్టి బాధను దైవం తనమీద వేసుకొనడం

ప్ర: మాతా, అజ్ఞానం, పీడనం వలన బాధ వస్తుంది కదా, కాని దివ్యజనని తన పిల్లల కోసం అనుభూతి చెందే బాధ, పీడనాల లక్షణం ఏ విధంగా ఉంటుంది— సావిత్రిలో దివ్యజనని?

స: దానికి కారణం ఆమె వారి ప్రకృతిలో భాగస్వామి అవుతుండడం మూలంగానే. ఆమె వారి ప్రకృతిలో పాలుపంచుకోవడానికి క్రిందికి భూమిమీదకు దిగి వచ్చింది. కారణం ఆమె వారి ప్రకృతిలో పాలు పంచుకోకపోతే గనక, ఆమె వారికి దారి చూపి ముందుకు నడిపించలేదు. బాధే లేనటువంటి ఆమె తన పరమోత్కృష్ట చైతన్యంలోనే ఉంటే, తన పరమోత్కృష్ట జ్ఞానంలోనే ఉంటే, ఆమెకు మానవ అస్తిత్వాలతో ఎటువంటి సంబంధమూ ఉండే అవకాశం లేదు. దానికోసమే ఆమె మానవ చైతన్యాన్ని, రూపాలను తీసుకోవలసిన అవసరం కలిగింది, ఆ విధంగా వారితో ఆమె సంపర్కంలోకి చేరటానికి శక్యం కలుగుతుంది. కేవలం అంతమాత్రమే తప్ప, ఆమె మర్చిపోదు: ఆమె వారి చైతన్యాన్ని తనదిగా గ్రహిస్తుంది. కాని ఆమె తన సొంత వాస్తవమైన, పరమోత్కృష్ట చైతన్యంతో సంబంధంలో ఉండియే ఉంటుంది. ఆవిధంగా, రెండింటినీ కలపడంతో, ఎవరైతే అన్యచైతన్యంలో ఉంటారో వారిని పురోభివృద్ధి చేయగలుగుతుంది. కాని ఆమె

వారి చైతన్యాన్ని తనదిగా గ్రహించక పోతే, ఆమె వారి దుఃఖ బాధను అనుభవించక పోతే, ఆమె వారికి సహాయం చేయ లేదు. ఆమెది అజ్ఞానంలో అనుభవించే బాధ కాదు; ఆమె తాదాత్మ్యతతో బాధ ననుభవిస్తుంది. కారణం, ఆమె వారితో సంపర్కంలోకి వెళ్ళ గలగటానికి, వారు ఉన్న స్థితినుంచి వారిని బయటకు లాగ గలగటానికి, వారి కున్నటువంటి అవే స్పందనలను పొందటానికి ఆమె సమ్మతించింది. వారితో ఆమె సంపర్కం లోకి వెళ్ళకపోతే, ఆమె అనుభూతిని ఏ మాత్రమూ పొందలేరు, లేదా ఉజ్వలమైన ఆమె వెలుగులను ఎవ్వరూ భరించలేరు.... ఇది అన్ని రకాలైన సంప్రదాయ రీతుల లోను, అన్ని రకాల మతాల లోను చెప్పబడింది. వారు దైవిక త్యాగాన్ని గురించి చాల తరచుగా చెప్పటం జరిగింది. కాని ఒక విధమైన దృక్పథం ప్రకారం అది నిజమే. అది స్వచ్ఛందమైన త్యాగం, కాని అది నిజం. పరిపూర్ణ చైతన్య స్థితిని, పరిపూర్ణ ఆనందాన్ని, పరిపూర్ణ శక్తిని వదిలిపెట్టి, అజ్ఞానంలోనుంచి బాహ్య ప్రపంచాన్ని బయటకు లాగటానికి ఆమె అజ్ఞాన స్థితిని ఆమోదించింది. ఈ స్థితిని గనక ఆమె ఆమోదించక పోయినట్లైతే, ఆమెకు దానితో ఏ సంపర్కమూ ఉండబోదు, ఏ సంబంధమూ సాధ్యమయ్యే విషయం కాదు. అవతారానికి సహేతుకమైన కారణం ఇదే. అన్యథా వాటి ఆవశ్యకత వుండేది కాదు. దివ్యచైతన్యం, దివ్యశక్తి వారున్న పరిపూర్ణ స్థితినుంచి సూటిగా పనిచేయ గలిగితే, సూటిగా పదార్థంమీద పనిచేయగలిగి దానిని పరివర్తన చేయగలిగితే, అప్పుడు మనిషి కున్నటువంటి శరీరాన్ని ధరించ వలసిన ఆవశ్యకతే లేదు. దివ్య సత్యలోకంనుంచి పరిపూర్ణ చైతన్యంతో చైతన్యంమీద పనిచేస్తే సరిపోయేది. నిజానికి అది పనిచేస్తుంది, కాని బహుశా చాలా నెమ్మదిగా, ప్రపంచాన్ని పురోభివృద్ధి నొందించటానికి ఈ విశేష ప్రయత్నం ఉన్నప్పుడు, దానిని ఇంకా త్వరగా ముందుకు పోయేటట్లు చేసేటప్పుడు, దైవం మానవ ప్రకృతిని తీసుకోవలసిన ఆవశ్యకత ఉంది. మానవ శరీరాన్ని తీసుకోవటం ద్వారా ఒకరు మానవ ప్రకృతిని తీసుకోవటానికీ బద్ధుడవుతారు, పాక్షికంగా. కేవలం, ఒకరు తమ చైతన్యాన్ని పోగొట్టుకోకుండా, దివ్య సత్యంతో సంబంధాన్ని పోగొట్టుకోకుండా, ఒకరు ఈ చైతన్యాన్ని ఈ దివ్యసత్యాన్ని అట్టే పెట్టుకొంటారు. ఈ రెండింటినీ కలపడం ద్వారా, కచ్చితంగా ఈ రకమైన రసాయన యోగ పరివర్తనను

సృష్టించ గలుగుతారు. కాని పదార్థాన్ని స్పృశించకపోతే, వారు దానికి ఏమీ చేయలేరు.

CWM5: 387-88

కారుణ్యం — దైవజోక్యం

.... జోక్యం చేసుకోక పోవటం ఎప్పుడూ వివేకవంతమైన పనే — జనులు తలా తోకా లేని విధంగా జోక్యం చేసుకుంటారు. కేవలం ఇతరులకు సలహాలిచ్చే అలవాటు ప్రకారం తమ అభిప్రాయాలను తెలియ జేస్తుంటారు.

అసలైన విషయం యొక్క దృష్టి నీకు ఉన్నప్పటికీ కూడా, జోక్యం చేసుకోవటం చాలా అరుదుగా వివేకవంతమైన దవుతుంది. ఒకరు ఒక పని చేయ దలచుకొన్నప్పుడు అది తప్పనిసరిగా వినాశానికి దారి తీసేదైనప్పుడు మాత్రమే అది అనుల్లంఘనీయమైన దవుతుంది. అప్పుడుకూడా, జోక్యం (నవ్వు) ఎల్లప్పుడూ ప్రభావకారి కాదు.

వాస్తవానికి, జోక్యం సమర్థనీయమైన దయ్యేది కేవలం నీకు పూర్తిగా కచ్చితంగా సత్యం యొక్క దృష్టి ఉన్నప్పుడు మాత్రమే. కేవలం అదే కాదు. దానితో పాటుగా పర్యవసానాల యొక్క స్పష్టమైన దృష్టికూడా. ఎవరో ఒకరి పనులలో జోక్యం చేసుకోవటానికి ఒకరు తప్పకుండా ప్రవక్త అయ్యుండాలి. ఆ ప్రవక్త మొత్తం అంతా మంచితనంతో కారుణ్యంతో ఉండాలి. ఒకరికి అవతలి వ్యక్తి విధిలో జోక్యం చేసుకోవడం వలన సంభవించే పర్యవసానాల దృష్టి కూడా తప్పక ఉండాలి. జనులు ఎల్లప్పుడూ ఒకరి కొకరు "ఇది చెయ్యి, అది చెయ్య వద్దు" అనే సలహా ఇస్తుంటారు. నేను దానిని గమనిస్తుంటాను. వారు ఎంత గందరగోళాన్ని సృష్టిస్తున్నారో వారికి ఎటువంటి భావనా ఉండదు. గందరగోళాన్ని అస్తవ్యస్తతను వారు ఎంత ఎక్కువ చేస్తారో వారికి తెలియదు. ఒక్కొక్కప్పుడు వారు వ్యక్తియొక్క సహజమైన అబివృద్ధికి హాని కలుగ జేస్తారు.

అభిప్రాయాలు ఎల్లప్పుడూ ప్రమాదకరమైనవని, చాలా తరచుగా అవి పూర్తిగా ఎందుకూ కొరగానివని నేననుకొంటాను. ఇతరుల వ్యవహారాల్లో నీవు తల దూర్చ కూడదు, నీవు వారికంటే అపారంగా వివేకవంతుడవైతే తప్ప. సహజంగానే, ఒక వ్యక్తి ఎల్లప్పుడూ తనకు తాను వివేకవంతుడననే తలుస్తాడు! నేను

ఈ విషయాన్ని వాస్తవ దృష్టిలో మాట్లాడుతున్నాను. కాని నీ సొంత అభిప్రాయం ప్రకారం మాత్రం కాదు. భవిష్యత్తును నీవు ఇంకా బాగా చూడ గలిగితే, నీవు వ్యామోహాలన్నింటికీ, కోరికలకూ, అంధ ప్రతిక్రియలకూ అతీతుడవైతే తప్ప జోక్యం చేసుకోకూడదు. ఇతరుల జీవితంలో జోక్యం చేసుకొనే హక్కు కలిగి ఉండటానికి నీవు వీటన్నింటికీ నీకు నీవుగా అతీతుడవుగా ఉండాలి. అతడు జోక్యం చేసుకోమని అడిగినా కూడా. అతడు అడగనప్పుడు అది కేవలం నీ వ్యవహారం కానటువంటిదైన ఏదో ఒక దానితో అనవసరంగా జోక్యం కలుగజేసుకొనటమే అవుతుంది.
CWM 10: 235-236

దివ్యకారుణ్యం — దైవదృష్టి

ఎవరైతే తెలివితేటలలో ఉన్నతోన్నత స్థాయిలకు చేరినప్పటికీ, వారిలోని మానసిక ప్రవృత్తులను నియంత్రించ లేకపోతారో, వారికి అందరూ తమ మాదిరిగానే ఆలోచించాలనే, తాము అవగాహన చేసుకొన్న విధంగానే అందరూ చేసుకొనే సామర్థ్యం కలిగి ఉండాలనే అమాయకత్వపు తపన ఉంటుంది. ఎప్పుడైతే ఇతరులు ఆ విధంగా ఉండరో, వారికి ఆ విధంగా అర్థం చేసుకొనే శక్తి లేదో, అటువంటప్పుడు వారి మొదటి ప్రతిక్రియ విపరీతంగా తల్లడిల్లిపోవడం, అప్పుడు వారు ఆశ్చర్యచకితులై అంటారు. "ఎటువంటి మూఢుడు!" కాని వారేమాత్రం మూఢులు కారు. వారు వేరే విధంగా ఉన్నవారు, వారు మరొక్క క్షేత్రంలో ఉన్నారు. నీవు జంతువు వద్దకు వెళ్ళి, "నీవు మూఢమతివి" అని అనవు, నీవు "ఇది ఒక జంతువు" అంటావు. మరి నీవు "ఇది ఒక మనిషి" అంటావు. అది మనిషే; కేవలం మానవ మాత్రులు కాని వారున్నారు. కానీ ఇంకా కొంతమంది ఉన్నారు. వారు దేవతలు కారు. వారు ఒక పరిస్థితిలో ఉన్నవారు..... వాస్తవానికి ఒక ఇబ్బందికర పరిస్థితిలో, కాని అది ఎంతో ఓదార్పు నిచ్చేది, ఎంతో తియ్యనైనది, ఎంతో అద్భుతమైనది. ఈ దర్శనం ప్రతీదీ పూర్తిగా సహజమైన, తన లక్షణాన్ని వ్యక్త పరుస్తూ. దాని విస్తృతిలో సమస్త దర్శనంతో ఒకటేదో లభ్యమౌతుంది. అది అవగాహన చేసుకొనే కారుణ్యం — అదేమీ తక్కువస్థాయి మీద ఎక్కువ స్థాయికి ఉండే దయ కాదు, నిజమైన, దైవికమైన దివ్యకారుణ్యం,

అది ప్రతివ్యక్తి తప్పకుండా ఏ విధంగా ఉండాలనే సంపూర్ణ గ్రహణశక్తి.
CWM 11: 29

దివ్యకారుణ్యం — దివ్యప్రేమ

కాని అప్పుడు హఠాత్తుగా ఒక్కసారిగా, నిజమైన ఈ దివ్య కారుణ్యం, దివ్యప్రేమ వచ్చినప్పుడు, వెల్లడవుతున్న ఈ విషయాలన్నింటినీ ఒకరు ఎంతో దారుణంగా, ఎంతో అసహనంగా, ఎంతో అసంగత మైనవిగా చూపినప్పుడు, అన్ని అస్తిత్వాల మీద, అన్ని విషయాలమీద సైతం అసాధారణమైన క్లేశం ఉంటు న్నప్పుడు.... ఆ సమయంలో భౌతిక అస్తిత్వంలో ఒక ఆకాంక్ష ప్రభవిస్తుంది, దీన్ని ఓదార్చడానికి, స్వస్థత చేకూర్చడానికి, దానిని తొలగించ డానికి. అప్పు డక్కడ, అందులో దివ్యప్రేమ, దాని దివ్యమూలంలో ఏదో ఒకటి నిరంతరం దివ్యానుగ్రహ జోక్యంగా భావించ బడేది ప్రవేశిస్తుంది: ఒక శక్తి, ఒక తియ్యదనం, ఏదో ఒక ప్రకంపన లాంటిది, అంతటా పరచుకొన్న ఊరడింపు లాగా. కేవలం ఒక ప్రకాశవంతమైన చైతన్యం మాత్రమే కొన్ని స్థానాలపై దాని ప్రభావం చూప గలదు, ఏకాగ్రం కాగలదు. అక్కడే, అక్కడ మాత్రమే, ఆలోచనల అసలైన ఉప యోగాన్ని ఒకరు ఏ విధంగా వినియోగించ వచ్చనే దానిని నేను చూసాను. ఈ ప్రకంపనను ఆలోచన ఒక విధమైన మాధ్యంగా ఒకచోటి నుంచి మరొక చోటికి, ఎక్కడెక్కడ దాని ఆవశ్యకత ఉంటుందో, అక్కడక్కడకు తీసుకుపోతుంది. ఈ శక్తి, ఈ ప్రకంపన తీయదనం గ్రహించ బడటానికి ఒత్తిడి చేస్తూ ప్రపంచంమీద స్థిర శక్తిగా పనిచేస్తుంది. కాని అది వ్యక్తిత్వరహిత చర్య, ఆలోచన — ప్రకాశవంత మైన ఆలోచన, సమర్పించబడిన ఆలోచన, ఇక ఎంతమాత్రము ఉపకరణముగా తప్ప ఇతరముకాని ఆలోచన, ప్రారంభించడానికి ప్రయత్నించని ఆలోచన. ఉన్నతోన్నత చైతన్యంతో కదలించబడటం మూలంగా సంతృప్తి పొందినటు వంటిది. ఆ ఆలోచన, ఒక సంపర్కాన్ని, ఒక సంబంధాన్ని నెలకొల్పటానికి, ఎక్క డెక్కడ ఆవశ్యకత ఉందో, అక్కడక్కడ, నిర్దిష్టమైన స్థానాలమీద ఆ వ్యక్తిత్వరహిత మైన మహాశక్తి పనిచేయడాన్ని సుసాధ్యం చేయడానికి మధ్యవర్తిగా పనిచేస్తుంది.
CWM 11: 42- 43

దివ్యకారుణ్యం — దైవన్యాయం

ప్ర: దైవం అన్యాయానికి దండన విధిస్తుందా? ఆయన కసలు ఎవరినైనా శిక్షించటం సాధ్యమయ్యే విషయమేనా?

స: విషయాలను మనుషులు చూసే విధంగా దైవం చూడదు. ఆయనకు శిక్షలు విధించడం లేదా బహుమతు లీయడం అవసరంలేదు. ప్రతి కర్మ దానితో పాటు దాని ఫలితాన్ని, పర్యవసానాలనూ, తీసుకువస్తుంది.

కర్మలక్షణాన్ని బట్టి నిన్ను అది దైవం వద్దకు తీసుకు వెళ్తుంది లేదా ఆయనకు దూరంగా తీసుకు వెళ్తుంది, అదే పరమోత్కృష్ట పర్యవసానం.

*

మనిషి ఏర్పరచుకున్న న్యాయాన్ని బట్టి అపరాధి శిక్షార్హుడు. కానీ మానవ న్యాయం కంటె ఎక్కువ అనివార్యమైన న్యాయం ఒకటుంది. అది దైవ న్యాయం, కారుణ్య పూరితమైన దయ: ఈ ధర్మం కారణంగా ప్రపంచం చాలాకాలం మన గలుగుతున్నది, దివ్యసత్యం దివ్యప్రేమల దిశగా పురోభివృద్ధి చెందుతున్నది.

CWM 14:24

దివ్యకారుణ్యం కేవలం తినబడిన వారికే కాకుండా, తినేవారికి కూడా చేరుతుంది — కేవలం చిత్రహింసకు గురైన వారికే కాకుండా, చిత్రహింసకు గురి చేసే వారికి కూడా చేరుతుంది.

CWM 14:131

..... మనుషులు ఎప్పుడూ అపరాధి శిక్షించబడాలని కోరుకుంటారు. తంటాను తొలగించుకోవడానికి అది మార్గం. కాని అసలైన మార్గం కారుణ్యం మరియు దయ. దానర్థం, నీవు అసలైన గమనం ఏదో, దోషపూరిత గమనం ఏదో, తెలుసుకోవటానికి అజ్ఞానివని కాదు, కాని నీకు అప్రయత్నంగా తటాలున కని కరం కలుగుతుంది. అప్రయత్నంగా — అన్ని సమయాల్లో, దర్శనం చాలా స్పష్టంగా ఉంది, ఈ విధంగానే పురోభివృద్ధి సాధ్యం అని. దోషులు ఎప్పుడు శిక్షించ బడాల్సి వస్తే, అక్కడ పురోబివృద్ధికి ఎవ్వరూ మిగలరు!

The Mother: Conversations with s disciple, November 19, 1966



స్వర్గమును కిందికి ఇక్కడకు తెచ్చునాతడెవరో
తనకు తాను తప్పక మానవ దేహంలోనికి అవరోహించ వలె
మరియు భూప్రకృతి భారమును భరించ వలె
మరియు నడవ వలె దుఃఖపూరిత మార్గమున.

నా దేవత్వాన్ని బలవంతపెట్టి నేను కిందికి వచ్చాను.
ఇక్కడకు హీనమైన ఈ భూమి మీదకు,
అజ్ఞానంతో, శ్రమిస్తూ, మానవులు వృద్ధి నొందే
చావు, పుట్టుకల ద్వారాల మధ్యకు.

CWSA 2:534

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మొత్తం మీదను పనిచేసే పరమేశ్వరుని కారుణ్యం

నేను ఈ మూడురోజుల తరబడి ఒక దర్శనం పొందాను. పరమోత్కృష్ట చైతన్యం ఏ విధంగా పనిచేస్తున్నదో చూపిస్తున్నదీ (నేను దానిని వ్యక్తిగతంగా పరమ ప్రభువు అని పిలవటాన్ని సౌకర్యంగా గ్రహించాను) ప్రతి సెకను అది నిన్ను ఏ విధంగా చేయటానికి లేదా చెప్పటానికి లేదా చూడటానికి పురికొల్పుతూ లేదా ఈ విధంగా ప్రతిదీ కదులుతూ ముందుకు పోవటానికి కచ్చితంగా ఏది అవసరమో దానిని తెలుసుకొనేటట్లు చేస్తున్న (విశ్వశక్తుల గమనాలు లెక్కలేని విధంగా శాఖోపశాఖలుగా, గుండ్రంగా, విస్తరించునట్లుగా వ్యక్తపరచే సంజ్ఞ) ఒక నిర్దిష్టమైన దర్శనం ప్రతి సెకను పొందాను. అప్పటికి అది ఒత్తిడి చేసే, సర్వ శక్తివంతమైన , సూటైన మహాశక్తుల వినాశకారక మహాగమనం కాదు. (పై నుంచి కిందికి చూపించే సంజ్ఞ, తళతళమెరిసే కత్తియొక్క ప్రకాశంలాగా): ఇది ఇటువంటి గమనం (అదే గుండ్రని సంజ్ఞ) కాని అద్భుతం, అద్భుతమైన సూక్ష్మత, కౌశలం ప్రతి ఒక్కదానికి మాన్యతతో, కాని ప్రతి ఒక్కటీ, నీకు తెలుసా, ఒక గమనం ప్రతి ఒక్కదానిని లక్ష్యం దిశగా ముందుకు పోవటానికి ప్రతి ఒక్కదానిని వినియోగించుకుంటుంది. “తప్పులుసైతం” దివ్య చైతన్యం అక్కడ ఉన్న కారణాన అవి తప్పులు కావు, అజ్ఞానం మూలంగా చేయబడిన తప్పు కాదు. ఒక విషయం చెప్పబడింది లేదా చేయబడింది. ఎందువల్లనంటే చెప్పవలసి నది అదే, లేదా చేయవలసినది అదే. అవటం మూలంగా — చూడటానికి అది పెద్ద పొరపాటుగా కనపడవచ్చు. అయినప్పటికీ ప్రతి ఒక్కటీ ముందుకు పోవటా నికి (లెక్కలేనన్నింటిని చూపించే అదే గుండ్రటి సంజ్ఞ) అదే కచ్చితంగా అవసరమైనది. ప్రకాశవంతంగా కోరుకొన్న లక్ష్యం వైపుగా ముందుకు నడిపించ టానికి. అది పూర్తిగా అద్భుతం. అత్యంత అల్పమైన సూక్ష్మాంశాలుగాను, పరి పూర్ణంగాను, కనిపిస్తుంది. ఈ మహాద్భుతమైన దివ్యచైతన్యం ప్రతి ఒక్కరిని వారు తప్పక ఏమి చేయవలసి ఉందో దానిని చేసేటట్లు చేస్తుంది. ప్రతి ఒక్క విషయాన్ని దాని స్థానంలో ఉంచుతుంది. ప్రతి ఒక్కదానిని దాని రకాన్ని బట్టి వేరు చేస్తుంది. సంపూర్ణంగా అజ్ఞాన పూరిత మైన బుద్ధిహీనమైన దృష్టి మనలను తప్పులు, పొరపాట్లు చేసినట్లు విశ్వసింప జేసుంది. అది మన మూఢత్వం. ....

ప్రతి ఒక్కరు ఒక సమస్యే, పరిష్కరింప బడవలసినదే. ఒక దానిలో ఒకటి చొచ్చుకుపోయిన సమస్యలు మొత్తాన్ని తప్పక కచ్చితంగా ఈ దివ్యసత్యం వైపు నడిపించవలసి ఉంది (అసలైన దానికి), కాని నీకు తెలుసా, నేను మెచ్చుకుంటూ గంటల కొద్దీ గడిపాను — పరమానంద భరితమైన మెచ్చుకోలుతో ఇటువంటి అద్భుత వ్యవస్థ ఎడ, నీ చుట్టూ ఉన్న అల్ప విషయాలతో, నీ చుట్టూ ఉన్న సమస్త అల్ప మానవులతో, సమస్తమైన అల్ప పరిస్థితులతో అది ఎంతో అద్భుతం... అద్భుతం!

దాని తరువాత, ఏమీ అర్థం చేసుకోలేని ఈ గర్విష్టియైన మనస్సు, తనకు గల సర్వ-శక్తివంతమైన జ్ఞానంలో తనకు తాను సమర్థించుకుంటూ, ఓహ్... అదంతా ఎంత హాస్యాస్పదమో!

అది అన్ని సాధ్యాలను, అన్ని అసాధ్యాలను, అన్ని సామర్థ్యాలను, అన్ని అసమర్థతలను గరిష్ఠ ప్రమాణంలో వినియోగించడం; ఒక గరిష్ఠ ప్రమాణంలో ఒక అత్యధిక ఆధిపత్య శక్తి మరియు అత్యధిక దివ్యకారుణ్యం వినియోగం, ఇంకా... ఒక చిరునవ్వు! ఒక చిరునవ్వు, ఒక హాస్యప్రియత్వం, ఓహ్!... ఎటువంటి ఔదార్యపూరిత వ్యంగ్య వక్రోక్తి, ఎంతగానో పూర్తి కారుణ్యం, ఎంతగానో అద్భుతం. ఈ గర్విష్టియైన మనస్సు, నిజంగా ఒక విచిత్రమైన ప్రక్రియ: తనకు తెలియని దానిని న్యాయనిర్ణయం చేయడానికి కాలాన్నంతా గడుపుతూ ఉంటుంది, తాను చూడలేని దానిని నిర్ధారిస్తూ ఉంటుంది!

ఇంకా అక్కడ ఇతరులు దర్శించినదీ ఉంది, ఆ విషయాల కున్నటువంటి గొప్ప ప్రాముఖ్యతగల కాలాన్ని, అది తీవ్రంగా పరిగణించబడిన కాలాన్ని, గుర్తు చేసుకుంటూ, సంస్కారవంతంగా... పూర్తిగా నైతిక సంస్కారం, అది కూడా వినోదం కలిగించేదే.

The Mother: Conversation with a disciple, March 22, 1967

కారుణ్యం — నాశనం

కారుణ్యం అనేది ఒక విధంగా వేరైనది. అది ఎంతో ఊర్ధ్వం నుంచి వస్తుంది. కష్టాలలో ఉన్న మనిషికి, భూమి మీద ఉండే కష్టానికి సానుభూతి కనబరచేది. అక్కడ ఒక భావన ఉంటుంది, దానికి తన చేతనైనంత సహాయం చేయాలని, ఏ

సందర్భంలోనైనా ఒకరు తాను చేయగలిగిన పద్ధతిలో. అది జాలి వంటిది కాదు. అది దేవతల కుండే టటువంటిది, వారు ఊర్ధ్వం నుంచి మానవుల కష్టాలను చలించకుండా చూస్తూ ఉంటారు, అది అటువంటిది. ఆ కారుణ్యం నాశనం చేయగలదు కూడా, అది కారుణ్యంతో నాశనం చేస్తుంది — దయ — దుర్గ శత్రువులైన రాక్షసులను నాశనమొనరించినట్లుగా. అక్కడ జాలి అనేది ఉండదు. ఎన్నో మార్లు రాక్షసుడు వచ్చి ఆధ్యాత్మిక శక్తితో తనను రక్షించమని నిన్ను అడగవచ్చు, పరివర్తన చేయమని కూడా అడగవచ్చు — ఏ విధంగా అయితే కొన్ని అస్తిత్వాలు శ్రీమాతను ఆమె దర్శనంలో అడిగారో — నీవు దానికి ప్రయత్నించితే గనక, నీ ఆధిపత్య శక్తి అంతా రాక్షసులకు పోతుంది, నీవు శక్తిహీనుడవు కావచ్చు. ఎప్పుడైతే ఈ ప్రాణిక అస్తిత్వాలు మనుషులలో అవతరిస్తాయో, అప్పుడు కారుణ్యం నిన్ను వారిని చంపకుండా అడ్డుపెట్టదు.

Evening Talks with Sri Aurobindo by Nirodbaran, p. 63

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సర్వదా దయాళువైన గురువు

నీవు తెలుసుకో వలసిన విషయమంతా ఇదే.

ఎవరు అర్హులు అని చెప్పవలసి వస్తే, నిజానికి అర్హత మరియు అనర్హత అనేవి మాట్లాడుకోవటానికి మాత్రమే; (ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినంత వరకు) మనిషి తన బాహ్య ప్రకృతిలో అనర్హుడు, అనుపయుక్తమైనవాడు, కాని అతని లోలోపల అంతరాత్మ ఆ పైన దైవకృప ఉన్నాయి.

"ఇదంతా నీకు తెలిసిన లేక తెలుసుకోవలసిన విషయం". ఒక వేళ నువ్వు తెలుసుకో లేకపోయినా కూడా తడబడుతూ ఎలాగో ఒక లాగ సరైన మార్గంలోకి వచ్చావు కనుక, నిన్ను జ్ఞానం తెలుసుకోమని మేలుకొలుపుతూ పిలుపు వచ్చే దాకా అక్కడే ఉండు: తథాస్తు.

Correspondence with Nirodbaran, p 461

నా చిన్ని బుర్రకి అర్థం అయింది ఏమిటంటే నువ్వు చాలా అసంభవ పరిస్థితుల

లోను, విపరీత వివరాలతోను పని చేస్తావు. ఈ రెండు వివరణలను సరి చూడండి. "లోలోపల ఆత్మ ఉంది. ఆ పైన దైవకృప ఉంది" మరియు "నువ్వు ఏదైనా జరగాలి అనుకున్నప్పుడు అది అసలు ఎందుకు జరగాలనడానికి కారణం లేదు" అని రెండు వివరణలు పరస్పర విరుద్ధంగా లేవూ?

ఇది ఏ విధంగా ప్రతికూలమైనదో నాకు కనిపించడం లేదు. సహజంగా అంతరాత్మ ఒక చివర, దైవకృప రెండో చివర ఉంటాయి. దాని అర్థం ఆ రెండింటి మధ్యా ఏమి ఉండకూడదని కాదు. నువ్వు ఈ వాక్యాన్ని ఈ విధంగా అర్థం చేసుకున్నట్లుగా ఉంది, "లోపల కాలాన్ని వృథా చేసే అంతరాత్మ ఉంటే ఆ పైన నిద్రావస్థలో నున్న దైవకృప వున్నది. ఎప్పుడైతే దైవకృప మేల్కొంటుందో అప్పుడు అంతరాత్మ ఎంత మాత్రం కాలాన్ని వృధా చేయదు. ఎందుకంటే అది దాని ఉనికి కోల్పోతుంది." ఇలా తప్పక జరిగే అవకాశం ఉంది. కానీ నేను చెప్పినట్లుగా అలా ఎందుకు జరగాలి అన్న దానికి కారణం లేదు. మామూలుగా ఆత్మ మేలుకొని కళ్ళు నులుముకొని అడుగుతుంది. "ఆ దైవకృప ఎక్కడుంది" అని దైవకృప చివర ఉంది అన్న ఆశతో ఆ చుట్టుపక్కల అంతా తడిమి చూస్తూ, లాగుతూ చిట్టచివరకు అనుకోకుండా ఏదో ఒకటి లాగినప్పుడు దైవకృప ఎక్కడ నుంచో దొర్లుతూ వచ్చి దఢాలున మీద పడుతుంది. అది ఎక్కడ నుంచి వచ్చిందో ఆ భగవంతుడికే తెలియాలి. అది సాధారణంగా జరిగే విధానం. ఇతరమైనవి కూడా వున్నాయి.

Correspondence with Nirodhbaran p. 579

అత్యంత ఉత్తేజకరమైన సూత్రము

నీ లేఖలో ఒక ఉత్తేజకరమైన సూత్రం చూసాను." లోలోపల ఆత్మ ఉంది. ఆ పైన దైవకృప ఉంది." దాని గురించి చెప్తూ నువ్వు నీకు తెలిసింది లేదా నువ్వు తెలుసుకో వలసింది ఇంతే", అని అన్నావు. నిజంగా అంతేనా?

అవును ఆధ్యాత్మిక జీవనం గడపాలనుకునే ఎవరికైనా ఇదిచాలు.

"దైవకృప ఉన్నస్థితి" కి లోలోపల అంతరాత్మ ఉన్న కారణంగానో లేదా దానికి అంటిపెట్టుకున్న కారణంగానో చేరుకోగలరా?

అవును. ఎవరైనా చేరుకోగలరు. చాలామంది చేసి చూపించారు కూడా.

కాని ప్రతి వారిలోనూ అంతరాత్మ ఉంది. అందరిపైన దైవకృప ఉంది. మనుషులు దైవత్వంవైపు ఎందుకు వెన్ను చూపారు?

రాజసిక అహం, తీవ్రవాంఛ, ఆడంబరం కారణంగా — ఎందుకంటే అటువంటి వాళ్ళు తమ స్వశక్తిని నమ్ముకున్నారు తప్ప దైవకృపను కాదు.

దైవకృప అంతా చేస్తుంది అని నేను ఎప్పుడూ వినలేదు. ఎక్కడైనా అలా జరిగిందని అనిపిస్తే దాని వెనుక వాళ్ళ పూర్వజన్మలో సాధన చేయలేదని ఎలా తెలుస్తుంది? దాన్ని నువ్వు ఖండించ లేవు కదా?

ఆధ్యాత్మిక చారిత్రక సంఘటనలను ఎన్నో నీకు ఎత్తి చూపించ గలను. జగాలు మధాయి సంఘటన మొదలుకొని, ఎందుకంటే 2+2=4 అంటే ఒప్పుకోనని బుద్ధి ముందర అది నిష్ప్రయోజనం. దానిని నీవు రూఢి పరచలేవు. అవునా?

సామాన్యమైన అంటిపెట్టుకోవటం సరిపోదు. అలా అయితే మన ఆశ్రమం పిల్లి “ఋషీ” కి కూడా అవకాశం ఉండేది.

తప్పక వుంది. వచ్చే జన్మలో ఒక నూత్న ఉన్నత స్థాయికి, సర్వం సానుకూలంగా ఉండే స్థితికి ఎదగడానికి.

సాధనలో బ్రహ్మాండమైన ప్రయాస పడవలసి వుంటుంది, గనుక నాకు దైవకృపపై అంతగా నమ్మకం లేదు. దైవకృప అనేది బేషరతుగా అందాలి గదా?

అది షరతులపై ఆధారపడదు. అది ముఖ్యంగా ప్రతి ఒక్క సాధకుడు, ఎవరైనా సరే, షరతులు లేకుండా సమర్పణ చేసుకోడానికి భిన్నమైనది.

శ్రీరామకృష్ణుల మార్జాల న్యాయంలోని పిల్లి పిల్ల మాదిరి సాధకుడుకూడా సమర్పణ వైపు నిర్ణయాత్మకంగా సాగుతూ, మిగతా అస్తిత్వాన్ని విధేయతగా నుండటానికి నిర్బంధిస్తుంది. ఈ ప్రపంచంలో అది అత్యంత కష్టతరమైన పని అని మీకు చెప్పాలి.

పిల్లి పిల్ల అలా ఉండిందని నేను వినలేదు. అదే కనక అలా ఉండి వుంటే పిల్లి పిల్ల అవదు కదా (అలా చేసేది పిల్లి పిల్లగా మారాలని ప్రయత్నించే పిల్లకోతి) కానీ, ఇది తేట తెల్లంగా తెలుస్తోంది. నీకుఎంతో ఉన్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానం ఉంది అనేది స్పష్టం. (నన్ను, రామకృష్ణులను మించి) దానికి వినమ్రతతో తలవంచి జ్ఞానం తక్కువగా ఉన్న వారికి పంచుతాను.

నిజంగా నువ్వు చేసే యోగం ఒక అర్థంకాని చిక్కుముడి, దాని తల తోక కూడా ఎప్పటికీ పట్టుకోలేను.

నువ్వు దాని తల తోక పట్టుకో నక్కరలేదు. కానీ అది నీ తలని కానీ, తోకని కానీ లేదా రెంటినీ పట్టుకోడానికి అనుమతిస్తే చాలు! సంతోషం, తోకను ముందు!

Correspondence with Nirodhbaran 463-466

దివ్యమాత కృప — అత్యుత్తమ వైఖరి

ఇదంతా (ఈ ప్రపంచం, ఈ ఆశ్రమం) అంతా నా చైతన్యంలో ఒక విధమైన ఆవశ్యకమైన దయతో పట్టి ఉంచాను. అది అన్నిటికీ, అందరికీ, అన్ని కష్టాలకీ, అడ్డంకులకీ ఉపయోగ పడేటటు వంటిది. మీకు తెలుసు నాకు డజన్ల కొద్దీ లేఖలు వస్తూంటాయని. ఒక్కొక్కరు తమ చిన్నపాటి ఆంతరిక లేదా బాహ్య దుఃఖంతో లేక సమస్యతో నా వద్దకు వస్తారు. (అంటే ఒక చిన్న మొటిమ పెద్ద పర్వత మంత అవచ్చు) మనుషులు నా దగ్గరకు వచ్చినప్పుడు నా అంతఃచేతన ఎప్పుడూ అందుకు దీటుగా స్పందిస్తుంది. అందరిపట్లా ఒకే సమానత్వం, కారుణ్యంతో. కానీ మనుష్యులు వాళ్ళ దుఃఖాన్ని గురించి నాతో మాట్లాడుతున్నప్పుడు లేదా ఒక లేఖ చదువుతున్నప్పుడు అది "ఏమి చెయ్యాలో" దానికి సరిపడే విధంగా నా శరీరంలోని చేతన పెరుగుతుంది. వాళ్ళ భారాన్ని నా మీద వేసేస్తారు. అదొక విధమైన భావనను రేకెత్తిస్తుంది. వాళ్ళా విషయం ఆ విధంగా ఎందుకు తీసుకుంటారు అని? అలా వాళ్ళు విషయాలను మరింత క్లిష్టతరం చేసుకుంటారు. శరీరానికి అర్థమవుతుంది, వాళ్ల ఆలోచనావిధానం, అతి చిన్న సమస్యను కూడా వాళ్ళ అంధత్వంతో, అహంకారంతో, అంతా తమదేనన్న ఆలోచనా విధానంతో భయం కరంగా పెద్దది చేస్తుంది.

అది ఒక నవ్వు పుట్టించే అనుభూతి, భావన మరియు అనుభూతుల కలయిక, విషయాల పట్ల మనుషుల సాధారణ వైఖరి వారి సమస్యలను రెట్టింపు చేసి అతి పెద్దవిగా చేస్తుంది. అదే కనక వారికి సరళమైన, సత్యమైన, సాధారణమైన అతి సామాన్యమైన సంక్లిష్టత లేని వైఖరి అయితే.... ఆహా జీవిత మంతా ఎంతో సుగమంగా ఉంటుంది. ఎందుకంటే శరీరానికి స్పందనలు తెలుస్తాయి. (శరీరాన్ని కూర్చడానికి తోడ్పడే స్పందనలు) శరీరం వాటి స్వభావాన్ని తెలుసుకొని, దాని సహజమైన


ప్రతిచర్య, శాంతి యుతమైనది మరియు విశ్వాసంతో కూడుకున్నది అని గ్రహించి, విషయాలను ఎంతో తేలిక పరుస్తుంది. కానీ చింతతో కూడిన కలవరం,భయం, అసంతుష్టి సంభవిస్తే, "దానిని ఏ మాత్రం సహించని" ప్రతి స్పందన కలుగుతుంది. ఓహ్, వెంటనే అది నీరు మరుగుతున్నట్లు యంత్రం లాగ బుడగలతో కూడిన శబ్దాలు చేస్తుంది. అప్పుడు ఆ కష్టాన్ని విశ్వాసంతో మామూలుగా స్వీకరిస్తే, అది కనిష్ట స్థాయికి తగ్గింప బడుతుంది. నా ఉద్దేశం పూర్తిగా భౌతికంగా అని, భౌతికమైన ప్రతిస్పందనలో అని.

The Mother, Conversations with a disciple, Febravary 25, 1961.

దివ్యమైన కరుణ — న్యాయస్థానము

ఈ ప్రశ్న తప్పు గురించి లేక శిక్ష గురించి కాదు. అసలు సాధకులు చేసే తప్పులను న్యాయస్థానంలో లాగా ఖండించడం, శిక్షించడం వంటివి చేస్తే, ఎటువంటి సాధన సాధ్యంకాదు. నువ్వు మా మీద వేసే నింద ఏ విధంగా సమర్థనీయం అన్నది నాకు తెలియటంలేదు. మాకు సాధకులపట్ల ఉన్న ఒకే ఒక్క బాధ్యత వాళ్లకు ఆధ్యాత్మికత సిద్ధించే దిశలో వాళ్ళని తీసుకు వెళ్ళడం — మేము ఒక కుటుంబ పెద్ద ఎలా ప్రవర్తిస్తాడో,అలాగ ప్రవర్తించి, వాళ్ళ దైనందిన కలహాలలో కల్పించుకోవడం, ఒకళ్ళని బలపరుస్తూ రెండో వాళ్ళమీద భారమంతా వెయ్యడం చెయ్యలేము! ఏమయినప్పటికీ తరచుగా ఎక్స్ తడబడుతూ ఉండొచ్చు. మనము చెయ్యి అందించి లేవ దీయాలి, తిరిగి దైవత్వం వైపు వెళ్ళడానికి తోడ్పడాలి. మేము నీ పట్ల ఎప్పుడూ ఆ విధంగానే చేసాము. కానీ నీవు అత నడిగే ఏ అభ్యర్థనను సమ ర్థించ లేక పోయావు. మేము ఎప్పుడూ దానిని దేవునికి అతనికి మధ్యగల విషయంగా భావించాము. నీ విషయంలో మేము ఒక నిర్భంధం పెట్టాం, నీ పూర్తి సమ్మతితో, మా సహకారం కోరి నువ్వు చేసే ప్రార్థనతో నువ్వు అతనితో ఉన్న ముఖ్యమైన సంబంధాన్ని పూర్తిగా తెంచుకుని ఇంక ఆధారపడకుండా చెయ్యడం. అయినప్పటికీ నువ్వు 'వై' పట్ల చేస్తున్న చర్యలను అవి ఎటువంటి వయినా మేము ఆమోదించ లేదని రాస్తూ — అది ఏమైనా కానీ — నువ్వు మమ్మల్ని శాశ్వతంగా విడిచిపెట్టావు.

నిన్ను నువ్వు స్వచ్ఛమైన,నిజమైన, వివేచనగల నీ అంతరాత్మ వైపుకి నీ చేతన వైపుకి తిప్పుకొని, నీ అంతరాత్మకు సరిపడని మోహంతో కూడిన భావాలను



నేను ఎప్పుడూ పైకి చూస్తాను, అక్కడ దివ్య సౌందర్యం, దివ్య శాంతి, దివ్య వెలుగు ఉన్నాయి. అవి క్రిందికి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. అందువల్ల ఎప్పుడు ఆకాంక్షతో పైకి చూడు, వాటిని భూమిమీద ఆవిష్కరించడానికి.

ఈ ప్రపంచంలో కిందవున్న హేయమైన విషయాలను చూడకు. నీకు ఎప్పుడు దుఃఖం కల్గినా ఎల్లప్పుడూ నాతో పాటు పైకి చూడు.

CWM 13: 69

శ్రీమాత

అనువాదం: డా. టి.యస్. రాజకుమారి

విసిరి వేయమని, నువ్వు పదే పదే శ్రీమాతపట్ల నీకు గల ప్రేమను గురించి, ఆమె నుంచి పొందిన ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతులను, ఆనందాలను వ్యక్తపరుస్తూ రాశావు. అది గుర్తు పెట్టుకో. అదే నీ నిజమైన మార్గం, నీ అసలైన అస్తిత్వం. అది గుర్తుపెట్టుకో. అది తప్ప ఇంక ఏవీ నీకు ముఖ్యం కాదు. నువ్వు నీ పూర్వపు సమత్వము తెచ్చుకో, నీ నిమ్న స్వభావాన్ని, దానిలోని అంధకారాన్ని, అవివేకాన్ని తీసివేయి.

CWSA 28: 864-65

శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి.యస్. రాజకుమారి

దైవానుగ్రహ ప్రదానాలు

శ్రీఅరవిందుల రచనలు

శ్రీఅరవిందులు తమ జ్ఞానసంపద యొక్క అవశేషాన్ని మాత్రమే మన కందించారు. ఆ మాత్రం కూడా ఏ ఒక్కరూ అర్థం చేసుకోలేరు. ఇక్కడ ఉండటంలో ఉన్న వ్యత్యాస మేమిటంటే గుప్తమై వున్న ఇహలోక జీవన ఆనందోత్సాహాలకు దారి తీసే ద్వారాలను వారు తెరచి పరమసత్య పవిత్రతను మనకు పరిపూర్ణంగా వెల్లడి గావించారు. వాతావరణ మంతటా నిండి వున్న దివ్య వైభవోపేత ఆనందాలను పవిత్రీకరించే దివ్యకాంతులను మనకోసం పోగుచేసి వుంచారు. అదే నీవు పీలుస్తున్నది, అదే నీవు ఆస్వాదిస్తున్నది, అదే నీవు ఇముడ్చుకుంటున్నది. ఎక్కడా లభ్యంకాని ప్రత్యేక సౌలభ్యం అదేనని తెలుసుకోకుండానే దానిని నీవు గ్రహిస్తున్నావు. అది నీ జీవితంలో అంతర్భాగం కూడా అయింది....

ఈ లక్షణాలన్నింటికీ సమిష్టిగా ఒక సూక్ష్మ కౌశల్యం వుంది. దాని వైశిష్ట్యత వర్ణించడానికి మాటలు చాలవు. అత్యద్భుతంగా చెక్కబడిన కళాఖండానికి ఉండవలసిన అంతః సౌందర్యం, సమృద్ధత సంపూర్ణంగా దాని కున్నాయి. దాని ఆకారం సంక్షిప్తం, సాధారణం, ఒక పరిపూర్ణ పవిత్రతతో కూడి వున్నది. దాని విగ్రహం సుందరమైనది, రమ్యమైనది, రాచఠీవిగలది. దాని నాదం శ్రావ్యమైన సంగీతాన్ని తలపిస్తుంది, లయబద్ధమైనది, గొప్ప భావాలను స్వచ్ఛమైన పదజాలంలో గంభీరంగా వినిపిస్తుంది.

దాని దృష్టి పరమ సత్య వీక్షణానికై ద్వారాలను తెరుస్తుంది. భావ వ్యక్తీకరణకు అది ఒక పరిపూర్ణతను ఆపాదిస్తుంది. ఈ గుణగణాలనే వారి రచనలన్నీ కలిగి వున్నాయి. ఇవి మాత్రమే కాదు, ఇంకా ఎన్నో రహస్యాలు, అంతర్ దృష్టి గలవారు మాత్రమే దర్శించగలిగే అజ్ఞాత విషయాలున్నాయి. వీటన్నింటి కూటమియే మహా మంత్రంగా రూపొందుతుంది. అదే శక్తి కారకం, బలవర్ధకం, అది సృష్టించగలదు. ఉచ్ఛారణమాత్రం అది ఒక ప్రకంపనను సృష్టిస్తుంది. ఆ ప్రకంపన ఒక రూపం ధరిస్తుంది. ఎవరైతే ఒక క్రమశిక్షణతో, అతిమానస జీవితానికి మారాలనే తపనతో, శ్రీఅరవిందుల విద్యావ్యాసంగం లోని ఆచరణాత్మక అర్థాన్ని తమ జీవితాలలో ఇముడ్చుకొనుటకు పూనుకున్నారో, వారికి మాత్రమే అందుబాటులో నుండటానికి నిలిచివుంటుంది.

Blessings of the Grace pp. 115-16

సావిత్రి

సత్యాన్ని తెలుసుకొనడానికి, చైతన్యాన్ని గుర్తించడానికి, దానిని పరివర్తన చెందించడం కోసం కాంతిని దానిలోకి చొప్పించుటలోని సందిగ్ధతను సరిదిద్దటానికి ఈ కావ్యంలో శ్రీఅరవిందులు పరిష్కారం చూపిస్తారు. అజ్ఞానాంధకారం నుండి తనను తాను ముక్తం గావించుకొని అతి మానస స్థాయికి అధిరోహించే మార్గం చూపించారు. ఆ మార్గం లోని ఒక్కొక్క దశకు ఒక్కొక్క చేతనా అంతస్తుకు ఏ విధంగా ఎదగవచ్చో, మృత్యువు అనే అడ్డంకిని సైతం అధిగమించి అమరత్వానికి ఎలా చేరవచ్చో, ఆ మార్గాన్ని సూచించారు. ఈ పయనం యొక్క పూర్తి వివరాలనే గాక మరెన్నో విషయాలను అందులో తెలుసుకోవచ్చు. సావిత్రి అధ్యయనం ఒక నిజమైన అనుభవం. మనిషిలోని రహస్యాలన్నింటినీ వారు వెల్లడించారు, భవిష్యత్తులో అతనికి తారసపడే వాటితో సహా. ఈ విధంగా సావిత్రి లోతైన అధ్యయనంలో ఎన్నో గ్రహించవచ్చు. అయితే వ్యక్తికి మృత్యువును జయించగల అనుభవంతో పాటు దాన్నంతటినీ గ్రహించగల జ్ఞానం తప్పక వుండాలి. ఈ దశల నన్నింటినీ వారు సూచించారు. పూర్ణయోగంలో పురోగతి సాధించటానికి ఎక్కవలసిన ప్రతి మెట్టును వారు చూపించారు.

ఇవి వారు జీవించిన అనుభవాలు, వాస్తవాలు, లోకాతీతమైన విశ్వగత సత్యాలు.



దైవికమగు విధిని మోకరిల్లి లాలించే పరమ ప్రశాంతత:
బాధను శమింప జేయ భూమిని అక్కున జేర్చే దివ్య కారుణ్యం;
మన అంతరంగ రహస్యాల మాటున వాసమున్న దివ్యసాక్షి,
మానవ దేహంలో అవతరించిన పరదైవతం

CWSA 2: 607

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఒక వ్యక్తి ఆనందాన్ని గాని విషాదాన్ని గానీ, ఏ విధంగా అనుభవిస్తాడో వాటిని వారు శారీరకంగా అనుభవించారు. అచేతన అంధకారంలో నడిచారు. మృత్యువు దరిదాపుల్లో కూడా, దురదృష్టవశాత్తు సంప్రాప్తించిన బాధలను భరించారు. బురద కూపం నుండి కడిగిన ముత్యంలా బయల్పడి ప్రస్తుత ప్రపంచ దయనీయ జీవన స్థితిని సర్వోత్కృష్టమైన సమగ్ర, సమృద్ధి స్థాయికి చేర్చి ఆ పైన అది మహోత్తమమైన పరమానంద భరిత సీమలలోకి ప్రవేశించుటకు తోడ్పడ్డారు. వారు ఈ పరిధులన్నింటినీ దాటారు. పర్యవసానాలను అనుభవించారు. ఊహించ లేనటువంటి బాధను భౌతికంగా భరించారు, సహించారు. ఈనాటి వరకు ఆయనలా ఎవ్వరూ కష్టపడలేదు. వారు బాధను భరించటానికి సమ్మతించినది ఎందుకనగా, ఆ బాధను భగవంతునితో ఐక్యమొందుటలో గల ఆనందంగా మార్చటానికి. ఈ చర్య ప్రపంచ చరిత్రలోనే సాటిలేని నిరుపమాన విశేషము. ఇది ఇంతవరకు ఎప్పుడూ చోటు చేసుకోనటువంటిది. మనము అతిమానస దిశగా దృఢ విశ్వాసంతో ఆ ఎరుకలేని దివ్య క్షేత్రంలో పయనించ టానికి వీలుగా బాట నేర్పరిచిన ప్రథమ మనీషి. మా కార్యాచరణను సులభతరం గావించారు. సావిత్రి వారి పరిపూర్ణ దివ్యరూపాంతరీకరణ యోగం. ప్రస్తుతం భూచైతన్యంలో ఈ యోగం ప్రప్రథమంగా ప్రకటితమౌతున్నది.

Luminous Notes: Mona Sarkar

ఆశ్రమం

విను, నేను జపాను నుండి వచ్చేటప్పుడు నాకు కలిగిన అనుభవం. నేను సముద్రంలో ఓడపై నున్నాను. దేనిని గురించి ఎదురు చూడడం లేదు. (అయితే నా అంతరంగ జీవితం గురించి మనస్సునందు నిమగ్న మై వున్నాను. కానీ శారీ రకంగా ఓడపై నున్నాను) పాండిచ్చేరి నుండి సుమారు రెండొందల సముద్రపు మైళ్ళ దూరంలో, ఉన్నట్టుండి హఠాత్తుగా వాతావరణం యొక్క భౌతిక లక్షణం మారింది. ఎంతగానంటే, నేను శ్రీఅరవిందుల తేజోవలయంలోకి ప్రవేశిస్తున్నట్లుగా తెలిసింది. అది ఒక భౌతికమైన అనుభవం. జాగృతమైన చేతన గలవారెవరైనా అలాంటి అనుభూతినే పొందగలరని నేను హామీ ఈయగలను.

అందుకు విరుద్ధమైన అనుభవం కూడా నాకు కలిగింది — ఇక్కడకు వచ్చిన అనేక సంవత్సరాల తరువాత మొట్టమొదటిసారి కారులో బయలుదేరినప్పుడు

చెరువును దాటి కొంత దూరం వచ్చిన తరువాత, అకస్మాత్తుగా వాతావరణం మారుతున్నట్లనిపించింది. సంపూర్ణత, శక్తి, తేజస్సు, బలం నిండి వున్నచోట అవన్నీ తగ్గిపోయాయి.... తగ్గిపోయాయి. ఆ తరువాత ఏదీ లేదు. అంతా శూన్యం. నేను మానసిక లేక ప్రాణిక చేతనలో లేను. నేను పూర్తిగా భౌతిక చేతన లోనున్నాను. మంచిది. ఎవరైతే సున్నితమైన భౌతిక చేతన కలిగి వుంటారో వారు అట్టి అనుభూతిని యదార్థంగా పొంద గలరు, నేను గట్టిగా చెప్పగలను. ఆశ్రమం అని మనం పిలిచే ఈ స్థలానికి ఒక ఘనీభవించిన శక్తి వుంది. అది ఒక పట్టణానికి ఉన్నటువంటి శక్తి లాంటిది కాదు. గ్రామీణప్రాంతానికి ఉన్నవంటిదికూడా కాదు....

CWSA 4: 224

దివ్య సత్యలోకం సంసిద్ధపడి వుంది: మనిషి సిద్ధపడలేదు

నన్ను నేను మరో ప్రపంచంలో నున్నట్లుగా గమనించాను, కానీ దూరంగా కాదు, (నేను సంపూర్ణ పారవశ్య స్థితిలో లేను). ఈ ప్రపంచం దాదాపు భౌతిక ప్రపంచ మంత స్థూలంగా నుండింది. అక్కడ గదులున్నాయి — శ్రీఅరవిందుల గది, వారు విశ్రాంతి తీసుకునే మంచంతో సహా — వారు అక్కడ నివాస ముంటు న్నారు, ఎప్పుడూ అక్కడే వుంటారు, అది వారి ఇల్లు. నా గది కూడా అక్కడే వుంది, ఇక్కడున్నట్టి పెద్ద అద్దం, దువ్వెన మొదలగు సరంజామా అంతా వుంది. వీటి వస్తు గుణాలుం దాదాపు భౌతిక ప్రపంచంలో నున్నంత సాంద్రత గలిగినవి కావు గానీ స్వయం ప్రకాశితమైనవి. అక్కడ పారదర్శకంగా లేదు, స్పష్టంగా లేదు, కాంతిమంతంగానూ లేదు. కాని స్వయం ప్రకాశితంగా నుండింది. అక్కడి గదులలోని వివిధ వస్తువులకు, ఇతర సామగ్రికి ఇక్కడి భౌతిక వస్తువుల కున్నంతటి సత్తా లేదు, భౌతిక ప్రపంచ మందున్నంత పొడిగా, గట్టిగా లేవు.

ఇక శ్రీఅరవిందులు అక్కడ వున్నారు, ఒక రాచఠీవితో, అత్యద్భుత చక్కదనం తో. ఇదివరలో లాగానే అందమైన జుత్తుతో నున్నారు, అదంతా ఎంత మూర్తిమంతం, ఎంత వాస్తవికత....

చూసావూ, పరమ సత్యమైన ఈ ప్రపంచం శూన్యం నుండి సృష్టించ బడవలసి వచ్చినట్లుగా భావించ రాదు. అది పూర్తిగా సంసిద్ధమై వుండింది, అది అక్కడ వుండింది, మన ప్రస్తుత ప్రపంచాన్ని వస్త్రానికి వెనుక ఆధరువుగా కుట్టే అస్తరు

గుడ్డలాగా, పొంకంగా నిలిపింది. అన్నీ అక్కడ వున్నాయి. అన్నీ వున్నాయి.

నేనా స్థితిలో పూర్తిగా రెండు రోజులు వున్నాను, రెండు రోజుల స్వచ్ఛమైన దివ్యానందం అనుభవించాను. నాతో శ్రీఅరవిందులు కూడా వున్నారు. నేను నడిచి నప్పుడు నాతో నడిచారు, నేను కూర్చున్నప్పుడు నా ప్రక్కనే కూర్చున్నారు. ఆగష్టు 15 వ రోజున కూడా దర్శన సమయ మంతా అక్కడే వున్నారు. కాని అది తెలుసుకున్న వారెవరు? కొద్దిమంది — ఒకరో ఇద్దరో — ఏదో అనుభూతికి లోన య్యారు. కానీ చూసిందెవరు? ఒక్కరూ లేరు.

నేను ఈ మనుషు లందరినీ శ్రీఅరవిందులకు చూపించాను. ఈ కార్య రంగా న్నంతా చూపించాను. వారి నడిగాను, ఈ మరో ప్రపంచం, వాస్తవంగా నున్న మరో ప్రపంచం, ఎంతో చేరువగా నున్న మరో ప్రపంచం, అనృతమైన మన ప్రస్తుత ప్రపంచం స్థానే ఎప్పుడు వస్తుందని. 'సిద్ధంగా లేదు'. అది మాత్రమే వారి సమాధానం, సిద్ధంగా లేదు.

అయినప్పటికీ, ఈ ప్రపంచం నుండి మరో ప్రపంచానికి సాగి పోవటానికి లేక ఆ మరో ప్రపంచం మన యథార్థ ప్రపంచం అవడానికి కొద్ది పాటి ప్రయాస పడవలసి వస్తుంది. ఒక చిన్న మీట నొక్కితే చాలు, లేదా అంతరంగ వైఖరిలో ఒక చిన్న వెన కడుగు వేస్తే చాలు. ఇది ఏ విధంగా చెప్పాలి?... ఇది సాధారణ చేతన తెలుసుకో లేదు. అంతరంగంలో స్వల్ప మార్పు చాలు — లక్షణంలో మార్పు.

The Mother, Conversations with a disciple: Oct 6, 1959

సమాధి

ఏదో ఒకటి సక్రమంగా లేనప్పుడు, కారణం తెలుసుకోవాలన్నా లేక ఒక బల హీనతను తొలగించుకోవలన్నా, లేక స్వస్థత చేకూర్చుకోవాలన్నా లేక పరిశుద్ధత పొందడానికి ఒక అడ్డంకిని తొలగించుకోవాలన్నా ఏ సమాధానానికైనా వచ్చి సమాధి వద్ద శ్రీఅరవిందులను అడగాలి, నీకు సమాధానం లభిస్తుంది. కేవలం వారి సమాధానమే కాదు, వారి ఆశీస్సులు, వారి సానుభూతి, వారి ప్రశాంతత, వారి వెలుగు కూడా లభిస్తాయి. సర్వ శక్తివంతమైన వారి ప్రేమ నిన్ను వశపరచుకొంటుంది, నిన్ను ముంచెత్తుతుంది. ఒక్కసారి గనక నిన్ను నీవు వారికి వశపరచుకుంటే అన్ని ఆపదల నుండి కాపాడబడతావు. అది వారి ప్రభావము. ఎవరు సామాన్యులో, చిత్తశుద్ధి గల

వారో, వినయ విధేయతలు గలవారో అట్టి వారందరికి వారు తమను తాము వెల్లడి చేసుకుంటారు. వారు అక్కడ పరిపూర్ణ చేతనతో నున్నారు, ప్రపంచ కార్యక్రమా లన్నింటినీ నడిపిస్తున్నారు. ఎప్పుడైనా, నేనేదైనా తెలుసుకోవాలంటే, నేను వారిని అర్థిస్తాను, తక్షణం వారు నాకు సమాధాన మిస్తారు.

Blessings of the Grace, pp. 120-21

వారు తమను తాము విశ్వవ్యాప్తి చేసుకున్నారు

నీకు తెలుసా, ఇంతకు పూర్వం శ్రీఅరవిందులు దేహధారులై వున్నప్పుడు జనులనేవారు, ఆయన చాలా దూరంగా వున్నారని, మనుషులకు అందుబాటులో లేనంత దూరంగా నున్నారని, ఇక్కడి సాధకుల విషయాలను పట్టించుకోరని. అది వాస్తవం కాదు, ఎందుకనగా నిజానికి వారు రాత్రుళ్ళంతా సమయాన్ని తమ నిర్దిష్ట కార్యక్రమమైన లోకోద్ధరణ మరియు తద్వారా అతిమానస ప్రపంచ ఆగమనానికై లోకాన్ని సమాయత్త పరచుటకు బదులు, కుప్పలు కుప్పలుగా వచ్చిన ఉత్తరాలకు సమాధానాలు వ్రాయడానికి వినియోగించేవారు. సాధకుల పురోభివృద్ధిని గమనిస్తూ వారికి సంబంధించిన విషయాల గురించి ప్రయాస పడేవారు. అయినప్పటికీ వారు ఎలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసారంటే, సాధకులు నాతో నేరుగా సంప్రదించి వారి సాధనకు సంబంధించి నా ఆశీస్సులను, నా సహాయాన్ని, భౌతిక స్థాయిలోనే గాక ఆంతరంగిక స్థాయిలో సైతం అందుకో గలిగే విధంగా చేసారు. నా ద్వారా వారు అతిమానస దిశగా చేతనా శిఖరాగ్ర స్థాయిని అందుకో గలరు, ఏ కష్టాన్నైనా అధిగమించ గలరు. ఆ కాలంలో వారు వారి కార్యాచరణకు ప్రతికూలంగా, అడ్డుగా నిలిచిన అసంఖ్యాక చేతనా స్థితులను, వివిధ శక్తులను వశపరచుకొనుటకే గాక వాటిని అనుకూలంగా మార్చి వాటిపై ఆధిపత్యం పొందే కార్యక్రమంలో నిమగ్నమై వున్నారు — అతిమానస అన్వేషణా కార్యక్రమం. లౌకిక విషయాల పరిష్కారంతో పాటు ఆశ్రమ నిర్వహణ, వ్యక్తుల పురోగతి, సమిష్టి యోగసాధన కోసం చేయవలసిన ప్రయత్నం నాకు వదిలేసారు. ఆ కాలంలో వారికి ప్రజలను గురించి ఆలోచించడానికి గాని, వారి పితూరీలను వినడానికి గాని ఏమాత్రం సమయ ముండేది కాదు. కాని ఇప్పుడు వారు తమను తాము సార్వత్రికం గావించుకున్నారు, విస్తృత పరచు కున్నారు, సన్నిహితులను చేసుకున్నారు. సామీప్యత ద్వారా, ప్రత్యక్ష ప్రభావం

ద్వారా ప్రతి ఒక్కరితో ఒక బంధ మేర్పడింది, తద్వారా అందరికీ వారిని కలిసే అవకాశం కలిగింది.

ఇది అసాధారణం. సమాధి చుట్టూ వారి ఉనికి, పులకరింపు కలిగిస్తుంది. దాని వాస్తవికతను అనుభూతి చెందవచ్చు. వారి ప్రభావం జీవి అంతరాల లోనికి చొచ్చు కొనిపోయి, మూల స్థానాన్ని తాకి, చేతనను ఆధ్యాత్మిక జీవనానికై మేల్కొల్పుతుంది. ఇక్కడి వింత ఏమిటో కనుగొనాలనే ఆశతో వచ్చే నాస్తికులు, దైవంపై నమ్మకం లేని వారు, దుస్సంకల్పం గలవారు సైతం ఒక మానవాతీత రసానుభూతికి లోనై, ఆశ్చర్య చకితులై, అంతరంగ ప్రశాంతతను పొంది, మరలిపోతారు. ఎందుకనగా సమాధి చెంత శ్రీఅరవిందులు తమ ప్రశాంతతను, తమ కరుణను, నిరంతరం వర్షిస్తుంటారు. సమాధి ముందు జనులు సాగిపోతున్నప్పుడు ఈ జల్లు వారిని ముంచెత్తుతుంది. ఇది వారి శక్తి యొక్క, వారి ఉనికి యొక్క నమ్మశక్యం కాని అతిశయించిన క్రియాశీలత.

Blessing of Grace, pp. 121-22

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

రక్షిత విశ్రాంతి నిచ్చు దివ్యధామ మందు సేదదీరి
గ్రోల గలరు. జ్యోతిర్మయ ఝరులలో జీవన మధురిమలను
పొందగలరు మరో మారు మరచిన స్వర్గ సుఖాలను.
చెందగలరు సంవేదన ప్రకృతి తేజోమయ వికసనాన్ని,
అనుభవించెద రామె గుండెల వెచ్చదనం, పాలనలో ఆనందం.
అంతులేని దామె కరుణ, ప్రశాంత మామె దివ్యధామం.
ఆమె అంతరంగ సాయం తెరుచును స్వర్గ ద్వారాలను,
పొందగలరు ఆశ్రయ మామె హృదయ మందు విశ్వమంతా.

సావిత్రి, పుట 15 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

స్మృతులు, ఆలోచనలు

ఉన్నత స్థాయిలు అంత సానుకూలం కావు

ఉన్నత స్థాయిలలో అవకాశం తక్కువ. అవకాశాలు బాగా వుంటే పైనున్న అతిమానసాన్ని భూ వాతావరణం లోనికి తీసుకొని రావటానికి మనం ఇంత ఇబ్బంది పడవలసి ఎందుకు వస్తుంది?

మీరంతా కులాసాగా కాలక్షేపం చేస్తూ, తమాషాగా కట్టు కథలు అల్లుకుంటూ, మూర్ఖత్వంలో మునిగి తేలు తున్నారు. మధ్య మధ్య 'మౌనం' గురించి, 'చైతన్యం' గురించి, 'అధిమానసం' గురించి, అతిమానస సిద్ధులను గురించి ఎంతో తెలిసిన వాళ్ళలా మాట్లాడు తుంటారు. ఇవి మనం మీట నొక్కితే వెలిగే విద్యుద్దీపా లనుకుంటున్నారు. ఒక నాటికి అట్లా సుసాధ్యం అవుతుందేమో! ప్రస్తుతానికి అది అలా లేదు.

ఇక పోతే నేను అన్వేషించి కనుక్కోవలసింది ఎంతో ఉంది. అది ఎలా వుంటుందో, దాని నియమాలు, కష్ట నష్టాలు ఏమిటో తెలుసుకోవాలి. నా మార్గాన్ని సుగమం చేసుకోవాలి. భావ వ్యక్తీకరణకు మాధ్యమాన్ని అన్వేషించాలి. దీనిని లొసుగులు లేని వ్యవస్థగా తీర్చి దిద్దాలి. ఇదంతా ఒకే ఒక జీవిత కాలంలోనే జరగాలి కదా! ఈ పని కేవలం నా ఒక్కడిదే అన్నట్లు నా అనుయాయులంతా భావిస్తున్నారు. వారు మాత్రం అసంబద్ధమైన హేతువాదాలతో కాలం గడుపుతూ వున్నారు. అంటే, అంతా నా ద్వారానే జరిగి, నా ద్వారా 'అతిమానస సిద్ధి' వాళ్ళకు అప్రయత్నంగా లభించాలి! ఇదీ వారి కోరిక. ఇక భగవంతుడే నాకు బలం చేకూర్చాలి!

సంఘంలో ఏకత్వ భావన

నేను అదే పనిగా ఇవ్వాళ కూడా వ్రాస్తున్నందుకు ఏమీ అనుకోవద్దు. క్షమించండి.

మిగతా వారికి అన్నీ 'ఆదివారాలే'!

ఆశ్రమంలోని వారంతా ఇట్లాగే అనుకుంటున్నారు. వారికి నిరంతరము 'ఆదివారమే'! వాళ్ళ సమస్యలను గురించి నాకు వ్రాయటానికి ఏ రోజైనా ఒకటే. సాంఘిక జీవనం లోని ఏకత్వం ఇదేనేమో! బహు దొడ్డ ఏకత్వం!

Correspondence with Nirodbaran, p.. 138

మీరు చెప్పే నిజం ఒకటే 'ప్రేమ' స్వలాభం కోరదనీ, అది దేన్నీ ఆశించదనీ. మీ పైన నాకూ, శ్రీమాతకూ ఉన్న ప్రేమ కూడా అటువంటిదే.

CWM 13:69

"అతిమానస సాధన పేరుతో శ్రీఅరవిందులు కృషి చేస్తున్నది ఒక నూతన మత స్థాపనకే అని అసుర శక్తులు భావిస్తున్నాయి. అతిమానస సిద్ధి ఒక క్రూరమైన, నిర్దాక్షిణ్యమైన భావన అని అసుర శక్తులు అనుకుంటున్నాయి. వీరంతా గ్రహించాల్సింది ఏమంటే ఇది నిజం కానే కాదు. ఆయన చెప్పేది అది కానే కాదు. శ్రీఅరవిందుల 'సత్యం' ప్రేమ మయమైనది, విజ్ఞానంతో కూడి యున్నది. అది కరుణా మయము. వారు సహృదయులు, దయామయులు, దైవాంశ సంభూతులు. అంతిమ విజయం వారిదే అనటంలో సందేహం ఏమీ లేదు."

CWM 15:389 శ్రీమాత

"దైవం ప్రత్యక్షం కాని చోటు అంటూ వుంటుందా? దైవం అన్ని చోట్లా ఉన్నాడు: చెరసాలలో, కుటీరాలలో, ఆశ్రమాల్లో, పేదల గుండెల్లో, అంతటా నిండి వున్నాడు. సంపన్నుల పూజా మందిరాల్లోనూ, విలాసవంతుల పట్టు పాన్పుల మీదనూ మాత్రమే ఉన్నాడను కున్నారా? మనకు లాగానే దేవునకు కూడా విజ్ఞానమూ, గౌరవము, నాయకత్వంపై కాంక్ష, ప్రజాభిమానము, బాహ్య సుఖాలు, అడంబరాలు కావా లనుకుంటున్నారా?

"బీదలకు ఆయన దివ్య కృపామయి అగు శ్రీమాత రూపంలో దర్శనం ఇస్తారు. అందరిలో, అన్ని జాతులలో, దేశాలలో, మాతృభూమిలో, పతితులలో, బీదలలో, ఆపన్నులలో, బాధాసర్ప దష్టులలో భగవంతుని ఎవరు దర్శించగలరో, ఎవరు జీవితాన్ని వారి సేవకు వినియోగించ గలరో వారి హృదయాలలో జీవుడు ఉంటాడు."

శ్రీఅరవిందుల బెంగాలీ రచనలు, పుట. 278

"అతి ప్రశాంత దరహాసం తొణికసలాడే వారి వదనాన్ని నేను ఎల్లవేళలా చూచాను. దయార్ద్రత వారి ముఖంలో కొట్టవచ్చినట్లు ఉండేది. అదే వారి ప్రత్యేకత. కరుణామృతాన్ని ఒలికించే ఆ వైఖరి, ఆ నిశ్చల ప్రశాంతత — అది అత్యద్భుతం!"

The Mother: Conversations with a disciple, Oct 16, 1965

"శ్రీఅరవిందులు సమూల మార్పుకు ప్రతీక. వారి బాహ్య అస్తిత్వంలో, మార్పు కోరే వారు, పురోగమించాలని తపించేవారు, అభివృద్ధి కోరే వారి కోవకు చెందినవారు.

బూజు పట్టిన పాత భావాలను వారు తిరస్కరించే వారు. ఇతరులతోను, ఇతర విషయాల తోను సర్దుకు పోవటానికి గట్టిగా ప్రయత్నించారు. వారి అనురాగ పూరిత హృదయం ఎల్లవారిని యథాతథంగా అంగీకరించింది, లేకుంటే వారు ఎన్నో ఇబ్బందులు పడవలసి వచ్చేది."

The Mother: Conversations with a disciple, Dec 3, 1965

తనకు గాని, కొద్ది మంది ఇతరులకు గాని ఆత్మ విమోచన కలగాలని ప్రయాస పడేవారు కృతకృత్యులైనప్పటికి, వారు పడిన శ్రమ అల్పమైనది.

సమస్త మానవాళి అంతరాత్మలకు ప్రశాంతత, ప్రమోదము, పరిశుద్ధత, పరిపూర్ణత సమకూరాలని ప్రయాస పడేవారు పాక్షికంగానో లేక పరిమిత కాలానికో కృతకృత్యులైనప్పటికీ, వారు పడిన శ్రమ అనంతమైనది, అతి విశిష్టమైనది.

CWSA 13:90-91 శ్రీఅరవిందులు

పరాజితుల ఆశ్రయము

నిజానికి, మనలో చాల మంది సాధారణ జీవులు, వారికి 'యోగం' అంటే ఏమిటో ఏ మాత్రం తెలియదు. అయినా శ్రీమాతారవిందులు మనలను 'యథాతథం' గానే స్వీకరించారు. వారి 'యోగం' ఏమిటో తెలియని మామూలు వ్యక్తులతోనే ప్రారంభించాలని వారి నియమం. అట్లాంటి వాళ్ళను క్రమంగా 'ఆత్మస్వరూపులు' గా మార్చవచ్చు.

నేను ఒకసారి వారిని అడిగాను, "మేము ఒక సద్గురువు వద్ద ఉండవలసిన అర్హతలు గల శిష్యులమేనా? మాకు ఎట్టి అర్హత లేదే! మీరు ఇంతకంటే ఎక్కువ అర్హత ఉన్న వారిని ఎంచుకొని ఉంటే బాగుండేది".

శ్రీఅరవిందులు దీనికి జవాబిస్తూ ఇట్లా అన్నారు: "శిష్యుల విషయంలో నేను దాన్ని అంగీకరిస్తాను. ఇంత కంటె ఎక్కువ అర్హతలు గల వారు ఉన్నారని ఊహించినా, వారు సాధారణ ప్రజలకు ప్రాతినిధ్యం వహించగలరా? కొందరు ప్రత్యేక రకాల వారితో వ్యవహరిస్తే, అది సమస్యకు పరిష్కారం కాదు." కొద్దో గొప్పో సాధన చేసిన వారితో మొదలుపెడితే అది సంపూర్ణ ప్రయత్నం కాజాలదని వారి అభిప్రాయం.

*

శ్రీమాతారవిందులు వారి శిష్యుల సమస్యలను తీర్చటానికి ఎంత శ్రద్ధ తీసుకునే

వారో అనేది ఆశ్చర్యకర విషయం, ప్రశంసనీయం. ఒక సాధకుడు ఆస్పత్రిలో చేరవలసి వచ్చినపుడు అతని వంటి మీద వచ్చిన చిన్న కురుపు విషయమై అక్కడి డాక్టర్లకు ఎన్ని జాగ్రత్తలు చెప్పారో. వారిలో నేను ఒక డాక్టర్నే! నాకే ఆశ్చర్యం వేసింది.

అంటువ్యాధులతో బాధ పడేవారు ఆశ్రమ భోజనశాల లోనికి ప్రవేశించ కూడదు, వాళ్లను అనుమతించ కూడదు అనే వాడిని. కాని, శ్రీఅరవిందులు అటువంటి ఒక బాధితుని గురించి అన్న మాటలు నా చెవులలో ఇంకా మ్రోగుతున్నాయి, "అతడు ఎక్కడికి వెళ్ళగలడు, అతనికి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు."

Correspondence with Nirodbaran

నిరంతరం ఆదరించే ఆచార్యుడు

శ్రీఅరవిందులు అక్కడ ఉండటం వలన వారి పాదస్పర్శతో మేడ మీద వరండా పవిత్రం గావించబడింది. వారు అక్కడ ఉదయం రెండు మూడు గంటలు, సాయంత్రం చర్చల సమయంలో ఒక గంట కూర్చునేవారు. సాధకులే తమకు తాముగా విషయాలను చర్చిస్తున్నపుడు అవసరాన్ని బట్టి అక్కడకు వస్తూ చర్చలో పాల్గొనేవారు. ఒక సాధారణమైన బల్ల, ఒక కుర్చీ మాత్రమే ఉండేవి. వాటిని మధ్య గుమ్మానికి తూర్పుగా వేశేవారు. శ్రీఅరవిందులు పత్రికలు చదవటం గాని, సాధకులను, సందర్శకులను కలుసుకోవటం గాని అక్కడే జరిగేవి.

ఒక్కొక్కసారి వారు అక్కడకు రాక ముందే వారి పెంపుడు పిల్లి అక్కడకు వచ్చి దర్జాగా వారి కుర్చీలో విశ్రమించేది. బహుశః వారి యోగశక్తి నుండి వెలువడుతున్న శక్తి తరంగాల వెచ్చదనం సూర్యకాంతిలా దాన్ని ఆకర్షించిందా అని అనుకునే వాళ్ళం. అట్టి సందర్భాల్లో శ్రీఅరవిందులు దాన్ని వెళ్ళగొట్టే వారు కాదు. కుర్చీలో ఒక మూల ఏ చిన్న జాగా వున్నా వారు కూడా సర్దుకొని అందులోనే కూర్చొనేవారు. ఇతర జీవులను కూడా గౌరవించి, సమాన అవకాశాలు కల్పించటం వలన ఆయన ఏ ప్రజాస్వామ్యవాది కన్న మించిన ప్రజాస్వామ్యవాది.

-- పూజాలాల్

విశ్రమిస్తున్న పిచ్చుకపై శ్రద్ధ

ఎప్పటి లాగే ఉదయం 5 గం.ల వేళ శ్రీమాతారవిందుల పవిత్ర సదనానికి వెళ్ళాను. నాపై అభిమానంతో కొన్ని గదులను శుభ్రం చేసే అవకాశాన్ని నాకు కల్పించారు. శ్రీమాతే స్వయంగా తలుపు తెరచి నాకు ప్రవేశం కల్పించేవారు. ఆ విధంగా నాకు ఆ పనిలో ఆనందాన్ని అనుభవించే అవకాశం వచ్చింది.

ఒక రోజు శ్రీమాత నాకు ఒక ప్రత్యేకమైన హెచ్చరిక చేసారు. ఆ రోజు పనిలో చాలా నేర్పుగా, ప్రశాంతంగా ఉండాలని, మధ్య గుమ్మం తలుపుపై కూర్చొని వున్న పిచ్చుకకు ఏ భయం కలుగ కుండా పని చేయాలని శ్రీఅరవిందుల ఆదేశంగా చెప్పారు. నేను దానిని దైవాజ్ఞగా భావించి అందుకు అంగీకరిస్తూ వాగ్దానం చేశాను. శ్రీమాత తిరిగి వెళ్తూ వుండగా నేను లోనికి ప్రవేశించాను. అతి జాగ్రత్తగా ఆ పిచ్చుక ప్రశాంతతకు భంగం కలిగించకుండా నా విధి నేను నిర్వహించ గలిగాను.

ఈ సంఘటన నన్ను చలింప జేసింది. శ్రీఅరవిందులు ఎంతటి దయార్ద్ర హృదయులు. బహుశః ఏ రాత్రో వారు ఆ గదిలో పచార్లు చేస్తుండగా అది అక్కడి ప్రశాంత వాతావరణంలో ప్రవేశించి సేద తీరుతున్నట్లుంది. ఆ విధంగా శ్రీఅరవిందుల కరుణ కేవలము మానవులకే పరిమితమైనది కాదని చెప్పవచ్చు. పశు పక్ష్యాదులు కూడా వారి సమక్షంలో నిర్భయంగా సంచరించేవి. విశ్వప్రేమకు ఇంత కంటె వేరొక తార్కాణం కావాలా!

వారి సామీప్యంలో ఉన్నవారంతా ధన్యులే, వారి ఉనికి వలన ఈ భూమి కూడా ధన్యత నొందింది. వారు దివ్య శరీరధారులై అటువంటి ఔన్నత్యం నుండి వారి కరుణను మనపై ప్రసరింప జేయటం వారిలో దాగి వున్న విశ్వప్రేమకు సంకేతం కదా!

Reminsemces of Pujalal

నేను వారిని వదలి వెళ్ళను

తమ శిష్యులకు ఒక నిగూఢ వేదాంత సత్యాన్ని, సంతృప్తిని ఇచ్చే విషయం శ్రీమాత అనగా నేను విన్నాను. అది ఏమిటంటే శిష్యులు గురువులను ఏవగించుకొని వెళ్ళిపోయినా, గురువు శిష్యులను వదలి పెట్టలేడు. గురుకృపను వదిలే శిష్యులు

లెక్క లేనంత మంది ఉండవచ్చు, కానీ నిజమైన గురుకృప శిష్యులను వదలి పెట్టదు.

ఒక శిష్యుని విషయంలో ఇలాగే జరిగింది. ఆ శిష్యుడు గురువును ఏవగించుకొని వదలి వెళ్ళాడు. శ్రీఅరవిందులు అతనికి జవాబు వ్రాస్తూ తాను ఆ శిష్యుని వదలుకోవాలని అనుకోవటం లేదని స్పష్టం చేశారు. ఒకసారి శ్రీఅరవిందులను నేనే స్వయంగా అడిగాను "వాడు మిమ్మల్ని వదలినా మీరు అతనిని వదలనని అన్నట్లున్నారు" అని. శ్రీఅరవిందులు ఇలా జవాబిచ్చారు: "నాకు అతనిని వదలాలని లేదు. ఒక వేళ ఏ శిష్యుడైనా గురువుని మోసగించి వెళ్ళాలనుకుంటే అతడు తనకు తానుగా గురువు యొక్క అనుగ్రహాన్ని పోగొట్టుకున్న వాడవుతాడు. కాని అప్పటికీ గురువుగారి అనుగ్రహం అతనిపై లేకుండా పోతుందని అనుకోలేము."

Memorable contacts with the Mother: NB: p. 107-108

అనువాదం: K. R. L. నరసింహా రావు

"For the kind attention of all the members of Sri Aurobindo Society"

As you all are aware, the centenary of the Mother's final arrival in Pondicherry falls on 24th April 2020. Sri Aurobindo Society Headquarters in Pondicherry intend bringing out a souvenir to commemorate this great event. For this we are collecting materials which have Mother's handwriting or signature etc. Members, who come across any such material are requested to share them with us. In case anything comes to your knowledge that have some connection with the Mother directly may also be shared with us. Scanned copies of such material may be sent to us at the following e-mail ids :


vijay@aurosociety.org

pradeep@aurosociety.org"

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2017



చక్కని జీవితం

1 వ భాగం

విషయసూచిక

సంపాదకీయం

మన చరిత్ర నంతా మరింత అందమైన, ప్రయోజనకరమైన అనుభవంగా రూపొందించడం కోసం భవిష్యత్తును నిజంగా, శాశ్వతంగా ఆనందమయం గావించే అవసరాలను అన్వేషించాలనే గట్టి తలంపుతో నిర్విరామంగా కొనసాగే ప్రయాణాలు మన జీవితాలు. అయితే ఈ మార్గంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రతి సవాలు యొక్క అసలు అర్థం తెలుసుకోగలిగితే అందులో కొన్ని అవకాశాలు కూడా వున్నట్లు గ్రహించవచ్చు.

ఈ సెప్టెంబరు, అక్టోబరు మాసాల 'అఖిల' ప్రచురణలు మన జీవితాలను సంతోషంగా, సామరస్యంగా, ప్రయోజనకరంగా గడపటానికి మార్గదర్శనం చేస్తాయి. మన లక్ష్యం జీవితాలను ఆత్మసంయమనం కోల్పోకుండా, చిక్కుల్లో పడకుండా సుగమంగా సాగించటం; జీవితాలను, సవ్యమైన వైఖరికి గల విలువల ప్రాధాన్యతను గుర్తించి, సంపూర్ణ సాఫల్యత పొందగలిగే జ్ఞానమార్గంలో నడిపించడం. సెప్టెంబరు సంచిక 'దివ్యజీవనం సవాళ్ళు' పై కేంద్రీకరిస్తుంది. అక్టోబరు సంచిక 'అందమైన దివ్యజీవనం – అవసరాలు, ఉపకరణాలు' వివరాలను తెలియబరుస్తుంది.

సంపాదకుడు

జీవితంలో ఎదురయ్యే సవాళ్ళు

భోగలాలసతో అప్రతిష్ట పాలైన జీవితానికి దాపురించిన అపప్రథను, సన్యాసత్వాన్ని అభిలషించి, అనుసరించడం ద్వారా తొలగించే ప్రయత్నాని కన్నా, జీవితాన్ని నిర్వికారంగా, నిగర్వంగా, నిర్మలంగా, సమరసంగా, సమర్థంగా సాగించడం అధిక కష్టతరం.

ఒకరి భౌతిక అస్తిత్వాన్ని సర్వనాశనమయ్యే స్థాయికి దిగజారే దాకా నిరాదరణకు గురిచేయడం కన్నా, దానికి సమరసమైన, ప్రగతిపూర్వక అభివృద్ధిని సమకూర్చడం అధిక కష్టతరం.

శరీరానికి ఆవశ్యకమైన పోషకాహారాన్ని, పరిశుభ్రతను అందనీయకుండా సమస్త సుఖభోగాలను త్యజించానని గర్వపడటం కన్నా, ప్రశాంతంగా, నిరాసక్తతతో జీవించడం అధిక కష్టతరం.

అనారోగ్యాన్ని అలక్ష్యం చేసి, ఉపేక్షించి, వినాశకరమైన దాని కార్యక్రమాన్ని నెరవేర్చడానికి స్వేచ్ఛగా వదిలేయడం కన్నా ఒక ఆంతరిక మరియు బాహ్య సామరస్యత, స్వచ్ఛత, సమతుల్యతలతో దాని బారిన పడకుండా తప్పించుకోవడం లేక దాటివేయడం లేక జయించడం, అధిక కష్టతరం.

అన్నింటి కన్నా అధిక కష్టతరమైనది చేతనా సామర్థ్యాన్ని నిరంతరం శిఖరాగ్ర స్థాయిలో నుండునట్లు కాపాడుతూ, శరీరం ఒక నిమ్న ప్రేరణతో ప్రభావితం కాకుండా పని చేయించడం.

CWM 12:49-50

శ్రీమాత

అనువాదం: జి. వి. యస్. వి. ప్రసాదరావు



శ్రీఅరవిందులు అరుదెంచింది భవితయొక్క సౌందర్యం ఏదైతే అనుభవించ వలసిందో అది లోకానికి తెలియ జేయడానికి.

వారు విచ్చేసింది ప్రపంచం ఏ వైభవోపేతమైన స్థితికి చేరువౌతున్నదో దానిపై ఆశను కాదు, ఒక దృఢ విశ్వాసాన్ని కలిగించడానికి. విశ్వంయొక్క ఆవిర్భావం ఒక దురదృష్టకరమైన యాదృచ్ఛిక సంఘటన కాదు, అది తనను తాను ప్రకటించుకొనుటకు కదులుతున్న ఒక మహాద్భుతం.

CWM 13:15

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అనిశ్చితత్వం

చాలామంది 'రక్షణ' కోరుకుంటారు. 'రక్షణ' ఉంటేనే మన మనుగడకు సార్థకత ఏర్పడుతుంది. ఇదే ఒక చక్కని గమ్యం. అసలు మానవ ప్రయత్నమంతా రక్షణ కోసమే అని చెప్పవచ్చు. "సౌకర్యం వుంటే చాలు" అనుకునేవారు కొందరు ఉంటారు. కొందరికి వినోదము, సంతోషము ఉంటే చాలు. "అభద్రత", అనిశ్చయత అనే భావన రాజకీయాలకు, మత ప్రచారానికీ ఉపకరణంగా తోడ్పడతాయి. అవి వ్యక్తులను ప్రభావితం చేయడానికి దోహద పడతాయి. మతమూ, రాజకీయమూ వీటి మీదనే ఆధారపడతాయి.

CWM 9: 354-55

*

జరగబోయే దాన్ని ముందుగానే తెలుసుకోవటమా! ఈ విషయంలో ఎంతమంది ప్రయత్నించారో! ఎన్ని విధానాలు ఆవిర్భవించ బడ్డాయో. ఎన్ని శాస్త్రాలు పుట్టి పెరిగాయో! చివరకు అన్నీ అనుభవ శూన్యమైన మూఢ నమ్మకాలుగా మారి నశించాయి. భవిష్యత్తును ముందుగా అంచనా వేసి, అర్థం చేసుకోవటము ఎందుకు సాధ్యపడదు? అది అంత అర్థం కాని విషయమా?

CWM12: 77

*

అసలు రేపటి రోజు ఏం జరుగుతుందో నీకు తెలుస్తుందా? ఎక్కువో, తక్కువో, కొంత ఊహించగలవు, రేపు కూడా ఇవాళ లాగే వుంటుందని. కానీ నీకు ఏమీ తెలియదు. రేపటి గురించి తెలియనప్పుడు ఇక వచ్చే నెల గురించి ఏమి తెలుస్తుంది? రానున్న సంవత్సరం గురించా? అసలు నీకు తెలియనే తెలియదు. ఏం జరుగు తుందో తెలియక పోవటం వలననే ఈ రోజు ఉత్సాహంగా పని చేయ గలుగుతున్నావు. భవిష్యత్తు తెలిస్తే వెయ్యి మందిలో తొమ్మిదివందల తొంభై తొమ్మిది మంది ఏమీ చేయకుండా నిమ్మళంగా కూర్చుంటారు, జరిగేది ఏదో జరుగుతుందిలే అని. అంతే కాదు, నీ ఉత్సాహం కర్పూరంలా కరిగిపోతుంది. చాలా సందర్భాలలో "అందుకోసం ఇదంతా చేయాలా? అనవసరం", అనుకుంటావు.

CWM 4;278

మనం జన్మిస్తుంటాం, జీవిస్తాం, మరణిస్తుంటాము, మళ్ళీ పుట్టి కొన్నాళ్ళు జీవించి తిరిగి చనిపోతాం. ఈ చక్ర భ్రమణం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. దీని కి అంతులేదు, అసలు ఈ సమస్యకు పరిష్కారం గురించి ఆలోచించడం. రానున్నది ఏ మాత్రం తెలిసినా, జీవితాన్ని రుచి చూసినా, అది ఒక నిరంతర చక్ర భ్రమణమనీ తెలిసినా, ఈ జీవితకాలంలో చేయవలసినది ఏమిటో గ్రహించగలిగినా మనం ఈ జన్మలో కొంతవరకే చేసి, మిగతాది వచ్చే జన్మలో చూద్దాములే అనుకున్నా, మనలను అనుసరించి దాని వస్తు సామగ్రిని వదిలించుకోలేక పోయినా, మరో జన్మ నెత్తి పునః ప్రారంభించాలి. కాని అలా వద్దు. చేయగలిగింది ఈ జన్మలోనే చేద్దాము. వచ్చే జన్మ ఎట్లా వుంటుందో! చేయగలింది ఈ జన్మలోనే ఆత్మసాక్షిగా

శ్రీఅరవిందుల అనర్ఘ రత్నాలు:

మానసికమైన తొందరపాటుతో ఆందొళన పడవద్దు. శ్రీమాతను ధ్యానించు. ఆమె శక్తి నీ హృదయ కమలాన్ని వికసింప జేస్తుంది.

CWSA 32:478

ఆకాంక్షకు తగినట్లుగా కృషి చేయాలి. నిన్ను నీవుగా శ్రీమాతకు సమర్పించు కోవాలి. శ్రీమాతకు సంబంధించిన కార్యక్రమములనే చేయాలి. మిగతావి తిరస్కరించాలి. సమర్పణ పరిపూర్ణముగా ఉండాలి. అంతా సరైన సమయం లో జరుగుతుంది. ఏ విషయములోనూ ఆందోళనను గాని, తొందరను గాని రానీయవద్దు. ఇక్కడ అసహనమునకు గాని, కృంగుబాటుకుగాని అవకాశమే లేదు.

CWSA 32:243

ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. అట్టి పరిస్థితులలో ప్రశాంత చిత్తముతో శ్రీమాతకు ఉన్ముఖుడవై ఆమెను ధ్యానించు. నీలో ఏదో ఒక పరిష్కార మార్గం ఉదయిస్తుంది.

CWSA 32:76

అనువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు

చేద్దాము, నిజాయితీగా చేద్దాము. అదే మంచిది. "నేడు చేయగలిగిన పని రేపటికి వాయిదా వెయ్యొద్దు," అంటే ఇదే. ఇప్పుడే మనకు అవకాశం ఉంటుంది, ఈ జన్మ లోనే వీలుపడుతుంది. దీన్ని సద్వినియోగం చేసుకోకపోతే మళ్ళీ ఏ వెయ్యి సంవత్స రాలకు అవకాశం వస్తుందో, అసలు రాదో!

ఏది ఏమైనా నీ విద్యుక్త ధర్మం నిర్వర్తించటం నీ విధి. ఎంత త్వరగా చేస్తే అంత మంచిది.

CWM 7:196 *అనువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు*

ఆందోళన

ఏమి జరుగబోతున్నదో అని అనునిత్యం విచరపడటం మనిషితో పాటే మొదలయింది. ఈ విచారం మనిషిని పీడించడానికి ఏకైక కారణం కాకపోయినా అదే ప్రధాన కార ణం. విషయ పరిజ్ఞాన పరమైన ఈ చేతనతో ఆరాటం, బాధాకరమైన ఊహలు, విచారం, పీడనం, భవిష్యత్ దుర్ఘటనలను ముందుగానే ఊహించుకోవడం మొదలవుతుంది. తత్ఫలితంగా అనేకులు — కొద్దిపాటి ఎరుక గలవారు కాదు, అత్యధిక ఎరుక గలవారు- నిరంతరం వ్యధ చెందుతూ జీవిస్తారు..... అది అవసరమైన జ్ఞానమా? ఇక దురదృష్టకర విషయమేమిటంటే మనిషి తన జీవితంలోని సమస్య లన్నింటినీ తానే పరిష్కరించుకోవాలనే నమ్మకం కలిగి వుంటాడు. కానీ అది చేయు డానికి అవసరమైన జ్ఞానం అతని కుండదు. అతని కష్టాలన్నింటికీ అదే మూలకారణం, ఉత్పత్తి స్థానం. 'దానితో నేనేం చేయాలి' అనే ప్రశ్న నిత్యం వెంటాడుతుంది. దానిని ననుసరించి అంతకన్నా తీవ్రమైన మరో ప్రశ్న 'ఏం జరుగబోతుంది?" ఉదయిస్తుంది. ఇంచుమించు అదే సమయంలో సమాధాన మీయడానికి అశక్తతత!

CWM 9:303-05

దాదాపు అందరూ ఫలితం గురించో లేక ఏదో పొందాలనో ఆత్రపడుతుంటారు. ఫలితాల గురించి ఆత్ర పడకూడదు. మామూలుగా పని చేయి, ఎందుకనగా అది తప్పక చేయబడాల్సింది అని నీకు తెలుసు. నీకు నీవు ఈ విధంగా చెప్పుకో, "నేను ఇది చేస్తున్నాను, కారణం అది చేయబడవలసినది గనుక. ఆ తరువాత ఏమి జరుగు తుందనే దానితో నాకు సంబంధంలేదు."

అది ఒక స్పష్టమైన లక్ష్యం. అది సిద్ధించే వరకు కార్యక్రమం ఎప్పుడూ అస్పష్టం గానే వుంటుంది.

CWM 4:12

చేయకూడని పని అని తెలిసి దానినే పదే పదే చేస్తూపోతే, తాను పొందగలిగిన శాంతిని, ప్రశాంత వాతావరణాన్ని , సుఖ సంతోషాలను సమస్తం నష్ట పోతాడు.

ఎవడైతే అబద్ధాలాడుతాడో , వాడు అది ఎప్పుడో బయట పడుతుందని నిరంతరం భయపడుతుంటాడు. ఎవడైతే అక్రమానికి పాల్పడతాడో వాడు బహుశా తాను శిక్షింప బడతానేమో అని నిత్యం ఆరాట పడుతుంటాడు. ఎవడైతే మోసం చేయాలని ప్రయత్నిస్తాడో అది తెలుసుకోబడుతుందేమో ననే బెంగతో శాంతిని కోల్పోతాడు.

వాస్తవానికి, కేవలం అహంకారమే కారణమైనప్పటికీ, మంచి చేయడం, ధర్మ బద్ధంగా వ్యవహరించడం, యుక్తమైన నడవడి కలిగి వుండడం, నిజాయితీగా ప్రవర్తిం చడం, నెమ్మదిగా, ప్రశాంతంగా నుండటానికి ఆరాటం తగ్గించుకోవడానికి ఉత్తమమైన మార్గం. దానితోపాటు వ్యక్తి నిరాసక్తుడైవుండి, వ్యక్తిగత ఉద్దేశ్యాలు, అహంభావం లేనివాడైతే, అప్పుడు నిజమైన ఆనందం పొందగల సంభావ్యత ఏర్పడుతుంది.

CWM 3:197

నీవు దేనినైతే ఆరాటం, ఆతురత అని అంటున్నావో, అది కలగడానికి కారణం నీవు నీ స్వంత వ్యవహారాలను చూచుకోవడంలో పూర్తిగా నిమగ్న మై వున్నందు వలన. అందుచేత అజ్ఞాని, సంస్కారహీనుడగు వ్యక్తిగా నుండకూడ దనుకుంటే, నీవు చేస్తున్న పనిపై అంకితభావం కలిగి వుండాలి, (చిత్రలేఖనం లేక సంగీతం) సంస్కరించ బడని నీ మనస్సును వికసింప జేయాలి, వ్యక్తికి ఆవశ్యకమైన జ్ఞాన మూలాలను తెలుసుకోవాలి. నీవు క్రమం తప్పకుండా ప్రతి రోజు ఎనిమిదినుంచి తొమ్మిదిగంటలు పని చేసినట్లయితే, నీకు అకలి వేస్తుంది, నీవు తృప్తిగా ఆహారం తీసుకో గలుగుతావు, ప్రశాంతంగా నిద్ర పోగలుగుతావు. నీకు నీ మనఃస్థితి బాగానే వున్నదా, లేదా అని ఆలోచించే సమయం కూడా దొరకదు.

CWM 12:130

..."నేను తొందర పడాలి, నేను తొందర పడాలి, ఎక్కువ సమయం లేదు, నేను త్వరపడాలి, సమయం ఎక్కువ లేదు" అని ఆరాటపడటం బహు చెడ్డది. వ్యక్తి పనులను అధ్వాన్నంగా చేస్తాడు లేదా అసలు చేయడం మానేస్తాడు. కానీ అతనికి

తన మానసిక శక్తితో సంపర్కంలోకి వచ్చిన వెంటనే ఈ స్థితి అంతమైపోతుంది. అతడు ఇంకొంత విస్తృతి చెందడం, నెమ్మది పడడం, ప్రశాంతత ననుభవించడం, శాశ్వతత్వంలో జీవించడం ప్రారంభిస్తాడు.

CWM 6:334

"ఓహ్, ఎవరైనా పనులను సక్రమంగా చేయాలంటే, అతనికి సమయం వుండాలి" అనే వారందరికీ ఇది చక్కని సమాధానం. ఇది నిజం కాదు. నీవు చేసే దాని కంతా — చదవడం, ఆటలాడటం, పని చేయడం — ఒకే ఒక పరిష్కారం వుంది: వ్యక్తి యొక్క ఏకాగ్రత శక్తిని పెంచడం. ఈ ఏకాగ్రతను నీవు సాధించినప్పుడు, అలసిపోవడం ఇక వుండదు. మొదట్లో ఒక మానసికోద్వేగం కలగడం సహజం, కానీ అలవాటు పడితే అది తగ్గిపోతుంది. క్రమేపీ ఎలాంటి సమయం ఒకటి వస్తుందంటే నీకు అలసట కలిగేది ఏకాగ్రత వహించనప్పుడు, నీ మనస్సును నీవు చెదరగొట్టుకున్న ప్పుడు, రకరకాల విషయాలు నిన్ను కబళించినప్పుడు, నీవు చేస్తున్న పనిపై ఏకాగ్రత చూపనప్పుడు. వ్యక్తి ఏకాగ్రతా శక్తితో పనులను మరింత మెరుగుగా, మరింత వేగవంతంగా చేయగలడు. ఈ విధంగా పనిచేయటం అభివృద్ధికి సాధనంగా ఉపకరిస్తుంది.

CWM 4:138

ఏ పరిస్థితిలోనైనా నీవు నిర్భయంగా చేయగలది ఒకటుంది. అదేమిటంటే నిద్ర కుప క్రమించే ముందు ఏకాగ్రత వహించడం, భౌతిక అస్తిత్వం లోని ఉద్వేగాన్ని సడలిం చడం.... అనగా, శరీరంలో ఉద్వేగాన్ని తగ్గించుటకు ప్రయత్నించడం. ఆ విధంగా దేహం పరుపుపై ఒక గుడ్డ పేలికలా పడి వుంటుంది. ఇక దానికి తిమ్మిర్లుగాని, పీక్క పోవడం గాని వుండవు; పూర్తిగా ఉపశమనం పొంది కేవలం ఒక గుడ్డపేలికలా అవుతుంది. ఆ తరువాత ప్రాణికం: దానిని శాంతపరచాలి, నీకు చేతనైనంతగా శాంతపరచు, సాధ్యమైనంతగా నెమ్మది కలిగించు, ప్రశాంతిని సమకూర్చు. తరువాత మనస్సును కూడా — దానికి ఏ విధమైన కదలికలను లేకుండా వుంచడానికి ప్రయ త్నించు.

నీ మెదడుపై గొప్ప శాంతికారకమైన, నెమ్మదిని కలిగించే, వీలైతే నిశ్శబ్ద స్థితిని కూడా కలిగించే శక్తిని ప్రయోగించు. ఊహలను చురుకుగా అనుసరించకు, ఏ ప్రయత్నం చేయకు, ఏమీ చేయకు, ఏమీ చేయకు. అక్కడ కూడా కదలిక

లేకుండా చేయాలి కానీ ఒక నిశ్శబ్ద ప్రశాంత స్థితిలో వీలైనంత విశ్రాంతిని కలిగించు.

CWM 7:66

ఈ విజయం సాధించాలంటే, మన చుట్టూ వున్న వాతావరణ స్థితికి భిన్నమైన లక్షణం గల ఒక మానసిక స్థితిని తప్పక నెలకొల్పుకోవాలి. కొద్ది కొద్దిగా, రోజువారీగా, మన మనసులను ఊహించ గలిగినంత అత్యున్నతమైన, స్వచ్ఛమైన, నిరాసక్తమైన ఆలోచనలతో నింపాలి. దేనినైతే మనం విధిగా ప్రకటించాలో ఆ దివ్యజ్ఞానాన్ని బోలిన అగ్నిజ్వాలను మనలో మనమే స్వయంగా రగిలిద్దాం.

ఈ కార్యాన్ని ఒక రోజులోనో, ఒక మాసంలోనో, కనీసం ఒక సంవత్సరంలో కూడా సాధించలేము. అందుకు మనం సంకల్పించాలి, పట్టుదలతో సంకల్పించాలి. కానీ, దీని వలన సమకూరే ప్రయోజనాలను తెలుసుకోగలిగితే, దాని వలన కలిగే ప్రశాంతతను అనుభూతి చెంద గలిగితే, అవి మనలో కోరికల వలన జనించే ఆందోళన, ఆరాటం, భయభ్రాంతుల స్థానాన్ని నెమ్మది నెమ్మదిగా ఆక్రమించుకుంటాయనే అవగాహన ఏర్పడితే, నీవు నిస్సంకోచంగా కార్యాచరణకు పూనుకుంటావు.

CWM 2:93

ఎప్పటి లాగే, పరిస్థితులు జటిలమైన వెంటనే, మానవులు ఆందోళన చెందుతారు, ఆగ్రహావేశాలకు లోనౌతారు, కష్టాలను పదింతలు అధికం గావించుకుంటారు. కాబట్టి, నేను నిన్ను సూటిగా హెచ్చరిస్తున్నాను, ఇది చేయకూడని పని అని, చేయవలసింది అందుకు వ్యతిరిక్తంగా నని. నేను ఏదైతే నీకు చదివి వినిపించ బోతున్నానో దానిని తప్పకుండా నీకు నీవు మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాలి, నీలో ఏదో ఆందోళన గానీ, విచారం గానీ కలిగిన వెంటనే, నేను నీకు నేడు చెప్పుతున్న దానిని గుర్తుంచుకోవాలి. సంవత్సరం పొడవునా గుర్తుంచుకోవాలి. ఉదయాన, సాయంకాలం పునశ్చరణం చేయి, లాభసాటిగా నుంటుంది. ఇక్కడ, ఇక విను... "మానవ సంకల్పం ఏది కూడా దైవ సంకల్పాన్ని ఎదిరించి నిలువ లేదు. అందువలన ఉద్దేశపూర్వకంగాను, ప్రత్యేకంగాను మనల్ని మనం దైవం తరఫున నిలుపుకుందాం.చివరకు విజయం తథ్యం"

CWM 6:454

అనుదినం ఆందోళన చెందకుండా జీవిద్దాం. బహుశా, ఎప్పుడూ జరుగదేమోనని

అనుకునే విషయాన్ని గురించి ముందుగానే విచారపడట మెందుకు?

*

విచారపడటమంటే దైవకృపపై విశ్వాసం కోల్పోవడం. నీ సమర్పణ సంపూర్ణంగా లేదనటానికి స్పష్టమైన సంకేతం.

CWM 14:222, 23

నీవు దైవకృపపై ప్రగాఢ విశ్వాసం, గట్టి నమ్మకం కలిగి వుండాలని అది బోధిస్తుంది. ఎందుకనగా అవి సంపూర్ణంగా, సమగ్రంగా సమకూరినప్పుడే సమస్తమైన విచారం, ఆరాటం నీ నుండి వెడలిపోతాయి.

CWM 17:377 *అనువాదం: అడుగులపాటి కైలాసపతి*

శంకలు భయాలు

సర్వసాధారణంగా మానవుల పరిస్థితి శంకలు, భయాలతో నిండిపోయి ఉండే అవస్థ. నీ మనస్సును నీవు పది నిమిషాలు లోతుగా పరిశీలిస్తే, పదింటిలో తొమ్మిది పూర్తిగా, భయంతో నిండిపోయినవై ఉంటాయి — అది తనతో ఎన్నో విషయాల మీద భయాన్ని వెంటబెట్టుకొనే ఉంటుంది, పెద్దవి, చిన్నవి, దగ్గరవి, దూరానివి, చూసినవి, చూడనివి. నీవు సాధారణంగా దానిని గురించి ఎరుకలో ఉండనప్పటికీ, అది ఎప్పుడూ అక్కడే ఉంటుంది. భయం అంతటి నుంచి విముక్తిని పొందటం అనేది కేవలం నిల కడతో కూడిన ప్రయత్నం, నియమానుసార ప్రవర్తన వలన మాత్రమే సాధ్యం కాగ లదు.

భయాల కారణాలు మళ్ళీ మళ్ళీ నీ మీద దాడి చేస్తూనే ఉంటాయి, వాటి ఎదుట స్వతంత్రంగా, ఉదాసీనంగా, తగలకుండా, పరిశుద్ధంగా నిలబడే పర్యంతము. ఒకరికి సముద్రమంటే భయం, మరొకరికి నిప్పు అంటే భయం. రెండవ వ్యక్తి బహుశా తాను ఒక దాని తరువాత మరొక పెద్ద మంటలో కాలిపోతానేమో నని అనుకుంటూ ఉంటాడు. అది అతని శరీరంలోని ఒక కణం కూడా వణకకుండా అతడు శిక్షణ పొందే పర్యంతమూ అట్లాగే ఉంటుంది. దేని గురించైతే నీకు మహాభీతి

ఉంటుందో, అది పోయే వరకు నిన్ను అది తిరిగి తిరిగి భయవిహ్వలుడిని గావిస్తూనే ఉంటుంది.

CWM 3:57

ఒకరికి దేని గురించి భయం ఉంటుందో ఆ భయమే ఎల్లప్పుడూ కలుగుతూ ఉంటుందని మనకు తెలుసు. నీవు ఒక ప్రమాదం గురించి భయపడితే, అది అయస్కాంతం లాగా ప్రమాదాన్ని నీ వైపుకు లాక్కు వస్తుంది. ఈ భావనలో, అది బహుశా వ్యక్తి నైతిక లాక్షణికతను బట్టి ఫలితం ఉంటుందని చెప్పబడింది. అదే విషయం వ్యాధికి కూడా వర్తిస్తుంది. వ్యాధి ప్రబలిన ప్రాంతాలలో రోగులమధ్య తిరిగే కొంతమంది జనం ఉన్నారు, వారెన్నడూ వ్యాధి బారిన పడరు. కాని ఇతరులు మరికొంతమంది ఉన్నారు, ఒక వ్యాధి గ్రస్తుడితో ఒక గంట గడిపితే చాలు వారు వ్యాధి బారిన పడతారు. అది కూడా అంతరంగంలో వారేమిటో అనేదానిమీద కూడా ఆధారపడి ఉంటుంది.

CWM 6:2

వ్యాధి ప్రమాదం పదింట తొమ్మిది వంతులు భయం వల్లనే వస్తుంది. భయం వాస్తవమైన వ్యాధిలక్షణాలను నీలో పొటమరింప జేయగలదు. అది నీకు వ్యాధిని కూడా సంక్రమింప జేయగలదు. దాని ప్రభావాలు అంతవరకు వెళ్ళగలవు.... అనుభవం ఎటువంటి లక్షణాలతో కూడుకున్నప్పటికీ, నీవు తప్పక భయానికి చోటివ్వ కూడదు. నీవు తప్పక నిబ్బరం కలిగిన ధృఢవిశ్వాసంతో ఏది జరిగినా అది జరిగితీరవలసి ఉంది కాబట్టి జరుగుతుందనే గట్టి నమ్మకంతో ఉండాలి.... కాని నీవు ఎంచుకోటం, వెనక్కి పోవటం, మళ్ళీ ఎంచుకోటం, వెనక్కి పోవటం, ఎల్లప్పుడూ ఇటువంటి ఊగిసలాట ధోరణితో, ఎల్లప్పుడూ శంకతో, ఎల్లప్పుడూ భయంతో నిండిపోయి, నీ అస్తిత్వంలో అసామరస్యతను సృష్టించినట్లయితే, అది నీ పురోగతిని మందగింప జేయడమేకాదు, మనస్సులో, ప్రాణిక అస్తిత్వంలో అన్ని రకాల అస్థిరతలకు, శరీరంలో అసౌకర్యానికి, వ్యాధికి మూలం కాగలదు.

CWM 3:90-91

ఒకరు అజ్ఞానం కారణంగా పిరికివారు అవుతారా?

దానర్థం అన్ని రకాల చెడ్డవిషయాలకు అజ్ఞానమే కారణమని ఒకరు అనుకోవచ్చు. కాని ఒకరు పిరికివారు అవటానికి కారణం వారు చాలా తామసికులవటం మూలంగాను,

ప్రయత్నం చేసేందుకు భయపడటం వల్లను అని నేననుకుంటున్నాను. పిరికివారవకుండా ఉండాలంటే ఒకరు ప్రయత్నం చేయాలి, ప్రయత్నంతో ప్రారంభించాలి, తదుపరి అది చాలా ఆసక్తిదాయకమైన దవుతుంది. కాని ఈ రకంగా పరిగెత్తి పారిపోవటం నుంచి తమకు తాము బయటపడాలంటే, అత్యుత్తమమైన విషయం ప్రయత్నించటం.

దానిని ఎదుర్కొనటానికి మారుగా, ఒకరు బెదిరిపోయి వెనుకంజ వేస్తారు, పారిపోతారు, వెనక్కి తిరిగి, పరుగెత్తి పారిపోతారు.కారణం మొదటిదైన ప్రారంభ ప్రయత్నమే కష్టం. కనుక, నిన్ను ప్రయత్నం చేయనీయకుండా అడ్డుకొనేది జడమయమైన అజ్ఞాన ప్రకృతి. నీవు రాజసిక ప్రకృతిలో ప్రవేశించిన వెనువెంటనే, నీవు ప్రయత్నాన్ని ఇష్టపడతావు. రాజసిక ప్రవృత్తి కల జనులకు కనీసం ఒక అనుకూలత వుంటుంది, అది వారు ధైర్యవంతులు కావటం, కాని తామసిక జనులు మాత్రం పిరికివారు. ప్రయత్నించటానికి ఉండే భయమే ఒకరిని పిరికి వారిని చేస్తుంది. ఒకసారి గనుక నీవు మొదలు పెడితే, ఒకసారి గనుక నిర్ణయం తీసుకొని ప్రయత్నం ఆంరంభిస్తే, నీవు ఆసక్తి పరుడవవుతావు. కచ్చితంగా ఇదే కొంతమందిలో వారిని వారి పాఠాలు నేర్చుకోకుండా ఉండటానికి, ఉపాధ్యాయుడిని ఆలకించకుండా ఉండేందుకు కారణమవుతుంది. అది తామసికత, అది నిద్రలో కూరుకుపోవడం, దేనినైనా పట్టుకోవడానికి తదుపరి దానిని గ్రహించి అట్టి పెట్టుకోవడానికి తప్పకుండా చేయాల్సిన ప్రయత్నాన్ని అది తప్పించుకుంటుంది. అది సగం నిద్రమత్తులో జోగడం. కనుక ఇదే భౌతికంగానూ వర్తిస్తుంది. అది అస్తిత్వం నిద్రమత్తులో జోగడం, ఒక జడత్వం.

కొంతమంది జనులున్నారు, వారు ... భౌతికంగా ఎంతో ధైర్యవంతులైన జనులు కొంతమంది నాకు తెలుసు, కాని నైతికంగా వారు ఎంతో, ఎంతో పిరికివాళ్ళు, కారణం మనుషులు భిన్న మైన భాగాలతో చేయబడతారు. వారి భౌతిక అస్తిత్వం చాలా చురుకుగానే, ధైర్యంతోనే ఉండగలిగి ఉంటుంది. వారి నైతిక అస్తిత్వం మాత్రం పిరికి. దానికి వ్యతిరేకమైనది కూడా నాకు తెలుసు: అంతరంగంలో చాలా ధైర్యవంతులైన వారు నాకు తెలుసు, కాని బాహ్యంలో వారు ఘోరంగా పిరికి వారు. కాని వీరికి కనీసం అంతరంగ ఇచ్ఛను కలిగి ఉన్న ఆనుకూల్యత ఉంది. వణకిపోయినా కూడా వారు తమకు తాము బలవంతం చేసుకుంటారు.

CWM 7:25-26

ప్రపంచం సమస్తం సంతోషం కలిగించని లేదా సౌందర్యవంతం కాని విషయాలతో పూర్తిగా నిండిపోయి ఉంది, కాని అదే కారణంగా ఒకరు నిరంతరం అసహ్యంతో, ద్వేషాను భూతితో, జీవించవలసిన అవసరం లేదు. మానవ మనస్సును అస్థిర పరుస్తూ, బలహీన పరచేటటువంటి కుంచించుకు పోయే, అసహ్యించుకునే, భయపడే అనుభూతులనన్నింటినీ అధిగమించ గలగటం సాధ్యమే. .... నీవు తప్పక అన్ని అస్తిత్వాల, విషయాల, సంఘటనల సన్నిధిలో ఒక పరిపూర్ణమైన సమత్వాన్ని ప్రదర్శించాలి. ఎల్లప్పుడూ తప్పకుండా నిశ్చలంగా వికలమైపోకుండా, చలించకుండా ఉండాలి. .... ప్రమాదకరమైన క్రూరమైన జంతువులు సైతం, ముఖాముఖీగా నిన్ను ఎదుర్కొన్నప్పుడు పూర్తి నిశ్చలత, ప్రశాంతత ఆ జంతువులు నీకు ఏ హాని చేయకుండా చేయగలదు.

ఏ ప్రమాదం నుంచైనా అత్యుత్తమంగా నిన్ను రక్షించేది, కారణాన్ని ఆలోచించ కుండా వెనక్కి పలాయనం చిత్తగించడం కాదు. కేవలం జ్ఞానం మాత్రమే, ప్రమాద లక్షణాన్ని తెలిపే జ్ఞానం, దానిని తొలగించడానికి లేదా నిర్వీర్యం చేయటానికి ఎరుకతో కూడిన సాధనాల వినియోగం. దేనినుంచి గమనాలు పైకి తరలివస్తుంటాయో దానిని గురించిన అజ్ఞానమే మానవుల సర్వ సాధారణస్థితి, కాని దానిని జయించవచ్చు; ఎందువల్లనంటే, మనం, దేని నుంచైతే బాహ్య అస్తిత్వం మొదలువుతుందో, ఏదైతే మనచుట్టూ పరివేష్టించియున్నదో అటువంటి మోటైన మానవ ప్రకృతికి పరిమితమై యున్న వారము కాదు.

అజ్ఞానం వృద్ధి పొందే చైతన్యం వలన చెదరగొట్ట బడుతుంది. నీకు కావలసినదల్లా చైతన్యం ఎల్లప్పుడూ మరింత చైతన్యం, ఒక పరిశుద్ధమైన, నిరాడంబరమైన, ప్ర కాశవంతమైన చైతన్యం. పరిపూర్ణం కావించబడిన ఈ చైతన్యం వెలుగులో, విషయాలు ఉన్నవి ఉన్నట్లుగా కనబడతాయి. అంతేగాని అవి కనబడాలని కోరుకున్న ట్లుగా కాదు. అది విషయాలను అన్నింటినీ కదలిపోతూ ఉంటే నమోదు చేసే ఒక తెర లాంటిది. అక్కడ నీవు ఏది ప్రకాశవంతమో, ఏది కటిక చీకటో, ఏది సూటిగా ఉందో, ఏది వక్రించి కుటిలమై ఉందో దానిని దర్శిస్తావు. నీ చైతన్యం ఒక తెర లేదా అద్దం అయిపోతుంది. కాని ఇది నీవు ఒక ఏకాగ్రతా ధ్యాన స్థితిలో ఉన్నప్పుడే, కేవలం ఒక పరిశీలకుడిగా ఉన్నప్పుడే జరుగుతుంది; నీవు క్రియాశీలంగా, చురుకుగా ఉన్నప్పుడు అది ఒక అన్వేషణా దీపంలా వుంటుంది. నీవు ప్రకాశవంతంగా చూడదలచు

కోవడానికి గాని, ఏ చోటులోనైనా, దేనివైనా సునిశితంగా పరీక్షించటానికి గాని కేవలం దాని మీటను పనిచేయడానికి తిప్పడం మాత్రమే నీవు చేయవలసి ఉంటుంది.
CWM 3:100-01

నీవు నీ చైతన్యాన్ని గనుక అత్యున్నతమైన చైతన్యం సంపర్కంతో అందుబాటులో ఉంచుకో గలిగితే అటువంటి సందర్భంలో అత్యుత్తమమైనదే పూర్తిగా, కచ్చితంగా నీకు జరుగగలదని నీవు అనుకోవచ్చు. కాని నీవు ఈ చైతన్యం నుంచి నిమ్నస్థితిలోకి పడిపోయిన వెంటనే, అప్పుడు సుస్పష్టమయ్యే విషయం అత్యుత్తమమైనది నీకు జరుగదని, దానికి సరళమైన కారణం నీవు నీ అత్యుత్తమమైన చైతన్యంలో లేవు. నేను ఇంకా గట్టిగా ఏమని చెపుతానంటే, తక్షణమే ప్రబావం చూపించే ప్రతి ఒక్కరి క్షేత్రంలో, సరియైన దృక్పథం కేవలం ప్రతి పరిస్థితిని అనుకూలంగా మార్చడమే కాకుండా, పరిస్థితిని సైతం మార్చి వేయగలదు. ఉదాహరణకు, ఒక మనిషి నిన్ను చంపటానికి వస్తే, నీవు సాధారణమైన చైతన్యంలో కొనసాగుతూ ఉంటే, మతి భ్రమించి భయోత్పాతానికి లోబడితే, అతడు ఎందుకు వచ్చాడో, ఆ పనిని విజయవంతంగా పూర్తి చేయడంలో చాలా మటుకు సఫలీకృతుడవుతాడని విశ్వసించవచ్చు. నీవు చైతన్యంలో ఇంకొంచెం ఉన్నతోన్నత స్థాయికి ఎదగ గలిగితే, పూర్తిగా భయంతో ఉన్నప్పటికీ, దైవం సహాయానికై అర్థిస్తే, అతడు బహుశా చిన్న గాయం మాత్రం చేస్తూ, కొద్దిలో గురి తప్పిపోతాడు. కాని నీకు సరియైన దృక్పథం ఉంటే, నీ చుట్టూ ఉన్న దైవసన్నిధి యొక్క సంపూర్ణ చైతన్యం గనుక ఉంటే, అతడు నీ వైపు వేలును కూడా ఎత్తి చూపడానికి అసమర్థుడవుతాడు.

ఈ సత్యం మొత్తం పరివర్తన సమస్యకు పూర్తిగా కీలకం అవుతున్నది. ఎల్లప్పుడూ దైవసన్నిధిని తాకుతూ ఉండి, దానిని క్రిందికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తూ ఉంటే, అప్పుడు చాలా ఉత్తమమైనదే ఎల్లప్పుడూ జరుగుతుంది. సహజంగానే, ప్రపంచం ఒక్కసారిగా మార్పు చెందదు, కాని అది ఎంతో త్వరితంగా దానికి ఎంతగా సాధ్యమైతే అంతగా ముందుకు వెళ్తుంది. మీలో ప్రతివారు చేయ గలిగిన దంతా చేస్తే, అప్పుడు సక్రమంగా కలిసి పని చేయడం జరిగి, ఫలితం ఎంతో ఎక్కువగా తొందరగా జరుగుతుంది. నా దగ్గర సరియైన దృక్పథం యొక్క ఆధి పత్య శక్తి మీద లెక్కలేనన్ని ఉదాహరణలున్నాయి. ఒక్క వ్యక్తి సరియైన దృక్పథాన్ని

కలిగి ఉండడం మూలంగా సమూహాలు దుర్ఘటనల నుంచి రక్షింపబడటాన్ని నేను చూసాను.

ప్రతిసారి నీవు నీ ఊహను అనారోగ్యకరమైన పద్ధతిలోనే పోనిస్తూ ఉంటే, నీ భయాలకు రూపాన్ని కల్పిస్తూ, ప్రమాదాలు, దురదృష్టాలు జరుగుతాయని ముందుగానే ఊహిస్తూ ఉంటే, నీవు నీ సొంత భవిష్యత్తును చెడగొట్టుకుంటూ ఉన్నవాడవవుతావు. దానికి మారుగా నీ ఊహ ఎంతగా ఆశావహ దృక్పథంతో ఉంటే అంత ఎక్కువగా నీ లక్ష్యాన్ని సాక్షాత్కరింప చేసుకొనే అవకాశం ఉంటుంది.... కనుక, నేను మీకు చెప్పేదేమంటే, ఎన్నడూ నిరుత్సాహానికి, నైరాశ్యానికి లోను కావద్దు, కాని నీ ఊహను ఉన్నతోన్నత సత్యం ఒత్తిడికి ఎల్లప్పుడూ ఆశావహంతో, హర్షపూరితమైన మృదుత్వంతో ఉంచు; ముందు చెప్పినదానిలో రెండవది సంపూర్ణంగా ఆవశ్యకమైన రూపాలను నీలో చూసి, దాని సృజనాత్మక ప్రకాశాన్ని పట్టి ఉంచడానికై బహుశా అది నిన్ను కోరుకోవచ్చు.... మనం చేసే పని సఫలీకృతంగా నిరూపితమవుతుందనే నిరంతర ఆశావహంతో, నమ్మకంతో జీవించు.

CWM 3:154-156

ఈ అస్తిత్వాలు అనేక లక్షణాలతో చేసే కార్యక్రమాలలో ఒకటి ప్రాణిక ప్రదేశం లోను, కాలం లోను తమ ఇచ్ఛతో బ్రహ్మాండమైన రూపాలను అనుకరించగల సామర్థ్యం కలిగి ఉంటూ, నీలో భయ ప్రకంపనలు సృష్టించడం; నీ మీద దండెత్తి, వశం చేసుకోవటానికి అదే వారి అత్యంత శక్తివంతమైన సాధనం. నీవు తప్పక నీ మనస్సులో భయోత్పాతం కలిగించే భ్రమాత్మకమైన వారి ఆధిపత్య శక్తిని జ్ఞాపకం ఉంచుకోవాలి, అంతట భయాన్నంతా బయటకు విసరి వేయాలి. ఒకసారి నీవు వారిని ధైర్యంగా, జంకు లేకుండా ఎదుర్కొంటే, వారి కళ్ల లోకి సూటిగా చూస్తే, వారు వారి శక్తిలో మూడు వంతులు కోల్పోతారు. నీవు అప్పుడు మా సహాయాన్ని అర్థిస్తే, అప్పుడు ఆ అఖరి వంతు కూడా పోతుంది, వారు వారి కాళ్ళకు బుద్ధి చెప్పటం గాని లేదా విలీనమై అదృశ్యమై పోవటంగాని చేస్తారు.... కనుక మొత్తానికి సారాంశంలో, రెండు విషయాలను గుర్తు పెట్టుకో; ఎన్నడూ, ఎన్నడూ భయపడవద్దు, అన్ని పరిస్థితులలోను నిన్ను ధృఢంగా వంద రెట్లు అధిక బలవంతుడిగా చేయడానికి సరియైన సహాయాన్ని అర్థించు.

CWM 3:165-66 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

బాంధవ్యాలు

ప్రశ్న: మధుర మాతా! ఇద్దరు మనుషుల మధ్య ఉండవలసిన ఉత్తమమైన బంధమేది? తల్లీ కొడుకులదా? ఒక సోదరుడు లేక స్నేహితుడు లేక ప్రేమికుడు లాంటిదా?

అన్ని అనుబంధాలు సూత్రప్రాయంగా మంచివే. ప్రతి అనుబంధం అనంతుని ఒక అంశను వ్యక్త పరుస్తుంది. కానీ అసత్యము, స్వార్థపూరితమగు మానవ ప్రకృతితో ప్రతి అంశ వక్రీకరించబడి, చెడుగా పరిణమిస్తుంది, దాని వలన ప్రేమ యొక్క స్పందనలు తమ సంపూర్ణ స్వచ్ఛతతో వ్యక్తపడలేవు.

CWM 16:278

మీ రొక వ్యక్తితో కలిసి ఉంటారు. ఆ వ్యక్తి మీ కేదో చెపుతాడు. మీరు అందుకు వ్యతిరేకంగా ఏదో చెపుతారు. (సాధారణంగా అలా జరుగుతుంది. ఏదో వ్యతిరే కించాలని అలా అంటారు.) మీరు వాదించటం మొదలు పెడతారు. సహజంగానే మీరొక కొలిక్కి రాలేరు. మీ స్వభావం మంచిది కాకపోతే దెబ్బలాటకు దారి తీస్తుంది. కానీ అలా కాకుండా, మీ ఆలోచనలనూ, మాటలనూ పట్టుకొని వేలాడటం బదులు మీతో మీరు "కొంచెం ఆగు! నేను అతనెందుకు అలా చెప్పాడో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను. అవును, అతనలా ఎందు కన్నాడూ" అని చెప్పుకో గలిగితే, మనసును ఏకాగ్రం చేసి 'ఎందుకు? ఎందుకు? ఎందుకు?' అని ప్రశ్నించు కుంటూ అలా నిలబడతారు, ప్రయత్నిస్తుంటారు. మీ ఎదుటి వ్యక్తి మాట్లాడుతూనే ఉంటాడు కదా. అతను కూడా చాలా ఆనందంగా ఉంటాడు, ఎందుకంటే మీ రత నిని ఏ మాత్రం వ్యతిరేకించటం లేదు కాబట్టి! అతను అనర్గళంగా మాట్లాడేసి మిమ్మల్ని తప్పకుండా ఒప్పించ గలిగానని నమ్ముతాడు. అప్పుడు అతను చెప్పేది మీరు మరింత ఏకాగ్రంగా వింటారు. అతని మాటల ద్వారా క్రమంగా అతని మానసిక పరిధుల్లోకి చేరుకుంటారు. మీరు అతని మస్తిష్కం లోకి ప్రవేశించిన వెంటనే అతని ఆలోచనా విధానం లోకి అడుగిడతారు. ఆ తరువాత, ఊహించుకోండి, అతను అలా ఎందుకు మాట్లాడుతున్నాడో మీకు అర్థం అవుతుంది. మీకు చురుకైన మేధాశక్తి ఉంటే మీకు అంతకు ముందు తెలిసిన దానికి, మీరు అర్థం చేసుకున్న దానిని జత చేసినపుడు మీకు రెండు మార్గాలు కనిపిస్తాయి. ఆ రెండింటికి ఏకాభిప్రాయ

మగు సత్యాన్ని కనుగొన గలుగుతారు. ఇప్పుడు మీరు నిజంగా ప్రగతిని సాధించారు. మీ ఆలోచనలను విశాల పరచు కోవాటానికి యిదొక ఉత్తమ మయిన మార్గం.

మీ రొక వాగ్వివాదం లోకి దిగడానికి ప్రారంభించా లనుకుంటే తక్షణం మౌనం పాటించండి. మీరు నిశ్శబ్దంగా ఉండాలి. ఏమీ మాట్లాడ కూడదు. ఎదుటి వ్యక్తి ఆ విషయాన్ని ఎలా చూస్తున్నాడో గ్రహించే ప్రయత్నం చేయండి. మీరా విషయాన్ని చూసే విధానం మరచిపోరు. ఏ మాత్రం మరచిపోరు! కానీ మీరా రెంటినీ జత కూర్చి చూడ గలుగుతారు. ఇక మీరు నిజంగానే ప్రగతి చెందారు. నిజమయిన ప్రగతి.

CWM 5;220-21

అనవసరంగా విమర్శించట మనేది ఒక దురలవాటు, తప్పు పట్టటం, ఎదుటి వారిని ఖండించటం (తరచుగా తప్పుడు మార్గంలో). అది ఇరు వైపుల వారికీ చెడు వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. ఈ దురుసుతనం, దృఢమైన నమ్మకంతో ఖండించటం ఎందుకు? ప్రతి మనిషికీ అతనికుండే లోపాలు అతని కుండవా? ఎదుటివారిలో తప్పు లెన్నటానికి, వాళ్ళని ఖండించటానికి అంత ఆతృత ఎందుకు? కొన్ని సార్లు ఆలోచించాల్సి వస్తుంది, కానీ అది తొందరపాటుతో, తప్పులు వెదికే ధోరణిలో చేయకూడదు.

CWSA 31:351

ఎదుటి వారు చేసే దానిని ఎప్పుడూ చాలా తీవ్రంగా విమర్శించ గలుగుతారందరూ. నేర్పుతో తాము ఆ పొరపాట్లు చేయడం, తాము స్వయంగా తప్పించుకోకుండా మీరు ఇలా చేయాలి, అది చేయకూడదు అని చెప్పుకుంటారు. తరచుగా తమలో తాము తెలుసుకో లేని దోషాలను యితరులలో తేలికగా ఎత్తి చూపుతారు. మానవ మనస్సు తనను గురించిన ఎరుకను కలిగి ఉండడం అవసరం. అందుకే యోగంలో వ్యక్తి తనలో ఏముందోచూసి, తెలుసుకొని దానిని గురించిన ఎరుకను పెంచుకోవాలి.

CWSA 31:351

ఒక స్థితిలో మిమ్మల్ని సాధారణ జీవన స్థాయిలో తప్పనిసరిగా ఉంచగలిగే సంభాషణలు శిరోవేదనను కలిగిస్తాయి, కడుపులో అలజడి కలిగిస్తాయి. అది కొన సాగితే మీకు జ్వరం గూడా రావచ్చు. నేను ఉబుసుపోని కబుర్ల గురించి చెప్తున్నాను. ఏదో కొంతమంది తప్ప చాలామంది యిటువంటి సంభాషణలలో ఆసక్తి చూపి

మౌనంగా ఉండవలసిన చోట, ఇతర విషయాల గురించి అనవసరంగా మాట్లాడుతూ ఉంటారు. లేదా ఎంత స్వాభావికం అవుతుందంటే మీకు దాని వలన ఏమి యిబ్బంది కలగదు. కానీ యిలానే కొనసాగితే మీ చేతన ఎదగటం పూర్తిగా ఆగి పోతుంది. మిమ్మల్ని మీరు యినుప సంకెళ్ళతో సాధారణ చేతనలో బంధించు కుంటారు, అవచేతనలో జరగవలసిన శుద్ధి కార్యం జరగదు, కనీసం ప్రారంభం కాదు. ఊర్థ్వ గతిలో పురోగమించా లనుకునే వారికి ముందుగానే సరిపడినన్ని ఆటంకా లున్నాయి, బయటనుండి ప్రొత్సాహం కోసం చూడకుండానే.

CWSA 4:152-53

నిన్ను నిమ్న స్థాయికి దిగజారమని, తనతోపాటు తెలివి తక్కువ పనులు చేయమని లేక తనతోపాటు చెడుమార్గంలో పడమని, నువ్వు చేసే దుష్కర్మలను పొగిడేవాడిని నిజమైన స్నేహితుడు కాదనేది స్పష్టంగా తెలుస్తుంది కదా. నిజంగా నువ్వెప్పుడూ నీకన్నా తెలివైన వాళ్ళను, ఎవరి సాహచర్యంలో నువ్వు ఆత్మ సంయమనాన్ని సాధించి ప్రగతి చెందగలవో, ఎవరు మరింత ఉన్నతంగా నీ నడవడిని తీర్చి దిద్ద గలరో, మరింత స్పష్టమైన అవగాహన కలిగించ గలరో, అటువంటి వారి సాహచర్యాన్ని ఎన్నుకోవాలి.

CWM 9:56- 57

ఎదుటివారితో మరీ సన్నిహితంగా మెలగటం వలన వారు సరియైన దృక్పథాన్ని కలిగి ఉండనపుడు, ప్రాణిక చేతనలో నివసించే వారయినపుడు క్రింద స్థాయికి దిగ జారడం జరుగుతుంది. నీ కెన్ని సంబంధా లున్నప్పటికీ నువ్వు నీ అంతరంగంలో ఉండటం అలవరచుకోవాలి, నిష్పక్షపాత వైఖరి నవలంబించాలి. పనిలో తలెత్తే కష్టాలవల్ల గానీ, వ్యక్తుల నడవడి వలన కలిగే సమస్యల వలన గానీ యిబ్బంది పడ కుండా నిన్ను నువ్వు సరియైన మార్గంలో ఉంచుకో గలగాలి.

CWSA 31: 325

ఎవరు ఏమన్నా గానీ, ఏమి చేసినా గానీ లేక బాహ్యవిషయాల వలన ఆనందం లేక దుఃఖం, సుఖం లేక కష్టం కలిగినా అలజడి చెందకూడదు.

CWSA 31: 335

ఒకవేళ నిన్నెవరైనా అవమానించా రనుకో, ఈ అవమానాలను నువ్వు ఎదుర్కో గలిగితే, నీవు నిశ్చలంగా నుండగలవు. (కేవలం బయటకు మాత్రమే కాదు, సమగ్రంగా

అని నా భావం) ఏ విధంగానూ చలించకుండా, వాటి ప్రభావానికి లోను గాకుండా ఉండ గలగాలి. వ్యతిరేకంగా ఎవరూ ఏమి చేయలేని ఒక శక్తిలా అచ్చట నిలుచోవాలి. సమాధానం యివ్వకుండా, కదలిక లేకుండా, ఒక్కమాటైనా మాట్లాడకుండా. అప్పుడు నీమీదకు ప్రయోగించబడిన అవమానాలన్నీ నిన్ను ఏమాత్రం అంతరంగంగానూ, బాహ్యంగానూ ప్రభావితం చేయకుండా వెళ్ళిపోతాయి. నీ హృదయ స్పందనలను ప్రశాంతంగా ఉంచుకో గలవు. నీ మస్తిష్కంలోని ఆలోచనలను నిశ్చలంగా, ప్రశాం తంగా, ఏమాత్రం అలజడి లేకుండా ఉంచుకోగలవు, అనగా నీ మేధ అదే విధమయిన ప్రకంపనలతో వెంటనే సమాధానం యివ్వదు, నీ నరాలు తమను తాము ఉపశమింప

మనం యింకా సరిక్రొత్తగా సాధించ వలసిన దేమిటి?

దివ్య ప్రేమ: ఎందుకంటే, మనం ఇంతవరకు కేవలం ద్వేషాన్ని, స్వోత్కర్షను మాత్రమే సాధించాము.

దివ్యజ్ఞానం: ఎందుకనగా మన మింతవరకు పొరపాటును, గ్రహణశక్తిని, ఊహాకల్పనను మాత్రమే సాధించాము.

బ్రహ్మానందం : ఎందుకనగా మన మింతవరకు సుఖానుభూతిని, బాధను, ఉదాసీనతను మాత్రమే సాధించాం.

దివ్యశక్తి: ఎందుకనగా ఇంతవరకు మనం బలహీనతను కృషిని, భంగ పరచబడిన విజయాన్ని మాత్రమే సాధించాం.

దివ్యజీవనం: ఎందుకనగా ఇంత వరకూ మనం జన్మించటం, ఎదగటం మరణించటం మాత్రమే సాధించాం.

దైవిక సంయోగం: ఇంతవరకు మనం పోరాటాన్ని, సన్నిహితత్వాన్ని మాత్రమే సాధించాం.

ఒక్కమాటలో చెప్పాలంటే దివ్యత్వాన్ని సాధించాలి, భగవత్స్వరూపులుగా మనలను మనం తీర్చిదిద్దుకోవాలి

CWSA 13: 200-01 — శ్రీఅరవిందులు

అనువాదం: ఢా. సరోజాప్రసాద్

చేసుకొనుటకు తిరిగి దెబ్బ తీయవలసిన అవసరం ఉండదు. నువ్వలా ఉండగలిగితే నీలో ఒక సుస్థిర శక్తి నెలకొంటుంది. ఆ శక్తి అవమానాన్ని అవమానంతో ఆందోళనను ఆందోళనతో దెబ్బని ఎదురుదెబ్బతో సమధానం చెప్పగల శక్తి కన్నా అనంత శక్తి వంత మైనదిగా నుంటుంది.

CWSA 4: 368-69 అనువాదం: డా. సరోజాప్రసాద్

బాధపడడం

శత్రుత్వం వల్లగానీ, పాపంవల్లగానీ శిక్షగా బాధ విధించబడుతుంది అనే ఆలోచన తప్పు. జీవితంలో భాగంగా సంతోషం ,అదృష్టం వచ్చినట్టే అజ్ఞాన జీవితంలో భాగంగా బాధ కూడా తప్పనిసరిగా వస్తుంది. ద్వంద్వాలైన ఆనందం, బాధ, సంతోషం, దుఃఖం, అదృష్టం, దురదృష్టం అన్నీ అజ్ఞానం యొక్క అనివార్య ఫలితాలు. ఇవి మనల్ని దైవం నుండి, నిజ చైతన్యం నుండి వేరు చేస్తాయి. వీటి వైపు తిరిగి చేరడం ద్వారా మాత్రమే బాధను వదిలించుకోగలం. గత జన్మల కర్మ ఉంటుంది. ఇప్పుడు జరుగు తున్న దానిలో అధిక భాగం దాని కారణంగానే జరుగుతుంది, కాని అంతా కాదు. మన స్వయంకృషి వల్ల, చైతన్యం వల్ల, ప్రయత్నాల వల్ల మన కర్మను మనం సరి దిద్దుకోగలం. నిప్పుతో ఆడితే కాలడం ఎంత సహజమో, అలాగే మనం చేసిన పాత తప్పుల వల్ల బాధ పడడం అంత సహజం. అంతే గాని అది శిక్ష కాదు. ఇది అనుభవంలో ఒక భాగం. దీని వల్ల అంతరాత్మ దాని పనిముట్ల ద్వారా, దైవం వైపు మరలే వరకు, ఎంతో నేర్చుకుని ఎదుగుతుంది.

CWSA 31:670

అస్తిత్వానికి తగిలే తాకిడులను, తత్ఫలితంగా కలిగే కుంచించుకపోవడం, తరిగి పోవడం లాంటి దుష్ఫలితాలను మనలోని చేతనా శక్తి దీటుగా ఎదుర్కోలేక పోవడంతో బాధ కలుగుతుంది. అందుకు మూల కారణం మన అవగాహనా లోపంతో ఏర్పడిన అహంకారం ఆత్మశక్తిని పరిమితం చేయడంతో గ్రహణ శక్తిలోను, స్వాధీనపరచుకొనే సమర్థతలోను అసమత్వం ఏర్పడుతుంది. బాధను నిర్మూలించి ముందుగా జుగుప్సకు (అసహనం, రోత) బదులుగా తితీక్ష (ఓర్పు) వహించాలి, అనగా తాకిడులతో కుంచించుక పోవుటకు, కరిగి పోవుటకు మారు వాటిని ఓర్పుకొని



స్వచ్ఛమైన ఆధ్యాత్మిక చెలమలందు
పొంగిన ప్రగాఢమగు దివ్యప్రేమ
అజ్ఞానపు అగాధాల పరితాపాన్ని పరిహరించింది.
అమరమైన హాసమందు అంతమొందింది సంతాపం.

CWSA 33:314 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

జయించాలి. ఇట్టి ఓర్పుం, విజయాలతో మనం సమత్వం సాధించగలం. అట్టి సమత్వం రెండు విధాలుగా ఏర్పడవచ్చు. తాకిడులను లక్ష్యపెట్టక పోవడం లేక వాటిని సంతోషంగా స్వీకరించడం. ఈ సమత్వం తిరిగి ఆనందాన్ని, బాధను సంతోషంగా స్వీకరించగలిగే అహం చేతన స్థానే చోటు చేసుకొనే సంపూర్ణ దివ్యానందమయ సచ్చిదానంద చేతన మూలంలో దృఢంగా స్థిరపడాలి.

CWSA 22:117

ప్రధానంగా ఉపరితల సత్తాలో తగినంత చైతన్యశక్తి లేకపోవడం ఫలితంగా వేదన, బాధపడడం సంభవిస్తుంది. దీనివల్లే ఉపరితల సత్తా, ఆత్మ తోను, ప్రకృతితోను సవ్యంగా వ్యవహరించలేక పోతుంది, లేక తాను స్వయంగా విశ్వవ్యాప్తమైన దైవశక్తితో ఇమడ లేక పోతుంది, సంబంధాలతో సామరస్యం సాధించలేకపోతుంది. సమగ్ర సత్తా యొక్క దైవశక్తి, ప్రకాశవంతమైన దివ్యచేతనాశక్తి మనలో సాక్షాత్కరించినపుడు వీటికి ఉనికి వుండదు.

CWSA 22:622

బాధ పడటానికి మొదటి కారణం అజ్ఞానం, అవిద్య. రెండవ కారణం దైవసత్తా, దైవచైతన్యం నుండి వ్యక్తిగత చైతన్యం వేరుపడటం. ఇది అవిద్య, అజ్ఞానములచే ఏర్పడ్డ వేర్పాటు భావం. ఎప్పుడు ఈ వేర్పాటు భావం పోతుందో, ఎప్పుడు వ్యక్తి పూర్తిగా దైవంలో వసిస్తాడో, ఎప్పుడు వ్యక్తి ఇంకెంతమాత్రం తన అల్పమైన ఆత్మలో వసించడం మానుతాడో అప్పుడే వేదన, బాధ పడడం ఆగిపోతాయి.

CWSA 28: 5-527

శ్రీఅరవిందులు

వేర్పాటు భావన వలననే వేదన, బాధపడడం, దైన్యం, అజ్ఞానం, అన్ని అసమర్థతలు సంభవిస్తాయి. పరిపూర్ణ ఆత్మార్పణ, అట్టి భావనలో తనను తాను మర్చిపోవడం వల్లే బాధ అదృశ్యమౌతుంది. దానికి బదులుగా ఏదీ మరుగు పరచలేని ఆనందం వస్తుంది.

ఈ ఆనందం ప్రపంచంలో స్థిర పడ్డాక మాత్రమే అందులో నిజమైన పరివర్తన సరి కొత్త జీవితం, కొత్త సృష్టి, కొత్త అనుభవాలు ఏర్పడుతాయి. దీనికి మొదట ఆనందం చైతన్యంలో స్థిరపడాలి. తరువాతే భౌతిక పరివర్తన చోటు చేసుకుంటుంది. అంతకుముందు కాదు.

నిజం చెప్పాలంటే, ఈ ప్రపంచంలో ప్రతికూలత మూలంగానే బాధపడడం ఏర్పడింది. ఆనందమే దీనిని తుడిచి పెట్టగలదు, ఇంకేమీ కాదు. ఆనందం మాత్రమే తప్పకుండా, చివరిగా తుడిచి పెట్టగలదు.

సృష్టికి కారణం దివ్యానందమే. సాధించేది దివ్యానందమే.

దేనిని సాధారణంగా మనుషులు ఆనంద మంటారో దానిని గూర్చి కాదు నేను చెప్పేది. ఇది గమనించండి. వ్యంగ్యంగా చిత్రీకరించడం, వ్రాయడం కూడా కాదు ఆనందం అంటే. ఇవన్నీ హానికరమైన కల్పనలు. ఇవి తప్పుదారి పట్టిస్తాయి. మరుపు, విముఖత్వం, బాహ్య విషయాలవల్ల వచ్చే సంతోషం ఇందుకు కారణం. నేను ఒక పరిపూర్ణ ప్రశాంతమైన ఆనందం గురించి, నీడలేని వెలుగు గురించి సామరస్యం గురించి, పరిపూర్ణ సౌందర్యం గురించి, ఆపలేని శక్తిని గురించి మాట్లాడుతున్నాను. ఈ ఆనందం స్వయంగా దైవం యొక్క ఉనికి, దైవ సంకల్పం, దైవ సాక్షాత్కారం.

CWSA 7: 396-97 శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

బాధపడడం, బాధను వాంఛించడం, దానిని ఆనందంగా అనుభవించే లక్షణ మేదైతే, నీలో ఉన్నదో అది మానవ ప్రాణికంలో భాగం. ఇటువంటి విషయాలనే మనం కపటమని, ప్రాణికం వక్రీకరించి మెలిక వేసే లక్షణమని అంటాం. అది విచారానికి, కష్టానికి వ్యతిరేకంగా నిరసనను ప్రకటిస్తుంది. దైవాన్ని, జీవితాన్ని మిగిలిన ప్రతిదానిని తనకు వేదన కలిగిస్తున్నదని నేరారోపణ చేస్తుంది. కానీ చాలావరకు విచారము, కష్టము, సంభవించడానికి, నిలువడానికి కారణం ప్రాణికంలోని వక్ర లక్షణమేదైతే వాటిని వాంఛిస్తుందో, అది! ప్రాణికంలోని ఈ మూలకం సంపూర్ణంగా విసర్జించబడాలి.

*

అవును, అది ఆ విధంగానే వుంటుంది. (మనుషులు దైవానికి ఉన్ముఖులు కాకుండా తమంతట తాము బాధను, దుఃఖాన్ని పరోక్షంగా ఎన్నుకుంటారు) అదీగాక, జీవితంలో బాధ లేకపోతే, ప్రాణిక చేతనలోని ఏదో ఒక పార్శ్వం జీవితం సాఫీగా సాగుతున్నదనే అనుభూతిని పొందలేదు. భయం చెందేది, ఏవగించుకొనేది, భౌతికం. కానీ ప్రాణికం

వాటిని కేళీ విలాసంలో భాగంగా స్వీకరిస్తుంది.

*

జీవిత నాటకాన్ని ఆనందంగా అనుభవించేది. ప్రాణికం. దుఃఖించడంలో, బాధ చెందడంలో కూడా అది ఆనందం పొందుతుంది. అది కృంగుబాటు వలన కలిగే పరివర్తన, విముఖత కాదు, అంగీకార సూచన. ప్రాణికంలో కూడా విముఖత ప్రదర్శించే చిత్త వృత్తులుండటం కద్దు. వాటిల్లో అది ఆనందం పొందుతుంది. ఏ భాగమైతే బాధపడటాన్ని సహించదో, బాధను తప్పించుకోవడంలో సంతోష పడుతుందో, అది భౌతిక చేతన. అయితే, దానిని ప్రాణికం సదా ఎగదోస్తుండటం వలన అది తప్పించుకోలేక పోతుంది.

*

విముఖత ప్రదర్శించటడానికి, కృంగుబాటును అంగీకరించటానికి కారణం రాజసిక తమోగుణ ప్రధానమైన ప్రాణిక అహంకారం. ఇక్కడ, విముఖతకు ప్రబలమైన కారణం రజోగుణం. కృంగుబాటుకు ప్రబలమైన కారణం తమోగుణం.

*

అన్ని రకాల నిట్టూర్పుల్లో, రోదనల్లో, విచారాల్లో, బాధల్లో ఆనందం పొందేది ప్రాణికం లేదా దానిలోని ఏదో ఒక పార్శ్వం కానీ అంతరాత్మ కాదు.

*

బాహ్యంలో ప్రకటితమయ్యే స్వభావం కాదు, నిట్టూర్పులో, రోదనలో ఆనందం పొందేది. అంతరంగంలోని దేదో "నవ్వు లొలక బోసే, కన్నీళ్ళు కార్చే," సంతోషం మరియు విచారం, ఆహ్లాదం మరియు ఆవేదన. ఒక్కమాటలో చెప్పాలంటే, అజ్ఞాన పూర్వకమైన లీలా విలాసాన్ని ఆనందంగా అనుభవించేది. కొందరిలో ఇది కొంత మేర పైకి ప్రకటిత మౌతుంది. చాలామంది జీవితంలో బాధను లుప్తం గావించే విషయాన్ని వారికి ప్రతిపాదిస్తే, ప్రశ్నార్థకంగా చూస్తారు; జీవితంలో కేవలం సంతోషం, దివ్యానందం, ప్రశాంతత తప్ప మరేమీ లేకపోతే విసుగు పుట్టించేదిగా నుంటుందని భావిస్తారు. అనేకులు అలా చెప్పారు కూడా.


CWSA 31:178

మనిషికున్న మేధ మరియు తార్కిక గుణాల కారణంగా అతనిలో ఆలోచించ గలిగే మనస్సు లేక బుద్ధి, అసంపూర్ణంగానైనా శక్తిమంతమై వుంటుంది. అది మేధ,

మరియు తార్కిక నియమానుసారంగా, తాను ఆ నియమాల్ని అర్థం చేసుకోగలిగిన విధంగా తాను నడచుకొనుటకు లేక ఇతరులను కూడా ఆ విధంగా వర్తింపచేయుటకు ప్రయత్నిస్తుంది. అందుకు భిన్నంగా ప్రాణికం కోరికలకు, మనోభావాలకు, తీవ్రప్రేరణలకు, భావోద్రేకాలకు, సంవేదనలకు, జీవిత సాఫల్య ప్రయత్నాలను స్వంతం చేసుకోవాలి, అనుభవించాలి, అనే వాంఛలకు సంబంధించినది. అవే దాని కార్యాచరణ, దాని స్వభావం. మనలోని ఈ పార్శ్వమే. జీవిత సుఖాలకై వెంపర్లాడుతుంది, దాని కదలికలపై దృష్టి సారిస్తుంది. ఈ ప్రయత్నమంతా కేవలం వాటి అనుభూతిని పొందాలనే. సంతోషాన్ని మాత్రమే కాదు, అంతకు మించిన దానినే కాక, బాధను సైతం కలగ జేసినా అది వాటిపై పట్టు వదలడానికి ఇష్టపడదు. జీవిత నాటకంలో భాగంగా, యదేష్టంగా బాధను భరించ గలిగే, కన్నీరు కార్చ గలిగే సత్తా కలిగి వుంటుంది. అలాంటప్పుడు ఆలోచించ గలిగే మేధాశక్తికి, ప్రాణికానికి మధ్య సమానమైన ఆమోదయోగ్యమైన లక్షణ మేముంటుంది? ప్రాణికం మేధాశక్తికి ఎందుకు విధేయత కలిగి వుండాలి? తన స్వీయ ప్రవృత్తిని ఎందుకు అనుసరించదు? అనుసరించక పోవడం అనేది అగస్టిన్ సూచించినట్లుగా అర్థంకాక పోవడానికి బదులు అతి సహజమైనదిగా నుంటుంది.

CWSA 28:175 శ్రీఅరవిందులు

ఎవరైతే హృదయపూర్వకంగా దైవానికి విధేయులై వుంటారో, ఎవరు నిజంగా సాధనాస్ఫూర్తితో జీవిస్తారో, వారి చేతనను, ధ్యేయాన్ని, దైవంపై, దైవకార్యాచరణపై కచ్చితంగా నిలుపుతారో వారికి మాత్రమే దైవం రక్షణ కల్పించగలదు. ఉదాహరణకు, కోరికలు కలిగి వుండటం, వారివారి ఇష్టాఇష్టాలపై సౌలభ్యత ప్రాధాన్యత చూపడం, నాటకీయమైన మోసపూరితమైన, కదలికలపై మక్కువ చూపడం లాంటివన్నీ దైవరక్షణ పొందటంలో అతి పెద్ద అడ్డంకులుగా నిలుస్తాయి. ఒకవేళ నీవు నీ సంకల్పాన్ని దైవంపై విధించటానికి ప్రయత్నిస్తే, అది నీపై నీవు ఒక విస్ఫోటక గోళాన్ని పడేసుకున్నట్లుగా నుంటుంది. కచ్చితంగా విషయాలు ఈ విధంగానే జరుగుతాయని నేను అనను, కానీ మనుషులు ఎరుక కలిగి, జాగరూకులుగా నుండకపోతే, నిజమైన ఆధ్యాత్మిక ఆసక్తిపరుడికి నుండవలసిన స్ఫూర్తితో మెలగక పోతే, ఆ విధంగా జరిగే అవకాశం మెండుగా నుంటుంది. బయటిప్రపంచంలో లాగానే లోపల మానసిక వాతావరణం కూడా వున్నట్లయితే, అందులో ప్రమాదకారకమైన, బాధను కలిగించే,



సర్వనాశనం చేసేటటువంటి విషమ పరీక్షలను రూపొందిస్తున్న ఆసురిక శక్తుల దాడి నుండి రక్షణ కల్పించే దృఢమైన అడ్డుగోడను నిర్మించే అవకాశం వుండదు.

CWSA 13:121 శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సూచనలతో, శక్తులతో, నిరంతరం ఘర్షణ పడే స్థితికి అలవాటు పడకూడదు. మనుషులు అతి సులువుగా ఇందులో పడి, ఒక అలవాటుగా చేసుకుంటారు. 'ప్రాణిక పార్శ్వం' నా పై దాడి జరిగింది, అధిక భారం మోప బడింది, బాధ కలిగింది, దుఃఖితుడనైనాను, నా గతి ఎంత విషాదకరమయింది! ఓ భగవాన్! నీ వెందుకు సహాయపడవు? సహాయం లేదు, దైవకృప కూడా లేదు? నేను నా దౌర్భాగ్యానికి, నా పతనానికి వదిలి వేయబడ్డాను. వగైరా వగైరా అని కేకలేస్తూ, ఒక విధమైన ఉత్తేజిత సంతృప్తిని పొందుతుంది. ఇంకొక సాధకుడు ఈ స్థితికి దిగజారాలని నేను కోరను. అందుకని పిలుపు నిస్తున్నాను. 'ఆగు,' అని — ఈ విధమైన ఎడతెగని పోరాటంలో చిక్కుకునే ముందు. ఈ శక్తులు కోరేది ఇదే, దిక్కులేని ఓటమి పాలైన, తలకు మించిన భారం మోప బడిన దౌర్భాగ్యపు అనుభూతిని నీకు కలిగించడం. నీవు దానిని అనుమతించ కూడదు.

CWSA 29: 80

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

జీవితం అస్థిరంగా నున్నప్పుడు

జీవితం స్థిరంగా సాగనప్పుడు, అనగా, నీలో ఏమి జరుగుతున్నదో నీకు తెలియనప్పుడు, నీలో కొన్ని అస్పష్ట భావనలు ఏర్పడినప్పుడు, నిన్ను నీవు ప్రశ్నించుకుంటే "నే నెందుకలా ఆలోచించాను? నా కెందు కలాంటి అనుభూతి కలిగింది? నేనెందు కలా చేసాను?". అప్పుడు సాధారణంగా, నూటికి తొంబై తొమ్మిది సార్లు, అన్ని వేళల్లో వచ్చే సమాధానం ఒక్కటే – "నాకు తెలియదు, అది అలా వచ్చింది, అంతే".

చెప్పాలంటే, నీవు ఏ మాత్రం కూడా ఎరుక కలిగి లేవన్న మాట.

నీవు ఇతరులతోనున్నప్పుడు, నీ నుండి ఏమి వస్తున్నది, ఇతరులనుండి ఏమి వస్తున్నది, గ్రహించ గలుగుతున్నావా? ఎంతమేరకు వారి అస్తిత్వవిధానం, వారి ప్రత్యేక లక్షణం నీ పైన పనిచేస్తున్నది? దానిని గురించి నీకే మాత్రం ఎరుక లేదు. నీవు "ఇంతో, అంతో", లాంటి చైతన్యంలోనే వున్నావు. సగం మెలుకువగా, సగం నిద్రావస్థలో, ఒక విధమైన అస్పష్ట ధోరణిలో, విషయాలను పట్టుకొనడానికి తడబడుతున్నావు. కానీ నీలో ఏమి జరుగుతున్నదో, ఎందుకు జరుగుతున్నదో అనే దానిపై స్పష్టమైన అవగాహన వున్నదా? నీలో నుండి వచ్చే ప్రేరణల గురించి అవగాహన వున్నదా? అది నీ ఆలోచనా సరళిని మారుస్తాయా? నీ వొక విధమైన మసక బారిన అస్థిర జీవనంలో వున్నావు. కొన్ని చిన్న పరిణామాలు నీ చేతనలో ఘనీభవించినప్పుడు, వాటిని క్షణమాత్రం పట్టుకోగలుగుతావు. అవి లిప్తమాత్రం తెర మీద బొమ్మ కనపించినంత స్పష్టంగా నుండి, మరు క్షణం అస్పష్టం, అసమగ్రం అవుతాయి. కానీ అది నీకు తెలియదు. ఎందుకనగా కనీసం నిన్ను నీవు ప్రశ్నించుకోలేదు గనుక, నీ జీవన విధానంలో అలా వుంది గనుక. అది ఇక్కడ ఆగిపోతుంది, ఇక్కడే ప్రారంభమవుతుంది, ఇక్కడే ముగుస్తుంది. అంతే. నీవు ప్రతి రోజూ ,ప్రతి నిముషం, చేయవలసిన పనులను చేస్తుంటావు. ఆ విధంగానే అన్ని పనులు జరుగుతూ వుంటాయి.

అది వస్తుంది, అది వస్తుంది. తప్పకుండా వస్తుంది. నేను నిన్ను అలా వదిలేది

లేదు.... నిన్ను కొద్దిగా కదిలిస్తాను. అందుకు అవసరమైన దాన్ని నేను చేస్తాను. అక్కడ వున్నాం మనం.

CWM 6: 336

శ్రీమాత

అనువాదం: జి.వి. ఎస్. వి. ప్రసాదరావు

అహమే అడ్డంకి

అహం దాని పీఠం నుండి క్రిందకు దిగటానికి ఇష్టపడకపోవడం వలననే అన్ని అనర్థాలు సంభవిస్తున్నాయి.

*

జరిగేదంతా మనకు ఓకే పాఠాన్ని నేర్పుతుంది. అహాన్ని వదిలించుకో లేకపోవడం వలననే మనకు ఇతరులకు శాంతి లేకుండా పోయిందని. అహం లేకపోతే జీవితం అత్యద్భుతంగా వుంటుంది.

*

అహం మనతో ఆడుకోవడం వలన వైషమ్యాలు జీవిస్తూ వుంటాయి. ఇట్టి చాంచల్యానికి మన ప్రాణికం అవకాశం ఇవ్వకపోతే జీవితంలో అంతా స్థిరంగా వుంటుంది, నాటకీయత ఉండదు.

*

నీకు వచ్చిన కష్టాలను బట్టి నీలో ఎంత అహం వుందో తెలుసుకోవచ్చు!

*

ప్ర: దివ్యమాతా, నా అహం నా మార్గాన్ని ఒక భూతంలా అడ్డగిస్తున్నది. నేను దాన్ని దాటి ముందుకు పోలేకుండా ఉన్నాను. నేను దాన్ని ఎలా జయించాలి?

స: "దానిని లేక్క చేయకు. ముందుకు సాగిపో."

*

అహాన్ని దాటటం అంత సులభం కాదు. భౌతిక చేతనలో దాన్ని దాటగలిగినా అది ద్విగుణీకృతమై ఆధ్యాత్మికంలో మళ్ళీ ఎదురౌతుంది.

CWSA14: 257-58

ఏ మాత్రమైన బాధ గాని, ఇబ్బంది గాని నీకు ఎదురైనా నీలోని అహం నీ అస్తిత్వపు వాకిలిని బార్లా తెరిచి నిస్సిగ్గుగా దుష్టశక్తులను లోనికి ఆహ్వానిస్తుంది. పవిత్రమైన, అందమైన, ముఖ్యంగా నీ అంతరాత్మ ఆకాంక్ష దైవకృప అందించే సహాయం పైన బురద, పంకిలం చల్లుతుంది. నీ లోని పవిత్రతను, నీ పనిలోని చక్కదనాన్ని కలుషితం చేస్తుంది.

దీన్ని ఇలాగే కొనసాగనిస్తే అది సర్వ నాశనం జరిగినదాకా ఆగదు. దీన్ని అంతం చెయ్యాలంటే బలమైన విధానాలు అనుసరించాలి. నీలోని ఆత్మ మేల్కొని అహంపై నీవు తలపెట్టిన యుద్ధంలో నీకు పూర్తిగా తోడ్పడాలి. దాని వలన తెరువబడిన అస్తిత్వపు ద్వారాన్ని మూసి వేయటం జరగాలి. అప్పుడే దుష్ట శక్తులు నీలో ప్రవేశించటం ఆగిపోతుంది.

CWSA 15: 23

*

అహంలో జీవిస్తూ, అహం కోసమే బ్రతుకుతూ, దాన్నే తృప్తి పరచాలనుకునే వాడు ఒక పనికి మాలిన మూర్ఖుడు. అహం మీద నీవు పైచేయి సాధిస్తేనే లక్ష్యాన్ని చేరుకోవాలనే నీ ఆశ నెరవేరుతుంది. అహం నీలో ఉండటానికి నీ చేతనలో అవకాశం లేకుండా చేయగలిగితే నీ లక్ష్యాన్ని చేరటానికి బలం చేకూరుతుంది.

*

ఒక్కొక్కసారి 'అహం' లేకుండా వ్యక్తికి చేతన ఏర్పడదేమో అనే సందేహం వస్తుంది. కాని 'అహం' రాగానే దానితోపాటే అన్ని అడ్డంకులు, బాధలు, కష్టాలు కూడా వచ్చి పడతాయి. అవి దివ్యత్వ సాధనలో వ్యతిరేకంగా పనిచేసే శక్తులు. కాని ఇంకోవిధంగా చూస్తే, ఇట్లాంటి వ్యతిరేక శక్తులే సాధనకు బలం చేకూరుస్తాయి. అంతర్గత పరిశుద్ధతను పెంచి 'అహం' అడ్డురాకుండా చేసుకొనే బలాన్ని అవే చేకూరుస్తాయి. ఈ దుష్టశక్తుల ఫలితంగానే 'అహం' రూపు దిద్దుకుంటుంది. ఈ శక్తులు కొనసాగడం వల్లనే 'అహం బలపడుతుంది.' 'అహం' పోయినప్పుడే దానితో పాటు వ్యతిరేక శక్తులు కనుమరుగౌతాయి. ఇక అవి ప్రపంచంలో లేకుండా పోతాయి.

ఆ విధంగా అంతరంగ స్వేచ్ఛ, పరిశుద్ధత, నిజాయితీ సాధిస్తే, మన బాధలన్నీ మాయమవుతాయి.

అటువంటి మానసిక స్థితిలో 'చేతన' దాని అంతిమ లక్ష్యాన్ని చేరుకోగలదు.

CWSA 3:216 అనువాదం: కె.ఆర్.ఎల్. నరసింహారావు

"నాకేమి తెలియదు"

ఎంతో కష్టపడి పైకి వచ్చిన ఒక నిజమైన శాస్త్రవేత్తను నీవు కలుసుకున్నప్పుడు, అతను నీతో అంటాడు. "మనకేమి తెలియదండీ, రేపు తెలుసుకోబోయే విషయాన్ని బట్టి చూస్తే నేడు మనకు తెలిసింది చాలా స్వల్పం. మరు సంవత్సరానికి ఈ సంవత్సరపు అన్వేషణలు పాతబడి పోతాయి." ఒక యదార్థమైన శాస్త్రవేత్తకు బాగా తెలుసు, తాను తెలుసుకున్న వాటికంటే తనకు తెలియని విషయాలు చాలా వున్నాయని. మానవ కార్యక్రమాలలోని అన్ని విభాగాలలో ఇది కడు వాస్తవం. పేరెన్నిక గాంచినప్పటికీ ఒక గర్విష్ఠియైన శాస్త్రవేత్తను నేను ఏ నాడు కలుసుకోలేదు. ఎంతో కొంత ప్రజ్ఞ కలిగి "నాకంతా తెలుసు" అనే మనిషిని నేను ఎన్నడూ కలువలేదు. "నిజంగా నాకేమీ తెలియదు." అని ఒప్పుకునే వారు మాత్రమే నాకు తారసిల్లారు. తాను చేసినదంతా, తాను సాధించినదంతా విడమర్చి చెప్పి కూడా అతను ఎంతో వినమ్రంగా "ఏమైనప్పటికీ, నాకు తెలిసింది స్వల్పం." అని అంటాడు.

CWM 5: 29

నీకు తెలుసా! నీకంటే ప్రకృతికి ఊహాశక్తి ఎక్కువని. ఆమె ఎల్లప్పుడూ క్రొత్త వస్తువులు ఊహాకల్పన చేస్తూ ఉంటుంది. అందుకే కాలంతో పాటుగా ప్రతీదీ మారుతూ, ఉంటుంది. సమస్త సంయోజనాలు నిత్యనూతనంగా ఉంటాయి. ఈ విశ్వగమనంలో ఏ రెండు లిప్తలూ ఒకేలా ఉండవు. ఆమె కల్పనాశక్తి అమోఘం. నీ వెన్నడూ దాన్ని గురించి ఆలోచించలేదా? ఎప్పుడైనా నీకు ఒకే రకమైన రెండు క్షణాలు సంభవమైనాయా? లేదు. నీవు నిన్నటిలా ఈ రోజు లేవనీ మరియు నేటిలా రేపుండవనీ నీకు బాగా తెలుసు. నీవు వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు — ఒక పది సంవత్సరాలు అనుకుందాం — బహుశా నిన్ను నీవు పోల్చుకోలేవేమో. అన్ని విషయాలను ఆలోచించేవాడినని ఒప్పుకున్నప్పటికీ నీవు దేనిని గురించి ఆలోచించిచేవాడివో, కచ్చితంగా చెప్పలేవు!

అయితే ఇక్కడ సమస్య అంటూ ఏమీ లేదు. చేయవలసిందల్లా నీకు అందించబడిన పరిమితమైన అనుభవ క్షేత్రంలో జరిగిన వాటి సంభావ్యతలను పరిశీలన చేసేందుకు ప్రయత్నించడం, వాటిని నమోదు చేయడం ప్రారంభించడం. అదంతా ఒక పెద్ద గ్రంథం అవుతుందని నీవు వెంటనే గ్రహించగలుగుతావు. అవి కేవలం నీదైన ఆ చిన్ని అనుభవ క్షేత్రంలోని సంఘటనలు.

మరి నీ వేంటి? ఈ అనంతత్వంలో ఒక్క లిప్త మాత్రమే.

CWSA 5:225-26

శ్రీమాతా, ఒకడు తాను శక్తి హీనుడనని తలచినప్పటికీ ఏదో ఒకటి అతడు శక్తివంతుడని నమ్ముతుంది.

అయితే? ఆ నిజమే, నిజమే! నిష్కపటంగా ఉండగలుగుట ఎంత కష్టం! అందుకనే భాధలనేవి ద్విగుణీకృత మౌతాయి. ఒక్కోసారి మరీ తీవ్రతర మౌతాయి. ఎందుకనగా నీలోని మూర్ఖత్వాన్ని తొలగించేందుకు అదొక్కటే మార్గం గనుక. ఆపదలు సంభవించుటకు ఇదే కారణమని చెప్పటానికి ఋజువు ఇదే. నీవు ఏదో కొంత తీవ్రవేదనకు లోనైనపుడు, ఏదో నిన్ను బాగా కలచివేసేముందు, అది నీ అంతరాలలో ప్రభావం చూపి నీలోని మూర్ఖత్వాన్ని కొంత కరిగించి వేస్తుంది. అయితే నీవన్నట్లు నీలోని ఎంతో కొంత సమసిపోయినా, ఇంకా లోపల ఏదో కొంత ఉండిపోతుంది. అందుకే నీ మూర్ఖత్వం చాలాకాలం కొనసాగుతుంది.

నీవు అల్పుడవని, నీవేమీ చేయలేవనీ, నీకు అసలు ఉనికి లేదని, దివ్యచేతన, దైవకృపలేకుండా అస్తిత్వమే లేదని, నీ అంతరాలలో లోతైన అవగాహన కలగడానికి జీవితంలో ఎన్ని దెబ్బలు తినాలో? ఆ అవగాహన ఏర్పడిన క్షణంనుంచి, అది సమసిపోతుంది. అడ్డంకులన్నీ తొలగిపోతాయి. అది సమగ్రంగా తెలిసిపోయి,

ఒక పరిపూర్ణ చేతనకు, ఒక సమగ్ర చేతనా శక్తికి మేల్కొన్న అంతరంగ జీవితం గలవారందరూ దాని అనివార్యమైన ఫలితాలను పొందుతారు — ఆత్మ జ్ఞానం, సంస్కరించబడిన ఉనికి, తృప్తి పొందిన అస్తిత్వంలోని ఆనందం, ఈడేర్చబడిన లక్షణం గల సంతోషం.

CWSA 221: 1072 *అనువాదం: ఎస్. వై. బాషా*

ఆటంకపరచేది ఏమీ లేకపోతే.... కానీ ఆ క్షణం వరకు......చాలా సమయం పడు తుంది.

ఇది మరువకుండా నీవు ఉండలిగేటంతటి అదృష్టం వుంటే, సాధనలో చాలా వేగంగా మున్ముందుకు సాగ గలవు. నీ సాధన వేగవంతం అవుతుంది.

CWSA 6:323-324

అనువాదం: యస్. వై. బాషా

పరిపూర్ణ విశ్వాసం పొందే మార్గం

రేపు ఏమి జరగబోతోందో నాకు చెప్పగలవా? నీవు చెప్పగలవని నేననుకోను. కానీ నీవు తప్పక చెప్పవచ్చు. మనం తింటాం, నిద్రిస్తాం.... ఇవి మామూలు విష యాలు. కానీ ఏదో అనుకోనిది జరిగబోతున్నదని మాత్రం చెప్పలేవు. ఎందుకు? ఎవరో అన్నారు,"దీని కోసం ఒక ప్రత్యేకమైన నేత్రం అవసరం" అని. ఆకారాలను అందుకోలేక పోయినా జరుగబోయేదానిని ముందుగానే గ్రహించడం సాధ్యమే. ఆ కృతులులేని జ్ఞానం ఒకటున్నది.

CWSA15: 285

*

ఇక్కడ మళ్ళీ మనం 'యోగం' లో పరిష్కారాన్ని వెతకాలి. యోగాచరణ ద్వారా ఒకవ్యక్తి తన 'విధి' ని ముందుగా చూడటమే కాదు, దానిని మార్చి పూర్తిగా సరి దిద్దుకోగలడు కూడా. అన్నింటికంటే ముందు, మనమేదో ఒక ఏకైక జీవి కాదని, ఒక సామాన్యమైన, తార్కికపరమైన, కేవలం ఒకే ఒక 'విధిని' ఆవశ్యకంగా కలిగివున్న వారం కామని 'యోగం' ప్రబోధిస్తుంది. ఇంకా మనం ఒప్పుకు తీరవలసిన దేమిటంటే చాలామంది మనుషులు 'విధి' సంక్లిష్టమైనది, తరచుగా అసంబద్ధమైనంతవరకు అని. ఈ సంక్లిష్టతయే కాదా అని అనిరీక్షితమైన, అనిశ్చితమైన పర్యవసానంగా, అనూహ్య మైన ధోరణిని కల్గించేది?

ఈ సమస్యా పరిష్కారానికై తెలుసుకోవలసినది.... కళాత్మక జీవన గమనానికి కావలసినది ఒక వ్యక్తి తన చేతనయొక్క అత్యున్నత స్థాయిలో తనను తాను వ్యవస్థీకరించుకోవడం, తద్వారా అతడి అత్యున్నత విధి యితరుల జీవితాలపై,

కార్యాచరణపై ఆధిపత్యం కలిగి వుండటం. కాబట్టి ఏ పొరబాటు జరుగదనే ధీమాతో, నిర్భయంగా చెప్పగలగాలి, ఎల్లప్పుడూ నీ చైతన్యంయొక్క శిఖరాగ్ర స్థాయిలో నిలిచి వుంటే, ఎప్పుడూ నీకు అత్యుత్తమమైనదే జరుగుతుందని. కానీ అది అత్యున్నతస్థాయి, దానిని చేరడం అంత సుళువు కాదు.

CWM12: 77-78

మనుషులు వాళ్ళ చైతన్యం నిజంగా మారాలని కోరుకొన్నప్పుడే వాళ్ళ క్రియా కలాపాలు కూడా మార్పు చెందుతాయి. మన చైతన్యంలో మార్పు కలిగితే, అసలు ఆ మార్పు ఏమిటో మనం గ్రహించ గల్గుతాం:

మార్పు అంటే:

1. ద్వేషం, సామరస్యంగా
2. అసూయ, ఔదార్యంగా
3. అజ్ఞానం, జ్ఞానంగా
4. చీకటి, వెలుగుగా
5. అసత్యం, సత్యంగా
6. చెడు, మంచిగా
7. యుద్ధం, శాంతిగా
8. భయం, నిర్భయంగా
9. అనిశ్చిత స్థితి, నిశ్చయ స్థితిగా
10. సందేహం, విశ్వాసంగా
11. గందరగోళం, క్రమబద్ధంగా
12. ఓటమి, విజయంగా

CWM 15: 223

ప్రశ్న: అనుభవానికి సంబంధించి ప్రతికూల పార్శ్వం, సానుకూల పార్శ్వం అన్నదానికి అర్థమేమిటి?

ఓ బిడ్డా! నీకు తెలుసా, నీలో కొన్ని దోషాలుంటాయి. అవి నిన్ను ఎదగనివ్వకుండా ఆపుతాయి. కాబట్టి ఈ ప్రతికూల పార్శ్వం అనగా నీ దోషాలనుండి బయటపడే ప్రయత్నం చేయడం

కొన్ని విషయాలు ఉంటాయి. వాటిలా నీ వుండాలి. ఆ విధంగా తయారుకావాలి.

నీవు సాధించడానికి నీలో నీవే నిర్మించుకోవలసిన లక్షణాలు వుంటాయి. ఈ పార్శ్వాన్ని సానుకూల పార్శ్వం అంటారు.

ఉదాహరణకి, నీలో నిజం చెప్పనటువంటి వైఖరి ఒకటున్నది. ఈ అబద్ధం చెప్పే సత్యాన్ని చూడని, సత్యాన్ని పలకని అలవాటుకు భిన్నంగా నీ చేతనలో అసత్యాన్ని నిరాకరించడం ద్వారా నీవు పోరాడాలి. నిజం పలుకని దురలవాటును నిర్మూలించు కోవటానికి శ్రమించాలి. ఈ పని చేయడం కోసం నీలో కేవలం సత్యాన్ని పలికే అలవాటును అలవర్చుకోవాలి. నీ అంతట నీవే ఎల్లప్పుడూ సత్యాన్ని గ్రహించే, సత్యాన్ని వచించే అభ్యాసాన్ని చేపట్టాలి. ఒకటి ప్రతికూలమైనది. దోషాన్ని నిరాకరించడం, మరొకటి నిజమైనది ఆ లక్షణాన్ని వృద్ధి చేసుకోవాలి. ఈ విధంగా వుంటుంది.

ప్రతిదీ ఇలాగే వుంటుంది. ఉదాహరణకు, నీ లోపల ఎక్కడో తిరుగుబాటు ధోరణి, అజ్ఞానం, దురహంకార అస్పష్టమైన వ్యతిరేకత, పైనుండి వచ్చే దానిని నిరాకరించడం లాంటిది వుంటుంది. కాబట్టి ప్రతికూల పార్శ్వ మేమిటంటే దానితో పోరాడటం, అది తనను తాను వ్యక్తం కాకుండా ఆపు చేయడం, దానిని నీ స్వభావం నుండీ తిరస్కరించడం. ఇక సానుకూల పార్శ్వం శరణాగతి, అవగాహన, సమర్పణ భావన, ఆత్మ సమర్పణ, దైవిక శక్తులకు పూర్తిగా తోడ్పడే ధోరణిని పెంపొందించు కోవడం. అర్థమైందా? ఇదే విషయాన్ని మళ్ళీ చూస్తే, కోపిష్టులైన వ్యక్తుల్లో కోపం రాగానే తారా స్థాయిలో ఊగిపోయి, కోపావేశానికి లోనయ్యే, అలవాటుంటుంది. దానికి వ్యతిరేకంగా పోరాడి కోపోద్రిక్తుడు కాకూడదు. తన అస్తిత్వం నుండి వెడలే కోపా వేశ తరంగాలను నిరాకరించాలి. కాని వాటి స్థానే అచంచలమైన ప్రశాంతత, సంపూర్ణమైన ఓరిమి, ఇతరుల దృక్కోణాన్ని అర్థం చేసుకొనే అవగాహన, స్ఫుటమైన సమదృష్టి, స్థిరమైన నిర్ణయం ప్రతిష్ఠించాలి. అది సానుకూల పార్శ్వం.

CWM 7: 202-03 — శ్రీమాత

అనువాదం: సి. హెచ్ . హర్షవర్ధన్

మనస్సును, స్వభావాన్ని, జనుల అభిరుచులను ఉన్నతం చేయాలి. ప్రాపంచిక జీవితాన్ని అందమైనదిగా, అద్భుతమైనదిగా, చేసిన స్ఫూర్తిని, ప్రాచీన వైభవోపేత మానసిక స్థితిని, దృఢమైన ఆర్య జాతి విలక్షణతను, విశిష్టమైన ఆర్యుల దృక్పథాన్ని తిరిగి అలవరచు కోవాలి. మనలను భూమి పైనున్న సమస్త మానవ జాతులన్నింటిలోకి అత్యంత దయార్థ్రి హృదయులు, గంభీరమైన ఆలోచనా వరులుగా, అపారమైన జ్ఞాన సంపదతో సాత్విక జీవన శైలి కలవారు గా తీర్చిదిద్దిన దివ్యమైన ఆద్యాత్మిక అనుభవాలను, సిద్ధులను, అభిలాషలను తిరిగి పొందాలి.

ఇది మనం విధిగా నెరవేర్చవలసిన ముఖ్యమైన అత్యావశ్యకమైన కార్యం.

CWSA 8: 248

శ్రీఅరవిందులు

అనువాదం: సి. హెచ్ . హర్షవర్ధన్

అఖిల

ఖిల భారత పత్రిక
అక్టోబరు 2017



చక్కని జీవితం

2 వ భాగం

అందమైన దివ్యజీవనం — ముఖ్య అవసరాలు



అందమైన దివ్యజీవనం — ముఖ్య అవసరాలు

ప్రశ్న: పుస్తకాలలో చిత్రీకరించ నవసరం లేకుండానే హృదయ విదారకమైన విషయాలు ప్రపంచంలో కావలసినన్ని వున్నాయని నీకు అనిపించటం లేదా? ఈ విషయం, నా చిన్నతనంలో కూడా నన్ను ఆశ్చర్యపరుస్తుండేది. జీవితం ఎంతో వికృతమైనది, అల్పమైన, నికృష్టమైన, కొన్ని సార్లు జుగుప్సాకరమైన విషయాలతో నిండి వున్నది. ఇప్పటికే ప్రబలియున్న చెడు విషయాలను మించిన చెడ్డవాటిని ఊహించుకోవడంలో ప్రయోజన మేమిటి?

సమా: నీవు ఏదో అత్యంత రమణీయమైన, అత్యంతానందమయమైన జీవితాన్ని ఊహించుకున్నట్లయితే అది శ్రమకు తగ్గ ఫలితం దక్కినట్లుండేది, వికృతమగు విషయాలను వ్రాయడంలో ఆనందం అనుభవించే వారు మానసిక దారిద్ర్యం అధికంగా కనబరుస్తారు — అది ఎల్లప్పుడూ మనోదౌర్బల్యానికి చిహ్నం. గగుర్పాటు గొలిపే సన్నివేశంతోనో లేక ఒక దుర్ఘటనతోనో ముగింపు పలికే కథను వ్రాయడం కన్నా మొదటి నుండి చివరి దాకా ఒక కమనీయమైన కథను చెప్పడం చాలా కష్టం. చాలా మంది రచయితలు అందమైన, రమ్యమైన ముగింపు గల కథను వ్రాయవలసి వస్తే, అలా చేయలేక పోతారు — అందుకు అవసరమైన భావనా పటిమ వారి కుండదు కొన్ని కథలకు మాత్రమే ఒక ఉద్ధారకతను సూచించే ముగింపు వుంటుంది. దాదాపు అన్నీ విషాదాంతాలే. అందుకు కారణం అతి సామాన్యం — ఎదగడాని కన్నా దిగజారడం అతి సులభం. ఒకరు తమ కథను ఒక ఉన్నత వైభవోపేత స్థితికి చేర్చడంతోను, తమ కథానాయకుడిని ఆతని లక్ష్యాన్ని మించి సాధించగోరే అసాధారణ ప్రజ్ఞ గలవాడిగా తీర్చి దిద్దడంతోను ముగించడం చాలా కష్టం. ఎందుకనగా అందుకు రచయిత స్వయంగా అసాధారణ ప్రజ్ఞావంతుడై వుండాలి, అట్టి ప్రజ్ఞాపాటవం అందరికీ లభ్యం కాదు.

CWM 4:155 — శ్రీమాత

ఆత్మవిశ్వాసం

మనిషి శ్రమించి, సంకల్పించి, ఉన్నత స్తరాలకు ఎదిగి చివరకు తన శక్తిని భగవంతునికి మహా నైవేద్యంగా సమర్పించ గలుగుటకు అతనికి తనలోను, తన భావనా పరంపర లోను, తన శక్తి సంపదలోను విశ్వాసం కల్పించబడింది. వేద శాస్త్రాల ప్రకారం ఈ స్ఫూర్తిని బలహీనులు పొందలేరు, "నీ యం ఆత్మా బలాః ఇనేన లభ్యః" శక్తిహీనుణ్ణి చేసే ఆత్మద్రోహ చింతనను తలెత్త నీయకూడదు, తప్పక సాధించి తీరుతామనే మన శక్తిసామర్థ్యాన్ని శంకించ కూడదు. ఎందుకనగా అది నిస్పృహాయతను అకారణంగా అంగీకరించడ మౌతుంది, బలహీనతను ఊహించడమౌతుంది, మహా శక్తివంతమైన ఆత్మబలాన్ని నిరాకరించడ మౌతుంది. ప్రస్తుతం ఏమైన అశక్తత ఏర్పడినప్పటికీ, తద్వారా ఏర్పడిన ఒత్తిడి ఎంత పెనుభార మనిపించి నప్పటికీ, అది కేవలం నీ విశ్వాసానికి ఒక పరీక్ష, ఒక తాత్కాలిక ఇబ్బంది మాత్రమే. పూర్ణయోగ సాధకుడు అశక్తతా భావానికి లొంగిపోవడం వెర్రితనం, ఎందుకనగా ఇప్పటికే అతనిలో కలిగిన పరిపూర్ణత ఏదైతే అస్తిత్వంలో గుప్తమై వున్నదో దానిని వృద్ధి చేయడం అతని లక్ష్యం కాబట్టి. కారణం, దివ్యజీవన బీజాన్ని మనిషి తన అంతరాత్మలోనే కలిగి వున్నాడు. అతని ప్రయత్నంలో గెలుపొందే సంభావ్యత ఇమిడి వుంది. విజయం తథ్యం; ఎందుకనగా దాని వెనుక ఒక సర్వోత్కృష్ట శక్తి యొక్క పిలుపు మరియు మార్గదర్శకం వున్నది. అదే సమయంలో అతని ఆత్మవిశ్వాసానికి సోకిన రాజసిక అహంకారం మరియు ఆధ్యాత్మికోన్నతి అనే గర్వపు వాసనలు శుద్ధి పరచబడాలి.

CWSA 24:778

నేను ఇపుడే చెప్పాను, మనం మనపై సర్వదా ఎనలేని మమకారం కనబరుస్తుంటామని. నిజానికి, మన అవలక్షణాలు మనకు తరచుగా అనిర్వచనీయ ఆనందమయమైనవిగా కనిపిస్తాయని, మనం మన బలహీనతలను సమర్థించుకుంటామని నేననుకుంటాను. కానీ నిజం చెప్పాలంటే, ఇది ఆత్మవిశ్వాసం కొరవడి నందువలన జరుగుతుంది. ఆశ్చర్యంగా వుంది కదూ?...

అవును. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను,మనకు విశ్వాసం కొరవడింది — ఈ క్షణాన మన మేవిధంగా వున్నామనే విషయంపై కాదు, మన క్షణ భంగురమైన మరియు సర్వదా మార్పు చెందే బాహ్య అస్తిత్వంలో ఎలాగున్నామనే విషయంపై

కాదు — ఈ అస్తిత్వం మన కెల్లప్పుడూ ప్రియమైనదిగానే వుంటుంది — కానీ ప్రయత్నం ద్వారా మన మెలా కాగలం అనే విషయంపై మనకు విశ్వాసం కొరవడింది. స్వయంగా మనంతట మనం నిర్వహించ వలసిన, శాశ్వతుడగు దైవం నిర్వహించ వలసిన, సమస్త జీవులలో నున్న దైవం నిర్వహించవలసిన సమగ్రమైన, సర్వోత్కృష్టమైన రూపాంతరీకరణ కార్యక్రమంపై మనకు విశ్వాసం లేదు — దాని దివ్య ప్రకాశవంతమైన, దూరదృష్టి గల మార్గదర్శనానికి మనం చిన్న పిల్లలలా సమర్పించు కున్నప్పటికీ. కాబట్టి సంతృప్తి మరియు వికాసం ఒకటేననే భ్రమకు లోను కాకూడదు.

CWM 2:24

ప్ర: మీరు "Words of Long Ago" లో ఏమి వ్రాసారంటే మనలో ఆత్మ విశ్వాసం కొరవడినప్పుడు మనం మన బలహీనతలను సమర్థించు కుంటామని. ఎందుకని మనమలా చేస్తాము?

స: ఊ! అయితే. మనం మన బలహీనతలన్నింటినీ సమర్థించుకోవటమా? వాస్తవానికి, అది ఆత్మవిశ్వాసం లేకపోవడం కాదు. అది దైవకృప మన గురించి చేయగలిగిన దానిపై విశ్వాసంలేక పోవడం. తన బలహీనతలను తాను సమర్థించుకోవడం ఒక విధమైన సోమరితనం, జడత్వం.

ఎవరైతే తనను తాను సంస్కరించుకొనే ప్రయత్నం చేయటానికి ఇష్టపడనప్పుడు, అతను అంటాడు, “ఓహ్, అది అసాధ్యం. నే నది చేయలేను. అందుకు కావలసిన బలం నాకు లేదు. నా వ్యక్తిత్వం అటువంటి లక్షణంతో రూపొందలేదు. అందుకు అవసరమైన గుణగణాలు నాకు లేవు. అది నేనెప్పటికీ చేయలేను.” అది పూర్తిగా సోమరితనం, చేయవలసిన ప్రయత్నం తప్పించుకోవడానికి ఒక సాకు. అభివృద్ధి సాధించమని ఆదేశించితే, “ఓహ్, అది నా శక్తికి మించిన పని, నేనొక అభాగ్య జీవిని, నేనేమీ చేయలేను” అని అంటాడు. అంటే, దాదాపు అదొక వికటించిన సంకల్పం, తీవ్రమైన సోమరితనం, ఏ విధమైన ప్రయత్నానికైనా నిరాకరణ. ఒక వ్యక్తి తన అవలక్షణాలను, అసమర్థతలను అధిగమించడానికి అవసరమైన ప్రయత్నం చేయకుండా వుండటానికి వాటిని పూర్తిగా ఒప్పుకుంటాడు. దానికి తోడు,“నే నలాంటి వాడినే, మరో విధంగా నుండలేను.” అంటాడు. అది దైవకృప నీలో పనిచేయడానికి తిరస్కరించడం, నీ మనస్సంకల్పాన్ని సమర్థించుకోవడం అవుతుంది.

CWM 6:267

వాళ్ళ కాళ్ళపైన వాళ్ళు నిలుచోగల మనుషు లున్నారు. వాళ్ళు ఏ పనైనా ఎందుకు చేస్తారంటే ఆ పని మంచిదని వారు అనుకుంటారు కాబట్టి. గురువు మార్గదర్శకాన్ని అనుసరించటానికై అతనికి వారిని వారు ఇష్ట పూర్వకంగా సమర్పిం చుకుంటారు. అయితే ఎల్లప్పుడూ ఆ కార్యక్రమం స్వేచ్ఛగానే కొనసాగుతుంది. ఇతరులున్నారు, వాళ్ళు బానిసలు, వాళ్ళెప్పుడూ వారు చేసే కార్యానికి ఒక సామాజిక లేక ఆధికారక గుర్తింపు లభించాలనే కోరిక కలిగి వుంటారు. ఏదో ఆధికారక ప్రశంస అందుకున్నప్పుడే వారికి ఆత్మవిశ్వాసం కలుగుతుంది. బానిస మనస్తత్వ మంటే ఇదే.

CWM 15: 261

ఆత్మవిశ్వాసం లేకుండా నీవు ఎప్పుడూ ఏమీ చేయలేవు.... కారణం, అత్యంతతో కూడిన మొదటి కొన్ని సంవత్సరాలను గడపటానికి నీకు భవిష్యత్తులో లాభాపేక్ష తప్ప మరో ఆదరువు లేదు. నీ కుండే యుక్తమైన ఆస్తి నీపై నీకుండే నిస్సంకోచమైన, తడబడని ఆత్మ విశ్వాసం మరియు ధైర్యం.

CWSA 1:716

అదే సమయంలో మనిషికున్న ఆత్మ విశ్వాసానికి రాజసిక అహంకారం మరియు ఆధ్యాత్మిక ఆధిపత్య గర్వంతో సోకిన దుర్వాసనలు శుద్ధపరచ బడాలి. సాధకుడు అహంకార గర్వంతో తన శక్తి స్వయంగా తనదే నని అనుకోకుండా అది విశ్వవ్యాప్త దైవశక్తి అనే భావనను ఏర్పరచుకోవాలి. దాని వాడకంలో అహంకారయుతమైన దేదైనా వున్నట్లయితే, అదే దానిని విస్తృత పడకుండా పరిమితం చేసి ఆటంక పరచటానికి కారణమనే భావనను తన మనసులో నిలుపుకోవాలి,

దైవికమైన విశ్వగత మహాశక్తి యొక్క బలం ఏదైతే మన అభిలాష వెనుక వున్నదో అది అంతులేనిది, అనంతమైనది. యుక్తమైన రీతిలో దానికై పిలుపు నిస్తే, అది తనంతట తానుగా వర్షించకుండా ఉండదు. ప్రస్తుతమో లేక తరువాతనో సంభవించనున్న ఏ అశక్తతనుగానీ, ఆటంకాన్ని గాని తొలగించకుండా వుండదు. మన పోరాటం కొనసాగే పర్యంతం మొదట్లో అది సాధనా పరంగానూ, పాక్షికంగాను మన విశ్వాసం, మన ప్రయత్నం పై ఆధారపడినప్పటికీ చివరకు గుప్తంగా నున్న భగవంతుడు ఎవరైతే యోగానికి ఏకైక గురువై వున్నాడో, ఎవరి వివేచనా జ్ఞానంతో

సర్వం నిర్ధారించబడుతుందో, ఆతని చేతుల్లో వుంటుంది.
CWS A 24:780

స్వయంవృద్ధి, ఆధ్యాత్మికాభిలాష మనిషికి కర్మపై ఆధిపత్యశక్తిని సాధించుటకు తోడ్పడుతాయి.

నేర్చుకోవడం ఉత్తమం. నేర్చుకున్నదానిగా మారడం అత్యుత్తమం.

CWM 10:275 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

ధైర్యం

నీవు నీళ్ళల్లో పడ్డావు. ఆ జలరాశిని చూసి నీవు చెదరవు. ఈదేందుకు నీ కాళ్ళను, చేతులను చక్కగా వినియోగిస్తావు, ఎలా ఈదాలో నేర్పించిన గురువుకు కృతజ్ఞతతో. అలలతో పోరాడి తప్పించుకుంటూ ధైర్యంగా నున్నావన్న మాట. నిద్రిస్తావు. 'నిప్పు' అన్న కేకతో, భయంతో లేచావు. పక్కమీదనుండి దూకి ఆ మంటల ఎఱ్ఱని కాంతిని చూస్తావు. మృత్యుభయం నిన్ను తాకలేదు. రక్షణకోసం పొగ, నిప్పు రవ్వల మంటలగుండా పరిగిడుతావు. ఇది ధైర్యం.

కొంతకాలం క్రిందట ఇంగ్లండులో చిన్నపిల్లల పాఠశాలను సందర్శించాను. ఆ పాఠశాలలో పిల్లలందరు మూడు నుండి ఏడు సంవత్సరముల లోపు వారే. వారిలో బాలురు, బాలికలు వున్నారు. వారంతా కుట్టుపని, చిత్రలేఖనం, కథలను వినటంలో, పాటలు పాడటంలో నిమగ్నమై ఉన్నారు. ఉపాధ్యాయుడు నాతో "మే మిప్పుడు అగ్ని హెచ్చరికను చేయబోతున్నాం. నిజంగా అచట నిప్పులేదు. అయితే అగ్నిహెచ్చరిక చేసిన వెంటనే అందరు తక్షణం బయటకు వెళ్ళాలని వారికి నేర్పాము" అని చెప్పారు.

ఉపాధ్యాయుడు ఈల ఊదాడు. తక్షణమే పిల్లలు అందరూ వారి వారి పుస్తకాలను, పెన్సిళ్లను, కుట్టు సూదులను వదలి లేచి నిలబడ్డారు. రెండవసారి ఈల వేసిన వెంటనే వారంతా బయటి ప్రదేశంలోకి వరుస కట్టారు. కొద్ది క్షణాల లోనే తరగతి గది అంతా ఖాళీ అయింది. ఈ పిల్లలందరూ అగ్ని ప్రమాదాన్ని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నారు.

ఎవరికోసం నీవు ఈదావు? నీకోసమే కదూ!

ఎవరికోసం మంటలగుండా పరిగెత్తావు? నీ కోసమే కదూ!

ఎవరికోసం పిల్లలంతా అగ్ని భయాన్ని ఎదుర్కొన్నారు? వారికోసమే కదూ!

పై వాటిలో చూపిన ధైర్యం ఆత్మసంరక్షణ కోసమే. ఇది తప్పా? కానే కాదు. నీ ప్రాణాన్ని ధైర్యంగా కాపాడుకోవడం యుక్తమైన పని. అయితే దీన్ని మించిన ధైర్యం ఒకటుంది. అది ఇతరులకోసం చూపెట్టే ధైర్యం.

CWM 2: 179- 80

ఈ ధైర్యాన్ని ప్రదర్శించటంలో పురోగతి నెమ్మదిగా ఉండవచ్చు. పతనం అతి తరచుగా జరగవచ్చు. కాని ధైర్యవంతమైన సంకల్పం నిలుపుకోగలిగితే వ్యక్తి ఏదో ఒక రోజున తప్పక జయిస్తాడు. సత్య చైతన్యకాంతి ముందు కష్టాలన్ని కరిగి మటుమాయ మవుతాయి.

CWM 4:52

లోతుగా ఆలోచించినట్లయితే నిజమైన ధైర్యం జీవితంలో ప్రతి సంఘటనను, అతి చిన్నదాని నుండి అతి గొప్పదాని వరకు, భౌతికమైన దాని నుండి ఆత్మానుగతమైన దాని వరకు, కలవర పడకుండా, గుండె వేగంగా కొట్టుకో కుండా, నరాలు కంపించ కుండా, అస్తిత్వంలో ఏ భాగం కూడా అణుమాత్రమైనా ఉద్రేకానికి లోను కాకుండా ఎదుర్కొ గలగడం. ప్రతి విషయాన్ని నిరంతర దైవసాన్నిధ్య చేతనతో; దైవానికి సంపూర్ణ ఆత్మార్పణంతో, అస్తిత్వాన్నంతా అట్టి సంకల్పంతో జోడించి ఎదుర్కోవాలి. అప్పుడే వ్యక్తి పురోగతి చెందగలడు, దేని నైనా ఎదుర్కొగలడు — కలవరపాటు లేకుండా, కంపించకుండా అని అంటాను. నీకు తెలుసా, వ్యక్తి ఒక ప్రత్యేకమైన దైవానుగ్రహం కలగి జన్మించి వుంటే తప్ప ఈ ఫలితం సుదీర్ఘ ప్రయత్నం చేయగలిగితే మాత్రమే సిద్ధిస్తుంది. ఇంతకన్నా అరుదైన విషయం వుంది. ఒకరు తమ భయాన్ని అధిగమించడ మంటే అర్థం అస్తిత్వంలో ఒక భాగం మరొక భాగం కన్నా బలమైనది వున్నదని, అది నిర్భయంగా నుంటుందని. భయం చెందిన భాగం తనదైన సాహసాన్ని పాటిస్తుంది. కానీ దీని అంతరార్థం ఆధిపత్యం నెరపడానికి భయపడని వాడి కన్నా మరొకడు ధైర్యవండుతు కాడని. ఎందుకనగా అధికారం చలాయించడానికి జంకులేని వ్యక్తి... దీని అర్థం అతడు అన్ని చోట్లా ధైర్యవంతుడుగానే వుండగలడని, తన అస్తిత్వపు అన్ని భాగాలలో. ఇప్పుడు అచేతన చేత, అజ్ఞానం చేత కలిగే నిర్భయత్వం

ఒకటి వుంది. ఉదాహరణకు బాలలు కొన్ని పనులను వాటిలోని ప్రమాదం గురించి ఎరుక లేనప్పుడు చేస్తారు. ప్రమాదం గురించి ఎరుక వున్నట్లయితే వారా పనులు చేయరు. దీని అర్థం వారి అజ్ఞానం వలన కలిగిందని. కానీ నిజమైన ధైర్యం అనగా ఒక విషయం గురించి సంపూర్ణ పరిజ్ఞానంతో కూడిన ధైర్యం. అనగా దానికి గల అన్ని అవకాశాల గురించి తెలుసు, ఎట్టి మినహాయింపు లేకుండా.

CWM 7:31

ధైర్యం కలిగి ఉండటం ఒక పరిపూర్ణత గల లక్షణమని మనం చెప్పుకోవటం నాకు గుర్తుంది. దానిని ఒక పట్టికలో వ్రాసినట్లు నాకు గుర్తుంది. అయితే ఈ ధైర్యం ఒక గొప్ప సాహసకార్యం చేయాలనే అభిరుచిని సూచిస్తుంది. ఈ గొప్ప సాహసానికై గల అభిరుచినే ఆకాంక్ష అంటారు. ఈ ఆకాంక్ష నిన్ను పూర్తిగా కమ్మేసి, ఎటువంటి అంచన, మినహాయింపు, ఉపసంహరణ లేని దివ్యావిష్కరణ, దివ్య సమావేశం దివ్యసాక్షాత్కారం అనే సాహసకృత్యంలోకి తోస్తుంది. ఏమి జరగబోతుంది? ఏమి జరుగబోయేది నీవు అడిగితే నీవు బయలుదేరవు. ఎప్పుడు అక్కడే ఉంటావు. ఉన్నచోటనే పాతుకుపోతావు, ఏదో సమతౌల్యతను పోగొట్టుకుంటాననే భయంతో. అందువల్ల ధైర్యాన్ని గురించి మాట్లాడుతున్నా. కాని వాస్తవానికి ఇది ఒక ఆకాంక్ష. అవి కలిసి వుంటాయి. వాస్తవమైన ఆకాంక్షలో ధైర్యం సంపూర్ణంగా ఉంటుంది.

CWM 8:40-41

ధైర్యం, ప్రేమ అన్నవి మాత్రమే ఆవశ్యకమైన సద్గుణాలు. మిగతావన్ని మరుగున పడినా లేక సుషుప్తిలోకి జారుకున్నా ఈ రెండు ఆత్మను సజీవంగా ఉంచుతాయి.

CWM 10:281

ఏ రూపం లోనిదైనా సంపూర్ణ భయరాహిత్యమే ధైర్యం.

CWM 10:282

ఏ విధంగానైతే ఒక కొవ్వొత్తి మరొక కొవ్వొత్తిని వెలిగించ గలదో, ఆ విధంగా ధైర్యం గలవారు ఇతరులకు ధైర్యాన్ని అందించగలరు.

*

తన తప్పులను గుర్తించటమే ఒక ఉన్నతమైన ధైర్యం.

CWM 14: 169-70 అనువాదం: ఎ. కృష్ణ

పట్టుదల

అత్యవసరమైన లక్షణం పట్టుదల, సహనము. ఇంకా కావలసింది ఒక రకమైన అంతరంగ హాస్యరస స్ఫూర్తి. నీకు ఇది నిరుత్సాహ పడకుండా, దుఃఖించకుండా, చిరునవ్వుతో అన్ని ఆటంకాలను ఎదుర్కొనేందుకు తోడ్పడుతుంది. దీనిని బాగా సూచించే ఆంగ్లపదం, Cheerfulness. దీనిని నీలో ఉంచుకోగలిగితే నీవు ఇంకా బాగా పోరాడ గలవు, నిరోధించగలవు. ఈ వెలుగులో నిన్ను పురోగమించకుండా నిరోధించే దుష్ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కోగలవు.

CWM 8: 23

*

ప్రతివాడు తనలోని నిశ్చయాన్ని తనలోనే కనుక్కోవాలి, దానిని నిలుపుకోవాలి, అదే దారిలో పోవాలి చివరివరకు, దానికెంత మూల్యం చెల్లించినా సరే, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనాసరే. అత్యంత ఓర్మి గలవానికే విజయం. ఎన్ని వ్యతిరేకతలు ఎదురైనా, ఓర్మి కొనసాగించడానికి దైవికమైన వాస్తవికత, పరమసత్యం యొక్క దృఢమైన చేయూత అవసరం. ఇతరుల అండకై ఎదురు చూడడం నిరుపయోగం.

CWM 9: 255

*

ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని ఆశించలేము. ఎలా ఓర్మితో నుండాలో తెలుసు కోవడం అత్యంత ఉపయోగకరం. ఎక్కువగా ఓర్మిని నేర్చుకునేందుకు అవకాశంలేని రోజులు మన జీవితాల్లో కొద్దిగానే ఉంటాయి. ఎప్పుడూ హడావిడిగా ఉండే మనిషిని ఏదో అడగాలని, కలుసుకుందామని అనుకుంటావు. నీవు అతని ఇంటికి వెళ్తావు. అప్పటికే చాలామంది సందర్శకులు అతని కోసం వచ్చి నిరీక్షిస్తుండటం మూలాన అతడు మిమ్మల్ని చూసేటందుకు చాలా సేపు నిరీక్షింప చేశాడు. బహుశా చాలా గంటలున్నారు మీరు అక్కడ నిశ్చలంగా ఓర్మితో. మరొక మారు మీరు వెళ్ళేటప్పటికి, అతను ఇంట్లో లేడు. మరుసటిరోజు మళ్ళీ వెళ్తావు. కానీ తలుపు మూసి వుంటుంది. మూడవ మారు మళ్ళీ వెళ్తావు. కానీ అతను అనారోగ్యంతో ఉంటాడు, నిన్ను చూడలేడు. కొద్ది రోజు లాగి మళ్ళీ వెళ్తావు. ఇంకేదో అవాంతరం వచ్చి అతనిని కలుసుకోనీయదు. అయినా నీవు నిరుత్సాహ పడకుండా ప్రయత్నాన్ని కొనసాగిస్తావు,

అతనిని కలుసుకునే వరకు. ఈ రకమైన ఓర్మిని సహనం అంటారు. ఇది క్రియాశీలక ఓర్మి. అది కొనసాగుతూనే ఉంటుంది.

CWM 2: 198

*

ఒక ప్రఖ్యాత జెనివా నావికుడు, కొలంబస్, స్పెయిన్ నుండి అంతవరకు తెలియని పశ్చిమ సముద్రాలు దాటుటకు బయలుదేరాడు. రోజులు, వారాలు గడిచాయి. సహచరులు గుసగుస లాడుకుంటున్నారు. అయినా అతడు తన నిశ్చయాన్ని, తన పట్టులను విడిచిపెట్టలేదు, కొత్త భూమిని చేరేవరకు కష్టాలు, అంతరాయాలు, ఎదురైనప్పటికీ, కొత్త అమెరికా ద్వీపాలను చేరేవరకు. ఈ విధంగా అతడు కనుక్కొన్నాడు ఒక క్రొత్త ప్రపంచాన్ని. అతడు తన సహచరులను కోరిన దేమిటి? వారి ఓర్మిని. వారు అతడిని నమ్మి అతడు వారిని నడిపించటానికి. కానీ గమ్యాన్ని చేరుటకు అతడికి అవసరమైనదేమిటి? ఆపలేని శక్తి. నిరాపేక్షమైన ఇచ్ఛ. దీనినే అంటాము, పట్టుదల అని

CWM 2: 198- 199

*

నీవు దర్శించిన సత్యాన్ని వెంటనే పొందలేక పోతే నీవు ఓరిమి లేకుండా వుండ కూడదు. భంగపడి, క్రుంగిపోయి, నిరుత్సాహపడి వుండ కూడదు. సహజంగానే నీవు తప్పు చేసినపుడు నీవు క్రుంగి పోయావా, దుఃఖించావా, లేదా నిర్వేదం చెందావా అన్నది ప్రశ్న కాదు. ఎందుకంటే ప్రతి తప్పును సరిదిద్దు కోవచ్చు. తప్పు చేశానని గ్రహించిన క్షణం నుండి, దానిని నీలో సరిదిద్దు కొనేందుకు అవకాశాలుంటాయి. పురోగమించడానికి, సుఖంగా నుండడానికి కూడా అవకాశాలుంటాయి. కానీ సత్యాన్ని దర్శించినపుడు అది మూల సత్యమో లేదా పరమసత్యమో అని తెలిసినపుడు, ఆ పరిస్థితిని అధిగమించడం అతి కష్టం. ప్రపంచ స్థితి ఎలా ఉందంటే ఈ సత్యం సిద్ధించడానికి ఇంకా పరిపక్వం కాలేదు. ఇలా ఇది ఎక్కువ మందికి జరుగుతుందని చెప్పలేను కానీ బహుశా ఇది నీకే జరగవచ్చు. అప్పుడు నీవు ఎక్కువ ఓర్మితో, అర్థం చేసుకొని, ఇలా నీకు నీవు చెప్పుకోవాలి. "అది సత్యమే కాని పూర్తి సత్యంకాదు." అనగా ఇతర సత్యాలతో పొందు కలిగి లేదు, అంతకు మించి ప్రస్తుత సంభావ్యతలకు అనుగుణంగా లేదు. కాబట్టి చాలా ముందుగా

దీనిని పొందుటకు ప్రయత్నించాము. తత్కారణంగా విఫలమయ్యాము. అలా అని అది తప్పు అనకూడదు. ఆ సత్యం ఇంకా పరిపక్వ మవలేదు అనాలి. ప్రస్తుతం ఈ చిన్న సత్యాన్ని ఓర్మితో భద్రంగా ఉంచుకోవాలి. దానిని పొందే అవకాశం వస్తుంది. ఎక్కువ ఓర్మి గల వానికే అంతిమ విజయం.

CWM 4: 116 - 117

*

ఎవరైనా భౌతిక జీవనంలో మార్పు తేవాలని కోరుకుంటే, అంగముల నైజంలోగాని, వాటిపని విధానంలో గాని, వాని అలవాట్లలోగాని మార్పు తేవాలని కోరుకుంటే, అతనికి తప్పనిసరిగా సడలని పట్టుదల ఉండాలి. ఒకే పనిని వందమార్లు — తిరిగి తిరిగి అదే దీక్ష, పట్టుదలతో ప్రారంభించే ఓర్మి — మొదట ప్రారంభించినప్పటి దీక్షతో కూడిన ఓర్మి ఉండాలి. ఆ పని అంతకు పూర్వమెప్పుడూ చేయనపుడు ఉండవలసిన పట్టుదల, ఓర్మి ఉండాలి.

CWM 7:104

*

పట్టుదల: చివరివరకు వెళ్ళే నిశ్చయం.
పట్టుదల అనగా క్రియాశీలా సహనం
పట్టుదల అన్ని ఆటంకాలను బద్దలు చేస్తుంది.
పట్టుదల కలిగి వుంటే ఆటంకాలన్నీ జయించ బడతాయి.
పట్టుదలతో వుండు- అది విజయానికి కచ్చితమైన మార్గము
గత సంవత్సరం సాధించలేనిది, ఈ సంవత్సరం సాధిస్తావు.

*

ఈ రోజు చేయలేనిది రేపు సాధిస్తావు.
పట్టుదల కలిగి వుండు. నీవు తప్పక జయిస్తావు.

*

పట్టుదల కలిగి వుండడం వల్లే ఆటంకాలు జయిస్తారు, దూరంగా వాటినుండి పారిపోవడం వల్ల కాదు. పట్టుదలగల వాడు తప్పక జయిస్తాడు. ఎక్కువ ఓరిమి గల వానినే

విజయం వరిస్తుంది. ఎప్పుడూ నీవు చేయగలిగింది చక్కగా చేయి. ఫలితం భగవంతుడు చూస్తాడు.

CWM 14:162-163 — *మూలం: శ్రీమాత*

అనువాదం: ఎస్. వై. సోమయాజులు

దైవశక్తిపై విశ్వాసం (1)

శత్రువును ఓడించడానికి ఉత్తమమైన మార్గం, అతని ముఖంపై నవ్వడం.

నీవు రోజుల కొద్దీ పెనుగులాడినప్పటికీ అతడి దారుఢ్యం ఏ మాత్రం తగ్గక పోవచ్చు. కానీ ఒక్కమారు అతనిని చూచి నవ్వు, ఇక చూడు! అతను కాళ్ళకు బుద్ధి చెపుతాడు. ఒక్కసారి అతన్ని చూచి నవ్వి చూడు! పరుగు పుచ్చుకుంటాడు.

దైవంపై విశ్వాసంతో కూడిన నవ్వుకు క్షణంలో దేనినైనా ముక్కలు ముక్కలు చేయగల బలం ఉంటుంది. అది శత్రుసైన్యపు అగ్రశ్రేణిని కకావికలం గావించి అతని సైన్యసంపదనంతా సర్వనాశనం చేస్తుంది. నిన్ను విజయోత్సాహంతో ముందుకు కొనిపోతుంది.

మనకు జీవితంలో తారసపడే సంఘటనలన్నీ ఈ విషయం నేర్పడానికే ఏర్పాటు కాబడ్డాయి. బుద్ధిని మించి, దైవకృప మన కష్టాలన్నింటినీ, బలహీనతలన్నింటినీ అదిగమించ గల శక్తిని సమకూరుస్తుంది. మనకు ప్రశాంతతను, ఆనందాన్నే గాక, శారీరక సమతుల్యతను, ఆరోగ్యాన్ని అందించే దైవిక చేతనతో సంబంధ మేర్ప రుస్తుంది.

CWM 3: 139 — *అనువాదం: కవితా శ్రీధర్ రెడ్డి*

నమ్రత

ఒక విషయం నిరంతరంచెప్పడం జరుగుతుంది, కానీ ప్రతీసారి అపార్థం చేసుకో బడుతుంది. అది నమ్రత యొక్క ఆవశ్యకత. దానిని తప్పుగా తీసుకోవడం, తప్పుగా అర్థం చేసుకోవటం, తప్పుగా ఉపయోగించటం జరుగుతుంది. విధేయుడిగా ఉండండి, కానీ సవ్యమైన విధంగా, అన్నిటికన్నా ముఖ్యంగా అపసవ్యమైన మార్గంలో కాదు. ఎందుకంటే అది మిమ్మల్ని ఎక్కడికీ తీసుకువెళ్ళదు. కానీ ఒక్క విషయం మీరు మీలోంచి అహంకారమనే కలుపు మొక్కను పీకి వేయగలిగితే, నిజంగానే మీరు కొంత సాధించ గలిగినట్లే. కానీ అది ఎంత కష్టతరమో మీకు తెలిస్తే! మీకు మీ లోపల మీ గురించి ఒక ఆధిక్యతా భావం, ఒక పొంగులాంటిది, లేక మీకు తెలియకుండానే అహంకారంతో కూడిన ఆత్మ సంతృప్తి తోకూడినది వుంటుంది, ఒక చిన్న పనిని కూడా సరిగా చేయలేరు. ఒక మంచి ఆలోచన చేయలేరు, సత్య మైన కదలిక వుండదు. కొంచెం కూడా ప్రగతి సాధించలేరు. అప్పుడు మీరు దాని ని గట్టిగా సుత్తితో పగలగొట్ట వలసి వస్తుంది. అప్పటికీ పగిలిన ముక్కలు తిరిగి మొలకెత్తటం మొదలుపెడతాయి. పదేపదే మొలకెత్తే ఈ కలుపుమొక్కని మరచి పోకుండా నిర్మూలించటానికి ఒక వ్యక్తి తన జీవిత కాలమంతా పరిశ్రమించ వలసి వస్తుంది. అది అంతరించి పోయిందని మీరనుకొని, చాలా వినయంగా ఇది చేసినది నేను కాదు, భగవంతుడనుకుంటాను, ఆయన లేకపోతే నేనేమీకాను అనుకొన్న మరు క్షణం మీరు అలా ఆలోచించగలిగినందుకు సంతోష పడిపోతారు!

CWM 5:44-45

ప్ర: విధేయత కలిగి ఉండడంలో సరైన పద్ధతి ఏది? సరికాని దేది?

అది అతి సాధారణమైనది. విధేయతతో ఉండండి అనగానే జనులు యితరుల ముందు వినయంగా ఉండటం అనుకుంటారు. అది తప్పు. నిజమైన విధేయత అంటే భగవంతుని ముందు విధేయులై ఉండటం, అంటే ఒక ఖచ్చితమైన, సమమయిన సజీవభావన — భగవంతుడు లేకుండా తానేమీ కానని, ఏమీ చేయలేనని, ఏమీ అర్థం చేసుకోలేననీ, ఎంత అద్భుతమైన మేధా సంపత్తి, సామర్థ్యం కలిగి ఉన్నా భగవత్ చైతన్యంతో పోల్చినప్పుడది శూన్యమనే భావనను ఎల్లప్పుడూ స్మరణలో ఉంచుకోవాలి. అపుడే సరైన విధంగా గ్రహించగల వైఖరిని కలిగి ఉంటారు — ఒక

వినయమైన గ్రహణశక్తి, దైవానికి వ్యతిరేకంగా ఎటువంటి వ్యక్తి గతమైన నటనలూ లేనిది. *CWM 5:43-45*

ప్ర: శ్రీమాతా, ఏదైనా ప్రయత్నం చేసినపుడు మాలో చాలా ఆత్మతృప్తి, గర్వం, ప్రయత్నం చేసామనే సంతృప్తి కలుగుతుంది. దానితో అంతా విఫల మౌతుంది. దీని నుండి బయటకు రావడం ఎలా?

ఆహా, తను చేస్తున్నదానిని తాను చూస్తూ, ఉండటం అంటే అదే. ఎవరైనా ఏదైనా పని చేసేటపుడు వేరెవరో గమనిస్తూ, ఉంటారు. కొన్ని సార్లు అతనికి గర్వం ఏర్పడుతుంది. అందువలన ప్రయత్నంలోని శక్తి ఖచ్చితంగా చాలా వరకు తగ్గిపో తుంది. అదే కారణమనుకుంటాను: పని చేసేటపుడు తమని తాము గమనించుకోవటం, తాము ఎలా జీవిస్తున్నామో తాము చూసుకోవడం లాంటి అలవాటు అని భావిస్తాను.

తమను తాము గమనించుకోవడం అవసరమేకానీ అంతకన్నా ముఖ్యమైన అవసర మేమిటంటే, తాము చేసేది పూర్తిగా, నిజాయతీగా, సహజంగా, అప్రయ త్నంగా జరగాలి. అన్ని వేళలా తనను తాను గమనిస్తున్నట్లుగా, చేసే పనిని చూస్తున్నట్లుగా, తనను తాను బేరీజు వేస్తున్నట్లుగా, కొన్ని సార్లు తీవ్రంగా — అలా ఉండకూడదు. అది తృప్తిపడి తమను తాము వెన్ను తట్టి మెచ్చుకోవట మంత చెడ్డది. నిజానికి రెండూ సమానంగా చెడ్డవే. ఒక వ్యక్తి తన ఆకాంక్షలో ఎంత నిజాయితీగా ఉండాలంటే, తాను ఆకాంక్షిస్తున్నాడనే ఎరుక అతనికి ఉండ కూడదు, అనగా అతడే ఆకాంక్షగా మారిపోవాలి.

ఒక్క నిముషం, ఒక్క నిముషం అలా చేయగలిగితే, కొన్ని సంవత్సరాలలో కలిగే సిద్ధిని పొందవచ్చు. ఎప్పుడైతే వ్యక్తి తన గొప్పతనంపై మోజు పడటం మానుతాడో, అనగా అహంకారం దాని క్రియాశీలతను చూసి పొంగిపోవటం ఆపు తుందో, వ్యక్తి తానే స్వయంగా కార్యాచరణగా మారుతాడో, అన్నింటినీ మించి తానే ఆకాంక్షగా మారుతాడో, అపుడు అది నిజంగా ఉత్తమమయిన స్థితి. ఆకాంక్షించే వ్యక్తి లేనపుడు కేవలం ఆకాంక్ష మాత్రమే సంపూర్ణమైన ఏకాగ్రతా స్పందనలా పైకెగసినపుడు అది చాలా ప్రగతిని సాధించ గలుగుతుంది. లేకపోతే ఎంతో కొంత అహం భావం, కొంత ఆత్మ తృప్తి, దైన్యత, లాంటి అన్ని రకాలయిన చిన్నచిన్న విషయాలు కలిసి మొత్తాన్ని పాడుచేస్తాయి.

CWM 6: 402 *అనువాదం: డా. సరోజా ప్రసాద్*

ఔదార్యం

ఉదాత్త గుణము మరియు ఔదార్యము అంతరాత్మ యొక్క, ఆకాశమంత విశాలత యొక్క సూక్ష్మ లక్షణాలు. అవి లేని వ్యక్తి భూగృహంలో పారాడే పురుగులా పరిగణించ బడతాడు.

— శ్రీఅరవిందులు (*Thoughts and Aphorisms*)

శ్రీమాత వివరణ

ఉదాత్త లక్షణము వ్యక్తిగతంగా సమకూరే ప్రయోజనాల తిరస్కారణను సూచి స్తుంది. ఔదార్యం అనగా ఇతరుల సంతృప్తిలో తాను సంతృప్తిని పొందటం.

CWM 10:282

ప్రశ్న: శ్రీఅరవిందులు మహాలక్ష్మి గురించి చెబుతూ పేదరికమంతా... ఆమె ఆగమనాన్ని నివారిస్తుందని అంటారు?

ఔను. పేదరికం అనగా ఉదాత్తత లేకపోవడం, ఉత్సాహం లేకపోవడం, ఔన్నత్యం లేకపోవడం, అంతరంగ ఐశ్వర్యం లేకపోవడం. నిస్సారమైనది, నిరుత్సాహమైనది, సంక్షోభంలో చిక్కుకున్నది అంతా మహాలక్ష్మి ఆగమనాన్ని అడ్డుకుంటుంది. ధనాధిక్యత అనే ప్రశ్న కాదు. తెలుసా! అత్యంత భాగ్యవంతుడు మహాలక్ష్మి దృష్టిలో కటిక దరిద్రుడు కావచ్చు. అతి పేదవాడు, ఏ లక్షణాలు, ఏ శక్తి, ఏ బలం, ఏ ఔదార్యం లేని వాడి హృదయం ఔదార్యంతో సుసంపన్నమై ఉంటే అత డామె దృష్టిలో గొప్ప సంపన్నుడు. మనిషి అసంతుష్టుడిగా ఎప్పుడుంటాడంటే, అతడికి ఔదార్యం లేనప్పుడు. స్వలాభ మాశించకుండా, ఉదార గుణం కలవాడు నిత్య సంతోషి. ఎవరు తమలో తాము క్షుభితులై వుంటారో, అన్నీ తమకే కావాలని లాగుకుంటారో, వారి సంకుచిత దృష్టితోనే ప్రపంచాన్ని, విషయాలను చూస్తారో, వారే అసంతుష్టు లుగా నుంటారు. ఎప్పుడైతే వ్యక్తి తనను తాను ఔదార్యంతో అర్పితం గావించు కుంటాడో, స్వలాభాన్ని ఆశించకుండా వుంటాడో, అతను ఎప్పటికీ అసంతృప్తి చెందడు. తీసుకో దలచినవాడే అసంతృప్తితో నుంటాడు. తనను తాను అర్పించుకొనె 'వాడు ఎప్పుడూ అసంతృప్తిగా నుండడు.

CWM 4:404

ఇప్పుడు నేను వస్తు సంబంధిత ఔదార్యము గురించి మాట్లాడటం తగదు. వ్యక్తి

సహజముగా అతని దగ్గర ఉన్నదానినే ఇతరులకు ఇవ్వగలడు. అయినప్పటికీ ఈ సుగుణము గూడా బహుళవ్యాప్తి చెందలేదు. ఎందుకనగా ఒకడు భాగ్యవంతుడై నప్పుడు తన అవసరానికి మించిన సంపదను పెంచుకోవడానికి ఆలోచిస్తాడు కాని ఇతరులకు ఇవ్వడానికి కాదు. మనుషులు ఎంత ఎక్కువ కలిగి వుంటారో వారి ఔదార్యం అంత తగ్గుతుంది. నేను నీతివంతమైన ఔదార్యం గురించి చెబుతాను. ఉదాహరణకు నీ తోటివాడు గెలుపొందుటలో, ఒక సాహసోపేత చర్యలో, ఒక నిస్స్వార్థ చర్యలో, ఒక త్యాగపూరిత చర్యలో, ఆనందం పొందే అవకాశం వుంది. ఈ నైతిక ఔదార్యత ఇతరుల నిజమైన విలువను, ఆధిక్యతను గుర్తించుటలో వుంటుంది.
CWM 4:30

నైతిక మరియు ఆధ్యాత్మిక దృక్పథాలమధ్య వ్యత్యాసాన్ని సోదాహరణంగా పరిశీలిద్దాం. సాధారణ సామాజిక అభిప్రాయాలు మనుషులను రెండు రకాలుగా విభజిస్తాయి. ధాతృత్వగుణం గలవారు పేరాశ గలవారిని తృణీకరించి నిందారోపణ చేస్తారు. ఉదార స్వభావులను నిస్వార్థముగా సమాజ శ్రేయస్సుకు చేయు పనుల వలన మెచ్చుకుంటారు. కాని ఆధ్యాత్మిక దృష్టిలో వారి రురువును సమాన స్థాయిలో నున్న వారే. ఒకరి దానగుణము, మరొకరి లోభత్వము రెండు ఉన్నత సత్యము యొక్క, మహోన్నత దివ్యశక్తి యొక్క వికృత రూపాలు. ఒక శక్తి, విస్తృత పరచే మరియు కుదించే దైవికమైన కదలిక ఒకటుంది. అది ప్రకృతి యొక్క అత్యంత భౌతికమైన స్తరాల నుండి, అత్యంత ఆధ్యాత్మిక స్తరాలపై తన వశంలో నున్న శక్తులను, ఇతర సరంజామాను నిరాటకంగా వర్షిస్తుంది. ఒక ధాతృత్వ గుణంగల వ్యక్తికి అతని ధాతృత్వానికి వెనుక అంతరాత్మ ముద్ర ఒకటి ఏదైతే ఈ చర్యను ప్రతిబింబిస్తోందో అది ఉంది. విస్తృత పరచేది, కుదించేది ఈ శక్తియే. వేరొక శక్తి, దైవికమైన కదలిక వుంది. సమీకరించడము, నిలువ చేయడము దాని లక్షణం. అది శక్తులను, ఇతర సామగ్రిని, వీలయినన్ని సంపదలను సమీకరిస్తుంది, కూడ బెడుతుంది. అవి ఉత్తమ లేక నిమ్న స్తరాలకు చెందినవే కావచ్చు. మనం లోభత్వాన్ని అంటగట్టే మనిషి ఇలాంటి కార్యకలాపానికి ఉపకరణంగా వుంటాడు.

ఇద్దరూ ముఖ్యమైన వారే. ఇద్దరూ పూర్తి ప్రణాళికకు అవసరమైనవారే. విస్తృత పరచి, కుదించే కార్యక్రమానికన్నా సమీకరించి నిలువచేసే కార్యక్రమం ఎంత మాత్రం తక్కువైనది కాదు. రెంటినీ నిజంగా దైవార్పణ చేయగలిగితే, అవి దైవ

కార్యార్థం, ఒకే స్థాయిలో, ఒకే విలువతో అందుకు ఉపకరణాలుగా పనికొస్తాయి. అవి సమర్పించబడక పోతే, రెండూ కూడా అజ్ఞానపూర్వక మనో భావాలతో ప్రభావిత మౌతాయి. ఒకటి విచ్చల విడిగా పడవేయబడుటకు ప్రేరేపించ బడితే, వేరొకటి వెనుకకు తీసుకొని నిలువ చేసుకొనుటకు ప్రేరేపించ బడుతుంది. కాని రెండూ వాటి స్వీయ చేతనకు తెలియని శక్తులతో ప్రేరేపితమైనవే. ఈ రెండింటి మధ్య తేడా ఏమీ లేదు. అందరిచే అతిగా కీర్తించబడే ధాతృత్వగుణంగల వ్యక్తికి, యోగ దృష్టిలో ఉన్నత స్తరం నుండి ఈ విధంగా చెప్పవచ్చు.

"ఔదార్య భావనతో చేసే ప్రేరణలన్నీ ఆత్మానుగతమైన విలువలతో పోలిస్తే — ఆధ్యాత్మిక చింతన విలువలను బట్టికాదు — ఏ మాత్రం విలువ లేనివి, ఎందుకనగా అవి అహంభావము, అజ్ఞాన పూరిత కోరికలనుండి ఉద్భవించినవి." అందుకు భిన్నంగా లోభత్వలక్షణం మోప బడిన వారిని కొందరిని చూస్తాం. వారికి స్వాభావికంగా అప్పచెప్పబడిన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఏకాగ్రమైన దృఢనిశ్చయంతో సమీక రిస్తూ నిలువ చేస్తుంటారు. ఒక్కసారి తట్టి లేపితే, వారు దైవానికి మంచి ఉపకరణం కాగలరు. కానీ సర్వసాధారణంగా, లోభి అన్నవాడు అహంకారంతో, కోరికతో ఆచరణ గావిస్తాడు. అది ఒకే విధమైన అజ్ఞానం యొక్క మరో కొసలాగ ఉంటుంది. ఇద్దరూ కూడా వారి వెనుక నున్నదానికన్నా ఉన్నతమైన దానితో సంపర్కములోకి రాకముందు స్వాభావికంగా వారికి అనువైన రీతిగా దానిని వ్యక్తపరచేముందు, వారిని వారు పవిత్రీకరించుకోవాలి.

CWM 3: 119

అనువాదం: జి. వి. ఎస్. వి ప్రసాదరావు

కృతజ్ఞత

మరొక భావాత్మక ప్రేరణ ఉంది అది ఎప్పుడూ భక్తితో కలిసి వుండాలి. భగవంతు డున్నాడనే ఒక కృతజ్ఞతా భావ మది. ఒక అద్భుతమైన కృతజ్ఞతా పూర్వక సంవేదన, దైవం ఉన్నాడనే సత్యం నీలో నిజంగా ఒక ఉదాత్తమైన ఆనందాన్ని నింపుతుంది. అది దైవమనే దేదో ఈ విశ్వంలో నున్నదనే సత్యం; మనం చూస్తున్నది ఏదో ఒక విపరీతమైనది కాదు, అది దైవం అని, దైవం ఉన్నాడని. ప్రతిసారీ ఏ అల్పమైన విషయమైనా నిన్ను నేరుగానో, పరోక్షంగానో దైవం ఉనికి యొక్క లోకోత్తర వాస్తవికతతో సంపర్కాన్ని కలిగిస్తూ వుంటే హృదయం ఎంతటి అంతులేని ఆశ్చర్యభరితమైన హర్షంతో, ఎంతటి కృజ్ఞతాభావంతో నిండి పోతుందంటే, అది అన్నింటిలోకి అధిక సంతృప్తి నిచ్చే ఆనందాయకమైన రుచి కలిగి ఉంటుంది. నీ లోని కృతజ్ఞతా భావం అందించే ఆనందానికి సరిసమానమైన దేదీ లేదు. ఒకరు పక్షుల కిలకిలా రవాన్ని వింటారు, ఒక అందమైన పువ్వును చూస్తారు, ఒక చిన్ని పాపాయిని చూస్తారు, ఒక ధాతృత్వ చర్యను గమనిస్తారు, ఒక ఇంపైన వాక్యం చదువుతారు, సూర్యాస్తమయాన్ని చూస్తారు. అవి ఏమైనా గానీ తటాలున నీలో నుండి ఒక రకమైన భావోద్వేగం ఉబికి వస్తుంది. అది నిజంగా ఎంత లోతైనది, తీవ్రమైనది అంటే ప్రపంచం దైవాన్ని అభివ్యక్తం చేస్తున్నట్లుగా నుంటుంది. ఈ ప్రపంచానికి వెనుకగా వున్నది దైవ మనే భావన కలుగుతుంది.

CWM 8:40

చాలా కొద్దిమంది, అతి తక్కువ సంఖ్యలో చర్చికో లేదా దేవాలయానికో ఒక నిజమైన ధార్మిక భావనతో వెళతారు, అనగా ప్రార్థించడానికో, దేవుణ్ణి ఏదో ఒకటి అడగడానికో కాదు, కానీ తమను అర్పించుకొనడానికి, కృతజ్ఞతలు చెప్పుకోడానికి, ఆకాంక్షించడానికి, వాళ్ళను వాళ్ళుసమర్పించు కోవడానికి వెళతారు. ఇలా చేసేవారు లక్షలో ఒకరు మాత్రమే వుంటారు.

CWM 6:194

వ్యక్తికి స్వయంగా అతని లొసుగులు, అజ్ఞానం, అపార్థాలు, అహంకారం, దాని నిరసనలు, ఘర్షణలు, ఉన్నప్పటికీ అతని దివ్యగమ్యానికి అతి దగ్గర దారుల గుండా నడిపించుకుపోయే పరంధాముని ఆశ్చర్యభరితమైన అనుగ్రహాన్ని ఎన్నడూ మరువ

కూడదు, కృతజ్ఞత గలిగి ఉండాలి. విశుద్ధ కృతజ్ఞతా పూర్ణ జ్వాల మన హృదయంలో వేడిగా, తియ్యగా, ప్రకాశవంతంగా అస్పష్టతను, అజ్ఞానాన్ని అంతం చేయడానికై ఎల్లప్పుడూ జ్వలిస్తూ వుండాలి. దైవకృపకై పరితపిస్తూ,ఈ కృతజ్ఞతా జ్వాల సాధకుణ్ణి అతని లక్ష్యం వైపుకు నడుపుతుంది. వ్యక్తి ఎంత అధికంగా కృతజ్ఞత కలిగి వుంటాడో, ఎంత ఎక్కువగా భగవదనుగ్రహం చేసే పనిని గుర్తించ గలుగుతాడో, ఎంతగా దానికి విధేయుడై వుంటాడో, గమ్యాన్ని చేరు మార్గం అంతగా చిన్నదవుతుంది.

*

అన్ని భావోద్వేగాల్లో కల్లా బహుశా ఒక్కటి అత్యంత ఆనందాన్ని సమకూరుస్తుంది. స్వచ్ఛమైన ఆనందం, నిర్మలమైన, అహంకారంతో కళంకితంకాని ఆనందం — అదే సహజోత్పన్న మైన కృతజ్ఞత.

అది ఒక రకంగా ఎంతో ప్రత్యేకమైనది. అది ప్రేమ కాదు, ఆత్మసమర్పణం కాదు. అది ఒక నిండు సంతోషం, మరొక దానితో పోల్చలేని, దానికదే సాటియైన విలక్షణ స్పందన. అది నిన్ను విశాల పరుస్తుంది, నిన్ను పరిపూర్ణం చేస్తుంది, అది ఎంతో తీవ్రమైనది.

మానవ చేతనా పరిధిలోని అన్ని భావోద్వేగాల కంటే ఈ కృతజ్ఞతాభావమే నిన్ను నీ అహంకార లోతులలో నుండి పైకి తీసుకొస్తుంది. నీవు ఎప్పుడైతే ఈ పవిత్రమైన భావోద్వేగానికి లోనౌతావో వెంటనే దానికి దివ్యప్రేమ స్పందనకు సరిసమానమైన లక్షణ మున్నట్లు గ్రహిస్తావు. దానికి పరిధులు లేవు. చివరగా, కృతజ్ఞత అన్నది దివ్యప్రేమ స్పందన యొక్క రంగును కొద్దిగా పులుముకున్న లక్షణం గలది.

ప్ర: దైవానుగ్రహాన్ని కృతజ్ఞతతో స్వీకరించే మార్గ మేమిటి?

స: ఓహ్! అన్నింటికంటే ముందు ఈ భావన యొక్క అవసరాన్ని నీవు గ్రహించాలి.

ఇది చాలా ముఖ్యమైన అంశం. దైవానుగ్రహమన్నది లేకుంటే నీవు నిస్సహాయు డవని నీకు తెలియపరచే ఒక ఆంతరికమైన అణకువను నీవు కలిగి వుండాలి. నిజా నికి ఈ అనుగ్రహం లేనిదే నీవు అపరిపూర్ణుడవు, శక్తి హీనుడవు. ప్రారంభానికి ఈ వినమ్రత మొదటి అవసరం.

ఈ అనుభవం వ్యక్తి బాగా పొందవచ్చు. నీవు గమనిస్తే, వాళ్ళను గురించి వాళ్ళకు ఏమి తెలియకుండానే కఠినమైన పరిస్థితిలో పడతారు, లేక పరిష్కరించి

తీరవలసిన సమస్యను ఎదుర్కొంటారు, అధిగమించి తీరవలసిన ఒక భావోద్వేగానికి లేక వారిని గందరగోళానికి గురిచేసిన దానిని ఎదుర్కొంటారు. అప్పుడు వారు మతిస్థిమితము కోల్పోయామని గ్రహిస్తారు. ఏం చేయాలో వారికి తెలియదు. వాళ్ళ మనసుగాని, వాళ్ళ సంకల్ప బలం గానీ, వాళ్ళ భావాలు గానీ సహాయపడవు. అప్పుడు వాళ్ళ లోపల ఒక రకమైన పిలుపు వస్తుంది, వ్యక్తి ఏమి చేయలేడో అది చేయడానికి పిలుపు. వ్యక్తి చేయలేని దానిని చేయడానికై ఆకాంక్షిస్తాడు. ఇది మొదటి నిబంధన, భగవదనుగ్రహం మాత్రమే దానిని చేయగలదని నీ వెరిగినట్లైతే, నీ వున్న పరిస్థితుల నుండి దైవకృప మాత్రమే విముక్తి కలిగించ గలదని అందుకు పరిష్కారాన్ని శక్తిని ఈయగలదని తెలుసుకోగలిగితే, సహజంగానే ఒక తీవ్రమైన ఆకాంక్ష నీలో మేల్కొంటుంది. ఒక ఎరుక ఉన్మీలనంగా మారుతుంది. నీవు పిలిచి నట్లైతే, ఆకాంక్షించినట్లైతే, సమాధానాన్ని ఆశిస్తే, నీవు అతి సహజంగా ఆ దివ్యకృపకు నీకుగా నీవు తెరుచుకుంటావు.

ఆ తరువాత నీవు దీనిపై చాలా శ్రద్ధ పెట్టవలసి వుంటుంది. (శ్రీమాత తమ వేలును పెదవులపై వుంచుతారు). ఆ భగవదనుగ్రహం నీకు సమాధానమిస్తుంది. అది నిన్ను సమస్యనుండి బయటకు తెస్తుంది. దివ్యకృప నీ సమస్యకు పరిష్కారాన్ని ఇస్తుంది లేదా ఆ కష్టం నుండీ గట్టెక్కే సహాయాన్ని అందిస్తుంది. ఆ ఉపద్రవం నుండి బయటపడిన పిమ్మట ఆ భగవదనుగ్రహమే నిన్ను బయటకు లాక్కొచ్చిందని మరువకూడదు. అదంతా నీ అంతట నీవే చేసుకొన్నానని భావించకు. నిజంగా ఇది చాలా ముఖ్యమైన విషయం. చాలామంది మనుషులు వాళ్ళ కష్టాలు తొలగిపోవడం తోనే “ఆ... ఎట్టికేలకు నాకు నేనే కష్టాల నుండి బాగానే బయట పడ్డాను” అంటారు.

అక్కడ ఆ స్థితికి చేరిన తర్వాత, నీవు తలుపు మూసి వేసుకొని గడి వేశావు. ఇహ నీవు ఇకపై ఏదీ పొందలేవు. నీలో ఈ రకమైన తెలివితక్కువతనం తొలగిపోవడానికి, అసలేమి చేయలేవని మరోసారి గ్రహించడానికి ఒక భయంకరమైన కష్టం, ఒక తీవ్ర మైన మనోవేదన మరోసారి నీ కవసరమౌతుంది. ఎందుకంటే నీవు శక్తి హీనుడవని తెలుసుకున్నప్పుడే నీవు కొద్ది కొద్దిగా నమ్యంగా, సానుకూలంగా దివ్యకృపకు తెరుచుకోవడం మొదలు పెడతావు. కాని నీ వెంతవరకైతే నీ స్వంత చాకచక్యంతో, నీ సామర్థ్యం మీద ఆధారపడుతున్నానని యోచిస్తుంటావో, నిజంగా నీ లోపల ఒక తలుపు కాదు, తెలుసా! తలుపు మీద తలుపు, అలా ఒకదాని తరువాత ఒకటి



మూసుకుపోతుంటావు, గొళ్ళెం పెడతావు. నిన్ను నీవు ఒక కోటలో బంధించుకుంటావు, దానిలోకి ఏది ప్రవేశించదు. అది పెద్ద ప్రతిబంధక మౌతుంది. మనిషి వెంటనే మర్చిపోతాడు. అతి సహజంగానే మనిషి తన స్వంత సామర్థ్యంతోనే తృప్తి పడి పోతాడు.

శ్రీమాత

అనువాదం: సి. హెచ్. హర్షవర్థనరాజు

దైవశక్తి పై విశ్వాసం 2

ఎల్లప్పుడూ మన బలానికి వెనుక ఆధారంగా మనకు దైవశక్తిపై విశ్వాసం వుండాలి. స్వయం వ్యక్తమైనప్పుడు అది స్పష్టంగా, సంపూర్ణంగా నుండాలి, లేక ఆ విధంగా వృద్ధి చెందాలి. ఆమె దివ్య చేతనాశక్తి, విశ్వమాత, శాశ్వతత్వం నుండి ఆవిర్భవించినది, పరమాత్ముని సర్వతోముఖ శక్తితో సమన్వితమైనది, కాబట్టి ఆమెకు అసాధ్యమైనది ఏమి లేదు.

సమస్త జ్ఞాన సంపద, శక్తి సామర్థ్యాలు, శత్రుజయ విజయోత్సాహాలు, నైపుణ్యం, కౌశల్యత, కార్యక్రమాలు అన్నీ ఆమెకు హస్తగతమై వున్నాయి. అవి దైవికమైన, సమస్త పరిపూర్ణతలకు, సిద్ధులకు చెందిన నిధి నిక్షేపాలతో నిండి వున్నాయి...

అట్టి విశ్వాసం మనకుండాలి. అన్ని విషయాలు ఒక సర్వోత్కృష్టమైన ఆత్మ జ్ఞానము, వివేకముతో నిర్వహించబడే కార్యక్రమాలని, మన చుట్టూ జరుగుతున్నదేదీ వృధాగా గాని, దాని ఔచిత్యాన్ని ప్రాముఖ్యతను పరిగణించకుండా గానీ జరగటం లేదని, ఆ సర్వేశ్వరుడే స్వయంగా మన జీవాత్మగా కార్యాచరణ చేయ బూనినప్పుడు సమస్త విషయాలు సఫలీకృతమౌతాయని, ఆతనిచే గతంలో చేయబడినది, ఇకపై చేయబడేది అంతా ఆతని అమోఘమైన దూరదృష్టితో కూడిన మార్గదర్శనం లో భాగమని, అదంతా మన యోగం, మన పరిపూర్ణత, మన జీవిత కార్యసాఫల్యతకు ఉద్దేశించబడినవనే విశ్వాసం మనకుండాలి.

ఉన్నత జ్ఞానం వికసించిన కొద్దీ ఈ విశ్వాసం మరింతగా సమర్థనీయ మౌతుంది. మన పరిమిత మనస్తత్వానికి, విశ్వాసానికి అంతుచిక్కని విషయాలన్నీ — పెద్దవి,

చిన్నవి — జ్ఞానరంజితమైనవిగా పరిణమిస్తాయి. అప్పుడు సర్వం ఆ దైవ సంకల్పం ప్రకారంగా జరిగే కార్యక్రమేనని, ఆ సంకల్పం సైతం జ్ఞానమేనని నిస్సందేహంగా తెలుస్తుంది. ఎందుకనగా ఆ జ్ఞానం మూలంగా జీవియొక్క, ప్రకృతి యొక్క జీవిత కార్యక్రమాల వృద్ధి జరుగుతుంది. ఈ ఉత్థాన పథంలో అత్యున్నత స్థితి కలిగేది ఎప్పుడనగా మనకు ఈశ్వర సాన్నిధ్య అనుభూతి కలిగినప్పుడు.

CWSA 24: 780- 81 అనువాదం: కె. కవితా శ్రీధర్ రెడ్డి

గ్రహణశీలత

మన చైతన్యం విస్తరించడంతోను మరియు మన ఆకాంక్ష ఏకోన్ముఖం గావించడం తోను గ్రహణశీలత వృద్ధి చెందుతుంది.

CWM 14:147

పరిపూర్ణతా సాధన పురోగమన దిశలో సాగుతున్నప్పటికీ, దానికి సమగ్రత ఎప్పుడు సిద్ధిస్తుందంటే, పై నుండి అభివ్యక్త మగుటకు దిగి వచ్చే శక్తిపాతంతో క్రింద నున్న గ్రహణశక్తి సరితూగినప్పుడు.

CWM 15:78

ప్ర: గ్రహణశీలత దేనిపై ఆధారపడి వుంటుంది?

స: అన్నింటి కంటే ముందు నిజాయితీపై ఆధారపడి వుంటుంది, నిజంగా దానిని స్వీకరించే కోరిక వున్నదా అనే దానిపై ఆధారపడి వుంటుంది. తదుపరి, నిజాయితీ మరియు నమ్రత ప్రధానాంకాలని నా నమ్మకం. గర్వాహంకారాలు నిన్ను ఎదగకుండా కప్పి వుంచుతాయి. నీకు తెలిసిన దానితో సంతృప్తి చెందినప్పుడు, నీలో ఏదో కొరత వున్నదని, నీవు తప్పులు చేస్తావని, నీలో ఎన్నో లోపా లున్నాయని నిన్ను ఒప్పుకోనియకుండా చేసేది, నీలోని ఒక విధమైన గర్వాహంకారం. నీకు తెలుసా, నీలో స్వాభావికంగా ఒకటి ఏదో ఇలా బిగుసుకపోయేది వుండి నిన్ను ఒప్పుకోనీయదు. ఇదే నిన్ను గ్రహించనీయకుండా అడ్డుపడేది. నీవు ఏదో విధంగా దానిని వదలించుకొని, గ్రహించుటలో నున్న అనుభవం పొందే ప్రయత్నం చేయాలి. నీ సంకల్పబలంతో నీ సత్తాలో అణు మాత్రమైనా, "అవును, నిజమే, నేను తప్పు చేసాను, నేను అలా

వుండ కూడదు, అలా చేసి వుండ కూడదు, అలా భావించి వుండ కూడదు, అది తప్పే," అని ఒప్పించ గలిగితే, మొదట్లో, నే నిప్పుడు చెప్పినట్లు, అది నిన్ను బాధించవచ్చు. కానీ ఒప్పుకొనేంత వరకు నీవు పట్టు వదలకుండా నిలబడితే, ఆ బాధ వెంటనే వీగిపోతుంది, ఆశ్చర్యకరంగా ఒక వెలుగు వెల్లువ నీలోకి ప్రవహిస్తుంది. ఆ తరువాత నీవు ఎంత ఆనంద పడతావంటే, నిన్ను నీవు ఇలా ప్రశ్నించు కుంటావు, "ఇంత కాలం దానిని అడ్డుకోలేక ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను," అని.

CWM 6:117

అనువాదం యస్. వై. బాషా

సాధారణత్వము

గత కాలం నుండి నేటి వరకు మానవుని మనఃప్రవృత్తి వృద్ధి చెందిందనే భావం నిజమైనది. ఆలోచనా విధానం సంకీర్ణమయింది. మనోవిజ్ఞానం అపారమయింది. ఆ కారణంగా ఈ వాగ్వాదాలు దాదాపు బాల్యచేష్టలుగా కనిపిస్తాయి. కానీ వాటిని ఆచరణలో పెట్టాలనే ఉద్దేశం కలిగినప్పుడు అవి ఇంచుమించు అంతకు ముందున్న స్థాయిలోనే నిలిచి పోయాయని అవగత మౌతుంది. ఒక వేళ ఆలోచనా విధానం వృద్ధి చెందినా, ఆచరణ మెరుగు పడక పోగా దిగజారి పోయినట్లు తోస్తుంది. ఈ పరిణామం ఒక అమాయకమైన సాధారణత్వాన్ని, కొంత నైతికమైన మరియు అపార్థానికి అవకాశం లేని స్థితి, ఏదైతే దురదృష్టవశాత్తు మానవజాతి కోల్పోయిందో, దానిని సూచిస్తుంది.

ఆ రోజుల్లో ఒక నైతికమైన ఉన్నత స్థితి వుండేది. అది కూడా పూర్తిగా కాన రాకుండా పోయింది. ఈ వాగ్వాదాలు నవ్వు తెప్పిస్తాయి గానీ ఇక్కడ బోధించబడిన దాని ఆచరణ ఆ కాలంలో కన్నా ఇప్పుడు కష్టతరమయింది. మానవ మనస్సును ప్రధానంగా ఒక విధమైన కాపట్యం, వంచన, మోసం లాంటి అవలక్షణాలు ఆక్రమించినట్లుగా అనిపిస్తుంది. మనుషులు తమను తాము అత్యంత హానికరమైన రీతిలో మోసపుచ్చుకోవడం నేర్చుకున్నారు.

ఆ కాలంలో ఒక వ్యక్తి చెప్పగలిగేవాడు, "హాని చేయవద్దు, నీవు శిక్షింప బడ తావు" అని; హృదయాలు నిరాడంబరమైనవిగా నుండేవి, మనస్సులు కూడా.

అందుచేత ఒక వ్యక్తి ఇలా చెప్పేవాడు, "అవును, హాని కలిగించచకుండా వుండటం మంచిది, కారణం నేను శిక్షింప బడతాను". కానీ ఇప్పుడు వ్యంగ్య మొలక బోసే నవ్వుతో అంటాడు, "ఓహ్! శిక్షను తప్పించుకొనే మార్గం తప్పక దొరుకుతుంది" అని.

మానసిక శక్తి పెరిగి నట్లనిపిస్తుంది, మేథాశక్తి వృద్ధి చెందిందనిపిస్తుంది, మనస్సులో మెదిలే ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించే సమర్థత అధికమయిందేమోనని అనిపిస్తుంది, సమస్త నైతిక నియమావళిపై మానసిక నియంత్రణ గలవారనిపిస్తుంది. అయినప్పటికీ మహాప్రకృతికి సన్నిహితంగా జీవించి, మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించడం అంతగా తెలియని జనాల కుండిన సరళమైన, ఆరోగ్యకరమైన స్వభావాన్ని కోల్పోయారు. ఆ విధంగా సమస్త మానవజాతి దాని మనుగడలో ఒక అత్యంత ప్రమాదకరమైన మలుపుకు చేరువైనట్లుగా తోస్తుంది. ఎవరైతే సర్వ వ్యాప్తమైన అవినీతికి, అక్రమాలకు పరిష్కారం వెతికే ప్రయత్నం చేస్తున్నారో వారు మానవజాతి మునుపటి సాధారణ స్థితిని తిరిగి సాధించాలని ప్రబోధిస్తారు, కాని కచ్చితంగా అది సాధ్యపడదు: నీవు వెనుకకు పోలేవు.

తప్పకుండా మనం మరింత దూరం ముందుకు సాగాలి, ఉన్నత శిఖరాగ్రాలకు ఎగబ్రాకాలి, సుఖసంతోషాల కోసం, వ్యక్తిగత సంక్షేమం కోసం పడరాని పాట్లు పడటం ఆపివేయాలి — శిక్షకు భయపడి కాదు, మరణానంతర దండనకు జడిసి కాదు కానీ ఒక నవ్య సౌందర్య పిపాస ద్వారా, సత్యానికై, వెలుగుకై తపించుట ద్వారా అది జరగాలి. అంతే కాదు, కేవలం నీవు నీ అస్తిత్వాన్ని విస్తృత పరచుకోవడం ద్వారా, నిన్ను నీవు స్వయం ప్రకాశితుడిని చేసుకోవడం ద్వారా, అభివృద్ధి సాధించాలనే తీవ్ర ఆకాంక్షతో జ్వలించుట ద్వారానే అది సాధ్యపడుతుందనే అవగాహన ఏర్పడాలి, దాని తోనే పరిపూర్ణ ప్రశాంతత మరియు చిరకాలం నిలిచే ఆనందం లభ్యమౌతాయనే నవ భావన నీలో ఉదయించాలి.

వ్యక్తి తప్పక పైకి ఎదగాలి, విస్తృతి చెందాలి. అందుకని పైకి పెరుగు, విస్తృతి చెందు.

CWM 3:235-36

వాస్తవానికి భౌతిక అస్తిత్వం సాధారణమైనది, దానికో పరపతి కూడా వుంది. అది ఎల్లప్పుడూ జ్ఞానం కలిగి వుండకపోయినా, భౌతిక అస్తిత్వానికి ఆత్మతో సన్నిహిత

సంబంధం నెలకొల్పడంలో ప్రాణిక ఉద్వేగాలు మానసిక దంభాచారాల కన్నా ఎక్కువ ఉపయుక్తంగా నుంటాయి. బహుశా ఆ కారణంగానే కాబోలు, పిల్లలలో సైతం మనస్సు ప్రాణిక, మానసికాలు పరస్పర వైరుధ్యాలతో, నిరంతరం గాకుండా అప్పుడప్పుడు మాత్రమే సతమత మౌతుండటం మూలంగా, ప్రశాంతమై వుంటాయి.

CWM 6:6

సాక్షాత్కార మొందుట లోని ప్రయాస అంతా సమసిపోయిన వెంటనే అది అతి సామాన్య మవుతుంది. ఎంతగా నంటే ఒక పుష్పం ఎట్టి కోలాహలం లేకుండా, అట్టహాసం చేయకుండా ఏ విధంగానైతే వికసిస్తుందో, దాని అందాలను ఒలకబోస్తూ, పరిమళాలను వెదజల్లుతుందో, అంతగా. ఇట్టి సాధారణత్వంలో లేశ మాత్రమైన కలుషితం గాని, హానికర ప్రతిచర్యలు లేని మహోన్నతమైన శక్తి ఇమిడి వుంటుంది.

సాధారణత్వం, సాధారణత్వం, నీ దివ్య సమక్ష పవిత్రత ఎంత మధురాతి మధురం!...

CWM 1:17

ఒక ఔదార్యవంతమైన హృదయం ఎప్పుడూ గత నేరాలను విస్మరిస్తుంది, సామ రస్యతను పునః స్థాపించుటకు సన్నద్ధమై వుంటుంది.

మన మందరము ఉజ్వల భవిష్యత్తును స్వాగతించడానికి సంసిద్ధుల మగుటకు గాను గతంలో మసకబారి, వికృతమైన దానినంతా విస్మరించెదము గాక

CWM 17:357

"ప్రపంచం ఒక గొప్ప మార్పుకు సంసిద్ధమౌతున్నది. నీవు సహాయ పడతావా?"

ప్రశ్న: ఏ మార్పు కోసం ప్రపంచం సంసిద్ధ మౌతున్నది?

స: చేతనలో మార్పు. మన చేతన మార్పు చెందినప్పుడు, ఆ మార్పు ఏమిటో మనకు తెలుస్తుంది.

ప్ర: ఈ మార్పు రావడానికి ఎవరైనా ఏ విధంగా సహాయ పడతారు?

స: మార్పు రావడానికి మన సహాయం అక్కర లేదు, కానీ దాని రాక వృధా కానం దుకు మనంతట మనం చేతనకు తెరుచుకొని వుండటం అవసరం.

CWM 12;310

అభివృద్ధి కోసం దాహం, జ్ఞానం కోసం దాహం, పరివర్తన కోసం దాహం, అన్నింటినీ మించి దివ్యప్రేమ కోసం, పరమ సత్యం కోసం దాహం — ఒకరు దానిని నిలుపుకో

గలిగితే అతను వేగంగా పురోగమిస్తాడు. వాస్తవానికి ఆ దాహం, ఒక అవసరం, ఒక అవసరం.

ఇక బంధాలు లేవు — స్వేచ్ఛ, స్వేచ్ఛ. ప్రతి దానిని మార్పు చేయుటకు సదా సంసిద్ధత, ఒక్క దానిని తప్ప: అపేక్షించడం, మరియు ఈ దాహార్తిని.

... వ్యక్తికి అవసరమై ఆ "ఏదో ఒకటి", వ్యక్తికి అవసరమైన ఆ దివ్య ప్రేమ, వ్యక్తికి అవసరమైన ఆ పరమ సత్యం, వ్యక్తికి అవసరమైన ఆ దైవికమైన పరిపూర్ణత — అది చాలు. ఇక ఆచార నియమాల కొస్తే... అవి ఎంత మితంగా నుంటే అంత మంచిది. కానీ, ఆ అవసరం ఏది మాత్రమే దానిని తీర్చగలదో అది మాత్రం తీరితే చాలు, పూర్తిగా. నీ దారి నీది, అది ఏదైనా కానీ, ఫరవాలేదు.

CWM 11:6 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

అందమైన దివ్యజీవనం — సాధనాలు

"తనకు తాను కథ చెప్పుకోవడం"

... ఇది యెలా చేయాలో తెలిసిన పిల్లలున్నారు. వాళ్ళ స్వప్నాలను వాళ్ళు కొనసాగిస్తుంటారు. ప్రతి సాయంకాలం వారు నిద్ర పోయే సమయానికి ఒకే చోటుకు చేరి వారి స్వప్నం కొనసాగిస్తారు.

నేను చిన్నపిల్లగా నున్నప్పుడు అలాగే చేసేదాన్ని.

నీవు ఇంకా చిన్నపిల్లవు కాదు, అదే దయనీయం!

ఎందుకంటే అప్పుడు నేను సమస్యల వలయంలో చిక్కుకో లేదు.

సరే, మరో మారు చిన్నపిల్లగా మారు. అప్పుడు నీకు తెలుస్తుంది, అది మళ్ళీ ఏ విధంగా చేయాలో.

ఇంకేదీ ఎక్కువ ఆసక్తిని కలిగించదు. రాత్రులు గడపటానికి అంత కన్నా ఆహ్లాదకరమైన మార్గం లేదు. నీవో కథను మొదలిడుతావు. మేల్కొనే సమయం కాగానే కథలోని చివరి అంకం దగ్గర విరమించి తిరిగి దైహిక స్థితిలోకి ప్రవేశిస్తావు. మరుసటి రాత్రి కథను పునః ప్రారంభించి నీవు స్వాప్నిక స్థితిలో నున్నంత సేపు దానిని కొనసాగిస్తావు. తరువాత సన్నివేశాలను తగు రీతిలో అమరుస్తావు — అందంగా

వుండేటట్లుగా. దైహిక స్థితి లోనికి తిరిగి చేరే సమయ మాసన్నం కాగానే, మరో సారి ఆపి, నీవు తిరిగి వచ్చే వరకు వాటిని నిశ్చలంగా వుండమని ఆదేశిస్తావు. తిరిగి దైహిక స్థితి లోకి ప్రవేశిస్తావు, ప్రతి సాయంకాలం ఈ విధంగా కొనసాగిస్తూ అద్భుతమైన కల్పిత గాథల పుస్తకం వ్రాస్తావు. నీవు మేల్కొన్న తరువాత వాటి జ్ఞాపకం నీ కున్నప్పుడే అది సాధ్య పడుతుంది.

ప్ర: కానీ పగలంతా నీవు నిశ్చల స్థితిలో నుండ గలగడం పై ఇది ఆధారపడుతుంది కదా?

స: కాదు, ఇది పిల్లవాడి సరళ స్వభావంపై ఆదారపడుతుంది.

దానికి తోడు, అతనికి జరగబోతున్న దానిపై అతనికున్న విశ్వాసం పై ఆధారపడి వుంటుంది, మనస్సుకు తప్పులు ఎన్నే గుణం లేకపోవడంపై ఆధారపడి వుంటుంది; అమాయకమైన హృదయంపై, యువత కుండే ఉత్సాహపూర్వక క్రియాశీల శక్తి సామర్థ్యాల పైనే గాక ఒక రకమైన ఆంతరికమైన ప్రాణిక ఉదారతపై ఆధారపడి వుంటుంది. వ్యక్తికి మితిమీరిన గర్వాహంకార లుండ కూడదు, అతి లోభత్వ ముండ కూడదు. అధిక క్రియాత్మకంగా నుండ కూడదు, అధిక ఫలాపేక్ష వుండ కూడదు — నిజానికి వ్యక్తికి వుండ కూడని లక్షణాలు ఎన్నో వున్నాయి — చిన్నపిల్లల విషయంలో లాగా.

అదీ గాక వ్యక్తికి ఒక చురుకైన కల్పనాశక్తి వుండాలి — నేను పనికిరాని విష యాలు చెపుతున్నట్లుగా తోస్తుంది, కానీ అవన్నీ వాస్తవాలు — ఎందుకనగా నీ వొక దివ్యమైన రూపకర్తగా నుండవలసిన ప్రపంచ మొకటి వుంది; అది నీకే స్వంతమైన ప్రత్యేక ప్రాణిక ప్రపంచం. నీవే దానికి సొగసులు దిద్దగల దిట్టవు, ఆ నీ ప్రపంచాన్ని ఆశ్చర్యకరమైన అద్భుతంగా తీర్చిదిద్దగలవు, అయితే అది ఏ విధంగా చేయాలో నీకు తెలిసి వుండాలి. నీకు ఒక కళాత్మక లేక కవితాత్మకమైన చేతన వున్నట్లయితే, నీవు సామరస్యతను, సౌందర్యాన్ని ఆరాధించే వాడివైతే, భౌతికంలో అభివ్యక్త మయ్యేందుకు కారణ భూతమగు ఒక అత్యద్భుతమైన దేదో ఒక దానిని నిర్మిస్తావు.

నేను చిన్నదానిగా ఉన్నప్పుడు దీనిని "తనకు తాను కథ చెప్పుకోవడం" అని అనేదాన్ని.

ఇది మస్తిష్కంలో, మాటల్లో చెప్పుకోవడం ఏ మాత్రం కాదు. ఇది ఒక నిర్మలమైన సరికొత్త చోటుకి వెళ్ళి, అక్కడ ఒక అద్భుతమైన కథను అల్లడం. ఈ విధంగా నీకు

నీవు కథ చెప్పుకోవడం తెలిసినట్లయితే, అది నిజంగా అందమైనది, నిజంగా చెవి కింపైనది, నిజంగా శక్తివంతమైనది, సాఫీగా సాగేదిగా నుంటే, నీ జీవితంలో సాక్షాత్తుగా అనుభవించ గలుగుతావు — బహుశా అది పూర్తిగా నీవు మొదట్లో సృష్టించిన విధంగా నుండకపోవచ్చు, కాని నీవు ఏది చేసావో, ఇంచుమించుగా మార్పు చెందిన దాని సాకార అభివ్యక్తిగా నుండవచ్చు.

అది చేయటానికి బహు సంవత్సరాలు పట్టవచ్చు కానీ నీ కథ మాత్రం నీ జీవితాన్ని తీర్చి దిద్దటానికి కారణ మౌతుంది.

అయితే, ఒక చక్కని కథను ఎలా చెప్పాలో ఎరిగిన కొద్ది మంది మాత్రమే వున్నారు కాని వారు ఎప్పుడూ భీతి గొలిపే సంఘటనలను జోడిస్తారు. తరువాత ఎందుకలా చేసామా అని విచారిస్తారు. ఎవరైనా ఒక దివ్యమైన కథను అల్లగలిగి సుందరమైన విషయాలను తప్ప భయానకమైన వేవీ లేకుండా చెప్ప గలిగితే, అది ప్రతివారి జీవితాన్ని ఎంతో కొంత ప్రభావితం చేస్తుంది. ఈ విషయం జనులకు తెలియదు. ఒకరికి ఈ శక్తిని ఏ విధంగా వినియోగించాలో తెలిస్తే, దర్శనీయ ఆకృతులు గల ఈ ప్రపంచంలోని సృజనాత్మక శక్తి యొక్క వాడకాన్ని చిన్నతనం లోనే, పసిప్రాయంలోనే ఈ శక్తిని ఎలా ఉపయోగించాలో తెలిస్తే, వారు తమ ఐహి క భవితవ్యాన్ని తీర్చి దిద్దుకోగలరు. ఎందుకనగా అప్పుడే వారికి ఆ శక్తి వుంటుంది. కానీ, సాధారణంగా నీ చుట్టూ వున్న మనుషులు, కొన్ని సార్లు స్వయంగా నీ చిన్ననాటి స్నేహితులు, ఎక్కువగా నీ తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తెలిసీ తెలియకుండా దానిలో జోక్యం చేసుకొని చెడగొడతారు. ఎంతగానంటే అది సత్ఫలం కలిగించడం చాలా అరుదు.

కానీ అలా కాకుండా అది స్వేచ్ఛగా ఒక పనితనపు వైఖరితో చేసినట్లయితే, ఒక అద్భుతమైన జీవితాన్ని నీకు నీవే స్వయంగా ఏర్పాటు చేసుకో గలవు — నేను మాట్లాడుతున్నది భౌతిక ప్రపంచం గురించి. చిన్ననాటి కలలు యుక్తవయసు వాస్తవాలు.

CWM 8: 118

పుస్తకాలలో చిత్రీకరించ నవసరం లేకుండానే హృదయవిదారకమైన విషయాలు ప్రపంచంలో కావలసినన్ని వున్నాయని నీకు అనిపించటం లేదా? ఈ విషయం నా చిన్నతనంలో కూడా నన్ను ఆశ్చర్యపరుస్తుండేది. జీవితం ఎంతో వికృతమైనది.

అల్పమైన, నికృష్టమైన, కొన్నిసార్లు జుగుప్సాకరమైన విషయాలతో నిండి వున్నది. ఇప్పటికే ప్రబలి వున్న చెడు విషయాలను మించిన చెడ్డవాటిని ఊహించు కోవడంలో ప్రయోజనమేమిటి? నీవు ఏదో రమణీయమైన, అత్యంత ఆనందమయమైన జీవితాన్ని ఊహించుకున్నట్లయితే, అది శ్రమకు తగ్గ ఫలితం దక్కినట్లుండేది.

CWM 4: 155 — *అనువాదం: తుమ్మల లక్ష్మి*

నిన్ను నీవు వ్యవస్థీకరించుకోవాలి

ప్రతి ఒక్కరిలో పరస్పర విరుద్ధమైన సంకల్పాలుంటాయి.

అవును చాలా. ప్రాథమికంగా తెలుసుకోబడిన వాటిలో ఇది ఒకటి. ఒకభాగం విషయాలీ విధంగా నుండాలని కోరుతుంది, మరో క్షణం, మరో విధంగా, మూడోసారి వేరొక విధంగా నుండాలని!

దానితోపాటు ఇదికూడా జరుగుతుంది: ఒకటి ఇది కావాలని కోరుతుంది. మరొకటి వద్దు అని అంటుంది. కాబట్టి కనీస పక్షంగా నైనా నిన్ను నీవు వ్యవస్థీకరించా లనుకుంటే, ఏదైతే నిన్ను వ్యవస్థీకరించగలదో దానిని స్పష్టంగా కనుగొనాలి. సినిమాలో లాగా నీవు స్వయంగా ఒక తెరమీద నీ ప్రతిబింబ ఛాయను ప్రదర్శించి నీ కదలికలు ఎలా వున్నాయో ఎందుకు గమనించవు? అది ఎంత ఆసక్తిదాయకంగా నుంటుంది!

ఇది మొదటి అడుగు.

నిన్ను నీవు తెరపైన ప్రదర్శించుకో. తరువాత అక్కడ కదిలే దానినంతా గమనించు. ఎలా కదులుతున్నదో, ఏమి జరుగుతున్నదో? ఒక చిన్నరేఖా పటం గీయి. అప్పుడు అది ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. కొంతసేపు తరువాత చూడటానికి అలవాటుపడ్డ తరువాత, మరొక్క అడుగేసి, ఒక నిశ్చయానికి రావాలి. లేకపోతే మరింత పెద్ద అడుగేయాలి. ఒక ఏర్పాటు గావించు. ఒక పద్ధతిలో ప్రతి దానిని దాని ఉచిత స్థానంలో నిలుపు. ఏర్పాటు ఎలాగుండాలంటే నీ కదలిక సూటిగా సాగాలి, ఒక అంతరార్థంతో. అప్పుడు నీవు కదులుతున్న దిశను గురించిన ఎరుక నీకు ఏర్పడుతుంది. నీవు ఇలా అనగలుగుతావు. "సరే, మంచిది. ఈ విధంగానే వుండనీ, నా జీవితం ఆ విధంగానే వృద్ధి చెందుతుంది. ఎందుకనగా అది నా

అస్తిత్వం యొక్క హేతుబద్ధత, ఇప్పుడు అదంతా నాలో ఒక పద్ధతిగా అమర్చుకున్నాను, ప్రతి విషయం దాని స్థానంలో ఉంచబడింది. కాబట్టి ప్రధానమైన దిశా నిర్దేశం రూపొందుతున్నది. నేను ఈ నిర్దేశిత దిశను అనుసరిస్తున్నాను. మరొక్క అడుగువేస్తే, నాకేమి జరుగుతుందో నాకు తెలుస్తుంది. ఎందుకనగా దానిని నేనే స్వయంగా నిర్ణయించాను." నాకు తెలియదు, నీ కిది చెబుతున్నాను. నాకది అత్యాసక్తిదాయక మనిపించింది. లోకంలో కల్లా ఆసక్తికరమైనది అక్కడ ఏమీ లేకుండింది. దానిని మించిన ఆసక్తికరమైనది వేరొకటి లేకుండింది. ఇది నాకు అనుభవమయింది.... నా కప్పుడు అయిదారేండ్ల వయస్సు (ఏడో ఏట ఈ విషయం దృఢమయింది) నా తండ్రి సర్కస్ అంటే ఇష్టపడే వాడు. నా వద్దకు వచ్చి అన్నాడు, "నాతో రా, ఆది వారం సర్కసుకు వెళ్తున్నాను." నేనన్నాను "కాదు, సర్కస్ కన్నా అధిక ఆసక్తికరమైన దానిని నేను చూస్తున్నాను." మరోసారి నా స్నేహితులు ఒక సమావేశానికి రమ్మని ఆహ్వానించారు. అక్కడ మేమందరమూ కలిసి ఆడుకోవాలి, ఉల్లాసంగా గడపాలి. "కాదు, ఇక్కడ అంతాకన్నా ఎక్కువ ఉల్లాసంగా నుంటాను." అది ఎంతో మనస్ఫూర్తిగా అన్నమాట, నటనకాదు: నాకావిధంగా నుండేది, అది నిజం. లోకంలో అంతకు మించిన ఆనందకరమైనది వేరొకటి లేకుండింది.

ఎవరైనా ఆ విధంగా, అదే కొత్తదనంతో, అంత మనస్ఫూర్తిగా చేస్తే, వారు అత్యంత ఆసక్తిదాయకమైన ఫలితాలను తప్పక పొందుతారు. దానినంతా నీ ముందు ఒక తెరపై నుంచి, ఏమి జరుగుతున్నదో చూస్తుంటే! మొట్టమొదలు ఏమి జరుగుతున్నదో తెలుసుకోవాలి, నీకు ఏదైనా సంతోషంగా లేకపోతే కళ్ళు మూసుకొనే ప్రయత్నం చేయవద్దు. కళ్ళు బాగా తెరిచి వుంచి కనిపిస్తున్న ప్రతి దానిని ఆ విధంగా తెరముందు వుంచాలి. అప్పుడు ఎంతో ఆసక్తికరమైన దానిని కనుగొంటావు. తరువాత చేయవలసిందేమిటంటే, నీకు నీవు ఇలా చెప్పటం ప్రారంభించాలి, "అదంతా నాలోనే జరుగుతున్నది కాబట్టి, ఎందుకని ఈ విషయాన్ని ఈ విధంగా, ఆ విషయాన్ని ఆ విధంగా పెట్టకూడదు? ఈ మరోదానిని ఈ విధంగా ఎందుకు వుంచకూడదు? ఆ విధంగా నేనొక అర్థవంతమైన దానిని హేతుబద్ధంగా చేసినట్లుండదా? దారిలో ఆటంకం కలిగిస్తున్న దానిని తొలగించినట్లు ఈపరస్పర విరుద్ధంగా నున్న సంకల్పాలను ఎందుకు తొలగించకూడదు? ఎందుకు ? అస్తిత్వంలో అది దేనిని సూచిస్తుంది? అది అక్కడ ఉన్నది ఎందుకు? దానిని వేరొక చోట పెట్టినట్లయితే నాకు హాని కలిగించటానికి

బదులు మేలు చేయదా? ఆవిధంగా......

అట్టి ఆలోచనలతో కొద్ది కొద్దిగా నీవు స్పష్టంగా చూడ గలుగుతావు. ఆ తరువాత ఈ విధంగా నీవు ఎందుకు చేయబడ్డావో, నీవు చేయవలసిన పని ఏమిటో, దేనికోసం నీవు జన్మించావో, గ్రహించగలుగుతావు. అప్పుడు, అతి సహజంగా ఇదంతా జర గటానికి తగిన ఏర్పాటు చేయబడింది గనుక, నీకు మార్గం సుగమ మౌతుంది. ముందుగానే నీవు చెప్ప గలుగుతావు "ఈ విధంగా ఇది జరుగుతుంది" అని — ఇక బయట నుండి ఈ ఏర్పాటును అస్తవ్యస్తం గావించే పరిస్థితులు తటస్థించితే, నీవు చెప్పగలుగుతావు, "కాదు, అది ఉపయుక్తం కాబట్టి దీనిని నేను అంగీకరించాను. అది హానికరం కాబట్టి దీనిని తిరస్కరించాను" అని. అటుపిమ్మట కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత, ఒక గుర్రాన్ని అదుపులో పెట్టినట్లుగా నిన్ను నీవు అదుపులో నుంచుకుంటావు. అప్పుడు నీ కేది ఇష్టమో అది చేస్తావు, నీ కిష్టమైన రీతిలో, నీ కిష్టమైన చోటికి పోతావు.

ఇది శ్రమకు తగ్గ ఫలితం ఇస్తుందని నాకు తోస్తుంది. ఇది అత్యంత ఆసక్తికరమైన విషయం అని నేను నమ్ముతాను.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఒకే ఒక్క పరిష్కారం

ప్రపంచం ప్రస్తుతమున్న స్థితిలో పరిస్థితులు ఎప్పుడూ కష్టతరంగానే ఉంటాయి. ఈ విశ్వమంతా ఆవిష్కరించ బడాలని చూస్తున్న సత్యం, వెలుగులకు మరియు అందుకు ప్రతికూలంగా గతంలో స్థిరపడి, ఘనీభవించి వదలిపెట్టని దేదైతే మార్పును నిరసిస్తుందో దానికి మధ్య జరిగే ఘర్షణ, విరోధాలతో నిండి ఉంది.

సహజంగానే ప్రతివ్యక్తి తన స్వంత యిబ్బందులను కలిగి ఉంటాడు. అలాంటి అవరోధాలనే ఎదుర్కోవలసి ఉంటుంది.

కేవలం మీకు ఒకే ఒక మార్గం ఉంది. అది ఒక సమగ్రమైన, సంపూర్ణమైన షరతులు లేని సమర్పణ. అలా అనటంలో నా ఉద్దేశ్య మేమిటంటే మీరు మీ చర్య లను, మీ విధులను, అభీష్టాలనే గాక మీ భావనలను, ఒక విధంగా మీరు నిర్వహించే

సర్వస్వాన్ని మీరు ఏదైతే అయి వున్నారో దాని నంతటిని కేవలం దైవంకోసమే సమర్పించాలి. అందువలన చుట్టూ ఉన్న మానవుల ప్రతి స్పందన లన్నింటికీ అతీతంగా ఉన్న భావన మీకు కలుగుతుంది. కేవలం వాటికి అతీతంగా ఉన్నట్లే కాకుండా దైవకృప ఒక గోడలా మీకు రక్షణ కల్పిస్తున్నట్లుగా నుంటుంది. ఒక్కసారి గనుక ఏ విధమయిన కోరికలు, అనుబంధాలు, లేకుండా ఎప్పుడైతే మానవులనుండి, వారెవరైనప్పటికీ, ప్రశంసలు అందుకోవలసిన అవసరం లేదనుకుంటే, కేవలం పరమాత్మ నుండి వచ్చే ప్రశంస మాత్రమే విలువయినది అని అది మిమ్మల్నెప్పుడూ విఫలం కానీయదు అని గ్రహించగలిగితే, ఒక్కసారి మీరు బాహ్యమైన వస్తువులతో, వ్యక్తులతో బంధాన్ని విడిచి పెడితే, తక్షణమే మీ హృదయంలో మీలో సర్వదా ఉండే ఈ దివ్య సాన్నిధ్యాన్ని దైవ శక్తిని, దైవకృపని అనుభూతి చెందుతారు.

వేరొక పరిష్కారమేమీ లేదు. అందరికీ మినహాయింపు లేకుండా అదొక్కటే మార్గం. బాధలను అనుభవించే వారికి యిదే విషయం చెప్పాలి. బాధలన్నింటికీ కారణం సమర్పణ సంపూర్ణంగా లేకపోవటమే. మీ కెప్పుడైనా ఎదురుదెబ్బ తగిలిన భావన కలిగినపుడు “ఇది బాగాలేదు”, లేక “ఈ పరిస్థితి కష్టంగా ఉంది” అనుకునే బదులు నా సమర్పణ సంపూర్ణంగా లేదు అనుకుంటే అది బాగుంటుంది. మీ రపుడు మీకు సహాయం చేసి, మీకు మార్గాన్ని చూపే దైవకృపను అనుభూతి చెందుతారు, ముందుకు కొనసాగుతారు. ఏదో ఒకరోజు మిమ్మల్ని ఏదీ కలతపెట్టని ప్రశాంతత లోకి అడుగిడుతారు. అన్ని వ్యతిరేకశక్తులను, ప్రతికూల చర్యలను, దాడులను, అపార్థాలను, దుస్సంకల్పాలను మీరు దైవకృప పట్ల పూర్తి విశ్వాసం వలన వచ్చే చిరునవ్వుతో ఎదుర్కొంటారు. కేవలం అదొక్కటే బయటపడే మార్గం, మరొకటి ఏదీ లేదు.

ఈ ప్రపంచం వైషమ్యాలు, బాధలూ, కష్టాలు, శ్రమతో నిర్మితమై ఉంది, అది యింకా మార్పు చెందలేదు. మారటానికి కొంతకాలం పడుతుంది. ప్రతి ఒక్కరికీ దాని నుండి బయటపడే సంభావ్యత ఉంది.... పరమ కృపపై ఆధార పడగలిగితే అదొక్కటే మార్గం. నేను రెండు, మూడు, రోజులుగా పదేపదే ఆ విషయాన్ని మీకు చెప్పుతున్నాను....

ప్ర: కానీ అంత శక్తి ఎక్కడ లభ్యమౌతుంది?

మీ లోపలనే. ఆ దివ్య సన్నిధానం మీలోనే ఉంది, మీ లోపలే ఉంది. మీరు దానికోసం

బయట వెతుకుతున్నారు. అంతర్ముఖంగా చూడండి. దివ్య సన్నిధానం అక్కడే ఉంది. మీరు శక్తిని పొందటానికి ఎదుటివారి ప్రశంస కోసం చూస్తుంటారు. అది మీ కెప్పటికీ లభించదు. ఆ శక్తి మీలో ఉంది. మీరు కావాలనుకుంటే, సర్వోత్తమమైన గమ్యం కోసం, సర్వోత్కృష్ట వెలుగు కోసం, దివ్యజ్ఞానం కోసం, దివ్య ప్రేమ కోసం, మీరు ఆకాంక్షించవచ్చు. కానీ అది మీలోనే ఉంది. లేకపోతే మీ రెప్పటికీ దానితో సంపర్కం పొందలేరు. మీరు మీ లోపల లోలోతులకు వెళ్ళగలిగినపుడు అక్కడ మీ కది కనిపిస్తుంది — నిరంతరం నిటారుగా పైకెగసే జ్వాలలా.

అలా చేయటం చాలా కష్టమని అనుకోవద్దు. మీరెపుడూ బాహ్యోన్ముఖులై ఉండటం వలన దైవ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందలేకపోతున్నారు.

మీరు బాహ్యమైన ఆలంబన కోసం వెతకటం మాని, మనస్సును ఏకాగ్రం చేసి, అంతర్ముఖులై పరమప్రజ్ఞను ప్రార్థించినపుడు ప్రతిక్షణం ఏమి చేయాలో ఎలా చేయాలో — మిమ్మల్ని మీరు చేసే పనులను పరిపూర్ణతను పొందటానికై పూర్తిగా అర్పించుకున్నప్పుడు — ఆ ఆలంబన మిమ్మల్ని అనుక్షణం నడిపిస్తూ, మార్గాన్ని చూపుతున్నట్లుగా అనుభూతి చెందుతారు.

ఏదైనా కష్టం వచ్చినప్పుడు పోరాటం మాని ఆ పరమ ప్రజ్ఞ చేతులలో పెట్టండి. అన్ని దుస్సంకల్పాలను, అన్ని అపార్థాలను, అన్ని చెడు స్పందనలను మీరు పూర్తిగా సమర్పణ చేసుకొన్నప్పుడు ఆపై మీకు సంబంధం ఉండదు. అప్పుడది పరమాత్మ బాధ్యత. ఆయన స్కంధాలపై ఉంచుకొని ఏమి చేయాలో అందరికన్నా ఆయనకు బాగా తెలుసు. అదొక్కటే మార్గం, తెలుసుకో బిడ్డా.

CWM 15: 398-400

మానవ ప్రకృతిని మార్చకుండా మానవ జీవనాన్ని మార్చటమనేది అర్థంలేని, ఆధ్యాత్మికం కాని ఆలోచన. అది అసహజమయిన, అవాస్తవమైన, అసాధ్యమయిన అద్భుతాన్ని కోరుకోవటం వంటిది.

.... ఒక్కొక్కప్పుడు కేవలం విద్య, మేధా పరమైన శిక్షణ మానవులను మార్చ గలదని భావించేవారు. అది ఒక వ్యక్తిని, సామూహిక అహాన్ని కొంత మెరుగైన వివ రాలతో తమ స్వయం సంపత్తికై సమర్థవంతమైన యంత్రాంగాన్ని యివ్వగలదు, కానీ మానవ అహం అలానే మార్పు చెందకుండా ఉండిపోతుంది.

SABCL 19:1053-59

కేవలం సమూలమైన చైతన్య మార్పు మాత్రమే మానవతను అది మునిగి ఉన్న భయంకరమైన దురవస్థనుండి రక్షించ గలదు, మునిగి ఉన్న భయంకరమైన దురవస్థ నుండి రక్షించగలదు. మిగిలిన ఆచరణాత్మక మనిపించే సాధనాలన్నీ పిల్ల చేష్టలే. వాటితో మనుషులు నిజమైన అవసరాలను తెలుసుకోకుండా, ఉన్న ఒకే ఒక పరిష్కారాన్ని చూడకుండా, తమని తాము అంధులుగా చేసుకుంటున్నారు.

CWM 15 : 67 *అనువాదం: డా. సరోజా ప్రసాద్*

జీవితోద్దేశం

అవును, ఐహికమైన ఉనికికి తగిన కారణం, ఒకరు భూమిమీద దైవాన్ని సాక్షాత్కరించు కోవటం కోసం.

ఈ కారణం లేకుండా ఐహిక జీవితం రాక్షసం.

(మౌనం)

దైవాన్ని తిరిగి కనుక్కోవడం, ఆయనలాగా పరిణమించటం, ఆయనను అభివ్యక్తం చేయటం, బాహ్యంలో ఆయనను సాక్షాత్కరించుకోవడం అనేటటువంటి పరమోత్కృష్ట కారణం అక్కడ లేకపోతే, ఐహిక జీవితం, అది ఉన్నది ఉన్నట్టుగా, ఒక విధమైన రాక్షసత్వం

సహజంగానే ఎంత ఎక్కువగా జనులు ఎరుకలేని వారవుతారో, వారి కది అంత తక్కువ అర్థమవుతుంది, కారణం వారు వాస్తవికతను గ్రహించలేరు, వారు యాంత్రికంగా, అలవాటు ప్రకారం, వాస్తవాన్ని కూడా గ్రహించకుండా లేదా కనీసం వారి జీవన విధానాన్ని గురించిన ఎరుక కూడా లేకుండా జీవిస్తారు. చైతన్యం వృద్ధి పొందిన కొలదీ, జీవితం ఎటువంటి రాక్షసత్వంతో నరకప్రాయంగా ఉంటున్నదో వారు అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు — జీవితం అది ఉన్నది ఉన్నట్లుగా.

కేవలం ఈ జీవితం ఎటు వైపుకు తీసుకు వెళ్తున్నదో దానిని గురించిన ఎరుకలోకి వచ్చినప్పుడు మాత్రమే, వారు దానిని ఒప్పుకుంటారు, అర్థం చేసుకుంటారు. కేవలం జీవితాని కున్న ఈ ఉద్దేశం మాత్రమే దానిని ఆమోదించ దగినదిగా చేస్తుంది.

CWM 8:119

ఒకరు తనకి తానే సంతోషిస్తూ, తనని తాను మరచిపోయినప్పుడు, విషయాలను వచ్చినవి వచ్చినట్లుగా ఒకరు గ్రహిస్తున్నప్పుడు, గంభీరంగా ఉండటాన్ని, జీవితాన్ని తేరిపార చూడటాన్ని తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఒక్కమాటలో, ఒకరు పట్టించుకోకుండా విస్మరించటానికే చూస్తుంటే, అక్కడ పరిష్కరించ వలసిన ఒక సమస్య ఉందనే విషయాన్ని, అక్కడ తెలుసుకో వలసిన దేదో ఉందనే విషయాన్ని, మన ఉనికికి, జీవించటానికి ఒక కారణం ఉందనే విషయాన్ని, మనం ఇక్కడ ఉన్నామంటే వాస్తవంగా ఏదో విధంగా మన కాలాన్ని గడిపేసి, ఏమీ నేర్చుకోకుండా లేదా ఏమీ చేయకుండా వెళ్ళిపోవడానికి కాదనే విషయాన్ని మరచిపోతే, అప్పుడు వారు నిజంగా వారియొక్క కాలాన్ని వ్యర్థం చేసిన వారవుతారు. ఒకరు మన కివ్వబడిన అవకాశాన్ని కోల్పోతారు — నేను దీనిని అసదృశమని అనలేను. కాని పురోభివృద్ధికి క్షేత్రమైనటువంటి ఉనికికి అద్భుతమైన అవకాశమని, జీవితంయొక్క రహస్యాన్ని ఆవిష్కరించగలిగే శాశ్వతత్వంలోని క్షణ మాత్ర కాలం అని అనగలను. కారణం ఈ భౌతికం, ఈ ప్రాపంచికమైన ఉనికి ఒక అద్భుతమైన అవకాశం, జీవి తోద్దేశాన్ని కనుగొనటానికి నీ కివ్వబడిన ఒక సంభావ్యత, మిక్కిలి లోతైన ఈ సత్యం వైపు నీవొక అడుగుముందుకు వేయడానికి, దివ్యజీవితం యొక్క శాశ్వత పారవశ్యంతో నిన్ను సంపర్కంలోకి తీసుకు వచ్చేటటువంటి ఈ రహస్యాన్ని నిన్ను కనుగొనేటట్లు చేస్తున్నటువంటి ఒక అద్భుతమైన సదవకాశం.

(నిశ్శబ్దం)

నేను నీకు ఇప్పటికే చాలాసార్లు చెప్పాను, బాధను, క్లేశాన్ని కోరుకోవటం అనారోగ్యకరమైన వైఖరి అని, దానిని తప్పక పరిహరించాలి అని, కాని వాటినుంచి మతి మరపుతో, పైపైన ఉన్న, అల్పమైన గమనంతో, ధ్యాస మళ్ళడం ద్వారా పరుగెత్తి పారిపోవడం అనేది పిరికితనం. మనకి వేదనవచ్చిందంటే, అది మనకు ఏదో బోధించటానికి వస్తుంది. మనం అది ఎంత త్వరగా తెలుసుకొంటే, అంత త్వరగా వేదన అవసరం తగ్గిపోతుంది. మన కా రహస్యం తెలిసినప్పుడు బాధను అనుభవించడం ఇక ఏమాత్రం జరగదు. ఎందువల్లనంటే ఆ రహస్యం మనకు ఉద్దే శాన్ని బహిర్గతంచేస్తుంది, దానికారణం, బాధకు మూలం, దానిని దాటిదూరంగా పోయే మార్గం తెలుస్తాయి. దాని రహస్యం, అహంకారం నుంచి బయటపడటం, ఆ బందిఖానా నుంచి బయటపడటం, దైవంతో మనకి మనం ఐక్యం కావటం,

ఆయనలో లీనమైపోవటం, ఆయనను మనలను వేరుచేసే వాటిని వేటినీ ఆమోదించక పోవటం. అప్పుడు ఒకసారి గనక ఈ రహస్యాన్ని కనుగొని, దానిని తన అస్తిత్వంలో సాక్షాత్కరించుకొంటే, వేదన దాని ఆవశ్యకతను కోల్పోతుంది. బాధ మాయ మవుతుంది. అది సర్వశక్తివంతమైన నివారణోపాయం, కేవలం అస్తిత్వంలోని చాలా లోతైన భాగాల లోనే కాక, ఆత్మలో. ఆధ్యాత్మిక చైతన్యంలో, అంతేకాక జీవితంలోను, శరీరంలోను కూడా.

CWM 9 : 42-43

శ్రీఅరవిందులు చెప్పేదంతా... మానవ ప్రకృతిని దాని జడత్వంతో, దాని భారంతో, బద్ధకంతో, తేలికగా పొందే సంతృప్తులతో, సమస్త ప్రయత్నానికి ఉండే ప్రతికూల భావంతో ఎదురొడ్డి పోరాటానికి ఉద్దేశించ బడింది. జీవితంలో శాంతి కాముకులుగా మారి పోయినటువంటి వారిని ఒకరు ఎన్నోమార్లు కలుసుకోవడం జరుగుతుంది, కారణం వారు పోరాచానికి భయపడతారు. వారు దానిని గడించటానికి ముందే విశ్రాంతిని వాంఛిస్తారు. కొంచెం పురోగతితో సంతృప్తిని పొందుతారు, మార్గమధ్యం లో ఆపివేయ దలచుకొన్న దానిని సమర్థించుకోవటానికి వారు వారి కల్పనలతో, కోరికలతో దానిని ఒక అద్భుతమైన సాక్షాత్కారంగా చేసుకొంటారు.

సాధారణ జీవితంలో ఇది ఇప్పటికే ఎంతగానో జరుగుతూ ఉంది. యదార్థానికి ఇది బూర్జువా ఆదర్శం, అది మానవజాతిని శక్తి, బలం కోల్పోయేటట్లు చేసింది. ఇప్పుడు మనిషి ఏ విధంగా ఉన్నాడో అలా తయారుచేసింది. "యవ్వనంలో ఉన్నప్పుడు పనిచేయి, ధనం, గౌరవం, హోదా పోగుచేసుకో, పొదుపుగా ఉండు. కొంచెం ముందు చూపు కలిగి ఉండు, కొంచెం ప్రక్కన పెట్టు, కొంత మూలధనం దాచిపెట్టు, ఒక అధికారి అవు — ఫలితంగా తరువాత నీవు నీ నలభైయో పడిలోకి చేరినప్పుడు "కూర్చోగలవు. నీ ఆదాయాన్ని అనుభవించు, తరువాత నీ పించనును, వాళ్ళు చెప్తున్నట్లుగా మంచి సంపాదన గల విశ్రాంత జీవిత ఆనందాన్ని పొందు" చతికిలబడిపోవడం, మార్గంలో ఆగిపోవడం, ముందుకు కదలకపోవటం, నిద్రపోవటం, ఒకరు తమ సమయానికి ముందే క్రిందికి శ్మశానం దిశగా తరలిపోవటం, జీవితోద్దేశాన్ని జీవించకుండా ఆగిపోవటం — చతికిలపడిపోవటం!

ముందుకు పోకుండా ఒక్క క్షణం ఆగిపోతే, వారు వెనక్కి పడిపోతారు. ఒకరు ఒక్కక్షణం సంతృప్తిపొంది, ఇక ఏమాత్రం ఆకాంక్షించక పోతే, వారు చనిపోవటం

మొదలు పెడతారు. జీవితం ఒక గమనం, అది ఒక ప్రయత్నం, అది ప్రగతి పథానికి చేసే కవాతు, అది శిఖరారోహణం, నూతన జ్ఞానోదయాలవైపుకు, భవిష్య సాక్షాత్కారాల వైపుకు అధిరోహణం. విశ్రాంతి పొందాలని కోరుకోవటం కంటే ఎక్కువ ప్రమాదకరమైనది మరొకటి లేదు. కార్యశీలత లోనే, ప్రయత్నం లోనే, ముందుకు వేసే పదఘటన లోనే, విశ్రాంతిని, దివ్యానుగ్రహంలో, పూర్ణ విశ్వాసంలో, కోరికలు లేకుండా, స్వార్థా హంకారం మీద గెలుపు సాధించి నిజమైన ప్రశాంతతనూ తప్పక కనుగొనవలసి ఉంది.

నిజమైన ప్రశాంతత విశాలత్వం నుంచి, చైతన్యం యొక్క సార్వజనీనత నుంచి వస్తుంది. ప్రపంచమంత విశాలంగా నీవు ఎల్లప్పుడు విశ్రాంతిలో ఉంటావు. నట్టనడి కార్యాచరణలో, పూర్తిగా యుద్ధం మధ్యలో, ప్రయత్నంలో, నీవు అనంతత్వం, శాశ్వతత్వం లోని ప్రశాంతను తెలుసుకో గలుగుతావు.

CWM 9: 65-66

ప్ర: మాతా, బాహ్యంలో కనబడే వాటియెడ యోగి వైఖరి ఏ విధంగా ఉండాలి?

స: గుడ్డిగా ఉండటానికి బదులు స్పష్టంగా చూడగలిగిన దానివలన కలిగే ప్రయోజనంలా వుండాలి. బాహ్యంలో కనబడే వాటివలన ఇక ఎంతమాత్రం మోసగించబడకపోవటం వలన కలిగే ప్రయోజనంలా వుండాలి.

అజ్ఞానంలోను, అనృతంలోను జీవించటానికి బదులుగా నిజమైన జీవితోద్దేశం తెలుసుకోవటంవలన కలిగే ప్రయోజనంలా వుండాలి.

CWM 16:392

పురోగతికై తహతహ, జ్ఞానానికై తహతహ, పరివర్తనకై తహతహ, అన్నింటినీ మించి, దివ్యప్రేమకై, దివ్యసత్యానికై తహతహ — దానిని ఒకరు కలిగి ఉంటే, వారు చాలా తొందరగా పయనిస్తారు. నిజంగా ఒక తహతహ, ఒక అవసరం, ఒక అవసరం.

ఏ బంధాలు లేవు — స్వేచ్ఛ, స్వేచ్ఛ, ఎల్లప్పుడూ ప్రతి ఒక్కదానినీ మార్చడానికి సంసిద్ధంగా ఉండటం, ఒక్క విషయంలో తప్ప: ఆకాంక్షిస్తూ, ఈ తహ తహను.

... ఒకరికి ఏదో 'ఒక దాని' అక్కర, ఒకరికి దివ్యప్రేమ అక్కర, ఒకరికి దివ్యసత్యం అక్కర, ఒకరికి పరమోత్కృష్ట దివ్య సంపూర్ణత అక్కర — అంతే. సూత్రాలు — ఎన్ని తక్కువ సూత్రాలుంటే, అంతమంచిది. కాని అది: ఆ అక్కర, కేవలం ఆ 'పరమవిషయం' మాత్రమే సంతృప్తి కలిగించ గలదు — మరేదీ కాదు. సాక్షిక

ప్రమాణ మంటూ లేదు, కేవలం అదే. అంతట నీ పయనం సాగించు!... నీ దారి నీదే.... ఏ దారైనా గాని, ఫరవాలేదు. ఫరవాలేదు....

CWM11: 6

సమిష్టి సామరస్యత దిశగా

మరీ చాలా కాలం క్రిందటి విషయం కాదు, మనిషి ఆధ్యాత్మిక ఆకాంక్ష, ఒక నిశ్శబ్దం మరియు క్రియారహిత ప్రశాంతం వైపు మరల్చబడుతూ, ప్రాపంచిక విషయా లన్నింటి నుంచి తెగ తెంపులు చేసుకొంటూ, జీవితం నుంచి పలాయనం చిత్తగించుతూ, కచ్చితంగా పోరాటాన్ని తప్పించుకోవడానికి, జీవితంలోని పెనుగులాటలకు తటస్థంగా ఉంటూ, ప్రయత్న మంతటి నుంచి తప్పించుకొని పారిపోయే సమయం ఒకటుండేది; అది ఒక ఆధ్యాత్మిక ప్రశాంతత, అందులో సమస్త ఉద్రిక్తతలు, పెనుగులాటలు, ప్రయత్నాలు ఆగిపోవడంతో పాటుగా అన్ని విధాలైన బాధానుభవం కూడా అక్కడ ఆగిపోవటం జరిగింది. ఆధ్యాత్మిక దివ్యజీవనానికి ఇదే అసలైనటువంటి, కేవల వ్యక్తీకరణగా తలంచబడింది. అదే దైవానుగ్రహంగా, దైవ సహాయంగా, దైవ జోక్యంగా భావించబడింది. ఇప్పటికీ కూడా తీవ్రబాధ, ఉద్రిక్తత, శ్రుతిమించి పోయిన ఉద్రిక్తతల యుగం లోను ఈ సర్వోత్కృష్ట ప్రశాంతతే అన్నింటి లోకి అత్యుత్తమ తోడ్పాటును అందించేదిగా, ఎంతో ఆదరంతో ఆహ్వానించ బడేదిగా, జనులు అడిగే, ఆశించే ఉపశమనంగా తలచబడుతున్నది. ఇప్పటికీ చాలామందికి అది దైవ జోక్యానికి, దైవానుగ్రహానికి నిజమైన సూచన.

యదార్థానికి ఒకరు ఏ సాక్షాత్కారాన్ని కోరుతున్నా గాని, వారు పరిపూర్ణమైన, చెక్కుచెదరని ఈ ప్రశాంతతను నెలకొల్పుకోవటంతో తప్పక మొదలుపెట్టవలసినదే. ఈ ఆధారంనుంచే ఒకరు తప్పక పనిచేయవలసిఉంది, కాని ఒకరు అనన్య సామాన్యమైన, వ్యక్తిగతమైన స్వార్థపూరిత విమోచనకై కలలు కంటే తప్ప, అక్కడే ఆగిపోలేరు. నూతన ప్రపంచానికి ద్వారాలను తెరచేటటువంటి దైవసాక్షాత్కారంతో కేవలం ఎంపికైన కొద్దిమంది మాత్రమే లాభపడటం కాకుండా, వారి ప్రభావంతో, వారి ఉదాహరణంతో, వారి ఆధిపత్యశక్తితో మిగతా మానవ జాతికి నవ్యమైన, శ్రేష్టమైన స్థితిగతులను తీసుకువచ్చే దైవానుగ్రహం యొక్క దృక్పథం, అన్ని అడ్డంకులమీద గెలుపు సాధించే పురోగమన దృక్పథం, మానవజాతిని కొత్త సాక్షాత్కార దిశగా

ముందుకుతోసే మరియొక దృక్పథం ఉంది.

ఇది భవిష్యత్తులో సాక్షాత్కార మార్గాలనూ, ముందుగానే కనుగొనబడిన సాధ్యా సాధ్యాలను తెలియ జెప్తుంది. ఎరుకతోగాని లేదా ఎరుకలేకగాని నూతన శక్తులకు ఉన్మీలనమైన మానవ జాతి భాగం మొత్తం, అంతా ఉన్నది ఉన్నట్లుగా, మరింతగా ఉన్నతమైన, ఎక్కువ సామరస్యపూరకమైన, మరింతగా పరిపూర్ణమైన జీవితంలోకి పైకెత్తబడినప్పుడు ...ఒక వేళ ప్రత్యేక వ్యక్తి యొక్క పరివర్తన ఎల్లప్పుడూ అనుమతించ బడకపోయినా, లేదా సాధ్యపడకపోయినా, అక్కడ ఒక సామూహికమైన ఉద్ధరణ, సమస్తం యొక్క సమన్వయం ఉంటుంది. దాని ఫలితంగా నూతన వర్గ క్రమాన్ని, నూతన సామరస్యతను నెలకొల్పటానికి ఇప్పుడున్న అస్తవ్యస్తత, సంఘర్షణల తీవ్ర పరితాపం లేకుండా పోవటానికి, దాని స్థానంలో మొత్తాన్ని సామరస్యపూరితంగా పనిచేయటానికి ఔదలదాల్చే కొత్త క్రమ వ్యవస్థ స్థాపించబడటానికి సాధ్యమయ్యేటట్లు చేస్తుంది.

జీవితంలో మనస్సు జోక్యం చేసుకొని సృష్టించిన వక్రీకరణలనూ, వికారాలనూ, కృతకంగా చేయబడిన మొత్తం సముదాయం మూలంగా ఎక్కువైన బాధ, దైన్యం, నైతిక లేమిని, మొత్తం మానవ జీవిత భాగాన్ని ఒక విధంగా ఎంతో భయంకరంగా చేస్తున్నటువంటి మలినమైన, జుగుప్సాకరమైన, హీనమైన స్థితిని మొత్తం ఒక వ్యతిరేక దిశలో పరిహరించటానికి మొగ్గు చూపించే ఇతర పర్యవసానాలు ఉన్నాయి.

అదంతా తప్పకుండా లేకుండా పోవలసిందే.

ఇది మానవ జాతిని నిరాడంబరత లోనూ, సహజప్రకృతి ధర్మంగా తనకు తానుగా ఏ బాహ్య ప్రేరణలు లేకుండా ప్రవర్తించడంలోను, సామరస్యతలోనూ, సమస్తాన్ని అది పొంది ఉన్నప్పటికీ, ఎన్నో విధాలుగా అపరిమితంగా పశుప్రాయమగు జీవితంకంటే అత్యంత అధమాధమంగా చేస్తున్నది.

ప్రత్యేకంగా స్వార్థపూరితమైన అవసరాలసేవకు ఉపయోగించే మానసిక వినియోగం వలన వక్రమార్గం పట్టిన మానవజాతి లోని ఒక వర్గానికి ఇప్పుడున్న విధంగా, జంతువులలో బాధ ఇంత దైన్యావస్థలో, హీనస్థితిలో ఎన్నడూ లేదు.

మనం తప్పక ఉన్నత స్థితికి పైకి పోవాలి, దివ్యప్రకాశం, దివ్యసామరస్యత లోకి దూకాలి లేదా క్రిందికి ఆరోగ్యకరమైనటువంటి కృతకం కాని నిరాడంబరమైన జంతు జీవితంలోకి తిరిగి పడిపోవాలి.....

కాని ఎవరైతే ఉద్ధరింపబడలేరో ఎవరైతే పురోగతికి తిరస్కరిస్తారో, వారు స్వతస్సిద్ధంగా మానసిక చైతన్యం వినియోగాన్ని కోల్పోయి, అధో మానవ స్థాయికి వెనక్కి పడిపోతారు.

CWM 9 :298-99 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

మానవ సంబంధాలలోని అంతరార్థం

మానవ సంబంధాలను నాలుగు ముఖ్య విభాగాలుగా వర్గీకరించవచ్చు. అవి మనం చేసే నాలుగు రకాలైన కార్యక్రమాలకు సంబంధించి ఏర్పడతాయి. అవే భౌతికము, ప్రాణికము, అతీంద్రియమనసు. మానసికము. ఇవన్నీ ఒకే సమయంలో మనపై ప్రభావం చూపించవచ్చు, లేదా ఒకదాని తరువాత ఒకటి పనిచేయవచ్చు. ఇది మన కార్యక్రమాల తీరుతెన్నులను బట్టి ఉంటుంది.

మనం దేహధారులం కాబట్టి శారీరకమైన సంబంధాలు తప్పకుండా వుంటాయి. ఇవి మనకు జన్మ నిచ్చిన వారిమీద, మనపై ఆధారపడే వారి యెడల వుంటాయి. వారు రక్త సంబంధం కలిగినవారు కూడా.

మన సన్నిహితులతో కూడా మనకు భౌతిక సంబంధం వుంటుంది. మన ఇరుగు పొరుగువారి పైన, తోటి ప్రయాణీకులతోను, వీధులలో కలిసే వారితో గాని ఈ సంబంధాలు ఏర్పడతాయి. (ఈ రకమైన సంబంధం కేవలం భౌతికం అని చెప్పలేము. మిగతా మూడురకాల సంబంధాలతో ఇది కలిసి వుండే అవకాశం కూడా ఉంది. ఈ పరిస్థితి మిగతా సంబంధాల విషయంలోనూ ఉండవచ్చు. కాకపోతే, భౌతిక సంబంధం మిగతా మూడు సంబంధాల కన్నా ఎక్కువ ప్రభావం కలిగి ఉంటుంది)

ఏకోన్ముఖంగా సాగే ఆధ్యాత్మిక కాంక్షలు ఉన్నచోట, ఆధ్యాత్మిక సంబంధం ఏర్పడుతుంది.

సమానమైన మానసిక సామర్థ్యం గాని, సంబంధిత ప్రతిభా పాటవాలు కానీ ఉన్న వారితో మానసిక సంబంధం ఉంటుంది.

ఈ నాలుగు రకాల మానవ సంబంధాలలో ఏ ఒక్కటి ప్రముఖంగా లేకపోతే మనం సన్నిహితులకు భౌతికంగానే సహాయపడ గలము. మనకు నిర్వహణా

సామర్థ్యము, క్రమమైన విధానము ఉన్నపుడు ఇది సాధ్యపడుతుంది.

కొన్ని మినహాయింపులను వదలి వేస్తే, మన కుటుంబ సభ్యులకు వస్తు రూపంలో చేయగలిగిన సహాయం కన్నా, సహాయం అవసరమైన కొందరు అప్పుడప్పుడు వీధులలో, బస్సులలో, రైళ్ళలో, ఓడలలో తారస పడే వారికి కూడా వస్తు రూపేణా చేసే సహాయయం మంచిది. రోగగ్రస్తులకు, ప్రమాదాల బారిన పడిన వారికి, ఆర్థిక సహాయం ఎక్కువ ప్రయోజనాన్ని ఇస్తుంది.

మనతో పాటే ఏ విషయంలో నైనా సమానమైన అభిరుచులు (కళాత్మకం గాని, మరేవైనా గాని) ఉన్నందున మన కాకర్షితులైన వారి విషయంలో అట్టి వారికి మద్దతును, తగు సూచనలను ఇవ్వటం వలన వారి ఇంద్రియ సంవేదనా శక్తుల సమతౌల్యానికి, వాటిని సరి జేయడానికి, వాటిని సవ్య మైన రీతిగా సాగడానికి తగిన మద్దతు లభిస్తుంది.

మన లాంటి అభ్యుదయ ఆకాంక్షలే కలిగి యుండి, మనతో సంబంధాలు యేర్పడిన వారికి మనం సహాయ పడవచ్చు. అట్టి వారికి మనం ఆదర్శ ప్రాయంగా వుండి, వారికి మార్గదర్శనం కూడా చెయ్యవచ్చు. మన ప్రేమాభిమానాలతో వాళ్ళ మార్గాన్ని సుగమం చేయవచ్చు. చివరిగా, మన తెలివి తేటల వెలుగును మన సన్నిహితులపై ప్రసరించేలా చూచి, వీలయితే వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేయవచ్చు, వారి ఆదర్శాన్ని కూడా తేజోవంతం చేయవచ్చు.

పైన పేర్కొన్న సంబంధాలు కొద్దో గొప్పో సున్నితమైన తేడాలతో మనకు ఎదురౌతాయి. కాని మన పరిజ్ఞానం తగినంత చురుకుగా లేనందున వాటిని మనం అంత జాగ్రత్తగా గమనించ లేము.

తోటి వారి యెడల మంచి భావనను అభివృద్ధి చేసుకోవటానికి గాని, మన విధానాల లోని దోషాలను తగ్గించుకోటానికి గాని ముందుగా మనకు వారితో గల సంబంధాలు ఏర్పడటానికి గల కారణాల పూర్వాపరాలను బాగుగా పరిశీలించుకోవాలి. మన సంబంధాలు ఏ తరహాకు చెందినవో నిర్ధారించుకోవాలి.

కొంతమంది అరుదైన వ్యక్తులతో మనకు చాల దగ్గఱ సంబంధం వుంటుంది. వారు మనకు ఆ నాలుగు రకాల కార్యక్రమాలలో తోడుగా వుంటారు. వీరే నిజమైన మిత్రులు. అట్టి వారి విషయంలో మనం చేసే పనులు సమగ్రంగాను, సహాయ పడునవి గాను, ప్రయోజనం సమకూర్చేవి గాను ఉండగలవు. మన సంబంధాలు,

"ఎంత కాలము ఇలాగే కొనసాగుతాయి?" అనే దాని మీదను మనం ఎన్ని సార్లు సహాయపడ్డాము అనేదాని మీదను, వ్యక్తుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాల గాఢత పైననూ ఆధారపడి ఉంటాయి. మనలోనూ, వారిలోనూ అంతర్గతంగా ఉన్న శాశ్వతమైన సారం అన్నిటా ఉన్నది అని విశ్వసిస్తే, వారితో మన సంబంధాలు శాశ్వతంగా వుంటాయి. అలాంటి వారు మన దగ్గరలో ఉన్నా, లేక సుదూరంలో ఉన్నా, ఈ లోకంలోనూ పై లోకంలోనూ వారు కలిసే ఉంటారు. వీరిని మనం భౌతి కంగా కలవగలమా లేదా అనేది ప్రధానంగా మన అంతరంగంలో, ఆ కలయిక అనుభూతి కలుగుతుందా లేదా అనే దాని మీద ఆధారపడి ఉంటుంది. కలయిక జరిగితే మన వైఖరి పూర్తిగా మారుతుంది.

శ్రీమాతతో మమేకమైనట్లయితే మనలోని భగవత్తత్వంతో కూడా మమేక మైనట్లయితే సమస్తంతో కలిసిపోతాము. అప్పుడే ఆమె ద్వారా, ఆమె వలన మనం జీవు అందరితో సంపర్కమేర్పరచుకుంటాము. అప్పుడు "ఆకర్షణ - వికర్షణ లకు" లోను కాకుండా యిష్టాయిష్టాలను త్రోసిరాజని ఆమెకు చేరువ కాగలం. ఆమెకు దూరంగా ఉన్నవాటికి మనం కూడా దూరమౌతాము.

ఈ విధంగా అందరి మధ్యన మనం ఎల్లప్పుడు మరింత సమగ్రమైన మేథ మరియు ఆధ్యాత్మిక కార్యనిర్వాహక నమూనాగా మారాలి. ఆ విధంగా అందరికీ సదవగాహన ఏర్పడి దివ్యజీవన పథంలో అడుగిడటానికి ఒక అవకాశం కలుగుతుంది.

CWM 2: 71-73

మనిషి తన ప్రకృతియొక్క అన్ని అస్తిత్వ స్థితులకు సర్వశక్తి సమన్వితుడగు అధి పతి అని, కానీ అతడు అట్టి పాత్రను పోషించటం మరిచాడని చెప్పవచ్చు.

సర్వశక్తివంతుడుగా నుండటం అతని సహజ స్థితి — ఆ విధంగా నుండటం అతను విస్మరించాడు.

పరిణామ క్రమంలో మనిషి తన సర్వ శక్తిత్వాన్ని మరచిపోవడం సహజం. ఎందుకనగా ఆ లక్షణం అతనిని గర్వాహంకరాలతో ఉబ్బిపోవునట్లు చేసి, వక్రగతిని పట్టించింది. అందులవన తనకన్నా బలమైనవి, అధిక శక్తివంతమైనవి, అనేక మున్నాయనే భావన అతనిలో కలిగించవలసి వచ్చింది. అయితే ఇది అంతగా వాస్తవమైన విషయం కాదు. అది పురోగమన పథంలో ఒక అవసరమైన మలుపు. అంతే.

మనిషి దైవంగా రూపొంద గలిగే సంభావ్యత గలవాడు. తానే స్వయంగా

వాస్తవమైన దైవాన్నన్ని విశ్వసించాడు. తాను నేల మీద పాకే హీనమైన అల్ప కీటకాని కన్నా మించిన వాడిని కాదని తెలుసుకోవలసి వచ్చింది.కాబట్టి జీవితం అతనిని అన్ని విధాలుగా చెక్కింది, చదును చేసింది, తురుమింది ,ఎంతగానంటే... ఆ విషయాన్ని అతడు అర్థం చేసుకోలేక పోయినా, కనీసం అణుమాత్రమైనా అవ గతం చేసుకొనేటంతగా. కానీ అతనికి సరైన దృక్పథం ఏర్పడిన వెంటనే తాను దైవంగా రూపొంద గల సంభావ్యత గలవాడినని గ్రహిస్తాడు. కావలసింది ఒక్కటే. అతను తప్పకుండా ఆ విధంగా కావాలి. అందుకు ప్రతికూలమైన దానినంతా అధి గమించాలి.

దైవాలతో మనకున్న సంబంధం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఎంతకాలం దేవుళ్ళను ఆశ్చర్యము, విభ్రాంతి, భయంతో చూస్తామో, వారి సౌందర్యానికి, అతీతశక్తులకు సిద్ధులకు ఆశ్చర్యచకితులు, భయకంపితులము ఔతామో, అంతకాలము మనం వారికి బానిసలము ఔతాము. ఏనాడు ఇవన్నీ పరమాత్మ ప్రదర్శించే వివిధ మార్గాలనీ, అంతకంటే విశేషం వాటిలో ఏమీ లేదనీ తెలుసుకుంటామో, ఏనాడు తాము దైవ అస్థిత్వంయొక్క మారు రూపాలమని, అవశ్యం అతనిగా మారాలని గ్రహిస్తామో, మనలోని బానిస భావం అంతమై, ఈ సంబంధాలన్నీ మారిపోయి మనం "దైవాలకు బానిసలము కాము" అనే నిర్ణయానికి మానవాళి వస్తుంది.

CWM 11: 38-39 *అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు*

నిజమైన అవసరం

నీవు దైవం వైపు మళ్ళి, పూర్తి విశ్వాసంతో ఆయన్ను అడిగావంటే నీకు అవసరమైనది నువ్వు పొందుతావు. అది అవసరమైనదని నీవు ఊహించుకున్నది కానవసరంలేదు. కానీ నీకు నిజంగా అవసరమైన దానిని నువ్వు పొందుతావు. దాని కొరకు నువ్వు ఆయన్ను అడగాలి.

ఈ ప్రయోగాన్ని నీవు నిజాయితీగా చేయవలసివుంటుంది. దీనిని పొందేందుకు నువ్వు అన్ని విధాలైన బాహ్యమార్గాలలో ప్రయత్నించి అడగకుండానే భగవంతుడు దానిని నీకు ఇవ్వాలనుకోకూడదు. వాస్తవానికి ఏదైనా నీకు ఇవ్వమని నీవు ఎవరినైనా కోరుకొన్నప్పుడు నువ్వు అతడిని అడుగవా? అలాంటప్పుడు నీవు అడగకుండానే

దానిని భగవంతుడు నీకు ఇవ్వాలని ఎలా అనుకుంటావు? సాధారణ చైతన్యంలో ఈ భావన విరుద్ధంగా ఉంటుంది.నీవు కొంత నిశ్చిత భావనతో ఇలా అంటావు "నాకు ఇది అవసరం. నాకు ఈ అనుబంధం అవసరం. ఈ ప్రేమ అవసరం, ఈ జ్ఞానం అవసరం, వగైరా. దైవం దీనిని నాకు తప్పకుండా ఇవ్వాలి. లేకపోతే ఆయన దైవం కాదు." ఆ విధంగా చెప్పటంతో నువ్వు సమస్యను పూర్తిగా తలక్రిందులు చేసినట్లే. అన్నింటికన్నా ముందుగా "నాకు అవసరం" అని నువ్వు అంటావు. నీకు నిజంగా అది అవసరమా లేక అది కేవలం నీ మనోగత విశ్వాసమా? లేక ఒక కోరిక లేదా ఒక అజ్ఞాన భావనా అన్నది నీకు తెలుసా?

మొదటివిషయం: దాని గురించి నీకు ఏమీ తెలియదు.

రెండవ విషయం: "నాకు ఇది అవసరం." అని దైవానికి చెప్పుకుంటూ నీ స్వీయ సంకల్పాన్ని దైవం మీద రుద్దాలని అనుకుంటున్నావు. అది కావాలని కూడా అతనిని నీవు అడుగవు. నువ్వు ఇలా అంటావు, "నాకు దానిని ఇవ్వు. అది నాకు అవసరం. అది నాకు అవసరమైనది గనుక అది నాకు అతి సహజంగా, అప్రయత్నంగా రావాలి: నాకు అవసరమైనవన్నీ ఇవ్వటం భగవంతుడి కర్తవ్యం." కానీ నిజానికి నీకు ఏది అవసరమో నీకు తెలియక, అది కేవలం ఒక భ్రమ తప్ప యదార్థం కాక పోతే అందులోనూ దానిని నువ్వు నీ చుట్టూ వున్నజీవితం నుండి అడుగుతావు తప్ప దైవం వైపు మళ్ళవు గనుక దైవానికి నీకు మధ్యన ఎటువంటి అనుబంధమును ఏర్పరచుకోవు, ఆయన గురించి ఆలోచించవు లేదా కనీసం నీ దృక్పథంలో కొంత నిజాయితీతోనైనా ఆయనవైపు మళ్ళవు, ఆయనను ఏమీ అడుగవు, కనుక దేనినైనా నీ కివ్వటానికి ఆయనకు కారణము లేదు.

కానీ ఆయన దైవం గనుక నువ్వు ఆయనను అడిగితే, నీకు అవసరమైనదేదో నీకన్నా ఆయనకే బాగా తెలిసివుంటుంది. నీకు అవసరమైన దానిని నీకు ఇస్తాడు. లేదా నువ్వు హఠంతో నీ స్వంత సంకల్పాన్ని రుద్దాలని చూస్తే, నీలో జ్ఞానం కలి గించి నీ పొరపాటు గురించి నీలో చైతన్యం కలుగచేయడానికి నువ్వు కోరుకున్నది నీకు ఇస్తాడు. అది నిజానికి నీకు అవసరమైనది కాకపోయినా. అప్పుడు నువ్వు దానికి అసమ్మతి తెలపడం ప్రారంభిస్తావు. నీవే అన్న వ్యక్తిగత అర్థంలో కాదు. నేను సర్వ మానవజాతి గురించి మాట్లాడుతున్నాను. "భగవంతుడు నాకు హాని చేసేదాన్ని నాకు ఎందుకు ఇచ్చాడు?" అంటావు. దానిని అడిగింది నీవే ననే

విషయం మరచి ఈ రెండు సందర్భాలలో కూడా అసమ్మతినే తెలుపుతావు. ఒకవేళ నువ్వు అడిగింది ఆయన నీకు ఇచ్చి, అది నీకు మంచికన్నా ఎక్కువగా హాని చేస్తే, నీవు అప్పుడు కూడా వ్యతిరేకిస్తావు. ఒకవేళ ఇవ్వకపోతే మళ్ళీ అసమ్మతి తెలుపుతావు. "ఏమిటి నాకు అవసరమని నేను చెప్పినది నాకు ఆయన ఇవ్వలేదు", అంటూ. ఈ రెండు సందర్భాలలో కూడా అనంగీకారం తెలుపుతావు. పాపం! భగవంతుడు నిందించ బడతాడు. దీనంతటికి బదులు నీలో ఒక ఆకాంక్ష, అదేమిటో అనే ఒక తీవ్ర తపన, ఒక ప్రేరేపణ, నీవు సత్యమని భావించే దానిని అన్ని విషయాల మూలమును, సర్వోన్నత మంచిని, మనం కోరుకొనే వాటంతటికీ సమాధానాన్ని, అన్ని సమస్యల పరిష్కారాన్ని తెలుసుకోవాలనే ఒక తీవ్రమైన గాఢ భావావేశం వుంటే, నువ్వు ఎప్పటికీ ఇలా అనవు. "నాకు ఇది ఇవ్వు," లేకపోతే "నాకు ఇది అవసరం, నాకు ఇది కావాలి," అందుకు బదులు నువ్వు అంటావు "నాకు అవసరమైనదానిని చెయ్యి. నా అస్తిత్వం యొక్క సత్యానికి నన్ను నడిపించు. నీ సర్వోన్నత జ్ఞానంలో, నీవు నాకు ఏది అవసరమని దర్శిస్తావో దానిని ఇవ్వు." అప్పుడు ఖచ్చితంగా నువ్వు పొరపాటు పడినట్లుకాదు. నీకు హాని చేసే దానిని ఆయన నీకు ఇవ్వడు. ఇంతకన్నా ఉన్నతమైనది అడుగు. కానీ దానితో ప్రారంభించటం మరింత కష్టం.


"నాకు ఇది అవసరం, నాకు దీనిని ఇవ్వు" అని భగవంతుడితో చెప్పే దానికన్నా మొదటిది దైవాన్ని చేరే నిజమైన దృక్పథం. ఎందుకంటే తమకు ఏది అవసరమో, తెలిసినవాళ్ళు కొద్దిమందే ఉంటారు, చాలా కొద్దిమంది. దీనికి ఋజువు ఏమిటంటే వారెప్పుడూ తమ కోరికలను సఫలం చేసుకోవాలనే అన్వేషణలోనే వుంటారు. వారి శ్రమ మొత్తం దాని మీదనే ఆధారపడి వుంటుంది. వారి కోరికలలో ఒకటి నెరవేరిన ప్రతిసారి నిరుత్సాహపడతారు. వేరొకటి కావాలని ఆరాటపడడం మొదలిడుతారు.

CWM 8: 122-26 అనువాదం: సునీత శేఖర్

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2017



ప్రభు నిలయం

ప్రభు నిలయం


సంపాదకీయం

ప్రస్తుతం శ్రీఅరబిందో ఆశ్రమంగా పిలువబడుతున్న ఈ ఆశ్రమం స్థాపించబడి తొంభై సంవత్సరాలు గడిచిన సందర్భం గురుతుగా ఈ సంచిక సమర్పితం.

24 నవంబరు 1926 నాటి మహామహిమాన్విత సంఘటన తదనంతరం ఏర్పాటు గావించబడిన ఈ ఆశ్రమంతో పాటు పూర్ణయోగ తత్వం సమాచారం సుదూర తీరాలకు విస్తరించింది. అంతే కాదు, ఎచ్చోటనైనా అభ్యసించతగ్గ యోగంతో పాటు, ఆ మహితాత్ముల తపః పలితంగా భూమండలానికి, వ్యక్తులకు పై నుండి లభ్యమైన నూతన దివ్య చేతనా ప్రసరణ శక్తి యొక్క మహోన్నత ప్రభావానికి ఈ ఆశ్రమం కేంద్ర స్థానంగా నున్న దనుట నిస్సందేహం. అట్టి ముఖ్యమైన కారణంగా శాశ్వతమైన ప్రాధాన్యతను సంతరించుకున్న మరో విషయ మేమిటనగా, ఈ ఆశ్రమం కేవలం శ్రీమాతారవిందుల యోగ సాఫల్యత కోసం వారిచే ఎన్నుకోబడిన ఐహిక లోక ఆవాసమే కాక వారి తపోపీఠం కూడా. అనేకమైన ఇతర కారణాలను ప్రక్కన బెట్టితే, ఈ ఒక్క కారణం చాలు, పూర్ణయోగ మార్గానుసరులచే శ్రీఅరవిందాశ్రమం అత్యంత ప్రీతి పాత్రము మరియు పవిత్రమైనదిగా పరిగణించ బడటానికి. పూర్ణయోగం భౌగోళిక సరిహద్దులకే పరిమితం కానప్పటికీ, దాని అభ్యాసకులు విశ్వమంతటా విస్తరించి ఉన్నప్పటికీ, కేవలం దాని ప్రత్యక్ష ఉనికితో భూమండలం యొక్క దైవపరమైన ఆకాంక్షకు ఆమూలాగ్రంగా సత్తువ నిచ్చే పోషక విలువల కేంద్రంగా ఆశ్రమం నిలిచి వుంటుంది.

స్థలాభావ కారణంగా ఆశ్రమ జీవనం యొక్క బహుముఖ విశేషాలను సంచికలో విపులంగా చర్చించ వీలు గాకపోయినా, కొన్నింటిని మాత్రం ప్రస్తావించడమైనది.

సంపాదకుడు (అనువాదం: అందుగులపాటి కైలాసపతి)



కాదు, ఆశ్రమంలో ఉండటం సరిపోదు — వ్యక్తి శ్రీమాతకు తెరుచుకొని, తాను లోకంలో ఏ బురదమట్టితో నైతే ఆడుతున్నాడో దానిని వదిలి వేయాలి.

CWSA 32:156 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

భగవంతుని స్వప్నం

భూమండలంపై ఏదో ఒక చోట ఏ దేశము హక్కు భుక్తంగా నాకే స్వంతమన లేన టువంటి ప్రాంత మొకటి ఉండి ఉండాలి. అచ్చట స్వచ్ఛమగు ఆకాంక్ష, సత్ప్రవర్తన గల సుగుణశీలురైన జనులు స్వేచ్ఛగా, విశ్వపౌరులుగా, అనన్యమగు పరమ సత్య ఏకాధిపత్యతకు విధేయులై జీవించగలరు. ఆ ప్రాంతం ప్రశాంతత, ఐక్యత, సామరస్యతలతో నిండి వుంటుంది. అచ్చట మనిషికి సహజంగా నుండే పోరాడే నైజం ప్రత్యేకంగా అతని కష్టాలకు, దుఃఖాలకు గల కారణాలను అణిచి వేయడానికి, అతని బలహీనతలను, అజ్ఞానాన్ని అధిగమించడానికి, అతని కున్న పరిమితులను, అశక్తతలను జయించడానికి వినియోగించ బడుతుంది. కోరికలను తీర్చడానికి, ఐహికానందం పొందడానికి పడే పాట్లు కన్నా ఆత్మ సంతృప్తికి, మానవ పురోగతికి కావలసిన అవసరాలను తీర్చాలనే ఆరాటానికి ప్రాధాన్యత వుంటుంది. ఈ ప్రదేశంలో బాలలు వారి ఆత్మానుసంధానం కోల్పోకుండా సమగ్రమైన పెరుగుదలను, అభివృద్ధిని సాధించ గలరు. విద్యాభ్యాసం కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికో లేక యోగ్యతా పత్రాలు పొందడానికో లేక ఉద్యోగాలు సంపాదించుకోవడానికో కాక ప్రస్తుత విద్యానైపుణ్యతలను మెరుగు పరచుకొనుటకు, క్రొంగ్రొత్త పోకడలను అనుకరించుటకు దోహద పడేదిగా నుంటుంది. ఇచ్చట బిరుదులు, హోదాలు, అంతస్తుల స్థానంలో సేవ చేయడానికి, పరిస్థితులను వ్యవస్థీకరించడానికి గల అవకాశాలు చోటు చేసుకుం టాయి. ప్రతి ఒక్కరు వారి దైహిక అవసరాలను అందరితో సమానంగా పొందగల వ్యవస్థ వుంటుంది. ఈ వ్యవస్థలో మేధాపరమైన, నైతికపరమైన, ఆధ్యాత్మిక పరమైన ఔన్నత్యం, జీవింతలో పొందే అధికారాలు, ఆనందాలు అధికమయ్యే విధంగా ప్రకటిత మవడానికి బదులు విధి నిర్వహణల బాధ్యతల పెరుగుదలలో వ్యక్తపడతాయి. చిత్రలేఖనం, శిల్పకళ, సంగీతం, సాహిత్యం రూపాల్లో గల సౌందర్యాన్ని ఆస్వాదించు టకు అందరికీ ప్రవేశార్హత సమానంగా లభిస్తుంది. అయితే తద్వారా సమకూరే ఆనందంలో పాలు పంచుకోగల సమర్థత ప్రతి ఒక్కరి నైపుణ్యతను బట్టి నిర్ధారించ బడుతుంది గానీ వారి సామాజిక లేక ఆర్థిక స్తోమతను బట్టి కాదు. ఎందుకనగా ఈ ఆదర్శవంతమైన రంగంలో డబ్బుకు పెద్ద పీట వేయబడదు. భౌతిక సంపద కన్నా, సమాజంలో వున్న పేరు ప్రఖ్యాతుల కన్నా, వ్యక్తిగత విలువకు అధిక ప్రాధాన్యత

వుంటుంది. అక్కడ పని చేయడం జీవన భృతి సంపాదనకు మార్గంగా నుండదు. కానీ తమను తాము వ్యక్తపరచుకొనుటకు, తమ సమర్థతలను, సంభావ్యతలను మెరుగు పరచుకొనుటతో పాటు తమ వంతుగా సమాజ సేవ చేయడం వలన వ్యక్తులకు జీవనాధారం లభ్యమవుతుంది, కార్యాచరణకు రంగం ఏర్పడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, మానవ సంబంధాలు ఏవైతే సర్వ సాధారణంగా కేవలం పోటీ తత్వం పైన, పోటీదారుల మధ్య తగవులాటలపైన ఆధారపడి వుంటాయో వాటికి బదులు కార్యాచరణలో ఒకరిని మించి ఒకరు నైపుణ్యత కనబరుస్తూ, పరస్పరం సహకరించుకుంటూ, నిజమైన సోదర భావంతో మెలుగుతుండటం సంభవిస్తుంది.

అలాంటి ఆదర్శాన్ని సాఫల్యం చేసుకోవడానికి ప్రపంచం ఇప్పటికీ సిద్ధపడి లేదు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకనగా మానవజాతి దానిని అర్థం చేసుకొని ఆమోదించటానికి తగినంత జ్ఞానం గానీ, దానిని అమలుపరచడానికి ఆవశ్యకమైన చేతనా శక్తిని గాని ఇప్పటికీ పుంజుకో లేదు. అందు కే అది ఒక స్వప్నమని అంటాను.

అయినా కూడా ఈ స్వప్నం సార్థకమొందే గమనంలో నున్నది. అది సాధించ డానికే మనం శ్రీఅరవిందాశ్రమంలో ఉద్యమిస్తున్నాము. ఆ కార్యం అతి కొద్ది స్థాయిలో, మన పరిమితమైన సాధనా సంపత్తికి సరిపడునట్లుగా కొనసాగుతున్నది. సాధన అంత సమగ్రంగా సాగటం లేదనుట నిజమే కాని, పురోగమన దిశగా సాగు తున్నది. కొద్ది కొద్దిగా మన గమ్యం దిశగా అడుగేస్తున్నాం. ఏదో ఒక రోజున ప్రస్తు త గందరగోళ పరిస్థితి నుండి బయట పడటానికి, ప్రస్తుత స్థాయి కన్నా మెరుగైన సామరస్యత, వాస్తవికత గల నూతన జీవం పోసుకొని, ఒక ఆచరణాత్మకమైన, సమర్థమైన విధానాన్ని ప్రపంచానికి అందజేయ గలమనే ఆశ వున్నది.

CWM 12:93-94

ఒక ప్రత్యేకమైన ఏర్పాటు

దేవుని కంఠస్వరం విన్నాను. దైవికమైన బలం, ప్రకాశం, మరియు శక్తి యొక్క సాక్షాత్కారానుభూతి కలిగింది. అది సర్వాన్ని పురోగమించునట్లుగా ప్రేరేపిస్తున్నది. (ఎప్పటి లాగే అది క్రియాశీలకమైన శక్తి). అది మిరుమిట్లు గొలుపుతున్న తెల్లని వెలుగు. కాని నాకు విచిత్రమైనదిగా కనిపించే దేమిటంటే అక్కడ నేను పూర్తిగా నా సహజ స్థితి కలిగి వున్నాను. ఇక ఈ ఆశ్రమం నా యొక్క చిన్న, అతి చిన్న

భాగమై వుండింది. ఆ అనుభవం కొనసాగినంత వరకు ఆ విధంగానే వుండింది — నాలో ఒక చిన్న భాగంగా. మిగిలినదంతా, కేంద్రీకృతమై లేదన లేను, కానీ సంపూర్ణంగా, సర్వ సాధారణంగా ప్రతి రాత్రి మామూలుగా జరిగే కార్యక్రమంలా వుండింది. నేను ఆశ్రమాన్ని స్పష్టంగాగ చూస్తున్నాను — కొన్ని ప్రత్యేక కారణాల వలన ఏదో ప్రత్యేకతను సంతరించు కొన్నట్లుండింది. కానీ నేను భౌతికంగా ఒక అపారమైన దేహం కలిగి వున్నా ననిపించింది, కానీ అది అతి చిన్నదిగా, అతి స్వల్పనమైనది.

నా దేహంతో పోలిస్తే, ఆశ్రమాన్ని బోలిన ఆ కట్టడం, నా నాభి స్థానమంత ఎత్తున వుండింది. శరీరం పరిమితిని మించి లేదని అనలేము గాని, కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను లేక కొంత స్పష్టంగా రూపొందించబడని ఆకారాలను కలిగి వుండింది. శరీరంలోని ఒక భాగాన్ని ప్రతిబింబిస్తున్నట్లుగా అవి పరస్పరం ఒకదాని కొకటి అనుసంధానమై వున్నాయి. ప్రతి ఒక్కటి ప్రపంచ మందు జరిగే ఒక కార్యాచరణకో, లేక దానిలోని ఒక భాగానికో లేక అది ఏ విధంగా ప్రదర్శించబడు తుందో అనే దానికి సూచికగా వుండింది. ఆ విధంగా వాటి నిర్మాణం నాభి స్థానానికి దరిదాపుగా మొదలై క్రిందకు మూలాధారం వైపుగా సాగింది....

దాని రూపం నిడువుగా, క్రిందకు దీర్ఘంగా సాగదీసి నట్లుగా నుంది. (అది ఎప్పుడూ ఇట్టి రూపాన్నే కలిగి వుంటుంది). పై భాగం ఒక శిరస్సును బోలి వుండి రేఖలు గీతలు క్రిందిగా సాగి కనుమరుగైనాయి. అది ఎక్కడా తెరుచుకొని లేదు. ఆ పైన, అనేకమైన మసక బారిన పొరలు దానిని ఆవరించి ఉన్నాయి. అవి ముదురైన నీలారుణ వర్ణం గలవి. అది రక్షణను సూచించే రంగు. మిణుకు మిణుకు మంటున్న కాంతి దానిలో ప్రవేశిస్తూ ఉంది — ప్రవేశిస్తుండింది గానీ ఎటువంటి రంధ్రాలను చేయకుండా. అది ప్రతిదాని నుండీ సూటిగా దూసుకపోయింది. నీలారుణ వర్ణం ద్వారానే గాక ప్రతిదాని నుండి కూడా. అలా దూసుకుపోతూ, ఒక జలపాతంలా, రంగు రంగుల మెరుపులు చిందుతున్న ఒక ఆవరణలోకి ప్రవేశించింది. ఇలాంటి శక్తిధారా ఝురులు ఎల్లప్పుడూ వుంటాయి. ధారాపాతంగా పడుతున్న నీళ్ళు ప్రవహించకుండా, కనీసం అంతరించి పోకుండా నిలిచి వుండినట్లు. ఆ నీటి నిలువ ఒక ఓజస్సుల సంకలనం, ఒక సంక్షేపం. ఒక విధంగా దగ్గరగా అణచి వేయబడి అధిక స్థలాన్ని ఆక్రమించకుండా నిలిచి వుంటాయి. ఇక లోలోపల అది చలిస్తుంటుంది, కంపిస్తుంటుంది, కంపిస్తూనే వుంటుంది; అది వస్తూనే వుంటుంది — ఎక్కడి నుండి

వస్తున్నదో నీకు తెలియదు, కానీ దాని రాక కొనసాగుతూనే వుంటుంది, కూడుతూనే వుంటుంది.

అది ఒక శక్తి, దాని మధ్య భాగంలో ఒక తెల్లని కాంతి వెలుగుతూ వుంటుంది. అది దివ్యమాత యొక్క శక్తి. అది లోపల బాగా దట్టించబడి, కేంద్రీకరించబడి లేక ఘనీభవించబడిన వెంటనే అనేక రంగులను దాల్చింది — రంగు రంగుల మెరుపులు కదిలాడాయి — ఒక మూర్తిమంతంగా — దివ్యశక్తి పదార్థంలోకి ప్రవేశించినపుడు ఏ విధంగా మూర్తిమంత మౌతుందో ఆ విధంగా నుండినాయి ఈ రంగులు. (ఏ విధంగానైతే పదార్థం శక్తి యొక్క ఘనీభవించిన స్థితియో, ఇది ఘనీభవించిన దివ్యశక్తిగా తోచింది....)

The Mother: Conversations with a disciple

ఆశ్రమంలో పనులు జరిగే తీరు

...ఎప్పుడైనా గానీ ఒక ఆలోచనతో కూడిన ప్రణాళిక, ఒక ఖరారు చేయబడిన కార్యక్రమం లేక ముందుగా స్థిరీకరించబడిన ఏర్పాటు వుండేది కాదు. మొత్తం కార్యం ఒక చేతనాపూర్వక ఉద్యమం (చిత్ తపస్సు) ద్వారా, ఒక ప్రాణం పోసు కున్న జీవి పుట్టి, పెరిగి, వృద్ధి చెందినట్లుగా, సర్వదా పోషింపబడి, ప్రబలమై, బలపరచబడింది. దివ్యచేతనా శక్తి పదార్థంలోకి దిగి వచ్చి ప్రసరించగానే, అది ప్రకటిత మవడానికి తగిన ఉపకరణాలకై వెతుకుతుంది. ఉపకరణం ఎంత ఎక్కువగా వివృతమై, గ్రహణశక్తియుతమై, మలచుటకు వీలుగా నుంటే, ఫలితాలు అంత విశి ష్టంగా నుంటాయనే విషయం చెప్ప నక్కర లేదు. సాధకులలోను, వారి ద్వారాను నిరాటంకంగా, సామరస్య పూర్వకంగా పని చేయడానికి ఆటంకపరచే రెండు ప్రతిరోధ కాలు ఏవంటే:

1) చేతనాశక్తి కార్యాచరణకు, ప్రభావానికి అడ్డుపడే మానసిక ఊహాగానాలు మరియు ముందుగా ఏర్పడిన అభిప్రాయాలు.

2) మక్కువ చూపడం, అభిమానించడం లాంటి ప్రాణిక లక్షణాలు ఏవి భావ ప్రకటనను వక్రగతి పట్టించి, తారుమారు చేసేవి.

ఈ రెండు ప్రతిరోధకాలు అహంభావ జనిత సహజ ఫలితాలు. ఈ రెండింటి జోక్యం లేనప్పుడు నేను భౌతికంగా జోక్యం చేసుకోవలసిన అవసర ముండదు.

"శ్రీమాత ఇష్టపడతారు", "శ్రీమాత ఇష్టపడరు" అనే మాటలను నమ్మనని నీ వనటంలో నీవు నిజం పలికావు. అది కేవలం చిన్నపిల్లలు వెలిబుచ్చే అభిప్రాయం లాంటిది.

దివ్యశక్తి యొక్క, దివ్యచేతన యొక్క కార్యాచరణ తీరుపై ఒక స్పష్టమైన, కచ్చితమైన అవగాహన వుంది. ఎప్పుడైనా దివ్యశక్తి అపార్థం చేసుకోబడితే, లేక దివ్యచేతన కార్యాచరణ క్రమంలో అస్పష్టత చోటు చేసుకుంటే, నేను కలిగించుకొని పరిస్థితిని చక్కదిద్ద వలసి వస్తుంది.

లేనట్లయితే అందరికి ఇష్టారాజ్యంగా వర్తించే గొప్ప స్వేచ్ఛ కలుగుతుంది. ఎందుకనగా దివ్యచేతనా శక్తి తనకు తానుగా అసంఖ్యాక రీతుల్లో వ్యక్తపరచుకో గలదు. అట్టి అభివ్యక్తిని పరిపూర్ణం గావించుటకు, సమగ్ర పరచుటకు ఎట్టి అవకాశాలను వదల కూడదు. అందుకు సరైన మార్గం ఎన్నుకునే ముందు ప్రయత్నించి చూడటం అతి తరచుగా చేయవలసి వుంటుంది.

CWSA 35:676-77 — శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

నవ ప్రపంచ ఊయల

మానవజాతి ప్రస్తుతం సాధించిన విజయాలేవీ, అవి ఎంత గొప్పవైనా, మనం అను సరించడానికి ఆదర్శప్రాయమైనవి కావు. మానవ ఆదర్శాల పరిశీలనకు ఒక ప్రయోగశాల ఈ విశాలమగు ప్రపంచం.

మాన మాశించే ప్రయోజనం వేరు. ప్రస్తుతానికి మన విజయావకాశాలు తక్కువే అయినా భవిష్యత్తులో అవి పుష్కల మవడానికి మనం శ్రమిస్తున్నామని కచ్చితంగా చెప్పవచ్చు.

బాహ్యదృష్టికి ప్రపంచంలో నేటి వరకు సాధించబడిన అనేక విజయాలతో పోలిస్తే, మనం వెనుకబడి వున్నాము. అయితే, మన లక్ష్యం మానవ ప్రమాణాలకు దీటైన పరిపూర్ణతను సాధించుట కాదు. మనం భవితకు చెందిన అన్య అవసరాలకై ఉద్యమిస్తున్నాము.

ఆశ్రమం స్థాపించబడింది, సంకల్పించ బడింది ప్రసవ మొందే నూతన ప్రపంచానికి ఊయలగా ఉపయుక్త మవడానికి.

అందుకు ప్రేరణ పైనుండి లభించింది, మార్గ నిర్దేశక శక్తి పైనుండి లభించింది, సృజనాత్మక శక్తి పైనుండి లభించింది. ఇవన్నీ నూతన సాక్షాత్కార అవరోహణ కొరకు కృషి సల్పుతాయి.

కేవలం దాని తప్పిదాల వల్ల, దాని లోపాల వల్ల, దాని వైఫల్యాల వల్ల ఆశ్రమం ప్రస్తుత ప్రపంచానికి చెందినదిగా నున్నది.

మానవజాతి ప్రస్తుతం సాధించిన విజయాలకు ఆశ్రమాన్ని దాని ఇక్కట్ల నుండి బయటకి లాగే శక్తి లేదు.

కేవలం ఆశ్రమ సభ్యులు మొత్తం పరివర్తన చెందటం వలవ, వారందరు అవరోహణ చెందుతున్న పరమ సత్య దివ్యకాంతికి సమగ్రంగా ఉన్మీలమవటం వలన మాత్రమే ఆశ్రమం దానంతట అది తన ఇక్కట్ల నుండి బయట పడగలదు.

నిస్సందేజంగా ఈ కార్యం అసాధ్యమైనదే కానీ దానిని సాధించాలనే అదేశం మనకు అందింది. కేవలం ఆ ప్రయోజనార్థమే మనం భూమిపై వున్నాము.

సర్వోన్నతుడి సంకల్ప సహాయాలపై విఫలం చెందని విశ్వాసంతో చివరి దాకా ఈ కార్యాన్ని కొనసాగిద్దాం.

ఈ ప్రయోజనార్థం తమ జీవితం ధారపోయ నిశ్చయించుకున్న వారికి తలుపు తెరిచి వుంది, ఎప్పటికీ తెరిచే వుంటుంది.

CWM 13:109-110

ఒక ప్రకటన

ఎన్నో సంవత్సరాల నుండి ఆశ్రమం ఈ నగరంలో ఉన్నప్పటికీ ఇక్కడి జనం దానికి ప్రీతిపాత్రులు కాలేదు, ఎందుకనీ! అని విషయాలను పైపైన మాత్రమే చూసేవారు కొందరు అడగవచ్చు.

వెంటనే చెప్పవలసిన మొదటి సమాధానం: ఈ నగర జనాభాలో ఉన్నత శ్రేణికి చెందిన సంస్కారవంతులు, తెలివి గలవారు, పరపతి గలవారు, విద్యావంతులు, ఆశ్రమాన్ని స్వాగతించడమే గాక, వారి సానుభూతిని, ప్రశంసలను, సుహృద్భావనను కనబరిచారు. శ్రీఅరవిందాశ్రామానికి పాండిచేరిలో చాలా మంది చిత్తశుద్ధి, విధేయత

గల అనుయాయులు, స్నేహితులు ఉన్నారు.

ఈ సమాధానం మన వైఖరిని స్పష్టం చేస్తుంది. మనం ఏ విశ్వాసానికి, ఏ మతానికి వ్యతిరేకంగా పోరాడం. మనం ఏ పాలనా వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడం. మనం ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా పోరాడం. మనం ఏ దేశానికి, ఏ నాగరికతకు వ్యతిరేకంగా పోరాడం. మనం పోరాడేది అచేతనతో, అజ్ఞానంతో, అలసత్వంతో, అసత్యంతో.

మన ప్రయత్నమంతా భువిపై ఐక్యతను, జ్ఞానాన్ని, చైతన్యాన్ని, దివ్యసత్యాన్ని స్థిరపరచడం. దివ్యకాంతి, దివ్యశాంతి, దివ్యసత్యం, దివ్యప్రేమలతో కూడిన నూతన సృష్టి ఆగమనాన్ని ఏది వ్యతిరేకించినా దానిపై పోరు సల్పుతాం.

CWM 13:124-25 శ్రీమాత

అనువాదం: సునీత శేఖర్

ఆశ్రమం శ్రీమాత సృష్టి. ఆమె లేకుండా ఆశ్రమం స్థాపించ బడేది కాదు. ఆమె నిర్వర్తిస్తున్న కార్యం ఆమె సృష్టించుకున్నదే కానీ ఆమెకు ఈయబడినది కాదు, ఆమె నుండి తీసుకో బడదు.

CWSA 32:83 శ్రీఅరవిందులు

అనువాదం: సునీత శేఖర్

"ఆశ్రమానికి సంబంధించి మీరొక మూలాధారమైన విషయాన్ని అపార్థం చేసుకున్నారని నా అనుమానం. ఈ సంస్థ శ్రీఅరవిందులచే రూపొందించ బడిన నిర్వాహక విధులు, నియమాలు లేక నిబంధనలతో, వారి ఆజ్ఞానుసారం ఏర్పాటు చేయబడినది కాదు. వారిలో ప్రత్యక్షంగా వెలువరించబడిన పరమ సత్యము యొక్క దివ్యశక్తితో స్వయంగా దానంతట అది వృద్ధి చెందింది. అది ఆ పరమ సత్య ప్రగతిశీల కదలికలను మాత్రమే అనుసరించ గలదు. శ్రీఅరవిందులచే ఈ ఆశ్రమము రెండూ ఒక్కటిగా రూపొందిన ఒక సమగ్ర సంపూర్ణత. వారి అస్తిత్వము ఆశ్రమ మంతటా విస్తరించుకొని ఉండి, దాని స్థితిగతులను, కార్యకలాపాలను సమస్తాన్ని ఒక సామరస్య పూర్వక సమిష్టిగా, తనకు స్వంతమైనదిగా సమీకరించు కుంటుంది. దాని నడవడి దైవికమైన ఆత్మ యొక్క నడవడి, దాని అభివృద్ధి దైవికమైన ఆత్మ యొక్క అభివృద్ధి. ఆశ్రమం ఒక సాధకుల సమూహంగానో లేక శ్రీఅరవిందుల జీవితానికి, ఆకాంక్షకు, లక్ష్యానికి వేరైన ఉనికి గలది గానో పరిగణించడం పొరపాటు. దాని స్థితి, దాని కదలికలు, కార్యకలాపాలు ఆంతరికంగా ఏర్పడిన దాని పెరుగుదల, అభివృద్ధికి సమగ్రమైన సంకేతాలు. దీనికి చట్టాలు, నియమాలు లేక నిబంధనలు లేవు, కేవలం శ్రీఅరవిందులలోను, వారి ద్వారా చోటు చేసుకొనే అభివృద్ధి, ఆధ్యాత్మిక పెరుగుదల యొక్క ఏకైక సూత్రం తప్ప.

(శ్రీఅరవిందుల సూచనల ననుసరించి ఒక సాధకునిచే వ్రాయబడి, వారిచే సరిదిద్దబడిన ఉత్తరము. శ్రీ అమల్ కిరణ్ గారి 'Our Light and Delight, p. 8-9' లో ఉదహరింబడినది.)

అనువాదం: సునీత శేఖర్

పునాది

రూపాంతరీకరించబడిన జీవిత ప్రతిబింబం

సాధకుడు ఎలా వుండాలి? సాధకుని దృష్ట్యా నీవు చెప్పింది సత్యం. నీ భావనలను నేను ప్రశంసిస్తున్నాను. కానీ ఈ ఆశ్రమం కేవలం సాధకులకు మాత్రమే కాదని అందరికీ తెలుసు. ఈ ఆశ్రమం రూపాంతరీకరించబడిన జీవిత ప్రతిబింబం. ఇచట యోగాభ్యాసం చేసేవారు అల్ప సంఖ్యాకులు. ఇచట నేను శ్రద్ధగా సాధన చేసేవారిని మాత్రమే ఉంచితే అతి కొద్ది మంది మాత్రమే మిగులుతారు.

దైవం సర్వత్రా వున్నాడు, అన్నింటిలో వున్నాడు, అనే వాస్తవాన్ని శ్రీఅరవిందులు మనకు గుర్తు చేస్తుంటారు. యదార్థమైన దయాదాక్షిణ్యాలను పాటించమని మనల్ని ఆదేశిస్తుంటారు. దయ లేకుండా నిన్ను నీవు పరీక్షించుకో, అపుడు ఇతరులపై దయాదాక్షిణ్యాలను ఉదారంగా చూపిస్తావు అనే విషయాన్ని వారు ఎంతో అందంగా చెప్పారు.

ఆశ్రమం ఒక ప్రయోగశాల

ఆథార్ దాస్ చెప్పినట్లు ఆధ్యాత్మిక అధిమానస యోగానికి తప్పనిసరైన "ప్రయోగశాల" ఈ ఆశ్రమము. ఇచ్చట అన్ని కోవలకు చెందినవారు వుంటారు. ఎందుకనగా మార్పిడి సమస్యకు అనుకూల, ప్రతికూల అంశా లన్నింటిని పరిగణన లోనికి తీసుకోవాలి. ఒకే మనిషిలో ఈ రెండు లక్షణాలు మిళితమై వుంటాయి. సాత్వికులు, సంస్కారవంతులు మాత్రమే యోగాభ్యాసానికి వచ్చినట్లయితే ప్రయత్నం విఫల మవుతుంది, కారణం పృథ్వీతత్త్వము లోని ప్రాణిక అంశానికున్న ప్రతిబంధకం మూలంగా అధిగమించబడ లేదు గనుక. కొన్ని పరిస్థితులలో ఒక అధిమానసిక పార మానసిక, ప్రాణిక, భౌతిక అస్తిత్వాలపై ఆధిపత్యం వహించి వాటిని ప్రభావితం చేస్తుంది. అయితే మనషిలో అధిమానసిక లేక ఉన్నతమైన రూపాంతర పరివర్తనను కలిగించ లేదు. ఆశ్రమంలో నలుమూలల నుండి వచ్చిన వారుంటారు.

సామూహిక యోగాచరణలో — ఒక్కొక్కరికి కాకపోయినప్పటికి — ప్రతి స్తరంలోను దాని కుండే కష్టాలు ఉత్పన్న మవుతాయి. సాధకులు ఊహించని

పరిణామాలు ఆశ్రమంలో చోటు చేసుకోవటం ఇందు వలననే. ప్రయోగశాలలో ప్రాథమిక అభ్యాసం ముగిసిన తర్వాత విషయాలలో మార్పు జరిగి తీరుతుంది.

సహ యోగుల మధ్య సాధారణమైన మానవ సంబంధా లుండాలనే వత్తిడి ఏమీ లేదు. (సద్భావన, కష్టసుఖాల పరిగణన, ఉపచారము ఉన్నప్పటికీ) ఎందుకనగా అది ఆశ్రమ లక్ష్యం కాదు. నూతన చైతన్యంలో ఐక్యత సాధించటానికి ప్రతి ఒక్కరు మొదట సాధనచేయాలి, నూతన చైతన్యం పొందాలి, ఏకతను సాధించాలి.

సాధకులలో ఏ లోపాలున్నా, పైనున్న దివ్యకాంతి వాటిని తొలగిస్తుంది. సత్య నియమా నికి అలవాటు పడిన ప్రకృతులను సాత్త్విక విధానం మాత్రమే మార్చగలదు. *CWSA 35:600-01*

యోగాభ్యాసం చేయాలని నిర్ణయం

శ్రీఅరవిదుల యోగాన్ని ఆచరించటమంటే వ్యక్తిలో సమగ్రమైన మార్పు తేవటం, జీవితంలో ఏకైక లక్ష్యాన్ని కలిగి వుండటం. ఆ లక్ష్యం తప్ప ఏదీ వుండ కూడదు. కావాలన్నా, వద్దన్నా ఆ లక్ష్యం వ్యక్తిలో స్పష్టంగా వుండాలి. ఆ లక్ష్యం లేకున్నా సత్ సంకల్పం, సేవా నిరతి, అవగాహన గల జీవితాన్ని కలిగి వుండవచ్చు. సులభంగా దివ్యకార్యాన్ని నెరవేర్చుటకు శ్రమించ వచ్చు — ఎన్నో కార్యాలు చేయవచ్చు. కాని దీనికి యోగాచరణకు మధ్య చాలా వ్యత్యాస ముంటుంది.

యోగాచరణ నిన్ను వరించాలంటే నీవు చేతనాయుతంగా కోరాలి. ప్రారంభించే ముందు అది ఏమిటో తెలుసుకోవాలి, దాన్ని గురించి ఒక తీర్మానాన్ని గైకొనాలి. ఒకసారి తీర్మానం గైకొన్నాక దానిని ఏ మాత్రం సడలించ కూడదు. ఆ కారణంగానే దానిని గురించిన సంపూర్ణ జ్ఞానంతో దానిని చేపట్టాలి. నేను యోగా చేయాలి అని అన్నప్పుడు నీవు ఏమి నిశ్చయించుకుంటున్నావో నీవు తప్పక తెలుసుకోవాలి. అందుకనే నేను ఎప్పుడూ నిన్ను బలవంతం చేసాననుకోను. దాన్ని గురించి నీకు చెపుతా, ఓహ్, దాన్ని గురించి ఎంతో చెప్తాను. కానీ వ్యక్తిగతంగా మాత్రం. "అవును, ఏ విధంగా నైనా నేను యోగం చేయాలి. యోగం గురించి నా అభిప్రాయం నా కుంది" అని ఎవరు వచ్చి చెప్తారో వారికి.

అయితే వారికి అది వేరే విధంగా నుంటుంది. వారి జీవన పరిస్థితులు, ముఖ్యంగా అంతరంగంలో, వేరుగా వుంటాయి, అంతరంగంలో మార్పులు జరుగుతాయి.

పరిస్థితిని చక్కబెట్టేందుకు ఒక చైతన్యం నిరంతరం పని చేస్తూ వుంటుంది. అది నిన్ను ముందుకు పోనీయని అడ్డంకులను ఎదుర్కొనేటట్లుచేస్తుంది. నీ తప్పిదాల వల్ల, నీ గ్రుడ్డితనం వల్ల నీ తల బొప్పి కడుతుంది. యోగం చేయాలనుకునే వారికి మాత్రమే ఇలా జరుగుతూ వుంటుంది. ఇతరులకు దివ్యచైతన్యం ఒక జ్యోతి వలె, ఒక జ్ఞానం వలె, ఒక రక్షణ వలె, ఒక పురోగమన శక్తి వలె పని చేస్తూ వుంటుంది. తద్వారా వారు అధిక శక్తులను పొందవచ్చు, సాధ్యమయినంత వరకు అనుకూల వాతావరణంలో వృద్ధి పొందవచ్చు.

తీర్మానం లోనుండి రావాలి. యోగమనగా ఏమిటో అవగాహన పొంది యోగం కోసం వచ్చేవారి జీవన పరిస్థితులు ఇచ్చట వేరుగా వుంటాయి. బాహ్యంలో భేదం లేకున్నా, అంతర్గతంగా భేదం వుంటుంది. చైతన్యంలో సంపూర్ణత వుంటుంది., అది దాని మార్గం నుండి వారిని ప్రక్కకు వైదొలగ నీయదు. ఒకరు చేసే తప్పులు స్పష్టంగా తెలుస్తాయి. వాటి ఫలితాలు ఎంత బలంగా కనిపిస్తాయంటే ఏ తప్పూ చేయకూడ దనుకుంటారు, లేకపోతే పరిస్థితులు తీవ్రతర మవుతా యనుకుంటారు. కానీ ఎప్పుడూ అలా వుండదు.

CWM 7:198-99 — *శ్రీమాత*

ఇతర సంస్థల వలె గాక మరొక సదుద్దేశ్యంతో ఈ ఆశ్రమం నిర్మించబడింది. ప్రపంచాన్ని పరిత్యజించడానికి కాదు. కానీ ఇది ఒక కేంద్రంగా, ఒక ఆచరణ క్షేత్రంగా, మరొక జీవిత పరిణామం కోసం, ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యానికి జీవి తాన్ని నడిపించే ఒక గొప్ప స్ఫూర్తిగా రూపందుకుంటోంది. సాధారణ జీవితాన్ని వదలి ఇచట ప్రవేశించటానికి ఒక దశ అంటూ లేదు. ఇది వ్యక్తిగత అవసరంపై సహజోద్వేగంపై, సాధ్యతపై లేక సలహాపై ఆధారపడి వుంటుంది. నిర్ణయం శ్రీమాతది మాత్రమే.

CWSA 35:592-93 — *శ్రీఅరవిందులు*

ఇచ్చట వుండటం సులభం కాదు

పైకి కనిపించే వాటిని బట్టి నిర్ణయించ కూడదు. ఇతరులు చెప్పేవి విన కూడదు. ఎందుకంటే ఈ రెండూ సాధకులను తప్పు దారి పట్టిస్తాయి. నీవు వదలి వెళ్ళాలనుకుంటే వెళ్ళవచ్చు. బాహ్యకారణాల దృష్ట్యా అది మంచిది కావొచ్చు.

అదీ గాక, ఇచట వుండటం అంత సులభం కాదు. ఆశ్రమంలో బాహ్య క్రమశిక్షణ

వుండదు, పైకి కనబడే పరీక్షలు లేవు. కాని అంతరంగిక పరీక్ష కఠినంగా వుంటుంది, నిరంతరం వుంటుంది. అహంకారాన్ని జయించాలనే చిత్తశుద్ధితో కూడిన కోరిక వుండాలి, డాంబికాన్ని జయించాలి.

సంపూర్ణ శరణాగతి బాహ్యంగా సమకూర్చ బడదు. అయితే ఎవరు ఇక్కడ ఉండాలని ఇష్టపడతారో వారికి అది అవసరం. శరణాగతి శ్రద్ధను పరీక్షించటానికి ఎన్నో పరీక్షలు ఎదురవుతాయి. ఏమైనా దైవకృప, దైవ సహాయం, కోరుకున్న వారికి ఎల్లప్పుడు వుండనే వుంటాయి. నమ్మకం, విశ్వాసం వున్న వారికి వాటి శక్తి అపరిమితం.

CWM 13:111 శ్రీమాత

అనువాదం: ఆకుల కృష్ణ

ఆశ్రమంలోని భౌతిక జీవిత పునాదులు

ఇక్కడ భౌతిక జీవితానికి సాధ్యపడేవి కేవలం రెండు పునాదులు. ఒకటి తనని తాను ఇచ్చుకోవడం అనగా ఆత్మసమర్పణ మరియు పూర్తిగా తనని తాను సమర్పించుకోవటం అనగా శరణాగతి సిద్ధాంతం పైన స్థాపించబడిన ఆశ్రమం యొక్క సభ్యుడవడం. తాను ఆ దైవానికే చెంది, తనకి కలిగినదంతా ఆ దైవానికే చెందినదై వుంటుంది. ఆ ఇవ్వటంలో కూడా తన స్వంతమని అనుకుంటున్న దానిని ఇస్తున్నానన్న భావన కాక, ఆ దైవానికి అప్పటికే చెందిన దానిగా భావించి ఇవ్వడం. అది చెల్లుబాటు అని కాని, లేక, అది తిరిగి రావాలన్న ప్రశ్న అక్కడ లేదు, బేరసారాలు లేవు, కోరికకు కాని, అడగటానికి కాని స్థానం లేదు. శ్రీమాత సర్వాధికారిణియై ఎంత చక్కగా అవసరాలను ఏర్పాటు చేయవచ్చో అంతగా ఆమె వద్ద ఉన్న సాధన సంపత్తికి, ఆమె ఉపకరణాల సామర్థ్యానుసారం సమకూరుస్తారు. ఆమెకు సాధకుల యొక్క మానసిక స్థితిగతుల ననుసరించి లేక భౌతిక కోరికలు మరియు అడిగే వాటి ననుసరించి పని చెయ్యవలసిన అవసరం లేదు. వారితో వ్యవహరిస్తున్నప్పుడు ఆమె స్వతంత్రంగా వ్యవహరిస్తారు. సాధకుని యొక్క వాస్తవిక అవసరాన్ని గుర్తించి లేక అతని ఆధ్యాత్మిక ప్రగతికి ఏది మంచిదని ఆమె భావిస్తారో ఆ విధంగా చేస్తారు. ఎవరూ ఆమె మీద

తమ స్వంత అభిప్రాయాలు కాని నియమాలు కాని విధించి న్యాయనిర్ణేతలు కాలేరు. కేవలం ఆమె మాత్రమే నియమాలు విధించ గలరు. అవసరమనిపిస్తే ఆమె వాటి నుండి విడివడ గలరు కూడా, కాని ఎవరూ ఆమెను అలా చెయ్యమని ఒత్తిడి చెయ్య లేరు. వ్యక్తిగతంగా అడగడమూ మరియు కోరికలు ఆమెపై మోపబడ లేవు. ఒక వేళ ఎవరికైనా ఏదైనా అత్యంత అవసరమని అనిపించినపుడు లేక తనకి అప్పగించబడిన బాధ్యతను గూర్చి ఏదైనా సలహా ఇవ్వాలనిపించినప్పుడు అతడలా చెయ్యవచ్చు, కాని ఆమె అనుమతి ఇవ్వకపోతే, అతను తృప్తి చెంది ఆ విషయాన్ని వదిలి పెట్టాలి. ఇదే ఆ ఆధ్యాత్మిక క్రమశిక్షణకు, ఆ దివ్యసత్యానికి ప్రాతినిధ్యం వహిస్తూ దాని మూర్తి రూపం ధరించిన ఆ ఒకరే దానికి కేంద్రం. అయితే ఆమె అదైనా కావాలి మరియు ఇదంతా పదార్థ జగత్తు యొక్క సహజ వివేకం కావాలి, లేక ఆమె అది కానప్పుడు ఇక్కడ ఎవరూ ఉండవలసిన అవసరం లేదు. ఎవరికి కావలసిన దారిలో వాళ్ళు వెళ్ళవచ్చు. ఇక ఆశ్రమమూ లేదు, యోగమూ ఉండదు.

కాక, ఒక వేళ ఆశ్రమ సభ్యుడవ్వడానికి సిద్ధపడి లేకపోతే ఇక్కడి అనుశాసనాన్ని సహించలేక పోయినప్పటికీ యోగసాధనలో ఏదో ఒక స్థానానికి ప్రవేశార్హత పొందితే అతను వేరుగా ఉండి అతని ఖర్చు లతడే భరించుకోవాలి. భౌతికంగా జీవితంలో అతనికి ఎటువంటి అనుశాసనము వర్తించదు, కేవలం పని సవ్యంగా జరగడానికి అవసరమయ్యే నియమాలు మాత్రమే వర్తిస్తాయి.

భౌతికమైన బాధ్యత ఏదీ శ్రీమాతకి ఉండదు.

CWSA 32:374-75

శ్రీఅరవిందులు

అనువాదం: డా. విజయలక్ష్మి

పృథ్వీ మండలం యొక్క సంకేతాత్మక ప్రాతినిధ్యం

పరిణామానికై అత్యంత తక్కువ సిద్ధంగా ఉన్న అన్ని రూపాలను కూడా కలుపుకుని పృథ్వి అంతా పరిణామం చెందడానికి తయారు చెయ్యడమే ఉద్దేశ్యం. అందు కోసం మనం పనిచేయడానికి, పరస్పర సహకారం అందించుకోవడానికి పృథ్వి పై ఉన్న అన్ని పదార్థములకు, ఒక సంకేతాత్మక ప్రాతినిధ్యము ఉండి తీరాలి. విశ్వము యొక్క సంకేతాత్మిక ప్రతినిధి పృథ్వి అయినప్పుడు, పృథ్వి యొక్క సంకేతాత్మక ప్రతినిధి సమూహ మవుతుంది.

శ్రీఅరవిందులు, నేను 1914 వ సంవత్సరములో ఈ విషయము చర్చించి నప్పుడు (చాల కాలము క్రిందట) మేము రెండు సంభావ్యతలను గమనించాము: ఒకటి మేము ఇప్పుడు చేస్తున్నది, లేక అతిమనస్సు ప్రాప్తించే వరకు ఏకాంతవాసము మరియు ఒంటిరిగా ఉండటమే కాకుండా పదార్థ పరిణామ క్రమాన్ని ఆరంభించే వరకు, ఈ కార్యం నుండి మనల్ని మనం వేరుపరచుకో లేమని, ప్రగతి మార్గంలో పయనిస్తున్నప్పుడు, మనం అత్యంత అధికంగా విశ్వముతో మమైక్య మవుతామని, పర్యవసానంగా ఎలాగైనా ఆ భారాన్నంతా మనం మనపై మోపుకుంటామని శ్రీఅర విందులు సరియగు విధంగానే నుడివారు.

ఒక కూడలి తయారగు విధంగా మనుషులను ముందుకు తీసుకు రావడానికి జీవితమే స్పందించింది. అయితే, పనిని ఇది మరింత క్లిష్టంగా, కష్టతరంగా చేస్తుందని మేము స్పష్టంగా చూశాం (ఇది నాకు మరింత గురుతర బాధ్యతను, సమగ్రమైన పనిని కలిగిస్తుంది.) కాని, అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే — దివ్యకార్యం కొరకు — ఇది అనివార్యమైనదే కాక వదిలి పెట్ట కూడదనిది కూడా. ఎలా చూసినా మేము తరువాత సరి చూసినట్లుగా, ప్రతీ ఒక్కటి ఒకే సమయంలో ఒక ప్రత్యేక కష్టాన్ని పరిష్కరించడానికి మరియు ఒక సంభావ్యత ప్రతినిధిగా వ్యవహరిస్తుంది.

శ్రీమాత: ఒక సాధకునితో సంభాషణలు సెప్టెంబరు 20, 1960

ఒక సామూహిక కార్యం మరియు సామూహిక యోగము

పృథ్వి కొరకై పని చేయుట మినహాయించి (అనగా వ్యక్తిగత పరిణామం కంటె అధికంగా అని అర్థం) వ్యక్తిగతంగా, ఏకాంతంగా రూపాంతరీకరణ చేయడం

సాధ్యమూ కాదు, ఉపయోగకరమూ కాదు. (అంతే కాక ఏ ఒక్క మానవుడు తన స్వశక్తిపై మాత్రమే ఆధారపడి రూపాంతరణకై పని చేయ్య లేడు. యోగసాధన యొక్క లక్ష్యము ఏదో ఒక చోట అతిమానవుడిని సృష్టించడము కాదు) యోగము యొక్క లక్ష్యము అతిమానస చైతన్యమును భూమిపై అవతరింప చేసి, దానిని అక్కడ స్థాపించి, వ్యక్తిగత, సామూహిక అంతరికక మరియు బాహ్య మానవ జీవితాన్ని శాసించే అతిమానస చైతన్యము అనే సిద్ధాంతముతో ఒక కొత్త జాతిని సృష్టించడం కనుక ఆశ్రమం యొక్క అస్తిత్వము, మాకు కాని లేక ఏ ఒక్క వ్యక్తికి కాని ఎటువంటి కష్టాలు కల్పించినా తప్పనిసరి అయింది. దాని పద్ధతి ఒక మనిషికి ప్రతినిధులుగా ఆశ్రమవాసులను మరియు ఇతరులను సాధారణ పృధ్వీగత చేతనలో కూడా ఒక నిశ్చిత విధానంలో పని చేయించుట ద్వారా, మనిషిలో పృధ్వీ చేతనను తయారుచేసి అతిమానస శక్తిని అవతరింప చెయ్యడం. వారి వారి సాధన ననుసరించి ఒకరి తరువాత ఒకరు ఆ శక్తిని స్వీకరించడం ద్వారా భౌతిక ప్రపంచంలో అతిమానస చైతన్యం స్థాపించ బడడమే కాక దానిని విస్తరింప చెయ్యడానికి ఒక మూలాన్ని సృష్టించడం సాధ్యమవుతుంది.

CWSA 28:296 — *శ్రీఅరవిందులు*

ఇది ఇతర ఆశ్రమముల వంటిది కాదు. ఇచటి సభ్యులు సన్యాసులు కారు, ఇచటి యోగసాధన ఏకైక లక్ష్యము మోక్షం కాదు. ఇచట జరిగేది ఒక పనికి తయారీ. ఆ పని యోగిక చేతన మరియు యోగ శక్తుల మీద స్థాపించబడుతుంది తప్ప దానికి వేరే పునాది అంటూ ఉండదు. ఈ లోపల ఇచట ఉన్న ప్రతీ సభ్యుడు తన ఆధ్యాత్మిక సంసిద్ధతలో భాగంగా ఆశ్రమ మందలి ఏదో ఒక పని చేస్తూ ఉండాలి.

CWSA 29:232 — *శ్రీఅరవిందులు*

భావానువాదం: డా. విజయలక్ష్మి

సాధన యొక్క లక్ష్యము, నియమ నిబంధనలు

సాధారణ సాధనల లక్ష్యం సర్వోత్కృష్ట చేతన (సత్ -చిత్ -ఆనందం) తో ఐక్యం గావడం. ఎవరైతే ఆ లక్ష్యం చేరుకుంటారో, వారు వారి స్వంత విముక్తికి సంతృప్తి చెంది దుఃఖభూయిష్టమైన ఈ ప్రపంచాన్ని దాని దౌర్జన్య స్థితికి వదిలి వేస్తారు. అందుకు వ్యతిరిక్తంగా శ్రీఅరవిందుల సాధన, ఇతరులు వదిలిపెట్టిన స్థాయి నుండి ప్రారంభమవుతుంది. ఒకసారి సర్వోన్నత చైతన్యముతో ఐక్యత సిద్ధించితే, ఆ సిద్ధిని వ్యక్తి బాహ్య ప్రపంచము లోకి కొనివచ్చి, భూమిపై జీవన పరిస్థితుల పరి వర్తనను పూర్తిగా నెరవేర్చాలి. ఈ లక్ష్యానికి అనుగుణంగా పూర్ణయోగ సాధకులు ధ్యాన చింతనా జీవితం గడపటానికి ప్రాపంచిక జీవితం నుండి నిష్క్రమించరు. ప్రతి సాధకుడు తన సమయంలో కనీసం మూడవ వంతైనా ప్రయోజనకరమగు పనికి వినియోగించాలి. ఆశ్రమంలో అన్ని రకముల కార్యక్రమములు వుంటాయి. ప్రతి ఒక్కరూ తమ తమ స్వభావాలకు అనుకూలమైన పనిని స్వీకరించాలి. అయితే అది సేవా దృక్పథంతో, శ్రద్ధతో, నిస్వార్ధతతో, సమగ్ర యోగసాధనా లక్ష్యాన్ని దృష్టిలో నుంచుకొని చేయవలసి వుంటుంది.

ఈ ప్రయోజనం సాధించటానికి ఆశ్రమం వ్యవస్థీకరించ బడింది — ఆశ్రమవాసు లందరూ తమ అవసరాలు సంతృప్తికరంగా తీర్చుకొని, వారి పోషణ గురించి చింతించ నవసరం లేని విధంగా.

నిబంధనలు కొద్ది పాటిగానే వుంటాయి. వాటిని సంతోషంగా పాటించడానికి అభివృద్ధి సాధించడానికి కావలసిన స్వేచ్ఛ ప్రతి ఒక్కరి కీయబడింది. అయితే కొన్ని విషయాలు మాత్రం కచ్చితంగా నిషేదించ బడ్డాయి. అవి 1) రాజకీయాలు 2) ధూమపానం 3) మద్యపానం 4) లైంగిక సంబంధాలు.

అందరికీ ఆరోగ్యం, సంక్షేమం, శారీరకాభివృద్ధి అవసరాలు, చిన్నా, పెద్దా, యువత, ముదుసలు లనే తేడా లేకుండా అందించడానికి తగిన శ్రద్ధ తీసుకో బడింది.

CWM 13:107-08 — శ్రీఅరవిందులు

జి. వి. యస్. వి. ప్రసాదరావు

ఆశ్రమ వాతావరణం

ఆశ్రమం దివ్య కంపనములతో ఆవేశితమైన ఒక ప్రదేశం

ఇటువంటి ప్రదేశంలో, కొన్ని శక్తులు, కంపనాలు వాతావరణంలో ఆవేశింపబడి ఉంటాయి. అవి తమంత తాముగా కంటికి కనబడే వస్తువుల్లోను, స్పర్శనీయమైన వస్తువుల్లోను కనిపించవు కాని మార్పులు కలుగ జేయగలవు. అవి ఒక పద్ధతి ప్రకారం జరుగుతాయి కాబట్టి తార్కికంగా మనం ఒక స్థితి నుండి మరో స్థితికి వెళ్తాము. ఇదే తర్కం, ఏదో సాధారణ జీవితంతో సంబంధం లేనిది ఇక్కడ ఉన్నదని తెలుసుకోడానికి, మీకు అడ్డు పడుతుంది. సాధారణ బుద్ధికి చెందిన అవగాహన తప్ప, ఇతర అవగాహనలు లేనివారు, ఎవరైతే విషయాలను సాధారణంగా జీవితంలో జరిగేవిగా చూస్తారో వారు — "ఓహో, ఇక్కడంతా సాధారణంగానే ఉన్నది" అని చెబుతారు. కేవలం భౌతిక అవగాహన తప్ప, ఇతర అవగాహనలు లేనివారికి, ఈ కంపనాల లక్షణం తెలుసుకో లేనివారికి, వీటికి సంబంధించినదేదీ, వారిలో లేని వారికి ఒక వేళ ఉన్నప్పటికి, అది తగినంతగా మేల్కొల్పబడని వారికి ఇక్కడి జీవితం భౌతిక జీవితంలాగే వుంటుంది. వారు చెప్తారు — "ఇది భౌతిక జీవితం లాగే ఉంది, బహుశా నీకు జీవితం గురించి కొన్ని సొంత అభిప్రాయా లుండొచ్చు, చాలా మందికి వారి స్వంత అభిప్రాయా లుంటాయి, నీవు కొన్ని ప్రత్యేక పద్ధతులలో పని చేయవచ్చు, అలాగే ఒక ప్రత్యేక పద్ధతిలో పని చేసే వారు అనేక మంది ఉంటారు, వారు అనుకుంటారు — ఇక్కడి జీవితం నే జీవించే జీవితంలాగే ఉన్నది" అని. ఇక్కడ అతిమానస శక్తి, కొన్ని క్షణాల లోనే అభివ్యక్త మైనప్పటికీ, అది చైతన్య వంతమై ఉన్నప్పటికీ, అది పదార్థం పై ప్రభావం చూపినప్పుడు, ఆ కంపనాలలో పాల్గొననివారు ఆ అనుభూతి పొందలేరు. జనం అంటారు — "అతిమానస శక్తి అభివ్యక్తమైనప్పుడు, అది మనకు బాగా తెలుస్తుంది, అది కనబడుతుంది" అని, కాని తప్పనిసరిగా జరగ నవసరం లేదు. అక్కడే నివసిస్తూ, ఆశ్రమంలో నుండే పోతూ, వాతావరణంలో ఏ మాత్రం తేడా గమనించలేని తక్కువ సున్నితత్వం గల సాధారణ జనం కంటే వీరేమీ ఎక్కువ కాదు.

వినండి. నేను జపాన్ నుండి తిరిగి వస్తున్నాను ఆశ్రమానికి. నేను సముద్రంలో ఓడ పై ఉన్నాను, దేని కోసం నిరీక్షించకుండా. అప్పుడు హఠాత్తుగా, పాండిచ్చేరి

నుండి రెండు మైళ్ళ దూరంలో ఉన్నప్పుడు, వాతావరణ భౌతిక లక్షణం, గాలి లక్షణం, ఎంతగా మారిందంటే మేము శ్రీఅరవిందుల 'ఆరా' (తపోశక్తి వ్యాపించిన ప్రదేశం) లో ప్రవేశిస్తున్నట్లు మాకు తెలిసింది. అది ఒక భౌతిక అనుభూతి. తగినంతగా మేలుకున్న చైతన్యం గల వారందరూ ఇదే అనుభూతి పొందగలరని హామీ ఇస్తున్నాను.
CWM 4:22-23

శ్రీఅరవిందులు ఇంకా ఎక్కువ అందుబాటులోకి వచ్చారు

నిస్సందేహంగా, ఇప్పుడు నీవు వారితో సులభంగా సంప్రదించ గలవు.

వారికి వారుగా శ్రీఅరవిందులతో సంబంధ మేర్పరచుకొని ప్రశ్నలకు సమాధానాలు కనుగొన్న వారెందరో ఉన్నారు. వారు, ఇప్పుడు ఎక్కువ అందుబాటులో, ఎక్కువ క్రియాశీలంగా ఉన్నారు.

ఏదైనా సరిగా లేనపుడు, దాని కారణం నీవు తెలుసుకో దలిచినపుడు లేదా ఒక బలహీనతను నీవు తొలగించు కోవాలనుకున్నప్పుడు, లేదా శుభ్రపడాలి, నయమవాలి అనుకున్నప్పుడు, లేదా ఏదైనా కష్టం శుద్ధి కావడానికి తొలగింప బడాలి అనుకున్నప్పుడు, ఏ సమాధానానికైనా, సూటిగా అడగండి శ్రీఅరవిందులను వారి సమాధి వద్ద. నీవు వెంటనే పొందగలవు వారి సమాధానం. సమాదానమే కాకుండా, వారి ఆశీస్సులను, వారి జాలి, వారి శాంతి, వారి వెలుగును కూడా నీవు పొందగలవు. ఎంతో శక్తివంతమైన వారి ప్రేమతో నీవు ముంచెత్త బడ్తావు. నిన్ను నీవు వారికి అర్పించుకున్నప్పుడు, నీ ఆపద లన్నింటి నుండి రక్షింపబడ గలవు. అతని ప్రభావ మిలా ఉంటుంది: వినయము, నిజాయితీ, సరళ స్వభావం గల వారందరకూ అతడు తనకి తానుగా ఎరుక పరుచుకుంటాడు. అతడక్కడే (సమాధి వద్ద) పరిపూర్ణ చైతన్యంతో ప్రపంచ చర్య లన్నిటినీ పర్యవేక్షిస్తూ ఉన్నాడు.

అది అసాధరణ మైనది. సమాధి చుట్టూ వారి సాక్షాత్కారం, ఉనికి, స్పష్టంగా కంపిస్తూ ఉంటుంది. వారి ప్రభావం చొచ్చుకుపోయి స్పృశిస్తుంది, మన చైతన్యాన్ని అది మేల్కొలుపుతుంది ఆధ్యాత్మిక జీవితం వైపు. శూన్యవాదులు, నమ్మకాలు లేనివారు, చెడు స్వభావం గలవారు కూడ వచ్చి, ఆసక్తితో సమాధిని దర్శించి, దిగ్భ్రాంతితో, అవ్యక్తానుభూతితో, ఆశ్చర్యంతో తిరిగి వెళ్తారు. ఎందుకంటే స్థిరంగా, వారు తన జాలినీ, సానుభూతినీ, శాంతిని వారిపై ఇవి వర్షింప జేస్తాయి. స్థిరంగా

వెదజల్లుతాయి, వారి సమాది పక్క నుండి వెళ్ళినపుడు. ఇది నమ్మశక్యం కాని శ్రీఅరవిందుల శక్తి సాక్షాత్కారాల చర్య.

Blessings of the Grace, pp. 12-22

సమాధి వద్ద ఉన్నది అతడే

నేను సమాధిని చూచినపుడు, అక్కడ ఏమి జరుగుతోందో పరిశీలించినపుడు, నేను ఆశ్చర్య చకితురాల నయ్యాను. కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతిపుంజం, పరిణామ శక్తితో కంపిస్తూ సమాధి చుట్టూ నిలువుగా, అడుగుకు పైకి ఎగసి పడుచున్న దానిని నేను దర్శించా. (శ్రీమాత తన చేతులతో పైకి ఎగ్రతోసే చలనం చేస్తారు) అది పదార్థ రూపంగా మారుతున్న కొత్త కాంతి....

ఆది పవిత్రీకరింపబడిన, ధ్యానానికి అనువైన ప్రదేశం. కబుర్లు చెప్పుకునే ప్రదేశం కాదు. ఎప్పుడు కూడా అక్కడ మాట్లాడ కూడదు, వాతావరణం కలుషిత మౌతుంది. వారు తమ వైభవ శరీరంతో, ప్రపంచం అంతటికీ ఆధారంగా, తమ సూక్ష్మాంశతో, క్రమక్రమంగా వ్యక్తీకరించ బడుతూ వున్నారు. వారి చైతన్యం దైవావతరణ కొరకు పాక్షికంగా మరుగు పరచబడి ఉన్నది.

మన దివ్య సంభావ్యతలకు వారే ఒక సజీవ వాగ్దానం; వెదజల్ల బడుతున్న దివ్యకాంతి, దివ్యశక్తితో కూడిన దైవత్వం యొక్క వాగ్దానం. ఇది దైవావతరణ వైపు ఒక పురోగమనం. నీ కర్థమైనదా, ఎందులకు వాతావరణం అత్యున్నత దివ్య శాంతితో ఆవేశింపబడి ఉన్నదో?

అక్కడ ఉన్నది వారే. తమ దివ్య శరీరంతో, తమకు తాముగా దివ్యీకరించుకొని, మానవజాతి ప్రతినిధిగా ఉన్నారు. వారు తమ శరీరాన్ని వైభవోపేతం చేసుకున్నారు.

వారు తమ శరీరంతో తమ స్వంత ప్రయత్నం, సాధన, తపస్సులతో వారు సాధించిన అనుభవాలు శరీరంలో ప్రోగుపడ్డాయి. అవి ఆ శరీరాన్ని ఒక పరిణామ శక్తితో, ఒక క్రియాశీల శక్తితో పొంగిపొరలే కాంతితో ఆశ్రమమంతా ఆవేశించాయి. అది అతిమానస శక్తి గనుక తగ్గుముఖం పట్టకుండా నిలిచి వుంటుంది. అది తగ్గదు.

అనువాదం: యస్. వై. సోమయాజులు

జనులు సమాధి చుట్టూ పరిక్రమ చేస్తున్నప్పుడు లోనికి పీల్చుకొనేది ఇదే. వారికి తెలియకుండానే వారు శ్రీఅరవిందుల ప్రేమ జల్లులో తడుస్తారు. సమాధి దరికి

చేరుతున్నప్పుడు వారు ఏ దివ్యానుభూతికి లోనవుతారో వారికి తెలియదు. అది అత్యాశ్చర్యకరం!... ఎవరైతే వారి అస్తిత్వాలను తెరుచుకొని ఉంటారో వారు ఒక స్పర్శానుభూతిని పొందుతారు. ఆ శక్తిని తమలో పునరుద్ధరించు కొనుటకు, తమ అస్తిత్వంలో దానిని జీర్ణించుకొనుటకు, అక్కడి వాతావరణంలోని దివ్యప్రశాంతతను అనుభవించుటకు వారు పునర్దర్శనానికి విచ్చేస్తారు. శ్రీఅరవిందుల సన్నిధి ఎంత స్థిరమైనదిగా, సజీవమైనదిగా నుంటుందంటే, వాతావరణాన్నంతా ప్రభావితం గావించ గల దివ్య చైతన్య అపారతలా ఉంటుంది. అనుక్షణం వెలుగుతూ, ఆరుతూ వుండే దీపకాంతులను, రంగులను వెదజల్లే ప్రకాశంలో, పట్టలేని దివ్యానంద సౌందర్యం, పవిత్రమైన ఆత్మశక్తి, అంతుచిక్కని ఉనికి తేలియాడుతున్నట్లు నేను చూసాను. అదంతా అవాస్తవమైనదిగా తోచినా, దాదాపు ఒక భౌతికాకృతి దాల్చి, లోకాతీతమైన మధురిమను కలిగినదిగా ఉండింది. దైవానికై తీవ్ర అభిలాష కలిగి, ఏకోన్ముఖమైన ఒక హృదయం శ్రీఅరవిందుల సమాధి ముందర నిలుచుని వారి దివ్యానంద ప్రాప్తిని తప్పవేరొక దానిని కోరనట్లయితే, వారు సర్వోన్నత స్వర్గధామాలు లేక భూమండలం కనీ వినీ యెరుగని పారవశ్యతను మించిన అనుభవాని కన్నా ఉన్నతమైన ఆనందమయ క్షేత్రం లోనికి కొని పోబడతారు.

వారి శిష్యులే కాదు, ఇతరులు ఎవరైతే నిజమైన ఆకాంక్ష కలిగి, శక్తిమంతమైన ఉనికితో, ఈ ప్రాంగణంపై ఆధిపత్యం నిర్వహించే శ్రీఅరవిందుల చేతనతో ఏకం కావాలని కోరుతారో, వారు నన్ను మీరు ఇప్పుడు ఎంత వాస్తవంగా చూడ గలుగుతున్నారో, అంత భౌతికంగా రాచఠీవితో విరాజిల్లే వారి సన్నిధిని చూడగలరు. ఎవరైతే వారితో మాట్లాడ దలచారో వారి స్థిరమైన సమాదానాన్ని పొందుతారు. వారు అక్కడ ఉన్నారు. సర్వ శక్తి సమన్వితులై వారు పరోక్షంగా, వారి కార్యాచరణకు అనుగుణమైన రీతిలో దృఢమైన పట్టుదల గలిగి, నమ్మశక్యం గాని ఓరిమితో, గట్టి నిశ్చయంతో నూతన సృష్ట్యారంభంపై అధ్యక్షత వహిస్తారు. విజయ పరంపరను అన్ని దిశలుగా కొనసాగిస్తూ, ముందుగా మానవాళి చేతనలో మార్పును తెచ్చి, తరువాత దానిలో అన్ని విధాలుగా పరివర్తన కలుగ జేస్తారు. ఈ మార్గంలో ఎదురయ్యే ఈ అడ్డంకులు, ఈ క్షణికమైన భంగపాట్లు మానవజాతిని దాని ముందున్న ఆటంకాలను అధిగమించుటకు సమాయత్త పరుస్తాయని వారికి తెలుసు. తమ వెలుగుబాట ప్రశాంతతలో సాగుతున్న విశ్వవ్యాప్త ఉద్యమ స్ఫూర్తి మానవజాతి కార్యాచరణకు,

వైఖరికి దిశానిర్దేశం చేస్తుంది. అన్నింటినీ మించి, ఇదంతా ఆధ్యాత్మికతపై ఆధారితమై సాగుతుంది. మతమౌఢ్యము, యుద్ధము, అనవసర కలహాలతో కూడిన కపట మత సంబంధిత ఉద్యమాలపై కాదు.

Blessings of the Grace, pp. 122-25

ఆశ్రమ వాతావరణం

అవసరమైనది ఆశ్రమ వాసం కాదు, అంతరంగ సామీప్యం.

యదార్థ మేమిటంటే, ఒక బలమైన శక్తి ఇచ్చట నుండి వెలువడుతుంటుంది. అది కేంద్ర స్థానమందు అత్యంత శక్తిమంతంగా నుండటం సహజం, కానీ అది ఏ విధంగా ప్రభావం చూపుతుంది అనేది ఒకరు దానిని ఏ విధంగా గ్రహిస్తారు అనే దానిపై ఆధారపడి వుంటుంది. కేవలం గట్టి నమ్మకం, సదుద్దేశం, నిష్కాపట్యం, ప్రగాఢమైన అంతరంగ విశ్వాసంతో గ్రహించబడితే అతి ఒక పరిపూర్ణ రక్షణగా పని చేసుంది. అయితే దూరంగా నున్నప్పుడు కూడా ఆ విధంగానే పని చేస్తుంది.

*

ఆశ్రమ ఆవరణ సరిహద్దు లేవి? ఆశ్రమానికి చెందిన సాధకులు నివసించే ప్రతి గృహము ఆశ్రమ ఆవరణ లోనిదే. ఈ ఆవరణలో నున్న ఆవాసాలనే ఆశ్రమమని విచిత్రంగా మాట్లాడుతారు — అందులో అర్థం లేదు. లేక శ్రీమాత ప్రభావం గానీ, నాది గానీ ఒక ఆవరణలో మూతబడి వుంటుందని వారనుకుంటారా?

*

ఆశ్రమంలో రెండు నైతిక పరిస్థితులు నెలకొని వున్నాయి. ఒకటి మాది, రెండవది సాధకులది. కొంత గ్రాహ్యశక్తి గలవారు బయట నుండి వచ్చినప్పుడు, వారు అక్కడి నిశ్చలత, ప్రశాంతతతో ఆశ్చర్య చకితు లౌతారు. సాధకులతో సన్నిహితంగా కలగలపుగా నున్నప్పుడే ఆ అవగాహన, ప్రభావం తగ్గుముఖం పడతాయి. అక్కడి వాతావరణంలో మాంద్యము, వ్యాకులత ఏమన్నా ఉన్నట్లయితే, అవి సాధకులచే స్వయంగా కల్పించబడినవి — వారు శ్రీమాతకు తగు రీతిగా ఉన్మీలులై వుండి

వుంటే వారు నిశ్చలంగా, ప్రశాంతంగా జీవనం గడప గలుగుతారు, మాంద్యంగా, వ్యాకులతతో కాదు.

CWSA 35:631-32

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

పూర్ణయోగ సాధనా నియమాలు

ప్రతి ఒక్కరూ స్వయంగా తమదైన సాధన చేసే మార్గాన్ని కలిగి వున్నారు

ప్రతి ఒక్క వ్యక్తి స్వయంగా తనదైన సాధన చేసే మార్గాన్ని, తనకు తానుగా భగవంతుడిని చేరుకోగల మార్గాన్ని కలిగి ఉన్నాడు, ఇతరులు ఎలా చేస్తున్నారని గాభరా పడ నవసరం లేదు. వారి విజయాలు, అపజయాలు, వాళ్ళ కష్టనష్టాలు, వాళ్ళ భ్రమలు, వాళ్ళ అహంకారం, దర్పం అన్నీ 'ఆమె' చెప్పుచేతల్లోనే వున్నాయి. ఆమె అపారమైన ఓర్పు కలిగి వుంది. అంటే, దాని అర్థం వాళ్ళ దోషాలని అంగీకరిస్తుందని, వాళ్ళు చెప్పే, చేసే వాటన్నింటినీ ప్రోత్సహిస్తుందని కాదు. శ్రీమాత ఏ తగువు లోను, ఎవరి పక్షం వహించదు. ఆమె మౌనంగా వున్నది అంటే దాని అర్థం వాళ్లు చెప్పేది, వాళ్ళు చేసేది అసంగతంగా వున్నా ఒప్పుకొంటుంది అని కాదు. ఆశ్రమం గానీ, ఆధ్యాత్మిక జీవితం గానీ ఒకరు ప్రాచుర్యాన్ని పొందే, ఆధిక్యతను కనబరిచే పాత్రను పోషించే స్థలం కాదు, అందరి కంటే పైన వుండి, ఇతరుల కంటే తాను అధికుడినని నిర్ధారించుకొనే పోటీ ప్రదేశం కాదు. ఈ రకమైన విషయాలన్నీ ప్రపంచం పట్ల సామాన్య మానవుని వైఖరిలో నుండి పుట్టుకొచ్చే ఆవిష్కరణలు, అవే మానవ వైఖరిని సాధనలోకి చొప్పింపచేసే ధోరణిగా నుంటాయి, కానీ అవి ఆధ్యాత్మిక సత్యానికి సంబంధించిన అంశాలు కావు. శ్రీమాత అందరి పట్ల సహనంతోనే వుంటుంది. ప్రతి ఒక్కరూ, ఒకరి నొకరు విమర్శ చేసుకోవడాన్ని, కూడదని నిబంధన పెట్టదు. అలాగే, ఈ విమర్శలకు ఎలాంటి విలువా కూడా ఇవ్వదు. ఆధ్యాత్మిక స్థాయిలో నుంటూ ఈ విషయాల నిరర్థకత్వాన్ని సాధకులు గమనించినప్పుడే అవన్నీ మాయ మవుతాయని ఆశించవచ్చు.

శ్రీఅరవిందులు

సాధారణంగా మేము ఇదివరలో ఆశ్రమంలో ధ్యానం చేసేటప్పుడు ఉదయం లేక సాయంకాలం సమయాల్లో ప్రతి ఒక్కరి చైతన్యాన్నీ ఏకీకృతం చేసి, దైవం దిశగా ఎంత ఎత్తుకు ఉద్ధరించగలమో, అంత మేరకు చేయడమే నా పని. ఎవరైతే ఈ చేతనా గతిని అనుభవించ గలిగారో వారే దానిని అనుసరించ గలిగారు. అది దైవం వైపుగా పురోగమిస్తూ, ఆకాంక్షతో జరిగే సాధారణ ధ్యానం. కానీ ఈ క్రీడా ప్రాంగణంలో నా పని ఇక్కడివారి నందరినీ సమైక్యపరచి, వారిని తెరిచి, వారిలోకి దివ్యశక్తిని దింపడమే. ఇది మొదటి దానికి వ్యతిరిక్తమైన చర్య. అందుకే ఒక ఏకాగ్రతా ప్రక్రియ మరొక దానిని భర్తీ చేయ లేదు. ఇక్కడ జరిగేది విక్షణమైనది. ఆశ్రమంలో జరిగే ధ్యానంలో నా ఆకాంక్షాపరమైన శక్తితో అక్కడున్న వారి చైతన్యాన్ని అంతా ఒక చోట సమీకరించి, ఆ చేతనను దైవం వైపుకు ఉద్ధరింప చేసాను. అనగా దాని తో మీలోని ప్రతి ఒక్కరూ కొంత ప్రగతిని సాధించారు. కానీ ఇక్కడ, మిమ్మ ల్నందరినీ, వున్నవారిని వున్నట్లు, తీసేసుకొన్నాను. మీలో ప్రతి ఒక్కరూ వచ్చి "మే మిక్కడ రోజంతా పనిపాటల్లో మునిగి వుంటున్నాం, మా శారీరక శ్రమతో పనులు, వెసులుబాటు లేకుండా వున్నాం. మా పనులను, మా చర్యలను అవి ఎలా వున్నాయో అలాగే, మే మెలా వున్నామో అలాగే మీకు అర్పిస్తున్నాం" అని చెబు తున్నారు. దీని నంతా ఏకీకృతం చేయడం, దీనిని ఒకే రకమైన సమూహంగా మార్చడమే నా పని. ఈ అర్పణకు (ప్రతి ఒక్కరూ తమ స్వంత మార్గంలో చేసే సమర్పణ) సమాధానం ప్రతి ఒక్కరి చేతనను తెరిచి, గ్రాహ్య శక్తిని విశాలపరిచి, ఈ గ్రహణ శక్తు లన్నింటిని ఏకం చేసి, దాని లోకి దైవశక్తిని దింపడమే నా పని. కాబట్టి, ఆ క్షణంలో మీ లోని ప్రతి ఒక్కరూ, అమిత శాంతంగా, అప్రమత్తంగా వుండ గలిగితే, కొంత తప్పకుండా స్వీకరించ గలరు. మీరు దానిని ఎల్లప్పుడూ గమనించ లేరు గానీ, కొంత మాత్రం స్వీకరించ గలరు.

(1964 మార్చి నెలలో శ్రీమాతను ఈ క్రింది ప్రశ్న అడగడం జరిగింది.)

శ్రీమాతా! ఇప్పుడు క్రీడా ప్రాంగణంలో జరిగే ఏకాగ్రతా, ధ్యానాల్లో మీరు భౌతికంగా పాల్గొనడం లేదు. అప్పుడు ఏం జరుగుతుంది?

ఇక్కడి వారంతా కొంత ప్రగతిని సాధించారనే నేను భావిస్తున్నాను. ఇక దైవ సహా

యాన్ని, దైవ శక్తిని పొందడానికి భౌతిక సన్నిధి అవసరం లేదు.

CWM 4:106 శ్రీమాత

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్ రాజు

కర్మయోగ మార్గంలో శిక్షణ

ఇక్కడ నిర్వహించబడుతున్న కార్యక్రమం మరియు ప్రపంచమందు నిర్వహించ బడుతున్న కార్యక్రమం ఒక్కటి కాదు. అక్కడ నిర్వహింప బడుతున్నది ఏ విధంగాను దైవికమైనది కాదు, అది లోకంలో సాధారణంగా కొనసాగే కార్యక్రమం. అయినప్పటికీ వ్యక్తి దానిని కర్మయోగ మార్గంలో ఒక శిక్షణగా నిర్వర్తించాలి. అందులో ముఖ్యమైనది ఆ చేయబడే పని ఏలాంటిది అనేది కాదు, ఏ విధంగా చేయబడుతుందనేది ముఖ్యం. అది భగవద్గీతానుసారంగా, నిరపేక్షంగా, నిస్వార్థంగా, ఇష్టాపూర్తిగా, సాధ్యమైనంత సమగ్రంగా నిర్వర్తించబడాలి. కుటుంబ సంక్షేమానికో లేక వృద్ధి చెందడానికో లేక అధికారుల మెప్పు బడయటానికో కాకుండా అది నీ చేతికివ్వబడింది కేవలం నిర్వర్తిం చడానికే ననే భావనతో చేయాలి. నీకు అది ఒక ఆంతరిక శిక్షణ, అంతకు మించి మరేమీ కాదు. అందులో నేర్చుకోవలసిన మూడు లక్షణా లున్నాయి. ఒకటి సమా నత్వం, రెండు నిరపేక్షత, మూడు అంకిత భావన. పని చేయబడేది కేవలం దాని కుండే ప్రయోజనాన్ని ఆశించి కాదు. పని చేయడం, పని చేయబడే తీరు, దైవా నికి అంకితం కావాలి. ఆ స్ఫూర్తితో నెరవేర్చబడితే, ఆ పని ఎటువంటిదైనా ఫరవాలేదు. ఒక వ్యక్తి అట్టి ఆధ్యాత్మిక శిక్షణను తనకు తానుగా పొందగలిగితే అప్పుడు దైవం కోసం ప్రత్యేకంగా నిర్దేశించబడిన ఎటువంటి కార్యాన్నైనా (ఆశ్రమానికి సంబంధించిన పని లాంటిది) ఏనాడైనా, నిర్వర్తించడానికి సంసిద్ధుడై ఉంటాడు.

CWSA 29:240-41

సాధకుని కొరక నియమం

నీ కోసం ఒక నియమాన్ని విధిస్తాను. "శ్రీమాత నుండి నీ వేదైతే దాచాలనుకున్నావో దానిని చేయకు, దానిని పలుకకు, దానిని ఆలోచించకు". నీలో తలెత్తిన ఆక్షేపణలకు ఇది సమాధానం — నీ ప్రాణికంలో నుండి కదూ? "ఈ అల్పమైన విషయాలను

శ్రీమాత దృష్టికి తేవడానికి వ్యతిరేకంగా". ఈ విషయాలతో శ్రీమాతను కంగారు పడతారు లేదా వాటిని అల్పమైనవిగా పరిగణిస్తారని నీ వెందుకనుకుంటున్నావు? జీవితమంతా యోగం అయితే అల్పమైనది లేక అప్రధానమైనది ఏముంటుంది? శ్రీమాత సమాధాన మీయకపోయినా, నీ కార్యాచరణను గురించి, నీ స్వయం వృద్ధిని గురించిన ఏ విషయాన్నైనా సదుద్దేశంతో ఆమె ముందుంచడంలో అర్థం దానిని పరమ సత్య వెలుగులో పరివర్తన కోసం పనిచేస్తున్న దివ్యశక్తి కిరణాల క్రింద ఆమె రక్షణలో అని అర్థమే కదా. ఎందుకనగా ఆమె దృష్టికి తేబడిన విషయంపై ఆ కిరణాలు వెంటనే ప్రసరించి పని చేయడం ప్రారంభిస్తాయి. నీలోని ఉత్సాహం అది చేయటానికి ప్రేరేపించినప్పుడు, నీలో ఏదైనా చేయవద్దని సలహా నిస్తే, అది దివ్యకాంతి కిరణాన్ని, దివ్యశక్తి కార్యాచరణను వీగిపోవునట్లు చేయడానికి ప్రాణికం పన్నిన పన్నాగం కావచ్చు. ఒక వేళ నీవు నీలోని ఏ భాగం యొక్క కదలికలనైనా ఆమె పరిశీల క్రిందికి తేవాలనే కోరికతో నిన్ను నీవు ఆమెకు ఉన్మీలనం గావించుకుంటే ఆ చర్య తనకు తానుగా ఒక సంబంధాన్ని, ఒక వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని ఆమెతో ఏర్పరుస్తుంది. అది ఆమె సాధకు లందరితో సాధారణంగా, మౌనంగా లేక పరోక్షంగా నిలుపుకనే సంబంధానికి భిన్న మైనది.

ఇదంతా వర్తించేది ఎప్పుడంటే నీవు ఈ ఉన్మీలనానికి సిద్ధపడి వున్నానని భావించినపప్పుడు, నీ లోని ఉత్సాహం నీలో ఉన్నదేదో దానిని దాచకుండా ఆమె ముందుంచడానికి సిద్ధపడినప్పుడు. ఎందుకనగా అప్పుడే అది ఫలప్రద మౌతుంది — నీలో నుండి స్వేచ్ఛగా, యదార్థంగా వచ్చినప్పుడు.

CWSA 32:449

సంబంధాలన్నీ ప్రాణికం నుండి ఆధ్యాత్మిక మూలానికి చేరాలి

సాధకులందరూ ఒకరి నుండి ఒకరు దూరంగా నుండాలని, ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొంటుండాలనేది తొందరపాటుగా, అనాలోచితంగా ఏర్పడిన భావన. అది పరిత్యజించ బడాలి. యోగజీవన ధర్మం సామరస్యత, పోరాటం కాదు. ఈ తొందరపాటు భావన, బహుశా, నిర్వాణమే లక్ష్యమని తలచబడ్డ పాత అభిప్రాయం నుండి పుట్టి యుండవచ్చు. కానీ, ఇక్కడ లక్ష్యం నిర్వాణం కాదు, జీవితంలో దివ్యత్వాన్ని సార్థకం చేయడం, అందుకోసం ఏకత్వము, సంయోగము ఆవశ్యకమైనవి.

'X' కు నీపై అసహ్యత పెరగడం మరియు నీకు 'X' పై అసహ్యత పెంచుకోవడం సులభం కాకపోవడం అనే విషయాలు నా మనో నేత్రానికి కనబడడం నాకు బాధాకర మనిపించింది. అందువలన ఇట్టి ప్రాణికపరమైన స్వాప్నిక భయానక దృశ్యాలు ఉదయించ కూడదు. ఏవగింపు, ఘర్షణ యోగంలో అయోగ్య మైనవి, అవి యోగిక పోకడలు కావు. ఈ ఆశ్రమం ఘర్షణమయమై ఉన్నదనే విషయంతో అది అపరి పూర్ణులగు సాధకుల ఆశ్రమంగా నున్నదని, ఇంకా యోగుల ఆశ్రమంగా మారలేదని స్పష్టమౌతుంది. దాని అర్థం ఆధ్యాత్మికాభిలాషి యొక్క ధర్మం అసహ్యించుకోవడం, పోరాడటం కాదు అని. యోగం యొక్క ఆదర్శ మేమిటనగా సర్వము దైవమందు కేంద్రీకృతం గావాలి, దైవం చుట్టూ కేంద్రీకరించబడాలి, మరియు సాధకుల జీవితం ఆ పునాదిపై ప్రతిష్ఠితం కావాలి, వారి వ్యక్తిగత సంబంధాలలో సైతం దైవం కేంద్రమై ఉండాలి. అన్నింటిని మించి, సంబంధాలన్నీ ప్రాణికం నుండి ఆధ్యాత్మిక మూలాలకు మారాలి. ప్రాణికం ఆధ్యాత్మికతకు కేవలం ఒక పరికరంగా మరియు ఒక రూపంగా నుండాలి. అనగా వారి మధ్యన ఎలాంటి సంబంధా లున్నప్పటికీ అసూయ, ఘర్షణ, పగ, అసహ్యం, ద్వేషం మరియు తదితర దుష్ట ప్రాణిక భావనలన్నీ వాటి నుండి పరిత్యజించ బడాలి, ఎందుకనగా ఆధ్యాత్మిక జీవనంలో అవి భాగం కాలేవు. ఆ మాదిరిగానే అహంకార పూరితమగు ప్రేమ మరియు మమకారం మాయం కావాలి. అనగా, ప్రేమ ఏదైతే కేవలం అహం యొక్క తృప్తి కోసమే ప్రేమిస్తుందో, అహం దెబ్బతినిన వెంటనే అసంతృప్తికి లోనై ప్రేమించడం మానివేస్తుందో లేక ద్వేషాన్ని, పగను సైతం పెంచుకుంటుందో, అటువంటి ప్రేమ నశించాలి. ప్రేమ వెనుక జీవంతో తొణికిసలాడే, చిరకాలం నిలిచే, సంయోగం ఉండాలి. లైంగికమైన కల్మషం లాంటి అపవిత్ర లక్షణాలు తప్పక అంతమొందాలనేది అర్థం చేసుకోబడిన విషయం.

CWSA 31:288-89

స్నేహము మరియు ప్రేమ ఆవశ్యక లక్షణాలు

ఈ ఆశ్రమంలోని వారందరు ఒకరి మంచిచెడులు మరొకరు పట్టించుకోకుండా నుండరు. యోగంలో స్నేహంగాని, ప్రేమానురాగాలతో మెలగడం గాని యోగ మార్గంలో బహిష్కరించబడ లేదు. దైవం పట్ల మిత్రభావన కలిగి ఉండట మనేది

గుర్తింపు పొందిన సంబంధం. సాధకుల మధ్య స్నేహసంబంధా లుంటాయి. శ్రీమాత వాటిని ప్రోత్సహిస్తారు. ఆ సంబంధాలు చాలా వరకు మనుషుల మధ్య అస్థిరమైనవిగా నుంటాయి. ఆ విధంగా కాకుండా అవి సాధకుల మధ్య అవి ఒక దృఢమైన పునాదిపై ఏర్పడాలి అనేదే మా ప్రయత్నమంతా. మేము స్నేహాన్ని, సహోదరత్వాన్ని, ప్రేమను అతి పవిత్రమైనవిగా భావించటం మూలననే సాధకుల మధ్య సంబంధాలలో ఈ మార్పును మేము కోరేది — ఎందుకనగా అహం యొక్క ప్రేరణనలతో ఏర్పడే కోపతాపాలు, ఓర్వలేనితనం, విశ్వాసఘాతుకాలతో అను క్షణం ఆ సంబం దాలు మలినపడి, చెడిపోయి, తెగిపోవడం మేము ఇష్టపడం. నిజంగా పవిత్రమైనవిగా, దృఢమైనవిగా కొనసాగటానికి అవి అంతరాత్మలో పాతుకపోయి, దైవికమైన పునా దులపై దృఢంగా ప్రతిష్ఠితం కావాలని మా కోరిక. మా యోగం సన్యాసత్వం కాదు. దాని లక్ష్యం పవిత్రత, కానీ ఉదాసీనతతో కూడిన కఠోర నియమపాలన కాదు. ప్రేమ మరియు స్నేహపూర్వక భావాలు మేము అభిలషించే సామరస్యతకు ఆవశ్యక లక్షణాలు. అది నిష్ప్రయోజక స్వప్నం కాదు ఎందుకనగా లోపభూయిష్టమైన పరిస్థితులలో సైతం, మూల మందు ఈ ఆవశ్యక లక్షణాలు కొద్దిపాటిగా నున్నా, మా ఆశయం నెరవేరుతుంది. అది కష్టమే, దానికి తోడు పాత ఆటంకాలు మొండిగా పట్టు వదలకుండా వేలాడుతాయి. కానీ లక్ష్యం పై దృఢమైన విశ్వాసం లేనిదే మరియు సుదీర్ఘ మైన ప్రయాస పడనిదే విజ యం సాధ్యపడదు. పట్టు వదలకుండా ప్రయత్నించడం తప్ప వేరొక మార్గం లేదు.

CWSA 31:294-95

గృహస్తు, సన్యాసి

ఇక్కడ గృహస్తు, సన్యాసి అన్న ప్రశ్న ఉదయించదు. ఎందుకనగా మాకు ఈ వ్యత్యాసం లేదు. అయితే సాధారణ స్థాయి సన్యాసికి ఇక్కడ చోటు ఉండదు ఎందుకనగా మేము జీవితంపై విముఖత చూపం. అలాగని మేము గృహస్తులం కూడా కాదు కారణం, సాధారణ మానవ జీవితశైలిని, దాని వ్యవస్థలను, ఉద్దేశాలను మేము వదిలి వేసాము...

కేవలం రెండు రకాల మనుషులు మాత్రమే ఇక్కడ ఉండి ఎలాంటి నిజమైన ప్రయోజనాన్ని పొందగలరు:

1. ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆకళింపు చేసుకొని మార్పు చెందటానికి సిద్ధపడిన వారు.

2. ఇంకా సిద్ధపడి లేకపోయినా, ఇక్కడి ప్రభావానికి లోబడి, నెమ్మదిగా తయారు కాగలవారు.

CWSA 35:563-64

పరీక్షా సమయం

నీ ఉత్తరం చదివి నీవు కోరిన అవకాశం ఇవ్వాలని నిశ్చయించాను. ఆరంభానికి ఆశ్రమంలో రెండు, మూడు మాసాలు వుండి నీవు కోరుతు ప్రదేశం, మార్గం నిజంగా ఇదేనా అని కనుక్కోవచ్చు. మేము కూడా నీ ఆధ్యాత్మిక సంభావ్యతలను దగ్గరగా నుండి పరిశీలించి, నీకు ఎంతగా సహాయపడగలమో, అసలు ఈ యోగం నీకు ఉపయుక్తమువుతుందా కాదా తెలుసుకో గలుగుతాం.

అనేక కారణాల దృష్ట్యా ఈ పరీక్ష అవసరం. ఎందుకనగా ఈ యోగాన్ని అనుసరించడం కష్టం. ఎక్కువ మంది స్వభావానికి ఇందులో పాటించవలసిన నియమావళి ఒత్తిడిని భరించడం కష్టం. మేధను పరిపూర్ణం గావించుట ద్వారా దానిని ఆద్యాత్మికమైనదిగా, దివ్యమైనదిగా చేయగలిగిన ఒకరిని నాలో చూసానని వ్రాసావు. కానీ వాస్తవానికి ఆ స్థితికి నా మనస్సును పూర్తిగా నిశ్శబ్దపరచడం ద్వారా చేరుకున్నాను. ఎలాంటి ఆధ్యాత్మికత మరియు దివ్యత్వం ఆ కారణంగా సాధించబడిందో అది ఒక ఉన్నతమైన, లోకోత్తరమైన, మేధాపరమైన జ్ఞానం ఆ నిశ్శబ్దంలోకి అవరోహించడం ద్వారా జరిగింది. 'గీతా వ్యాసాలు' అనే గ్రంథం సైతం ఆ మానసిక నిశ్శబ్ద స్థితిలో వ్రాయబడింది. దాని రచనకు మేధాపరమైన ప్రయత్నం చేయబడలేదు, పైనుండి ప్రాప్తమైన జ్ఞానం యొక్క విముక్త చైతన్యం తోడ్పడింది. ఇది ముఖ్యమైన విషయం, ఎందుకనగా ఈ యోగం యొక్క ప్రధాన లక్ష్యం మానవ స్వభావాన్ని పరిపూర్ణం గావించడం కాదు, అస్తిత్వం యొక్క అన్ని భాగాలలో మానసిక మరియు ఆధ్యాత్మిక పరివర్తన కలగ జేయటం. ఆ పరి వర్తన మొదట అంతఃచేతన అస్తిత్వ భాగాలపై పని చేయడం ద్వారా, తదుపరి ఒక ఉన్నతతర చేతన యొక్క కార్యాచరణ ద్వారా, పాత కదలికలను పారద్రోలి లేక వాటిని తన పోలికకు సరిపోవునట్లుగా మార్చి ఆ విధంగా నిమ్నస్వభావాన్ని

ఉన్నతతరమైనదిగా మార్చడంతో సాధ్యపడుతుంది. అది మేధను శ్రేష్ఠమైనదానిగా చేయడంతో దానిని పరిపూర్ణం చేయడం కాదు, మనస్సును పరివర్తన గావించడం కాదు. ఒక సమగ్రమైన గొప్ప జ్ఞానసూత్రాన్ని ప్రత్యామ్నాయంగా చేర్చడం కాదు — మిగతా అస్తిత్వమంతటితో ఆ విధంగానే వుంటుంది.

ఇది నెమ్మదైన కష్టంతో కూడిన ప్రక్రియ. మార్గం సుదీర్ఘమైనది. అందుకు అవసరమైన పునాది వేయడం కూడా కష్టమే. ప్రస్తుతం కొనసాగుతున్న పాత స్వభావ లక్షణం అడ్డుకుంటుంది, ఆటంక పరుస్తుంది. ప్రతిబంధకాలు ఒకదాని తరువాత ఒకటి మళ్ళీ మళ్ళీ అధిగమించబడే వరకు ఎదురౌతుంటాయి. అందువలన అనుసరించాలని అంతిమ నిర్ధారణ కొచ్చే ముందు అది సరైనదా కాదా అని కచ్చితమైన నిర్ణయానికి రావాలి.

CWSA 35:585-86 *శ్రీఅరవిందులు*

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అసలైన పోరాటం — నివారణ

ఇక్కడ సాధకులు అన్ని రకాల వాళ్ళు, అన్ని స్థాయిల లోనూ ఉన్నారు. కాని పురోభివృద్ధి చెందినవారికి సైతం ఉండే అసలైన ఇబ్బంది వారి బాహ్యమనిషి తోనే. పాత ఆదర్శాన్ని అనుసరించేవారిలో కూడా, ఏదో ఒక దాన్ని వారు చేరుకున్న ప్పటికీ సాధకుని బాహ్యమనిషి చాలా మటుకు అదే విధంగా ఉంటాడు. అంతరంగ మనిషి స్వతంత్రుడై నప్పటికీ, బాహ్యంలో మటుకు ఇంకా స్థిర ప్రకృతినే కలిగి ఉంటాడు. మన యోగం ఫలప్రదమయేది కేవలం బాహ్యమనిషి కూడా మారినప్పుడే, కాని అది అన్నింటిలోకి అత్యంత కష్టమైన కార్యం. అది కేవలం భౌతిక ప్రకృతి మారినప్పుడు మాత్రమే, అత్యున్నత ప్రకాశం మహాప్రకృతి యొక్క ఈ అత్యంత నిమ్నభాగం లోకి అవతరించడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఇక్కడే పోరాటం జరుగుతున్నది. ఇక్కడ ఉన్న చాలామంది సాధకులలో అంతరంగ అస్తిత్వం ఇంకా ఎంతగా అపరిపూర్ణమై నప్పటికీ, సర్వసాధారణ మానవుని కంటే ఇంకా భిన్నంగానే ఉంటుంది, కాని బాహ్యం ఇంకా పాత పద్ధతుల కే, ప్రవర్తన కే, అలవాట్ల కే

అంటిపెట్టుకొని ఉంటుంది. చాలామంది మార్పు ఆవశ్యకతకు మేల్కొన్నట్లుగా కూడా అనిపించటం లేదు. ఎప్పుడైతే ఇది గ్రహించ బడుతుందో, అది నెరవేర్చ బడుతుందో, అప్పుడు యోగం ఆశ్రమంలో దానంతటదే పరిపూర్ణ ఫలితాలను ఇవ్వగలుగుతుంది. దానికి ముందు మాత్రం కాదు.

CWSA 35:591

మనది రాజకీయం కాదు, సామాజికం కాదు, కాని మనది ఆధ్యాత్మిక లక్ష్యం. మనం కోరుకునేది, వ్యక్తి చైతన్యం పరివర్తన, అంతే కాని పాలన, ప్రభుత్వం మార్పు కాదు. లక్ష్యాన్ని చేరుకోవడం కోసం మానవ సాధనాలలో దేనిలోనూ మనం విశ్వాసం ఉంచం, అది ఎంత శక్తివంతమై నప్పటికీ; మన ప్రగాఢ విశ్వాసం కేవలం దివ్యానుగ్రహంలో మాత్రమే ఉంచుతాం.

CWM 13:08

యోగంలో ప్రవేశం

జీవితం మీద, మనుషుల మీద ఏవగింపుతో ఒకరు యోగంలోకి రాకూడదు.

కష్టాల నుంచి తప్పించుకొని పారిపోవటానికి ఒకరు ఇక్కడికి రానక్కర లేదు.

ప్రేమ మాధుర్యాన్ని, రక్షణను వెతుక్కుంటూ కూడా రా నక్కర లేదు, కారణం, ఒకరు గనక సరియైన దృక్పథాన్ని కలిగి ఉంటే, ప్రేమ, రక్షణ, ప్రతి చోటూ అను భవించ గలిగినదే.

ఒకరు దైవసేవలో తమను తాము పూర్తిగా ఇచ్చుకో దలచుకొంటే, దైవకార్యంలో తమను తాము పూర్తిగా అర్పించ దలచుకొంటే, కేవలం తమను తాము అర్పించుకొనే టటువంటి, సేవ చేసే టటువంటి ఆనందం కోసం మాత్రమే అయితే, అర్పణ, సేవ, సాధ్యత తప్ప బదులుగా మరి దేని కోసమూ అడగకుండా ఉంటే, అప్పుడు వారు ఇక్కడకు రావటానికి సిద్ధంగా ఉన్నట్లు; వారికి తలుపులు బార్లా తెరచి ఉంటాయి.

ప్రపంచంలోని బిడ్డ లందరికీ వారెక్కడున్నా ఇచ్చే నా ఆశీస్సులను నేను నీ కిస్తున్నాను, దానితో పాటుగా "నీకు నీవు సిద్ధం కా, నా సహాయం ఎల్లప్పుడు నీతో ఉంటుందని" చెప్తున్నాను.

CWM 13:111-12

దివ్యమార్గానికి కట్టుబడి ఉండు

నా బిడ్డలారా — నేను మీకు చెప్పబోయేది, నేను మళ్ళీ మళ్ళీ చెప్పినదానినే, అయినా మళ్ళీ తిరిగి దానినే చెప్తున్నాను — మీ రందరూ అసాధరణమైన స్వేచ్ఛలో జీవిస్తున్నారు. బాహ్యంలో మటుకు కొన్ని పరిమితులున్నాయి, కారణం, మనం చాలా మందిమి ఉన్నందున, మొత్తం భూమి అంతా మన అధీనంలో లేదు, మనం తప్పనిసరిగా కచ్చితమైన నియమావళికి కొంత మటుకు లోబడి ఉండవలసిన అవసరం ఉంది; దాని మూలంగా అక్కడ చాలా ఎక్కువగా అస్తవ్యస్తత లేకుండే అనకాశం ఉంది కాని అంతర్గతంగా మీరు అద్భుతమైన స్వేచ్ఛలో నివసిస్తున్నారు. ఎటువంటి సామాజిక నియంత్రణా లేదు, ఎటువంటి నైతిక నియంత్రణా లేదు, ఎటువంటి మేధోపరమైన నియంత్రణా లేదు, ఏ శాసనమూ లేదు, ఏమీ లేదు, అక్కడ ఉన్న ఒక ప్రకాశం తప్ప మేరేమీ లేదు. మీరు దాని వలన లాభం పొందాలనుకొంటే, మీరు లాభం పొందుతారు; మీరు వద్దనుకొంటే, దానికీ మీకు స్వాతంత్ర్యం ఉంది.

కాని మీరు దానిని ఎంచుకున్న రోజున — మీరు దానిని సంపూర్ణ చిత్తశుద్ధితో చేసినప్పుడు, మీరు అంతరంగంలో తీవ్రంగా ఒక ముఖ్య నిర్ణయం అనుభూతిని పొందినప్పుడు — విషయం చాలా భిన్నంగా ఉంటుంది. అక్కడ ఒక ప్రకాశం ఉంది, అనుసరించటానికి మార్గం ఉంది, పూర్తిగా సూటి అయినది, మీరు దాని నుంచి అవశ్యం పక్కకు మరల కూడదు. మీకు తెలుసు కదా; యోగం అనేది పరి హాసం కాదు, ఎంపిక చేసుకున్న తరువాత మీరు ఏమి చెస్తున్నారో మీకు అవశ్యం తెలియాలి. కాని మీరు ఎంపిక చేసుకొన్నప్పుడు మీరు తప్పక దానికి కట్టుబడి ఉండాలి. మీ కిక ఏమాత్రమూ అటూ ఇటూ తటపటాయించటానికి అవకాశం లేదు. మీరు తప్పక ముందుకు సూటిగా వెళ్ళాలి. తెలిసిందా!

మీ నుంచి నేను ఆశించేది బాగా చేయాలనే ఇచ్ఛను, పురోభివృద్ధికై ఒక ప్రయత్నాన్ని, సర్వసాధారణ మానవ అస్తిత్వాల కంటే కొంచెం మెరుగ్గా ఉండాలని కోరుకోవటాన్ని. మీరు పెరిగి పెద్దవారయ్యారు, ఎంతో అసాధారణమైన, ప్రకాశవంత మైన, ఎరుక గలిగిన, సామరస్యత కలిగిన, పరిపూరితమైన ఆచరణ కల వాతావరణ పరిస్థితులలో అభివృద్ధి నొందారు. ఈ పరిస్థితులకు సమాధానంగా మీరు ఈ ప్రకా శానికి, ఈ సామరస్యతకు, ఈ ఆదరణకు అభివ్యక్తంగా ప్రపంచంలో ఉండాలి.

అది ముందుగానే ఎంతో శ్రేయోదాయకమైనది, ముందుగానే ఎంతో శ్రేయోదాయక మైనది.

యోగం చేయాలంటే, ఈ పరివర్తన యోగం ఏదైతే అన్నింటి లోకి చాలా ప్రయాసభరిత మైనదో — కేవలం దాని కోసమే ఇక్కడికి వచ్చామన్న అనుభూతి కలిగితే మాత్రమే (నేనన్న దానికి అర్థం ఈ భూమి మీదకు), అది తప్ప చేయటానికి మరేదీ లేదు అని అనుకొంటే తప్ప, ఉనికికి మూల కారణం కేవలం అది మాత్రమేనంటే తప్ప — ఒకరు చాలా కఠిన శ్రమను చేయవలసి వచ్చినా, కష్టపడవలసి వచ్చినా, సంఘర్షించవలసి వచ్చినా, అది అంతగా లెక్కపెట్ట వలసింది కాదు — "నేను కోరుకొనేది ఇదే, మరేదీ కాదు" — అప్పుడు పరిస్థితి మారిపోతుంది. అలా కాకపోతే, నే ననాలి, "సంతోషంగా ఉండు, మంచిగా ఉండు, అంత మాత్రమే నీ నుంచి కోరుకొనేది. అర్థం చేసుకొనే భావనలో, నీవు అసాధారణమైన పరిస్థితులలో జీవించావని తెలుసుకొని, సర్వ సాధారణంగా ఉండేవారి కంటే ఉన్నతోన్నతంగా, ఎంతో ఉదాత్తంగా, ఎక్కువ సత్యసంధత గల జీవితాన్ని జీవించు, దాని మూలంగా కొద్దిగా, ఈ చైతన్యాన్ని, ఈ ప్రకాశాన్ని, దాని మంచితనాన్ని దాని కదే ప్రపంచంలో వ్యక్తం చేయటానికి అనుమతించినట్లుగా జీవనం గడుపు. అది ఎంతో మంచి పని". అదీ విషయం.

కాని ఒకసారి యోగమార్గంలో అడుగు పెట్టావంటే, నీవు ఉక్కులాంటి ధృఢమైన తీర్మానాన్ని తప్పక కలిగినవాడవై, నీ లక్ష్యం వైపు సూటిగా సాగిపోవలసినదే, ప్రపంచం తలకిందులైనా సరే.

CWM 7:199-200

శ్రీమాత విధానం

మీలో చాలా మంది మీరు చాలా చిన్నగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చారు. ఆ వయస్సులో ఆధ్యాత్మిక జీవితం లేదా ఆధ్యాత్మిక బోధన అనే ప్రశ్నలే ఉండవు — అది పూర్తి అపరిపక్వత. మీరు వాస్తవంగా ఈ వాతావరణంలోనే నివసించారు కాని దాని గురించి మీకు కనీసం తెలియను కూడా తెలియదు; మీకు నన్ను చూడటం, నన్ను వినటం అలవాటయింది. నేను మీతో చిన్నపిల్లలతో మాట్లాడే విధంగానే మాట్లాడుతాను, ఒకరు పిల్లలతో ఆడినట్లే, నేను మీతో ఆటలు సైతం

ఆడాను. మీరు కేవలం ఇక్కడకు వచ్చి, కూర్చుని, నేను మాట్లాడేది వినడం మాత్రమే చేయాలి. నన్ను మీరు కేవలం ప్రశ్న లడగటం, నేను సమాధానం చెప్పడం మాత్రమే జరుగుతుంది. మీ కెవరికీ నే నెన్నడూ ఏది చెప్పడానికైనా తిరస్కరించ లేదు — అది చాలా తేలిక. కేవలం అది చాలు — జీవించటానికి — నిద్ర, తినడం, కొన్ని వ్యాయామాలు చేయడం, స్కూల్లో విద్య నభ్యసించడం. ఇతర ప్రదేశాలలో నివసించే విధంగానే మీరు ఇక్కడ కూడా నివసిస్తారు. ఆ విధంగా మీ కది అలవాటయి పోయింది.

నేను గనక కఠినమైన నిబంధనలు పెడితే, "తెలుసుకోవటానికి మీరు నిజంగా కొంత ప్రయత్నం చేస్తే కాని, నేను చెప్పను" అని అంటే, బహుశా అప్పుడు మీ రేమైనా కొంత ప్రయత్నం చేసి ఉండే వాళ్ళేమో; కాని అది నా భావన ననుసరించి ఉండదు. నేను ఎక్కువగా వాతావరణంలో ఉండే ఆధిపత్యశక్తినీ, కఠినమైన బోధన కంటె ఉదాహరణను విశ్వసిస్తాను. నేను అస్తిత్వంలో, ఒక విధంగా, కృషితో కూడిన నియమావళి కంటే, సంక్రమణం ద్వారా ఏదో ఒకటి మేల్కొనేదానికి ఎక్కువగా ప్రాముఖ్యత నిస్తాను.

బహుశా, చివరికి, అస్తిత్వంలో ఏదో ఒకటి సిద్ధమై, ఒక రోజున అది బయటకు పెల్లుబికి వస్తుంది.

అదే నేను ఆశిస్తాను.

CWM 9:372-73

కనబడేవాటి ద్వారా న్యాయనిర్ణయం చేయవద్దు

సహజసిద్ధంగానే, కనీసం అదేమిటో తెలియను కూడా తెలియకుండానే, జనులు వారి అభిప్రాయాలకు సరిపడే విధంగానే దైవం ఉండాలని పట్టుబడ్తారు. అది ఎలాగంటే, ఏమీ ఆలోచించకుండానే, పూర్తిగా అప్రయత్నంగా తటాలున వారు నీతో అంటారు, "ఓహ్, ఇది దైవం, అది దైవం కాదు!" దాని గురించి వారికేం తెలుసు? మరి కొంతమంది, ఇంకా మార్గంలో అడుగు పెట్టనివారు, ఇక్కడకు వచ్చి విషయాలను లేదా జనులను చూసి నీతో అంటారు, "ఆశ్రమానికి దైవానికి ఏ సంబంధమూ లేదు, ఇది ఎంత మాత్రం దివ్యమైనది కాదు". కాని నీవు వారిని , "దైవం అంటే ఏమిటి?" అని అడిగితే, దానికి వారి వద్ద ఏ సమాధానమూ ఉండదు, వారికి దాని

గురించి ఏమీ తెలియదు. ఒకరికి ఎంత తక్కువ తెలిస్తే, అంత ఎక్కువగా న్యాయ నిర్ణయం చేస్తారు. అది సంపూర్ణంగా వాస్తవమైన విషయం. ఒకరికి ఎంత ఎక్కువ తెలుస్తే అంత తక్కువగా వారు విషయాల మీద న్యాయనిర్ణయాన్ని ప్రకటిస్తారు.

ఒకానొక సమయం వస్తుంది, ఒకరెవరైనా చేయగలిగినది ఏమైనా ఉంటే అది పరిశీలించటం, కాని నిర్ణయం చేయడం మటుకు అసాధ్యం. ఒకరు విషయాలను అవి ఇప్పుడున్న విధంగా, వాటి సంబంధాలలో, వాటి స్థానంలో చూడగలరు; అవి ఇప్పుడు ఉన్న స్థానానికీ, అవి తప్పనిసరిగా ఉండవలసిన స్థానానికీ మధ్య తేడాను తెలుసుకో గలుగుతూ — కారణం, అదే ఇప్పుడు ప్రపంచంలో ఉన్న అస్తవ్యస్తత — కాని, ఒకరు న్యాయనిర్ణయం చేయరు, కేవలం పరిశీలిస్తుంటారు.

అప్పుడు ఒకానొక క్షణంలో ఒకరు, "ఇది దైవం, అది దైవం కాదు" అని చెప్పడానికి అశక్తు లవుతారు, కారణం, ఒక సమయం ఆసన్నమౌతుంది, ఒకరు మొత్తం విశ్వాన్ని ఎంతో సంపూర్ణంగా, ఒక విధంగా విస్తృతమై గ్రాహ్యమైన దాని నిగా చూసినప్పుడు, నిజం చెప్పాలంటే, ప్రతి ఒక్కదానినీ అస్థిరపరచకుండా దాని నుంచి దేనినైనా సరే తీసివేయడం అసాధ్యం.

అదనంగా, ఒకటి లేక రెండు అడుగులు ముందుకు వేస్తే, ఒకరు కచ్చితంగా తెలుసుకుంటారు, అది, ఏదైతే దైవానికి వైరుధ్యంగా ఉన్నదని మనల్ని కుదిపివేస్తుందో అది పూర్తిగా కేవలం దాని స్థానంలో లేనిది. ప్రతిదీ కచ్చితంగా తప్పక దాని స్థానంలో ఉండాలి, అంతే కాకుండా, అది తప్పక చాలినంతగా కోమలత్వం కలిగి, చాలినంతగా నూతన రూపానికి ఒదిగి పోగలిగి, అభివ్యక్తమైన విశ్వంలో నిరంతరం కలపబడే నూతన మూలకా లన్నింటితో పురోభివృద్ధి నొందుతూ ఉండే సామరస్యతతో కూడిన వ్యవస్థ లోనికి తావిచ్చేదానికి అనుగుణంగా ఉండాలి.

CWM 8:1-2

ధార్మికాహంకారం — సంకుచిత మనస్తత్వం

ఉదాహరణకు, స్నేహితులు కలిగిన ఒక వ్యక్తిని తీసుకో, ఆమెను ఆమె స్నేహితులు ఎంతగానో కోరుకుంటారు, కారణం ఆమెలో వారు ప్రత్యేకమైన సామర్థ్యాలను చూస్తుంటారు, కారణం ఆమె సహవాసంలో ఉండటం హాయి నిస్తుంది, ఆమె నుంచి ఎల్లప్పుడూ నేర్చుకో గలగటం జరుగుతుంటుంది. అప్పుడు హఠాత్తుగా

పరిస్థితులన్నీ కలవటం మూలంగా, ఈ వ్యక్తి సమాజంచే త్యజించ బడింది. కారణం, ఆమె మరొక పురుషునితో ఉంది లేదా చట్టబద్ధంగా వివాహం కాకుండా మరొకరితో కలసి జీవిస్తున్నది, పర్యవసానం సంక్షిప్తంగా, ఈ సామాజిక విషయా లన్నింటి వలన వాటికి స్వతహాగా ఏమియూ లేక పోయింది. ఆమె స్నేహితు లందరూ — నిజంగా ఆమెను ప్రేమించినవారి గురించి నేను చెప్పటం లేదు — ఆమెతో పరి చయమున్నవారు, ఆమెన సాదరంగా ఆహ్వానించినవారు, ఎవరైతే చిరునవ్వుతో స్వాగతం పలికారో, అభినందనలు తెలిపారో వారు ఆమెను వీధిలో కలసినప్పుడు, ఇప్పుడు వారు మరొక వైపుకు తలలు తిప్పుకుంటారు, ఆమెను చూడకుండా వడివడిగా ఆమెను దాటి వెళ్ళిపోతారు — ఇది ఇక్కడ ఆశ్రమంలో జరిగింది! నేను ఏ వివరణలూ ఇవ్వ దలచుకోవటం లేదు. ఏమైనా కాని, చాలా మార్లు సామాజిక సూత్రాలకు విరుద్ధంగా ఏదో ఒకటి జరిగింది, జనులు ఎవరైతే ఎంతో ప్రేమ, దయ చూపించారో — ఓహ్, ఒక్కొక్కప్పుడు వారంటారు, "ఈ వ్యక్తి భ్రష్టుడై పోయాడు".

అటువంటివి ప్రపంచంలో విచ్చలవిడిగా జరుగుతుంటే, అవి పూర్తిగా సహజంగానే జరుగుతున్నాయని నేను అనుకుంటాను, కాని అవి ఇక్కడ జరిగినప్పుడు, నేను ఎల్లప్పుడు కొద్దిగా అసంతృప్తికి లోనవుతాను. అప్పుడు నాకు నేను చెప్పుకుంటాను, "నిజమే, నిజమే, వారు దానిని దాటి ఆవలకు పోలేదు!" అని.

తాము చాలా విశాల మమస్తత్వం కలవారమని బాహాటంగా నొక్కి చెప్పేవారు కూడా, మేము ఈ సంప్రదాయాలకు అతీతంగా ఉన్నామనేవారు, తక్షణం, సరాసరి ఉచ్చులో పడిపోతారు. అప్పుడు వారి చేతనను రక్షించుకోవటానికి ఇలా సర్ది చెప్పుకుంటారు, "శ్రీమాత దానిని ఒప్పుకోరు. శ్రీమాత దానికి అనుమతి నివ్వరు, శ్రీమాత వాటిని సహించరు!" — ఉన్న మూర్ఖత్వా లన్నింటికి తోడుగా మరొక దానిని కలుపుతారు.

ఈ స్థితి నుంచి బయటపడటం చాలా కష్టం. ఇటువంటి సామాజిక గౌరవం నిజంగా ధార్మికాహంకారమే. కాని ఇది సంకుచిత స్వభావం, కారణం ఒక వ్యక్తి తనకున్న కొద్దిపాటి మేధతో అటువంటి దానిని ఏదో దోషమని పట్టుకో లేడు. ఉదాహరణకు, ఎవరైతే ప్రపంచాన్ని చుట్టి వచ్చారో, ఇటువంటి సామాజిక కట్టుబాట్లు పూర్తిగా వాతావరణం, జాతి, సంప్రదాయం, ఇంకా ఎక్కువగా కాలం, యుగం

మీద ఆధారపడి ఉంటాయని తెలుసుకొన్నారో, వారు దాని నంతటిని దరహాసంతో చూస్తారు. కాని న్యాయవర్తనులు — ఉఫ్!

అది ఒక ప్రాథమిక దశ. నీవు ఈ దశ నుంచి బయటపడేటంత వరకు నీవు యోగానికి అనర్హుడవు. కారణం, నీవు ఆ స్థితిలో ఉన్నప్పుడు, నిజంగా, నీవు యోగానికి తయారుగా లేవు. అది ఒక బీజ స్థితి

CWM 10:78-79

సహజంగా ఉండటం — స్వేచ్ఛగా ఉండటం

ప్ర: కాని సర్వసాధారణ పరిస్థితులలో, ఎలా ఉండాలో ననేదానికి మార్గాన్ని ఒక వ్యక్తి ఎట్లా తెలుసుకో గలడు?

నా బిడ్డా, దాని కోసమే ఆశ్రమం నెలకొల్పబడింది! అదే భావన. ఎందువల్లనంటే, ఫ్రాన్సులో నేను ఎప్పుడూ నాకు నేను ప్రశ్న వేసుకొనే దానిని: ఒక వ్యక్తి తనను తాను తెలుసుకొనేందుకు సమయం ఎట్లా కుదురుతుంది? ఒకరికి కనీసం స్వేచ్ఛను పొందటం ఎట్లాగో అర్థం చేసుకొనే సమయం ఎట్లా కుదురుతుంది? అప్పుడు నేను ఆలోచించాను: ఒకానొక ప్రదేశం ఉండాలి, అక్కడ భౌతిక అవసరాలన్నీ తగి నంతగా ఇవ్వబడాలి, ఫలితంగా ఎవ్వరైనా నిజంగా స్వేచ్ఛగా ఉండదలచుకొంటే, వారు అక్కడ ఆ విధంగా ఉండగలరు. ఈ భావన మీదనే ఆశ్రమం స్థాపించబడింది, మరే ఆలోచనతోనూ కాదు — ఒక చోటుంటుంది, అక్కడ జనం జీవించడానికి సరి పడా సమకూర్చ బడుతుంది. దాని ఫలితంగా పరమ సత్య విషయం మీద ఆలోచిం చేటంత సమయం వారికి ఉంటుంది.

(*చిరుదరహాసం చేస్తుంన శ్రీమాత*) మానవ ప్రకృతి ఎటువంటిదంటే, ఆకాంక్ష స్థానంలో బద్ధకం చోటు చేసుకుంది — ప్రతి ఒక్కరికనీ కాదు, ఏమైనా గాని — సర్వ సామాన్యంగా — స్వేచ్ఛ స్థానాన్ని యథేచ్ఛాప్రవృత్తులు లేదా అనైతికమైన వ్యభిచార ప్రవృత్తులు చోటు చేసుకున్నాయి — మానవజాతి శక్తి వినియోగానికి కట్టుబడిన తన బానిసత్వం నుంచి తనకు తాను ఉపసంహరించుకోవడానికి తయారు కావడానికి ముందు అది కఠిన దండనను పొందవలసి ఉంటుందనే దానిని అది ఋజువు చేస్తున్నది.

యదార్థానికి, మొదటి కదలిక ఇది, “ఓహ్! ఒకరు ఏకాగ్రత వహించటానికి,

తన్ను తాను తెలుసుకోవటానికి, నిజంగా భౌతిక విషయాలలో నిమగ్నం కాకుండా నివసించడానికి చోటు కోసం వెతుకులాట!" అది మొదటి ఆకాంక్ష. దానిని ఆధారంగా చేసుకొని కూడా ఎట్లాగైనా కాని మొదట్లో, శిష్యులను ఎంపిక చేసుకోవటం జరిగింది — కాని అది సాగ లేదు! విషయాలు తెలికైపోయినై, ఉత్సాహం ఉద్రేకాలకు తావివ్వడం జరిగింది. అక్కడ నైతిక నియంత్రణలు లేవు, కాబట్టి వ్యక్తి మూర్ఖంగా ప్రవర్తిస్తాడు.

CWM 10:197-98

కొత్తగా వచ్చేవారికి సలహా

ఇప్పటికే భవిష్య ఉపాధ్యాయులు, భవిష్య విద్యార్థులు రావటం మొదలైంది. కొంతమంది బయట నుంచి (విదేశాల నుంచి) వచ్చారు, దేశ వాతావరణానికీ, సంప్రదాయలకీ వారు కొత్త. మొట్టమొదటి సారిగా వారు ఆశ్రమం లోనికి రావటం జరుగుతున్నది, ఆశ్రమ జీవితం గురించి కాని లేక కట్టుబాట్ల గురించి కాని వారికేమీ తెలియదు. కొంతమంది మానసిక ఆకాంక్షతో వస్తారు, సేవ చేయడానికో లేక నేర్చుకోడానికో, కొందరు యోగం చేయాలనే ఆశతో లేక దైవాన్ని కనుగొనాలని, ఆయనతో ఐక్యం కావాలని వస్తారు. చివరగా కొంతమంది ఉంటారు, భూమిపై దైవకార్యంలో పూర్తిగా తమను తాము అంకితం చేసుకోవాలని కోరుకుంటారు. వారందరూ వారి చైత్య అస్తిత్వం ప్రేరణ వల ముందుకు తోయబడినవారే, అది వారిని ఆత్మసాక్షాత్కార దిశగా ముందుకు నడిపించాలని కోరుకుంటున్నది. వారి చైత్యం వారికి ముందుండి, చైతన్యాన్ని శాసిస్తూ ఉండగా వచ్చినవారు వారు; వారికి జనంతోనూ, విషయాలతోనూ ఒక చైత్యసంబంధం ఉంది. వారికి ప్రతిదీ అందంగా, మంచిగా అనిపిస్తుంది, వారి ఆరోగ్యం మెరుగవుతుంది, వారి చైతన్యం ఇంకా ప్రకాశవంతంగా వృద్ధి పొందుతుంది. ఆనందం, ప్రశాంతత, భద్రత అను భూతిని వారు పొందుతారు. చైతన్యం యొక్క అత్యధికమైన సాధ్యతకు చేరామని వారు అనుకుంటారు. చైత్య సంబంధం వలన ఇవ్వబడిన ఈ ప్రశాంతత, సంపూర్ణత, సంతోషం సహజంగానే వారికి ప్రతి చోటా, ప్రతి దాని లోనూ, ప్రతి వ్యక్తిలోనూ దొరుకుతుంది. ఇక్కడ అంతటా వ్యాపించియుండి, ప్రతి దానిని నెరవేర్చే నిజమైన చైతన్యం దిశగా ఇది ఏ దాపరికమూ లేని ఉన్మీలనాన్ని కలిగిస్తుంది. అటువంటి

దాపరికం లేని ఉన్మీలనం ఉన్నంతవరకు, ప్రశాంతత, సంపూర్ణత, సంతోషాలు వాటి తక్షణ ఫలితాలతో పురోభివృద్ధి, శరీరంలో ఆరోగ్యం, యోగ్యత, ప్రాణికంలో ప్రశాంతత, ఉదారత, మనస్సులో స్పష్టమైన అవగాహన, విశాలత మరియు సర్వ సాధారణ అనుభవమై నటువంటి భద్రత, సంతృప్తి కొనసాగుతూనే ఉంటుంది. కాని మానవ అస్తిత్వం అతడి యొక్క చైత్యంతో నిరంతరం సంబంధాన్ని కలిగి ఉండటం కష్టం. అతడు స్థిరపడిన వెనువెంటనే, అతడి నూతన అనుభవపు తాజాదనం క్రమంగా అంతరించి పోగానే, పాత జీవం దాని అన్ని అలవాట్లు, ఇష్టాయిష్టాలు, అల్పవ్యామోహాలు, లోపాలు, అపార్థాలతో తిరిగి పైకి వస్తుంది. ప్రశాంతత స్థానంలో వ్యాకులత చోటు చేసుకుంటుంది, సంతోషం మాయమవుతుంది. అవగాహన గుడ్డి దవుతుంది. ఈ ప్రదేశమూ అన్ని ప్రదేశాల లాంటిదనే విషయం మెల్లగా పాకుకుంటూ చొచ్చుకు వస్తుంది, కారణం అతడు సర్వత్రా ఇతఃపూర్వం ఉన్న విధంగానే మారాడు. కేవలం ఇంత మటుకు సాధించిన దానిని మాత్రమే చూడటానికి బదులుగా అతడు ఎక్కువెక్కువగా, చాలా మటుగు ప్రత్యేకంగా ఇంకా ఏమి చేయవలసి ఉందో అనే దానినే చూస్తాడు. అతడు విచారగ్రస్తుడై, అసంతృప్తికి లోనవుతాడు, తనను తాను నిందించుకోవడానికి బదులుగా జనులను, విషయాలను దూషిస్తాడు. అతడు సదుపాయాలు లేవని, వాతావరణం భరించరానిదని, భోజనం సరిపడక జీర్ణించుకోవడం తనకు బాధాకరమౌతున్నదని ఫిర్యాదు చేస్తాడు. శరీరం యోగానికి అనుల్లంఘనీయమైన ఆధారమని, దానిని ఉపేక్షించ కూడదని శ్రీఅరవిందులు బోధించినదానిని ఊతంగా తీసుకొంటూ, దానికి వ్యతిరేకంగా, దాని మీద చాలా శ్రద్ధ పెట్టడం జరుగుతుంది, భౌతిక చైతన్యం శరీరం మీద చాలా మటుకు ప్రత్యేకమైన ఏకాగ్రతను వహిస్తుంది, దానిని సంతృప్తి పరచటానికై మార్గాలు వెతికే ప్రయత్నం చేస్తుంది. ఇది ఆచరణాత్మకంగా అసాధ్యం, కారణం, చాలా కొద్ది మినహాయింపులతో, ఎంత ఎక్కువ దానికి ఇవ్వడం జరిగితే, అది అంతగా ఇంకా గట్టిగా కోరుతుంది. అంతే కాకుండా, భౌతిక అస్తిత్వం అజ్ఞానమైనది, గుడ్డిది, అది పూర్తిగా ఉన్నత సిద్ధాంతాలలో, ముందస్తుగానే ఊహించుకున్న భావాలతో, పక్షపాతాలతో, ఇష్టాయిష్టాలతో ఉంటుంది. వాస్తవానికి, అది శరీరంతో, సమర్థవంతంగా వ్యవహరించ లేదు. కేవలం చైత్య చైతన్యానికి మాత్రమే సరైన దానిని సరైన పద్ధతిలో చేసే జ్ఞానమూ, నిశిత దృష్టి ఉన్నాయి.

వెంటనే నీవు నన్ను అడుగవచ్చు, ఇటువంటి పరిస్థితులకు నివారణోపాయం ఏమిటి అని. ఇదంతా ఎందువలన జరుగుతున్నదంటే, ఇక్కడ మనం దోషభూయిష్టమైన చక్రంలో గిరగిరా తిరుగుతున్నాం, కనుక మొత్తం కష్టం అంతా చైత్యం నుంచి దూరంగా పోవడం మూలంగావే వస్తున్నది, కేవలం చైత్యం మాత్రమే సమస్యకు పరిష్కారం కనుగొన గలదు. పర్యవసానంగా కేవలం ఒక్క నివారణోపాయం మాత్రమే ఉంది; ఎప్పుడూ నీ జాగ్రత్తలో ఉండు, చైత్యానికి బలంగా అంటిపెట్టుకొని ఉండు. నీ చైతన్యంలో నీ చైత్యానికి నీకూ మధ్య ఏదైనా సరే జారి పడటానికి సమ్మతించకు నీ చెవులనూ, నీ అవగాహననూ ఇతరమైన అన్ని సూచనలకు మూసివెయ్యి, కేవలం చైత్యం మీద మాత్రమే ఆధారపడు.

CWM 12:45-46

గతంలో చెసినదానినే మళ్ళీ మళ్ళీ తిరిగి చేయండి లేదా భవిష్యత్తును నిర్మించడం

అంతటా అదే చేయబడితే గనక, మనం తిరిగి వాటినే చేయ నవసరం లేదు, అదే జరిగితే, ఇతరులు చేసినదాని కంటే మనం ఏ మాత్రమూ బాగా చేయలేము. నేను చేసేదానికి ఈ వాదనను వారు అడ్డు వేస్తే, అంతకంటే ఎక్కువగా, పూర్తిగా బుద్ధిహీనంగా నీకు కనపడేదానిని దేనినీ వారు చెప్పలేరు. అది అంతటా చేయబడు తున్నాదా? చేయకుండా ఉండటానికి అది అసలైన కారణం, ఎందుకనగా, ఇతరులు చేసినదానినే మనం చేస్తున్నామంటే, దాని కంటే అసలేమీ చేయకపోవటమే ఉత్తమం. మేము కచ్చితంగా ప్రపంచంలో లేనిదానిని ఏదో ఒక దానిని ప్రవేశ పెట్టాలని చూస్తున్నాం; కాని మేము ప్రపంచంలోని అలవాట్ల నన్నింటినీ, ప్రపంచంలోని ఇష్టాయిష్టాల నన్నింటినీ, ప్రపంచంలో నిర్మాణమైన వాటి నన్నింటినీ ఉంచాలనుకొంటే మనం గాడిలో నుంచి ఏ విధంగా బయటపడ గలం? కొత్త దానిని ఏ విధంగా చేయగలం అనే విషయం నాకు కనపడటం లేదు.

నా బిడ్డలారా, నేను మీకు ముందే చెప్పాను, దానిని అన్ని ప్రసంగాలలోను, అన్ని విధాలా మళ్ళీ మళ్లీ చెప్తూనే ఉన్నాను. మీరు ఇక్కడ ఉండటం మూలంగా నిజంగా లాభపడ దలచుకొంటే, ఏదో ఇంకా ఒక ఉన్నతోన్నతమైన, ఏదో ఇంకా లోతైన, విస్తృతమైన, ఏదో ఇంకా ఎక్కువ సత్యమైన, ఏదో ప్రస్తుతం ఇంకా

వాస్తవం కానటువంటి ఒక రోజు తప్పక జరిగేదాని మీద ఆధారపడి నటువంటి కొత్త దృష్టితో, కొత్త అవగాహనతో విషయాలను చూడటానికీ, అవగాహన చేసుకోవడానికీ ప్రయత్నం చేయండి. దానికి కారణం ఈ భవిష్యత్తును నిర్మాణం చేయడానికి మేము ఈ అసాధారణ వైఖరికి విడువకుండా కట్టుబడి ఉన్నాం.

CWM 8:239-40

దర్శన దినాలు — అప్పుడు, ఇప్పుడు

శ్రీఅరవిందులు దర్శనం ఇచ్చే రోజులలో, ఆయన దర్శనం ఇవ్వటానికి ముందు ఎప్పుడూ ఆయన జనుల కివ్వ దలచుకొన్నదాని యొక్క కొన్ని శక్తుల ఏకాగ్రత లేదా కచ్చితమైన సాక్షాత్కారత ఉండేది. కనుక ప్రతి దర్శనం ఒక దశ ముందుకు వెళ్ళినటువంటి గుర్తింపు కలిగి ఉండేది; ప్రతిసారి ఏదో ఒకటి కలుపబడేది. కాని ఆ సమయం ఎటువంటిదంటే అప్పుడు సందర్శకులు చాలా పరిమితంగా ఉండేవారు. అది మరొక విధంగా వ్యవస్థీకరించబడింది, అప్పుడది అవసరమైనటువంటి సంసిద్ధతతా భాగంగా ఉండేది.

కాని ఇప్పుడు ఈ ప్రత్యేకమైన ఏకాగ్రత, ఇతరములైన సమయాలలో సంభవిస్తున్నది, ప్రత్యేకించి దర్శనం రోజులలో కాకుండా, అది ఇంకా ఎక్కువగా తరచుగా, ఇతర తీరుతెన్నులలో, ఇతర పరిస్థితులలో ఏర్పడుతున్నది. ముందుకు అడుగు వేసే గమనం, ఇంకా ఎక్కువ తీవ్రగతిని పొందింది, దశలు ఒకదాని తరు వాత ఒకటిగా శరవేగంతో వస్తున్నాయి. బహుశా దానిని అనుసరించటం చాలా కష్టం; లేదా ఏ విధంగానైనా కాని, ఒకరు పట్టు సడలకుండా ఉండటానికి జాగ్రత్త పడకపోతే, ఒకరిని చాలా ఎక్కువ తొందరగా మునుపటి కంటె ఎక్కువగా వెనుకపడేటట్లు చేస్తుంది, ఒకరు ఆలస్యం అవుతున్న అనుభూతిని పొందుతారు లేక నిర్లక్ష్యం చేయబడినట్టి భావన పొందుతారు. విషయాలు చాలా తొందరగా మార్పు చెందు తున్నాయి.

నేను చెప్పదలచుకొన్నది, దర్శనం సమయాలు ఇంత జనప్రవాహంలో అంతరంగ పురోభివృద్ధికి పని చేయవు — అనగా, ఆశ్రమం లోపల — బయట బాహుళ్యం మూలంగా. ఈ రోజులను మేము ఉపయోగించే విధానం కొంత వేరుగా ఉంటుంది. మొత్తం మీద విశాలమైన క్షేత్రాల లోకి ముందుకు దూరంగా వెళ్ళడానికే, చాలా

సుదూర ప్రదేశాలకు చేరడానికే ఉద్దేశించ బడింది. కాని ఏకాగ్రత తక్కువ ఉంటుంది, జన సమూహం ఎక్కువగా ఉండటం మూలంగా ఈ అసౌకర్యం ఉంది, అది ఎప్పుడూ ఉంది, కాని, మొదట్లో కంటే ఈ గత కొన్ని సంవత్సరాలుగా అది చాలా ఎక్కువగా ఉంటోంది. ప్రారంభంలో ఇంత జనసమూహం ఉండేది కాదు; బహుశా జనసమూహ లక్షణం కూడా కొంత భిన్నంగా ఉండేది.

CWM 8:262-63 శ్రీమాత

అనువాదం; డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అంతర్గతమైన గొప్ప ఆశ్రమం

జ్ఞానుల సమాజం ఏర్పడటానికి అవసరమైన నియమ నిబంధనలు

మన ఆశ్రమము చాలా కాలము 'కొందరు వ్యక్తుల సమూహం' గానే వుండేది. వారికి ప్రత్యేక భావజాలం వుండేది. అందరినీ సమన్వయం చేసే వ్యవస్థ ఆశ్రమంలో ఉండేది కాదు. చూట్టానికి ఒక సమూహంగా వున్నా చదరంగం బల్లపై బంట్లలాగా విడివిడిగానే ఉండేవారు. కాకపోతే ఒకే ప్రదేశంలో ఉండడం వలన కొన్ని కట్టుబాట్లకు లోబడి మెసలేవారు. వ్యక్తిగతంగా వారు పరిణతి చెందుతున్నారో లేదో అది వారికే తెలియాలి. ఇతరులు అంతగా పట్టించుకునేవారు కాదు. పూర్వపు ఆశ్రమం అందు వలన కేవలం ఛాయామాత్ర వ్యవస్థగానే ఉండేది. చాలా కాలం ఇలాగే గడిచింది. ఆశ్రమంలో ఒక సంఘటిత వ్యవస్థ ఉంటే మంచిదని ఈ మధ్యనే అనిపించింది. ఆ వ్యవస్థ కేవలం ఆశ్రమవాసులకే పరిమితం కాకుండా ఆధ్యాత్మికంగా 'శ్రీఅరవిందుల శిష్యులము' అని చెప్పుకునే వారందరికీ ప్రయోజనం కలిగించేలా ఉండాలని కూడా అనిపించింది. 'అతిమానస శక్తి' భూ వాతావరణంలో ప్రవేశించిన నాటి నుండి నిజమైన సమిష్టి జీవన విధానం మరింత అవసరమని అనిపించింది. కేవలము భౌతిక జీవనానికి సంబంధించినదే కాకుండా "జ్ఞానుల అతిమానస వ్యవస్థ" గా అది రూపొందాలి. దీన్ని సాధ్యం చేయాలంటే ఇక్కడ ఉన్నవారంతా అతిమానస చేతనతో పని చేయాలి. వ్యక్తిగత పరిపూర్ణత్వం సాధించ లేకపోయినా, ఆ లక్ష్యానికి సుదూరంలో వున్నా, ఈ దిశగానే కృషి చేయాలి. దానిని 'సామూహిక వ్యక్తిత్వం' అని కూడా

అనవచ్చు. నిజమైన కలయిక, లోతైన అనుబంధం అనేవి చాలా అవసరమని గ్రహించి, ఆ దిశగా చర్యలు చేపట్టాము.

మానవ మనస్తత్వం సహజంగానే వ్యష్టి కేంద్రంగా పని చేస్తుంది. అందువలన కొంత అలజడి వచ్చిన మాట వాస్తవమే. కాని అది భౌతిక విషయంలో కాదు. పద్ధతులు దాదాపు పూర్వ విధంగానే వుండేవి, కాని కొంత లోతైన చేతనతో. ముఖ్యంగా చెప్పదలచుకున్నది ఏమిటంటే ఇది కొంత అంతర్గత పరాధీనతను కూడా సృష్టించింది. ఆ విధంగా వ్యక్తిగత స్థాయి సహజంగానే కొంత తగ్గింది — చాలా కొంచెమే అనుకో — కాని అందరిలో ఇలానే జరిగిందని కాదు. సమానత్వ భావన ఇది వరకే ఏర్పడిన వారిలో తగ్గ లేదు. మొత్తం మీద సాధారణ పరిస్థితి దిగజారిందని అనుకోవద్దు. అది ఇదివరకటి కన్న ఉన్నత స్థాయిలోనే వున్నది. కొద్దిమందిలో అది దిగువ స్థానంలో ఉన్న మాట నిజం. ఈ పరస్పర సహకార సమానత్వంలో అట్టివారు ఏదో భారాన్ని మోస్తున్నట్లు భావిస్తూ అందరిలో ఇమడలేక పోతున్నారు. ఈ స్థితి తాత్కాలికమే. బహుశః పరిస్థితి చక్కబడ వచ్చు; స్పష్టమైన అభివృద్ధి నెలకొనవచ్చు.

CWM 9:173-74

బయట ప్రపంచంలోని యోగాలు ఇంతకంటే ఎక్కువ కష్టసాధ్యమైనా, అవి కూడా పరిపూర్ణమే

రెండు పడవలపై కాలు మోపడం ప్రమాదకరం. అటు ఒక కాలు, ఇటు ఒక కాలు పెట్టనే కూడదు, ముఖ్యంగా ఒక్కొక్కరు ఒక్కో దారిలో పోతున్నప్పుడు. అది ప్రమాదకరం. రెండు విభిన్న జీవన విధానాలను అనుసరించ వద్దని శ్రీఅరవిందులే చెప్పారు. ఏదో ఒకదాన్నే ఎంచుకొని, రెండవ దాన్ని విడచి పెట్టాలి. రెండింటినీ ఒకేసారి అనుసరించటం వీలు పడదు.

ఇందువలన తాను అనుసరిస్తున్న జీవన విధానాన్ని వదలి పెట్టమని కాదు. అసలు మానవలసినది అంతర్గత విధానమే. అది సమూలంగా మారాలి. అలవాటుగా చేస్తున్న వాటిని కొనసాగించ వచ్చు, కాని దృక్పథం పూర్తిగా మారాలి. అలా అని జీవితంలో అన్నిటినీ త్యజించి ఏకాంతం లోనికి వెళ్ళమని నేను చెప్పటం లేదు. ఈ యోగం కొనసాగించటానికి ఏ ఆశ్రమవాసమూ అవసరం లేదు. మౌనము, ఏకాంతము కూడా అనవసరమే. ప్రాపంచిక నేపథ్యంలో వుంటూనే ఈ యోగం

కొనసాగించ వచ్చు. కష్ట సాధ్యమైనా అదే నిజంగా పరిపూర్ణమైనది. ఏకాంతవాసంలో గడిపేవారికి ఎదురపడని అనేక సమస్యలు నిజజీవితంలోనే యోగం కొనసాగించే వారికి ఎదురుపడ వచ్చు. ఒంటరి జీవితంలో సమస్యలు అంతగా వుండవు. సాధారణ జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. నీ చుట్టూ ఉన్నవారి తోనూ, నీకు అవసరం ఉన్నవారి తోనూ 'అవగాహన' సమస్యలు ఎదురౌతాయి. దానికి సిద్ధంగా వుండాలి. సహనాన్నే ఆయుధంగా ధరించాలి. చాలా ఉదాసీనంగా ప్రవర్తించాలి. ఈ యోగంలో ఉంటే "ఇతరులు నీ గురించి ఏమి అనుకుంటున్నారు" అన్న విషయాన్ని పట్టింటు కోగూడదు. "ప్రపంచం నీ గురించి ఏమి అనుకుంటున్నది" అనే విషయానికి గాని, "నీతో ఎలా ప్రవర్తిస్తున్నది" అనే విషయానికి గాని నీలో ఏ అవకాశం ఉండ కూడదు. అలాంటి భావన నిన్ను స్పృశించనే కూడదు. దానికి నీవు చాలా దూరంగా వుండాలి. సాధారణ జీవితం గడుపుతూ కూడా యోగం చేయటం అందుకనే చాలా కష్టం. ఆశ్రమవాసాలలో ఏకాంతంగా గడిపేవారికి ఈ సమస్య ఉండదు.

ప్రపంచంలో వుంటూ యోగం చేయటం కష్టమే కావచ్చు. కాని కష్టమైనదాన్ని సాధించటమే యోగం. ఇక తేలిక పద్ధతులా! అవి పరివర్తన గురించి ఆలోచించ లేని వారికి వదిలేద్దాం.

CWM 4:377, 378

ఆధ్యాత్మిక జీవనానికి సిద్ధం చేసే ఉత్తమ మార్గం

బంధనాలను త్రెంచుకోవటం, సమతను పెంచుకోవటం ఆధ్యాత్మిక జీవనానికి ఉత్తమ మార్గం. "దైవం సర్వాంతర్యామి యనీ, నీలోనే ఉన్నాడు" అని 'భగవద్గీత' కూడా చెప్పింది కదా! అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలోనూ దైవం ఉన్నాడు. ఈ ప్రతిబంధకాలను అధిగమించి వెలుగు వైపుగా, ఆనందం వైపుగా సాగే ప్రయత్నమే జీవిత పరమార్థం. ఆ విధంగా నీకు ఇష్టం లేని విషయాలకు, కష్టం కలిగించే విషయాలకు కూడా పరిష్కారం దొరుకుతుంది. ఇష్టం లేని విషయాలను 'సమత' స్ఫూర్తి తోనే ఎదుర్కోవాలి.

*

బయట ప్రపంచంలో జీవిస్తూ, ఆశ్రమవాసంలో ఉన్నట్లు భావించటం సాధ్యపడదు.

అందరితో కలసి, మెలసి ఉండాల్సిందే; సాధారణ జన జీవనం యథాతథంగా కొన సాగాల్సిందే. అసలు విషయం ఏమిటంటే అంతఃచేతన దివ్యత్వం వైపుగా వికసించి ఆ దిశగా ఎదగాలి. సాధన తీవ్రతను బట్టి కాలక్రమేణా ఇతరులపై మీకు ఉన్న వైఖరి మారిపోతుంది. ఎక్కడ చూచినా దైవస్వరూపమే కనబడుతుంది. క్రమంగా మీ చర్యలు కూడా పాత ప్రపంచపు అలవాట్లు కాకుండా అంతరంగంలోని 'వికసిత చేతన' ను ప్రతిబింబిస్తాయి.

*

సంసార జీవనం సహజంగానే అవిశ్రాంతమైనది. దివ్యత్వపు భావనయే దానిని మార్చగలదు. జీవితాన్ని దైవానికి సమర్పణగా భావించి, అంతరంగ ప్రశాంతత కొరకు ప్రార్థించటమే మన కర్తవ్యం. మానసిక ప్రశాంతత నెలకొంటేనే శ్రీమాత అనుగ్రహం వలన అన్ని పనులూ వాటంతట అవే సవ్యంగా జరిగి పోతాయి. ఆమె దివ్యహస్తాలే అన్నింటినీ స్వీకరిస్తాయి.

ఆశ్రమమే ఈ దివ్య కార్యక్రమానికి కేంద్రం

నా శక్తి కేవలం ఈ ఆశ్రమ పరిధికి గాని, అందులోని పరిస్థితులకు మాత్రమే పరిమితం కాదు. బయట ప్రపంచంలోని యుద్ధ వాతావరణాన్ని, మానవ పరిణామాన్ని మార్చే దిశగా అది పని చేస్తున్నదని నీకు తెలుసు. వ్యక్తుల జీవితాల్లోనే కాకుండా ఆశ్రమ వాతావరణానికి బైట నున్న ప్రపంచం మారటానికి కూడా యోగం ఉపయోగ పడుతున్నది. అట్టి ఆధ్యాత్మిక ప్రక్రియ కూడా నెమ్మదిగా జరుగుతూనే వుంది. అన్నింటికీ ఆశ్రమమే కేంద్ర బిందువుగా వుంటున్నది. యోగసాధన లేనిదే ఆశ్రమానికి అర్థం లేదు. యోగంలో కూడా విభిన్న తత్వాలకు విభిన్న మార్గాలు వుంటాయి. కాని, అన్నిటికి సరిపడే సాధారణ ప్రక్రియ ఒకటే. అట్టిదే దైవానికి లోబడి యుండి దైవత్వపు దిశగా చేతనను వికసింప జేసుకోవటం. వీలయినంత త్వరగా, వీలయినంత వరకు అట్టి పరిణామాన్ని ఆహ్వానించాలి. పైకి వేరుగా కనపడ్డా ఇవి వేరు, వేరు ప్రక్రియలు కావు. వాటి అంతరంగం ఒకటే.

CWSA 35:496

మనసును సంసిద్ధం చేయటానికి చదవటం, అధ్యయనం చేయటం చాలా అవసరమే. కాని కేవలం అవే యోగానికి రాజమార్గాలు కావు అని అతనికి చెప్పాలి. వ్యక్తిలోని

'అంకిత భావమే' సరియైన మార్గం, సాధన కొరకై ఆశ్రమంలో ప్రవేశించాల్సిన అవసరమే లేదు. ఆశ్రమంలో వున్నవన్నీ కోరదగినవే అని చెప్పలేము. ముఖ్య విష యం ఏమిటంటే సాధకుడు శ్రీమాత చేతనతో ఐక్యం కావాలి. తనను తానుగా శ్రీమాతకు సమర్పించుకోవాలి. ఇది త్రికరణ శుద్ధిగా జరగాలి. శ్రీమాత ఆజ్ఞ ఏ రంగానికి చెందినా, అది అంతర్గత చేతనను విస్తృతం చేసే విధంగానే వుంటుంది. ఆమెచే నిర్దేశింపబడిన కార్యక్రమాల నన్నింటినీ ఆమెకు సమర్పణగా భావించి, నిర్వర్తించాలి. అట్లా జరిగిన నాడే ఆమె శక్తి మనపై ప్రసరిస్తున్నట్లు గ్రహించగలము, ఆమె ఉనికి అనుభూతి చెందగలము.

CWSA 35:547,548

బాహ్య, ఆంతరంగిక సామీప్యతలు

ప్ర: సుదూర ప్రాంతాల నుండి శ్రీమాత సహాయం పొందవచ్చా? (అంటే బొంబాయి, కలకత్తాల నుండి) అది ఆశ్రమంలో ఉన్న విధంగానే ఉంటుందా?

సమా: బలమైన ఆధ్యాత్మిక చేతన ఉంటే, దూరంతో ఇబ్బంది లేదు. ఎక్కడ నుంచైనా కొనసాగించ వచ్చు. కాని, అనుభవంలో ఉన్న దానికి, బైట ఉన్నదానికి కొంత తేడా ఉంటుంది. రెండూ ఒకటే అని కచ్చితంగా చెప్పలేము.

*

సాధకుడు: నాకు శ్రీమాతకు సన్నిహితంగా ఉండాలనే వుంది. ఆ విధంగా వ్యతిరేక శక్తుల దాడి నుండి రక్షణ పొందవచ్చు.

సమా: అది సరియైన భావన కాదు. శ్రీమాతకు చాలా సమీపంలో ఉన్నవారిలో, కొందరి విషయంలో నీ కంటే ఘోర విపత్తులు సంభవించాయి. అందువలన భౌతిక సాన్నిధ్యం కాదు, ఆంతరంగిక సాన్నిధ్యం ఉండాలి. అదే రక్షిస్తుంది.

*

ఆంతరంగిక సాన్నిహిత్యమే అవసరం; అదే సహజమైనది. భౌతిక సామీప్యం "ప్రత్యేక అనుకూలత" అని గాని, "సత్వర పురోగమనం" అని గాని అనుకోలేము. ఆ విధ మైన అనుభవాలు దాదాపుగా లేవు. శ్రీమాతను ప్రతి రోజూ దర్శించే వారిలో కొందరు పూర్వం కంటె మరింత అభివృద్ధిని పొందని వారు కూడా కొందరు వున్నారు. అనేక సంవత్సరాలుగా వారిలో ఏ మార్పూ రాలేదు. మరి కొందరి

విషయంలో 'ప్రాణిక శక్తుల' ప్రాబల్యం వలన పరిస్థితి క్షీణించింది కూడా! ఇంకొందరి విషయంలో — శ్రీమాత వద్దకు మధ్య, మధ్య వచ్చేవారైనా — వారి సాధన సక్రమంగా కొనసాగుతూనే వుంది. ఒక సాధకుని విషయంలో వారికి సంవత్సరానికి ఒక్కసారే శ్రీమాత దర్శనం లభించేది. కాని వారిలో అభివృద్ధి మాత్రం ఇతరుల కంటే చాలా ఎక్కువగానే వుంది. శ్రీమాతపై వారికి గల ప్రేమాభిమానాలు బలంగానూ, తీవ్రంగానూ ఉండేవి. శ్రీమాత దివ్యశక్తిపై వీరికి పూర్తి విశ్వాసం ఉండటమే కారణం.
CWSA: 32:494

*

శ్రీమాతతో సన్నిహిత సంబంధం వుంటే, ఆమె నీ సమీపంలోనూ, నీ లోనూ ఉన్నట్లే! భౌతికంగా దగ్గర ఉండాల్సిన అవసరం లేదు. ఇది సాధించలేని వారు దీన్ని గురించే కోరుకోవాలి. ఇంతకంటే ఏదీ ఆకాంక్షించ వద్దు. బాహ్య సాన్నిధ్యం, ఆంతరంగిక సాన్నిహిత్యానికి మించినది కానే కాదు. భౌతికంగా దగ్గర వున్నవారు కూడా మానసికంగా 'సహారా' ఎడారి వున్నంత దూరంలో వుంటారు.
CWSA 32:495

ఒక్క మాటలో చెప్పాలంటే: ఆంతరంగిక సాన్నిహిత్యాన్నీ, అనుబంధాన్నీ పెంచుకోవాలి, బైట నున్న పరిస్థితులపై ఆధారపడ కూడదు. ఈ విధంగానే అన్నీ సానుకూల పడతాయి.

భౌతికంగా బాగా సన్నిహితంగా ఉండే వారంతా యోగంలో చాలా గాఢతతో ఉన్నారని అనుకోవద్దు. ప్రతి నిత్యం శ్రీమాతకు సమీపంలో ఉన్నవారూ, వంగి, వంగి ప్రణామాలు చేసేవారూ, సాయంత్రపు ధ్యానాలకు అను నిత్యం వచ్చేవారూ ఆమెతో మానసిక సాన్నిధ్యాన్ని ఏడాదికి ఒక్కసారి మాత్రమే పొందేవారు కూడా వున్నారు.

CWSA 32:496 *అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు*

అంతరంగ పరిచయ మేర్పరుచుకొనుట

శ్రీమాత ఏకాంతంలోకి వెళ్లడంతో ముఖ్యమైన సమస్య ఒకటి వచ్చిపడింది. ఆశ్రమవాసులకు ఆమెకు మధ్య నున్న భౌతిక అంతరం ఇంకా పెరుగుతుందా? ఆమె నిరంతరం పర్యవేక్షణ లేకుండా ఆశ్రమ కార్యక్రమాలు నిర్వహించ బడతాయా? ఆమె ఏకాంతంలోకి పోవడంతో సాధకుల ప్రయోజనాలు దెబ్బతింటాయా? గతంలో వలెనే ఇప్పుడు కూడా మన బాగోగులు పట్టించు కుంటారా?

ఏదో ఒక నాడు జీవింతంలో ప్రతి వారు తాను స్వయంగా ఏమై వున్నాడో దానినే పొందుతాడనే విషయం విస్మరించ కూడదు. నా అనుగ్రహం, ఆశీస్సులు ఎల్లప్పుడూ నీ వెన్నంటే వుంటాయి. నా శక్తిపై ఆధారపడేవారి గురించి నేను మామూలుగా తీసుకునే జాగ్రత్తలు ఏ ఒక్క రోజూ విరమించ లేదు.

*

కర్మ చేయి. నా ప్రేరణ, మార్గదర్శకం సదా నీతోనే ఉంటాయి. అవసరమైనప్పుడు నేను నిన్ను భౌతికంగా తప్పక చూస్తాను. అయితే నేను ఈ అవసరాన్ని తగ్గించే పనిలో వున్నాను. ఎందుచేతనంటే పనిలో పరిపూర్ణతను సాధించేందుకు అంతరంగ మార్గ నిర్దేశం తప్పని సరి.

*

నీ విప్పుడు ఇక్కడ ఉన్నావు కాబట్టి, చేయవలసింది ఒక్కటే. గతాన్ని మరిచిపో. ఇచ్చట నీ వాచరించ వలసిన పనిపై ఏకాగ్రత చూపు. ప్రస్తుతానికి నేను నిన్నుతరచుగా చూడలేననేది వాస్తవం. అయితే అంతరంగ సంపర్కాన్ని పొంద గలగటం నీవు నేర్చుకోవాలి. (నన్ను నేను ఏకాంత పరచుకోవటంలో గల కారణాలలో ఇది ముఖ్య మైనది). అప్పుడు నీకు దారి చూపేందుకు, సాయపడేందుకు నీ వెంటే వున్నానని, ఇక్కడ నీ సాధనను సవ్యంగా జరుపుటకు ఇంతకన్నా మెరుగైన పరిస్థితులు నీ కుండవని నీకు తెలుస్తుంది.

*

కొన్ని ఆలోచలు, కొన్ని భావనలు, కొన్ని చర్యలు మనుషులను నా నుండీ దూరం చేస్తాయి లేక అవి నాకు, మరొకరికి మధ్య వేర్పాటును సృష్టిస్తాయి, మేమిద్దరం

భౌతికంగా దగ్గరగా నున్నప్పటికీ, అనడం యదార్థం.

*

అమ్మా! మీ తోటి భౌతిక సంపర్కం అనివార్యమా?

కాదు. ఈ భౌతిక సంపర్కం అనివార్యం కాదు. నిజమైన వైఖరి కలిగిన వారికి భౌతిక సంపర్కం శారీరక పరివర్తన ప్రక్రియకు దోహదం చేస్తుంది, కానీ శరీరం తద్వారా లబ్ధి పొందే స్థితిలో ఎల్లవేళలా ఉండదు. సాధారణంగా జన్మదినా లప్పుడు అది అధిక గ్రహణ శీలతను కలిగి వుంటుంది.

*

ఇక పై నేను క్రియాశీల జీవితం గడపను. నీవు ఉన్మీలుడవై వుంటే, సాయం తప్పక అందుతుంది.

CWM 13:78-80

మీ అందరి లోని అంతరంగ ద్వారాలను తెలిచేందుకు అత్యధిక శ్రద్ధ తీసుకుంటాను. ఆ కారణంగా ఏకాగ్రతా చలనం, స్వల్పమైనా కలిగితే, గట్టిగా మూసుకొని వున్న తలుపు ముందు, తాళం చెవి లేకుండా, ఎలా తెరవాలో తెలియకుండా, చాలా కాలం వేచి వుండే అవసరం ఉండదు. తలుపు తెరిచే వుంది. కేవలం నీవా దిశగా చూడాలి, వెన్ను చూప కూడదు.

*

ఎవరికైనా గురువుగా నుండాలనే అత్యాశ నాకు లేదు. జనులందరికి అమ్మగా అనుభూతి చెందుతూ, వారిని నా ప్రేమశక్తితో నెమ్మదిగా ఉన్నత స్థితికి చేర్చడం నాకు సహజం.

CWM 13:82 — శ్రీమాత

అనువాదం: యస్. వై. బాషా

చైత్య సంబంధము దూరంగా ఉండవచ్చు

చైత్య సంబంధము దూరంగా కూడా ఉండవచ్చుని మరియు దైవము ఏ ఒక్క స్థలానికి పరిమితం కాడని, అతడు సర్వాంతర్యామి అన్న విషయం నూటికి నూరు పాళ్ళు నిజం. ప్రతి ఒక్కరు పాండిచ్చేరిలోనే నివసించి, లేక శ్రీమాతకి సమీపంలో ఉండటం ద్వారా ఆధ్యాత్మిక జీవితాన్ని గడపవచ్చుని లేక ప్రత్యేకించి యోగసాధన ఆరంభ దశలో శ్రీమాత సన్నిధిలో చెయ్యవచ్చుని అనుకోవలసిన అవసరం లేదు. కాని అది సత్యానికి ఒక వైపు మాత్రమే. వేరొకటి కూడా ఉంది. దాని తార్కిక ముగింపు ఆశ్రమ ఉనికి, శ్రీమాత ఇక్కడ ఉండవలసిన అవసరం లేదని, ఎవరికైనా ఇచటకు రావలసిన అవసరం లేదని అనిపిస్తుంది.

చైత్యపురుష సత్త ప్రతి ఒక్కరిలోనూ ఉన్నది. కాని కొందరిలో మాత్రం అదిచాలా చక్కగా వికసించి ఉన్నది. చేతనలో చక్కగా నిర్మింపబడి బయటకు ఎక్కువగా కనబడుతున్నది. చాలా మందిలో అది ఆవృతమై దాగి ఉన్నది. తరచుగా ప్రభావితం చేసే శక్తి కొంచెం కూడా లేక కేవలం నామమాత్రంగా మిగిలి, చాలినంత చైతన్య వంతం కాక లేక ఆధ్యాత్మిక జీవితానికి సహాయం చెయ్యడానికి తగినంత శక్తి లేక కూడ మిగిలిపోవచ్చు. ఈ కారణంగా ఈ సత్యము దిశగా ఆకర్షితులగు వారికి వారి చైత్య సంబంధాన్ని మేల్కొలిపి తయారు చెయ్యడానికి లేక దానిని తీసుకు రావడానికి, అదే వారికి ఆరంభం కనుక స్పర్శ పొందగలగడం కోసం, ఇక్కడకి రావడం అవసరం. ఈ కారణంగానే చాలా మందికి ఇక్కడ ఉండడం అవసరం. వారు సిద్ధంగా ఉంటే నేరుగా వారిపై పడే ప్రభావము మరియు సామీప్యము చేతనలో చైత్య సంబంధము యొక్క ఎదుగుదలకి కాని లేక అది ముందుకు రావడానికి కాని దోహద పడవచ్చు. స్పర్శ ఒసగబడినప్పుడు లేక వికాసము ప్రభావితం కాబడినపుడు, ఆ క్షణంలో సాధకుడు ఎంత సమర్ధవంతుడుగా ఉంటే, అతడు బాహ్య ప్రపంచం లోనికి తిరిగి వచ్చిన తరువాత దూరం నుండి కూడా ఆ స్పర్శ రక్షణ, దిశా నిర్దేశం ద్వారా ఈ సంబంధాన్ని నిలుపుకొన గలిగి తన ఆధ్యాత్మిక జీవితంలో కొనసాగ వచ్చు. కాని బాహ్య ప్రపంచం యొక్క ప్రభావాలు చైత్య సంబంధానికి, మనోవికాసానికి అనుకూలమైనవి కావు, ఒక వేళ సాధకుడు తగినంత జాగ్రత్తగా లేక ఏకాగ్రచిత్తుడు కానప్పుడు చైత్య సంబంధము కొంత సమయం తరువాత

చాలా సులభంగా పోగొట్టు కొనవచ్చు లేదా అది మసి బారవచ్చు, వికాసము కుంటువడ వచ్చు, ఉన్న చోటనే నిలిచిపో వచ్చు లేదా ప్రతికూల ప్రభావము మరియు కదలికలచే నాశన మవవచ్చు కూడా. కనుక ప్రభావ కేంద్రము దిశగా తిరిగి వచ్చి సంబధాన్ని తిరిగి పొందడము లేక వికాసము కొరకై ఒక నూతన పురోగమన ప్రేరేపణ అనేది అవసరమని తరచు భావించబడినది. సమయం గడిచిన కొలది అటువంటి సామీప్యమున కైన అభిలాష భౌతికమైన కోరిక కాదు, అహంభావ ప్రేరిత హఠము లేక ప్రాణిక హేతువులో కలిసినపుడు మాత్రమే అది ప్రాణిక కోరిక అవుతుంది, కాని కేవలము ప్రశాంతమైన, లోతైన, సందడిలేని, తత్తరపాటు లేని హఠము లేని చైత్యప్రాణి యొక్క అభీష్టం అయినప్పుడు మాత్రము కాదు.

ఎవరయితే పిలువబడరో లేక ఆశ్రమములో కేంద్రశక్తి యొక్క బలము మరియు అస్తిత్వము యొక్క ప్రత్యక్ష ఒత్తిడికి లోబడి ఆశ్రమములో నివసించుటకు అనుమతించ బడరో, ఇది వారికి ఉద్దేశించబడినది కాదు. ఆరంభ దశ నుండి ఎవరయితే పిలువ బడతారో, ఎవరు సంసిద్ధులై ఉన్నారో, ఏ కారణము చేతనయినా యోగము కొరకై సృష్టించబడ్డ ఏ పని చేయుట కొరకైనా ఎవరు భాగస్వాములు గావింప బడతారో వారు ఆశ్రమంలో తప్పనిసరిగా జీవించాలి. వారికి ఈ వాతావరణంలో నివసించడం, సామీప్యము అనునవి అనివార్యమైనవి. దాని నుండి విడివడడం వారికి ఒసగబడీన అవకాశాన్ని త్యజించడం, ఒసగబడిన ఆధ్యాత్మిక అదృష్టం నుండి వెనుదిరగడం అవుతుంది. చూడడానికి బయట నివసించేవారి ఇబ్బందుల కన్నా వీరి యొక్క కష్టాలు అధికంగా కనిపిస్తాయి. కారణం జాగ్రత్తగా ఉండడము, ఒత్తిడి కూడా అధికమే కాబట్టి. కాని దానికి సమానంగా వారు ఎంపికకు, పిలుపుకు తగినట్లు విశ్వసనీయు లైపప్పుడు వారి ఆధ్యాత్మిక ప్రగతికి దోహదపడు విధంగా వారికి ఇవ్వబడిన గొప్ప అవకాశం, శక్తి, వికాస పరిణామంపై ప్రభావము కూడా చాలా గొప్పవే.

CWSA 35:574-76 శ్రీఅరవిందులు

అనువాదం: డా. విజయలక్ష్మి

వ్యక్తిగతమైన ప్రత్యేక బంధము

ఆశ్రమంలో ప్రతి చోట శ్రీఅరవిందుచే ఇప్పటికి చాలా కాలం క్రితమే పెట్టించిన ఈ గురుతు మీ కందరికీ తెలుసు: "శ్రీమాత ఎల్లవేళలా మిమ్మల్ని గమనిస్తున్నట్లుగా ప్రవర్తించాలి, ఎందుకనగా ఆమె ఉనికి ఎల్లప్పుడూ యదార్థంగా ఉన్నది".

ఇది కేవలం ఒక నుడికారం కాదు, సాధారణ పదముల బంధం, కాదు, అదొక వాస్తవము. నేను యదార్థంగా మీతో ఉన్నాను, సూక్ష్మదృష్టి గలవారు నన్ను చూడగలరు.

సర్వ సాధారణ రీతిలో నా దివ్య క్రియాశక్తి నిరంతరం పని చేస్తూనే వుంటుంది; నీ యొక్క అస్తిత్వ మనోవిజ్ఞాన సంబంధిత అంశాల పరస్పర అనుబంధ బాంధవ్యాలను సర్వదా సర్దుబాటు చేస్తూ, నీ అంతట నీవునీ స్వభావంలోని వివిధ కోణాలను స్పష్టీ కరించుకొని వేటిలో మార్పు తీసుకురావాలో, వేటిని వృద్ధిపరచాలో, వేటిని తిరస్కరించాలో నీవు గ్రహించ గలిగే విధంగా ఉపకరిస్తుంది.

ఇది గాక, నీకు మరియు నాకు మధ్యన ఒక ప్రత్యేకమైన వ్యక్తిగత బంధం ఉంది. శ్రీఅరవిందుల యొక్క, మరియు నా యొక్క బోధన వైపు ఎవరైతే మరలి వున్నారో, వారందరితోను ఒక బంధం ఉంది. శ్రీఅరవిందుల యొక్క మరియు నా యొక్క బోధనల వైపు ఎవరైతే మరలి ఉన్నారో, వారందరితోను ఒక బంధం ఉంది. ఇచ్చట దూరం అనేది లెక్కలోనిది కాదు. నీవు ఫ్రాన్సులో ఉన్నా ప్రపంచం మరో కొసలో వున్నా లేక పాండిచ్చేరిలో వున్నా, ఈ బంధం సర్వదా సజీవమైనదిగా, వాస్తవమైనదిగా నుంటుంది. ఇక పిలుపు వచ్చిన ప్రతిసారీ ఒక శక్తిని, ఒక ప్రేరణను, ఒక రక్షణను లేక మరే దానినైనా తక్షణం పంపించవలసి వస్తుందన్న సమాచారం చెలుసుకున్న ప్రతిసారీ, అవసరమైన చర్య నేను వెంటనే చేపట్టుతాను.

నీకు మరియు నాకు మధ్యన వున్న ఈ బంధం ఎప్పటికీ తెగిపోదు. ఎపుడో చాలా కాలం ముందు తిరుగుబాటు స్వభావం వలన ఆశ్రమాన్ని వదలి వెళ్ళినవారి గురించి సైతం, వారి స్థితిని గురించి తెలుసుకుంటూనే వుంటాను, వారి అవసరం తీరుస్తాను. మీరెప్పుడూ వదిలివేయబడరు. నిజానికి ప్రతి ఒక్కరి బాధ్యతను నేను స్వయంగా వహిస్తాను, నా జీవితంలో నన్ను క్షణ మాత్రం కలిసిన వారితో సహా.

CWM 13:73-74 — శ్రీమాత

దివ్యజననికి ఎవరు ఉన్మీలనమై ఉంటారో, అంతరంగ సత్తాతో ఆమెకు సన్నిహితంగా నుంటారో, ఆమె సంకల్పంతో మమేకమై ఉంటారో వారు ఆమె బిడ్డలు, ఆమెకు అత్యంత సన్నిహితులు శారీరకంగా దగ్గరగా నుండే వారు కాదు.

CWSA 32:496 శ్రీఅరవిందులు

అనువాదం: కవితా శ్రీధర్ . కె

శ్రీఅరబిందో ఆశ్రమం గురించి శ్రీ నళినీదా గారి అభిప్రాయం

ప్రపంచానికి భూమండల మే విధంగానైతే ప్రతినిధిగా నున్నదో అదే విధఁగా భారతదేశం భూమండలానికి ప్రతినిధి. భూమండల పరిణామ క్రమానికి భారతదేశం మాధ్యమం గాను మరియు ప్రయోగశాలగాను ఎన్నుకోబడింది. సమస్త మానవ జాతి ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ఇచ్చటనే గుమిగూడినట్లుగా కనిపిస్తుంది. ఇచ్చట పరిష్కరించబడినవన్నీ దాదాపుగా ప్రపంచమంతటా పరిష్కరించ బడతాయి; ఏ విధఁగా ననేది చూపించ బడతుంది. కష్టాలన్నీ ఇచ్చటనే కేంద్రీకృతమైనాయి, ఎందుకనగా ఇచ్చట ఒక సజీవమైన చేతనా శక్తి ఉన్నది; కేవలం అది మాత్రమే వాటిని పరిష్కరించగలదు.

ఆ విధంగానే ఇచ్చట మన ఆశ్రమం మానవజాతి సమస్తం ఎదుర్కొంటున్న కష్టా లన్నింటికీ ప్రాతినిధ్య సంకేతం అని అనవచ్చు — మానసిక మరియు భౌతిక పరమైనవి, దేశానికి మరియు సమాజానికి చెందిన కష్టా లన్నింటికీ. రకరకాల వైరుధ్యాలు మరియు ప్రతికూలతలు, ఆటంకాలు మరియు ప్రతిబంధకాలు, అజ్ఞానాలు మరియు దురభిమానాలు ఇచ్చట ఉన్నాయి. అవి విషయాలను తికమక చేసి, పురోభివృద్ధి మరియు నూతన సృష్టి దిశగా సాగుతున్న పయనాన్ని సాధ్యమైనంతగా ఆలస్యం చేస్తాయి. ఎందుకనగా, ఇది ఎటువంటి స్థానమనగా, ఇచ్చటి ఉపరితలం వ్యతిరేకార్థక కదలికల వెనుక ఒక ఆకాంక్ష మరియు మహోన్నతమైన శక్తి, క్రియాశీలత గల ఆధారభూతమైన చైతన్యం ఉన్నాయి. ఇచ్చట నున్న వ్యక్తులు అనేక రకాల కష్టనష్టాలను ఎదుర్కొనవలసి వుంటుంది కాబట్టి వ్యక్తిగత స్వభావంలోను, సమిష్టి

సాధనలోను వాటి నుండి విముక్తి నొందగల మార్గం కనుగొనవచ్చు.

CWNKG VOL 4:269-70

శ్రీమాత అన్నారు: ఏ విధంగానైతే ఆశ్రమం భారతదేశానికి సూక్ష్మరూప ప్రతినిదిగా నున్నదో, ప్రతి వ్యక్తి తన వంతుగా ఆశ్రమం యొక్క సూక్ష్మరూప ప్రతినిధిగా నున్నాడో, అదే విధంగా భారతదేశం సర్వ ప్రపంచానికి ప్రతినిధిగా లేక సూక్ష్మరూప ప్రతినిధిగా నున్నది. అందువలన ప్రపంచ సమస్యలన్నీ భారతదేశంలో పరిష్కరించ బడాలి. ఎందుకనగా భారతదేశానికి ఆ సామర్థ్యం ఉన్నది, అది దాని విధిగా నిర్ణయించ బడింది. ఎప్పుడైతే భారతదేశం ఆమె సమస్యలను పరిష్కరించుకుంటుందో, ప్రపంచం సైతం తన సమస్యలు ఆ అనుభవం ద్వారా పరిష్కరించ బడతాయని గ్రహిస్తుంది. ఇక ఆశ్రమం, తన వంతుగా, భారతదేశ సమస్యలకు పరిష్కారం చూపుటకు ప్రతీక్షించాలి. ఆశ్రమం తన పాత్రను పోషించే స్థాయికి ఎదగ గలదా? కనీస పక్షంగా శ్రీమాత ఉద్దేశించింది అదే. ఇక అదంతా ఆశ్రమ సభ్యులపై ఆధారపడి వుంది.

ఈ సందర్భంలో మనం తప్పకుండా గుర్తుంచుకోవాలి, శ్రీమాత సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని.

*

నూతన సృష్టి ఈ పాటికే ఇక్కడ ఉంది — తనంతట తాను రూపుదిద్దుకుంటూ — ప్రస్తుతం ఆశ్రమంలో గాని బయటగాని ఏమి జరుగుతున్నదో అది నూతన సృష్టి సాధ్యమైనంత వేగంగా ముందుకు రాగలగాలనే ఉద్దేశంతో జరుగుతున్న నూతన అస్తిత్వం ప్రతిష్ఠితమై వున్న కట్టడం యొక్క ఉపరితల ఆవరణను ఆమె బ్రద్దలు కొడుతున్నది లేదా దానిని నూతన అస్తిత్వం బయల్పడటానికి దానిని కప్పుకొని వున్న జడమైన గట్టి పెంకును బ్రద్దలు చేయడం అనవచ్చు. అది శ్రీమాత తమ స్వీయ శరీరానికి సంబంధించి చేపట్టిన చర్య. ఆమె తమ ఛిన్నమస్తకావతారాన్ని దాల్చింది. ఆమె కూలుస్తున్నవన్నీ స్వయంగా ఆమెకు చెందినవే — ఒక విధంగా, చేవ చచ్చిన కారణంగా నిరుపయోగమైన తమ శరీర అవయవాలను వదిలించు కుంటున్నారు.

ఈ సందర్భంలో, శ్రీఅరవిందుల వాక్యాలను మనం గురుతుకు తెచ్చు కోవచ్చు:

"... ఆ ఘటియ తరచూ, ఘోరమైనదిగా నుంటుంది — ఒక అగ్నిజ్వాల,

ఒక తుఫాను, ఒక సుడిగాలి. ద్రాక్ష సారాన్ని స్రవింపజేసే మరయంత్ర తీవ్ర చాల నాన్ని బోలిన భగవదనుగ్రహం. కానీ, ఎవరైతే వారు ఆశించిన ప్రయోజనం యొక్క సత్యతపై ఆధారపడి ఆ స్థితిని తట్టుకొని నిలువ గలుగుతారో, వారే తప్పక నిలుస్తారు. వారు పడిపోయినప్పటికీ తిరిగి లేస్తారు. గాలిలో తేలిపోతున్నట్లు కనిపించినా తిరిగి వస్తారు. ప్రాపంచికమైన వివేచనా జ్ఞానాన్ని నీ చెవిలో గుసగుస లాడనీయకు, ఎందుకనగా ఇది అనిరీక్షితమైనది ఆసన్నమయ్యే ఘడియ."

CWNKG, Vo;. 6:258

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

1. శ్రీ నళినీకాంత గుప్తగారు శ్రీఅరవిందుల 'మానస పుత్రుడు' గా ప్రాచుర్యం పొందారు. వారు స్వాతంత్ర్య పోరాటం నుండి, ఆశ్రమ జీవితమంతా శ్రీఅరవిందులతోనే వున్నారు. ఆశ్రమ స్థాపకులలో ముఖ్యులు.

2. 'ఛిన్నమస్తక' — దివ్యజనని యొక్క భయంకర రౌద్రరూపం. ఆ రూపంలో ఆమె తమ స్వంత మస్తకాన్ని తామే ఛేదించుకుంటారు,

కృష్ణుడు ఆశ్రమమును ఆవరించుట

శ్రీకృష్ణుడి రక్షణ వెలుగు ఊదారంగులో ప్రసరించ బడుతుంది, అందువల్లనే, అతి సహజంగా అది నీకు శాంతిమయ ప్రశాంత స్థితి యొక్క అనుభూతిని కలిగించింది. శ్రీమాత అంటారు, ఆమె శ్రీకృష్ణునితో సన్నిహితంగా నున్న ఎల్ల వేళలా దానిని గ్రహించానని; ప్రస్తుతం కూడా అది ఆశ్రమాన్ని నిరంతరం కప్పి యున్నట్లుగా కనిపిస్తున్నదని.

CWSA 30:157

శ్రీఅరవిందులు

అఖిల భారత పత్రిక

డిశంబరు 2017




మరణానంతర జీవనం

జీవన్మరణాలు

జీవం, మరణం — మరణం, జీవం,
పదాలు సాగాయి యుగాల తరబడి
మన భావన, చేతన, స్థిరమైన వైరుధ్యాలు రెండూ,
ఇపుడు దీర్ఘకాలం మరుగున పడ్డ పేజీలు తెరుచుకొన్నాయి,
కలలు కనని సత్యాలను విడుదల చేసాయి.
జీవం వుంది, అది కేవలం మారువేషం వేసుకొన్న మరణం.
జీవం ఒక హ్రస్వమరణం, మనల్ని అబ్బురపరచేవరకు.

CWSA 2: 216 శ్రీఅరవిందులు

అనువాదం: సునీత శేఖర్



మృత్యువుకు అసలైన కారణం — నిజమైన ప్రాముఖ్యత

పదార్థం భూమి మీద ఉంటున్నటువంటి పరిస్థితులే మృత్యువును అనుల్లంఘ నీయమైనదిగా చేసాయి. మొట్టమొదటి అచేతనా స్థితి నుంచి అభివృద్ధి చెందుతూ ఉంటే చైతన్యంగా వృద్ధి పొందుతూ ఉండటమే మొత్తం పరిణామం భావనగా ఉంది. ఇటువంటి వృద్ధి ప్రక్రియలో, విషయాలు వాస్తవంగా జరుగుతున్న రీతిలో, రూపాలు అంతరించి పోవడమనేది అనివార్యమైన ఆవశ్యకత అయింది. వ్యవస్థీకృత్మైన వ్యక్తిగత చైతన్యానికి ఒక స్థిరమైన ఆధారం ఉండాలనే దాని ననుసరించి ఒక స్థిరమైన రూపం అవసరమైంది. అయినప్పటికీ ఈ రూప స్థిరత్వమే మృత్యువును తప్పనిసరి చేసింది. పదార్థం రూపాలను తీసుకోవలసి వచ్చింది. ప్రత్యేకతను సంతరించుకోవడం, జీవం యదార్థంగా నిర్దిష్ట రూపం కలిగి ఉండడం — శక్తులు లేదా చైతన్యం — లేకుండా శక్తులు అసాధ్యం. అవి లేకుండా భౌతిక తలం మీద వ్యవస్థీకృత ఉనికికి మొట్టమొదటి పరిస్థితులు ఉండే అవకాశము ఉండి ఉండేదికాదు. కాని నిర్దిష్టమైన, యదార్థ రూపధారణ ముడుచుకుపోయే ధోరణితో ఒక్కసారిగా కఠినంగా, ధృఢంగా, రాయిలాగ అయిపోయేటట్లు చేసింది. ప్రత్యేక రూపం గట్టిగా పట్టువిడువకుండా ఎక్కువగా నమూనాకు అంటిపెట్టుకుని కొనసాగింది. దానికి శక్తుల కదలికలను అనుసరించే సామర్థ్యం లేదు; సార్వజనీనమగు గమనశీలంలో అభ్యుదయ పథంలో సాగిపోయే క్రమానుగతికమైన మార్పుకు అనుకూలంగా, సామరస్య పూర్వ కంగా, అది మార్పును పొందలేదు; మహాప్రకృతి గట్టిగా ఆశించేవాటిని అది నిరంతరం అందుకోలేదు, లేదంటే ఆమెతో సమానంగా భుజంకలిపి నడవనూలేదు; అది ప్రవాహం నుంచి బయటకు పక్కకు పడిపోతుంది. ఒకానొక సమయంలో రూపానికీ, దానిపై ఒత్తిడి చేసే శక్తికీ మధ్య అధికమైపోతూ ఉండేటటువంటి ఈ తేడాలో మరియు చోటు చేసుకొనే అసామరస్యతలో, రూపం పూర్తిగా అంతరించి పోవడమనే అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. ఒక నూతన రూపం తప్పక సృష్టించ బడుతుంది. ఒక నూతన సామరస్యత, ఒక సమానత సాధ్యం చేయబడుతుంది. ఇదే మృత్యువుయొక్క అసలైన ప్రాముఖ్యత, మహాప్రకృతిలో దాని ఉపయోగం. కాని రూపం ఎక్కువ చురుకుదనాన్ని, మలచ బడగలిగే మెత్తని గుణాన్ని కలిగి ఉండగలిగినట్లయితే, మార్పు చెందే చైతన్యంలో శరీర కణాలను మార్పు చెందటానికి గాను మేల్కొల్ప

గలిగితే, అక్కడ అది తీవ్రస్థాయిలో అంతరించి పోవలసిన అగత్యంలేదు. మృత్యువు ఇక ఎంతమాత్రము తప్పనిసరి కాదు.

CWM 3:37

మరణ సమయం

మృత్యువునెడ సరియైన దృక్పథం

పరిస్థితి ఎటువంటిదైనా గాని, నీ మనస్సు దానిని ఏదో ఒక విధంగా నీకు సహాయం చేసేదే అనే దృష్టితో చూడటానికి అలవాటు పడితే, అది నీకు ఇక ఎంత మాత్రమూ బాధ కలిగించేది అవదు. ఇది బాగా తెలిసిన విషయమే; మనస్సు ఒక విషయాన్ని ఆమోదించటానికి తిరస్కరించినంత కాలం దానికి వ్యతిరేకంగా పోరాడుతుంది, దానిని అడ్డుకొనే ప్రయత్నం చేస్తుంది. అప్పుడక్కడ పీడనలు, కష్టాలు, తుఫానులు, అంతరంగ పోరాటాలు, బాధాకరమైన దంతా ఉంటుంది. కాని మనస్సు, "మంచిది, ఇదే కదా రావలిసి ఉన్నది, అది ఆ విధంగా తప్పకుండా జరిగేదేకదా" అని చెప్పిన నిమిషాన, ఏమి జరిగినా కాని నీవు సంతృప్తిగా ఉంటావు. కొంతమంది మనుషులున్నారు, వారు వారి మనస్సుతో వారి శరీరం మీద ఎటువంటి నియంత్రణను కలిగి ఉంటారంటే, వారు ఏ అనుభూతినీ చెందరు; నేను దీని గురించి ఒకరోజున కొంతమంది మార్మికుల విషయంలో చెప్పి ఉన్నాను. వారు గనక వారిపై విధించబడిన బాధ వారిని ఒక క్షణంలో దశలను దాటిపోవటానికి సహాయం చేస్తుందనీ, వారికి ఒక విధంగా సాక్షాత్కారం పొందటానికి, వారి ముందు వారు పెట్టుకొన్న లక్ష్యానికీ దైవంతో సంయోగానికీ ఆధారమెట్టును అందిస్తుందని వారు అనుకుంటే, వారు ఎంత మాత్రమూ బాధానుభూతిని పొందరు. వారి శరీరం లోహంతో పూత పూయబడిందా అని అనిపిస్తుంది. ఇది చాలా తరచుగా జరిగిన విషయం, ఎవరికైతే నిజంగా తీవ్రమైన ఉత్సాహం ఉంటుందో వారిలో ఇది సర్వ సామాన్యానుభవం. ఏది ఏమైనప్పటికి, ఏదో ఒక కారణాన లేక మరింకొక కారణాన ఒకరు శరీరాన్ని వదలివేసి కొత్తది తీసుకుంటే, వారప్పుడు వారి మృత్యువును ఏవగింపు కలిగించే ఓటమిగా కాకుండా ఏదో అద్భుతమైన దానిగా, సంతోషదాయకమైన దానిగా, అత్యుత్సాహా న్నిచ్చే దానిగా చేసుకోవడం మంచిదికాదా? ఎవరైతే శరీరాన్నే

పట్టుకొని వేలాడు తారో, ఎవరైతే ఒకటి లేక రెండు నిమిషాలు అంతిమ ఘడియను ఆలశ్యం చేయటానికి సర్వశక్తులు ఒడ్డుతారో, ఎవరైతే ఒక ఘోరమైన తీవ్ర బాధానుభవానికి నిన్ను ఉదా హరణగా నిలుపుతారో, నీకు అది వారు వారి ఆత్మ ఎరుకను లేనివారనే దానిని తెలియజేస్తుంది.....

CWM 4:354-55

మరణం కేవలం ఒక సాధనం

ఏది ఏమైనప్పటికీ అది బహుశా ఒక సాధనం, కాదంటావా? ఒకరు ఈ దుస్సంఘట నను ఒక సాధనంగా మార్చుకో గలరు. ఒకరు ఎరుకతో ఉంటే వారు దాని నుంచి ఒక రమ్యమైన దానిని చేయవచ్చు, చాలా రమ్యమైన దానిని, ప్రతి దాని విషయంలో మాదిరిగానే. గుర్తు పెట్టుకో, ఎవరైతే దాని గురించి భయపడరో, ఎవరైతే వ్యాకుల పడరో, ఎవరైతే ఏ విధమైన హీనత్వంతో చనిపోరో వారు ఎన్నడూ దాని గురించి తలంచరు. వారు తప్పించుకోవాలని, సాధ్యమైనంతగా వారి నుంచి దూరంగా దానిని నెట్టివేయాలని ప్రయత్నించే, ఈ 'మహాభీతితో' కాలమంతా ఆలోచనలతో తలమునకలుగా తరమబడకుండా ఉంటారు. సమయమేతెంచినప్పుడు వారు తమ తలను పైకెత్త కలిగినవారై, చిరునవ్వుతో, చెప్తారు. "నేనిక్కడ ఉన్నాను" అని.

అటువంటివారే, వారి జీవితాన్ని అత్యుత్తమంగా ఉపయోగించుకొనే ఇచ్ఛను కలిగి ఉంటారు. అటువంటి వారే ఇలా చెప్తారు, "ఎంతకాలం అవసరమౌతుందో అంతకాలం, చివరిసెకను వరకు, నే నిక్కడే ఉంటాను, నా లక్ష్యాన్ని సాక్షాత్కరించు కోవటానికి నేను ఒక్క క్షణాన్ని కూడా వదులుకోను." అవసరమైనప్పుడు వీరు అత్యుత్తమమైన ప్రదర్శనను కనపరుస్తారు. ఎందుకు? అది చాలా తేలిక, ఎందువల్లనంటే వారు వారి ఆదర్శంలో జీవిస్తారు; వారి ఆదర్శపు వాస్తవికతలో జీవిస్తారు, ఎందుకనగా అది వారికి వాస్తవమైన విషయం, వారి అస్తిత్వ మూల హేతువు. అన్నింటిలోను వారు ఈ ఆదర్శాన్నే చూడ గలుగుతారు. ఉనికికి దీనినే కారణంగా చూస్తారు. వారు భౌతిక జీవితపు హీనత్వంలోనికి ఎన్నడూ కిందికి దిగిరారు.

కాబట్టి ముగింపు:

ఒకరెన్నడూ చావును కోరుకోనే కూడదు.

ఒకరెన్నడూ చనిపోవాలని ఇచ్ఛగించనే కూడదు.

ఒకరెన్నడూ చనిపోవడానికి భయపడకూడదు
అన్ని పరిస్థితులలోను ఒకరు తప్పక తమను తాము
అధిగమించటానికై ఇచ్ఛగించాలి.

CWM 4:354-55

మృత్యుభీతి

ఒకరు చనిపోవాల్సి వస్తే, చనిపోతారు, ఒకరు చనిపోవలసిన సమయం రాకపోతే చనిపోరు. ఒకవేళ నీవు మృత్యుముఖంలో ఉన్నా, అది చనిపోవాల్సిన క్షణం కాక పోతే నీవు చనిపోవు. ఒకవేళ నీవు మొత్తం అపాయంనుంచి బయట పడినప్పటికీ, కేవలం పాదం మీద ఒక చిన్న గాటు చాలు నిన్ను చంపటానికి సరిపోతుంది. కారణం, కొంతమంది జనులున్నారు, వారు కేవలం ఒక గుండు సూదివల్ల చని పోయారు — పాదం మీద చిన్న గాటు — కారణం వారికి సమయ మాసన్న మైంది. కావున భయపడటంలో అర్థంలేదు. నీవు ఏమి చేయగలవంటే, ఒక చైతన్య స్థితికి చేరు. అక్కడ నీవు చెప్పగలిగింది, "అది అంతే, మేము వాస్తవాన్ని ఒప్పుకుంటాం, కారణం, అది అనుల్లంఘనీయమైన యదార్థతగా కనిపిస్తుంది. కాని నేను భయపడవలసిందేమీ లేదు, కారణం అది కేవలం వచ్చేసమయంలో మాత్రమే వస్తుంది. కాబట్టి నేను భయపడవలసిన పనిలేదు. అది రావలసినటువంటి సమయం కాకపోతే, అది నా దరికి రాదు. కాని అది నా దరికి రావలసి వస్తే, అది వచ్చి తీరుతుంది. అది నాకు అనుల్లంఘనీయంగా వచ్చేదైనప్పుడు, నేను భయపడకపోవడమే మంచిది. దానికి వ్యతిరిక్తంగా ఒకరు తప్పక సంపూర్ణంగా ప్రకృతి సహజమైన దానిని ఒప్పుకొని తీరాలి." ఇది బాగా తెలిసినటువంటి నివారణోపాయం, అనగా ఎక్కువగా వాడుకలో నున్నది.

మరొకటున్నది, కొద్దిగా ఎక్కువగా కష్టమైనది, కాని మంచిదని నేను విశ్వసిస్తున్నాను. అది తనకు తాను ఈ విధంగా చెప్పుకోవడం లోను, "ఈ శరీరం నేను కాదు," మరియు తనలో నిజంగా తాను ఏ భాగమో తెలుసుకొనే ప్రయత్నం వారి చైత్య అస్తిత్వాన్ని వారు కనుగొనేంత వరకు చేయడంలోను వుంటుంది. వారు తమ చైత్య అస్తిత్వాన్ని కనుగొనగానే తక్షణం నీకు అర్థమౌతుంది – వారికి శాశ్వతత్వ భావన ఉన్నదని. అప్పుడు ఒకరికి తెలుస్తుంది, ఏది బయటకు పోతుందో

లేదా లోనికి వస్తుందో, అది కేవలం వెసులుబాటు చర్య మాత్రమేనని. "నేను పూర్తిగా చిల్లులు బడిపోయి ప్రక్కన పడేసిన ఒక చెప్పుల జతకోసం ఏడవ దలచుకోవటం లేదు! నా చెప్పుల జత బాగా అరిగిపోయినప్పుడు దానిని నేను ప్రక్కకు పడేస్తాను, నేను ఏడవను." మంచిది, చైత్య అస్తిత్వం ఈ శరీరాన్ని తీసుకుంది. కారణం అది దీనిని దాని పని కోసం వాడుకోవా లనుకొన్నది. కాని శరీరం వదిలివేయ వలసిన తరుణ మాసన్న మైనప్పుడు, అనగా, ఒకరు తప్పక దానిని వదిలివేయాలి, కారణం, ఏ కారణాలవల్ల నైనా గాని అది ఇక ఎంతమాత్రం ఎందుకూ పనికిరాదు కాబట్టి ఒకరు శరీరాన్ని వదిలివేస్తారు. వారికి భయంవుండదు. అది పూర్తిగా ఒక సహజమైన చేష్ట — అది ఏ మాత్రం చింతంచకుండా చేయబడుతుంది, అంతే.

నీవు నీ చైత్య అస్తిత్వంలో ఉన్న క్షణ కాలంలో, నీకు ఆ అనుభూతి ఉంటుంది. అప్రయత్నంగా, తనంత తానుగా, ఏ ప్రయత్నమూ లేకుండానే నీవు భౌతిక జీవితానికి పైకి ఎగబాకావు. నీకు శాశ్వతత్వభావన కలుగుతుంది. నాకు మటుకు నేను ఇది అత్యుత్తమమైన నివారణగా పరిగణిస్తాను......

ఇప్పుడిక మూడోది కూడా ఒకరు తప్పక తెలుసుకోవాలి, కాని దీనికి ఒకరు తప్పక గొప్పయోగి కావలసి ఉంది. దీని అర్థం మరణం అనుల్లంఘనీయ మైనదేమీ కాదు. ఇది ఒక ప్రమాదం, ఇప్పటి వరకు జరుగుతూనే ఉన్నదే (ఇప్పటివరకు ఏ విధంగానైనా ఎల్లప్పుడూ జరుగుతూనే ఉన్నదే), అని తెలుసుకుంటూనే, దీనిని గెలవాలనే ఇచ్ఛనూ, దీనిని అధిగమించాలనీ మనం మన బుర్రలో నిశ్చయం చేసుకొని ఉన్నాం. కాని ఇది చాలా భయానకమైనది, ఇది అన్ని మహాప్రకృతి ధర్మాలకు వ్యతిరేకంగా, అన్ని సమిష్టి సూచనలకు వ్యతిరేకంగా, సమస్త భూ అల వాట్లకు వ్యతిరేకంగా జరిగే భయంకరమైన యుద్ధం, కాని నేను ముందే చెప్పిన విధంగా, నీవు అగ్రశ్రేణి యోధుడవై యుండాలి. అతడిని ఏదీ భయపెట్టలేదు, అలా కాకపోతే, యుద్ధం మొదలుపెట్టకపోవడమే మంచిది. నీవు తప్పకుండా, సంపూర్ణంగా, నిర్భయుడవైన వీరుడవు అయివుండాలి, కారణం, ప్రతి ఒక్క అడుగులో, ప్రతిఒక్క సెకను, నీవు బలంగా పాతుకుపోయిన అన్ని విషయాలకు వ్యతిరేకంగా యుద్ధం చేయవలసి ఉంటుంది. కాబట్టి అది అంత తేలికైన విషయం కాదు.

కేవలం ఒకరు చనిపోవటానికి అనుమతిని ఇస్తే మాత్రమే వారు చనిపోవటం జరుగుతుంది

అమ్మా, నీవు చెప్పావు, "ఒకరు దాని సమయాన్ని వేగిరపరచనూ లేరు, లేదా ఆలస్యం చేయనూలేరు." కాని ఒకరు తాము పురోభివృద్ధి నొందటం ఆగిపోతే మరణం సంభవిస్తుంది. కాబట్టి పురోభివృద్ధి నొందుతూ ఉంటే మరొక సమయానికి వారు దానిని వాయిదా వేయగలరు. లేదా దీని అర్థం ఒకరు పుట్టి నప్పుడే వారు చనిపోయే రోజు, క్షణం ముందే విధినిర్ణయమై పోయి ఉంటుందా?

కాదు. ఇది పూర్తిగా మరింకేదో విషయం, వేరొక క్షేత్రానికి చెందినది. నేను మరో చోట, ఒకరు కేవలం చనిపోవటానికి అనుమతినిస్తే మాత్రమే వారు చనిపోతారు అని వ్రాసాను. నేను ఇక్కడ చెప్పినదానికి అది వ్యతిరేకంగా అనిపిస్తున్నది. కాని ఇదే సత్యం. నేను దీనిని ఈవరకే ఒకసారి చెప్పి ఉన్నానని అనుకుంటున్నాను; ఏమైనా గాని, నేను దీనిని ఎక్కడో మరోచోట వ్రాసి ఉన్నాను. అందులో రెండు దృక్పథాలున్నాయి. ఇక్కడ నేను పూర్తిగా సర్వ సాధారణమైన దృక్పథాన్ని మాత్రమే తీసుకున్నాను, అది భౌతిక చైతన్యానిది. కాని నేను ఎక్కడో మరొకచోట మన అస్తిత్వంలో విభిన్నము లైనటువంటి, "నిర్ణయకాల పొరలు" ఉన్నాయని వివ రించాను. భౌతిక ఉనికికి ఒక నియతి ఉంది. ప్రాణిక ఉనికికి ఒక నియతి ఉంది. మానసిక ఉనికికి ఒక నియతి, ఉన్నతోన్నత మనస్సుకు, చైతన్యానికి వేరు వేరుగా నియతు లున్నాయి. ఇంకా ఉన్నతోన్నత స్థితులకు నియతులున్నాయి. అతిమానసిక స్థితికి ఒక నియతి ఉంది. వీటన్నింటి నియతుల కలయిక వల్ల ప్రతివాని యొక్క నియతి ఏర్పడుతుంది. (నేను దీనిని ఎక్కడో ఒకచోట కచ్చితంగా వ్రాశాననే అను కుంటున్నాను). ఉదాహరణకు, ఒకానొక క్షణంలో, మొత్తం భౌతిక నియతి తప్పక ఆవశ్యకంగా మరణాన్ని తీసుకు వచ్చేదైతే, నీవు హఠాత్తుగ అతిమానసం వంటి మహోన్నతమైన నియతి సంపర్కంలోకి ప్రవేశించి, ఈ రెండింటినీ కలపడంలో సఫలీకృతుడవైతే, నీవు ఆ క్షణంలోని నీ భౌతిక నియతిని పూర్తిగా మారుస్తావు: భౌతిక నియతి వలన నిశ్చయించ బడిన మరణం రద్దు చేయ బడుతుంది, పరిస్థితులు మార్పుకు లోనవుతాయి. వెనక్కు నెట్ట బడుతాయి.....

నీవు ఉన్నతోన్నత మైన నియతిని జోక్యం చేయనీయక పోతే, నిజంగా నీవు

దేనినీ మార్చలేవు. నీ భౌతిక నియతిని మార్పు చేసే విధానం కేవలం అది మాత్రమే. నీవు నీ భౌతిక చైతన్యంలోనే కొనసాగుతూ, నీదైనటువంటి నియతిని మార్చాలనుకొంటే, నీవాపని చేయలేవు....

CWM 6:47- 48

ఆత్మ చుట్టూ విభిన్న విభాగాలను ఎరుకతో వ్యవస్థీకరించడం

ఒక్కొక్కప్పుడు మనుజులు చనిపోయే సమయంలో, చనిపోతున్నామని వారికి తెలుస్తుంది. అప్పుడు వారు మృత్యువును వెళ్ళిపొమ్మని ఎందుకు చెప్పరు?

ఆహా! నిజమే, అది ఆ మనుజుల మీద ఆధారపడి ఉంటుంది. రెండు విషయాలు తప్పనిసరి. మొట్టమొదట, నీ అస్తిత్వంలో ఏదీ, నీ అస్తిత్వంలో ఏ భాగమూ చని పోవాలని కోరుకో కూడదు. ఇది అంత తరచుగా జరిగేది కాదు. నీలో ఎక్కడో ఒక చోట, ఎల్లప్పుడూ ఒక నిరాశావాది ఉంటాడు: అలసిపోయినదేదో, విసుగుచెందిన దేదో, దానితో ఇక భరించ శక్యము కాని దేదో, సోమరి అయిన దేదో, పోరాటం సలపటానికి ఇష్టపడని దేదో అంటుంది, "మంచిది, ఆహా! ముగిసి పోవడమే మేలు, ఎంత త్వరగా అయితే అంత మంచిది", అది చాలు నీవు చనిపోవటానికి.

కాని ఇది నిజం: ఏదీ కూడా, పూర్తిగా నీలో ఏదీ కూడా చనిపోవటానికి సమ్మతి నివ్వకపోతే, నీవు చనిపోవు. ఒకరు చనిపోవటానికి ఎల్లప్పుడూ ఒక సెకను ఉంటుంది, బహుశా ఆ సెకనులో నూరవ వంతు సమయంలో అతడు తన సమ్మతిని తెలియ జేస్తాడు. సమ్మతి నిచ్చిన ఈ సెకనే లేకపోతే అతడు చనిపోడు.

భౌతిక ప్రాణిక సూత్రాల ప్రకారం తప్పకుండా చనిపోయి ఉండవలసిన మనుషులు నాకు తెలుసు; దానిని వారు తిరస్కరించారు. వాళ్ళన్నారు, "లేదు, నేను చనిపోను", వారు జీవించారు. ఇంకా ఇతరులు కొంతమంది ఉన్నారు, వారికి చనిపోవలసిన అవసరమే లేదు, కాని వాళ్ళ లక్షణం అటువంటిది, వాళ్ళంటారు, "ఆహా! మంచిది, అవును ముగిసిపోవటం ఎంత త్వరగా అయితే అంత మంచిది", అంతే అది ముగిసిపోతుంది. ఆ కాస్తా చాలు, దాని కంటే ఎక్కువేమీ అక్కర లేదు: అంత మాత్రం చాలు, అంతకన్నా మించి ఏమీ అక్కర లేదు. పట్టుదలతో కూడిన కోరిక వుండ నక్కర లేదు, కేవలం నీవు చెప్పవలసింది "మంచిది, అవును నిజమే, ఇక భరించే ఓపిక లేదు!" అంతే పరిసమాప్త మౌతుంది. కనుక అది నిజంగా అటువంటిదే.

నీవు అన్నట్లుగా, నీ మంచం పక్కన మృత్యువు నిలబడి ఉండగా, దానితో నీ వంటావు: “నేను నిన్ను కోరుకోవటం లేదు, వెళ్ళిపో”, తప్పకుండా అది నీ మాట విని వెళ్ళిపోతుంది, కాని సర్వసాధారణంగా ఒకరు దారి నిస్తారు, కానీ, ఒకరు తప్పక పోరాడాలి, ఒకరు తప్పక దృఢంగా ఉండాలి, ఒకరు తప్పక ధైర్యంగా ఉండాలి, ఓరిమితో ఉండాలి, జీవితం ప్రాధాన్యత మీద తప్పక గొప్ప విశ్వాసం ఉండాలి; తాను ఏదో ఇంకా చేయవలసి ఉందని గట్టిగా అనుభూతి చెందుతూ, దానిని నేను తప్పక సంపూర్ణం చేయవలసి ఉందని అనుకునే వాడిలాగా ఉండేవాడి నొకనిని ఉదాహరణగా తీసుకో. కాని కచ్చితంగా ఎవరికి తెలుసు, అతనిలో లేశ మాత్రమైనా ఎక్కడో ఒక చోట నిరాశావాది లేడని, అతడు వాస్తవంలో లొంగిపోయి అంటాడు, “మంచిది, జరిగిపోనీ”?... ఇక్కడనే, తనకు తాను ఏకీకరణను చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఎటువంటి పద్ధతిని మనం అనుసరించినా, ఏ విషయాన్ని అభ్య సించినా, మనం ఎల్లప్పుడూ ఒకే ఫలితానికి చేరతాం: ఒక వ్యక్తికి అత్యంత ముఖ్యమైన విషయం, తనలోని దివ్యకేంద్రం చుట్టూ తనకు తాను ఏకీకరించుకోవటం; ఆ విధంగా అతడు నిజమైన వ్యక్తి అవుతాడు, తనకు తాను, తన విధికీ ప్రభు వవుతాడు. కాని పక్షంలో, అతడు శక్తుల చేతిలో ఆటవస్తువు, నదిలో నీటి మీద అటు ఇటు కొట్టుకుంటూ ఉండే చిన్న బెండులాగా అవి అతడిని పైకి కిందికీ ఆడిస్తాయి. అతడికి ఇష్టం లేని చోటికి పోతాడు, అతడికేవి ఇష్టం లేవో వాటిని బలవంతంగా అతడి చేత చేయించడం జరుగుతుంది, చిట్టచివరికి గట్టిగా పట్టుకొనే శక్తి లేక అతడు గుంటలో పడిపోతాడు. కాని నీవు ఎరుకతో వ్యవస్థీకృతుడవైతే, దివ్యకేంద్రం చుట్టూ ఏకీకరించబడిన వాడవై, దాని వలన పరిపాలించబడి, నిర్దేశించబడితే, నీవు నీ విధికి ప్రభువవుతావు. ప్రయత్నించిన దానికి ఫలితం ఉంటుంది....

CWM 5:138

గాఢాంధకారమయమైన, ప్రమాదభరితమైన నిష్క్రమణం

ఆత్మహత్య చేసుకొంటే ఒకరు బాధ నెందుకు అనుభవిస్తారు?

ఆత్మహత్య చేసుకోవట మెందుకు? దానికి కారణం ఒకడు పిరికివాడు కావటం... ఒకరు పిరికి అయితే, ఎల్లప్పుడూ బాధ ననుభవిస్తూ ఉండటం జరుగుతుంది.

వచ్చే జన్మలో వారు తిరిగి బాధ ననుభవిస్తారా?

చైత్య అస్తిత్వం ఒక నిర్దుష్టమైన ఉద్దేశంతో కొన్ని స్థిరమైన అనుభవాల ద్వారా జీవించటానికి, నేర్చుకోవటానికి, అభివృద్ధి పొందటానికి వస్తుంది. దాని పని పూర్తి కాకుండానే నీవు వెళ్ళిపోతే ఆ పనిని చేయటానికి చాలా ఎక్కువ కష్టమైన పరిస్థితులలో అది తిరిగి రావలసి ఉంటుంది. కాబట్టి నీవు ఒక జీవితంలో తప్పించుకొని వదలివేసిన దంతా, మరొక జీవితంలో తిరిగి పొందవలసి ఉంటుంది, ఇంకా ఎక్కువ కష్టంతో. ఈ విధంగా వదలి వేయకుండా కూడా నీకు జీవితంలో అధిగమించ వలసిన కష్టాలుంటే, మేము సర్వ సాధారణంగా అంటూ ఉంటాం, నీవు ఒక పరీక్షలో ఉత్తీర్ణుడవు కావాల్సి ఉంటుంది, తెలుస్తున్నదా; ఒక వేళ నీవు పరీక్షలో ఉత్తీర్ణుడవు కాకపోతే లేదా పలాయనం చిత్తగిస్తే, ఉత్తీర్ణుడవు కావటానికి బదులుగా వదలి వెళ్ళిపోతే, నీవు మరొక సమయంలో ఉత్తీర్ణుడవు కావలసి ఉంటుంది, అది మునుపటి కంటే చాలా ఎక్కువ కష్టదాయకంగా ఉంటుంది.

ప్రస్తుత కాలంలో జనులు, తెలుసు కదా, అమితంగా అజ్ఞానులు. వారు దాని గురించి ఈ విధంగా ఆలోచిస్తారు: అక్కడ ఒక జీవితం ఉంది, తరువాత మృత్యువూ ఉంది; జీవితం ఇబ్బందుల పుట్ట, ఇక మృత్యువేమో శాశ్వతమగు ప్రశాంతత. కాని ఆ విధంగా ఏ మాత్రం లేదు. సాధారణంగా ఒక రెవరైనా జీవితం నుంచి పూర్తిగా అనాలోచితంగా బయటకు వెళ్ళిపోతే, ఒక అజ్ఞానమయ, అర్థరహితమైన తీవ్ర ఉద్రేకంతో పోతే, వారు సరాసరి ఈ రకమైన తీవ్రోద్రేకాలతో, ఈ అజ్ఞాన మంతటితో నిండిన ప్రాణిక లోకంలోకి వెడతారు. కనుక ఒకరు తప్పించుకోవాలనుకొన్న ఇబ్బందులు, శరీరం వారికి ఇచ్చే ఎటువంటి రక్షణకూడా లేకుండా తిరిగి ఎదురవు తాయి. అది ఎలాగంటే, నీకు ఎప్పుడైనా పీడకల వచ్చినప్పుడు, అనగా ప్రాణికంలోకి దుందుడుకు విహారయాత్ర, దానికి నివారణ వెంటనే నీకు నీవు మేల్కొనటం, అనగా తక్షణం శరీరంలోకి వేగంగా వచ్చేయడం. కాని నీవు నీ శరీరాన్ని నాశనంచేస్తే, నిన్ను రక్షించటానికి ఇక ఎంతమాత్రం నీకు నీ శరీరం ఉండదు. కనుక నీవు నిరంతరం పీడ కలలోనే వుంటావు. అది ఏమంత హాయిగా నుండదు. నీవు పీడకలను తప్పించు కోవాలనుకొంటే, నీవు నీ చైత్య చైతన్యంలో ఉండాలి. నీవు చైత్య చైతన్యంలో ఉంటే, నిన్ను ఎటువంటి విషయాలు బాధించవని నీవు చాల కచ్చితంగా అనుకోవచ్చు. వాస్తవానికి అది ఒక అజ్ఞానాంధకార గమనం, నేను మునుపే చెప్పినట్లుగా, ఓర్పుతో

కూడిన ప్రయత్నంతో నిర్వహించవలసిన ఒక కార్యం సమక్షంలో ఒక మహా పిరికివాడ వుతాడు.

CWM 7:23-24 శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

స్థిరమైన జ్ఞాపకము మరియు నిష్క్రమణ క్షణం

మన ఆలోచన, ఆంతరిక భావన, విశ్వాసము, శ్రద్ధ ఏదైతే తనకు తానుగా పరిపూర్ణమైన మరియు నిశ్చయమైన పట్టుదలతో స్థిరపడుతుందో దాని లోకి మారడానికి మన అంతర్జీవి మొగ్గు చూపుతాడు. మన మెప్పుడైతే ఆ ఉన్నతమైన ఆధ్యాత్మిక మరి యు స్వయంకృత అనుభవాలలోకి — మన సాధారణ మనస్తత్వం ఆధారపడిన దానికన్నా తక్కువగా బాహ్య విషయాలపై ఆధారపడిన, బాహ్య ప్రకృతికి లోబడినవి — ప్రవేశిస్తామో అప్పుడు ఆ వైఖరి ఒక నిర్ణయాత్మక శక్తిగా రూపుదిద్దుకుంటుంది. అక్కడ మనం దేనిపైనైతే మనస్సును కేంద్రీకరిస్తామో, దేనిని మనం నిరంతరం అభిలషిస్తామో, దానిగా మనంతట మనం, నిలకడగా మారడం మనం గమనించగలం. కాబట్టి ఆ మార్పు చెందే క్రమంలో మన ఆలోచనా సరళిలో ఏ విధమైన లోటు చోటు చేసుకున్నా, జ్ఞాపకశక్తి సన్నగిల్లి సహకరించక పోయినా, మార్పు చెందడం మందగిస్తుంది, లేదా దాని ప్రక్రియ కొంత పతనావస్థకు దిగజారి, మనలను మన పూర్వ స్థితి దిశగా తిరోగమింప జేయడం జరుగుతుంది. ఇట్టి స్థితి, కనీసం మనం ఆకాంక్షించే లక్ష్యాన్ని తిరుగులేకుండా సుస్థిరంగా నిలుపుకోనంత వరకు కొనసాగు తుంది. మనం ఎప్పుడైతే మార్పు చెందాలనే ఆకాంక్షను పటిష్ట పరచుకొని, దాని ని మన సాధారణ అనుభవంలోకి తెచ్చుకున్నామో, దాని స్ఫురణ దానికదిగా నిలిచిపోతుంది. ఎందుకనగా అది మన స్వాభావిక సహజ చేతనగా రూపొందింది గనుక. ప్రాణం పోతూ జీవావరణాన్ని దాటుతున్న ఆపత్కార ఘడియలో అప్పటి మన చేతనాస్థితి యొక్క విశిష్టత స్పష్టంగా తెలుస్తుంది. కాని ఇది మరణశయ్యపై కలిగే స్ఫురణ కాదు, మన జీవన శైలికి వ్యతిరేకమైన లేక దానితో అసంపూర్ణంగా రూపొందించబడిన మరియు మన గత అంతరంగ స్థితియొక్క రక్షణ శక్తి కాదు. గీతలో ప్రవచించబడిన ఆలోచన జనామోదక మతపరమైన ఇష్టాయిష్టాలతో,

సౌలభ్యాలతో పొసగదు. ఒక క్రైస్తవుడు మరణించిన అనంతరం ఆ మతాచార్యుడు నిర్వర్తించే పాపవిమోచన ప్రక్రియ, తైలాభ్యంగనలాంటి విచిత్రమైన చర్యలు అజ్ఞాన భరితమైన అపవిత్ర జీవితాన్ని జ్ఞానస్ఫూర్తిగలదానిగా, పవిత్రమైనదిగా చేయజాలవు. ఆ విధంగానే పుణ్య క్షేత్రమగు బనారస్ (కాశి) లో గాని, పవిత్ర గంగానదిలోగాని, ముందు జాగ్రత్త చర్యగా, ఏర్పాటు చేసుకొన్న మరణం, ముక్తిని ప్రసాదించదు.

భౌతికంగా మరణం సంభవించే క్షణంలో 'దైవంగా, మారడం' అన్న దానిపై మనస్సు కేంద్రీకరించబడాలి — 'యామ్ స్మరన్ భావమ్ త్యజతి అంతే కాలేవరమ్' భౌతికంగా జీవిస్తున్నప్పుడే లోలోపల ఆ భావంలో అంతరాత్మ ఎదుగుతూ పోవాలి. 'సదా తద్ భావ భావితః' –- "కావున" గీతాచార్యుడు అంటాడు, "అన్ని వేళల నన్నే స్మరించు. యుద్ధం చెయ్యి, ఎందుకనగ నీ మనస్సు మరియు నీ బుద్ధి సర్వదా నాపై లగ్నమై, నాకే సమర్పించితే — 'మయి అర్పిత మనో బుద్ధిః' — తప్పక నన్నే చేరుతావు." ఎందుకనగా భగవంతుడినే సర్వదా తలుస్తూ, చేతనను ఆయనతో మమేకం గావించితే, ఒక స్థిరమైన నిరంతర యోగసాధనతో దైవం దరికి, ఆ పరమపురుషుడి దరికి చేరగలుగుతావు.

CWSA 19: 294-296 శ్రీఅరవిందులు

అనువాదం: సి. హెచ్ . హర్షవర్ధన్

మానవాతీత శక్తిని నమ్మే ఆధ్యాత్మిక వేత్తలు దేని గురించైనా భయ భ్రాంతులైతే, ఉత్తమమైన నివారణోపాయం, దైవాన్ని స్మరించడం. అప్పుడిక ఆయన హస్తాల్లోనో లేక పాదాల వద్దనో ఒదిగి పోవాలి. ఆంత రికంగా, బాహ్యంగా లేక ఎక్కడనైనా జరిగే ప్రతి విషయాన్ని ఆయన బాధ్యతకే వదిలివేయాలి. వెంటనే భయం మటుమాయమై పోతుంది. ఆధ్యాత్మికవేత్తకు అదే నివారణోపాయం, అన్నింటికన్నా తేలికైన పద్ధతి. అయితే, ప్రతివారు ఆధ్యాత్మికవేత్తగా ఆనందంగా అనుభవించగల అను గ్రహం అందుకోవటానికి పాత్రులు గాలేరు.

CWM 5:318 శ్రీమాత

అనువాదం: సి. హెచ్ . హర్షవర్ధన్

అసహజ గాఢ నిద్రస్థితి (కోమాలో) శ్రీమాత నామాన్ని పునశ్చరణ చేయడం

'కె' అనే వ్యక్తి చనిపోయాడు. అతనికి జరిగిన శస్త్రచికిత్స అసాధారణ స్థితిలో విచిత్రంగా విజయవంత మయింది. అది ఒక భయంకరమైన శస్త్రి చికిత్స, శరీరంలోని ఒక భాగాన్ని బయటకు తీసివేసేది. తరువాత నాలుగు రోజులవరకు బాగానే వున్నాడు. ఆ తరువాత పరిస్థితి తారుమారయింది.

మామూలుగా అట్టి సందర్భాలలో, శస్త్రిచికిత్స చేసే సమయాల్లో చేసేటట్లుగా నేను ఎంతో సునిశితంగా నాశక్తిని అతనిపై ప్రసరింపజేసాను — అంతా సవ్యంగా ముగుస్తుందని. కొన్ని రోజుల క్రితం నేను జపం చేస్తున్నప్పుడు ఒక రకమైన ఆదేశం అందింది, స్పష్టమైన ఆదేశం — అతనిపై కేంద్రీకరించమని, తద్వారా అతన తన అంతరాత్మను గురించి సచేతనుడై శరీరాన్ని ఉత్తమ స్థితిలో వదిలివేయ గలుగుతాడని. ఇక నా ఏకాగ్రతను అద్భుతంగా పని చేయించాను. అతని అంతిమ దినాల్లో, సంపూర్ణ చేతన లేని స్థితిలో సైతం;... ఏకధాటిగా 'మా - మా- మా' అని జపించాడట.

నా ఏకాగ్రత క్రమంగా తీవ్రమయింది. మొన్న అది చాలా శక్తివంతంగా మారింది. నిన్న మధ్యాహ్నం 12.30 గంటలకు అది నన్ను అంతర్ముఖం గావించింది. అతను ఒక విధమైన నిద్రావస్థలో నా వద్దకు వచ్చాడు. అది స్పృహతో నున్న నిద్రావస్థ. నేను బిగ్గరగా 'ఓహ్, కే' అని కూడా అన్నాను.

ఆ స్థితి 15 నిమిషాలు కొనసాగింది. నేను పూర్తిగా అంతర్ముఖమై ఉన్నాను, అతనిని స్వీకరించే విధంగా.

The Mother Conversations with disciple May. 28, 1960

అనువాదం: సి.హెచ్ . హర్షవర్ధన్

"ఇహం" నుండి "పరం" లోనికి ప్రస్థానం

ఉన్నవారు, పోయినవారు:

మరణించడం విషాద భరితంగా మారిపోయింది. గత కొద్దిరోజులుగా నేను ఈ విషయం గమనిస్తూనే వున్నాను. ఒకటి రెండు రోజుల క్రితం ఒక రాత్రివేళ 'సూక్ష్మ భౌతిక' వాతావరణంలో నేను కొంతసేపు గడిపాను. ఆ వాతావరణంలో జీవించినవారు, మరణించినవారు అన్న తేడా లేకుండా కలసిమెలసి ఉండటం చూసాను. ఆ విభేదమే అక్కడ ఉన్నట్లు అనిపించలేదు. వీరు "జీవించియున్నారని వారు మరణించి యున్నారని " వేరు వేరుగా భావించలేము. అంతా కలసి మెల సే ఉన్నారు. కలసి భోజనం చేసారు. ఆడారు, పాడారు. అంతా స్పష్టంగా వెలుతు రులో జరిగినట్లే అనిపించింది. అక్కడ ఎంత ఆహ్లాదకరంగా వుందని! వారికి అదొక 'విరామం' లాగా తోచింది. 'మరణం' ఒక అచేతనావస్థగా వారు భావించారు అనిపించింది. కాని వారంతా సాధారణ చైతన్యం లోనే వున్నారు.

మరణించిన వారి యెడల జీవించియున్నవారి దృక్పథం

ఒకానొకప్పుడు 'మరణించాడు' అని నిర్థారించిన ఒక వ్యక్తిని (అతడొక రాజు) స్మశాన వాటికకకు తీసుకొని వచ్చారు. అంతట్లో జోరున వర్షం ప్రారంభం అయింది. ఇక దహనానికి అవకాశం ఎలా వుంటుంది! అందువలన ఆ 'మృతదేహాన్ని' అక్కడే వదిలిపెట్టి, మరునాడు దహన సంస్కారం జరిపిద్దామని నిర్ణయించుకొని వెళ్ళి పోయారు. మర్నాడు వారు మరల అక్కడకు వచ్చేసరికి ఆ 'శవం' మాయం అయింది. ఎటుపోయిందో (మందహాసంతో)!

అక్కడితో కథ పరిసమాప్తం కాలేదు. అలా దాదాపు 30 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ తరువాత అంతర్థానమైన ఆ శవం ఒక సన్యాసి వేషంలో తిరిగి వచ్చాడు. (అంతకు ముందు ఆయన ఒక మహారాజు). జరిగింది ఏమిటంటే శ్మశానంలో పడివున్న ఆయనను కొందరు సన్యాసులు వారితో తీసుకొనివెళ్ళారు. కొంతకాలం ఆయన ఏకాంత వాసంలో గడిపి చివరకు తాను కూడా సన్యాసిగా మారిపోయాడు. మళ్ళీ ఎందుకు తిరిగి వచ్చాడో ఆ దేవునికే ఎఱుక! తన ఆస్తుల

మీద ఆశ నశించక అన్ని ఆధారాలతో సహా తిరిగి వచ్చాడు. ముమ్మూర్తులా అదే వ్యక్తి.

ఇలాంటి కథలు లెక్కలేనన్ని విన్నాను. చనిపోయిన వారు తిరిగివస్తే, ఎవరు స్వాగతిస్తారు. పోయినవారు పోయినట్లే అని భావిస్తాము. కర్మకాండ ఎంత త్వరగా అయితే అంతమంచిది! ఇది మన భావన!

జీవిస్తున్న వారికి మరణించిన వ్యక్తిపై ఉన్న జుగుప్సాభావం అజ్ఞానం వలన జనించినదే. ఎలాగైనా "సాగనంపాల్సిందే," "భరించడం దుర్లభం" అనుకోవడం వల్లనో, "వదిలించుకోవాలి త్వరగా" అనే అంతర్గత ప్రేరణ వలననో కూడా ఇలాంటి ఆలోచనలు వస్తాయి.

ఇక్కడ నా పిల్లలు కొంతమంది ఉన్నారు. పిల్లలు అంటే చిన్నపిల్లలు కాదనుకోండి. కాని వారు వాళ్ళ తల్లి దండ్రుల పోషణలో ఉన్నారు. వారి తల్లి దండ్రులు కూడా అంత పెద్ద వారేమీ కాదు. కాని విచిత్రంగా వారు మరణించినట్లు వారి పిల్లలు కల గన్నారట! ఆ సందర్భంలో వారి తల్లిదండ్రులు నిజంగానే చనిపోయి వుంటారని భావించి ఇలా అన్నారట. "మీరు మరణించారట కదా! మీకిక్కడ ఏంపని? అనవ సరంగా మమ్మల్ని ఖంగారు పెట్టకండి" అని బలవంతంగా వెనక్కు పంపించేశారట.

ఇట్లా ఉన్నది ఉన్నట్లుగా చెప్పినవారు బహు కొద్దిమందే. కాని ఈ వార్త అంతటా ప్రాకిపోయింది.

అసలు నిజం బైట పడాలంటే అనేక విషయాలలో కొంత మార్పు రావాలి గదా!

(*శ్రీమాత ఒక శిష్యునితో జరిపిన సంభాషణ* 10-8-1963)

"దహనానికి" తొందరపడ వద్దు

ఒక్కొక్కసారి మరణించారని భావించి, ప్రాణంతో ఉన్నవారిని కూడా దహనం చేసిన సందర్భాలు వున్నాయి. కొంచెం నిదానించండి, తొందరపడవద్దు. శరీరానికి చైతన్యం అనేది ఒకటి ఉంటుంది. అది ఉన్నంతకాలం దానికి జీవం ఉన్నట్లే. ఇది జీవ కణాల్లోని అంతర్భాగమే. అది భౌతిక మరణం తర్వాతకూడా సుమారు వారం రోజులు అంతర్గతంగా ఉంటుంది. అందుకనే దహనం చేస్తున్నప్పుడు కొన్ని దేహాలు అటూ ఇటూ కదులుతూ వుంటాయి. ఇది కేవలం యాంత్రికమే అని కొందరు

విశ్వసిస్తారు. కాని నాకు తెలిసినంత వరకు అది యాదృచ్ఛికం కాదు.

భౌతికచేతన నుండి బయటకు రావటం నాకు తెలుసును గనుక ఇది నాకు అవగతం అవుతుంది. చాలా కాలం క్రింద నేను మీ అందరు అనుకొనే అపస్మారక స్థితి కి వెళ్ళాను. అప్పుడు కూడా నేను జీవించి ఉన్నట్లే అనిపించింది. కాని స్థితి మాత్రం అచేతనమే. ఆ పరిస్థితి లోనూ నేను మాట్లాడుతూనే వున్నాను. చలనం కూడా వుంది. ఈ స్థితి నాకు కల్పించినది. 'ధియాను మహాశయుడు' అని నాకు గుర్తు. ఆ స్థితిలో ప్రాణం శరీరంలో లేదు. అయినా చలనమూ, మాట మాత్రం ఉన్నాయి.

ఒకనాటి సాయంత్రం నా శరీరంలో నుండి నా ప్రాణం పూర్తిగా బయటకు వచ్చింది. దేహం చల్లబడింది. ఇది సహజమే. కాని నాకు మాత్రం శరీరంలోనికి బైట ఉన్న గాలి నుండి ఏదో శక్తిని గ్రహిస్తునట్లు అనిపించింది. ఆ శక్తి ఎందులో నుండి వస్తున్నదో నాకు వివరంగా తెలియదు. నేను మాత్రం మాట్లాడుతూనే వున్నాను. మాటకూడా స్పష్టంగా వుంది. కాని బైటనుండి నన్ను నేను చూచుకుంటున్నట్లు భావన కలిగింది.

ఈ అనుభవాలను బట్టి దహన సంస్కారాన్ని నేను సమర్థించలేక పోతున్నాను. కాని ఈ దేశంలో భయంకర రోగాల బారిన పడి చనిపోయిన వారి విషయంలోనూ, అనారోగ్యకరమైన పరిసరాలు ఉండటం వలననూ వెంటనే దహనం చేయాలనే ఆలోచ నలు రావటం సహజమే. ఇట్లాంటి భావాలు వేగంగా వ్యాప్తి చెంది దయ్యాలు, భూతాలు ఉన్నాయి అనే భయాలకు అవకాశం కల్పించాయి. ఇట్లాంటివి నలుగురిలో త్వరగా వ్యాప్తిస్తాయి. చనిపోయిన వారి విషయంలో ఇలాంటి భయాలు కలగటం సహజమే కదా! ఇట్లాంటి భావనలు వారి భయాందోళనలను దృఢపరుస్తాయి. ఈ విధమైన కార్యక్రమాలకు కారణం అవుతాయి.

ప్రపంచం అంతా కల్మష భూయిష్టంగా వుంది. ఐరోపా వాసులకన్నా భారతీ యులు ప్రతి దానికి అతిగా స్పందిస్తారు. వారికి భౌతిక దృష్టి కన్నా ఆంతరంగిక భావనే ముఖ్యం. సున్నితంగా ఆలోచించిన కొద్దీ వారికి అంతా అపసవ్యంగానే కని పిస్తుంది. బాగా భయపడిన వారిని ఆ భూతం బాగా పీడిస్తుంది.

అగ్ని ఇలాంటి శక్తులను బహిర్గతం చేస్తుందేమో! పరిస్థితిని మాత్రం భయానకం చేసింది.

(*శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణ, 28- 5- 1960*)

చనిపోయిన వారి ఎడల గౌరవంతో, శ్రద్ధతో మెలగండి

మరణాన్ని మానవుడు విషాద హేతువుగా మార్చేశాడు. ఇది నా అనుభవంతో చెప్తున్నాను. ఇప్పటి అనుభవం కూడా అట్లానే అనిపిస్తున్నది. తాము గౌరవించి, ప్రేమించే వ్యక్తులలో ఎందరు ఇలాంటి నిర్దాక్షిణ్యానికి గురి ఔతున్నారో కదా! "చనిపోయారు" అనే భావన వారిచే అలా చేయిస్తున్నది. "మరణించారు" అనేది ఎంత చెడ్డ భావన!

మరణించినవారు నశించారనా?

"మరణించారు" అనబడినవారు ఖననం లేక దహనం చేయబడతారు. కొందరు అపస్మారక స్థితి ఉండగానే శవపేటికలో ఉంచబడ్డారు. అట్టి పరిస్థితిలో వారి చేతన సంపూర్ణంగానే ఉండే అవకాశం కూడా వున్నది. కాకపోతే, అచేతనంగా వుండటం వలననూ, మాట్లాడలేని స్థితిలో ఉండటం వలననూ అందరూ "మరణించాడు" అని నిర్ధారించుకున్నారు. ఆ నిర్ణయం వెంటనే జరిగి వుండవచ్చు. వాళ్ళు సచేతనంగా ఉన్న స్థితి బయటవారికి ఎలా తెలుస్తుంది? ఎవరైనా కొంతసేపు అచేతనంగా ఉంటే మరణించారు అనుకోవటం సహజమే కదా!కాని చనిపోయినవారు చైతన్యంతో లేనట్లు భావించకూడదు. ఆయన తన చుట్టూ ఉన్నవారిని గమనిస్తూనే వుంటాడు. రోదనలను గ్రహించగలడు. కొద్దో, గొప్పో, అంతర్ దృష్టి ఉన్నవాడయితే వారిలో కొంతమంది కొంత సంతోషంగా ఉన్నారని కూడా గ్రహించగలడు. తాను శవపేటికలో ఉన్నానని కూడా ఆయనకు తెలుస్తుంది. మూత బిగించి మేకులు కొడుతున్న సంగతి కూడా తెలుస్తుంది. అంతా అయిపోయిందనీ, ఇక ఖననం చేయటమే తరు వాయి అని కూడా తెలుస్తుంది. లేదా తనకు దహనసంస్కారం చేస్తారనియైనా తెలుస్తుంది ఇంత జరిగినా అతనిలోని చైతన్యం అతని దేహాన్ని వెంటనే విడిచి వెళ్ళదు.

ఈ తతంగం ఈ మధ్య కూడా నా అనుభవం లోనికి వచ్చింది. నా కళ్ళతో

నేను ప్రత్యక్షంగా చూశాను. నిన్న రాత్రో, మొన్నరాత్రో నేను సూక్ష్మ భౌతిక ప్రపంచంలో గడిపాను. ఆ ప్రపంచంలో జీవించినవారు మరణించినవారు అనే భేదం లేదు; అంతా కలిసి, మెలసి ఉన్నారు. వారికి ఆ తేడా లేనే లేదు. ఒక మాటలో చెప్పాలంటే నేను శ్రీమతి ఎమ్. గారిని వారి భౌతిక దేహంలో సంవత్సరానికి ఒకసారో, రెండుసార్లో చూచేదాన్ని. ఆ తర్వాత అనేక సంవత్సరాలుగా ఆమె నా స్మృతిపథంలో లేదు. ఆమె మరణించిన తరువాత ఆమె నాకు సూక్ష్మ భౌతికంలో కనబడుతూనే వుంది. అదే విధంగా వుంది. (శ్రీమాత చేతులతో సంజ్ఞ చేస్తారు.) అది జీవంతో ఉన్న నాటి శరీరమే. ఏ మార్పూ లేదు. నాకు ఏ ఇబ్బంది కలుగలేదు. స్థూలభౌతికము, సూక్ష్మ భౌతికము రెండూ ఒకటిగానే వున్నాయి. కలిసి మెలసి సంచరిస్తున్నాయి. నవ్వుతూ, త్రుళ్ళుతూ ఉన్నాయి కూడా. ఆ వాతావరణంలో నిశ్చలమైన, ఆహ్లాద కరమైన వెలుగు. ఇంకా వివరంగా చెప్పలేను. మరి "చనిపోయాడు". ప్రాణం పోయింది. అంటారేమిటి? దేహం ఒక రొట్టెముక్క అనుకున్నారో! అది సచేతనము. అదే సమయంలో అచేతనము కాని మనం దానిని వస్తువును చూచినట్లు చూస్తున్నాము. ఇటువంటి ధోరణి వీలయినంత త్వరలో మారాలి. ఆ భావన జుగుప్సాకరం. మన ఆనందానికి అది అడ్డువస్తుంది. ఆ వ్యక్తి మరణం వలన అతిగా దుఃఖించే వారు కూడా ఆ వ్యక్తి చనిపోయిన తర్వాత అతని మృత దేహాన్ని సమీపించటానికి కూడా ఇష్టపడరు. వారికి అది అంత అయిష్టంగా వుంటుంది.
శ్రీమాత ఒక శిష్యునితో సంభాషణలు: 12-10-1962

చనిపోయిన వారికి సాయపడటం

ప్రాణిక మానవులకు ప్రాణిక ప్రపంచంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు తాము మరొక మార్గాన్ని అన్వేషించటంలో ఆశ్చర్యం ఏమి ఉంటుంది? నిజమే, అందుకే ఇతర దేశాలన్నింటిలో కనీసం ఏడు రోజులు సంతాప దినాలుగా జరుపుకుంటారు. అయినవాళ్ళు అక్కడ చేరి చనిపోయిన వ్యక్తితో తమకు గల మధుర స్మృతులను నెమరు వేసుకుంటారు. వారిలో దుఃఖం గాని, మానసిక వైక్లవ్యం గాని కనిపించదు. అట్లా పరిస్థితి సానుకూలంగా వుంటే పోయిన ప్రాణికి అది దివ్వెలా దారి చూపుతుంది. నేను భౌతిక శరీరం గురించి కాదు, ప్రాణిక దేహం గురించి మాట్లాడుతున్నాను. భౌతిక శరీరం ఎలాగు సెలవు తీసుకుంటుంది గద!

ఏం చేయాలో దిక్కుతోచని ప్రాణిక దేహానికి తన బంధువుల ప్రేమాభిమానాలు చీకటిలో దారి చూపించే దివ్వెలా నడిపిస్తాయి. ఆ పరిస్థితిలో ప్రాణి తన పూర్తి ఆకారంతో (స్వరూప స్వభావాలతో) వారి మధ్య సూక్ష్మరూపంలో ప్రశాంతంగా వుండగలడు. వారు తన పరిస్థితిని అర్థం చేసుకోగల ప్రేమాస్పదులే గదా!

ఇందు మూలంగానే ఉత్తర క్రియలు, కర్మకాండ ప్రయోజనవంతం అవుతాయి. అట్లా కాకుంటే దీనికి అర్థం ఉండదు. కాని ఈ తతంగం ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. మనలో మాట, కర్మ కాండ ఎక్కువైన కొద్ది అసలు విషయంనుండి మనసు దృష్టి మళ్ళు తుంది. ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి, అనేది మనసును ఎక్కువ ఆక్రమించుకుంటుంది. ఏ వ్యక్తిని గురించి ఈ కార్యక్రమం తలపెట్టామో అది రెండవ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.!

కార్యక్రమంలో భాగంగా చేసే శరీరపు కదలికలు, యాంత్రిక మంత్రోచ్ఛారణ, అసలు ఉద్దేశ్యాన్ని మరుగున పడేస్తాయి.

CWM 4: 204-205

'మరణం' గురించిన సంతాపం అంత మంచిది కాదు. మరణం అంటే ఒక దేశంనుండి మరొక దేశానికి పోయే ప్రయాణం వంటిది. నిద్రలో మనం చేస్తున్నది కూడా అదే.

భవబంధాలు ఉన్నంతవరకూ ప్రాణి తన శరీరాన్ని అంత తేలికగా విడిచి పెట్టలేడు. కాని ఎప్పటికైనా వీటిని దాటాలి గదా? "తరించటం" అంటే అదే కదా. అదే భౌతికాన్ని దాటటం!

అసలు విషయం ఏమిటంటే "మరణం" అంటే కేవలం భౌతిక దేహాన్ని వదలటం మాత్రమే. జీవిని వదలటం కాదు. వ్యక్తిత్వానికి మరణం లేదు. మరో దేశానికి వెళ్లిన వారు మరణించినట్లు కాదు గదా! దుస్తులు మారినందు వలన వ్యక్తి మారడు గదా!

CWSA 28: 529

జరిగిన దానిని దైవశాసనంగా భావించి సంయమనం పాటించాలి. ఆత్మయొక్క మహాప్రస్థానానికి మరణం రాజమార్గమని తెలుసుకోవాలి. సాధరణ మానవులకు ఇది అంత మంచి భావనగా కనిపించపోవచ్చును. వారు వారి ఎదుట కనిపిస్తున్న ఆకారమే నిజమైనదని అనుకుంటారు. ఆధ్యాత్మికతను అన్వేషించే వారికి మాత్రం "మరణం" ఒక జీవితం నుండి మరొక జీవితం లోనికి దారితీసే మార్గంలా

కనిపిస్తుంది. వారి దృష్టిలో వెళ్ళిపోయిన వారంతా నిష్క్రమించేవారే గాని, మరణించేవారు కాదు. మీరు ఆ దృష్టితో చూడండి. దైనందిన విధిని దుఃఖంతో గాక, దివ్యజీవనానికి మార్గంలా భావించి ఆ అన్వేషణలో ముందుకు సాగండి. జరుగుతున్న వాటిని ఎవరూ ఆపలేరు.

మరణం తరువాత జీవుడు ప్రాణిక ప్రపంచాన్ని దాటటానికి కొంత సమయం పడతుంది. ఆ ప్రపంపంచంలో అది కొన్ని రోజులు ఉంటుంది.ఈ ప్రస్థానం మొదట్లో కొంత ప్రమాద భరితంగాను, బాధాకరంగానూ ఉన్నా, తరువాత క్రమంగా ప్రాపంచిక వాసనలను , భౌతిక కోశానికి వుండే సహజమైన కోరికలను వదిలించుకొని ఆత్మ క్రమ క్రమంగా పైపైకి పోతుంది. ప్రాణిక కవచం క్రమేణా విడిపోయి తొలగిపోతుంది. తనను పట్టుకొని వదలకుండా వ్రేలాడుతున్న కోరికలను కూడా విడిచి ఆత్మ ఆధ్యాత్మిక ప్రపంచంలో విశ్రమించటానికి పయనిస్తుంది. మళ్ళీ భూవాతావరణంలో జన్మించే అవకాశం వచ్చేదాకా అది అక్కడే ఉంటుంది.

సద్భావంతోకాని అతీంద్రియజ్ఞానంతో కాని అట్టి ఆత్మలకు మనం ఉప శాంతిని చేకూర్చగలం. అతిగా రోదిస్తున్నా, పాత స్మృతులను నెమరు వేసుకొని బాధపడుతూ నేవున్నా, మరణించిన వారి జీవాత్మను తిరోగమనం పట్టించటమే అవుతుంది. భౌతిక కోశం నుండి బహిర్గతం అయిన ఆత్మకు పరమాత్మను చేరటమే అంతిమ లక్ష్యం. ఇది గ్రహించి మనం సంయమనం పాటించాలి. ప్రశాంతంగా ఉండాలి.

శ్రీఅరవిందులు

శ్రీమాత శిష్యునితో సంభాషణ

నీ భార్య ఆకస్మిక మరణానంతరం నీవు ఎంత తల్లడిల్లి పోయావో నాకు అర్థం అయింది. కాని, నీవు సత్యాన్ని అన్వేషించే సాధకుడవు. నీ మనసును సాధారణ మానవ సంబంధాలకు అతీతంగా ఉంచుకోవాలి. విశాల దృక్పథంతో నీవు వీటిని తిలకించాలి. నీ భార్య మరణాన్ని అంధకార బంధుర దైహిక ప్రపంచంనుండి తేజో పుంజమైన ఆధ్యాత్మిక ఔన్నత్యంవైపు పయనించే ఆత్మ స్వరూపంగా నీవు భావించాలి. ఇట్టి ఆత్మ ప్రయాణం సాధారణ మానవులకు “దురదృష్టంగా” గోచరి

స్తుంది. అకాల మృత్యువుగాని, ఏదైనా దుర్ఘటన వలన గాని మరణించిన సందర్భాల్లో, జీవితం అంతా దుఃఖమయం అయ్యే మాట యదార్థం. అట్టి మరణం దురదృష్టకరమే, కాని ఈ బహిర్గత ప్రపంచం చాటున ఉన్న అసలు నిజాన్ని గ్రహించ గల వారికి అంతా పరిణామ క్రమంలో భాగంగానే అనిపిస్తుంది. ఇదంతా చీకటిని చీల్చుకొని కాంతి వైపుగా వెళ్ళే ప్రయాణమే అనిపిస్తుంది. ఈ ప్రస్థానంలో మొదట ఒడుదుడుకులు, ప్రమాదాలు, ఉండటం సహజమే. ఇన్ని మలుపులను దాటితే గాని ఆత్మ వెలుగును చేరుకోలేదు. దైవనిర్ణయం ఎలా ఉన్నా అదంతా మన మంచికే. నీ భార్యయొక్క ఆత్మ రెండు స్థితులకు మధ్య ఉన్న అడ్డంకిని దాటి నిరవధికమైన దివ్యత్వం వైపుగా వెళ్ళే ప్రయత్నంలో ఉన్నదని భావించి, సంయమనంతో, ప్రశాంతతో, దైవ సహాయాన్ని హృదయపూర్వకముగా అర్థించు. ఎక్కువ కాలం విలపించటం వలన ఆమె ప్రయాణానికి కొంత అవరోధం ఏర్పడ వచ్చు. జరిగిన నష్టాన్ని తలచుకొని కుమిలి పోవద్దు. ఆమెకు కలగబోయే ఆధ్యాత్మిక శ్రేయస్సు గురించి మాత్రమే యోచించు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

మరణానంతరం ఏమి జరుగుతుంది

దేహమే నీ దుర్గం, నీ ఆశ్రయం

మానవజీవి భౌతిక దేహంలోనే హాయిగా, సురక్షితంగా నుంటాడు. దేహమే అతనికి రక్షణ. శరీరాలపట్ల తృణీకారభావం గలవారు కొందరుంటారు. మరణానంతరం శరీరాలు లేనపుడు పరిస్థితులు తేలిక అవుతాయని, మెరుగుపడతాయని వారనుకుంటారు. కాని వాస్తవానికి శరీరం నీ కోట, నీ ఆశ్రయం. నీవు అందులో వసించియున్నప్పుడు నీపై ప్రపంచమందున్న ప్రతికూల శక్తులకు ప్రత్యక్షంగా నీపై పట్టు సాధించటం కష్టతరమౌతుంది. భయానకమైన కలలంటే ఏమిటి? అవి ప్రాణిక క్షేత్రంలో నీవు దాడి సల్పటం వంటివి. భయానకమైన స్వాప్నిక స్థితిలో చిక్కుకొని వున్నప్పుడు నీవు మొట్టమొదట చేయ యత్నించేదేమిటి? వెంటనే నీ దైహిక స్థితిలోకి చేరటం.

నీ స్వాప్నిక భ్రాంతిని విదిల్చుకొని సహజసాధారణ భౌతిక చేతనలోకి చేరుకుంటావు. కానీ ప్రాణిక శక్తుల ప్రాబల్యం వున్న లోకంలో నీవొక అజ్ఞాత వ్యక్తివి. అది ఒక దిశా నిర్దేశం చేయబడని సముద్రం. ఆ సముద్రంలో దిక్సూచిగాని ,చుక్కానిగాని నీ వద్ద లేదు. ఎలా వెళ్ళాలో ఎటువెళ్ళాలో నీకు తెలియదు. అడుగడుగున చేయవలసిన దానిని పూర్తిగా వ్యతిరేకమైనది చేస్తావు. మొత్తానికి ఏదో ప్రదేశానికిచేరుతావు. అక్కడి జీవులు నిన్ను చుట్టుముట్టి నీవద్దనున్న దానిని చేతనైనంతగా కొల్లగొట్టి, వారికి ఒక ఆహారంగా, ఒక ఎరగా చేసుకుంటారు. నీలో నుండి ప్రకాశవంతమైన వెలుగు, శక్తి ప్రసరించకపోతే అక్కడ చలినుండి, శీతల వాతావరణం నుండి కాపాడగల కోటు లేనట్లుగా, ఆశ్రయమిచ్చే గృహం లేనట్లుగా, కనీసం నీ దేహాన్ని కప్పి వుంచే చర్మం కూడా లేనట్లుగా, నీలోని నరాలు సైతం రక్షణ కోల్పోయి బహిర్గతమై అశరీరుడిగా నీవక్కడ తిరుగాడుతావు. "ఈ శరీరంలో ఎంత అసౌఖ్యంగా నున్నాను," అనే వారున్నారు. వారు మరణాన్ని తప్పించుకోవాలని భావిస్తారు. కాని మరణా నంతరం కూడా నీకు అవే ప్రాణిక పరిసరాలుంటాయి. ఈ జీవితం దుఃఖభాజనం కావటానికి కారణమైన అవే శక్తులు వుంటాయి. నీ దేహం కరిగి మాయమవడంతో నీవు ప్రాణిక ప్రపంచపు బయలు ప్రదేశాలలోకి బలవంతంగా త్రోయబడతావు. అటుపైన నీకు రక్షణ అంటూ వుండదు. ఆశ్రయం పొందటానికి భౌతికదేహం ఉండదు.
CWM 3: 47

మృత్యు క్షేత్రం

ఒక వ్యక్తి శరీరత్యాగం చేసిన క్షణంలో, అతి భౌతికమైన ప్రాణిక క్షేత్రం లోని ఒక భాగం లోనికి త్రోయ బడతాడు. అదే మృత్యు క్షేత్రం. అతడి జీవితంలోని ఏ భాగమైతే సాధారణంగా అత్యంత చైతన్యవంతమై ఉంటుందో, అది అతడు మరణించే క్షణాన అక్కడ ఆవిష్కృత మవుతుంది. ఆ క్షేత్రం భౌతికమైన ప్రాణిక లోకం, కటిక చీకటిమయమై ఉంటుంది; కోరికలు హానికారకమగు సంకల్పాలకు కేంద్రం. ఇవి పాంచభౌతిక లక్షణాలు. ప్రకృతి పరిణామాలు ఏ విధంగా నైతే ఎడతెగకుండా నిరంతరం కొనసాగవో ఈ లక్షణాలు కూడా స్థిరంగా నిలువవు. అవి వస్తూ పోతూ వుంటాయి, మానవ జీవుల అవశేషాలను భుజించే క్షుద్ర జీవులలాంటివి. అందువలన మృత్యువు సంభవించిన క్షణాన, ఆ తాకిడికి అదరకుండా చనిపోయేవారు అతి

కొద్దిమంది మాత్రమే. వారు చేతనా స్థితిలోనే, పూర్తిగా మృత్యువును గురించిన ఎరుక కలిగి వెళ్ళిపోతారు. అటువంటివారు ఎక్కువగా నుండరు — సాధారణంగా అది ఒక ప్రమాదం, ఆఖరి ప్రమాదం. మరణమనే తాకిడి తగలగానే విరుద్ధ లక్షణాలు పైకి పోయే ప్రాణంపై ఆకస్మాత్తుగా దాడి సల్పి భక్షిస్తాయి. వ్యక్తి సజీవుడిగా నున్నంతకాలం అవి అతన్ని తాక లేవు. ఎందుకనగా మీకందరికి భయానక స్వప్నం యొక్క అనుభవం వుంది. దానిలో పరిస్థితి ప్రమాదభరిత మైనదనే అనుభూతి కలగగానే నీవు వెంటనే మేల్కొంటావు — నీవు నీ దేహం లోకి తిరిగి ప్రవేశిస్తావు. ఎందుకనగా దేహమే నీకు రక్షణ నిస్తుంది. దేహంతో నున్నప్పుడు అవి నీకే హాని చేయలేవు. కానీ నీవు పూర్తిగా దేహంనుండి బయట నున్నప్పుడు (నేను ఇదివరలో చెప్పినటువంటి ఈ బంధం కూడా నీవు దేహం బయట నున్నప్పుడు కొంత మేరకు రక్షణగా నుంటుంది.) కానీ ఈ బంధాలు తెగిపోయి నీవు ప్రత్యేక పరిస్థితులను లాభసాటిగా మలచుకుంటే తప్ప..... ఉదాహరణకు ఒక వ్యక్తి బాగా సజీవులైవున్న ఇతరులతో గాఢంగా ప్రేమించబడినప్పుడు — అనగా అతనిని ప్రేమించేవారు ఆ క్షణంలో వారి ధ్యాసను, ప్రేమను మరణించిన వ్యక్తిపై ఏకాగ్ర పరచినట్లయితే, ఆ వ్యక్తి అందులో ఆశ్రయం పొందుతాడు. ఇది అతనిని ఆ ప్రతికూల శక్తుల నుండి పూర్తిగా రక్షిస్తుంది. కానీ ఎవరైతే ఎవ్వరి యొక్క ప్రత్యేక ఆదరాభిమానాలను పొందలేరో — అతను హాని కలిగించిన వారు ఎవరైతే అతనిని ప్రేమించరో లేక పూర్తిగా స్మృతి తప్పినవారో అతని చుట్టూ ఉన్నట్లయితే — వారు ఈ ప్రతికూల శక్తులకు ఎరగా వేయ బడతారు. అది నిజంగా భరించ కష్టతరమైన అనుభవం.

అయితే ఇది సర్వ సాధారణంగా జరిగే పద్ధతి. ఇక ఇప్పుడు ఇక్కడి పరిస్థితులను అధిగమించటానికి మార్గాలుంటాయి, రక్షితమార్గాలు: అవి ప్రాణిక ప్రపంచంలో ఇట్టి ఆపదలనుండి గట్టెక్కడానికి ఏర్పాటు గావించబడినవి. దేహత్యాగం చేసిన వారిని స్వాగతించి, వారికి ఆశ్రయం, రక్షణ నిచ్చే వాతావరణంగల మండలా లున్నాయి. అన్ని రకాల ఇతర పరిస్థితులు నెలకొని వున్నాయి. నేనిప్పుడు చెప్పింది మరణించినవారి సహజమైన స్థితి, సాధారణ మానవ జీవులది. కానీ కొంత ఉన్నత స్థాయికి చెందిన మానవజాతి విషయంలో ఈ పరిస్థితులు వేరుగా నుంటాయి. జీవిలో ఒక ప్రత్యేకమైన, ఉన్నత స్తరానికి చెందిన అభ్యుదయ స్థితి ఏర్పడివుంటే

తప్పు సాధారణంగా జరిగే పద్దతే నిలిచి వుంటుంది.

CWM 6: 55-56

మరణానంతరం మన అస్తిత్వ స్థితి

మరణానంతరం మన అస్తిత్వ స్థితి ఎలాగుంటుంది అనేది చాలావరకు వ్యక్తి జీవించి వున్నప్పుడు అతని ప్రాణికం మార్పు చెందిందా లేదా అనే దానిపై ఆధారపడి వుంటుంది. ఒక వేళ నీవు కేవలం ఒక కలగాపులగంగా నున్న మానసిక ప్రేరణల మిశ్రమంగా నున్న వాడివైతే మరణించే సమయాన, ఎప్పుడైతే చైతన్యం పూర్వరంగం లోకి వెనక్కు మళ్ళుతుందో, నీలోని వేర్వేరు వ్యక్తిత్వ లక్షణాలు చెల్లా చెదరై వాటికి సరిపడ్డ పరిసరాలను వెతుక్కొనడానికి తొందర పడతాయి. వాటిలోని ఒక భాగం దానికి ఆకర్షితుడైన మరొక వ్యక్తిలోనికి ప్రవేశించ వచ్చు. మరొక భాగం ఒక జంతువులో సైతం ప్రవేశించ వచ్చు. ఏ భాగమైతే దైవ సన్నిధి ప్రభావానికి లోనై వుండిందో అది కేంద్ర చైత్య పురుష సత్తాతో జతగూడి వుండిపోతుంది. కానీ నీవు పరిణామక్రమంయొక్క గమ్యాన్ని చేరుకోవాలనే దృఢమైన నిశ్చయం కలవాడిగా పూర్తిగా సంస్కరించ బడిన ఏకైక ప్రత్యేక వ్యక్తిత్వం గలవాడిగా మార్పు చెందినట్లయితే, అప్పుడు మరణానంతరం కూడా చైతన్యం కలిగి వుండి దానిని అవిచ్ఛిన్నంగా కాపాడుకుంటావు....

మనుషులందరు వారి శరీరాలు క్షయమొందిన తరువాత వారి వ్యక్తిగత ప్రత్యేకతలను నిలుపుకొని వుంటారా అనే విషయం తెలుసుకోవాలని నీ కోరిక. మంచిది. అది ఇదమిద్ధంగా చెప్పలేము. సామాన్య జన సమూహాలకు చెందిన మనుషులు వారి దేహాలతో ఎంతగా సన్నిహితమైన ఐక్యత కలిగి వుంటారంటే, వారి భౌతిక శరీరం శిథిలం కాగానే వారిదైనదేదీ బ్రతికి యుండదు. అనగా ఏదీ సంపూర్ణంగా సజీవమై యుండదని కాదు. ప్రాణికము, మానసికము అయిన పదార్థం యెప్పటికీ నిలిచి వుంటుంది. కానీ అది భౌతికమైన వ్యక్తిత్వంతో సమ మైనదిగా నుండదు. ఏది జీవించి వుంటుందో అది బాహ్య వ్యక్తిత్వంయొక్క స్పష్టమైన ముద్ర కలిగి వుండదు. అందుకు కారణం బాహ్య వ్యక్తిత్వం ప్రేరణలు మరియు కోరికల కలగూరగంపలా నుండుటతో తృప్తి పడుతుంది. దైహిక కర్మలు ఒకదానితో నొకటి అనుబంధమై, సమన్వయం చెందడంతో ఏర్పడిన తాత్కాలిక శరీర అంగాల

ఐక్యత అది. ఈ కర్మలు ఎప్పుడు ఆగిపోతాయో, అప్పుడు ఈ మిథ్యా ఐక్యత సహజంగా అంతమొందుతుంది. వివిధ భాగాలపై ఒక మానసిక మైన క్రమశిక్షణ విధించబడి అవన్నీ ఒక సమిష్టి మానసిక లక్ష్యసాధనకు ఉపయుక్తం కాబడినప్పుడు మాత్రమే తన ప్రాపంచిక జీవిత జ్ఞాపకాలను నిలుపుకో గలుగుటతో చేతనా పూర్వకంగా, సజీవంగా కొనసాగే ఒక లాంటి యదార్థమైన వ్యక్తిత్వం కొనసాగ గలదు. కళాకారుడు, వేదాంతి లాంటి వ్యక్తులు ఎవరైతే వారి ప్రాణిక అస్తిత్వాన్ని వ్యవస్థీకరించి, ఒక ప్రత్యేకతను ఆపాదించి కొంతమేరకు మారేటట్లు చేయగలిగారో వారు జీవించి వుంటారనవచ్చు. ఎందుకనగా వారు వారి బాహ్య చేతనలోకి క్రమానుసారంగా అస్తిత్వాన్ని ప్రధానమైన దైవసంకల్పానికి అనుకూలమైన విధంగా తయారు చేయాలనే లక్ష్యం పెట్టుకొన్నవారు, మరియు స్వాభావికంగా అమరమైన చైత్యపురుష వాస్తవికతను కొంత ఛాయామాత్రంగానైనా తీసుకు రాగలిగిన వారు.

CWM 3: 144-46

మరణానంతరం ప్రాణిక అస్తిత్వం ఏమవుతుంది?

ప్ర: మరణానంతరం ప్రాణిక అస్తిత్వం ఏమవుతుంది?

స: అది కరిగిపోతుంది. వేరొక విధంగా జరగడం చాలా అరుదు. ఒకవేళ నీవు ప్రగాఢమైన మనో భావన కలిగి వున్నట్లయితే, తీవ్రమైన మానసిక ప్రేరణచే నీలో అభిప్రాయ బేధాలు ఏర్పడి వుంటే, ప్రాణిక అస్తిత్వం ముక్కలై పోయేది. ఆవిరిగా ఎగిసిపోయే బదులు, ద్రవంగా ఇంకిపోయే బదులు, చిన్న చిన్న ముక్కలుగా విడిపోయేది. ఈ ప్రాణిక పదార్థం యొక్క ప్రతి ఒక్క ముక్క దాని యొక్క ప్రధాన భావన, ప్రధాన కోరిక, ప్రధాన ప్రేరణ చుట్టూ కూడబెట్టబడి చిన్న చిన్న అస్తిత్వాలుగా ఏర్పడతాయి. వాటికి మానవాకారము ఉండదు, కానీ కొన్నిసార్లు ఒక అనిశ్చితమైన ఆకారం ధరిస్తాయి. కొన్ని మార్లు అంతకు ముందు అవి ఏ శరీరానికి చెంది వుండినవో దానిని బోలిన వాటిగా ఉంటాయి. ఇతర సమయాల్లో అవి ఏ కోరికకు ప్రతీకలుగానున్నాయో దానిని వ్యక్తపరచే ఆ కారాన్ని ధరిస్తాయి. సహజంగానే వాటి కోరికనో లేక మానసిక ప్రేరణనో తృప్తి పరచడం వాటి ఏకైక లక్ష్యమై వుంటుంది. వాటి స్వయం తృప్తిని సాధించ గలిగే మార్గాలకై ప్రతిచోటా అన్వేషిస్తాయి.

ఉదాహరణకు, ఒక లోభికి తన సంపదపై గల తీవ్ర కామనను తీసుకుందాం.

అతను మరణిస్తాడు. అతని ప్రాణిక అస్తిత్వం అంతరిస్తుంది. కానీ సంపదపై అతనికున్న తీవ్ర కామన సజీవమై నిలిచి వుంటుంది.అది తనంతట తాను తన చుట్టూ ఒక సజీవమైన, సచేతనమైన అస్తిత్వాన్ని ఏర్పరచుకొనడానికై అవసరమైన కొన్ని మూల పదార్థాలను సమకూర్చుకుంటుంది. ఈ వ్యక్తి తన జీవిత కాలంలో ఒక నిధినిక్షేపాన్ని ఎక్కడనైనా దాచివుంచి నట్లయితే ఆ అస్తిత్వం అచ్చటికి చేరి ఆ నిక్షేపమున్న స్థానంపైన తనను తాను నిలుపుకుంటుంది — దానిని రక్షించుకొనుటకు ఇతరులు దాని దరికి రాకుండా కాపాడుటకు అన్నట్లుగా.... చిన్నచిన్న అస్తిత్వాలు కూడా చాలా వున్నాయి. అవి పూర్తిగా ప్రతికూలమైనవి, దౌర్భాగ్యమైన లైంగిక వాంఛ నుండి అవి ఉత్పత్తి అవుతాయి. ఈ వాంఛ (దానికనుగుణంగా నున్న అస్తిత్వాలతో పాటు)మరణించే సమయాన అంతరించక పోయినట్లయితే. అది దాని ఉనికిని కొనసాగిస్తూ, సున్నిత మనస్సు లుండేటటువంటి వాతావరణంలో వారిని ప్రేరేపించటానికి ఉత్సాహపరచడానికి చేరుతాయి. సంభోగక్రియ జరుగుతున్న సమయంలో ఉత్పన్నమయ్యే ప్రాణిక శక్తిని స్వాహా చేస్తాయి. సాధ్యమైనంత పోషకాహారాన్ని రాబట్టుకోవడం సహజంగా వాటి కుండే ఏకైక లక్ష్యం. ఇటువంటి అనేక జీవుల వలయంలో చిక్కుబడిన వారిని నేను చూచాను. ఇది యదార్థమైన విషయం....
CWM 4:191- 92

ప్రత్యేక సందర్భాలు

ఒక వ్యక్తి తన జీవిత కాలమంతా యోగానుష్టానం చేసి, ప్రాణికాన్ని, మనస్సును చైత్యపురుష సత్తా చుట్టూ ప్రత్యేకంగా కేంద్రీకరించుటకు శ్రద్ధ వహించితే మాత్రమే నిలువగలుగుతాడు. ఇది లక్ష సందర్భాలలో ఒకసారి జరుగుతుంది, ఒక అసాధారణ సంఘటనలా. తన మేధాశక్తితో గణనీయంగా శ్రమించి, తన మెదడును వ్యవస్థీకరించుటకు ప్రయత్నం చేసిన ఒక వేదాంతి లేక ఒక రచయిత విషయం తీసుకుందాం. అట్టి వారి విషయంలో అది నిలిచి వుంటుంది, కానీ కేవలం ఒక ఆలోచించగల సమర్థతగా తప్ప మరింకే విధంగానూ కాదు. మరణించిన తరువాత కొనసాగే ఆలోచనా శక్తులు ఉన్నాయి. సహజంగా అవి ప్రకటిత మవడానికి వేరొక శరీరం యొక్క మెదడును వెతుక్కొనే ప్రయత్నం చేస్తాయి. ఈ విధంగా ఒక గొప్ప ఆలోచనాపరుడి మెదడు తనంతట తాను వేరొక మెదడుతో ఏకమై తనను తాను వ్యక్తపరచుకోవచ్చు.

జీవితమంతా తన బాహ్య అస్తిత్వాన్ని సంగీతానికై మంచి ఉపకరణంగా వాడిన ఒక గొప్ప సంగీత విద్వాంసుడి సంగతిని ప్రాణికపరమైన దృష్టితో పరిశీలిద్దాం. అతడు తన శరీరంలోని ఈ ప్రాణికశక్తిని సంగీతం ఆలపించడానికి అనువుగా మలచుకున్నాడు. సరే, అప్పుడు ఉదాహరణకు అతని చేతులు సంగీతవాయిద్యంపై వాయించడానికి ఎంత ప్రత్యేక నైపుణ్యతను అలవరచుకొన్నాయంటే, మరణానంతరం సైతం అవి ఆ విధంగానే, అదే నేర్పుతో, గత స్థాయికి సమానమగు రీతిలో, సూక్ష్మరూపంలో కొనసాగ గలవు. ప్రాణిక ప్రపంచంలో చలామణి అవుతూ, సమానమైన నైపుణ్యతలు గల వ్యక్తులచే ఆకర్షింపబడి వారితో ఏకమవడానికి ప్రయత్నిస్తాయి. తగినంత ఇంద్రియ జ్ఞానం, గ్రహణశక్తిగల వ్యక్తి ఈ చేతనలతో ఏకం కాగలిగి అద్భుతమైన పనులను నెరవేర్చగలడు, ఈ చేతులకున్న గత జీవిత ప్రత్యేక నైపుణ్యతలతో రాణించగలడు.

CWM 4:195- 96

ప్రతిభాగం దానిదైన లోకంలోకి చెదిరిపోతుంది

నీవు కోరికలతో, ఉద్రేకాలతో, ప్రేరణలతో నిండిన జీవితం గడుపుతున్నావనుకుందాం. నీవు గడుపుతున్న జీవితంలో నీ ప్రాణిక సత్తా ప్రబలమై వున్నదన్నమాట. కానీ నీవు ఒక ఆధ్యాత్మిక స్ఫూర్తి కలిగి, గొప్ప సత్సంకల్పంతో పనులను మంచిగా మరియు నిస్వార్థతతో నిర్వహించాలనే కోరిక కలిగి, అభివృద్ధి చెందాలనే సంకల్పంతో, జీవితం గడిపితే, నీలో చైత్యపురుష సత్తా ప్రబలమై వున్నదనవచ్చు. అట్టి స్థితిలో నీవు నీ శరీరం నుండి వెడలిపోయే సమయ మాసన్న మైనప్పుడు, ఈ సత్తాలన్నీ చెదిరిపోవడం మొదలవుతుంది. నీవు చాలా అభ్యున్నతి బడసిన యోగివై, నీ అస్తిత్వాన్ని దైవిక కేంద్రంతో ఏకంగావించి దాని చుట్టూ కేంద్రీకరించగలిగినప్పుడు మాత్రమే ఈ అస్తిత్వాలు కలసికట్టుగా నిలుస్తాయి. నిన్ను నీవు ఏ విధంగా ఏకీకృతం గావించుకోవాలో తెలియకపోతే, మరణించే సమయంలో అదంతా చెదిరిపోతుంది. ప్రతి ఒక్కటి దాని క్షేత్రానికి తిరిగి వెళ్ళిపోతుంది. ఉదాహరణకు, ప్రాణికసత్తాకు సంబంధించినంత వరకు నీకున్న కోరికలన్నీ పరస్పరం వేరుపడి ఒక్కొక్కటి స్వతంత్రంగా తాను సాధించుకో దలచిన దాని సాఫల్యతకోసం దాని స్వంత క్షేత్రం దిశగా పరుగులు తీస్తాయి. ఎందుకనగా వాటిని కలిసికట్టుగా నుంచడానికి భౌతిక

సత్తా ఇకపై ఉండదు గనుక. కానీ నీవు నీ చేతనను చైత్యపురుష చేతనతో ఏకం గావించి ఉన్నట్లయితే, నీవు మరణించినప్పుడు నీవు నీ చైత్యపురుష సత్తా యొక్క ఎరుక కలిగి వుంటావు. ఇక ఈ చైత్యపురుషసత్తా దాని ప్రపంచం ఏదైతే దివ్యానుగ్రహము, దివ్యానందము, శాంతియుతము, అలజడిలేనిది, వృద్ధి చెందు జ్ఞానదీప్తమైనదో, దానికి తిరిగి చేరుతుంది. కాబట్టి, దానిని నీవు స్వర్గమని పిలువదలిస్తే, మంచిదే. ఎందుకనగా నిజంగా నీవు నీ చైత్యపురుష సత్తాతో తాదాత్మ్యం చెందినంత మేరకు దాని ఎరుక కలిగి వుంటావు, దానితో ఏకమై వుంటావు. అది అమరమైనది. అమరమైన దాని క్షేత్రానికి సంపూర్ణమైన ఆనందమయ జీవితాన్ని లేక విశ్రాంతిని అనుభవించడానికి వెళ్ళిపోతుంది. నీవు దానిని స్వర్గమని పిలువ దలిస్తే, స్వర్గమని పిలువు. నీవు మంచిగా నుంటే, నీవు నీ మానసిక చేతన గురించిన ఎరుకను కలిగి, దానిలో జీవించ గలిగితే, మంచిదే. ఎందుకనగా నీ శరీరం మృత్యువాత పడగానే నీవు నీ చైత్యపురుష సత్తాతో కూడి ఒక పరమానందమయ స్థితిలో విశ్రాంతి నొందడానికి చైత్యపురుష లోకానికి చేరుతావు. కానీ నీవు నీ ప్రాణిక చేతనలో, దాని ప్రేరణలతో ప్రభావితుడవై జీవించి వుంటే గనక, ప్రతి ఒక్క ప్రేరణ తనంతటతాను ఎక్కడో ఒక చోట సాఫల్యతను పొందటానికి ప్రయత్నిస్తుంది.... ఆకృతికి ఒక ఆత్మశక్తి వుంటుంది: అలాగే నీ ఆకృతికి కూడా ఒక ఆత్మశక్తి వున్నది. మరణించిన తదుపరి ఏడు దినములవరకు అది కొనసాగుతుంది. వైద్యులు నీవు చనిపోయావని ప్రకటిస్తారు, కానీ నీ ఆకృతి యొక్క ఆత్మశక్తి జీవించివుంటుంది. జీవించి యుండటమే కాక అనేక సందర్భాలలో చేతన కలిగి వుంటుంది కూడా. కానీ అది ఏడు లేక ఎనిమిది రోజుల పర్యంతం నిలిచి వుంటుంది. అటుపిమ్మట అంతరిస్తుంది. నేను యోగుల విషయం ప్రస్తావించడం లేదు; సామాన్య మానవుల గురించి చెపుతున్నాను. యోగుల విషయంలో ఈ నియమాలు వర్తించవు. అది పూర్తిగా వేరే విధంగా వుంటుంది. వారి ప్రపంచం వేరుగా ఉంటుంది. నేను నీతో ప్రస్తావిస్తున్నది సాధారణ జీవనం గడుపుతున్న సామాన్య మానవుల గురించి. వీరి విషయంలో అది ఆ మాదిరిగా నుంటుంది.

మాంత్రికుల మరియు ఐంద్రజాలికుల మరణానంతర స్థితి

మధురమాతా, అతీంద్రియ శక్తులను వారి కార్యార్థం వినియోగించే మాంత్రికులు

వారి మరణానంతరం చాలా బాధలు పడతారని విన్నాను. అది నిజమేనా?

మరణానంతరం వారు బాధపడతారో లేక వారి చైతన్యం కోల్పోతారో నాకు తెలియదు. ఏమైనప్పటికీ వారు ప్రశాంతంగా లేక సుఖంగా ఉండ లేరనేది మాత్రం వాస్తవం. ఎందుకనగా ఆధ్యాత్మిక దృష్టిలో అట్టి స్థితి వారికి తప్పదు. అతీంద్రియ శక్తులు లభ్యమయ్యేది అంతరంగంగా క్రమశిక్షణ పాటించడం తోను, సర్వం దైవార్పణం గావించడం తోను. అయితే నీ అభిలాష. నీ క్రమశిక్షణ, నీ దైవార్పణతో ఒక ప్రగాఢమైన కోరిక జత గూడితే, అనగా శక్తులు సమకూరాలనే ఉద్దేశం తోడయితే, శక్తులు సమకూరినప్పటికీ అది దాదాపుగా ఒక శాపంలా పరిణమిస్తుంది. సాధారణంగా అవి నీకు లభ్యం కావు, కానీ వాటిని బోలిన దేదో ఒక ప్రాణిక పరమైనది నీకు లభ్యమవుతుంది. అది నీపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. దానితో నిన్ను వాడుకోవాలనే ఉద్దేశంతో నీకు శక్తులను సమకూర్చిన వాటి ఆధిపత్యానికి లోనవుతావు. అవి చేయగోరిన పనులను చేయడానికి అవి సృష్టించ దలచిన అరాచకాన్ని నీతో చేయించడానికి, నిన్ను వాడుకుంటాయి. వాటికవసరమైన మేరకు నీవు ఉపయోగపడ్డావని, ఇకపై నీతో పనిలేదని తెలియగానే, మరో తలంపు లేకుండా, నిన్ను కూలుస్తాయి. బహుశా నిన్ను శారీరకంగా కూల్చలేవు. ఎందుకనగా ఎల్లవేళలా అలా చేయగల శక్తి వాటికి ఉండదు. కానీ నిన్ను మానసికంగా, ప్రాణికంగా మరియు నీలో చైతన్యాన్ని నాశనం చేస్తాయి. అటు తరువాత నీవు ఎందుకు పనికి రాని వాడవవుతావు మరణోన్ముఖుడవు అగునంతవరకు. మరణానంతరం నీవు పూర్తిగా వాటి ప్రభావంలో నున్నందువలన మొట్టమొదట అవి నిన్ను కబళించి వేస్తాయి, ఎందుకనగా అవి మనుషులను వాడుకొనే విధానం ఆ విధంగా నుంటుంది గనుక, వారిని స్వాహా చేయడం. కాబట్టి అది అంతగా ఆనందం గొలిపే అనుభవం కానేరదు. అది చాలా చాలా అత్యంత ప్రమాదకరమైన ఆట.

కానీ, అంతటా, అన్ని ప్రబోధాలలో, అన్ని శిక్షణలలో, అన్ని కాలాలలో అదే విషయం పునరావృతం కాబడింది. వ్యక్తి ఎప్పటికీ, అత్యాశను, స్వార్థ ప్రయోజనాన్ని సాధనతో ముడి వేయకూడదు, లేకపోతే అతను కష్టాలను కొని తెచ్చుకున్నట్టే. ఆ విధంగా ఇది కేవలం ప్రత్యేకమైన సందర్భం మాత్రమే కాదు. ఈ విధమైన సందర్భా లన్నింటిలో ప్రాణాంతకమైన పర్యవసానాలు కలుగుతాయి.

CWM 7:260-261

స్వర్గం - నరకం

స్వర్గం నరకం రెండూ ఒకేసారి వాస్తవము, అవాస్తవము అనవచ్చు. రెండింటికీ ఉనికి వున్నది, లేదు. మానవ ఆలోచనా విధానం సృజనాత్మకమైనది. అది మానసిక, ప్రాణిక, సూక్ష్మభౌతిక పదార్థానికి శాశ్వతమైన రూపకల్పన గావిస్తుంది. ఈ రూపాలు కల్పితాలే గాని వాస్తవాలు కావు. కానీ, వాటికి ఊహాకల్పన చేసినవారికి, అంతకు మించి వాటిపై నమ్మకమున్నవారికి అవి వాస్తవమనే భ్రాంతిని కలిగించగలవు అదే విధంగా ఏ మతాలైతే ఒక నరకం, ఒక స్వర్గం లేక అనేక దేవతాలోకాలున్నాయని గట్టిగా నమ్ముతాయో, వాటిపై విశ్వాసమున్నవారికి వాటి ఉనికి వుంటుంది. వారు మరణానంతరం ఆ క్షేత్రాలకు ఎంతో కొంత కాలం గడుపటానికి వెళ్ళగలరు. అయినప్పటికీ ఇవన్నీ అశాశ్వతమైన మనోరూప కల్పనలు. వాటికి వాస్తవికత లేదు. కొందరు మరణిం చిన తరువాత ఏ స్వర్గాలకు లేక నరకాలకు పోయారో, వాటిని నేను చూశాను. అవి వాస్తవం కావు అని వారికి నచ్చచెప్పడం చాలా కష్టం. నరకమని పిలువబడేది వాస్తవానికి నరకం కాదని ఒకరిని ఒప్పించడానికి నాకు సంవత్సరం పైన బట్టింది — ఆ భావన నుండి అతనిని బయట పడేయటానికి .....

ఏ విధంగానైతే ఒక దివ్యానందమయ స్వర్గధామాన్ని దైవంతో పాటు పంచుకున్న భావనను నీలో నిలుపుకోగలవో, నీ స్వభావం లోని ఆసురిక వైఖరులను అదుపులో నుంచుకొనుటకు తగు శ్రద్ధ కనబరచక పోయినప్పుడు దిక్కుమాలిన, దౌర్భాగ్యమైన నరకాన్ని నీలో నిలుపుకో గలవు.

CWM 10: 64-65

స్వర్గలోకం, పాప ప్రక్షాళణ లోకం

ప్ర: (ఒక బాలుడు) మరణించిన తరువాత మనుషులు ప్రాణిక ప్రపంచంలోకి ప్రవేశిస్తారు, కానీ మంచి చేసినవారు స్వర్గానికి పోతారా?

స: విశ్వాసం గల వారికి మంచి పనులు చేయడానికి ప్రోత్సాహకంగా మతాచార్యులు సాధారణంగా చెప్పే విషయమిది. ఎందుకనగా, దుర్మార్గులకన్నా మంచివారికి జీవితం గడపడం దుర్భరం, అంత సులభంకాదు, అనేది అందరికీ బాగా తెలిసిన విషయం. మామూలుగానైతే ఇందుకు విరుద్ధంగా నుండాలి. అయితే, మంచివారి

కన్నా, దుర్మార్గులే ఎక్కువగా గెలుస్తుంటారు! కాబట్టి అంతగా ఆధ్యాత్మికతను పాటించనివారు, స్వగతంగా ఇలా అనుకుంటారు: "మంచిగా నుండటానికి ఎందుకు కష్టపడాలి? దుర్మార్గంగా నుంటూ సుఖమైన జీవితం గడపటం సులభం కదా!" మంచి అనేక రకాలుగా నుంటుందని, బహుశా మంచి చేయడానికి ప్రయత్నించితే, కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందేమోనని వారికి నచ్చచెప్పటం చాలా కష్టం. అంతగా తెలివిలేని వారికి ఈ విషయం స్పష్టం చేయడానికి ఈ విధంగా చెప్పవలసి వస్తుంది. "ఇది చాలా సులభం. నేను చెప్పినట్లు వింటే, మంచిగా, నిస్వార్థంగా నుండగలిగితే, ఎల్లప్పుడూ మంచి పనులు చేస్తుంటే, మేము చెప్పే సిద్ధాంతాలపై నమ్మకముంచితే, నీవు చనిపోయినప్పుడు దైవం నిన్ను స్వర్గానికి పంపుతాడు. ఒకవేళ కొన్నిసార్లు శుభసంకల్పం, కొన్ని సార్లు దుస్సంకల్పం కలిగి వుంటూ, కొన్నిసార్లు మంచిచేస్తూ, కొన్నిసార్లు చేయకుండానుంటూ, నీ గురించి నీవు గొప్ప గాను, ఇతరుల గురించి తక్కువగాను తలుస్తుంటే, చనిపోయిన తరువాత పాప ప్రక్షాళన లోకానికి పంపబడతావు. నీవు దుర్మార్గంగా ఉంటూ, ఎల్లవేళలా ఇతరులకు హాని కలిగిస్తూ, అన్ని రకాల చెడు కార్యాలను చేస్తూ, ఎవరి మంచినీ పట్టించుకోకుండా, ముఖ్యంగా మేము బోధించే సూత్రాలను నమ్మకపోతే, అప్పుడు నీవు నేరుగా, శాశ్వతంగా, నరకానికి పోతావు."

ఇది నేను విన్నవాటిలోకంతా అత్యంత శ్రేష్టమైన బోధ: నరకమనే దానిని కల్పించి చెప్పడం, ఆవిధంగా చెప్పటంలో అర్థం — ఒక్కసారి నీవు నరకంలోకి ప్రవేశిస్తే ఇక శాశ్వతంగా అక్కడే వుండిపోతావు అని.........

CWM 8: 217-18

అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

ఎందుకంటే, అది నీ కాలాతీత ఆత్మ. జన్మపరంపరలో, ఒక జన్మలో చైతన్యాన్ని తరువాత జన్మకు మోసుకుపోయే దిదే.

అది నీలోని సత్యమైన, దివ్యమైన వ్యక్తి. ఆతని నిజమైన వ్యక్తిత్వము చైత్యపురుష సత్తా. నీ వ్యక్తిత్వము అంటే నిన్ను నీవు ప్రకటించుకునే ఒక ప్రత్యేక పద్ధతి. ఇక నీ చైత్య పురుష సత్త అంటే, నీలో రూపు దిద్దుకున్న దివ్యచైతన్యం యొక్క ఒక ప్రత్యేక అంశ. కానీ చైత్యపురుష చైతన్యంలో, వ్యక్తి చైతన్యానికి, విశ్వచైతన్యానికి మధ్య విభజన భావముండదు. ఇది నీ నైజంలోని ఇతర భాగాలను ప్రభావితం చేస్తుంది. నీకు ఎరుక ఉంటుంది, నీ వ్యక్తిత్వం అంటే నిన్ను నీవు ప్రకటించుకునే ఒక ప్రత్యేక విధానమని. కాని అదే సమయంలో అది వ్యక్తీకరింపబడిన ఒకే విశ్వచైతన్యం యొక్క ప్రకటన అని కూడా నీకు తెలుసు. ఇది ఎలా ఉంటుందంటే, నీలోని ఒక భాగాన్ని తీసుకొని నీ ముందుంచుకుని రెండిటిని వేర్వేరుగా చూస్తూ, నీవు వాటితో ఆడుతూ వినోదించడంలా ఉంటుంది. ఈ ద్వైతము అవసరం, ఈ రెండింటి మధ్య ఒక సంబంధం ఏర్పరచి వినోదించడానికి. కాని చైత్యపురుష సత్తాలో ఈ ద్వైతము వేరు భావము, ఒక మిధ్య, ఒక ఎండమావి మాత్రమే. అంతకుమించి ఏమీ కాదు.

CWM 3: 63

కేంద్ర సత్తా, చైత్యపురుష సత్తా

ఈ రెండూ ఒక్కటే అని చెప్పాము. కాని దైవంతో ఉంటూ ఉండేది, దైవంగా పిలవబడే భాగం అలాగే నిలబడుతుంది. దైవంలోనే ఉంటుంది. భూమిపై జీవితంలో ఈ దైవం యొక్క ప్రతినిధి ఉండే భాగాన్ని చైత్యపురుషసత్తా అంటారు. ఇది జీవితంలో అనుభవాలను ప్రోగు చేసుకుంటూ ఎదుగుతూ ఉంటుంది. జన్మపరంపరలో ఇది ఏకాంతంగా అనుభవాలు పొందుతూ వాటిని తనలో ఇముడ్చుకుంటూ నెమరు వేసుకుంటూ ఎదుగుతూ ఉంటుంది. ఇది పురోగామి.

దీనికి భిన్నంగా జీవాత్మ (దైవభాగం) దైవంతో ఐక్యమయి స్థిరంగా ఉంటుంది. ఇది పురోగామికాదు. దీనికి శరీరం ఉన్నా లేకపోయినా ఒకటే.

ప్రశ్న: మధురమాతా, అయితే అందరి కేంద్రసత్తా ఒకటేనా?

కాదు. కానీ అది బహుళత్వంలో గుర్తింపబడుతుంది. ప్రతి సత్తా యొక్క సత్యం వ్యక్తిగతం. అది దైవంగా గుర్తింప బడుతుంది. ఇది ఐక్యతే గాని సమానత్వం కాదు. ఒక దృష్టిలో అన్నీ ఒకటే — వేరొక దృష్టిలో అవి బహుళము.

CWM 7:223, 224

పూర్తిగా అభివృద్ధి చెందిన చైత్యపురుష సత్తా యొక్క ప్రస్థానం.

ఒక మంచి ఉదాహరణ తీసుకుందాం. తనలోని దైవం యొక్క ఉనికి చుట్టూ సంపూర్ణంగా ఏకీకృతం కాబడ్డ సత్తా గలవాడు, అంటే ఒకే ఇచ్ఛ, ఒకే చైతన్యం గల వ్యక్తి కేంద్ర చైత్యపురుష సత్తా చుట్టూ పూర్తిగా అభివృద్ధి చెంది వ్యవస్థీకృతం కాబట్టి బుద్ధిని సంపూర్ణంగా ఆత్మార్పణ గావించుకుని, సహకరించే ప్రాణికం ఒక విధేయత, అణుకువ — ఎలా పడితే అలా సర్దుకుపోయే భౌతిక సత్తా గలవాడు.

ఇట్టి భౌతిక సత్తా పూర్తిగా అభివృద్ధి చెందడం వల్ల దానికి ఒక సూక్ష్మ భౌతిక శరీరం ఉంటుంది. దీనినే శ్రీఅరవిందులు నిజభౌతికం అన్నారు. ఇది భౌతిక శరీర పరిమితు లన్నింటిని అధిగమిస్తుంది. దీనికి తగినంత మెత్తదనం, మలచుకోగల స్వభావం, నిలకడ, ఉండడంవల్ల, అది సత్తా లోపలి భాగాలకు అంటిపెట్టుకుంటుంది. అది అంతరాత్మ కదలికలను అనుసరించి శరీరం బయటకు ప్రయాణించ గలదు.

ఆత్మ ఏం చేస్తుంది. ఎక్కడకు వెళ్తుంది, అనే విషయం అది శరీరం విడిచే ముందు తీసుకునే నిర్ణయంపై ఆధారపడ్తుంది. ఇలా ఎంపిక చేసుకునే శక్తి, తను ఎక్కడకు వెళ్ళాలో నిర్ణయించుకునే శక్తి సత్తా తన భౌతిక జీవితంలో తనను తాను సంపూర్ణంగా ఏకీకృతం చేసుకొని వ్యవస్థీకృతం చేసుపోవడం వల్ల కలుగుతుంది. ఈ శక్తి వేరే తరహా సంభావ్యతలకు వీలు కలిగిస్తుంది. ఎరుకతో ఒక శరీరం నుండి మరొక శరీరంలోకి నేరుగా వెళ్ళగలదు. తాను తన భౌతిక జీవితంలో చేసే పనిని కొనసాగించేందుకు తనకు తగిన వేరొక సత్తాను నెమ్మదిగా తయారుచేసుకొని తన పాతశరీరాన్ని విడిచి తన పూర్తి ఎరుకతో అందులో ప్రవేశించగలదు. కాని ఇది చాలా అరుదుగా జరిగే విషయం. అయితే ఆ విధంగా జరగడమనేది సాంప్రదాయక మార్మిక విద్యలో భాగం. సాధారణంగా ఆత్మ తన శరీరంలో పొందవల్సిన అనుభవాలు పూర్తి అయ్యాక వాటిని తనలో ఇముడ్చుకొని, నెమరు వేసుకొని, తరువాత తన భౌతిక అస్తిత్వము కొరకు తయారవుతుంది. ఇక్కడ అనేక సంభావ్య

తలకు అవకాశం ఉంది. వానిలో ఒకటి అది కొన్ని పరిధులలో సత్తాలను తన సూక్ష్మ శరీరంలో విడ్చిపెడ్తుంది. తన ప్రాణిక పరిధి లో ప్రాణిక సత్తాను బుద్ధి పరిధిలో బుద్ది సత్తాను తన సూక్ష్మ శరీరంలో విచిచి పెడ్తుంది. వీటికి స్వయం ప్రతిపత్తి ఉన్నా ఆత్మ తోకూడ ఒక సంబంధం కలిగి ఉంటాయి. ఈ సత్తా చైత్యప్రపంచంలో ప్రవేశించి, ఈ పేపరులో వివరించినట్లు తన అనుభవాలను నెమరు వేసుకుంటూ, విశ్రాంతి, ఆనందాన్ని పొందుతూ, కొత్త అనుభవాలు పొందటానికి సిద్ధమవుతూ ఉంటుంది. ఈ సత్తాలు ఇలా తమ అనుభవ సంపదతో తమ వివిద భాగాలను ఒక దాని తరువాత వేరొకటిని వేరొక కొత్త శరీరంలో ప్రవేశింపచేయడానికి సిద్ధ పరుస్తుంటాయి.

CWM 8: 333-338

దయ్యము ఆత్మ కాదు.

దయ్యం అంటే ఏమిటి? సామాన్యంగా వాడే పదం దయ్యం — అనేక ప్రత్యేక విషయాలను సూచిస్తుంది. వీటి మధ్య పరస్పర సంబంధం ఉండవలసిన అవసరం లేదు. వీటిలో కొన్ని, ఉదాహరణకు:

1. వెళ్ళిపోయిన వ్యక్తి ఆత్మలో వాస్తవ స్పర్శ, సూక్ష్మ శరీరంలో ఉన్న ఆత్మతో వాస్తవ సంబంధం: ఇది ఒక ఛాయాచిత్రంగా కనపడవచ్చు, లేదా దాని గొంతు వినిపించవచ్చు.

2. ఒక రూపు దాల్చిన మానసిక కల్పన: గతించిన వ్యక్తి ఆలోచనలు, అనుభూతుల ముద్రబడిన కల్పిత రూపం. ఒక ప్రదేశ వాతావరణంలో తిరిగే రూపం, మళ్ళీమళ్ళీ కన్పడే రూపం, తనంత తానుగా కరిగే లేక ఏదైనా సాధనతో కరిగింపబడే రూపం. ఒక హత్యకు ముందు లేక తరువాత దయ్యాల కొంపలలో కనపడే దృశ్యాలకు ఇది ఒక వివరణ.

3. ఒక దిగువ ప్రాణిక తలాలకు చెందిన సత్తా: చనిపోయిన వ్యక్తి వదలిన సూక్ష్మదేహంలో ప్రవేశించిన సత్తా, చనిపోయిన వ్యక్తి జ్ఞాపకాలు, లేక ప్రాణికవ్యక్తిత్వ భాగముతో కూడిన రూపంతో ఆ వ్యక్తి ఆలోచనలతో, జ్ఞాపకాలతో పని చేసేది.

4. దిగువ ప్రాణిక తలాలకు చెందిన సత్తా :కొంతమంది జీవించివున్న వ్యక్తులలో పూని మాట్లాడుట, భౌతికంగా కనిపించి మాట్లాడటం లేక అలా వ్యక్తులలో ప్రవేశించకుండా

వస్తువులను కదుపుట, సృష్టించుట, భూతాలుగా చెట్లలో నివసించుట. రాళ్ళు విసరుట.

5. స్వీయ మానసిక కల్పనలు - రూపాలు

6. ప్రాణిక సత్తాలు తాత్కాలికంగా మనుష్యులను పట్టుకొనుట

చనిపోయిన వారి బంధువులవలె నటించుట

7. చనిపోయేవారు చనిపోయేముందు వారి వ్యక్తిగత ఆలోచనల రూపు చనిపోయే సమయంలో గాని, తరువాత గాని వారి బంధువులకు, లేదా స్నేహితులకు కనబడుట. కేవలం మొదటి సందర్భంలో మాత్రమే ఆత్మ నిరాటకంగా అమరుతుంది.

CWSA 28:569-570

దయ్యము ఆత్మ కాదు. అది ప్రాణిక శరీరంలో కనబడే మనిషి కావచ్చు, లేదా ఏదైనా ప్రాణిక శక్తి లేదా ప్రాణికసత్తాచే పట్టుపడ్డ మనిషియొక్క ప్రాణిక భాగం కావచ్చు. శరీరం నశించాక, కొంతకాలం వరకు, ప్రాణిక భాగానికి అస్తిత్వముంటుంది. తరువాత అది ప్రాణిక తలంలో ప్రవేశిస్తుంది. ప్రాణిక పొర కరిగే వరకు అక్కడే ఉంటుంది. తరువాత అది మానసికంగా పరిణితి పొంది ఉంటే, దాని మానసిక పొరతో మానసిక ప్రపంచంలో ప్రవేశిస్తుంది. చివరిగా ప్రాణికం తన బుద్ధి పొరను కూడ విడిచిపెట్టి తన విశ్రాంతి స్థానానికి పోతుంది. మనస్సు బలంగా అభివృద్ధి చెంది ఉంటే, మనలో ఆ భాగం అలానే ఉండిపోగలదు. అదే విధంగా ప్రాణికం కూడ ఉండగలదు. అయితే ఒక షరతు. అవి నిజప్రాణికం చుట్టూ వ్యవస్థీకృతం కాబడి ఉండాలి. అప్పుడే అవి ప్రాణికం యొక్క అమరత్వాన్ని పంచుకోగలవు. అలాకాకపోతే, ప్రాణికం బుద్ధిని , జీవాన్ని, తనలోకి లాక్కుని జన్మల మధ్య ప్రశాంతతలో ప్రవేశిస్తుంది.

CWSA 28/117 *అనువాదం: యస్, వై. సోమయాజులు*

మొదటి నుండి ఉన్నది 'దివ్యతేజోకణం' — ఆత్మ — అన్నింటిలో ఉండే ఆత్మ. కాని అది సుదీర్ఘ పరిణామం చెంది ఎరుకతో ప్రకటింపబడే రూపంగల సత్తాగా ప్రాణిక సత్తాగా మారడానికి చాలా కాలం పడ్తుంది.

CWSA 28/117

అనేక మృత్యుముఖాలు

ఒక ప్రశాంత మరణం - తెలియకుండా చనిపోవడం

'ఎస్ ఎస్' మరణించాడని నీకు తెలుసు. అది ఒక ప్రమాదం వలన జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు అతడు నా వద్దకు వచ్చాడు. (ఒక స్పష్టమైన రూపంలో కాదు, అది ఒక చేతనా స్థితి అని వెంటనే గ్రహించాను.) ఇక్కడే కదలకుండా నిలుచున్నాడు. ఒక సంపూర్ణ విశ్వాస ఆనందమయ ప్రశాంత స్థితిలో నిశ్చలంగా ఏమాత్రం కదలిక లేకుండా .....(సమర్పణా భావ సంజ్ఞ) పూర్తి విశ్వాసంతో, ఏది జరగాలో అది జరిగి తీరుతుంది, ఏది ఉండాలో అది ఉంటుంది. ప్రశ్నలు లేవు. తెలుసుకోవాలనే అవసరంలేదు. ఒక హాయిని గొలిపే శాంతి.... ఏ బాధ ఏ కష్టం లేకుండా.

వైద్యులు ప్రయత్నించారు, పోరాడారు, శస్త్రి చికిత్స జరిపారు. కదలిక లేదు, దేనిలోనూ చలనం లేదు. ఒక రోజు మరణించాడని ప్రకటించారు.

ఆ సమయమంతా అతడిక్కడే ఉన్నాడు, నిర్వికల్పంగా. అప్పుడు, అకస్మాత్తుగా నాలో ఒక విధమైన కంపన ఏర్పడింది. నేను చూసాను. అతను పోయాడు. నేను పనిలో ఉండి సమయం గుర్తించలేదు, అయితే మధ్యాహ్నం అని మాత్రం తెలుసు. తరువాత చెప్పారు. అతనిని దహనం చేయాలని నిశ్చయించారని, అప్పటికే చేసేసారని.

ప్రమాద తీవ్రత అతనిపై క్రూర ప్రభావం చూపింది. కానీ అది సంభవించినప్పుడు అతను తప్పక విశ్వాసంతో నన్ను తలుస్తూ ఉండి ఉంటాడు. అతడు వచ్చాడు, గాని కొద్దిగా నైనా కదలలేదు. తన శరీరానికేమవుతుండిందో అతనికి తెలియదు. తాను మరణించానని సైతం అతనికి తెలియదు.

అప్పుడే, అక్కడే స్వగతంగా అనుకున్నాను. ఈ విధంగా మనుషులను దహనం చేసే అలవాటు భయంకరంగా, క్రూరమైనది. అని!.... తాను మరణించానని అతనికి తెలియదు గానీ ఆ విధంగా తెలిసింది!.... శరీరాకారం లోని జీవకళ ప్రతిస్పందించిన తీరుతో.

శరీరం ఆమూలం చెడిపోయిన స్థితిలో నున్న ఆకారం యొక్క జీవం దానిని వదిలి వెళ్ళడానికి కనీసం ఏడురోజులు పడుతుంది. ఇక యోగసాధన చేసేవారి

విషయంలో ఈ ప్రాణం చేతన కలిగి వుంటుంది. కాబట్టి మనుషులు మరణించారని వైద్యులు ప్రకటించిన కొన్ని గంటల తరువాత వారిని దహనం చేస్తారు. కాని రూపం యొక్క ప్రాణం ప్రతి అంగుళం మేర సజీవమై ఉంటుంది. ఇక యోగసాధన చేసిన వారిలో ప్రాణం చేతన కలిగి ఉంటుంది.....

కానీ నీవు చనిపోయావని తెలయకుండానే చనిపోవడం సాధ్యమే. .... మనుషులను దహనం చేయవద్దని సైతం నేను చెప్పను. ఎందుకనగా కనీసం వందలో తొంభైతొమ్మిది సందర్భాలలో అది చేయటం ఉత్తమం. దీనికి పరిష్కారం ఒక్కటే. మనుషులు విజ్ఞతను పెంచుకోవాలి. వారు విజ్ఞత కలిగి లేరు. వారు ఒక సిద్ధాంతాన్ని, ఒక ధర్మాన్ని అంగీకరించి వివేక శూన్య లైనందున దానిని గ్రుడ్డిగా అనసరించాల్సి వస్తుంది.

Conversations with a disciple july 4, 1962

మరణించిన తరువాత శ్రీమాత వాతావరణంలో నిలిచి ఉండుట

'ఐ బి' చనిపోయినపుడు ప్రమాద తీవ్రతతో చెదిరిపోయిన అతని అస్తిత్వం యొక్క, కర్మల యొక్క స్థితులన్నింటినీ నేను కూడాదీయాల్సి వచ్చింది. ఆ కార్యం దుర్భరమైనది. అతడు భయంకరమైన, చెల్లా చెదురయిన స్థితిలో వున్నాడు. రెండు లేక రెండున్నర రోజుల వరకు వైద్యులు అతనిని బ్రతికించాలనే ఆశతో పోరాడారు. కానీ, అది సాధ్యపడలేదు. అతనిని శరీరంపై ఎపుడు ఎక్కడినుండి వచ్చి, తనకు తాను ఏర్పరచుకొన్నదో, ఆ చైతన్యాన్ని అంతమేరకు అక్కడ కూడ గట్టాను. ఎటువంటి చేతనాస్థితి, ఎటువంటి ప్రాణము అతడి శరీరంలోకి తిరిగి వస్తుండింది అంటే కొన్ని గంటల తర్వాత, అతడు రక్షింపబడతాడని వైద్యులు విశ్వసించారు. కానీ అది నిలువలేదు. (మెదడులో, కొంతభాగం బయటకు వచ్చినందున అది సాధ్యం కాలేదు) కేవలం అతడి అంతరాత్మ మాత్రమే కాకుండా అతని మానసిక అస్తిత్వము, ప్రాణిక అస్తిత్వము, మిగిలినవన్నీ కూడా సరిఅయిన రీతిలో సమకూర్చబడి అతడి శరీరంపై పొందికగా ఏర్పరచినప్పుడు, అతడి శరీరం పూర్తిగా నిరుపయోగమైనదని తేలినపుడు అంతా ముగిసింది. వారు శరీరాన్ని వదిలివేశారు, అంతా ముగిసిపోయింది.

నేను 'ఐ.బి' ని నా దగ్గఱగా వుంచుకొన్నాను. ఎందుకంటే, అతడిని వెంటనే,

వేరొక శరీరంలోకి చేర్చాలి. అప్పటికే నేను ఆలోచించుకున్నాను. అతడి అంతరాత్మ సంతృప్తి చెందిలేదు, అది తన అనుభవాలను పూర్తి చేయలేదు. పరిస్థితుల సమ్మేళనంగా వుండింది. అది భూమి మీద జీవించడం కొనసాగించాలని కోరింది. అపుడు, ఆ రాత్రి అతడి ఆంతరిక అస్తిత్వము 'వి' ని కనుక్కోవడానికి వెళ్ళింది. శోకిస్తూ, తాను మరణించానని, అందుకు ఇష్టపడలేదని, కానీ తన శరీరాన్ని కోల్పోయానని, జీవించడం ఇంకా కొనసాగించాలనే కోరికతో వున్నానని చెప్పింది. 'వి' సందిగ్ధంలో పడ్డాడు. మరుసటి ఉదయాన 'జరిగింది యిది' అని నాతో చెప్పాడు. నేను అతనికి చెప్పాను. 'ఐ బి' ని నా వాతావరణంలో వుంచుకున్నాను. నీవు నిశ్శబ్దంగా, ఉద్రేక పడకుండా వుండు. ఎందుకనగా 'ఐ బి' ని సాధ్యమయినంత త్వరగా వేరొక శరీరంలోకి పంపిస్తున్నాను" అని. అప్పటికే ఒకటి నా దృష్టిలోకి వచ్చింది అదే సాయంత్రం 'ఐ.బి' మళ్ళీ అదే ఫిర్యాదుతో 'వి' వద్దకు వెళ్ళాడు. 'వి' అతడితో స్పష్టంగా చెప్పాడు. శ్రీమాత ఇలా చెప్పారు. ఆమె చేయబోతున్నది యిది, ఇక నిన్ను నీవు బాధపెట్టుకోవద్దు. దీనిని 'ఐ.బి' అర్థం చేసుకొన్నట్లుగా 'వి' ముఖంలోకి చూసాడు. (ఆంతరిక అస్తిత్వం 'ఐ బి' భౌతిక రూపాన్ని సహజంగానే దాల్చింది.) అతడి ముఖంలో 'ఉపశమనం' కనిపించింది. సంతృప్తి చెంది వెళ్ళిపోయాడు. ఇక తిరిగి రాలేదు. అనగా, నేను అతడిని 'సి' యొక్క బిడ్డలో వుంచే వరకు నాలో ప్రశాంతంగా నిలిచిపోయాడు.

The Mother: Conversations with a disciple, June 24, 1961

అంతరాత్మ నిష్క్రమించిన తర్వాత అలవాటు ప్రకారం జీవించడం

నీకు 'బి' తెలుసా? .... కొద్దికాలం క్రితం అతడి స్వేచ్ఛాపురుష సత్తా అతనిని వదిలి వెళ్ళింది. దాని ఫలితంగా ఉపరితల చేతనలో అతడు కొంత పిచ్చెక్కినట్లుగా కనిపించాడు. నిజంగా అతనికి పిచ్చి ఎక్కలేదు. కాని అతడి చైతన్యం తగ్గినట్లుగా కనిపించింది. నేను చెప్పినట్లుగా అతడు అలవాటు ప్రకారం జీవించాడు. భౌతిక చైతన్యం ఇంకా కొంత మేరకు ప్రాణికాన్ని, మనసును, నిలుపుకొని వుంది. అలవాటు ప్రకారం జీవనం కొనసాగించాడు కానీ గమనార్హమైన విషయం ఏమంటే అతడు కొన్ని సెకనుల పాటు,ప్రకాశవంతంగా, మెచ్చుకొనేటట్లుగా జీవించాడు. కొన్ని సమయాల్లో అవయవ కదలికలను సైతం నియంత్రించలేక పోయాడు. అపుడు ఇక

పూర్తిగా వెడలి పోయాడు. సమకూర్చబడివున్న శక్తి మొత్తం కొద్ది కొద్దిగా క్షీణించింది. మిగిలినవదేదైనా వుంటే, అది కూడా శరీరాన్ని వదిలిపెట్టింది. అతడి జన్మదినం రోజున (డిశంబరు 30 న రాత్రి) అతను మరణించాడు. ఎపుడూ చేసేటట్లుగానే అతడి గదిని శుభ్రం చేసారు. గదిలోని సామాను బయటకు తీసుకెళ్ళారు. అప్పటినుండి అతని ఆచూకి లేదు. నిన్న రాత్రి భోజనం తర్వాత (అదే సమాయాన సరిగ్గా పంన్రెండు రోజుల క్రితం అతడు శరీరాన్ని వదిలివేశాదు)నేను పూర్తి ఏకాగ్రత వహించి వున్నాను, విశ్రాంతి తీసుకుంటున్నాను. హఠాత్తుగా 'బి 'చాలా కోపంగా వచ్చాడు. నాతో ఇలా అన్నాడు: "వారు నా గదినుండి సామానంతా తీసుకెళ్ళారు! నేను యిపుడు ఏం చేయాలి?" నేను మెల్లగా చెప్పాను. "కలవరపడకు, నీకు ఇక్కడ ఏదీ అవసరం వుండదు". ఇక నేను అతడిని విశ్రమింపజేసి, మిగిలి వున్న అతడి అస్తిత్వంతో కలవడానికి పంపించాను. దీని అర్థం ఏమిటంటే అతని మొత్తం మూలకాలు తిరిగి రూపొందటానికి పన్నెండు రోజులు పట్టింది. వారు అతని శరీరాన్ని దహనం చేసారు. మేము అతని అంత్యక్రియలు జరిపించాము, కానీ కొంత కాల వ్యవధి కోరాను. అతడి విషయంలో వాస్తవానికి అది క్రమంగా చోటు చేసుకుంటున్న అలసట. అతని శరీరంలో మిగిలింది ఏమీ లేదు, ఏమయినా చైతన్యం కణాలనుండి ప్రబలంగా విసిరివేయబడింది. తిరిగి రూపొందటానికి పన్నెండు రోజులు పట్టింది. అది అతని అంతరాత్మ కాదు. (అప్పటికే అది అతడిని వదిలి వెళ్ళింది.) నా వద్దకు వచ్చింది అతని శరీరంలోని ఆత్మ. శరీర చేతన మంచి దుస్తులు ధరించి చక్కని 'బి' మాదిరిగా కేశాలు చక్కగా దువ్వబడి వున్నాయి. నా వద్దకు వచ్చినప్పుడు అతడు జీవించి వున్నప్పుడు వున్నట్లుగానే చాలా హుషారుగా వున్నాడు. నన్ను చూడటానికి ఎప్పుడూ బాగా తయారయ్యి, ఏ లోపం లేకుండా వుండాలని అతడి విధానం. ఆ విషయాన్నంతా సమీకరించటానికి పన్నెండు రోజులు కావాల్సి వచ్చింది. ఎందుకనగా దానిపై నేను దృష్టిని పెట్టలేదు. (ఆ పని నేను కొన్ని గంటలలోనే చేయగలను, నేను దానిపై దృష్టిని నిలిపితే) కానీ అతడి విషయంలో, అతడి అంతరాత్మ చాలా కాలంగా విశ్రాంతిలో వుండడం వలన అంత అవసరం లేకపోయింది. కాబట్టి, తిరిగి రూపం దాల్చడానికి దానికి పన్నెండు రోజుపలు పట్టింది. ఇక ఎప్పుడయితే అతడు తయారయ్యాడో (నవ్వుతూ) తన గదిని తిరిగి ఆక్రమించుకోవడానికి వచ్చాడు!.... అక్కడ సామాను ఏమి మిగిలి లేదు!

అది చాలా తమాషాగా అనిపించింది.

అతడు సంవత్సరం పైచిలుకు జీవించాడు. దాదాపు రెండు సంవత్సరాలు అనుకుంటాను. అది కేవలం జీవించే అలవాటు వల్లనే అనుకుంటాను.

The Moother: Conversations with a disciple January 12, 1963

మరణించడానికి దీర్ఘకాలం

ఇక్కడ డాబు సరిగా వుండే ఒక వృద్ధ డాక్టరు సోదరి కూడా ఉన్నది. ఆమె నా కన్నా అయిదారేళ్ళు పెద్దది అనుకుంటాను. తొంభైయ్యో పడిలో పడింది. చాలా నెలలుగా ఆమె మరణానికి దగ్గర అవుతూ వున్నది. వైద్యులు (ఇటువంటి సందర్భాలలో వారికి ప్రాథమిక విషయం కూడా తెలియదు.) ఆమె కొన్నిరోజుల్లో మరణిస్తుందని ప్రకటించారు. "కొంతకాలం వేచి చూడండి," అని నేను వారితో చెప్పాను, "ఈమెకు ఒక విశ్రాంత స్థితిలోకి ఎలా ప్రవేశించాలో తెలుసు, ఆమెకు ఒక ప్రశాంతమైన చేతనా స్థితి వున్నది — అది చాలా కాలం వుంటుంది. కొన్ని సంవత్సరాలు కొన సాగవచ్చు." ఆమె మంచంపై వుండింది, ఎక్కువగా కదలలేదు. కానీ.... ఆమె జీవిస్తుంది. ఆమె కూడా అలవాటు వల్లనే జీవిస్తుంది.

వాస్తవానికి మనుషులు అనుకొనేదాని కన్న శరీరానికి దీర్ఘకాలం నిలిచి వుండగల శక్తి వుంటుంది. దానిని అస్తవ్యస్తం గావిస్తారు. ఎవరయినా జబ్బు పడితే, మందులు ఉపయోగిస్తారు, లేక శరీరాన్ని కుదిపేస్తారు. ఎంతోకాలం నిలిచి వుండేటట్లుగా చేయగల వృక్షాలకు సహజంగా వుండే స్వయంపోషక స్థితి ఏదయితే చాలా కాలం కొనసాగుతుందో, దానిని అంతం చేస్తారు. మామూలుగా చెట్లు పోవడానికి చాలాకాలం తీసుకుంటాయి.

The Mother: Conversations with a disciple January 12, 1963

మరుగునపడ్డ అద్భుతాలు

ఒక విషయం ఉండింది. ఈ చిన్నదానిని ఇపుడు దహనం చేయబోతున్నారు. ఆమె శరీరంపై వుంచాలని కొన్ని పూలను నాకు చూపించడానికి ఒక పళ్ళెంలో నా వద్దకు తెచ్చారు. అక్కడ ఆ పళ్ళెంతోపాటు ఆ చిన్నదానికి చెందినదేదో వుండింది.ఒక గర్భస్థ ఆత్మ శక్తి, అది అక్కడవుంది, అది చిన్నగా కదిలింది..... తళుక్కున జరిగే

ఒక సుకుమారమైన కదలిక అది, ఆమె ఇలా ఉండింది. (పువ్వుల పళ్ళెంతో శ్రీమాత ముందున్నట్టి భంగిమ) నేను ఒక రోజా పుష్పం తీసుకొన్నాను. ఆమె చేతికివ్వాలన్నట్లుగా, ఆమె కిచ్చి చెప్పాను. "ఇదిగో, ఇది నీకే." అదంతా ఆ స్పందనలన్నీ వెలుగుతో, ఆప్యాయతతో నిండి వుండింది. ఇక (ఆమె లోని చేతనా భాగం)ఎంతో పరిపూర్ణమైన సంతోషంతో వుండింది!...

ఆ స్థితిని ఆమె తల్లిదండ్రులకు ఎలా చెప్పాలి? వాళ్ళంటారు నువ్వు వెర్రి దానివి.... అని.

కాని అది వాస్తవం, స్పష్టమైన యదార్థం, చంపక్ లాల్ పూలపళ్ళెంతో రావటం నేను చూసాను. ఆ గర్భస్థ ఆత్మశక్తి దానిపై తేలియాడుతుండింది ఈ విధంగా. కాబట్టి ఆమెను చూడగానే నేను ఒక రోజా పుష్పం తీసుకున్నాను. అక్కడ ఎంతో సుందరమైన, ఎంతో విలువతో నిండిన ఏదో ఒకటి వుండింది. (చాలా చిన్నది, గొప్ప శక్తి లాంటిది కాదు) కానీ ఎంతో సుందర మైనది, ఎంతో ప్రకాశవంత మైనది, ఎంతో సంతోషకర మైనది, ఎంతో విశ్రాంతి భావనతో నున్నది.... ఎన్నిమార్లు ఆ విధంగా జరుగుతుంది!

ఆశ్చర్యం, మనకేమి తెలియదు! రోజులు గడిచినకొద్దీ మనకేమి తెలియదని నాకు దృఢమవుతున్నది. మనకు తెలుసని అనుకుంటాము. మనమనుకుంటాం,... కానీ మనకి ఏమీ తెలియదు. మనం మరుగున పడ్డ అద్భుతాల సన్నిధిలో వున్నాం. మనం మూర్ఖులం కనుక వాటిని మనం గమనించలేము.

The Mother: Conversations with a disciple April 30, 1969

అనువాదం: సునీతాశేఖర్